# ఆంధ్రశిల్పి



సచిత్ర మాస సంచిక

సంపాదకులు:

వి. ఆర్. చిత్రా: పి. గణపతిశాస్త్రి

౧౦, నరసింగపురం వీథి

మౌంటురోడ్, మద్రాసు

# విషయానుక్రమణిక

స్వాగతాంజలి :

—సంపాదకులు ....

మాతృస్తవము :

—శ్రీ కాటూరి వెంకటేశ్వర రావుగారు ....

కనకకంకణం :

—శ్రీ దుర్భాకరాజశేఖర శతావధానిగారు ....

ఆంధ్రశిల్పి :

—శ్రీ మల్లవరపు విశ్వేశ్వరరావుగారు ....

శాంత :

—శ్రీ పఠాభిగారు ....

రమణగోపాలుడు :

—శ్రీ చింతాదీక్షితులుగారు ....

అటూ — ఇటూ :

—శ్రీ మునిమాణిక్యం నరసింహారావుగారు ....

నన్నుగురించి కథ వ్రాయవూ ?

—శ్రీ శివరాజు వెంకటసుబ్బారావుగారు ....

టీపార్టీ :

—శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ....

స్నాతకోపదేశము :

—ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులుగారు ....

కుటీర పరిశ్రమలు :

—శ్రీ వి. ఆర్. చిత్రాగారు ....

మూడు మాటలు :

—శ్రీ ఖమిడిపాటి కామేశ్వరరావుగారు ....

నాట్యకళ :

—శ్రీ తాడిపత్రి రాఘవాచార్యులుగారు ....

గ్రంథస్వీకృతి .... ....



సంపుట ౧ సంచిక

# స్వాగతాంజలి.

సహృదయ పాఠకలోకానికి సుస్వాగతము. యుద్ధం ముగిసినప్పటి నించీ భారత జాతీయత ఒక నూతనోత్తేజంతో జాజ్వల్యమానంగా వెలుగుతూఉంది. అందువల్ల జాతీయ సంస్కృతి అనేకమైన అభ్యుదయ వేణికల్లో ప్రవహిస్తూఉంది. ఆంధ్రదేశంలోకూడా తన్మూలకమైనవి అనేకసంస్థలూ, ఉద్యమాలూ బయలు దేరుతున్నాయి. దీనివల్ల పత్రికా ప్రపంచంలోను, వాఙ్మయరంగంమీదా కూడా కొన్ని అభ్యుదయపరిణామాలు జరుగుతున్నాయి. ప్రత్యహమూ ఏవో పత్రికలూ, గ్రంథ మాలలూ వెలువడుతూనే ఉన్నాయి. ఈ ఉత్సాహ ప్రవాహంలో పడిన మేమున్నూ ఈ శ్రావణ శుభావసరంలో 'ఆంధ్రశిల్పి' అనే ఒక సచిత్రమాసపత్రిక సహృదయుల కరకమలాంజలులలో సమర్పిస్తున్నాము.

'శిల్ప' పదానికి మనభాషలో ఎల్లాంటి అర్థచ్ఛాయ అలుము కున్నా, అసలు అది కళాపరమైనపదం; సుప్రసిద్ధులు దీన్ని సాహిత్యకళాపరంగా కూడా వాడారు. అందుచేతనే ఇది 'ఆంధ్రశిల్పి'గా అవతరించింది. ఇందులో మేము ఆంధ్రవాఙ్మయానికి ప్రధానస్థానంఇస్తూ, కళలకీ, ఇంకా ఆంధ్రసంస్కృతికీ సంబంధించిన విషయాలన్నిటికీ కూడా సముచితస్థానం ఇవ్వాలని సంకల్పించాము.

మేము కేవలం కళలకీ, చేతిపనులకీ, వాణిజ్యానికీ దోహద మిచ్చే 'శిల్పి' అనే ఒక ఆంగ్ల సచిత్ర మాసపత్రికకూడా వెలువరిస్తున్నాము.

అదిన్నీ ఈ శ్రావణమాసంలోనే ప్రారంభిస్తున్నాము. అది అఖిలభారతీయకళాన ర్తనలకీ, సంస్కృతికీ శృంగాటకంకాగలదని మా విశ్వాసము. తద్వారా 'ఆంధ్రశిల్పి' భారతీయ సంస్కృతినీ, కళలనీ ఆంధ్రులకీ, ఆంధ్రుల కళలనీ, సంస్కృతినీ అఖిలభారతావనికీ అందించగలదని ఆశిస్తున్నాము.

ప్రస్తుతం ఆంధ్రావనిలో నవ్యసాహితి తరంగితమై వివిధ ముఖాల్లో ప్రవహిస్తూఉంది. ఇంకా వీరేశలింగ యుగానికి సంబంధించిన కొందరు సుప్రసిద్ధకవివర్యులు రచనలు సాగిస్తూనేఉన్నారు. ఆకవితాచ్ఛాయలుకూడా వాఙ్మయంలో అక్కడక్కడ గోచరిస్తున్నాయి. అది అల్లా ఉండగా ఉద్ధృతంగా ప్రవహించే నవ్యసాహితీ ప్రవాహంలోనించి కొన్నికొన్ని అతినవ్యతరంగిణులు కొత్తకొత్త దారులుతొక్కుతున్నాయి. కొందరు 'అభ్యుదయరచన' అనీ, మరికొందరు 'అతివాస్తవికత' అనీ, ఇల్లాగే ఇంకా కొందరు ఇంకా ఏవేవో అనీ కొత్తకొత్త ప్రస్థానాలు లేవనెత్తుతున్నారు. ఈ ప్రస్థానాలు కేవలం కవితలోనే గాక మిగిలిన వాఙ్మయశాఖల్లో కూడా తలలెత్తుతున్నాయి.

వీరేశలింగ యుగ వాఙ్మయం కొంత అంతర్వాహినిగానే ఉంది. నవ్యసాహితీవాహిని స్థిరపడి ఒడ్డులొరసి సంపూర్ణంగా ప్రవహిస్తూఉంది. అతినవ్య వేణికలు వెల్లువలై ఉరకలు వేసుకుంటూ వస్తున్నాయి. ఇవి ఇంకా వాఙ్మయంలో స్థిరపడి కాలునిలవ దొక్కుకోవలసి ఉన్నాయి. ఆంధ్రశిల్పి నవ్యసాహితీమార్గంతో కొంత తాదాత్మ్యం వహించినా, అటు ప్రాచీన సంప్రదాయాలకీ, ఇటు అతినవ్యుల కొత్తకొత్త పోకడలకీ ఇవ్వవలసిన స్థానంఇస్తూ, వాటిని గౌరవిస్తూనే ఉంటుంది. కళలవిషయంలోనూ, సంస్కృతి విషయంలోనూ కూడా ఇదే మార్గం అవలంబిస్తూ ఉంటుంది.

ప్రతిసంచికలోనూ సహృదయలోకానికి సాధ్యమైనంతవరకు, ఉత్తమమైన కవితా, కథానికలూ, నాటికలూ, వ్యాసాలూ సమర్పించాలని మా సంకల్పము. ఇల్లాగ అనడంలో ఉండే సాధకబాధకాలన్నీ మాకు తెలియకపోలేదు. కొంత ఉత్తమ సాహిత్యం అనగానే అది

కేవలం ప్రజాసామాన్యానికి అందుబాటులో ఉండదేమోనని భయము. అయినా ఈ విషయంలో ప్రజాసామాన్యాన్ని విస్మరించకూడదని నిశ్చయించాము. అదీగాక మాసమాసానికీ వెలువడే ప్రతీసంచికకీ ఉత్తమ రచనలు సేకరించుకోవడం చాలా ముఖ్యమైన విషయం: ఇది ఇల్లా ఉండగా ప్రతీసంచికలోనూ సుప్రసిద్ధులైన ఆంధ్ర చిత్రకారులుగాని, భారతీయ చిత్రకారులుగాని రచించిన ఒక త్రివర్ణచిత్రమూ, ఇంకా కొన్ని రేఖాచిత్రాలూ, ఛాయాచిత్రాలూకూడా ప్రకటించాలని నిశ్చయించాము. ఈ ఆదర్శాలు విశాలాంధ్రావనిలో ఉండే చిత్రకారులూ, రచయితలూ, పాఠకులూ సంపూర్ణంగా సహకరిస్తేనే గాని, సాఫల్యం పొందనేరవని కూడా మేము ఎరుగుదుము. అయినా మేము కేవలం ఉత్సాహభరితమైన సాహసంతోనే ఈ వాఙ్మయసేవకి పూనుకున్నామని విన్నవిస్తున్నాము.

దానికి అనుకూలంగానే పత్రికాప్రారంభంలో ఎంతోమంది విఖ్యాతరచయితలు మాకు తమతమ రచనలు పంపించి, ఆదరించారు. వారందరికీ మా కృతజ్ఞత. రచయితలందరూ ఇతోధికంగా మాకు సహకరించగలందుకు ప్రార్థిస్తూ, పాఠకులుకూడా అంతకంటె అధికంగా చేయూత ఇచ్చి ప్రోత్సహించగలరని ఆశిస్తున్నాము.

# మాతృస్తవము

కొప్పునఁ జాబిలిన్ ముడిచి, గోమగు మోమునఁ జంద్రవంకతో
బొప్పిడి రావిరేక యిడి, యుత్పలహారమ్ములు వేసి, పాలయే
ఱెప్పలిలంగఁ జేసి, పృథులోరుతలమ్మునఁ జేర్చి బిడ్డలన్
జెప్పఁగఁ దీర్చి, కన్నొగుచు దేవి! భవత్పద మాశ్రయించెదన్.

హృదయమునకుఁ బవిత్రమ్ములను, భావభరమ్ముల కెల్లఁ గాన, అ
మ్మృదవృల కెల్ల మేఘములు, నంబుధరమ్ముల కెల్ల నబ్ధి, వ
క్కడలికి మాత్ర—విశ్వయుని గావుల పెట్టుచు, విని నన్నిటన్
గడుపునఁ బెట్టిబ్రోచు నిను గన్గొను టెన్నటికో, దయామయీ!

పలితపాంసుర కేశపాళితో నొకమాఱు
ముత్తైదువంబలె బొట్టి గూర్చి,
నవ వసంతారంభ పవమానసౌరభ
మ్మున దేలు నొకపరి ముద్దు లొలికి,
కారాకు రాల్చి, తుషారమ్ము మెయిఁ గప్పి
జాలి గొల్పుచు నొక్కమాఱు నిలిచి,
ఉరుము మద్దెళ్ళతో మెఱుపునృత్యము సల్పి
యొకపరి నెమ్మది కుబ్బుగొలిపి,
దినదినము క్రొత్త వేషమ్ము, దినదినమ్ము
క్రొత్త భావమ్ము దాల్చి, క్రొంగ్రొత్త సూపు
అక్షయవిలాసినీ! యీ ప్రతిక్షణాంగ
హారములు దాచె దేల? నిజాంతరమ్ము.

—శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు.

# కనకకంకణము

[ఈ క్రింది భాగం శ్రీ దుర్భాక రాజశేఖర శతావధానిగారి కనకకంకణమునుండి గ్రహింపబడినది. బహదూరు చిత్తూరు ముట్టడించిన సందర్భములో రాణీ కర్ణావతీదేవి హుమాయూను సాహాయ్యము అర్థిస్తుంది. ఇది ఆ సందర్భములోని కథ.]

చతురంభోనిధి సంవృతాఖిల మహీ సమ్రాణ్మహాధీశ ! భా
రత రాజన్య శిరోమణీ ! వినతిపూర్వంబైన కర్ణావతీ
సతి మేవాడ నృపాల మాత యొకవిజ్ఞప్తిన్ నివేదించెఁ గ
వ్రతరాష్ట్రావన కంకణమ్ము నొకకమ్మన్ బంచె సద్భ్రాతృతన్ !

అందున నీయెడఁ గలుగు నచ్చికమచ్చికఁ గాంచి,—సంచిదా
నంద మొసంగు నీ గుణగణశ్రవణంబును గాంచి పెద్ద మా
యందఱఁ గాంచి,—కీర్తికళ లందిన మా నృపమాతఁ గాంచి, మీ
దెందము వచ్చినట్టులు ఘటించి, పనిన్ గడియింపుఁ డున్నతిన్ !

అనియెడు నంత నిర్మల నవాంబురుహాయతనేత్ర లా మహా
కనకపుఁ బళ్ళెరమ్ము నెడగా గొనితెచ్చుచు సార్వభౌము చెం
తను దసరాకు బల్లపయినన్ గదియించి, నమస్సమంబు మో
డ్చిన కనుదోయితో మిగులఁ జెల్వగు నిల్చిరి యాజ్ఞ వేచుచున్.

తన పీఠంబున డిగ్గి, నిల్చుకొని, మూర్ధంబున్ దగన్ వాల్చి భ
క్తిని సూచించుచు, రాణిగారి ననురక్తిన్ గీర్తనల్ చేసి, యా
కనకంపుంబెనుపళ్ళెరంబుఁ గరయుగ్మంబెత్తుచున్ దాఁకి, తా
కిన చేఁదోయిని గన్నులొత్తుకొనఁగాఁ గీలించె ముమ్మాఱులున్ !

మును మాటాడిన కాంత లేచి వినయంబున్ మోమునన్ గ్రమ్మఁ గాం
చనపాత్రంబున కమ్మఁ జేతగొనుచున్ "సాహో ! పరా ! కా విక
ర్తనవంశప్రమదాశిరోమణి—మహారాణ్మాత, కర్ణావతీ
వనితారత్నము కమ్మ నేఁ జదివెదన్ బాటించి యాలింపుఁడీ !"

అని వాసంతరసాలా
వనిజోపరి పికసతీ శుభధ్వాన విమో
హన కలరావంబునఁ జది
వెను సతి తన రాణిగారి ప్రియమగు లేఖన్ !

—శ్రీ దుర్భాక రాజశేఖర శతావధాని

# ఆంధ్రశిల్పి

ఆంధ్రశిల్పి ఏడీ ? మన
ఆంధ్రశిల్పి ?.... ....
అజంతా గుహాంతరముల
సప్తవర్ణాంచిత శబలపక్షి
కాలేఖ్యములందు చిల్కి.
అమరత్వము చూరగొన్న
ఆంధ్రశిల్పి ఏడీ ? మన
ఆంధ్రశిల్పి ?.... ..
అమరావతి బుద్ధదేవు
విమల స్మృతికావ్య మున్న
తస్తూపాకృతి రచించి.
నిస్తుల ప్రశస్తి గన్న
ఆంధ్రశిల్పి ఏడీ ? మన
ఆంధ్రశిల్పి ?.... ....
నాగార్జునకొండ నాంధ్ర
నాగరికత శిధిలాలను
ఏ దినాల పూర్ణితనో
ప్రోదిచేసి గతియించిన
ఆంధ్రశిల్పి ఏడీ ? మన
ఆంధ్రశిల్పి ?.... ....
హంపీక్షేత్రాన రాజు
లంతరించినా చెరగని
చాతుర్యము నల్లరాతి
చెక్కడములలో మలిచిన
ఆంధ్రశిల్పి ఏడీ ? మన
ఆంధ్రశిల్పి? .... ....
దాక్షిణాత్య దేశంలో
ధ్వజ మెత్తిన ఆంధ్రశిల్పి.
దేవాలయ మంటపాల
వేల స్తంభా లెత్తిన
ఆంధ్రశిల్పి ఏడీ ? మన
ఆంధ్రశిల్పి ?... ....
తంజాపురమున తూలిక
పింజామర పేచి, మహో
ఘానాథ గభీర మూర్తు
లీనాటికి చూపించే
ఆంధ్రశిల్పి ఏడీ ? మన
ఆంధ్రశిల్పి ? .... ....
కొండపల్లి బొమ్మలలో
కలంకారి దిమ్మలలో
ద్వారబంధ దారువులను,
తివాసీల తీరువులను
నయనపర్వ మొనరించిన
ఆంధ్రశిల్పి ! ఆంధ్రశిల్పి !
ఆంధ్రశిల్పి ఏడీ ? మన
ఆంధ్రశిల్పి ?.... ....
రాడో ఈ నాడు తిరిగి
రాతిగుండె కరిగించే
ఆంధ్రశిల్పి ?.... ....
రంగుల తూలిక ముంచే
ఆంధ్రశిల్పి ?.... ....
రమ్యత్వము రూపించే
ఆంధ్రశిల్పి ?.... ....

# ఆంధ్రశిల్పి

రానున్నది అభ్యుదయం
పోనున్న దథఃపతనం—
స్వాతంత్ర్యపు స్వర్గంలో
జాతీయ పతాకానికి
అమృత సిద్ధ హస్తంతో
ఆకుపచ్చ, ఎఱుపు, తెలుపు
లాలేఖన మొనరించే
ఆంధ్రశిల్పి రావాలి !
అఖిల భారతావనిలో
అగ్రసరుడు కావాలి !

మబ్బు తొలగిపోవాలి,
ప్రొద్దు పొడిచితీరాలి—
తూర్పుకొండపై జెండా
తూలికతో వ్రాయాలి !

అంధ నిద్ర లేవోయీ !
ఆంధ్రశిల్పి రావోయీ !
అజంతా గుహాంతరముల
సంధికాల మంతరించి
అరుణకాంతి ప్రసరించిన
దల్లదిగో కనవోయీ !

అవనీంద్రుడు, నందలాలు
లదిచూచే లేచారోయ్,
ఆతిథ్యం ఒసగారోయ్,
ఆంధ్రశిల్పి ! మేల్కొనవోయ్ !
ఆంధ్రశిల్పి ఏది ? మన
ఆంధ్రశిల్పి ?........

—శ్రీ మల్లవరపు విశ్వేశ్వరరావు.



# శాంత

శాంతాప్రియ ! నీ భరతన ర్తన
నాభాగ్యము పండి కనినంతట
నాకన్నులు మూయుచు తపించుచు !
నాలోన విచిత్రపరివ ర్తన.
సుధామధురిమమ్ము గ్రోలితి.
అశోకవని దాక జాకితి,
నిశ్శబ్దపు పాట వింటిని
కనరేనిది నేను కంటిని ;
ఆహా ! యిది ఏటి సుకవుం గల !
కానీ, సఖి ! నా మనమునంగల
వచియింపగరాని సుఖగీతిని
వచియింపగలాడ ఏరీతిని ?
నీపాదగతికిన్ తాళము
వేయు కాలమ, నాకాలము ;
నీవుం ప్రకటించు భావము
ననుసరించును నాజీవము.
నన్నుం ఘటియించితివి కీలుగ.
నీవాడిన యన్ని తరహాలుగ
ఆడించితి నీవు పసమంత్రము
నుంత్రించి ; సుఖ మీసరతంత్రము !
నీఆనతికి. నాలోగల
ఆనందసితార తీగల
రాగమ్ములు పల్కు. తాళము
వేయంగ మదంతరాళము.
శాంతాప్రియ ! నీ భరతన ర్తన
నాభాగ్యము పండి కనినంతట
నాలోన విచిత్ర పరివ ర్తన.

—శ్రీ "పఠాభి"



# రమణ గోపాలుడు

శ్రీ చింతా దీక్షితులు

రమణా! నువ్వు గోపాలుడవా? గోవులు కాచుకొనే శ్రీకృష్ణమూర్తివా? అందుకనేనా గోవులమందలు పెట్టుకున్నావు? ఆవులు నీదర్శనంకోసం పరుగెత్తుకు వస్తాయి!

నీవు మురళితో పాడకపోయినా పరుగెత్తుకు వస్తాయి?

నీవు గోపాలుడవ కేనా దూడలు తోకలెత్తి నిన్ను చూడడంతోనే దుముకుతవి? గంతులు వేస్తవి? నిన్ను 'అమ్మా' అని పిలుస్తవి? నీవు గోపాలుడ వనేనా లక్ష్మి నీచేతినుంచి పళ్లు తినడానికి పరుగెత్తుకు వస్తుంది. నీచేత ఒళ్లు నోకించుకుంటుంది. నీపాదాలమీద తన ముట్టె వంచి నమస్కరిస్తుంది? నీ సమక్షంలో ఆవుల మందలు వూర్కు చెందుతవి? నీవుగోపాలుడవే కాకుంటే వాటిమీద నీకంత ప్రేమ ఎందుకు? వాటిని నీతో సమంగా చూచుకొంటావే! వాటికి ఆహారాలూ, వాటికిభోజనాలూ, వాటికి యసాలూ, వాటికి పిండివంటలూ పెట్టిస్తావు?

అయితే రమణా! నీవు గోపాలుడవే అయితే పింఛమేదీ? ఎక్కడ దాచిపెట్టావు? నెమిలి గదిచుట్టూ తిరుగుతుం దెందుకు? నెమిలికళ్లు తీసుకొని పింఛంగా పెట్టుకోమని చెప్పడానికా? మరి నీవు పింఛం పెట్టుకోవేం? దానికి తిండి పెట్టి పంపించివేస్తావేం?

మరి ఏమైనది రమణా! నీచేతికర్రేనా నీమురళి! దానితో పాడగలవా? మరి దానికి చిల్లులు లేవే! అయినా పాడగలవా? పాడుతూనే ఉన్నావా! మరి ఆపాట మాకు వినిపించడంలేదేమి? మాకు చెవుడా? అందుకనే వినిపించడంలేదా? చెవులు లోపలికి తప్పుకుంటేనే గాని వినిపించదా? చెవులకు వినిపించకపోయినా మాహృదయాలకి వినిపిస్తూనే ఉంది కాదూ రమణా! లేకుంటే మేమందరమూ ఇక్కడికి ఎలాగ వచ్చాము! ఎప్పటి కప్పటికి నీసమక్షానికి రావాలని మాకు తహతహ ఎందుకుంటుంది?

ఆనాడా గోపికలా మోహనమురళీ దివ్యగీతముల నాలించి పరుగు పరుగున వచ్చి గోపాల సందర్శనం చేసుకొన్నారట కాదూ!

ఈనాడు మేమంతా ఈ నిమోహన నీరవ దివ్యగీతములను మాహృదయాలతో ఆలించి పరుగు పరుగునవచ్చి నీసందర్శనం చేసుకుంటున్నాము కాదూ?

అయితే నిపచ్చని పట్టుబట్టఏదీ భగవాన్? మరి నీయశోద ఏదీ? నీ యమున ఏదీ? మాచర్మచక్షువుల కవన్నీ ఎలాగ కనిపిస్తాయనా అంటున్నావు? సర్వతీర్థాలూ నీసమక్షాన్నే కాపురముండగా యమున ఎక్కడ ఉందని అడగడం ఎందుకంటావా?

ఏమైనా నా కేమీ తెలియడంలేదు రమణా! నువ్వు గోపాలుడివే కాదూ? లేకుంటే గీత లెందుకు చెప్పావు? ఆ గోబృంద మెందుకు? ఆ మయూరి మెందుకు నీకు? కనిపించని తాళ్లతో కట్టివేసి మమ్మల్ని నీదగ్గిరికి లాగుకోడా లెందుకు?

బ్రహ్మదేవుడు గోవులన్నీ దాచేస్తే నువ్వే ఆ గోవులూ అయ్యేవుట; ఆగోవత్సాలూ అయ్యేవుట, గోపబాలురూ అయ్యేవుట; అవునా రమణా? అందుకేనా అంతా నేనే అంటున్నావు? ఈగోవులూ నువ్వే, ఈదూడలూ నువ్వే, ఈ మేమూ నువ్వే, ఈ నువ్వూ నువ్వే, ఈసర్వమూ నువ్వే; అవునా రమణా!

ఇదంతా నాకు తెలియడంలేదు రమణా! తెలుసుకొనే బుద్ధిశక్తి నాకు ప్రసాదించవా భగవాన్.





# అటూ - ఇటూ

శ్రీ మునిమాణిక్యం నరసింహారావు.

శర్మ భార్యను రైలుఎక్కించి ప్లాట్‌ఫారం మీద నుంచునిఉన్నాడు. ఆ అమ్మాయి అన్నది, "తమ్ముడి అన్నప్రాశన రేపు అయిపోతుంది. నేను అక్కడ ఆట్టేరోజులు ఉండాలిసిన అవసరం ఉండదు. మీరు శనివారం రండి, కలిసి మళ్లీ వచ్చేద్దాము."

శర్మ తలఊపి "నేను రావటానికి వీలుండదు. పరీక్షలు దగ్గరకువచ్చినైయ్. చదువుకోవాలె." అని గట్టిగా చెప్పేశాడు.

ఇట్లా శర్మ అన్నాడంటే దానికి తగినంత కారణం లేకపోలేదు. ఆ అమ్మాయి శర్మను చాలా విసిగించింది.

కొత్తగా కాపరానికి వచ్చిన పిల్లను గదా, అని ఆ అమ్మాయి మొగుడుదగ్గర భయభక్తులతో ఉండటం గాని, సిగ్గుగా ఉండటం గాని లేదు. దానికి కారణం ఇంట్లో పెద్దవాళ్లు ఎవ్వరూ లేకపోవటమే. అత్తగారు ఉన్నది గాని, ఆవిడ పెద్దది. వంటఇంట్లోనే ఉంటుంది. సాధారణంగా ఏవిషయమూ పట్టించుకోదు.

ఆ అబ్బాయి చదువుకొంటూఉంటే ఆ అమ్మాయి ఏదో పెద్ద పనిఉన్నదానిలాగా వచ్చి, దేనికోసమో అక్కడా ఇక్కడా వెదికి, చటుక్కున దీపం ఆర్పేసి "ఇహ పడుకోండి పదిఅయింది. అస్తే చదవటంవలన ఏమీ ప్రయోజనం లేదు. ఆరోగ్యం చెడిపోవటం తప్ప" అని అంటూ విరగబడి నవ్వి, పక్క మీది తెల్లటిదుప్పటి లాగి విదిలించివేసేది.

దానితరువాత దీపం మళ్లీ వెలిగించి చాలా ప్రయత్నంచేసినా కూడా అతని చదువు సాగేది కాదు.



బావమరిది వచ్చి అక్కయ్యను తీసుకొని వెడతా నన్నప్పుడు శర్మ అనుకొన్నాడు, "ఇదీ

ఒకేమాట మాట్లాడితే, చెప్పి ఒప్పించి నేను నాలుగురోజులు హాయిగా చదువుకోవచ్చు.''

అందుకనే ఆ అమ్మాయి, "మీరు రెండు రోజులలో వెంటనే, ఇద్దరు కలిసివస్తాము'' అని అడిగితే తల గిరగిరాత్రిప్పి 'రాను' అని గట్టిగా చెప్పాడు. ఆమె వెళ్లిపోయిననాటి రాత్రే శర్మకు కొంచెమైనా నిద్ర పట్టలేదు. పక్కమీదఉన్న మాసిన దుప్పటి చూచి నప్పుడే అతడు ఆలోచనలో పడ్డాడు. ఈ దుప్పటి తీసి కొత్తదుప్పటి వేయటం ఎలాగా అని! కొత్త దుప్పటి ఎక్కడుంటుందో అతని కేం తెలుస్తుంది! తెలుసుకోవటానికి ప్రయత్నంచేసినా కూడా లాభంఉండదని అతనికి తెలుసు. అందుకనే అతడు అట్లాంటి ప్రయత్నం ఏమీ చెయ్యక ఆ మాసినప్రక్కపైనే పడుకొని, నిద్రపట్టక చాలా అవస్థల పాలైనాడు.

తెల్లవారిన తరువాత అతనికి ఎన్నోవిషయాలు చికాకు కలిగించినై. అన్నానికి రమ్మని ఎవ్వరూ పిలవలేదు. తానేవెళ్లి తల్లి నడిగి కాస్త పెట్టించుకొని తిన్నాడు. ఆరోజు కాలేజీకి కఫ్‌గుండీలు పెట్టుకోకుండానే వెళ్లాడు. అవి వ్రేలాడుతూఉన్నవి. పైకి మడతవేసినా నిలవక క్రిందికి జారిపోయినై. రోజల్లాకూడా చాలా చికాగ్గాఉన్నాడు. సాయంత్రం ఇంటికొచ్చి తల్లిని పిల్చి అడిగాడు; "పుస్తకాలు అన్నీ దుమ్ముకొట్టుకొన్నాయి! నాకలం కనపడలేదు!— ఎట్లాగమ్మా?''. "ఇవన్నీ చూడ్డానికి ఎవరికి తెలుస్తాయి నాయనా, కోడలుంటే అది చూస్తుంది'', అని ఆమె అంటూనే నవ్వుకొన్నది.

ఆ అమ్మాయి వెళ్లిన మరునాటికల్లా శర్మ ఇంట్లో చిన్న చిన్న ఉపద్రవాలు చాలా బయలు దేరినవి. ప్రొద్దున తానే స్వయంగా కాఫీ కాచుకోవలసివచ్చింది. అప్పుడు చెయ్యికూడా కాలింది. అంతేకాకుండా చెయ్యిజారి పడిపోయి ఆ కప్పు పగిలిపోయింది. చాకలిది బట్టలు తెచ్చింది. లెక్కచూడటం ఎవ్వరికీ తెలియ లేదు! తెచ్చినబట్టలు అక్కడ పెట్టి పోయింది అది. అది ఎన్నిఇచ్చిందో ఏమో, సగంబట్టలు చూసినా కనుక్కొనేదిక్కు లేదు! పుస్తకా లన్నీ దుమ్ము కొట్టుకొన్నవి. వాటి ముఖం చూసేవారు లేరు. దువ్వెనా, అద్దమూ మొద లయిన వన్నీ, ఇంటావిడ లేదుగదా, మనతో ఎవరికి పని ఉంటుంది, అని అనుకొన్న వేమో, ఎక్కడికో కనపడకుండా పోయినై.

ఆవిడ ఉన్నప్పుడు ఎక్కడివి అక్కడ వినయ విధేయతలతో పడిఉండేవి. ఇప్పుడు అన్నీ వేటి దారిని అవి పోయినై!

సాయంత్రంఅయింది. శర్మ భోజనంచేసి చదువు ప్రారంభించాడు. గంటసేపు అయిన తరువాత చూచుకొంటే ఆరుపంక్తులు ఇవతల ఉన్నాడు.

పోనీ ఇవ్వాళకు పడుకొని దీనికంతా కారణం ఏమిటో ఆలోచించాలని నిశ్చయించు కొన్నాడు. గాలిదేవుడు దక్షిణవేపు కిటికీ తలుపులను మెల్లగా నెట్టి తొంగిచూచి ఆవిడ

లేకపోయేటప్పటికి మనకు జోరుగా వచ్చేశాడు. పక్కపై దుప్పటీకూడా శర్మపై ఎగిరిపడ్డది. శర్మకు చాలా చిన్నతనం వేసింది. 'ఛా ఇదేమీ బాగుండలేదు' అనుకొన్నాడు.

అది వెన్నెలరాత్రి కాదు. బయటలా బైట అంతా చీకటిగా ఉంది. శర్మ అటూ-ఇటూ చూచి ఇట్లా అనుకొన్నాడు. 'ఆవిడ ఉంటే ఇల్లా ఉండేది కాదు'.

ఆ రాత్రి నక్షత్రాలు ప్రకాశిస్తున్నాయి. మిథునరాశిలో, పెళ్ళాం నక్షత్రం, భర్తవేపు చూచి అన్నది, 'ఆ కిటికీలోనుంచి చూస్తున్నారా?' ఇద్దరూ నవ్వుకొని ఒకరికిదగ్గరగా ఒకరు జరిగారు.

ఆ రోజు రాత్రి శర్మ చాలాసేపు ఆలోచించాడు. ఆవిడ లేకపోతే చదువు బాగా సాగాలిసింది, అసలే సాగటం లేదు! ఆవిడ ఉన్నప్పుడే కాస్త నయం. ఏమిటి దీనికంతా కారణం? ఎంతసేపు ఆలోచించినా దీనికి కారణం ఏమో అతనికి తెలియటం లేదు. ఒకటి మటుకు నిజం. ఆ అమ్మాయి వస్తె తనచదువు సాగేటట్టుగా ఉంది.

మరునాడు సెలవదినమే. వెళ్ళినా వెళ్ళ వచ్చు. తెల్లవారుఝామున బండికి వెళ్ళి, సాయంత్రానికల్లా ఇంటావిడను తీసుకొని రావచ్చు. కాని, ఇరవైరెండేండ్ల కుర్రాడు ఆ పని చేయటానికి సాహసించలేకపోయినాడు. చాల్లా సిగ్గుపడిపోయినాడు.

తానుగాను తాను అత్తవారింటికి వెళ్ళి పెళ్ళాన్ని పంపించమని అడగటం బాగుండదు కావటం కాదా! అని అతను ఆలోచించాడు. ఇతను వెళితే, వెళ్ళడంతోనే అత్తగారు వేడి నీళ్ళు కాళ్ళకు ఇస్తుంది, మర్యాద చేస్తుంది. కాని ఏమనుకొంటుంది!!

ఛీ ఛీ! ఎట్లా వెళ్ళేది? వెళ్ళకూడదు.

ఇంకా ఏమనుకున్నాడంటే ఆవిడ లేకపోతే తనకేం జరగదా! వండిపెట్టటానికి తల్లి ఉంది. దాహానికి నీళ్ళు కాచి ఇస్తుంది. పక్క తాను పరిచి వేసుకోలేడా! పుస్తకాలపై బట్ట దుమ్ము దులుపుకోలేడా! ఆమె ఇష్టంవచ్చినన్నిరోజులు పుట్టింట్లో ఉన్నా తనకేమీ నష్టం లేదు. తను వెళ్ళకూడదు.

ఈ నిశ్చయం చాలసేపు నిలవలేదు. దానికి కారణం ఊహించలేము. కాని మొత్తంమీద అతడు అటూ ఇటూ చాలాసేపు ఊగాడు.

ఈ ఊపులో అతడు ఒకసారి వెళ్ళి అత్తగారింట్లో పడ్డాడు.

శర్మ వెళ్ళడంతోనే అత్తగారు, మరదలు, బావమరదులు అంతా ఎదురుగావచ్చి ఆహ్వానించారు. చాలా మర్యాదచేశారు. అమ్మాయి మటుకు రాలేదు. ఏ తలుపుచాటునుంచి అయినా నుంచుని కళ్ళతో పలకరించి పోకూడదా అని శర్మ అనుకొన్నాడు. అత్తగారింట్లో ఎవరూ లేరు కాబట్టి సరిపోయింది. తన తండ్రి, తల్లి, అన్నలూ, చెల్లెళ్ళూ, ఇంతమంది ఉన్న

ఇంట్లో మొగుడి ఎదట పడడానికి ఆ పిల్లకు మటుకు సిగ్గు కాదూ? అందుకనే ఆ అమ్మాయి రాలేదు. శర్మకు మటుకు పెళ్లాము వచ్చి తనను మాట్లాడించలేదని కోపంవచ్చింది.

తను వచ్చాడుగదా, అత్తవారింట్లో వాళ్లు అంతా ఏమనుకొంటారూ అని శర్మ ఆలోచించినాడు. 'రెండురోజులయిందో లేదో, ఏదో పుట్టిమునిగిపోయినట్లు పరుగెత్తుకొచ్చాడు' అని పక్కఇంటిఆవిడ అన్నది. 'అమ్మా, అక్కయ్యను వదిలి ఉండలేడే బావ!' అని మరదలు అడిగింది. ఇట్లాగే అందరూ వెక్కిరింతగా వేళాకోళంగా అన్నట్టు తోచింది. శర్మంతచిన్నవాడికి ఇది అవమానమే. శర్మ తను ఇల్లాగ అవమానము పొందటానికి కారణం తనపెళ్ళామే అని గట్టిగా నిశ్చయించుకున్నాడు. అప్పుడు జ్ఞాపకం వచ్చినయి. ఆ అమ్మాయికి తనమీద ప్రేమలేదు అన్నవిషయాన్ని బలపరచటానికి చాలాచాలా విషయాలు?

ఆ రోజున వాళ్ళ బాబాయిగారి యింటికని వెళ్ళి, రాత్రి ఎప్పుడో వచ్చింది. ఇంటికి వెళ్ళటం ఆలస్యంఅయితే భర్తకి కోపంవస్తుందని కాపురంచేసేపిల్లకి తెలియక్కరలేదా! పైగా అప్పుడు ఏంజెప్పింది! 'మీ మరదలు పద్మ భోజనంచేయండి కదలనీయలేదు. మీ బావకు కోపంవస్తుందీ అంటే—మా బావ కోపం ఎరగడు—అన్నది' అంటూ అల్లిబొల్లికబుర్లు చెప్పి అతన్ని మంచిచేసుకొన్నది.

మరో రోజున స్నేహితులతో కలసి సినీమాకు వెళ్ళలేదూ! అతడు కాలేజినించి ఇంటికివచ్చేసరికి ఆమెవచ్చి కాఫీ అవీ ఇచ్చి విసరాలా వద్దా? సినీమాకువెళ్ళికూర్చుంటే ఇక్కడ శర్మపడ్డ అవస్థ ఇంతాఅంతా కాదు. గాలిలేక ఉడకపొయ్యటమేనా, మంచినీళ్ళు ఇచ్చేవాళ్ళు లేక నాలిక పీక్కుపోవటమేనా, ఇక చెప్పటానికి వీలులేదు!!

ఇల్లా ఎన్నో విషయాలు జ్ఞాపకంవచ్చినవి శర్మకు. భోజనం చేస్తున్నంతసేపూ అతడు ఇటువంటి విషయాలనుగురించే తీవ్రమైన ఆలోచన చేశాడు. చివరకు ఏమనుకొన్నాడూ



అంటే—'అది చాలా చెడ్డమనిషి. దానికి మొగుడుపై ప్రేమలేదు. అదేమంటే, ఏదో

తియ్యని మాటలు మాటలాడుతుంది. పరమ నొంగ దానితో మాట్లాడకూడదు.'

శర్మకు మేడపైని దక్షిణవైపు గదిలో మంచం వేశారు. చల్లనిగాలి వచ్చేప్రదేశం గదిఅంతా ఘుమఘుమలాడుతూంది. శర్మ చాలాసేపు వేచియుండకముందే, అతనిభార్య వచ్చింది తమలపాకులు పుచ్చుకొని.

ఆమె వచ్చేటప్పటికి శర్మ మంచంమీద పడుకొని బాగా ఆలోచిస్తున్నాడు భార్యపైన కోపం తీర్చుకోవడం ఎల్లాగా అని! మొత్తం మీాద ఆమెతో మాట్లాడకూడదనీ, మెత్తని మాటలు మాట్లాడినా లొంగకూడదనీ గట్టిగా నిశ్చయించుకోవటమే కాకుండా ఘోరమైన ప్రతిజ్ఞకూడా చేశాడు.

ఆ అమ్మాయి వచ్చి మంచంప్రక్కన కుర్చీలో కూర్చుని 'తమలపాకులు వేసుకోండి' అన్నది. పాపం ఆపిల్లకు ఏమీా తెలియదు శర్మ ఇప్పుడు చాలా కోపంగా ఉన్నాడని. తననుగూర్చి చాలా తక్కువచూపులో ఉన్నాడనికూడా ఆ పిల్లకు తెలియదు.

'తమలపాకులు వేసుకోవాలా వద్దా' అని శర్మ ఒక్క క్షణం ఆలోచించాడు.

ఆమె వచ్చేసరికి శర్మ కాళ్ళు ఊగించుకొంటూ పడుకొన్నాడు. ఆమె వస్తూన్నట్లు తెలిసేసరికి కాళ్ళు సరిగ్గా పెట్టుకొని, కళ్ళు గట్టిగా మూసుకొని ఆ అమ్మాయి అన్న మాటను వినలేదు.

పైకి విననట్లు ఉన్నాడుకాని, లోపల ఆలోచిస్తున్నాడు జవాబు ఏమిచెబుదామా అని. తాంబూలం పుచ్చుకోవాలా, నిరాకరించాలా అన్నదే ప్రశ్న! తనకోపం ప్రదర్శించేవిషయంలో 'తాంబూలం వేసుకోను' అనటం ఉచితమో, అనుచితమో అతడు ఊహించలేకపోయినాడు. ప్రబంధాలలో నాయకుడు కుపితుడై తాంబూలాన్ని నిరాకరించాడా అన్నది చాలా పెద్దవిషయం. కామసూత్రాలలో ప్రణయకోపప్రకరణలో కూడా ఈ విషయం చర్చకు రాలేదు.

అప్పుడు దీపం తగ్గించి ఉన్నది. ఆయన మాట్లాడలేదు. నిద్రపోతున్నాడా అని ఆ అమ్మాయికి అనుమానం కలిగి ఉంటుంది. అందుకనే కామాలు ఆమె వెళ్లి దీపం బాగా పెద్దది చేసింది. అతడు గాఢనిద్రలో ఉన్నాడు. ఆనిద్రలోనే అనుకొంటున్నాడు ఏమి చెబుదామా అని.

ఆ అమ్మాయి ఈతఫా మంచంమీాదికే వచ్చి కూర్చుని, 'ఏమండీ! తమలపాకులు వేసుకోండి' అన్నది.

అప్పటికి శర్మకు ఒకవిధంగా ఆలోచన తెగింది. తమలపాకులు వేసుకోకపోతేనేం? అందుకని 'అక్కర్లే' అన్నాడు నిద్రమత్తులో. ఆపిల్ల ఇంకా కొంచెం ముందుకుజరిగి అతని కాళ్లపైని చెయ్యివేస్తూ అన్నది. 'ఏం, కోపంగాఉన్నారేం?'

అప్పుడతడు పక్కకు ఒత్తిగిలి కోపంగా అన్నాడు "ఎందుకు వచ్చావ్?"

ఆమె కాలిమీద చెయ్యి తీసివేసింది. ఆ తరువాత ఆమె ఆ అబ్బాయి ముంగురులు సవరించింది. వక్షస్థలంమీద నొక్కుతూ అన్నది, 'ఎందుకంత కోపము?'

దీనికి అతడు జవాబు చెప్పగలడు. పదకొండు కారణాలు రెడీగా ఉన్నవి. కాని ఏమిలాభం చెప్పి! ఆ అమ్మాయి మొగుడియందు ప్రేమ లేకుండా ప్రవర్తిస్తున్నది, అందుకని అన్నాడు. విసుగ్గా 'నన్ను మాట్లాడించకు.'

'ఎందుచేత?' అని అడిగింది ఆమె. 'ఎందుచేతనా! నాకు నిద్రవస్తున్నది!' అన్నాడు ఈ పిల్లవాడు.

పాపం అతనికి అల్లాగ నిద్ర వస్తున్నప్పుడు ఈ పిల్ల అతనిదగ్గర జేరి కాలుగిల్లడం ఏమంత మంచిపనో నేను చెప్పలేను——

ఆ అమ్మాయిమాత్రం వెళ్లిపోక మళ్లీ అడిగింది దీనంగా 'లేచి తమలపాకులు వేసుకోండి'.

అతను మళ్లీ కోపంగా అన్నాడు; 'చాలా ప్రొద్దుపోయింది. ఇప్పుడేంతమలపాకులు!—వెళ్లిపడుకో—పో!'

ఇల్లా అతడు ఆ అమ్మాయిని ఎంతసేపో ఏడిపించి చివరకు దయదలచాడు. ప్రతిజ్ఞను నిలుపుకోలేకపోయాడు. పెళ్ళాన్ని తీసుకురావటానికి వెడితే ఇంతకథ జరుగుతుంది.

కాని ఇటుతిరిగి మళ్లీ అనుకొన్నాడు. 'ఛీఛీ. వెళ్లి రెండురోజులు కాలేదు. అంతా మునిగిపోయినట్లు నేను పరుగెత్తుకుపోతే అంతా నవ్వరూ!'

కాని అంతా నవ్వుతారని ఊరకుంటే బొత్తిగా చదువు సాగటంలేదే! అది ఎట్లా!

ఇట్లా చాలాసేపు అటూ ఇటూ ఊగాడు. చివరకు అనుకొన్నాడు-'తెల్లవారుఝామున బండికివెళ్లి తీసుకొనివస్తేనే మంచిది.' ఈ నిశ్చయానికి రావటంలో అతడు తొందరపడ్డాడనికాని, సిగ్గులేకుండా తెగబడ్డాడనికాని అంటానికి ఏమాత్రమూ వీలులేదు. సిగ్గుపడి వెళ్లకపోతే పరీక్షలో 'ఫెయిల్' అవటం తప్పదు కదా! అదిమటుకు ఏమంత మంచిపని!

వెళ్లటానికే నిశ్చయించుకొన్నా, అతడికి గుంజాటన ఇంకా తప్పలేదు. ఇంతలో తెల్లవారవచ్చింది.

శర్మ తెల్లవారుఝామున అయిదుగంటలకే లేచి ముఖం కడుక్కొని మంచిబట్టలు వేసుకొని బయలుదేరబోతూ తల్లిని లేపి అడిగాడు, 'అమ్మా! వెళ్లి, దాన్ని తీసుకొనిరానా?'

తల్లి లేచివచ్చి 'వెళ్లరా నాయనా, వెళ్లకపోతే ఎట్లా? ఆవిడ అక్కడ కూర్చుంటే ఇక్కడ ఎట్లా జరుగుతుంది?' అన్నది.

శర్మ మెల్లగా లేచి, కొత్తకోటు తొడుక్కొని జరీఉత్తరీయం వేసుకొన్నాడు. ఈ వెళ్లటం ఏమంత బాగుంది. ఆగిపోదామా? అనుకుంటూ ఉండనూ లేక, పోనూ లేక ఎంతో బాధపడుతున్నాడో ఆ భగవంతుడికి తెలియాలి.

ఇల్లాగ మథనపడుతూ ఉండంగానే ఒక పెద్ద తమాషా జరిగింది. ఏమిటంటే, ఎవరో పెద్ద కేక వేసినట్టు అతనిమనస్సుకు ఈ మాటలు

వినపడ్డయ్. 'ఏమి టీ పొగులాట? వెళ్లక పోతే ఎట్లా? ఆ అమ్మాయి వెంటనే రాక పోతే నీసంగతి ఎట్లాఉన్నా ముందు మీ అమ్మకు జరుగదు. ఆవిడ అనలేదూ, 'కోడలు అక్కడుంటే ఇక్కడ ఎట్లా జరుగుతుందిరా నాయనా' అనీ! ఈ మాటలు విన్నట్టు అయ్యే సరికి అతనికళ్లల్లోకి కొత్తకాంతులువచ్చినయ్. అతడు కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నాడు.

పదిగంటలకల్లా అక్కడికి చేరతాడు. భోజనాలైనతరువాత 'దాన్ని తీసుకొనివెడతాను' అని అంటాడు. అంటే అప్పుడు వాళ్లేమంటారూ? ''అప్పుడే ఏం తీసుకెళ్లటం నాయనా, వచ్చి రెండురోజులేకదా అయింది, ఇంకా నాలుగురోజులుంచుకొని పంపిస్తాములే'' అంటారు. ఇలాఅంటే, అప్పుడు తను ఏమిఅనాలె? 'ఏమండోయ్, మీ అమ్మాయి మీ యింట్లో ఎన్నిరోజులున్నా నాకేమీ అభ్యంతరం లేదు. అయితే మా అమ్మ పెద్దది. ఆవిడ అన్నది, ''కోడలు అక్కడుంటే ఇక్కడ ఎల్లాగజరుగుతుందిరా'' అని...అందుకనే వచ్చాను. లేకపోతే నాకేం!'

ఇల్లాగ అనాలని అనుకొంటున్నాడు. ఇంతలో తల్లివచ్చి, 'ఏంరా, ఇక్కడే కూర్చున్నావు. ఇంకా రైలుటైము కావటంలేదూ? అన్నది. శర్మ అన్నాడు 'చదువు పోతుందని ఆలోచిస్తున్నానమ్మా.'

ఈ మాటమీద ఆవిడ అన్నది. 'ఒక్కపూటలో చదువు ఏమంతపోతుంది! వెళ్లిరా నాయనా! కోడలు అక్కడుంటే నాకేమీ తోచటంలేదు. అయినా ఎట్లా? వెళ్లు.'

'సరే' అని శర్మ లేచాడు. ఆవిడను తీసుకొని రాకపోతే తల్లికి ఒక్కనిమిషం గడవదు. శర్మ తక్షణం లేచి ఉత్తరీయం పైనవేసుకొని వీధిలో కాలుపెట్టాడు.

అక్కడ కెళ్లింతరువాత వాళ్లంతా నవ్వుకొంటారు. పెళ్లాంకోసం పరుగెత్తుకొచ్చాడు అనికూడా అనుకొంటారు. కాని ఏంజేస్తాడు! తల్లిమనస్సు కష్టపెట్టడం ఏమంత మంచిపని కాదు. ఎవ రేమనుకున్నాసరే, తల్లిమాట వినాలె. అందుకనే అతడు గబగబా, గబగబా నడిచి, స్టేషనుకు వెళ్లిపోయినాడు.



# నన్ను గురించి కథ వ్రాయవూ?

## శ్రీ శివరాజు వెంకట సుబ్బారావు

"నన్నుగురించి కథ వ్రాయవూ?" అని అడిగింది కుముదం. ఈ ప్రశ్న నాకు కొంత ఆశ్చర్యం కలగజేసింది. ఎందుకంటే కొద్ది మార్పుతో ఇదే ప్రశ్న ఎనిమిది సంవత్సరాల క్రితం అడిగింది. నాకు బాగా జ్ఞాపకం. మా మేనమామగారింట్లో కుముదంతండ్రి కాపురం వుండేవాడు. అద్ది తీసుకురమ్మని అప్పుడప్పుడు నన్ను పంపేది మా అత్తయ్య. ఆ రోజు సాయంత్రం కర్రకు మేకు దిగేసి, ఇనపచక్రం దొర్లించుకుంటూ, వొళ్లో పరుగులెత్తింది కుముదం. నా కప్పుడు పన్నెండో ఏడు. ఆమె నాకంటె రెండు సంవత్సరాలు చిన్నదని వాళ్ళమ్మ చెప్పింది. నేను అద్దెమాట మరిచి, కుముదంతో కబుర్లు చెబుతూ కూర్చునేవాడిని. చెట్టెక్కి జామపండ్లు కోసిపెట్టమని వేధించుకు తినేది. పూర్తిగా పండని జామ పండు రంగులా వుండేది ఆపిల్ల ఛాయ. నే నేవో కల్పించి కథలుకింద చెప్పేవాడిని. వీటిల్లో నాయికలు మావూళ్ళో యిరుగుపొరుగు అమ్మాయిలు. ఈ కోతలు, అమాయికంగా చూస్తూ విన్నా, కుముదం కళ్ళల్లో ఎక్కడో యీర్ష్య మసగగా మెదిలినట్లు భ్రమించి, నేను గర్వపడేవాడిని కోతలు కొయ్యడం కథకుడి జన్మ లక్షణం కాబోలు: యథార్థవిషయాలు మానేసి, కల్పించి గాథలుచెప్పడం ఊహాసృష్టి లక్షణం అనుకుంటూ, ఇవన్నీ కుముదం నమ్మినట్లుగానే, కొంటెగా నిట్టూర్పు విడిచేది. నేనూ, యీ వ్యక్తులు, ఘట్టాలు యథార్థాలుగా స్మరించుకుని, తెచ్చిపెట్టుకున్న మౌనంలో పడేవాడిని. ఆ నిశ్శబ్దంలో కుముదం కంఠం వినిపించింది: "నన్ను గురించి కథ చెప్పవూ?" అంది. ఆ ప్రశ్న వెయ్యకపోతే, ఆమె కథ మరొకరిదగ్గర చెప్పి వుందునేమో నాకు తెలీదు. నే అనుకోడం, ఆమెకథ ఎవరితోనూ చెప్పి వుండను; ఎందుకంటే, ఆమె నిజంగా మనిషి—ఊహలో వ్యక్తికాదు.

అదే ప్రశ్న మళ్ళా అడగడం నాకు ఆశ్చర్యం కలగజేసింది. ఐనా నేను కథలు వ్రాస్తా నన్న సంగతి ఆమె కెట్లా తెలుసో నాకర్థంకాలేదు. నాకథలు, వొకటి రెండు తప్ప అచ్చుకాలేదు; వాటిని గురించి నే నెవ్వరితోనూ ముచ్చటించలేదు. ఇరవై సంవత్సరాల యువక అజ్ఞానంలో వున్న నన్ను ఎన్నుకోతగ్గ రచయితగా హిందూ సంఘం గుర్తించదని నా భయం. ముదుసలే జ్ఞాని కాగల డని భారతీయుల వెర్రినమ్మకం. పెద్దలన్నా, ప్రాచీనులన్నా, పాతవిషయాలన్నా, మనవాళ్ళకి అంత గౌరవం. ఒక విషయం మంచిదా, చెడ్డదా అన్న, తార్కిక సంశయాలకి మన సంఘంలో తావులేదు. ఎటొచ్చీ ఆవిషయాన్ని ప్రతిపాదించిన వ్యక్తి మృతుడై వుండాలి.

శక్తిగలవాళ్ళు ధనార్జనలోనూ, అదిలేనివాళ్ళు దైవంలోనూ లీనమైన యీ దేశంలో కథకుడికి విలువలేదని నే నారోజుల్లో నమ్మేవాడిని. నేను వ్రాసి తగలపెట్టిన రచనలతో నన్ను మరో దేశంలో బ్రహ్మరథం పడుదురు. సంఘం గుర్తించదన్న భయ మొకటేకాదు నేను కథలు వ్రాయకపోవడానికి కారణం: నా రచనావిధానానికి పరిపక్వం రాలేదని కూడా నే లోపల అనుకునేవాడిని, నా సృష్టిశక్తుల్ని రగిల్చి నన్ను తన్మయుణ్ణిచేసి నా జీవితంపై వొత్తిడి కలిగించే వ్యక్తులుకాని, నారచనల్ని చదివి, వాటిల్లోని, లోతులకి దిగబ్రాకి తాత్కాలికంగానైనా ధన్యతచెందే వ్యక్తులుకాని, ఆనాటివరకూ లేరని నాకు తెలుసు. ప్రపంచాన్ని పరిశీలిస్తూ, వ్యక్తుల మంచి

చెడ్డలని, వింతప్రవర్తనని, ప్రేక్షకుడుగా అనుభవించి, అర్థంచేసుకుని, అల్లా సంపాదించిన ఆంతరంగిక జ్ఞానాన్ని నా వేదాంతదృష్టిలో మేళవించి, వార్ధక్యంలో మహత్తర గ్రంథం వ్రాసి, మరణించాలని నా ఆదర్శం. ఈ రెంటిలో వొకటైనా జరిగితీరుతుంది. మహత్తరగ్రంథం వ్రాయలేకపోవొచ్చు: కాని మరణం మాత్రం తప్పదన్న ధైర్యం. నాకో నూత్నవుత్సాహాన్ని, ప్రసాదించింది ఆరోజుల్లో. "నన్నుగురించి కథ వ్రాయవూ?" అనే ప్రశ్న స్త్రీనోటి నుండి వినడం అదే మొదటిసారి. తన వ్యక్తిత్వాన్ని గుర్తించుకుని, దాని ప్రభావాన్ని ఇతరులకి తెలియచెయ్యాలన్న హిందూస్త్రీని, మొట్టమొదట కుముదంలో చూడగలిగాను. ఆమె వొక జీవి: ప్రత్యేకమైన వునికిగలది; ఆమెని తొలిగిస్తే ప్రపంచంలో కొంత పవిత్రమైన ఖాళీ ఏర్పడుతుంది. నే చూసిన స్త్రీలు, వివాహం జరిగిన రోజునే జన్మించినవాళ్ళు. భర్తని పొడిగిస్తే, స్త్రీ ఔతుంది; యింకా పొడిగిస్తే భర్త సంతానంగా మారతాడు: అతను గతించగానే, ఆమె స్థూలజీవితం సమాప్తమౌతుంది. సృష్టిని ఆహ్వానిస్తూ తెరుచుకున్న తలుపులు భారతస్త్రీలు. తెరుచుకోని తలుపులు లేవు. ఏదేనా వొక తలుపు పాడై తెరుచుకోనినాడు, దాన్ని గురించి చెప్పుకుని, మరమ్మత్తు సంకల్పించాలి. మరమ్మత్తుచేసినా బాగుపడని తలుపులని, నిర్మూలం చెయ్యాలా, లేక వేరే పనులకు వుపయోగించుకోవాలా అన్న సందేహాన్ని సంస్కర్తలు తీర్చాలి. కథకుడు, ఏంచెడిపోయిందో చెప్పగలడు; వీలైతే మిగిలినదానితోనే తృప్తిపడుతూ, యితరులకు ఆ విషయం నేర్పగలడు: కాని బాగుచేసే విధానాలతో అతనికి నిమిత్తంలేదు.

"నీలో ఏముందని నిన్నుగురించి కథ వ్రాయనూ?" అన్నాను. అట్లా అన్నందుకు నేను చాలాసార్లు పశ్చాత్తాప పడినా, ఆప్రశ్న నా నమ్మకాన్ని, ఆశయాలనీ యథార్థంగా వ్యక్తపరుస్తుంది. ఆమెలో, కథావస్తువుగా వుండేటంతటి విశేషం వొక్కటి కూడా లేదు. చూడడానికి చాలా సామాన్యంగా వుంటుంది; పల్చటిశరీరం; వేసంగిలోవర్షం కురిసేముందు దట్టంగా అల్లుకున్న మబ్బురంగు శరీరచ్ఛాయ. సంపూర్ణంగా వికసించని అవయవాలు. ఎవరో దువ్వినట్లుగావుండే జడకట్టు. చూసిన వొస్తువులు తనకోసం కానట్టు చాంచల్యంగా, మెరిస్తే బలహీనమైన కనురెప్పలకింద మంచులో కదిలిపోయిన కుందేలులా మెరిసే నేత్రాలు; కంఠంలో కొలవడానికి వీలుగావుండే పచ్చటి నాళాలు; నీడ కనిపించినట్లు స్ఫురించే వక్షం: శరీరంలో పైభాగాన్ని మోసే టందుకు వోపిక లేనట్టి అల్పమైన నడుం. కుముదం సాధారణమైన స్త్రీ. ఎవరూ, తుదకి వాళ్ళమ్మ కూడ ఆమె అందమైందని చెప్పుకోడం నే నెరగను. అందుకనే ఆమెలో నే నేమీ విశేషం చూడలేక పొయ్యానేమో!

"నాలో ఏముండాలి?"

"ఒక ప్రత్యేకత; అందరిలోనూ లేని వొక్క విషయం వున్నాసరే—"

వేలునున్న వుంగరాన్ని చూసి దాన్ని వేళ్ళలో తిప్పింది. పోతపోసి, పదునుపెట్టినట్లుగా చలించే వేళ్ళు ఆమెవి. ఏ అవయవం కదిలినా, శరీరంలోని శక్తంతా దానిలో పూరించినట్లుగా వుంటుంది. ఒక వొస్తువుకేసి చూస్తున్నప్పుడు, పంచప్రాణాలు కళ్ళల్లోకి పరిగెత్తుకొచ్చినంత తీవ్రంగా చూస్తుంది. సిగ్గుపడితే రక్తం చెక్కిళ్ళలోనుంచి తొంగిచూస్తున్నట్లుంటుంది. కాని కుముదాన్ని వర్ణించినంత మాత్రాన కథౌతుందా?

"నీ పెండ్లికి నన్ను పిలవలేదేం?" అని అడిగాను.

"మా అమ్మ నీకూ శుభలేఖ పంపానంది—వొస్తే నలుగుర్నీ చూసి, ఏమన్నా వుంటే కథేనా వ్రాద్దువుగా." అంది.

"నేను తమాషాకి అనడంలేదు. సాధారణవ్యక్తులను గురించి వ్రాసేటందుకు ఏముంది? పదిమందీ వొకేలాగున్నప్పుడు వారిలో ఏ వొక్కర్ని గురించీ చెప్పుకోం. కాని, అందులో ఏ వొక్కడైనా, పదిమంది చేసినదానికి వ్యతిరేకంగా చేస్తే అతన్నిగురించి చెప్పుగుంటారు. అట్లాంటి వ్యక్తులనిగురించి వ్రాయొచ్చు." అన్నాను.

"ఐతే, అందరూ చేసినదానికి విరుద్ధంగా చేసినవాళ్ళే మనుషు లన్నమాట……"

"నే అల్లా అనను. అట్లాంటివాళ్ళు చెప్పుకోదగ్గ మనుషు లంటాను."

ఎక్కడో ఎప్పుడో పుట్టడం, ఎవరో ఎవర్నో ఒప్పగిస్తే వార్ని పెండ్లాడడం, ఎందుకో తెలీకుండా పిల్లల్ని కనడం, ఎప్పుడో ఎక్కడో చచ్చిపోవడం—ఇది చాలా మంది చేస్తున్నది. దీన్ని గురించి కథగా చెప్పుకునేటందుకు ఏముంది? ప్రత్యేకత, వ్యక్తిత్వంలేని యీ జీవితాలు ప్రశాంతాన్ని పొందుతున్నాయి; కాని, అది మురదగుంటలో పురుగు పొందే ప్రశాంతం. సంఘాన్ని ధిక్కరించి, సాంప్రదాయాలపై విప్లవంచేసి, ఎవరికీ అక్కర్లేని కొత్తవిలువని సాధించి పొందినవాడే ధన్య జీవి. వ్యక్తిజీవులు సంఘం అల్లిన వలలో చిక్కుకొని, మర్యాదపేరు చెప్పుకొని కుళ్ళిపోతారు. స్థాపితమైన ఆదర్శాలపై విప్లవం చేసినవాడు, సంఘాన్ని తనవెంపుకి మరల్చ యత్నిస్తాడు. కాబట్టి సంఘాభివృద్ధి అల్లాంటి వాళ్ళపై ఆధారపడుతుంది. కుముదంలో యీ విప్లవ చిహ్నం వొక్కటికూడా లేదు.

ఆమె చదువుకోలేదు; సంగీతం నేర్చుకోలేదు. కనీసం కూనిదీర్ఘాలు తీసినట్లుగానేనా కనిపించదు. జ్ఞానం వొచ్చింతర్వాత ప్రేమించి చేసుకున్న పెండ్లి కాదు; గొప్పస్థితిపరురాలుకాదు; పోనీ బాగా బీదదీకాదు, సానుభూతి చూపేటందుకేనా: చక్కంది కాదు, పద్యాలు రాద్దామంటే; అనాకారీకాదు, వికృతాన్ని చిత్రిద్దామంటే; మంచివాళ్ళని గురించి వ్రాయొచ్చు; చెడ్డవాళ్ళని గురించి వ్రాయొచ్చు; కాని సాధారణమైన వాళ్ళనిగురించి వ్రాయడం ఎంతో కష్టం. అసలు వ్రాసేటందుకు ఏముంది?

కొందరు వ్యక్తులు తల్లితండ్రుల చర్యలవల్ల ఖ్యాతికెక్కుతారు. కుముదం ఆ తెగకిచెందదు. వాళ్ళతండ్రి చనిపొయ్యాడు; తల్లి ఏవూళ్ళోనో కొడుకుదగ్గర వుంది. వాళ్ళకుటుంబానికి చరిత్రలేదు.

"మీ ఆయన ఏం చేస్తున్నాడు?"

"ఎల్. టి. చదువుతున్నారు."

"స్కూల్‌మాస్టరవుతాడన్నమాట—ఏ పనీ దొరకని వాడికి ఆదేశరణు. మంచివాడేనా?"

నవ్వింది. "మంచి అంటే ఏమిటో నాకేం తెలుసు; నీకు తెలియాలి కథలురాసేవాడవు."

"ఓస్! చెప్పడంకాబోలు. అదికాదు కుముదం. అందర్లాగే కాపరానికెళ్ళి, పిల్లల్ని కంటే ఏం ప్రయోజనం? ఏదో వో గొప్ప కార్యం సాధించాలి; సంఘాన్ని ముందుకునెట్టాలి. ఇక్కడికే భారతమాత యీ సంతానాన్ని పోషించలేక పోతోంది."

"నాకింకా పిల్లలులేరు. ఐతే ప్రతి ఆడదీ పెళ్ళిచేసుకోకుండా కోట్ల ముందు పికెటింగ్ చెయ్యాలంటావా?"

"పెళ్ళి వొద్దని నే ననడంలేదు. వివాహం స్త్రీ జీవితంలో ప్రధానఘట్టం. అందులో నువ్వు సాధించింది ఏముంది? ప్రేమా? సౌఖ్యమా? ఆధ్యాత్మికమా? దేశభక్తా? ఏదీలేదు." అన్నాను.

"పెండ్లిచేసుకున్న ప్రతిస్త్రీ భర్తను వొదిలేస్తే నువ్వు కథలువ్రాస్తానంటావ్, అంతేనా?"

అంత పచ్చిగా అడిగినందుకు నాకు రోషంవొచ్చింది.

"వొదిలేస్తే చాలదు—మరో గొప్ప విలువని సాధించాలి."

"అంటే?"

"ప్రేమలేని వివాహానికి విలువ లేదనుకుంటాను."

"నీ కేంతెలుస్తుంది? నీకు పెళ్ళికాలేదు."

"ఆ విలువని సాధించగలిగితేనే వివాహానికి అర్థం వుంటుంది"

అట్లాగైతే, ప్రతిస్త్రీ భర్తను వొదిలేసి మరోడితో వుండాలంటూ, ప్రేమను సాధించేందుకు?"

అట్లా అడిగినందుకు నాకు నవ్వొచ్చింది. "దానికోసం ఆ త్యాగం చెయ్యగలిగితేనే మెచ్చుకుంటాను." అన్నాను

కుముదం మాట్లాడలేదు. ఈ భావాలు ఎంత వరకూ ఆమెని కలవరపెట్టాయో నాకు తెలీదు. స్త్రీ ప్రకృతిపైన

వొత్తిడి కలిగించేది. భావాలో, సహజమైన ఉద్రేకమో నేను చెప్పలేను. అది తెలిస్తే స్త్రీహృదయం అర్థం చేసుకున్నట్లే.

"కాని....కాని...." మాటలకోసం తడుముకుంటూ. నిదానించింది.

"ఏమిటి నీ సందేహం ?"

"ఏమీలేదు. నా కేదో చెప్పాల నుంది. ఎట్లా చెప్పాలో తెలీడంలేదు. నే చదువుకున్నదాన్ని కాదు. ఉండు ఆలోచించనీ........"

నేను ఆమెకళ్ళకేసి చూస్తూకూర్చున్నాను. నిదానించి చూస్తే ఆమె మొహంలో వొకచెప్పరాని ఆకర్షణ వుంది. వొంపులు, ఎత్తు పల్లాలు సూర్యరశ్మి సోకినప్పుడు తీర్చినట్లుగా విప్పారుకున్నాయి. ఆ కళ్ళు ఆమెకి వుపయోగం లేవుకాబోలు. మనుషులకి ఆత్మ వుందోలేదో నాకు తెలీదు కాని, ఆమెకి మాత్రం లేనట్లు నా కనిపించింది. మరో లోకంలో ఆత్మని మరచిపోయి, శరీరాన్ని తనిష్టం లేకుండానే ఇక్కడికి రప్పించినట్లు చలిస్తుంది. ఈ ప్రపంచంలో మూసుగుని మరోలోకంలో తెరుచుకొన్న నేత్రాలు ఆమెవి. "కాని....కాని....సూర్యుడు, చంద్రుడూ ఎప్పుడూ చూస్తుంటాను, కాని ప్రతిసారి ఎందుకో క్రొత్తగా కనబడతాయి. మంచినీళ్ళు రోజూ త్రాగుతాను; కాని ప్రతిసారి ఎంతో క్రొత్తగావుంటాయి.............. నక్షత్రాలు........"

నేను వెడలా నని లేచాను.

"నక్షత్రాలు....ఉ....మంచిది...." ఆమెని గురించి ఏం కథ వ్రాయనూ ?

* * *

క్రితంసారి మేం కలుసుగుని నాలుగేండ్లయిందని, నాకు కుముదంతో మాట్లాడుతున్నప్పుడు అనిపించలేదు. ఈ సారి ఆ వూరు కేవలం అద్దికోసమే వెళ్ళలేదు. వేరే పనుండి వెళ్ళాను. అది నే చెప్పదలచుకున్న దానికి అప్రస్తుతం కాబట్టి ఇక్కడ చెప్పను. మధ్యాహ్నం రెండు గంటలు దాటింది. నడివేసంగి, ఎండ నన్ను నీడకి తరిమింది. పోస్టాఫీసు ప్రక్కనున్న మామయ్యగారింటికి ఎప్పుడూ దొడ్డిదోవన వెళ్ళడం అలవాటుచప్పున ఆనాడుకూడా అల్లాగే వెళ్ళాను.

కుముదం మండువాలో గచ్చుమీద కూర్చుని అనాసపండు తరిగి వెండిపళ్ళెంలో వేస్తోంది. నారింజపండు రంగు చీర కట్టుకుంది; నన్నుచూసి లేవడంలో పమిట జారింది. నాకర్థమైనట్లు నవ్వి వెనక్కి తిరిగి లోపలికెళ్ళి వొక కుర్చీ అమిర్చి కూచోమని సంజ్ఞ చేసింది. నే చూసిన దృశ్యం నా కిదివరకులేని క్రొత్త చనువు నిచ్చిందని వొప్పుకోకతప్పదు. మనిషి శీలానికి వ్యక్తిత్వానికి మొహం వొక్కటే నిదర్శనం కాదనుకుంటాను. కొన్ని ఆకస్మిక దృశ్యాలు, జీవితకాలం పరిశీలించినా బోధపడని అంతరంగికాలని తేటపరుస్తాయి కాబోలు.

కుర్చీలో హాయిగానే పటుక్కుమంది పాతకుర్చీ. లేచి సర్దుకున్నాను, కుముదం పమిటని పళ్ళమధ్య బిగించి నవ్వుని ఆపుకుంటోంది.

"అన్నికుర్చీలమాదిరి నిన్ను భరించి వూరుకోక, విరిగి, క్రొత్తదారి తీసింది చూశావా ! దానికథ వ్రాయవూ ?...." అంది. నాకూ నవ్వొచ్చింది. చాపమీద కూర్చుని స్తంభానికి జార్లబడ్డాను.

"మనం కలుసుగుని దగ్గరదగ్గర నాలుగేళ్ళయింది, తెలుసా. నే నివన్నీ మరిచిపొయ్యాను నీకింకా ఎట్లా జ్ఞాపకం వుందీ ?" అన్నా ప్రశ్నార్థంగా.

"ఏమో, నువ్వు జీవితాన్ని పరిశీలిస్తావు. నేను అనుభవిస్తాను. ఏమో !" అన్నది.

ఆమెకి జీవితం అనుభవించడం అంటే ఏమిటో తెలీదని నా నమ్మకం. కాలం ఆమెపై ఎట్లాంటిమార్పూ తేలేకపోయింది. ఇదివరకు చూసినప్పటికంటె యీసారి ఎక్కువ చలాకీ, యవ్వనోద్రేకం చూపగలిగింది. ఆమెలో ఆకర్షణీయమైంది ఎడతెగని యవ్వనమేమో ననిపిస్తుంది, యవ్వనం వొక్కసారి తనశక్తిని ప్రకటించకుండా. నిలిపినిలిపి ప్రజ్వరించినట్లుగా గోచరిస్తుంది. కొన్ని ఉపమానాలు మన నాగరికసాంప్రదాయాలకి విరుద్ధమని జంకు

తున్నాగాని, లేకపోతే ఆమె శరీరాన్ని గుర్రంపిల్ల కదలికలోని లావణ్యంతో పోల్చొచ్చు. లేడిగంతులో శృంగారం వుందికాని, బలం లేదు: కుక్కపిల్లగంతులో కొంటెతనం వుందికాని, శక్తిలేదు. మేకపిల్ల గంతులో వేగం వుందికాని, మృదుత్వం లేదు. ఇవన్నీ గుర్రంపిల్ల అలిగిననాడు చేసిన నాట్యంలో వున్నాయి.

"నువ్వూ, మీ ఆయనా కులాసాగా వుంటున్నారా?" అన్నాను, ఏమనడానికి తోచక.

"నీదయవల్ల"

"ఇంతా నిన్నుగురించి బోలెడు వినాలనుంది."

"నన్నుగురించి వినేందు కేముంది, మాది సామాన్య బ్రతుకు" అంది నీరసంగా. "అప్పుడే జీవితంపైన విసుగు పుట్టిందా?" అన్నాను.



"ఈ ప్రశ్నలు నన్నింతవరకూ బాధించడం లేదు. నీమాట చెప్పు, ఏం చేస్తున్నావూ? ఎక్కడున్నావూ? ఎల్లావున్నావూ?...."

మనదేశంలో చదువుకున్న యువకుల్ని ఏం చేస్తున్నావూ? అని అడగడంకంటె ఎక్కువ అపచారం లేదు. పాపం అల్లా అడిగినవాళ్ళందరూ మామేలు కోరేవారే! కాని, దానికి సమాధానం చెప్పడంలో ఉద్యోగం లేని యువకుడు ఎంత బాధపడతాడో పెద్దవాళ్ళకి తెలీదు. ఏమీచెయ్యడంలే దనిచెప్పడం నాకు చిన్నతనంగా తోచి "ఏమీ లేదు—కథలు వ్రాయడం మొదలుపెట్టాను." అన్నాను,

"నన్నుగురించా?"

నవ్వుకున్నాను. "నీలో ఏముంది?" ఇంతలో పాకుతూ, నడుస్తూ, పడుతూ, వంటిపిల్ల చక్కావొచ్చి అర్థంలేకుండా ఏడవడం మొదలెట్టింది. నే నాశ్చర్యపడ్డాను.

"మా పాపాయి. ఇంక రెండునెల్లకి మూడోఏడొస్తుంది." అంది కొద్దిగర్వంతో.

"నా కెప్పుడూ చెప్పలేదే? ఈ సంగతే తెలీదు." అని ఆశ్చర్యం దిగమింగుకోలేకపోయాను.

"నీకు తెలియజేసేటందుకు యిందులో ఏం విశేషముంది? ఇది సాధారణంగా అందరికి జరిగే పనేకదా. నీ కీవిషయం వేరే నేచెప్పాలా?" అంది. ఆమె అంతవరకూ తన పిల్లనిగురించి చెప్పకపోడం చూస్తే నాకు మరీ ఆశ్చర్యం కలిగింది.

"దానికో పాపాయిపుడుతుంది, ఎప్పుడో, ఎక్కడో. అది ఎవర్నో, ఎక్కడో పెండ్లిచేసుకుంటే, దానికి మరో పాపాయి, ఎప్పుడో, ఎక్కడో పుడుతుంది. అల్లాజరిగిపోతుంది. ఇందులో ఆశ్చర్యపడే అసాధారణం ఏముంది....?"

కుముదంలో మాతృత్వం తాలూకు చిహ్నాలేవీ నాకు కనబడలేదు. పిల్లలని చూసుకుని తల్లులుపడే గర్వం ఆమెలో లేదు. ఆ ప్రశంస ఎత్తాలని ఆమెకు తట్టనేలేదు;

ఆమె శరీరపటుత్వాన్ని చూస్తే, ఆమె యీపిల్లని కన్నదా అనిపించింది. పిల్లలూ, భర్తా, సంసారం,—యివేవీ ఆమె నిజశరీరాన్ని తాకి, పంచుకున్నట్లు లేదు.

"నీపోలికా, వాళ్ళ నాన్నపోలికా?"

"ఏమో నీకే తెలియాలి."

"నా కెట్లాతెలుస్తుంది. నేను వాళ్ళ నాన్నని చూడనే లేదుగా."

"వీధులో వున్నారు చూడకూడదూ?" వీధులో అరుగు మీద విద్యార్థులతో ఆయనపడుతున్న అవస్థ నాకు వినపడుతునేవుంది. వెళ్ళేటప్పుడు చూడొచ్చు ననుకున్నాను. కుముదం పిల్లని లోపలికి తీసుకెళ్ళిపోయింది. ఆకులో అనాసముక్క లుంచి, మంచినీళ్లు పెట్టింది.

"పాపం, ఎండలో వొచ్చావు, నీ మొహం మాడిపోయింది."

"నిజంగా?"

"మనం పెద్దవాళ్ళ మైపోతున్నాం, కదూ?" "నా మాట తెలీదుకాని, నువ్వుమాత్రం యింకా చిన్నదానవవుతున్నావు." అన్నాను.

"అది అబద్ధం. ప్రకృతివిరుద్ధం." కొంతసేపు ఎవ్వరం మాట్లాడలేదు. ఎందుకో కొన్నికొన్ని సమయాలలో ఆమెతో మాట్లాడుతున్నప్పుడు, బుర్ర ఖాళీ ఐపోతుంది. సిగరెట్టు పీలుస్తూ, చీట్లాడుకుంటున్న సమయంలో అమాంతం గదిలోకి చిరతపులి వొచ్చినప్పుడు, బుర్ర ఎట్లా పనిచెయ్యదో, అట్లాగే ఆమెతో సంభాషణ.

"దేశంలో సంతానం ఎక్కువై పోతున్నారు. యిట్లా పదిసంవత్సరాలు జరిగిందంటే తినేందుకు తిండి వుండదంటున్నారు, సాంఖ్యశాస్త్రవేత్తలు తెలుసా?" అన్నాను.

"అది నాకు తెలీదు. కాని మనం ప్రకృతికి దాస్యం చెయ్యడం తప్పదు. దాస్యం నేను సహించలేను, కాని అది తప్పదనుకుంటాను. నేను ఎదురు తిరగలేక కాదు; కాని నా కదిష్టంలేదు. జీవితానికి తలవొగ్గి, ప్రపంచాన్ని అంగీకరిస్తాను."

"అదే పొరపాటు. అంగీకారం ఆదర్శాలు లేని వ్యర్థజీవి విముఖత్వం."

"కావొచ్చు, సృష్టిలో నేనెంత అల్పురాలనని తోటివాడవైన నీకే సామాన్యంగా కనుపించినప్పుడు, సృష్టి ముందు నే నేం తిరుగుబాటు చెయ్యగలను చెప్పు."

వెడతానని లేచాను,

"అద్దె తీసుకురానా?" అంది. "నేను దానికోసం రాలేదు. మనియార్డరు చెయ్యొచ్చు."

పాపిష్టి డబ్బుని ఆమె చేతులు తాకటం నా కిష్టంలేదు. ఆమెభర్తని చూడడం కూడా మరచి, బైటకి నడిచాను. నన్ను కుముదం వెనక్కి పిలుస్తుందనుకున్నా. అట్లా పిలవలేదు. నావెనకాల దొడ్డితలుపు గడియ మూసిన చప్పుడు వినిపించింది.

కుముదాన్నిగురించి ఏం కథ వ్రాయనూ?

* * *

ఆరు సంవత్సరాలు గడిచాయి. రెండో ప్రపంచ సంగ్రామం ప్రారంభ మైంది. అప్పటికి నా చదువు, ఉద్యోగ యత్నాలు పూర్తయ్యాయి— వొక్క యత్నం ఫలించలేదు. మా మామయ్య నాకోసం పెట్టిన డబ్బు ఖర్చంతా వృథా ఐంది. పైగా, ఆయనా, మా అత్తయ్యా, ఇండియా అంతా యాత్రచేసి రావడంవల్ల ప్రావిడెంట్ ఫండంతా తరిగిపోయింది. నిరుద్యోగ సమస్యను గురించి బోలెడు కథలు వ్రాశాను, సమస్య పరిష్కారం కాలేదు; ఆంగ్లంలో యీ సమస్యను పరిష్కరించడానికి కొన్ని సలహాలిస్తూ వ్యాసాలు వ్రాశాను; ఎవరూ వాటిని గుర్తించినట్లులేదు. కొన్ని సమయాలలో రాజకీయోద్యమంలో దిగి జైలు కెడదామనిపించేది. అప్పుడు భుక్తికి లోటుండదు, కీర్తి దక్కుతుంది— పైగా జైలులో నే తలపెట్టిన మహత్తర గ్రంథాన్ని రచించడానికి మంచి అవకాశాలుంటాయి. కాని రాజకీయాలలో దిగడం ఎట్లా? 'ఫరవా లేదురా అబ్బీ, యుద్ధం వొచ్చింది దేవుడి ధర్మమా అంటూ నీ కేదో వుద్యోగం దొరక్కపోదు' అని మామయ్య ఓదార్చేవాడు.

"నాకు నచ్చిన ఉద్యోగం ఒకటి ఖాళీ వొచ్చింది మామయ్యా, దరఖాస్తుకి, ఇంటర్‌వ్యూకి వో ఏభై రూకలుంటే నాకు లభించొచ్చు." వెంటనే మామయ్యకి వో భావం తట్టింది.

"ఒరే! కుముదంగారింటి కెళ్ళి, ఆరునెల్ల, అద్దిముందుగా యిస్తారేమో కనుక్కురా" అని నన్ను సాగనంపాడు.

సూర్యుడు పడమటింట్లో గృహప్రవేశం అవగానే ఎలుస్తువేసి, కిటికీ కర్టెన్లు దగ్గరగా లాగడానికి సిద్ధపడినట్లు, మేఘాలు దురుగ్గా విహరిస్తున్నాయి. కుముదంగారి దొడ్లో ఎన్నో యిదివరకు చూడని కొత్త మొక్కలు, చెట్లు వున్నాయి. కొబ్బరిచెట్లు మేఘాలతో ఏకీభవిస్తున్నట్లు ఆకాశంలోకి పొడుచుకుని ఆడిపోతున్నాయి. జామచెట్టు వార్ధక్యం వొచ్చినదాని మల్లే ముడుచుకుంది. ఆ అల్ప ప్రకృతిలో వొక్కటీ నారాక గుర్తించినట్లు లేదు. చెట్ల కొమ్మలకి ఉయ్యాల అమర్చబడి వుంది. నూతి పక్కం వేపునుంచి వో పాపాయి పాకుతూ వొస్తున్నాడు. వాడితో ఎదో మాట్లాడాను; వాడి కేమీ అర్థంకాక, జీవిత రహస్యం తెలుసుకోలేకపోయిన వేదాంతిలా, నిరర్థకంగా ఏడ్పు మొదలుపెట్టాడు. చెట్ల గుబురు మధ్య కుముదం మేఘాలమధ్య నక్షత్రంలా కదిలింది. నక్షత్ర బృందంలోంచి విడిపోయిన పిల్లకాంతిలా మరోచిన్నపిల్ల పరుగులెత్తింది. కుముదం చేతిలో గునపాన్ని గిరవాటెట్టి, పమిటని పళ్ళమధ్య బిగించి పైకి లాగి, చేతులోవున్న మొక్కని నాముందు పడేసింది.

"చూశావా, యీ ఆకుని ఎట్లా తినేస్తోందో యీ చిత్రమైన పురుగు? ఈ పురుగు అందమైనదే, మొక్కా అందమైనదే. అందాన్ని చూసి అందం ఓర్చలేదు కదూ?" నే నేమీ మాట్లాడలేదు.

"నువ్వొచ్చి ఎంతసేపైంది? పిలవలేక పొయ్యావా? లేక నాపేరే మరచిపొయ్యావా?" అంది.

"లేదులేదు.—యీ తోటని చూస్తూ ఆశ్చర్యపడుతున్నాను."

"ఇందులో ఆశ్చర్యం ఏముంది? విత్తనం వేసి, నీళ్లు పోస్తే మొక్క మొలుస్తోంది. ఇవన్నీ సాధారణమైన మొక్కలు." అని కొంటెగా నవ్వింది.



"మా పాపని చూశావా, పెద్దదైంది. నువ్వింక సంబంధాలు చూచిపెట్టే సమయం వొస్తోంది. వాడు మా రెండోవాడు. వాడికి ప్రకృతంటే పడదు. అన్నింటని ధ్వంసం చేస్తాడు. వీడు మా మూడోవాడు—వీడికి నాలా ప్రపంచంతో నిమిత్తంలేదు. పాపా! బకెట్ తీసుకురా...."

అమ్మాయి బకెట్ తీసుకొచ్చింది. కుముదం చిన్నప్పుడు జామపండు తింటున్న దృశ్యం జ్ఞాపకం వొచ్చింది.

"కొంచం నీళ్లు తోడిపెట్టు, చేతులు కడుక్కుంటా" అంది.

నేను తోడాను. బకెట్‌లో సగంనీళ్ళు నూతులోనే పడిపోయాయి.

"నీళ్ళు తోడడం తెలీకపోతే ఎట్లా? నీ భార్య బైటుంటే నువ్వే తోడుకోవాలి."

"నా కింకా పెండ్లికాలేదు."

నమ్మలేనట్లు చూసి, మౌనంలో పడింది.

"నాకు ఉద్యోగం లేదు. ఎందుకు పెండ్లి ?" అని స్వగతంలా చెప్పుకున్నాను.

నా మాట వినిపించుకోలేదు. చీరని పాదాలపైకి తీసింది. ఆమెశరీరానికి మాతృత్వం పరిపూర్ణత నిచ్చింది. వయస్సు మొహానికి వైరాగ్యా న్నిచ్చినా, వార్ధక్యా నివ్వ లేకపోయింది. మట్టిలో నీళ్లుకలిపిన వింత సువాసన న న్నావరించింది. మొహాన్ని పమిటతో తుడుచుకుంది. తడిసిన పమిట పర్వతశిఖరానికి ఎగబాకేవాడికి పట్టు దొరికినట్లుగా, వక్షాన్ని అదిమిపట్టుకుంది. సూర్యుడి కడ సారి కిరణం, లోయలో సీదని వొక్కసారి వెలిగించి మాయమైంది. సంధ్య అందాన్ని అనుభవించాలన్నవాడు, కుముదంతో వుండాలి. సంధ్యలో నే నెన్నడూ చూడని ప్రత్యేక శోభిని ఆనాడు చూడగలిగాను.

" దా, ఉయ్యాలమీద కూర్చో—వెనక విరిగినకుర్చీ యింతవరకూ బాగుచేయించనే లేదు ...ఏదో వొకటి వొస్తూనే వుంటుంది. తీరికలేదు."

కుముదం గడ్డిలో కూర్చుంది. అమ్మాయి, వేదాంతిని ఎత్తుకుని లోపలి కెళ్ళింది. వెండోవాడు, ధ్వంసం చేసేం దుకు మొక్కలు లేవన్నట్లు, గడ్డినే దిమ్మిశాలా పర్ది స్తున్నాడు.

" మనం కలుసుకుని చాలారోజు లైంది, తెలుసా."

" ఆహా, దగ్గరగా ఆరుసంవత్సరాలైంది."

" నువ్వు చాలా మారిపోయావు."

మంచికా చెడుకా అని అడుగుదా మనుకున్నాను. నన్ను మాట్లాడనీకుండానే—" ఎక్కడెక్కడి కెళ్ళిందీ, ఏంచేస్తున్నదీ—అంతా చెప్పు నిన్నుగురించి " అంది.

" ఉత్తర హిందూస్థానంవెళ్లా— ఎక్కడా మంచి ఉద్యోగం దొరకలేదు. మామూలుగా ఇండియాలో మనిషి ఇరవై మూడేండ్లకంటే ఎక్కువకాలం జీవించడంటారు, సాంఖ్య శాస్త్రకారులు. దానిప్రకారం నేను తొమ్మిదేండ్ల క్రితమే చనిపోయి వుండాల్సింది, అల్పాయిువుగలవాళ్లు సుఖంగా వుండగలరు యీ దేశంలో."

కుముదం సానుభూతిచూపి, జాలిపడుతుందని నా ఉద్రేకాన్ని ఎంతో కసితో భయంకరంగా ప్రకటించాను.

"వెధవ ఉద్యోగం లేకపోతేనేం : దానికోసం జీవి తాన్ని లిట్టొచ్చా ! ఉద్యోగంలో పడ్డావంటే, అదేలోకం, మరి ప్రపంచంతో సంబంధంవుండదు. ఎవరికో దానిసపై స్వేచ్ఛ పోగొట్టుకుంటాం. ఆడాళ్లకి పుద్యోగంచేసే బాధలేకపోవడం ఎంతోమెరుగు."

నా కిది నచ్చలేదు. కాని ఉద్యోగం చెయ్యనందుకు నన్ను అంపర్లా ఆక్షేపిస్తూ, తిట్టకుండా, మెచ్చుగున్నందుకు, నేను కుముదాన్ని కొంత గౌరవించాను.

" పాశ్చత్యదేశాలలో స్త్రీలు, పొట్టకూటికోసం భర్త లకు మనవాళ్ళల్లా అమ్ముడుపోరు." అన్నాను. అప్ర యత్నంగా రెండు గడ్డీపువ్వులను తెంచి జుట్టులో అమర్చుకుంది.

" మన కీ ప్రపంచంలో ఎవరో వొకరికి దాస్యం చెయ్యడం తప్పదేమో సనిపిస్తుంది, దేవుడు సైతం భర్తడికి దాసుడు కావడంలేదు ?"

" నా కింతవరకూ ఉద్యోగం యివ్వని యీ సంఘాన్ని గౌరవించి, ఎందుకు సేవచెయ్యాలో నాకు తెలీడంలేదు."

" నీకు ఫుద్యోగం లేకుండావుంటేనే నువ్వు సుఖపడ తావు. ఐనా నీ పిచ్చికాకపోతే, నీకు ఉద్యోగం ఎవరో యిచ్చేదేమిటి ? నువ్వేదో గొప్పకార్యం చెయ్యడానికి పుట్టావని వెనకచెప్పావు. అది నేను నమ్ముతాను, అది చెయ్యి. స్వతంత్రించి, నచ్చినపని చెయ్యడమే మంచిది, నేను దాస్యం సహించలేను."

" దాస్యంలేకుండా, ప్రేమని సాధించటం ఎట్లా ?" ఈ ప్రశ్న ఎందుకడిగానో నాకు తెలీదు.

" ఔను, మనుష్యులతో చేసే ప్రేమలో దాస్యంవుంది. సంసారంలో బంధనాలు ; ప్రేమలో బంధనాలు ; అసలు పుట్టడమే సృష్టికి దాస్యం. వీటికి దూరంగా వుంటే మంచిది.

కుముదం, హృదయానికి దగ్గరగావుండే విషయాలని గురించి ముచ్చటిస్తుంటే వినడం అదే మొదటిసారి. నేను అనుకున్నంతటి అమాయకురాలు కాదని స్పష్టమైంది.

"ప్రపంచంతో నిమిత్తం లేకపోతే, అసలు గొప్ప కార్యం సాధించటం దేనికి."

"సాధించటంతో మనుషులకు దాస్యం చెయ్యడంలేదు కాబట్టి, ప్రపంచాన్ని మనం ఏదేనాకోరి, ఆశిస్తే దాన్ని యివ్వదు. మనం దేన్నీ ఆశించకుండా, దూరంగావుండి, చెయ్యగలిగినపని చేస్తుంటే, ప్రపంచం మన పాదాల ముందు వాల్తుంది. నువ్వు దేన్నిస్తే, దాన్నే పుచ్చుకుంటావు."

కుముదం, స్వతంత్రాన్ని అంత కాంక్షిస్తుందని నే నెప్పుడూ అనుకోలేదు. భర్త, పిల్లలు, సంసారం, ఉద్యోగం—తుదకి ప్రేమ—యివన్నికూడా దాస్యమే నంటుంది. స్వతంత్రంలేని బ్రదుకు వృధాట. ఒక విలువని అంతగా కోరినప్పుడు, దాన్ని వారు పొందలేకపోతే, నాహృదయం బాధతో క్రుంగిపోతుంది. నాకుద్యోగం వొద్దు ; ప్రేమవొద్దు ; స్వరాజ్యంవొద్దు. కాని, కుముదం వున్న దేశానికి స్వరాజ్యం లేదంటే నాకెంతో చిన్నతనంగా వుంది. జనసామాన్యానికి స్వేచ్ఛనిస్తే దుర్వినియోగం చేస్తారు. దానివిలువ తెలియనివాళ్ళకి అదివ్వడం మహాపాపం. కాని, దేన్నీ ప్రయోగించుకోకుండా, కేవలం విలువల ఆరాధనతో తృప్తిపడే కుముదంలాంటి వ్యక్తులకి స్వేచ్ఛలేకపోవడం, ప్రపంచానికి అనర్థం.

"నేను నువ్వైతే ఏంచేద్దునో తెలుసా? నదీతీరాన్ని చిన్న తాటియాకు పాక కట్టుకుంటాను. అందులో కూర్చుని, ఊరికే చదువు నేర్పుతానని చాటింపు వేయిస్తాను. మొదట ఏ పదిమంది పొలంకాపులో వొస్తారు. సాయంత్రం, వాళ్ళకి బోధించడం మొదలెడతాను. ఇరుగుపొరుగునుంచి, అనేకమంది కర్షకులు, కూలివాండ్లూ చదువుకోసం వొస్తారు. ఉత్త చేతుల్తో రాకుండా, వొకరు వుప్పు, చింతపండు, వొకరు పాలు-అల్లా నాక్కావల్సిన వాటిని వాళ్ళే సిద్ధంచేస్తారు. వారు నా శిష్యబృందం. వాళ్ళకష్టసుఖాలు పంచుకుంటా ; వారి తగాదాలకి తీర్పు చెపుతా-అంతే ; నాజీవితం వృధాఅనుకోను."

సూర్యుడు అస్తమించిన చిహ్నాలు పడమటి లోయలో సేదతీర్చుకుంటున్నాయి. ఓపికలేక కదలలేకపోయిన మేఘద్వయం, దక్షిణగాలి పిలుపికి కదలిపోతున్నాయి. ఇది నారాజ్యం అన్నట్లు వొంటినక్షత్రం కన్నుమీటింది. ప్రకృతిలో నిశిధకీటకాలు తన్మయ నాదసాగించాయి. మాసంభాషణ విని విని విసుగెత్తిన పుష్పాలు చీకటి ప్రశాంతంలో ముడుచుకున్నాయి. తూర్పుఆకాశం, జడ విప్పుకుంది. కుముదంతలలో తెల్లవెంద్రుక మెరిసింది.

"తెల్ల వెంద్రుక." అన్నా, వున్నచోట నేలు మెదుపుతూ.

"ఎన్నాళ్ళని యవ్వనానికి శరీరం దాస్యంచేస్తుంది? నాసిదోవ అది చూచుకుంటుంది."

నాకళ్లు చెప్పలేని విచారంతో తడిసినై. నేను అద్దె మాట అడగడం మరిచిపోయ్యాను. డబ్బుతో, ఆతన్మయతతో బరువెక్కిన వాతావరణాన్ని పాడిచెయ్యడం నాకిష్టంలేకపోయింది.

వెడతాననిలేచా ; మంచిదంది: పోనీ, యీరాత్రి యిక్కడుండి వెళ్ళకూడదా అంటుందనుకున్నా. కుముదానికి, మర్యాదంటే ఏమిటో తెలీదు.

మరి నాలుగు సంవత్సరాలు గడిచినై ; యుద్ధం సాగుతోంది. నాకు మాత్రం ఉద్యోగం చిక్కలేదు. నేను దాన్నిగురించి విచారించే రోజులు వెళ్ళిపోయాయి.

రోజులు గడిచిపోతున్నాయి. నాతిండికి ఎట్లాంటి లోపమూ రాలేదు. వస్తున్న రోజు వొకటికూడా లేదు. దుబారా ఖర్చుకి, నాకే అలవాట్లులేవు. సిగరెట్లుకాల్చను; సినిమాల కెళ్ళను; పుస్తకాలు కొనుక్కోను. ఇవంటే యిష్టంలేకకాదు. ఇవి నా అందుబాటులో లేవు. మా మామయ్య చనిపోయి ఆరునెలలైంది. మా అత్తతప్ప నాకు 'నా' అన్నవాళ్లు ఎవ్వరూ లేరు. ఇది కొంత మేలే. నామీద అధికారం చలాయించేటందుకు, వొక్కరూలేరు. నాకీ సంఘం తిండిపెట్టనక్కరలేదు. నాబ్రదుకు నన్ను

బ్రతకనిస్తే చాలు. మా అత్తయ్య వున్నయింటికి అద్దియిచ్చుకోలేకపోతోంది. తుదకి నిశ్చయించుకుంది, సొంతయింట్లో కెళ్ళి కాపరం పెట్టడానికి. ఖాళీచేయించే ఏర్పాట్లకి నన్ను పంపింది.

ఆ నాడు ఆదివారం. రాత్రి ఎనిమిదిదాటింది. సన్నచంద్రుడు పల్చటి మేఘంవెనక దాక్కున్నాడు. కుముదం గారి యింట్లో దొడ్లో అంతా నిశ్శబ్దం. వీధులోకొచ్చాను. తలుపు తాళం వేసిఉంది. ఎక్కడికెళ్ళారో నాకు బోధపడలేదు. కాసేపు అరుగుమీద కూర్చున్నా. తెలిసిన వాళ్ళని కనుక్కుందామని వీధులోకి నడిచాను. అప్రయత్నంగా బజార్లోకి వెళ్ళాను. కిల్లీ దుకాణం ముందు బల్లమీద కుముదం పెద్దకూతురు పాపాయి నెత్తుకొని కూర్చుంది. నన్ను కేకేసింది.

"మా ఆఖరు చెల్లాయిని చూశారా? నాలుగోది—దీన్ని స్వరాజ్యం అని పిలుస్తుంది మాఅమ్మ....చూడండి, వూ ఏడుస్తుంది....ఊరుకో నా చిట్టితల్లీ."

"ఇట్లా యిక్కడెందుకున్నావ్, మీ అమ్మ ఎక్కడ?"

"మా అమ్మ ఆస్పత్రిలో వుంది. ఇది ఏడుస్తుంటే ఆడించడానికి బైటికి తీసుకొచ్చాను. మా నాన్న హొటలికెళ్ళాడు."

స్వరాజ్యాన్ని బుజాన్ని వేసుగుని హాస్పిటల్‌కి వెళ్ళాం. కుముదం మంచంపై పడుకుంది. పైన తెల్లటిగుడ్డ కప్పివుంది. చిన్నబల్ల మంచం దగ్గరగా లాగి కూర్చున్నాను.

"ఏంజబ్బు ?"

"న్యూమోనియా."

న్యూమోనియా అంత ప్రమాదమైన వ్యాధని నా కంతవరకూ తెలియదు. మాట్లాడేటందుకు ఏమీ కనుపించక, దిగులుగా కూర్చున్నాను. కుముదం నీరసంగా నవ్వడానికి యత్నించింది. మొహం మెలికలు తిరిగింది— పెదవులు పవిత్రంగా వొణికాయి.

"నన్ను గురించి కథవ్రాయవూ ?" అంది. నేనేం చెప్పను ?

"ఈ జబ్బు విషయం నాకు తెలీనేతెలీదు. పోనీ వొ వుత్తరం ముక్క వ్రాయించకూడదా ? డాక్టర్లు ఏమంటున్నారు ?"

"జబ్బు చెయ్యడం సాధారణమైంది. పదిమందితోనూ చెప్పుకునేందుకు అందులో ఏం విశేషముంది. ఫరవాలేదంటున్నారు డాక్టర్లు—కాని వాళ్ళకేం తెలుసు :" అని కళ్ళు మూసింది.

నా కక్కడినుంచి వెళ్ళిపోవా లనిపించింది. ఏదో చెప్పాలని వుంది, కాని నోరాడదు. నా శరీరం వొణికిపోతోంది. అనుకోకుండా, నా చెయ్యి ఆమెచేతిపైని ఆనించబొయ్యాను. అది వేలికి వుంగరంవున్న చెయ్యి. వెంటనే చేతిని లాగేసుకుని తెల్లదుప్పటిలో దాచేసుకుంది.

"నువ్వెందుకు పెండ్లి చేసుకోలేదో నాకు తెలుసు— నాకోసం"

అంటూ, మళ్ళా కళ్ళుమూసింది. నాగుండె స్థూలత్వాన్ని పోగొట్టుకుని ద్రవంగా విడిపోయి, దోవతెలియక తిరుగాడుతున్న రక్తనాళాలగుండా, వుజ్వలవేగంతో ప్రవహిస్తూంది. కన్నీటిని నావేళ్ళతో తొలిగించుకున్నాను. ఆమె పవిత్రశరీరంపైన నాకన్నీరు పడి మలినం చెయ్యడం పాపం అనిపించింది. మొహాన్ని పక్కకు తిప్పేసుకున్నాను. కిటికీ అద్దంలోనుంచి నిశీధి నల్లత్రాచులా లోకాన్ని అల్లుకుంటోంది.

"నీస్థితిచూస్తే నా కెంతో బాధగావుంది." అన్నా కన్నీరు దిగమింగుకుని.

"నాకు నిర్విచారం. ఈ ప్రపంచం నా దైతేగా విచారానికి. నువ్వుమాత్రం...." కళ్ళుమూసి మరి విప్పలేదు. ఈ లోకంలో మూసుకుని మరోలోకంలో తెరుచుకున్న నేత్రాలు కుముదానివి.

* * *

ఆత్మని దిగవిడిచి వొచ్చినవ్యక్తి మళ్ళా దానిలోకే చేరుకుంది. చెట్లు. నదులు. మేఘాలు. చీకటి వెలుగుల మొదలైనవాటితో గిరగిరా తిరిగిపోతున్న విశ్వచక్రంలో కలిసిపోయింది.

నిశీధిలోకి నడిచివెళ్ళాను. మహత్తర అనుభవం సంభవించినప్పుడు, తార్కికజ్ఞానం, విమర్శబుద్ధి పనిచెయ్యవు, ఇంద్రియాలు శరీరాన్ని వూపీ, క్రొత్తజన్మ

నిస్తాయి. భావోద్రేకంలో నిమగ్నుడై, చైతన్యప్రవాహంలో కొట్టుకుపోతున్న వ్యక్తి. వొక్కసారి, సృష్టి రహస్యాన్ని, మెరుపులా ఛేదించి మరోఅవతారం దాలుస్తాడు. చచ్చి బ్రతికడంలాంటిది ఆ అనుభవం.

కుముదం నా వివాహాన్నిగురించి చెప్పిన కడసారి మాటలు, నాలో అధోలోకాన్ని త్రవ్వి దాని దాపరికాన్ని నాకళ్ళముందు ప్రదర్శించినట్లయింది. ఆమెకోసం నే పెండ్లి చేసుకోలేదట. మానసిక శాస్త్రజ్ఞులు, మానవుడి బుద్ధిలో అధోలోకం వుందంటారు. అక్కడ, అతని రహస్యమైన కోర్కెలు, బైటకిచెప్పుకోలేని తీరని వాంఛలు, అడవిమృగాలలా తిరుగాడతాయట. అవి అన్ని సమయాలలోనూ బైటకి రాకుండా, బుద్ధి కాపలాకాస్తుందట. అవి బైటికి రాలేకపోయినప్పటికీ, ఎప్పుడో, నిద్రలోనో, బలహీనమైన స్వప్నావస్థలోనో గర్జించి, వాటి వునికుని, బాహ్యప్రపంచానికి వెల్లడిచేస్తాయిట. ఇంతకాలం నాబుద్ధి వాటిని కట్టేసింది. ఆనాడు ఆమె చెయ్యిపైన చెయ్యివేసినప్పుడు బుద్ధిని తొలిగించి, వాంఛలు బైటికొచ్చినట్లు కుముదం గ్రహించి, తన చేతిని లోపల దాచుకున్నట్లు, వాటిని వెనక్కి నెట్టి నోరు నొక్కింది. అమెలో ఏమీ విశేషం లేదని సమాధాన పరుచుకున్నా. ప్రాకృతికమైన ఆకర్షణ లోపల దాగివుండి, నా జీవితంపై అంత వొత్తిడి కలిగించినందుకు ఆశ్చర్య పడ్డాను.

తననిగురించి కథ వ్రాయమంది. ఆరుగంటల పరిచయంతో, ఆరువొందలమాట్లతో నా ప్రపంచాన్ని తలక్రిందులుచేసి, నా జీవితపరమావధినే తారుమారుచేసిన కుముదాన్నిగురించి ఏంకథ వ్రాయను ?

ఆమె చనిపోయిన ఆరుమాసాలకి, ఆమెనిగురించి నా అభిప్రాయం మార్చుకున్నాను. ఆమెలో ఏమ్నకోతగ్గ వ్యక్తిత్వం, ఊహ, హృదయం, లేవనుకుని శరీరాన్నే చిత్రించాను. జీవితంపై వొక విచిత్ర వేదాంతదృష్టిని అలవరచుకున్న వ్యక్తి కుముదం. ఆదృష్టి తార్కిక జ్ఞానాన్నుంచిమాత్రం జనించలేదు. ప్రతి అనుభవం నేర్పిన పాఠాలని, ఎముకలకిసైతం పట్టించుకుని శరీరంలోని నాడులపై వాటి యదార్థం ఋజువుపర్చుకుంది. నాలుగు వాక్యాలు ఆమె దృష్టిని వ్యక్తపరుస్తాయి.

'నువ్వు జీవితాన్ని పరిశీలిస్తావు, నేను అనుభవిస్తాను.' 'జీవితానికి తలవొగ్గి ప్రపంచాన్ని అంగీకరిస్తాను.' 'అసలు పుట్టడమే సృష్టికి దాస్యం.' 'మనుషులప్రేమలో దాస్యంవుంది, నే నది సహించలేను.'

వీటిని నేనుకూడా రక్తనాళాలపైన ఋజువు చేసుకోకుండా, ఆమెకథ వ్రాయగలననుకోడం ఆత్మవంచన.

అనుకున్నంత యదార్థంగా ఈ కథ చెప్పలేక పొయ్యానని నాకు తెలుసు. వర్ణించేటందుకు ఏమీవిశేషం లేదు గనక, ఆమెని సరిగ్గా వర్ణించలేకపొయ్యాను, కొన్ని సమయాలలో ఆమె నా ఊహపై కలిగించిన వొత్తిడిని మాత్రం చిత్రించాను. ఆ వర్ణనలన్నీ నా ఉద్రేకాన్ని వర్ణించుగోటం అనుకుంటే, నేను ఖండించను.

కుముదం నిజంగా ప్రయోగించినమాటలు వ్రాశానని కూడా అనను. నిజానికి ఆ సంభాషణలన్నీ ఆమె చని పోయింతర్వాతే జ్ఞప్తికి తెచ్చుకున్నవి. అంచేత అచ్చంగా అల్లా మాట్లాడింది అనను.

కుముదం త్వరితంగా ముగిసిపోతున్న శతాబ్దానికి చెందినస్త్రీ. ఈ యుద్ధానంతరం అట్లాంటిస్త్రీలు, మన సంఘంలో యింక వుంటారనుకోను. నేటి స్త్రీలోకంలో గొప్ప మార్పొచ్చింది. వారిభాష వేరు; వారిఊహలువేరు; వారి ఆశయాలు వేరు. నేటికాలంస్త్రీలలో నన్ను ఎవరూ భర్తగా అంగీకరిస్తారనుకోను. 'అతనిలో విశేషం ఏముంది ?' అంటారు. నేను కుముదంలో ప్రత్యేకత చూడలేకపొయ్యాను; అట్లాగే నేటిస్త్రీలుకూడా, ప్రత్యేకత చూడలేరు కాబట్టి నా మిగతా జీవితం బ్రహ్మచారిగా గడపాల్సిందే.

ఐతే వెనకటిశతాబ్దం స్త్రీలకీ నేటివారికీ ఏమిటిబేధం ? తన శతాబ్దపు స్త్రీలను గురించి కుముదం చెప్పుకుంది. వారు "జీవితాన్ని అంగీకరిస్తారు." నేటికాలంవాళ్ళు "జీవితాన్ని తృణీకరిస్తారనొచ్చు." ఈ రెండుదృష్టులలో ఏది మంచిదో యేది సాధ్యమో నిర్ణయించేటందుకు తగిన వుత్సాహమూ లేదు, జ్ఞానమూ లేదు నాకు. అది నిర్ణయించి విలవ కట్టగానే నన్నుగురించి కథ వ్రాయవూ అని నేనే అడగాల్సి వొస్తుంది.

# టీపార్టీ

—శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి.

స్థలం. ఒక మేడలో ఉత్తరంవైపు కిందిగది వసారా. అక్కడ యిరవై సంవత్సరాల యువకు డొకడు కంగారు పడుతూ వుంటాడు. అతనిపేరు శంకరం. గళ్ళలుంగీ, తెల్లని లాల్చీ, దానిమీద ట్వీడుపొట్టికోటూ, నెత్తిమీద గుజరాతీటోపీ—ఇది అతని వేషం. దీనికి సాయం, ఫ్రెంచికట్టింగుమీసాలూ, చేతిలో సగం కాలిన బీడీ ముక్కానూ.

సరిగా, యీవసారా పైన కూడా యిలాంటిదే గది వసారా. అక్కడ, శ్రీదేవమ్మ అనే వొక ప్రౌఢా, సుందరమ్మ అనే వొక యువతీ వుంటారు. సుందరి పదహారేళ్ళది. వారిద్దరూ మాట్లాడుకుంటూ వుంటారు. కిందికి, ఆమాటలు మాత్రమే వినిపిస్తూ వుంటాయి

హాల్లోనుంచి గదిలోకీ, గదిలోనుంచి వసారాలో వున్న శంకరం దగ్గిరకీ శాస్త్రి అనే మిత్రుడు వస్తాడు.

సమయం, మధ్యాహ్నం మూడుగంటలవేళ.

శాస్త్రి—(శంకరాన్ని చూసి తెల్లపోయి) ఏమిటోయ్ వాలకం?

శంకరం—(విచారంగా) కొంపమునిగింది.

శాస్త్రి—అంటే?

శంకరం—విను. (పైకిచూపిస్తాడు.)

తెరలో—

ప్రౌఢ—తెలిసిందా? మీ అమ్మ యీ నాలుగు ముక్కలూ చెప్పి వూరుకుంటారు. ఇక నామాటలు విను.

శాస్త్రి—ఏమిట్రాయిదీ?

శంకరం—(విచారంగానూ, విసుగ్గానూ వినరా అన్నట్టు చెయ్యీ తలా వూపుతాడు.)

తెరలో—

ప్రౌఢ—మహాజనులారా! ఇవాళ మిక్కిలి సుదినం. ఏమంటారా? మన మిప్పు డొక చారిత్రికఘట్టంలో వున్నాం. అవెనకటి ఆంధ్రజాతి చాలా పౌరుషం కలది. అప్పటి మన ఆంధ్రులు, అనేకయుద్ధాలు చేశారు, గెలిచారు. మహాసామ్రాజ్యాలు నిర్మించారు, దర్జాగా ఏలారు. ఇప్పటి మనం వారి సంతతివారమే. మనకీ కావలసినంత పౌరుషం వుంది, లోటులేదు. ఈస్థితిలో యీ రెండో ప్రపంచసంగ్రామం వచ్చింది. ఇది మన జాతికి గొప్ప అవకాశం. ఏమంటే? ఇప్పుడు మన వాళ్లలో అనేకమందికి పురుషకారానికి వినియోగం యేర్పడి ప్రఖ్యాతి రావలసివుంది. అంచేతనే నేనీ మహాయుద్ధానికి స్వాగతం నివేదించుకుంటున్నాను.

ఇక ప్రకృతం. మన కందరికీ యీటీపార్టీ యేర్పాటు చేసిన విశాలాక్షమ్మగారికి సుందరమ్మ అనే వొక్క కూతురు మాత్రమే వుండడమూ, ఆసుందరమ్మ స్కూలు ఫైనలు తరగతి చదువుతూ వుండడమూ, రెండేళ్ళ కితమే పెళ్ళి అయినా ఆమె సంవత్సరం కిందటే రజస్వల అయివుండడమూ మీ కెరుగుదురు.

శాస్త్రి—ఏమిట్రా యీగొడవా?

శంకరం—నా కొంప—

శాస్త్రి—(పళ్ళుకొరుకుతూ విసుగ్గా) సంగతేమిటో చెప్పరా నాయనా!

శంకరం—నువ్వే ముంచావు తెలుసా? నీకే తెలుస్తుంది విను.

తెరలో—

ప్రౌఢ—సుందరమ్మ తండ్రి తహస్సీలుదారీ వుద్యోగంచేసి, పెన్షను పుచ్చుకుని, ఏణ్ణర్థం కితమే కాలంచేసి వుండడమూ మీ కెరుగుదురు. సుందరమ్మ మామగారు, పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టరు ఉద్యోగం చేసి, మొన్న మొన్ననే పెన్షను పుచ్చుకున్నారు. ఆయన ఏకపుత్రుడు శంకరమే సుందరమ్మ భర్త. ఈసంగతి కూడా మీలో కొందరెరుగుదురు.

శాస్త్రి—ఈ అష్టకష్టాలన్నీ వెళ్లగించడం యెందుకురా?

శంకరం—(నెత్తి బాదుకుంటాడు.)

తెరలో—

ప్రౌఢ—శంకరం పోలీసు కొడుకు కనక, చాలా పౌరుషవంతుడైనాడు. అందుకు నేను చాలా సంబరపడుతున్నాను. మా సుందరమ్మ చాలా గర్వపడుతోంది. మీరంతా బాగా ఆనందించాలి, తప్పదు.

శాస్త్రి—ఇప్పుడయినా చెప్పరా?

శంకరం—నా ప్రాణాలు తెరిగిపోతున్నా యేం చెప్పనురా, నువ్వే అర్థం చేసుకోరా.

తెరలో—

ప్రౌఢ—ఆ శంకరం, ఇప్పుడు, తన పౌరుషం రేకెత్తగా, ఆటు నాలుగేళ్ళనుంచి చేస్తున్న యింటరు జ్యూనియరు తరగతీ విడిచి, యిటు కార్యం చేసుకుని తన యింటికి తీసుకువెళ్ళవలసిన మా సుందరమ్మని విడిచి, యుద్ధానికి వెడుతున్నాడు. గుమాస్తాగా అనుకుంటారేమో, కాదు కాదు, సిపాయిగా వెడుతున్నాడు. ఈ దివ్యతరుణంలో అతన్ని సత్కరించి పంపడానికి విశాలాక్షమ్మగారు ఈటీపార్టీ యేర్పాటు చేశారు.

శంకరం—(శాస్త్రికేసి విచారంగా చూస్తూ నెత్తీ నోరూ బాదుకుంటాడు.)

శాస్త్రి—ఉండరా పెద్దన్నయ్యా! ఈ పుట్టుమునక యేమిట్రా? భయపడి త్వరగా కార్యం చేసేసి పంపిస్తారనుకుంటే, యుద్ధానికే వెళ్ళమని టీపార్టీ యివ్వడమా?

శంకరం—ముసేరా, నాపాలిటి మందపిల్లి శనేశ్వరుడా!

తెరలో—

ప్రౌఢ—నేనీకసిన్ని మాటలూ చెప్పి పూరుకుంటాను. అంటే—

యువతి—సభవారికి నన్ను పరిచయం చెయ్యరూ మరీ?

ప్రౌఢ—ఇక అదే తరవాయి. అలా తొందరపడిపోతావేం? నీ వుబలాటమే నీదా? నిదానించనక్కరలేదు? నీ మొగుడు మహావీరుడయిపోతున్నందుకు నువ్వు వీరపత్ని వనిపించుకుంటావు, నాకు తెలుసు. వీరపత్నియేమిటి చచ్చు పెద్దమ్మబిరుదు? వీరయువతీశిరోమణి అనే అనిపించుకుంటావు, తప్పదు; కాని వోపికపట్టాలి. ఇక చూసుకో. రాజమహేంద్రవర కౌరశిఖామణీమణులారా! అల్లుడు యుద్ధానికి వెడుతున్నందుకు మా విశాలాక్షమ్మగారు చాలా బెంగపెట్టుకుంటారనుకున్నాను నేను. భర్త, తనని కాక, విజయలక్ష్మిని చేపట్టడానికి వెడుతున్నందుకు మా సుందరమ్మ కూడా చాలా గోలపెట్టేస్తుందనుకున్నాను; కాని నా వూహ తల్లకిందులయిపోయింది. ఎకాయెకీని బందరుపట్నంనుంచే యుద్ధానికి వెళ్ళిపోకుండా అల్లుణ్ణిక్కడికి రప్పించి, అతని గౌరవార్థం యీ టీపార్టీ యేర్పాటుచేసి, విశాలాక్షమ్మగారు వీర అత్తగా రనిపించుకున్నారు.

శంకరం—(తెల్లపోయి, శాస్త్రికేసి చూస్తూ) నేను బతికివున్నానా, చచ్చిపోయానా?

శాస్త్రి—నాకు తెలిసినంతవరకూ డెయ్యానివై నువ్వు నన్ను పీక్కుతింటున్నావు.

శంకరం పైగా యిదా?

శాస్త్రి—లేకపోతే? నీ తండ్రి నిగర్భాధానానికి కూడా నీకు వెయ్యినూటపదహార్లు కట్నమూ, నీ తల్లికీ నీ అక్కాచెల్లెళ్ళకూ నీకూ లాంఛనాలూ కావాలనడమా? నీ అత్తగారు పూతికపుల్ల అయినా యివ్వననడమా? దానిమీద సంవత్సరం చూసిచూసి, విరహవ్యథాఖిన్నుడవై "యిక భరించలేను, నా సుందరినీ నన్నూ యేకం చెయ్యరా" అంటూ కాళ్ళావేళ్ళా పడి నువ్వు నన్ను ప్రార్థించడమా? పైపెచ్చు నింద నాకా? బాగుందిరోయ్ వాలకం?

శంకరం—మరి ఆవుత్తరం?

శాస్త్రి—అవును, వుత్తరానికేం? మనమే రాశాం.

శంకరం—రాసింది నువ్వూ. అబద్ధం ఆడకు.

శాస్త్రి—రాయమని కలమూ కాగితమూ యిచ్చి

కాళ్ళు పట్టుకున్నది నువ్వా, మరిచిపోకు.

ంకరం—రామా, రామా! (అంటూ నెత్తిబాదు కుంటాడు.)

ాస్త్రి—ఆ వుత్తరం తిరగా నీకేం తెలుసూ? కీ: అలాగ వుత్తరం రాయమని నువ్వు తప్ప మరె మ్మ దేవుళ్ళొడతాడూ? నేను తప్ప మరే ముస్సద్దీ పకడుగా వుత్తరం రాయగలడూ? కాకపోయినా, ేగేళ్ళు స్కూలుఫైనలు తప్పినవాడవు, నీకేం స్తుందీ ఆ వుత్తరం బరువు?

ంకరం—అంత బరువు కలది కనకనే నాకొంప చిందిరా బాబూ అది.

ాస్త్రి—అది నీకర్మ యెవరేం చేస్తారురా న్నయ్యా?

ంకరం—(పెద్దనిట్టూర్పు విడుస్తూ) శివశివా!

ాస్త్రి—పోనీ, వొక్కటాలోచించు. ఒక యెత్తు ం. అది నెగ్గేవుంటే? హా!

తెరలో—

ౌఢ—ఇదిగో, యిక మాసుందరమ్మ మాట్లాడు ు. సుందరమ్మకి ప్రయివేటు ట్యూటరునైనందుకు చాలా గర్విస్తున్నాను. కనీసం, ఇవాళ యింగ్లీషు వుతున్న యువతు లయినా యిలాగ పట్టుదలా, ్యమూ కనపరిస్తే మన యువకు లెంతో బాగుపడు . విశాలాక్షమ్మగారు మనకి కమ్మని ఫలాహారాలు ంచారు, మాసుందరమ్మ, యిక, బంగారపు అక్ష తో చరిత్రలో అచ్చుపడే మాటలు చెబుతుంది, గా ఆలకించండి.

ాస్త్రి—నీ పెళ్ళాం కూడా వుపన్యాసం పెల ప మె?

ంకరం—(సగర్వంగా) ఏం, స్కూలుఫైనలు ప్యతోంది చేతకాని దనుకున్నావా? (దుఃఖంగా) మొగుడంటే భయభక్తు లుండేటట్టు లేదురా ా! (సరోషంగా) ఈ ట్యూటరుభడవ దాన్ని ారిలో పెట్టేస్తోందిరా నాయనా!

తెరలో—

ప్రౌఢ—నువ్వు మాట్లాడతావని నేను చెప్పగానే నువ్వు దర్జాగా లేవాలి. సిపాయివేషం వేసుకుని రైట్, లెఫ్ట్, రైట్, లెఫ్ట్, రైట్, లెఫ్ట్—నీ మొగుడు నడుస్తాడు చూడూ, అలాగ నడిచివెళ్ళి కమాండరులాగ టంచెన్‌గా నుంచుని మాట్లాడాలి. దర్జా—గాంభీర్యం—ఆనందం—గర్వం—బింకం—శౌర్యం—వుద్రేకం—పారవశ్యం—యివన్నీ కలిపి నీచూపుల్లోనూ, నీమాటల్లోనూ యేకధారగా ప్రవహించాలి.

శాస్త్రి—చచ్చాం, యిదెక్కడి రిహార్సల్సురా భగవాన్!

శంకరం—ఆ వుత్తరం చదివేస్తుందేమోరా భగవంతా!

శాస్త్రి—(రోషంగా) చదివితే వూరుకుంటానేం? (నిదానించి) పోనీ, నువ్వూ నీపెళ్ళామూ మీయిష్టం వచ్చినట్టు దేవుళ్ళాడండి నాకేం?

శంకరం—(రోషంగా) ఏమిటీ? నన్ను ముందుకి తోసి నువ్విప్పు డిలా తప్పుకుంటావా? (నిదానించి) పోనీ, వుత్తరం నువ్వు రాశావు. దస్తూరే నీదీ. చేవ్రాలు నీదీ, నాకేం?

శాస్త్రి—ఒప్పుకున్నాను. ఒప్పేసుకున్నారా. ఆ వుత్తరం విన్నవాడు తలకాయలో మెదడున్న వాడయితే నా ప్రతిభా, నా చాతుర్యమూ గుర్తించి నాకు సాష్టాంగపడతాడు. నిన్ను మాత్రం చచ్చుపెద్దమ్మకింద కట్టేస్తాడు, తెలుసా?

శంకరం—(నెత్తి బాదుకుంటాడు.)

తెరలో—

యువతి—నరనారీమణులారా!

ప్రౌఢ—నరులూ నారులూ కాకపోతే వచ్చినవాళ్ళంతా వానరులా యేమిటి? పైగా, చప్పగా కూడా వుంది. ఆ మొదటి ముక్క వొక్కటీ యింగ్లీషులో అను.

యువతి—లేడీసండుజెంటిల్మన్!

ప్రౌఢ—భాష మారినంతమాత్రాన లాభంలేదు. బింకంగా కూడా వుండాలి.

యువతి—లేడీస్! అండ్, జెంటిల్‌మన్!

ప్రౌఢ—ఆ, అదీ పద్ధతి. అయితే, సభలో ఆసే

ఇప్పుడు మాత్రం యెదురొమ్ము విరుచుకుని మరీ అనాలి, తెలిసిందా? మరి కానియ్యి.

యువతి—లేడీస్! అండ్, జెంటిల్‌మన్! మా అమ్మ ఆహ్వానం అంగీకరించి దయతో మీరందరూ యిక్కడికి వచ్చినందుకు చాలా సంతోషం. మీకు నా హృదయపూర్వకంగా స్వాగతం నివేదించుకుంటున్నాను. ఇవాళ, నేను ఆనందపరవశ నయిపోయి వున్నాను. అంచేత, నాకు మాటలు సరిగా రాకపోవచ్చు. అందుకు మీ రందరూ నన్ను మన్నించాలి.

ప్రౌఢ—ఒక విషయం యెత్తుకో.

యువతి—మహాజనులారా! ఇవాళ బ్రాహ్మణ యువకులు కూడా యుద్ధానికనేకమంది వెడుతున్నారు. అయితే, వారందరూ గుమాస్తాలుగా వెడుతున్నారు. నాభర్త అలా కాక, సిపాయిగా వెడుతున్నారు. అందుకు నేను చాలా గర్విస్తున్నాను.

శంకరం—ఆమాట వింటే యుద్ధానికి వెడితేనే బాగుండు ననిపిస్తోంది. (ఈమాట, సోల్జరులాగ యెదురొమ్ము విరుచుకుంటూ బింకంగా అంటాడు.)

శాస్త్రి—అలాగా? అయితే, తొందరపడకు, నీ పెళ్ళాం మెడపట్టి గెంటడానికే వూనుకుంది లే.

శంకరం—(పెద్ద నిట్టూర్పు విడుస్తూ) రామా, రామా! (అని కుంగిపోతాడు.)

తెరలో—

ప్రౌఢ—ఉత్తరం సంగతి యెత్తుకో యిక.

శాస్త్రి—ఆ! అన్నంతపనీ అయింది.

శంకరం—శివా! శివా! ఇదిగో, ఏడుకొండలవాడా, వెంకటేశ్వరుడా, తండ్రీ! నాపెళ్ళాం ఆవుత్తరం చదవకుండా చేస్తివా—ఇదిగో, నాతల నీలా లిచ్చుకుంటాను మహాప్రభూ!

శాస్త్రి—వడ్డీకాసులవాడా! నీకు క్రాపింగు పనికి వస్తుందా మహాప్రభూ! ఆపిల్ల అది చదివేటట్టు చేస్తే నేను వందకొబ్బరికాయలు కొట్టేస్తాను.

యువతి—మాఅమ్మకీ నామామగారికీ యేదో వ్యవహారం విషయమై మాటపట్టింపులు జరుగుతున్నాయి. ఆకీచులాట లిష్టంలేక నాభర్త యుద్ధానికి వెళ్ళిపోతున్నారు. మేము సరదృష్టవంతులం అయితే యెవరికీ తెలియకుండానే వారు రెయిలెక్కేసివుందురు; కాని ఆయన కొక మిత్రుడున్నాడు. ఆమిత్రుడు మా అమ్మ కొక వుత్తరం రాశారు. దాంతో మాకా సంగతి తెలిసింది. అది చాలా గొప్ప వుత్తరం. నాదృష్టిలో అది చారిత్రాత్మకమైన ఉత్తరం. అంచేత, అందులో వున్న సంగతులు నిస్సారాలైన నామాటలతో చెప్పక, ఆయన రాసింది రాసినట్టుగానే ముఖ్యభాగాలు కొన్ని చదువుతాను.

శంకరం—(బిక్కముఖంతో) చదివేస్తోందిరా బాబూ!

శాస్త్రి—ఆవుత్తరం నాప్రజ్ఞాధ్వజం, చదివెయ్యవలసిందేరా నారాజా!

తెరలో—

యువతి—"విశాలాక్షమ్మగారూ! మీఅల్లుడెంత ప్రతిభావంతుడో అంతపరాక్రమవంతుడు. అతను పుస్తకం పుచ్చుకున్నాడంటే బృహస్పతిని మించుతాడని యిదివరకే పేరుతెచ్చుకున్నాడు. ఇప్పుడు, కత్తి పట్టాడంటే—అంటే తుపాకీలెండి—పరశురాములవారినీ, ద్రోణాచార్యులవారినీ, కృపాచార్యులవారినీ, అశ్వత్థామనీ, ఖడ్గతిక్కన్ననీ, బ్రహ్మరుద్రయ్యనీ మించుతాడని అనిపించుకోడానికి యుద్ధానికి వెళ్ళిపోతున్నాడు. అతను నాకు ప్రాణస్నేహితుడైనందుకు నేను చాలా గర్వపడుతున్నాను."

మహాజనులారా, ఆవుత్తరంలో యిదొక భాగం. నాభర్త స్కూలుఫైనలు వగైరా నాలుగేళ్లు తప్పారంటే అది విద్యాశాఖ డైరక్టరు గొప్పలోపం, ఇప్పుడు, ఇంటరు జూనియరుక్లాసు నాలుగోసంవత్సరం చదువుతున్నారంటే అది ఆంధ్రయూనివర్సిటీకి మాయనిమచ్చ. వారు, పెళ్ళిలో కనపరిచిన కొన్ని లీలావిలాసాలనుపట్టి నేనిది ఢంకామీద దెబ్బకొట్టి చెప్పగలను. వారి ప్రతిభ ఈక్షుద్రసంస్థలకు అతీతమైనది. కాగా, నాభర్తని గురించి, అఖర్వగర్వం, వారి మిత్రునకేకాదు, నాకూ మీకూ కూడా కూలంకషంగానే వుంది. ఇందుకు మీ రామోదించినట్టు స్పష్టంగా వెల్లడిస్తారని ఆశిస్తున్నాను.

ప్రౌఢ—సరిగా, నువ్వీమాట అనేటప్పటికి, మన యేర్పాటు ప్రకారం సభలో చెదిరిచెదిరి కూచున్న మన వాళ్లు "వాహ్వా, వాహ్వావాహ్వా" అంటూ సింహనాదాలు చేస్తారు, ఒక పక్కగా కూచున్న శిష్యోపాధ్యాయినులు అది శుకానువాదంచేస్తారు.

శాస్త్రి—సెబాస్! ఇది కూడానా? గుండెలు తీసిన బంటులావుందే ట్యూటరు!

శంకరం—ముందు నాకొంప తీస్తోందిరా బాబూ!

తెరలో—

యువతి—ఇంకో భాగం చదువుతాను. "విశాలాక్షమ్మగారూ! మీఅల్లుడు నాకు ప్రాణస్నేహితుడు. అతని విలవ నాకు తెలిసినట్టు మరెవరికీ తెలవదు. యుద్ధానికి వెడితే స్వల్పకాలంలోనే అతను కమాండరయిపోతాడు, సందేహం లేదు; కాని యుద్ధం పూర్తి అయేదాకా—అంటే—అయిదారేళ్ళమాట—ఈలోపున మన కంటపడడు, ఇందుకు నేను చాలాచాలా విచారిస్తున్నాను"

మహాజనులారా! దీనికేమి చెప్పాలో నాకు తోచడం లేదు. ఎందుచేతనంటే? అలాంటి వీరాధివీరులు నాభర్తగారు, ఇలాంటి పిరికిపందతో యెలా స్నేహంగా వుంటున్నారో నాకు వింతగా వుంది. నిజంగా, నేనిందుకు చాలా సిగ్గుపడిపోతున్నాను. అయిదారు కాదు, పదిపదిహేనేళ్ళు వారు నాకంటబడకపోయినా నాకు విచారంలేదు. నాభర్త గొప్పవారయిపోతే నాకంతే చాలు. ఇక్కడ వుంటే మూడుపూట్లా భోజనం చెయ్యడమూ, రెండుపూట్లా ఫలహారాలుచేసి కాఫీటీలు పుచ్చుకోవడమూ, చివరికి బీడీలు కాలుస్తూ భావకవిత్వంలో కూచోడమూ—ఇంతే కాదూ? గ్రీష్మభానుడు ఒకప్పుడు మేఘమండలంలో తిరస్కృతుడై వుంటాడు, లోటేం? తరవాత తన దుర్నిరీక్ష్యత కనపరచడూ? అలాగే సర్వీసు పూర్తి అయేదాకా, నాభర్త నాకళ్ళబడకపోయినా నేను బెంగపెట్టుకోను. ఆయన సురక్షితంగా యింటికి వస్తారు, నాకు తెలుసు, పొందవలసిన ఉన్నతీ, ఘనతా, కీర్తీ, సంపదా ఆర్జించాకే వారు నాకు దర్శనం యిస్తే అంతకంటే కావలసిందేమివుంది? కనక, మీరందరూ కలిసి, ఆమిత్రుణ్ణి నానాచీవాట్లూ పెడుతూ తీర్మానించి, అది యీసభలోనే ఆయన కందచేస్తారని నమ్ముతున్నాను."

శాస్త్రి—ఆ, ఆ.

శంకరం—సెబాస్! కొట్టవలసిందే నిన్న దెబ్బ.

శాస్త్రి—అలాగేం? అయితే, అసలు దెబ్బ యెవరికో?

శంకరం—(నెత్తికొట్టుకుంటూ) రామా, రామా!

తెరలో—

యువతి—మహాజనులారా! ఆమిత్రుడింతటితో పూరుకుంటే బాగుండిపోవును; కాని యింకా ఎంత అవకతవక రాత రాశాడో చూడండి.

శాస్త్రి—ఆ! అవకతవక రాతా?

శంకరం—శకునిపక్షి రాతకూడానూ, అనవలసింది.

తెరలో—

యువతి—"విశాలాక్షమ్మగారూ! మనలో మనమాట. కీడెంచి మేలెంచమన్నాడు. యుద్ధం జరుగుతున్నంతకాలమూ యూరపులో తిరుగుతాడు కనక, మీఅల్లుడు, మిమ్మల్ని, మీఅమ్మాయినీ, తల్లిదండ్రులనూ, అతన్నే నమ్ముకునివున్న నన్నూ మరిచిపోయి—యేదొరసానినయినా పెళ్ళాడేసి అక్కడే వుండిపోతాడేమో అని నాకు చాలా బెంగగా వుంది సుమండీ!

నరనారీమణులారా! చూశారా యీమిత్రుడెంత సంకుచితహృదయుడో? నిజంగా, నాభర్తగారి యీ కుత్సితమిత్రుణ్ణి నేను తీవ్రంగా నిరసిస్తున్నాను. తీక్ష్ణంగా గర్హిస్తున్నాను. నాభర్తగారు, ముఖ్యంగా నన్ను మరిచిపోతారుట. ఏమిటో యిందులో విశేషం? అసలు తన్నే మరిచిపోతేగాని యెవడూ యుద్ధానికి వెళ్ళడు. కాకపోయినా, నాభర్త యేదొరసానినయినా పెళ్ళాడితే ప్రపంచం మునిగిపోతుందా? బహుభార్యాత్వం మనలో తప్పుకాదుగా? ఇంతకీ: మనవాళ్ళెంత గొప్పవాళ్ళయినా, సర్కారు, కొన్నికొన్ని పెద్ద వుద్యోగాలు మనవాళ్ళకివ్వరు. మరి యిప్పుడు? నాభర్త దొరసాన్ని పెళ్ళాడితే, ఆదొరసాని వైభవాలు తీర్చడానికయినా వారికి పెద్దవుద్యోగం యివ్వాలిగా? ఇది

నాకు ఘనత కాదూ? నాభర్త సర్కిల్ ఇన్స్పెక్టరు కాడూ కనిపించుకోడంకంటే గొప్ప మిలిటరీ ఆఫీసు కనిపించుకోడం నాకు మిక్కిలి ఆనందకరం కాదూ? కాగా, మహామహులు అయిపోయే నాభర్తగారి సుందరి కాళ్ళ కలాగ బందాలు వేసే యీమిత్రుడు గుంటనక్క అంటారా? మనిషి అంటారా మీరు ?

శంకరం—కావలసిందే.

శాస్త్రి—ఆ గుంటనక్క పాదా లాశ్రయించిన వాణ్ణేమంటారో?

తెరలో—

యువతి—మహాజనులారా! ఇంతవరకూ రాసిన రాతలు కూడా మనం సహించవచ్చు: కాని ఆమిత్రుడింతటితో ఆగలేదు.

“కనక, విశాలాక్షమ్మగారూ! పిలవని పేరంటం అయినా మీకిప్పుడొక సలహా చెప్పడానికి నేను సాహసిస్తున్నాను. వారందినాలు రాత్రింబగళ్ళు ఏకటాకీని ఆలోచించి నిగ్గుతేల్చిన సలహా యిది; కనక, మీరిది బాగా పరిశీలించాలి. ఏమిటంటే? కట్నాలూ లాంఛనాలూ యిస్తేగాని కార్యంచేసుకుని మీ అమ్మాయిని తీసుకువెళ్ళడానికి మీ వియ్యంకుడుగా రిష్టపడడంలేదు గదా? పెళ్ళికే కట్నాలూ కానుకలూ అడగడం విడ్డూరం అనుకునేటప్పుడు ఇది మరి విడ్డూరం అని వేరే చెప్పడం యెందుకూ? ఈవిషయం తెలుసుకుని తలుచుకుని మీఅల్లుడు చాలా సిగ్గుపడిపోతున్నాడు. నిజంగా, మామిత్రమండలిలో అతను తల యెత్తుకుని తిరగలేకుండా వున్నాడు. ఈయుద్ధప్రస్థానమే తటస్థించివుండకపోతే అతను ఏ కాశీ అయినా పారిపోయి వుండునంటే నమ్మండి. డబ్బుకోసం ఇలాంటి తుచ్ఛ ఉపాయా లవలంబించడం మీవియ్యంకుడుగారికే చెల్లింది. ఆయన మాట యెలా వున్నా మీఅల్లుడు సత్పురుషుడు కావడం చాలా గొప్ప సంగతి. ఏతావతా! మీకు నేనిప్పుడు రాసే దేమిటంటే? మీరంగీకరిస్తేరా, మీఅల్లుణ్ణి నేను రాజమండ్రీ తీసుకువస్తాను. “యుద్ధానికి వెళ్ళేటప్పుడు అత్తగారి దీవనలు పొందడం చాలా శ్రేయస్కరం అని చెప్పి, మధ్యపెట్టి మీఅల్లుణ్ణి మీయింటికి తీసుకువస్తాను. వెంటనే మీరు గప్‌చిప్‌గా కార్యం చేసెయ్యండి. మీవియ్యంకుడు తరవాత మిమ్మల్నేమీ చెయ్యలేరు. తండ్రీ, కుడిచేతా యెడమచేతా సంపాదించి పోగులు పెట్టిన లక్షలు అనుభవించవలసినవాడు మీఅల్లుడొక్కడేగదా? అక్కడ నయినా మీఆస్తి అంతా మీ అమ్మాయికి భుక్తపడేదే గదా? ఇక లోటేమిటి? దీనివల్ల మీకు చిక్కులన్నీ వదలిపోతాయి. విశేషం యేమిటంటే? దీంతో, మీఅల్లుడు, యుద్ధానికే కాదు, యిక బందరు కూడా వెళ్ళడంమానేసి మీయింట్లోనే వుండిపోతాడు, నాదీ పూచీ.”

శాస్త్రి—ఆహా, కనిపెట్టే నాథుడు లేకపోయాడు; గాని యేమిసాయంట్లు వేశానురా, నా రాజా!

శంకరం—అసలు, ఈసలహా నేను చెప్పి రాయిస్తే నువ్వేదో వొరగబోసినట్లు గప్పాలు కొడతా వేమిట్రా పప్పూ?

శాస్త్రి—కనక, ఆబహుమానాలు కూడా నువ్వే అందుకోరా జజ్జూ.

శంకరం—శివా! శివా! (నెత్తికొట్టుకుంటాడు.)

తెరలో—

యువతి—సభాసదులారా! ఈసలహా యెంత నికృష్టంగా వుందో మీరు గుర్తించాలి. పదహారేళ్ళు వచ్చాయంటే మన మొగపిల్లల కిప్పుడు పెళ్ళ్యంతప్పు మరేమీ అక్కర్లేదు. నేను చదివినంతవరకూ యేదేశ చరిత్రలోనూ యిలాంటి దౌర్భాగ్యం కనపడదు.

ప్రౌఢ—ఆవేశం చాలదు. మాటలు చప్పగా వున్నాయి. ఉద్రేకం తెచ్చుకో.

యువతి—మహాజనులారా! ఈయువకుడు నాభర్తగారి ప్రాణస్నేహితుణ్ణని చెప్పుకుంటున్నాడు; కాని ఆయన కాళ్ళకింద గోతులు తవ్వుతున్నాడు, చిత్తగించండి. అతను, దగా చెయ్యమని మాఅమ్మని ప్రోత్సాహపరుస్తున్నాడు. సిగ్గూ బిడియమూ విడిచి మా మామగారు లాగుదామనుకుంటున్న డబ్బు పడగొడుతున్నాడు. నన్ను మురికిగుంటలో పడగొయ్యాలని చూస్తున్నాడు.

శంకరం—(శాస్త్రి కేసి కొరకొర చూస్తూ) నిజం నిజం.

తెరలో—

యువతి—నాభర్తని పచ్చిపెద్దమ్మని చేసి ఆడిస్తున్నాడు.

శాస్త్రి—నిజం నిజం. (పెదవులు బిగించుకుని వెటకారంగా తల ఆడిస్తాడు.)

తెరలో—

ప్రేక్ష—ఇంకా వుద్రేకం కనపరచాలి.

యువతి—సభాసదులారా! ఇది దారుణమైన ద్రోహం. నీచమైన కుట్ర. నేరంచేయించడానికి కుమ్మక్కు. మనవాళ్ళలో వున్న నైచ్యం అంతా ఈ మిత్రునిలో మూర్తీభవించింది. మనవాళ్ళలో వున్న పశుప్రవృత్తి అంతా యీమిత్రునిలో రూపొందింది. మనవాళ్ళలో వున్న దుశ్చింత అంతా యీద్రోహిలో అచ్చుకట్టివుంది.

శంకరం—ఇంకా వాయించు.

శాస్త్రి—తరవాత ముక్తాయింపు చూసుకోవోయ్ నాయనమ్మా!

తెరలో—

ప్రేక్ష—చిళ్ళపెంకు, గుడ్డిగవ్వ, గడ్డిపరక, చచ్చిన పాము ఆయువకుణ్ణి విడిచిపెట్టెయ్య్. ఇక నీభర్త సంగతి యెత్తుకో.

శాస్త్రి—మరి చూసుకో! ఇక కాసుకో!

శంకరం—నాపెళ్ళాంచేత నన్ను తిట్టిస్తావా?

శాస్త్రి—నీపెళ్ళాంచేత నన్ను తిట్టిస్తావా?

శంకరం—కుట్రపన్నినందుకు అనుభవించు.

శాస్త్రి—కుట్రపన్న మన్నందుకు నువ్వనుభవించు.

శంకరం—ఇక నీయిష్టంవచ్చినట్టు గుంజుకో. నేను వెళ్ళి అమాంతంగా శ్రీదేవమ్మగారి కాళ్ళు పట్టుకుంటాను. మేము ముగ్గురమూ వొకటయిపోతాం.

శాస్త్రి—నేను వెళ్ళి సంగతంతా మీనాన్నకి చెప్పేస్తాను. వెంటనే ఆయన నిన్ను అరెస్టుచేయించేస్తాడు. మేమిద్దరమూ వొకటయిపోతాం.

శంకరం—తరవాత యేమయితే కానీ, ముందు కార్యం అయిపోతుందికదా?

శాస్త్రి—గుర్రండగు. నువ్వు పీటలమీద కూచునేటప్పటికే అరదండాలు పట్టుకుచక్కావస్తారు పోలీసులు.

శంకరం—రామా, రామా! (నెత్తిబాదుకుంటాడు.)

తెరలో—

యువతి—మహాజనులారా! ఈనీచుడి సంగతి యిలా వుండనివ్వండి. ఈకుట్రలో నాభర్త చేరి వున్నట్టా లేనట్టా? ఇదీ తేల్చుకోవలసింది.

శాస్త్రి—నన్నేమన్నా సరే, ముందా సంగతి తేల్చు.

శంకరం—నా పెళ్ళాం నన్నేమయినా అంటే మొరగదూ?

శాస్త్రి—అదేమిటో చూస్తాంగా?

తెరలో—

యువతి—మహాజనులారా! ఈస్నేహితుని విషయం తలుచుకుంటే నాకు వొళ్ళు మండిపోతోంది. అంటే నాశరీరంలో యిప్పుడు యోగాగ్ని ప్రజ్వరిల్లిపోతోంది. దాంతో నాకు, బుద్ధి నిశితమై అగతానాగతవిషయాలు తేటతెల్లంగా గోచరిస్తున్నాయి. నిజం యేమిటంటే? ఇలాంటి యుక్తులతో యీవుత్తరం నాభర్తే రాయించారు.

శంకరం—కనిపెట్టేసిందిరా దేవుడా! (చేతులతో మొగం కప్పుకుంటాడు.)

శాస్త్రి—నిజం నిలకడమీద తేలిపోయిందిరా నారంగా!

తెరలో—

యువతి—ఇక్కడ వున్న రహస్యం యేమిటంటే? తండ్రి ఆయెత్తు వేస్తే, కొడుకు ఈ యెత్తు వేశాడు. బుద్ధిహీనతవల్ల యీ మిత్రుడు నిమిత్తమాత్రుడై కూలికి విషం తాగాడు; గాని దీని కంతకీ మూలం నాభర్త.

ప్రేక్ష—ఉద్రేకం చాలదు.

యువతి—మహాజనులారా! నేనీ కుట్ర సహించను. నేనా మానవుని మొగం చూడను. నేను ఆ నడపీనుగు పెళ్ళామునై పడివుండను.

ప్రౌఢ—ఇంకా వుద్రేకం కనపరచాలి.

యువతి—ఇలాంటి యువకులు చచ్చేం బతికేం? ఇలాంటి యువకులు పుట్టేం పుట్టకేం?

ప్రౌఢ—చప్పబడిపోతున్నావు.

యువతి—లేదు, నేనెంతమాత్రమూ అంగీకరించను. ఈ స్థితిలో నాభర్త కాదు, యుద్ధానికి వెళ్లవలసింది నేను. అయితే, హిందూదాంపత్యం విచ్ఛిన్నం కాదు. మన ఆధ్యాత్మికజాతిలో స్త్రీకి భర్త వినా మరి గతి లేదు. కనక, నేను యుద్ధానికి వెళ్లినా నాభర్తని విడిచిపెట్టను. అయితే, నేను తిరిగివచ్చే లోపున, ఆయన, కమ్మగా వంటచెయ్యడమూ, చక్కగా శిశువులను పెంచడమూ, పొదుపుగా గృహకృత్యాలు నిర్వహించడమూ బాగా నేర్చుకుని వుంటే మాత్రం నేనాయన్ని దయతో యేలుకుంటాను.


శాస్త్రి—వన్సుమోర్ !

శంకరం—రామా ! రామా ! ఇక నేనాగలేను, ఇదిగో, వెళ్లి గోదావరిలో పడిపోతాను.

శాస్త్రి—(శంకరం చెయ్యిపట్టుకొని) ఆగు. టీ పార్టీమాట చెవిని పడేటప్పటికి వెధవది, నోరూరి చప్పబడిపోయింది; కనక, క్షణంలో కాఫీహోటలుకివెళ్లి వేడివేడి టీ పుచ్చుకుచక్కా వస్తాను. అంతవరకూ నువ్వు మునుగుతూ తేల్తూవుంటివా, నేను వచ్చి వొడ్డు కీడ్చేస్తాను. టీ పార్టీమాట జ్ఞాపకం వుంచుకుని, కాఫీ అనుకుని, కొత్తగోదావరి నీళ్లు మాత్రం నాలుగు గుక్కలు పీల్చెయ్యకేం ? మరి వెళ్లు, పరుగు.

ఇద్దరూ చెరోవేపుకీ వెడతారు.

గ్రంథకర్త అనుమతి పొందకుండా యిది యెవరూ ప్రదర్శించగూడదు.



# స్నాతకోపదేశము

## ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు

చెన్నపట్నం విశ్వవిద్యాలయ స్నాతకుల్ని ఉద్బోధించవలసిందని ఆహ్వానించినప్పుడు, నేనీ విషయంలో కొంత తటపటాయించాను. ఉత్సాహవంతు లయిన విద్యార్థినీ విద్యార్థులు విశ్వవిద్యాలయంవిడిచి, పట్టభద్రులై సువిశాల మయిన జీవిత విశ్వవిద్యాలయంలో ప్రవేశించే సందర్భంలో వాళ్ళని, నన్నువీరిని ఉద్బోధించడానికి ఆహ్వానించినందుకు కృతజ్ఞుణ్ణి. ఇక్కడ సమావిష్టు లయిన విద్యార్థినీవిద్యార్థు లందరికీ భావిజీవితాల్లో విజయపరంపరలుకలగాలని ఆశిస్తున్నాను. మీలో కొంత మంది సామాన్యంగా అందరికంటె ఉన్నతకక్ష్యలో ఉత్తీర్ణులయి ఉండవచ్చును. మరికొంతమంది భావి జీవితంలో ఇతరులకంటె సమున్నతస్థితులు పొందవచ్చును. కాని అందరూ కూడా ముఖ్యంగా విద్యాభ్యాసం పూర్తి కాలేదనీ, అది ఇప్పుడే ప్రారంభ మైనదని గమనిస్తారనీ నమ్ముతున్నాను.

విశ్వవిద్యాలయాలు తమ ఆదర్శాలు నిర్వహించుకోవాలంటే—చిన్న చిన్న జీవితరంగాల లాగే ఉండాలి. విద్య వ్యక్తిని సంఘజీవితానికి అర్హుణ్ణిగా తయారు చెయ్యాలి; అల్లాగే వ్యక్తికూడా సంఘాన్ని ఒకదివ్యాదర్శంగా సరిదిద్దాలి. విద్యావేత్తలు విద్యావంతు లయినవాళ్ళు జీవించడానికి తగిన సంఘంమాట మరిచిపోతే, మరి వారి విద్యావిధానం కేవలం బూడిదలో పోసిన పన్నీరన్నమాటే! సొసైటీ అనే పదం 'సహకారి' అని అర్థం కలిగిన ఒక లాటిను భాషాపదంలోనించి ఉద్భవించింది. సంఘంఅంటే సమానాదర్శాలు కలిగి, ఒక ఉద్యమంకోసం సమకూడిన వ్యక్తుల కూటమి. ఆ కూటమిలో ఉన్నవాళ్ళందరూ ఒక సమానాదర్శంతో పనిచేస్తూఉంటారు. వ్యక్తి సంఘక్షేమం కోసం స్వార్థత్యాగం అలవరచుకునే విధానమే విద్య, ఆత్మవికాసానికీ స్వార్థపరత్వానికీ ఉత్తర దక్షిణధ్రువాల అంతరం ఉంది! విద్యాబోధనావిధానాల్లో అనేకమందికి అనేకమైన అభిప్రాయభేదా లుండవచ్చును. కాని విద్యాదర్శం విషయంలో ఎవరికీఅభిప్రాయ భేదం ఉండదనుకుంటాను.

కాని ఈఆదర్శం అన్నిచోట్లాఅనుసరించడం మాత్రం కనబడడం లేదు. ప్రపంచంలో ప్రజాసామాన్యంలో నించి వచ్చిన నాయకులు పరిపాలకులుగా ఉండడం గాని, ప్రజాసామాన్యక్షేమంకోసం పరిపాలన జరగడం గాని చాలా అరుదుగాఉంది. అందుకనే మన విద్యాలయాల్లో ప్రజాక్షేమం అనేది ఆదర్శంగా ఉండడంలేదు. జమీందారీవిధానమూ, ధనికవర్గాధికారమూ కలిసి, ప్రజాసామాన్యాన్ని పీల్చి పిప్పిచేస్తున్నాయి. అత్యున్నతమైన విద్యాదర్శాలకీ, వీటికీ పొత్తు కుదరదు. ప్రపంచంలోపరపీడనమూ,ధనికదరిద్ర భేదమూ ఉన్నంత కాలం విద్యాలయాల్లో విశ్వమానవసౌభ్రాత్రం బోధించడం వల్ల ప్రయోజనం ఏమీ ఉండదు. గడిచిన రెండు ప్రపంచ సంగ్రామాలవల్ల ఈ విషయం బాగా వ్యక్తమయింది. ఇప్పుడు రాజకీయవ్యవస్థల్లో ఉన్న ఆర్థిక సాంఘికలోపాలన్నీ మన ప్రస్తుతవిద్యావిధానంలోకూడా ప్రతిబింబిస్తున్నాయి. విద్య జనసామాన్యానికి అందుబాటులో ఉండడానికి బదులుగా, కొన్ని ప్రత్యేక వర్గాల సొత్తుగా మారిపోయింది; అనేకమందికి మానవత్వం ప్రసాదించడానికిబదులు, మానవత్వనాశనానికే దారితీస్తోంది. ఇంచుమించుగా గతశతాబ్దానికి అంతిమ భాగంలో ప్రపంచంలో అందరూ ప్రజాసామాన్యానికి విద్య కావాలని గుర్తించి, నిర్బంధప్రాథమిక విద్య ప్రవేశపెట్టారు. అంతేకాదు; విద్యకి కావలసిన సాంఘికాదర్శాలు కూడా గుర్తించడం ప్రారంభించారు.

మనదేశంలో విద్య, వివిధములైన పరిస్థితులకీ,

ఆటంకాలకీ లోనయింది. మనకి ప్రాచీనకాలంలో గొప్ప గొప్ప విద్యాసంస్థలు ఉండేవి. అక్కడ విద్యార్థులు నిరంతరమైన చిత్తైకాగ్రతతో జ్ఞానోపార్జన చేస్తూ, నేటి మన ఉత్తమవిశ్వవిద్యాలయాల్లోలాగ, గొప్పశాస్త్ర పరిశోధనలు జరిపేవారు. నేటి శాస్త్రవిజ్ఞానం మనకి పాశ్చాత్యులు పెట్టిన భిక్ష కాదు. మన ప్రాచీనులు ఈ శాస్త్రాభివృద్ధికి బ్రహ్మాండంగా తోడ్పడ్డారు. విజ్ఞానం మానవకోటి అంతా సముపార్జించిందికాని, కేవలం ప్రాచ్యులుగాని, పాశ్చాత్యులుగాని ఇది మా సొత్తన డానికి వీల్లేదు. మన ప్రాచీనులు నలందా తక్షశిలాది విశ్వవిద్యాలయాల్లో విద్యావిధానాన్ని పరిపూర్ణౌన్నత్య శిఖరానికి తీసుకుపోగలిగారు. అయితే మన ప్రాచీనుల విద్య వట్టి మేధా, జ్ఞాపకశక్తుల మహేంద్రజాలం కాదు, అది ఆత్మసాక్షాత్కృతి కొక పరమసోపానము. విద్యా విధానంలో ఉండే ఆధ్యాత్మికవిద్య, సాంఘిక విద్యా దర్శాల నెంతమాత్రమూ కూడా న్యూనతపరిచేదికాదు. ఇంతేకాదు; వేదాలు కూడా కేవలం ఆధ్యాత్మికవిద్యకే సంబంధించినవే అని చెప్పడం సముచితంకాదు. వేదాలు సర్వవిజ్ఞానాలకీ పెన్నిధుల వంటివి. అందులో సత్యా న్వేషణకీ, దైవచింతకీ, ప్రాధాన్యంఉన్నా శాస్త్రాలకి కూడా సముచితస్థానం లేకపోలేదు.

ఇంక నేటికాలపు విద్యావిధానం సంగతి ఆలోచిస్తే ఆదర్శాలకీ, ఆచరణలకీ చాలా విభేదం కనిపిస్తుంది. మెకాలే మనకి ఆంగ్లేయభాషద్వారా విద్యాబోధన జరిగే పద్ధతి ఏర్పాటుచేశాడు. ఈస్టిండియాకంపెనీకి గుమాస్తాలని సరఫరా చెయ్యడమే దీని సాంఘికాదర్శము. ఈ వేళ మనకి దీని ఫలితాలన్నీ కనిపిస్తున్నాయి. మన యువతీయువకులు, మన సంప్రదాయాలకీ, సాంఘిక పరిస్థితులకీ దూరులై తమకిగాని, ప్రజాసామాన్యానికి గాని ఏవిధంగానూ ఉపకారులు-కాలేకుండా ఉన్నారు. విద్యావంతులు ప్రజాసామాన్యానికి దూరులై తాము వేరే ఒక ప్రత్యేకసంఘమని భావిస్తూఉంటారు. మనది ముఖ్యంగా కృషి ప్రధానమైన దేశం కావడంచేత, ఈ విధమైనదృష్టి గ్రామాలకీ, నగరాలకీ దాటరాని అంతరం కలిగిస్తూంది. అంతేకాదు; దేశానికి వెన్నెముకవంటి రైతులకీ వాళ్ళమీద ఆధారపడి గ్రామజీవితానికి,ఏవిధంగానూ తోడ్పడని విద్యావంతులకీ కూడా తీరని విభేదం కలిగిస్తోంది.

ఈ వేళ మన విశ్వవిద్యాలయాలూ, రామన్, రాధాకృష్ణన్, పి. సి. రేల వంటి మహనీయుల్ని ఉద్భవింప జేశాయని గర్వపడవచ్చును. విజ్ఞానదీపికలు వియత్తలం వరకూ ప్రజ్వలింపజేసిన వారికి మన జోహారులు. అయితే మన విద్యాదర్శం సంపూర్ణంగా పునర్నిర్మాణంచేసి, విద్యావంతులకీ విద్యావిహీనులకీ, పల్లెలకీ పట్టణాలకీ వ్యవసాయదారులకీ వారిమీద ఆధారపడి జీవించే పట్టణవాసులకీ మధ్యన ఉండే అగాధాలు తొలగించేవరకూ మనం గర్వపడడాని కవకాశంలేదు. మన విద్య మనల్ని మన పరిసరపరిస్థితులకి, తగినవారినిగా తయారు చెయ్యడమే కాకుండా వాటిని అభివృద్ధిపరిచే శక్తి మనలో సముజ్వలింపజెయ్యాలి; అంతేగాని పరిసరాలకి భయపడి పలాయనం చిత్తగించేవారినిగా చెయ్యకూడదు. మన విద్యార్థులీ నాడు మన ఆర్థికవిధానానికి పల్లెటూళ్ళే పట్టుగొమ్మలని తలచడం లేదంటే—అది వారి లోపం కాదు. విద్యావిధానం యింతవరకూ కేవలం పుస్తకాలు బట్టీపట్టడం మీదే ఆధారపడింది; అంతేగాని సజీవమైన పరిసరాలమీద ఆధారపడలేదు. ఇంతవరకూ మనం విజ్ఞానం విజ్ఞానంకోసమే అనే లక్ష్యంమీద ప్రాధాన్యం ఉంచాము. ఇప్పుడా ప్రాధాన్యం విజ్ఞానం దేశక్షేమానికే అన్న అభిప్రాయానికి ఇవ్వాలి. ఏ విద్యావిధానం నిర్మించినా దానిలో భారతదేశ గ్రామాలకి తప్పకుండా ప్రధానస్థానం ఉండితీరాలి. విద్యావంతులు గ్రామాలకీ వెళ్ళి, తమవిజ్ఞానం అంతా పల్లెటూళ్ళక్షేమం కోసం ధారపొయ్యడానికి బద్ధకంకణులై ఉండాలి.

మనవిద్యావిధానాల్లో మనపరిస్థితుల్ని సరిగా గమనించక పోవడంవల్ల అనేకమైన అవస్థలు కలుగుతున్నాయి. ఈనాడు మనకళాశాలల్లో విద్యార్థులకి ప్రవేశందొరకడం చాలా కష్టంగాఉంది. హైస్కూలు చదువు పూర్తి చేసిన ప్రతీ విద్యార్థి కళాశాలలో చేరడానికి అర్హుడని నిర్ణయించడానికి వీల్లేదు. విశ్వవిద్యాలయాలంటే ఉన్నతవిజ్ఞానకేంద్రా లన్నమాట. అందు

చేత ఆయా విజ్ఞానశాఖల్లో అర్హులయిన విద్యార్థులకే ప్రవేశం ఇవ్వాలి. యూరోపులో హైస్కూలువిద్య పూర్తిచేసిన విద్యార్థుల్లో చాలామంది పారిశ్రామిక విద్యాలయాల్లో జేరుతూ ఉంటారు. మనదేశంలో అల్లాంటి ఆచారమే అమల్లోకిరావాలి. ఇల్లాంటి పారిశ్రామిక విద్యాలయాలు లేకపోవడం ప్రస్తుతం మన దేశపు విద్యావిధానంలో ఒక పెద్దలోపంగా ఉంది. ప్రస్తుత విద్యా విధానానికీ, మనపరిస్థితులకీ సమీప సంబంధం ఉంటే, నూటికి తొంభైమంది విద్యార్థులు విశ్వవిద్యాలయాల్లో ప్రవేశించడానికి తహతహలాడడానికి బదులు, ఈపరిశ్రమాలయాల్లో ప్రవేశించి ఉందురు. ఈపారిశ్రామికవిద్యలో కూడా ప్రత్యేక పరిశ్రమలు ఆదర్శంగా పెట్టుకుని, పరిశ్రమలకీ కృషికీ కావలసిన సమానప్రాధాన్యం తారుమారు కాకుండా జాగ్రత్తపడాలి.

మన విశ్వవిద్యాలయాల్లో విద్యముఖ్యంగా మూడు విధాలుగా వ్యర్థమైపోతూంది.

ప్రభుత్వకళాశాలల్లోను, మిగిలిన కళాశాలల్లోనూ, శిక్షితులైన పట్టభద్రుల్లో నూటికి 30 మంది మాత్రమే తమవిద్యకి తగిన ఉద్యోగాలు సంపాదించగలుగుతున్నారు. మిగిలినవాళ్లలో నూటికి ౨౦మంది ఏ ఉద్యోగమూ సంపాదించలేకపోతున్నారు. పోగా, మిగిలిన వాళ్ళకి ఉద్యోగాలు దొరుకుతున్నాయిగాని, అవి స్కూలుఫైనలుపరీక్షలో ఉత్తీర్ణులయినవాళ్లు మాత్రమే చెయ్యవలసిన ఉద్యోగాలు. ఈ పైవిషయాలు గమనిస్తే విశ్వవిద్యాలయ విద్య ఏవిధంగా వ్యర్థమైపోతున్నదీ వ్యక్తమౌతుంది. ఇది మొదటిది.

ఇక రెండో విధం. విశ్వవిద్యాలయాల్లో చాలామంది పరీక్షల్లో తప్పిపోతున్నారు. విద్యావేత్తలు మన భారతవిశ్వవిద్యాలయాల్లో పరీక్షల్లో తప్పిపోయినట్లుగా ప్రపంచంలో మరి ఏ విశ్వవిద్యాలయాల్లోనూ తప్పిపోరని చెబుతారు.

ఇక మూడో విధం; పరీక్షల్లో ఉత్తీర్ణులయిన విద్యార్థుల్లో కూడా చాలామంది తమతమ పట్టాలకి తగిన పాండిత్యాలు లేకుండా ఉన్నారనుకుంటాను. వీరిలో కొంతమంది అత్యుత్తమతరగతుల్లో ఉత్తీర్ణులయినవారు ఉంటే ఉండవచ్చును. నేనన్న పై విషయంలో కొంతమందికి అభిప్రాయభేదం ఉండవచ్చును. దీన్నిబట్టి ప్రపంచవిశ్వవిద్యాలయాల్లో ఉత్తీర్ణులయిన పట్టభద్రులకంటె మనపట్టభద్రులు తక్కువశ్రేణిలో ఉన్నారని మనం భయపడవలసిన అవసరం లేదు

మొట్టమొదటిలోపం విశ్వవిద్యాలయాలు సంఘశ్రేయస్సు గమనించకపోవడంవల్ల ఏర్పడుతూంది. ఈ లోపం సవరించుకోవాలంటే, విశ్వవిద్యాలయాలు ప్రభుత్వశాఖల్లో ఆయా వృత్తులకి ఎంతెంతమంది పట్టభద్రులు కావాలో అంచనా వేసుకుని, సరిగ్గా అంతమంది విద్యార్థులకే విశ్వవిద్యాలయాల్లో అవకాశం ఇస్తూ ఉండాలి. అల్లాగే దేశంలో వాణిజ్యాదివృత్తులకికూడా, ఎంతెంతమంది పట్టభద్రులు కావాలో అంచనా వేసుకుని, దానికి తగినట్లుగా విశ్వవిద్యాలయాల్లో అవకాశం ఇస్తూఉండాలి. అంతేకాదు, ప్రభుత్వం ఒక ఇరవైఏళ్ళ లోపుగా, కృషి, పశుపోషణ, వైద్యం, ఆరోగ్యం, అటవులు మొదలైన శాఖల్లో, ఎంతెంత మంది పట్టభద్రులు కావాలో అంచనా వేసుకోవాలి; ఆపైన రాష్ట్రంలో ఎంతవరకు పారిశ్రామికాభివృద్ధికి అవకాశం ఉందో గమనించాలి. ఇవన్నీ జాగ్రత్తగా గమనించి, అంచానా వేసుకున్నప్పుడు, కళాశాలల్లో ఎంతెంతమందికి ప్రవేశంఇవ్వాలో సులభంగా తెల్చుకోవచ్చును. ఈనాడు కళాశాలల్లో ప్రవేశించే విద్యార్థుల సంఖ్యకి అంతులేకుండా ఉంది. కళాశాలల్లో జేర్చుకోవడానికి ఒక నిశ్చితమైన విధానం ఏదీ కనబడడం లేదు. అందుచేతనే నేడు మన విశ్వవిద్యాలయాలవిద్య చాలావరకు వ్యర్థమైపోతూందని చెప్పవలసివస్తోంది.

ఇక రెండో విధమైన లోపాన్నిగురించి ఆలోచిద్దాము. ఈలోపం లేకుండా చెయ్యాలంటే, విశ్వవిద్యాలయాల్లో కేవలం అర్హులయిన విద్యార్థులకే అవకాశం ఇవ్వాలి; కళాశాలల్లో క్రమశిక్షణా, బోధనా, బాగా అభివృద్ధిచెయ్యాలి. అంతేవాసులకీ, ఆచార్యులకీ మధ్యన ఇంకా ఎక్కువ సహకారం పెంపొం

దించాలి. కొంతమందికే కళాశాలల్లో ప్రవేశం ఇస్తున్నామనడం చాలా కష్టమే, అయినా అది ఆచరణలో పెట్టకతప్పదు. అల్లాగ చెయ్యడం న్యాయం కాదని పెద్ద ఆందోళన బయలుదేరవచ్చును. దీనికి కారణంగా, కళాశాలల్లో అవకాశం దొరకని వాళ్లకి మరో విద్యావిధానం లేదని ఒక సాకు చెప్పవచ్చును. నిజమే! పారిశ్రామికవిద్య లేకపోవడంమూలాన్నే విద్యార్థులంతా ఉన్నత విద్యాలయాల్లో గుమిగూడుతున్నారు. అందుకనే ఉన్నతపాఠశాలా విద్యావిధానం బాగా సంస్కరించి, సాంకేతికవిద్యకీ, (Technical) వృత్తివిద్యకీ (Vocational) బాగా ప్రాముఖ్యం ఇవ్వాలి. విశ్వవిద్యాలయాల్లో ఈవిద్యలు బోధిస్తూ, అందులో ఉత్తీర్ణులయినవారికి కూడా ప్రత్యేకంగా పట్టాలివ్వాలి మనం విశ్వవిద్యాలయవిద్య సంస్కరిస్తున్నామంటే పునాదుల దగ్గరనించి సంస్కరించాలిగాని, ఊరికే పైపై సంస్కరణల వల్ల ప్రయోజనంలేదు.

సంఘపరిస్థితులకి అనుకూలంగా విద్యావిధానం సంస్కరించాలని అనుకున్నాము. ఈ విషయంలో ఒక ఒట్టావా విశ్వవిద్యాలయంలో అంతేవాసిగా ఉండి, ఆతరవాత అక్కడనే ఆచార్యుడుగా ఉన్న ఒక వ్యక్తినిగురించి నాలుగుమాటలు చెబుతాను. ఆయన గోదావరీమండలంలో ఒక పల్లెటూళ్లో ఒక మిత్రుడి సాహాయ్యంతో ముఖ్యపరిశ్రమ ఒకటి స్థాపించారు. ఎండిపోయిన పొగాకు కాడలతోనూ, అరటిచెట్లతోను, ఇంకా కొన్ని వస్తువులతోను పొటాసియం పెర్మాంగనేట్; సోడా ఆష్ అనే వస్తువులు తయారుచేస్తున్నారు. ఆయన ఒక పొలంలో మూడుపాకలువేసి అందులో ఈ పరిశ్రమ ప్రారంభించారు. నేను అక్కడికి వెళ్ళి చూశాను. అక్కడ ఒక పాకనిండా ఎండిన పొగాకు కాడలున్నాయి. మనం సామాన్యంగా ఇవి అక్కరలేని వస్తువులని అవతల పారవేస్తూంటాము; లేకపోతే తగలబెడుతూఉంటాము. కాని వీటితో ఆయన పైన చెప్పిన రెండు రాసాయనికద్రవ్యాలూ తయారుచేస్తున్నారు. నేను అక్కడికి వెళినప్పుడు, ఆ తయారుచేసే విధానమూ, ఆ రాసాయనికద్రవ్యాలూ నాకు చూపించారు. నేను ఆ సమయంలో అక్కడ ఒక మహా విశ్వ విశ్వవిద్యాలయ హృదయమూ, ఆయనకి విద్యాదానం చేసిన విశ్వవిద్యాలయ హృదయమూ, ఆనందంతో స్పందిస్తున్నాయని అనుకున్నాను. అల్లాగే మీలో కూడా కొంతమంది మీమీ విజ్ఞానశాఖల్లో మీ సహజశక్తుల్ని అనుసరించి, దేశోపకారకములైన పరిశ్రమలు స్థాపించగలరని నమ్ముతున్నాను. మీకు ఈ విషయంలో వంగదేశంలో 'బెంగాల్ కెమికల్ అండ్ ఫారస్యూటికల్ వర్క్స్' స్థాపించిన ఆచార్య పి. సి. రే ఒక దివ్యాదర్శంగా ఉండగలరని నా ఆశయం. ఈ విషయంలో అంత విజ్ఞానఖని అయిన దేశభక్తుడు మరి ఎవ్వరూ ఉండరని నా నమ్మకము. ముఖ్యంగా మీరు విజ్ఞానం అంతా సంఘశ్రేయస్సుకోసం వినియోగించాలనే దృఢమైన ఆత్మవిశ్వాసంతో ఈ ఉద్యమానికి పూనుకోవాలి.

మన మహాకవి రవీంద్రుడు ఆయన వ్రాసిన క్రియేటివ్ యూనిటీ (creative unity) లో, జీవితానికీ విద్యకీ ఉన్న పరస్పరసంబంధం ఈ క్రిందివాక్యాల్లో విస్పష్టంగా విశదీకరించాడు,

విజ్ఞానం అంతా ఒకటే అనే ప్రధానసూత్రాన్నీ, సాంఘికజీవనమూ, ఆధ్యాత్మికజీవనమూ, ఒకటే అనే సత్యాన్నీ విద్యార్థులకి సాక్షాత్కరింపజెయ్యడమే, విద్యకిగల పరమాదర్శము. పురాతనకాలంలో సంఘం ఆర్థికసహకారంవల్ల కట్టుబడి ఉండేది. మన విశ్వవిద్యాలయాల్లో అల్లాంటి ఆర్థికసహకారం ప్రధానాదర్శంగా ఉండాలి. కేవలం విద్యాబోధనమే విశ్వవిద్యాలయాదర్శం కాదు. జీవనం కూడా దానికి ప్రధానాదర్శమే. విద్యార్థుల్లో కేవలం ఆలోచనాశక్తిని వృద్ధిచెయ్యడమే కాకుండా, వస్తూత్పాదకశక్తికి కూడా ప్రోత్సాహం ఇవ్వాలి. మన తపోవనాలన్నీ ప్రాకృతికమైన విశ్వవిద్యాలయాలు. వాటికి సామాన్యప్రజల దైనందినజీవితంతో నిత్యసంబంధం ఉండేది. ఆచార్యులూ, అంతేవాసులూ ప్రతిదినమూ అరణ్యంలోకి వెళ్లి సమిధలూ, ఫలాలూ సేకరించుకుని వచ్చేవారు; గోబృందాన్ని తీసుకుని ప్రొద్దున్నే పసిరపచ్చికబయళ్లకి తోలుకునిపోయేవారు; తమ కాయకష్టంవల్ల జీవితం గడుపుతూ ఉండేవారు. వారికి ఆధ్యాత్మికజీవనమన్నా, విద్య అన్నా ఒక్కటే. ఆ ఆధ్యాత్మికజీవనం అంటే సమగ్రజీవితానికి అంతటికీ సంబంధించిందే. మన విజ్ఞానకేంద్రాలు కేవలం మేధావికాసానికి తోడ్పడమే కాకుండా, మనదేశపు ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడేవై ఉండాలి.

ఇంతే కాదు: విశ్వవిద్యాలయాలు తమ పరిసరంలో ఉండే పల్లెలతో సహకరించాలి. వ్యవసాయమూ, పశు

పాలనమూ, వస్త్రోత్పత్తి మొదలయిన జీవితావసరాల విషయంలో పల్లీయులతో చేతులుకలపాలి. తమ శాస్త్రీయపరిజ్ఞానం అంతా ఉపయోగించి, పదార్థోత్పత్తికి సులభమార్గాలు అన్వేషించాలి. అసలు విశ్వవిద్యాలయమే, ఆచార్యులూ, అంతేవాసులూ సహకరిస్తూ ఉత్పత్తిచేసిన వృత్తిపనులవల్ల లభించే ఆదాయంమీద నిలబడాలి. దీనివల్ల మనం విద్యార్థులకి కేవలం స్వార్థభావవిహీనమైన పారిశ్రామికవిద్య బోధించగలుగుతాము. అంటే—విశ్వవిద్యాలయాలు ఆత్మోల్లాస సాహాయ్యంతో నిత్యమూ నవ్యజీవితసృష్టిపరములై ఉండాలి; స్వతంత్రసంస్థలై ప్రత్యేకప్రపంచాలుగా వర్ధిల్లుతూ, పరిసరజీవితానికి ఆనందోల్లాసాలు ప్రసరింపజేస్తూ ఉండాలి. ఇంతేకాకుండా తమ సమీపంలో విద్యాకేంద్రాలకి తగువిధంగా సహాయం చేస్తూఉండాలి. అన్నింటికంటె ముఖ్యంగా విద్యాలయాలు మానవుని, మేధాసంపత్తి అభివృద్ధిపరుస్తూ, అతని ఆర్థిక సాంఘిక వ్యవస్థలకి దోహదమిస్తూ, అతనికి ఆధ్యాత్మికదృష్టి కలిగించి, సంపూర్ణత్వానికి సహకరించాలి.

ఈనాడు, విద్యావిధానంలో మనలని అనేకతీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నాయి. విద్యావిధానంలో అన్నమాటేమిటి! జీవితరంగంలో అంతటా తీవ్రసమస్యలే! అయినా ధైర్యంతో వాటిని ఎదుర్కోవడం మనవిధి. అన్నింటికన్నా కులతత్వం మన్ని ఇప్పుడు ఎక్కువగా పీడిస్తోంది. ఈ కులతత్వసమస్య చివరికి విద్యాలయాల్లో కూడా ప్రవేశిస్తోంది. విద్యావిషయంలో వ్యక్తికీ, వ్యక్తికీ మధ్య అంతరువు లేమీ ఉండకూడదన్నమాట నిజమే! కాని, విశ్వవిద్యాలయవిద్యకీ, ఉన్నతకళాశాలల్లోని సాంకేతికవిద్యకీ కేవలమూ తగిన ప్రతిభావంతులకే అర్హత ఉంటుందిగాని, తదితరులకి ఉండనేరదు. కులతత్వంతో పని లేకుండా, అర్హులందరినీ ఉన్నతవిద్యాలయాల్లో ప్రవేశించనియ్యాలి. సంఘంలో అందరికీ సమానావకాశాలు కల్పించి, క్రమంగా కులతత్వం నిర్మూలింపజెయ్యాలి. కాని, అర్హులైన వారిని అణగద్రొక్కి అనర్హుల్ని పైకి లేవదీయడం న్యాయం కాదు. అర్హుల్ని అణగద్రొక్కడం కేవలం కులతత్వం సంపాందించడానికే సహకరిస్తుంది. అయితే, విద్య అనేది కేవలం ఉద్యోగానికే అన్న భావన పోతేనే గాని కులతత్వం పూర్తిగా నశించదు.

మనదేశం ఒకమహాయుగం ప్రారంభదశలో ఉంది. మన ఉజ్జ్వలభావి నిర్మాణానికి దేశంలో ఉన్న ప్రతిభావంతు లందరి సాహాయ్యమూ కావాలి. జవహర్‌లాల్ నెహ్రూ పండితుడి వంటి మహామహులందరూ, దేశంలో ధనస్వామ్యంవల్ల వచ్చే, స్వార్థపరత్వం నిర్మూలించి, సర్వమానవసమానత్వమూ, సంఘసేవా ప్రధానంగా ఉన్న, ఒక కక్ష్యారహితమైన సంఘం నిర్మించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు మన దేశంలో ఉన్న అజ్ఞానమూ, దారిద్ర్యమూ, అనారోగ్యమూ సంపూర్ణంగా నిర్మూలించాలి. మీ రందరూ మీ నాయకులకి చేదోడువాదోడుగా ఉండి, వారి ఆశయాలు సఫలం చేస్తారని విశ్వసిస్తున్నాను. మీరు దేశాన్నించి సాహాయ్యం అర్థించేముందు, దేశం ఎక్కువగా మీ సాహాయ్యం అర్థిస్తోందనే విషయం గమనించాలి. మీకంటె మీదేశం భరించరాని దైన్యస్థితిలో ఉన్నదనే మాట మరవవద్దు. ఇది మనదేశచరిత్రలో ఒక మహోజ్జ్వల ఘట్టం. ఈ సమయంలో మనం మన అల్ప స్వార్థాలు విడిచి, ఇంతకాలమూ మనస్వప్నప్రపంచం లోనే ఉండిపోయిన ఒక వినూత్న భారత జాతీయత నిర్మించాలి. అందులో వర్గాల ధనమదాంధతగాని, వర్ణాల జాతిదురహంకారమూ, పరపీడనా గాని తల లెత్తకూడదు.

మీరు మా స్వప్నప్రపంచంలోనే ఉండిపోయిన భావి వినూత్న భారతదేశంలో పౌరులుగా వర్ధిల్లండి. మన స్వాప్నికాదర్శాలు మరవకండి. పరమేశ్వరుడు మిమ్మల్ని ఆశీర్వదించుగాక!

సహ నా వవతు సహ నౌ భునక్తు
సహ వీర్యం కరవావహై. తేజస్వినా వధీత మస్తు
మా విద్విషావహై ఓం శాంతిః శాంతిః శాంతిః

ఆ పరమేశ్వరుడు మనలని రక్షించి, పోషించుగాక! మనము జ్ఞాన సముపార్జనాశక్తిని సంపాదింతుముగాక! మన విద్య సార్థక మగుగాక! మనము పరస్పరమును ద్వేషింపకుందుము గాక! ఓమ్ శాంతిః శాంతిః శాంతిః

# కుటీర పరిశ్రమలు

శ్రీ వి. ఆర్. చిత్రా

కుటీరపరిశ్రమలు అనే పదం సామాన్యంగా మన ఇళ్ళల్లో యంత్రసహాయం లేకుండా నిర్వహించే పరిశ్రమలకి వాడుతున్నారు. కరచరణ సహాయంతో నిర్వహించే పరిశ్రమలని కూడా మనం కుటీరపరిశ్రమలని అంటున్నాము. కాని, జపానులో మనం అనుకునే చేతి పరిశ్రమలలాంటివి సామాన్యంగా కనబడవు. జపాను ఒక సుప్రసిద్ధ పారిశ్రామిక దేశం కావడానికి, అది నేటి కాలపు యంత్రాలన్నీ కుటీరపరిశ్రమలకి అనుకూలంగా మార్చుకోవడమే కారణము. ఆ దేశంలో కుటీరపరిశ్రమలు విద్యుచ్ఛక్తి సహాయంతో నడిపిస్తారు; ఒక్కొక్క కుటీరంలో సామాన్యంగా పదిమందికి తక్కువమందే పనిచేస్తూఉంటారు. జపాను ఎగుమతి చేసే వస్తువులవల్ల వచ్చే ఆదాయంలో నూటికి యాభైవంతులు ఇల్లాంటి పరిశ్రమలవల్లనే వస్తూఉందని విజ్ఞుల అభిప్రాయం. జపానుదేశపు శ్రామికుల్లో నూటికి అరవై, డెబ్భైమంది ఈ కుటీరపరిశ్రమల్లో పనిచేసేవాళ్లే. మనం ఇల్లాంటి పరిశ్రమలని కూడా కుటీరపరిశ్రమ లని అంటాము. కాని జపానీయులు వీటిని చిన్నపరిశ్రమ లని అంటారు.

చాలామంది మనదేశానికి వ్యవసాయమే ప్రధాన పరిశ్రమ అనీ, చిన్నపరిశ్రమలు ఎప్పటికీ పనిలేనివాళ్ళని ఆకర్షించేటంత ఎక్కువగా అభివృద్ధి పొందలేవనీ అనుకుంటూ ఉంటారు. కాని జపానులో చేసినట్టుగా కుటీర పరిశ్రమలు అభివృద్ధిపరిచి, వాటివాణిజ్యం పెంపొందిస్తే మనది కూడా ఒక ప్రధాన పారిశ్రామిక దేశం కావడంలో సందేహం లేదు. దీనివల్ల ప్రస్తుతం మన దేశంలో కృషి, పరిశ్రమలూ అవలంబించేవారిలో కనబడే పెద్ద వ్యత్యాసం కూడా మార్చవచ్చును; పరిశ్రమ లన్నీ ఒకేచోట గుదిగుచ్చడంవల్ల కలిగే దుష్ఫలితాలు కూడా తొలగించవచ్చును. ఈ విధంగా కుటీరపరిశ్రమలు నడిపించడంవల్ల అనేకమైన సుఫలితాలు కలుగుతాయి.

వ్యవసాయం అవలంబించి జీవించే వాళ్లందరికీ సంవత్సరంలో చాలాకాలం బొత్తిగా పనిలేకుండా పోతోంది. డాక్టరుస్లేటరు దక్షిణ భారతంలో ఉండే వ్యవసాయ పరిస్థితు లన్నీ పరిశీలించి వ్యవసాయదారులకు పన్నెండు నెలల్లోను అయిదు నెలలు మాత్రమే పని ఉంటుందని వ్రాశాడు. కుటీరపరిశ్రమలవల్ల ఈసమస్య అతి సులభంగా సాధించవచ్చును.

గ్రామికవర్గాల్లో ఉన్న యువకులు, తాముఅభ్యసించే పరిశ్రమలద్వారా విద్య అభ్యసించడానికి కూడా అవకాశం కలుగుతుంది.

పల్లెటూళ్ళలో కుటీరపరిశ్రమలు స్థాపించడంవల్ల పరస్పర సహకారం పెంపొందుతుంది. యజమానులకీ, పనివాళ్ళకీ ఒకళ్లొకళ్ళని అర్థం చేసుకోవడానికి అవకాశాలు ఏర్పడడంవల్ల జీవితం కొంత ఉల్లాసకరంగా గడిచిపోవడానికి కూడా అవకాశాలు ఏర్పడతాయి. కుటీరశ్రామికులకు తమలో ఉండే శక్తిసామర్థ్యా లన్నీ వినియోగించుకోవడాని తగిన అవకాశం కలుగుతుంది; పట్టణాల్లో దుర్గంధకూపాల్లో పడి కృశించవలిసిన బాధ తొలిగిపోతుంది.

డార్లింగు అనే విజ్ఞుడు చెప్పినట్లు, పల్లెటూరి ప్రజలకి పనిలేని సమయాల్లో పని కల్పించి వారి భాగ్యాభివృద్ధికి తోడ్పడడంలో కుటీరపరిశ్రమలు చాలా ఉపకరిస్తాయి.

చేతికాగితాలు, పింగాణీపని, పటాలకి చట్రాలు తయారుచెయ్యడం, ఎనామిల్ పనీ మొదలైన పరిశ్రమలు, ఇంకా ఇతరమైన పరిశ్రమలూ స్థాపించడానికి

కావలసిన సాధనసంపత్తిఅంతా, దక్షిణభారత దేశంలో సమృద్ధిగాఉంది. అంతేకాక, అక్కడక్కడ మొలక లెత్తుతూఉన్న ఈ పరిశ్రమలకి తగిన ప్రోద్బలం ఇవ్వ వలసిన అవకాశం కూడా ఉంది.

గడిచిన కాలంలో జపానుప్రభుత్వం కుటీరపరిశ్రమలకి కావలసిన విద్యుచ్ఛక్తి అల్పమూల్యంలో లభించే ఏర్పాటులన్నీ చేసింది; పనివాళ్ళకి చిన్నచిన్న యంత్రాలు నడిపించడానికి కావలసిన తరిఫీగు ఇచ్చింది. ఇంతేకాక, పనివాళ్లు సులువుగా విద్యుత్పరికరాలు కొనడానికి తగిన ఏర్పాటు లన్నీ చేసింది. ఇంకా విద్యుత్పరికరాలు ప్రజాబాహుళ్యంలో బాగా ప్రచారం కావడానికి తగిన ప్రయత్నాలు చేసింది. ఇంకా అక్కడక్కడ ప్రదర్శనాలయాలూ, ప్రదర్శనాలూ ఏర్పాటు చేసి విద్యుత్పరికరాలు సర్వోత్తమ మయినవని ప్రచారం చేసింది. ఇంతేకాక, కుటీరపరిశ్రమలకి ఇంతకంటె తరణోపాయం లేదని కూడా విశదపరిచింది.

జపానుపల్లెల్లోని కుటీరాల్లో ఇంచుమించు గా పది మందిచేరి విద్యుచ్ఛక్తిమీద నడిచే మరమగ్గాలమీద పని చేస్తూంటారు. ఇల్లాగే మిగిలిన వృత్తులవాళ్ళుకూడా అతి సులువుగా తమవృత్తి పనులన్నీ చేసుకుంటూ ఉంటారు. ఇప్పుడు మనరాజధానిలో చాలాచోట్ల విద్యుచ్ఛక్తి సులువుగా దొరుకుతూఉంది. అందుచేత మన ప్రస్తుత కాంగ్రెసు ప్రభుత్వం జపాను ప్రభుత్వ విధానం అవలంబించి, కుటీరపరిశ్రమలకి విద్యుచ్ఛక్తి సరఫరా చేసి, వాటిని ప్రోత్సాహపరచడం అంతగా కష్టమైనపనికాదు.

మొదటి ప్రపంచసంగ్రామం అయిపోగానే, జపాను ప్రభుత్వంకేవలం నాసిరకం సరుకు పైదేశాలకి ఎగుమతి కాకుండా చెయ్యడానికి కొన్ని నిర్బంధాలు అమలు పరచవలసిన అవసరం ఉందని గ్రహించింది. దీనికని మొట్టమొదట కొన్ని వాణిజ్యసంఘాలు ఏర్పరిచి, కొందరు పరీక్షకులిని నియమించింది. ౧౯౨౫ లో 'కోగ్యోకుమియై' అనే ఒకశాసనం శాసించింది. దీనివల్ల ఉత్పత్తిదారులూ, పారిశ్రామికులూ సంఘాలుగా ఏర్పడి వస్తువుల ఉత్పత్తీ, మూల్యమూ, నాణ్యమూ నిర్ణయించవలసిన అవసరం కలిగింది. ఇంకా ఆ శాసనం వల్ల ఒకే పరిశ్రమకి చెందిన వాళ్ళంతా ఒకే సంస్థగా ఏర్పడి, వస్తూత్పత్తి విషయంలో ఉచితమైన నియమాలు అవలంబించవలసిన అవసరం ఏర్పడింది. ఈ సంఘాల్లో సభ్యులు కానివాళ్ళు కూడా పైసంఘనియమాలకి కట్టుబడేటట్లు చూస్తారు. ఈ విధంగా వాణిజ్యం సరియైన మార్గాల్లో నడుస్తూ, ఏవిధమైన అభ్యంతరమూ లేకుండా అభివృద్ధి పొందుతూ ఉంటుంది.

ఇంకా జపాను ప్రభుత్వం కుటీరపరిశ్రమల అభివృద్ధి కోసమై అనేక పరిశోధనాలయాలు ఏర్పరిచింది. ఆ దేశంలో వీటిలో ఒకప్రధాన పరిశోధనాలయాన్ని 'సెండై' అంటారు. ఇవి ప్రభుత్వపరిశోధనాలయా లైనప్పటికీ, వీటిలో పెద్దపెద్ద నియమాలూ, నిబంధనలూ ఏమీ ఉండవు. ఇందులో పనిచేసే వాళ్లు కేవలమూ దేశాభిమాన బుద్ధితో నిత్యమూ పరిశ్రమలు అభివృద్ధిపొందాలని ప్రయత్నిస్తూ ఉంటారు. ఈపరిశోధనాలయాల్లో ప్రత్యేకంగా ముడిపదార్థాలమీద పరిశోధనలుచేసి, ప్రజాసామాన్యానికి చవకగా వస్తువులు తయారుచేసి, ఇస్తూఉంటారు. అంతటితో ఊరుకోక వస్తూత్పత్తిలో కొత్తకొత్త పంథాలు తొక్కుతూ, అన్ని దేశాలవారి అభిరుచులకీ అనుకూలంగా కూడా వస్తువులు తయారయ్యేటట్టు చూస్తూఉంటారు. ప్రదర్శనాలకిగాని, కేటలాగులు ప్రకటించడానికిగాని ఎంతెంత డబ్బు ఖర్చుపెట్టవలసివచ్చినా వెనకముందులు చూడకుండా ఖర్చుపెడుతూఉంటారు. కుటీరపరిశ్రమల్లో పనిచేసే శ్రామికు లందరూ ఈపరిశోధనాలయాల్లో సభ్యులుగా చేరి, ఏదోకొంత చందా చెల్లిస్తూ ఉంటారు.

మద్రాసుప్రభుత్వం కూడా కుటీరపరిశ్రమలు ప్రోత్సహించదలచినపుడు ఇల్లాంటి పరిశోధనాలయాలు ఏర్పరచడం చాలా ఉపయోగకరం. ప్రస్తుతం మన భారతదేశంలో ఉన్న పారిశ్రామిక విద్యావిధానం విద్యార్థుల్లో ఉత్సాహశక్తి ఉద్దీపింపచెయ్యడం లేదు. కొంచెం ఉత్సాహవంతులయిన పారిశ్రామికవిద్యార్థులు తమకు కావలసిన ముడిపదార్థాలు మొదలయినవి కొనడానికి తగిన అర్థబలంలేకపోవడం మూలాన్ని కేవలం పనివాళ్ళుగా మాత్రమే ఉండవలసివస్తోంది. అందుచేత మన పారిశ్రామిక విద్యావిధానము కేవలమూ ఎందుకూ పనికిరాకుండా పోవడమూ, మనపారిశ్రామికుల నైపుణి అభివృద్ధికాకపోవడమూ జరుగుతున్నాయి.

# మూడు మాటలు

## శ్రీ భమిడిపాటి కామేశ్వర రావు

ఆంధ్రసారస్వతంలో 'హ్యూమర్'తో సంబంధం గల రచనాభాగంగురించి వీలైనంత టూకీగా ముచ్చటించాలని నాకు ఆంగ్లసంకల్పం కలిగింది. కాని, ఇంట్లో ప్రవేశించడానికి సంకల్పించుకుంటూ ఉండగానే ద్వారబంధం ఫెడీమని వేసుకున్నట్టు, మొదట్లోనే 'హ్యూమర్' అనేమాట ఖణాయించి దారి కాసింది. 'హ్యూమర్' అనేది ఒక ఆంగ్లపదం. ఇంగ్లీషు రచనలో ఆ పదం వ్యవహరింపబడినప్పుడు ఫలితాలు అనేకంగా ఉన్నట్టు ఎరుగుదుం. వంట్లో ఉండే ఒక రసవిశేషం, వ్యక్తియొక్క ప్రత్యేకపైత్యం, ఉత్సాహం, సరసత్వం, రసజ్ఞత, సమరసభావం, స్వారస్యం—ఇంకా ఎన్నెన్నో భిన్నభిన్నమైన అర్థాలలో ఒకటో ఎక్కువో శ్రోతలమనస్సుల్లో జనింపచెయ్యాలనే ఆశయంతో ఈ శబ్దం కాలక్రమాన్ని వాడబడి ఉండిన ఉదాహరణలు ఇంగ్లీషులో రూపం దాల్చాయి. ఈ మాటకి జోడీగా, ఇంగ్లీషులో 'విట్' అనే పదం మరోటి ఉంది. దాని అర్థంకూడా పరివర్తన చెందింది. అయినా, ఈ రెండు మాటలకీ ఉండగల అర్థంయొక్క అంతరం గీత గీసి తెగ్గొట్టినట్టు ఫలానా అని కేటాయింపు చెయ్యలేకపోయినా, 'విట్' అనేది సూచించే అర్థంయొక్క ముఖ్య విశేషం ఇదీ దాని రకాలు ఇవీ, 'హ్యూమర్' అనేది సూచించే అర్థంయొక్క ప్రత్యేకప్రకృతి ఇదీ దాని రకాలు ఇవీ— అని ఆంగ్లభాషానుశాసనులు యథాశక్తి విభజన ఈ పదాలగురించి లేవదీసి సోదాహరణంగా బంధించారు. ఇంగ్లీషుభాషలో 'హ్యూమర్' అనే పదం చేస్తూండే పన్లకి సర్వసమంగా ఉండే పన్లు తెలుగుభాషలో చేసిపెట్టగల పదం ఏది, అనేది నేటికీ సమస్యే! 'విట్' అనే పదానికి తర్జుమాగా 'చమత్కారం' అనే పదం అంగీకరించవచ్చు. గాని 'హ్యూమర్' అనే పదానికి తుల్యాంధ్రపదం ఏముందో తమకి తెలియదన్నారు తెలుగులో ప్రాజ్ఞులు. అనుభవజ్ఞులు 'లేదు' అనగలిగిన సర్వజ్ఞత్వం బదులు, 'మాకు తెలియదు' అనే కించిజ్జ్ఞత్వమే తమకి ఆరోపణ చేసుకుంటారు. సరే అజ్ఞులు చాలామంది 'హ్యూమర్'కి తుల్యపదం తెలుగులో లేదనే అంటారు. ఆ మాటకొస్తే, అటువంటి పదంయొక్క అత్యంతావసరం కలిగించే లక్షణం తెలుగు జాతిలో, అథవా తెలుగు వాళ్ళ చాలామందిలో, తత్రాపి తెలుగు రచయితల్లో— మృగ్యంగా ఉండడమే అందు కారణంగావును అంటారు. మరికొందరు తమరికనచ్చినపదం ఒకటి తమచిత్తం వచ్చిన సందర్భంలో వాడేసి తమరు వాడిన ఆ పదానికి వెనకదిక్కు అయి ఉంటూ అప్పట్లో తమ ఆంతర్యంలో వేంచేసి ఉండుకుంటూన్న వ్యాపారానికి సరియైన ప్రతినిధి నిజంగా 'హ్యూమర్' అనే పదమే అని అవసరంవస్తే వాదిస్తారు. మానవులు వాడుతూండే భాషల్లో దేన్లోనైనా సరే కొన్నికొన్ని మాటలయొక్క అర్థాలకి పెరుగుదలలో తరుగుదలలో ఉంటూంటుంది కాని, స్థిరత్వం ఉండదు. ఇంగ్లీషులో అటువంటి మాటలలో 'హ్యూమర్' ఒకటి. అందుకని, తెలుగులో పూర్వమే అర్థనిర్వచనవిషయాల్లో బంధింపబడి స్థిరపడ్డ ఏ పదమూ 'హ్యూమర్'కి తుల్యంగా వాడడానికి వీలులేదు. ఒకవేళ వెనకటి తెలుగు పదం (అనగా సంస్కృతపదం అన్నమాట-) ఏదేనా 'హ్యూమర్' ప్రత్యామ్నాయిగా వాడదాం అనుకుంటే మనం అనుకున్న పదం ఏదీకూడా 'హ్యూమర్' అన్నప్పుడు ఆంగ్లాంధ్రుడిమనస్సులోకలిగినంత ప్రచలనం ఎంతమాత్రం కలిగించలేదని వెంటనే తెలిసిపోతుంది. చూడండి, 'హాస్యం, వ్యంగ్యం, ఛాళనా, తమాషా

వినోదం, ఛలోక్తి, వక్రోక్తి'— ఇల్లాంటి మాటల్లో ప్రతిదానికీ తెలుగులో స్థిరపడ్డ అన్వయం ఉండడమే కాక, వీటిల్లో ఒక్కొక్క మాటకే ఒక్కొక్క విడి ఆంగ్లపదం (—'హ్యూమర్' అనేది తప్ప—) వెంటనే స్ఫురణకి వస్తూండడంచేత, ఈ మాటల్లో ఓటి పట్టుగొచ్చి మాటెట్టి తద్వారా 'హ్యూమర్' అనే మాటవల్ల ఆంగ్లంలో గడిచే పూచీ ఈ మాటవల్ల ఆంధ్రంలో మాత్రం గడవకపోతుందా అనడం సమంజసంలా కనపడదు కాని, మళ్ళీ చిక్కేమిటంటే, ఏదో పదం అంటూ లేకపోతే అసలే ఆట కట్టిపోతుంది.

అందుకని మొదట నేను సూచించిన పదాల్లో ఉన్న 'స్వారస్యం' అనేది 'హ్యూమర్'కి తుల్యంగా, ఇన్ని మాటలూ చెప్పి, నేను, నా అజ్ఞానం చొప్పున, ఈ రచనలో వాడుకొచ్చినందుకు, క్షమించవలసిందిగా కోరుతున్నాను. అయితే, ఇప్పుడు అటువంటి మాట గురించి ఏమంత ఒరకం వచ్చిందీ, ఎంతోమంది గొప్ప పూర్వీకులకి అక్ఖర్లేకపోయిన మాటపట్టింపు నేడెందుకు అవసరమైందీ, అని ఎవరేనా అనగల్రు. అంటే, రూపం ఇదివరకే సిద్ధించి ఉందిగనక, నామంయొక్క అవసరం కలిగిందని మనం ఎంచాలి. అంతేగాని, మొదటే నామం పెట్టేసి, అక్కణ్ణించి రూపంకోసం వెతగడం—ఎవరూ హర్షించరు, కోరరు. మనమూ కోరం. పైగా, అధమం - 'కన్యాశుల్కమూ,' 'సాక్షీ' పుట్టిన తేదీలనించీ యేనా అటువంటి మాటయొక్క అవసరం మరీ ఎక్కువగా కలగనే కలిగింది అని అంతా అంగీకరిస్తారు. అదీకాక, విడివిడి మాటలు విడివిడి అర్థాలిచ్చే రకంవి ఉంటూంటేటప్పుడే పదహత్యలు చేసేవాళ్లున్నారు. అట్లా లేనప్పుడు, అడిగారూ! మాటల్ని పట్టపగలు బహిరంగంగా సభల్లోకి ఈడ్చి ఖూనీ చేస్తారు.

అప్పుడప్పుడు ఆంధ్రమహాజనులు ఈ క్రిందిమాదిరి సాభిప్రాయాలు సెలవిస్తూంటారు, గమనించండి:—

"నాటకంలో పెద్దనాటకత్వం అంటూ ఏముంటుందీ దడదడా పద్యా లుండాలి గానీ! పద్యమే రాయలేని వాళ్లు నాటకం ఎందుకో రాయడం! పద్యాల్లో నైనా ఊహా పద్యత్వం అంటూ ఏం కూర్చుంటుందీ, పణుగుల్లాంటి పదాలు తెగ దొర్లిపోవాలి, కోకిల గాత్రంతో అవి అనాలిగానీ! అందుకని మహాపండితుడుగాని పద్యం కట్టకూడదు, మంచి పీకవాడుగాని నోరెత్తకూడదు. నటుడిలో మాత్రం మహా అక్కడికి నటత్వం అంటూ ఏం అఘోరిస్తుందీ, నువ్వా నేనా అన్నట్టు ఝుమాయించి శేషువులాలకించేట్టు రేవెట్టి జంబూరా గాత్రంతో నాటకరంగం ఊగిసలాడి ఆంధ్రనాటక సభవాళ్ళ అంతరంగాల్ని డీక్కునేలాగ పాడాలిగానీ! అందుకని, గొప్పగాత్రం ఉంటే సివాయి నటుడేమిటి వాళ్ళ ఎదం నటుడూ! అందులోనూ, అధమం యాభై అరవై రాగాలు—పాటకచేరీలవాళ్ళు యద్దినట్టు కాకుండా—మజాగా విసరడం చేతకాకపోతే, రాజువేషం వంటిది పుగ్రైపోతే ఒప్పుతుంది టండీ, ఎంత చమ్కీ వేసుకున్నానూ!"—అని, ఇల్లా ఏమాటని ఏ అర్థంలోనైనా సరే వాడుతూ ఆడ్డంగానూ విలోమంగానూ వాదించేవాళ్ళకి భాషలోని మాటలసంఖ్య ఎక్కువ అవుతూన్న కొద్ది ఎక్కువ వీలు అనేమాట నిజమే. ఎంచేతంటే మాటకలయికల సంఖ్య ఎక్కువ అవుతుంది గనక. కాని, అల్లాంటి వాళ్ళ వాదన్ను అంతకంటె బద్ధకస్తులుగాని నమ్మనూ నమ్మరు, ఉపేక్షాపరు లంటే భయంచొప్పున మాటలు పెరక్కుండా ఆగనూ ఆగవు. ఎందుకు చెప్పొచ్చానంటే, ఆంధ్రంలో ఫార్సు, ప్రహసనం, హాస్యం—ముఖ్యంగా ఈ మూడు మాటల్నీ జనం ప్రయోగించేటప్పుడు వాళ్ళ ఆంతర్యం అన్వయించుగోడానికి శ్రోతలకి ఉండగల పూర్వ జ్ఞానంగాని, ఇంగిత జ్ఞానంగాని పనికిరావు. ఎవరిమాటో కాదు నా మాటే చెబుతాను. నన్ను ఈ క్రింది సందర్భాలలో ఈ క్రింది మాటలతో హెచ్చరించిన వాళ్లున్నారు! నేను 'గాన ప్రశంస' అనే రచన ప్రకటించగానే—"మీరు ఈ మధ్య గానంమీద రాసిన ఫార్సు వెనకటి ఫార్సుల్లాగ లేదేం! పోనీ మీరు ఏవేనా ముఖ్యవిషయాలమీద రాయకూడదూ సంఘసమస్యలూ మానవవ్యాపారాలూ రానిచ్చి!" అని ఒక ఇష్టుడు అన్నాడు. ఎక్కడేనా నేను ఫలానా విషయం గురించి మాట్లాడడం అని

ప్రకటింపబడ్డనాడు, 'ఈవేళ మీ ప్రహసనం ఎన్ని గంటలకండీ?' అని అడుగుతారు. ఎవరేనా నేరచిం చిన ఆటపై ఊళ్లో ఎక్కడో ఆడబోతున్నారని తెలుసుగుని, "ఈ వేళ ఆ ఊళ్లో మీ హాస్యంటగా, మీ రింకా ఇక్కడే ఉన్నారేం?" అంటారు. అటువంటప్పుడు అవతలవారికి కోపం రాని సమాధానం చెప్పడానికి నేను ఉక్కిరి బిక్కిరి అయిపోవలిసి వస్తూంటుంది. ఇది ఇంతవరకు నయమే. మరో రకం ఉన్నారు. వ్యక్తి దూషణా, జాతిదూషణా, అశ్లీలాలూ, ముతగ సామెతలూ, భార్యాభర్తల వరసతప్ప తక్కిన ప్రతీ ఇతర వరసాగల స్త్రీ పురుషుల అక్రమ ప్రేమా—ఇటువంటి వయినాలు గలిగిన రచనలే మానవులకి తమాషాగా ఉండి నవ్వుతెప్పించే వని నమ్మేరకం. ఈ రకంలో ఉండే ఆస్వాదకులు ఊరుకోరు. తమాషాగాఉండి నవ్వు వచ్చే ప్రతీ సందర్భమూ ఇటువంటిదే అనుకుంటారు, అంటారు, కావలిస్తే వాదిస్తారు. అటువంటి వాళ్ళ ధర్మమా అని, మానవత్వం సార్థకపరచగలిగి సభ్యమై ఉండే నవ్వు జనింపచెయ్యడానికీ వ్యాపింపచెయ్యడానికీ ఉండవలసిన గుణం గలిగి తిక్కన నాటినించీ ఆంధ్రంలో పుట్టి పెరుగుతూన్న స్వారస్య రచనకి ఎంత ప్రతికూల ప్రచారం జరుగుతోందో చూస్తే చాలా కష్టంతోస్తుంది. ముందు ఫార్సు, ప్రహసనం, హాస్యం-ఈ మూడు మాటల్నీ పరామర్శించి, నవ్వుదగ్గిర కొంచెం నిదానించి, తరవాత చమత్కార స్వారస్యాల ఆవరణలు కొంచెం చూద్దాం.

'ఫార్సు' సంగతి! శాంగ్లికంపెనీ అనేది ఆంధ్ర దేశంలో తిరిగి ప్రప్రథమంలో నాటకాలు ఆడుతూ వచ్చిన నాటినించీ ఫార్సు అనే ఇంగ్లీషు ముక్క ఆంధ్రంలో ప్రచారం అయింది. ఏదేనా అయిదంకాల నాటకం ఉంటే ప్రతీ రెండు వరస అంకాలమధ్యా వాళ్ళు అసలు ఆటతో ఏమీ సంబంధం లేని మరో తేలిక ఆట ఆడి జనాన్ని ఆనందింప చేసేవాళ్ళు, ఆ సెట్టువాళ్ళే వేరవడంవల్ల ఆలస్యాలు కాకుండా కాలం కలిసొచ్చేది కూడానూ. అసలు నాటకం ఎంత గంభీరంగా దేవదానవుల సంగతులతో కూడి వుండేదో అంత తేలిగ్గా మానవాధముల వ్యాపారాలతో కూడి అంకాలమధ్య ఈ రంగాలుండేవి. వాటిని 'మధ్యరంగాలు' అనడం ఎక్కువ సమంజసం అయినా, అవి కొండొకచో బండజనాన్ని కూడా అశ్లీలంగా ఉండే ఆటపాటలవల్ల చలింపజేసే తాఖతులో ఉండడంవల్ల గావును వాటిని 'ఫార్సు'లు అన్నారు, అంతేగాని ఆంగ్లంలో ఫార్సు అనేది ఎటువంటి ఆటకివాడతారో తెలిసికాదు. అక్కణ్ణించి ఏదేనా పెద్ద వ్యాపారం జరిగే సందర్భంలో వచ్చిన ఏ యితర సంఘటన అయినా సరే, దాన్ని 'ఫార్సు' అంటోచ్చారు. రెండంకాలమధ్యజరిగే నృత్యాన్నీ ఈలపాటనీ, కుస్తీనీ, మ్యాజిక్‌నీ, మెస్మెరిజమ్‌నీ కూడా 'ఫార్సు' అనేవారు. గొప్పవాణ్ణి ఎవణ్ణేనా అనుకరించడానికి ఎవడేనా రంగం మీదికివస్తే అది ఆ గొప్పవాడి 'ఫార్సు' అనేవారు. అని, ఆ సమయంలో నవ్వాలిగావు ననుకుని, నవ్వేవారు. తరవాత, ఒక పెద్దనాటకంలో కలిపి ఆడబడే చిన్న ఆట ప్రతీదీ కూడా ఫార్సు అనే పేరు తెచ్చుకుంది. అందువల్లే, పీష్వానారాయణరావు వధింపబడే ఆటని "పీష్వానారాయణరావు ఫార్సు" అనేవారు. ఇంకా, కొన్నికొన్ని నాటక ప్రదర్శనాల సందర్భంలో అసలు నాటకంలో ఏ పాత్రా ధరించనవాళ్ళు మధ్య మధ్య ఇద్దరేసిచొప్పున వచ్చి, అప్పట్లో తమకి నోటికి వచ్చిన ముక్కలు ప్రయోగించి అంతకు పూర్వం లిఖిత రూపంలో గాని మరియే యితర రూపంలో గాని లేని "ఫార్సు"లు వేస్తూండేవారు. జనప్రియంగానూ జనరంజకంగానూ ఉండే తేలికమార్గం ఇటువంటిది ఒకటి ఉందీ అని రచయితలు గ్రహించి గావును, తమరు రాసింది ఘాటుగానూ లోతుగానూ పరువుగానూ బరువుగానూ ఉండదని తమ కే సందేహం తోచినప్పుడున్నూ దానివల్ల తమకి జరగవలిసినపని ఏదో ఉన్నప్పుడున్నూ దానికి 'ఫార్సు' అని పేరెట్టి, ఆ పేరట కుళ్ళిపోయిన సంఘంయొక్క దురాచారాలకి ఉద్వాసన చెప్పదల్చుగున్నట్టు శపథంచేసి, అవి అసలే దురాచారాలైన కారణంచేత వాటికంటె కొన్ని వీసాలు అన్యాయంగా ఉండే మాటల్తో వ్యక్తిదూషణా వృత్తిదూషణా సంస్థాదూషణా మొదలెట్టి, పాత్రలు అనిపించుగోడానికి

తగ్గ మానవత్వంలేని కర్రముక్క బొమ్మల్ని తయారు చేసి, తమ అక్కసు తప్ప ఇతరకథ ఏమీ అందులో మిళితం చెయ్యలేక, తోలుబొమ్మలవాడు తనకి చందా వెయ్యని వూరువాళ్ళమీద మరో ఊరెళ్ళి తను ఆడేటప్పుడు బొమ్మనికట్టి ఏకినట్టు వ్యవహరిస్తూండేవారు. ఫార్సుల్లో వృత్తాంతం ఏమిటీ అంటే, సప్తవ్యసనాలూ కూడా మంచివి కావనిన్నీ, ప్రతీకొత్త సంస్థా ఆంధ్ర మహాజనానికి అపాయకరం అనిన్నీ!! అటువంటివి ఆడబడేటప్పుడు ప్రేక్షకుల్లో ఉండగల నీచుడుకూడా తనకంటె చాలా నీచుడైనవాడు అంతకంటె నీచపు వృత్తాంతం తీసుగుని దానికంటె నీచమైన మాటల్లో ఏదో రచన చెయ్యగా అంతకంటె నీచుడు రంగం మీదికి ఎవర్నో పచ్చిగా దెబ్బతీసే ఉద్దేశంతో వచ్చి తనకి ఆనందం కలిగించాడు గనక, ఆరచనకీ దాని ఆచరణకీ కూడా ఒక్కొదెబ్బని విలవకట్టేశా నను కునేవాడు. దైవకృపవల్ల, ఫార్సు రూపంలో ఉన్న రచనలు సాహిత్యకం కాకపోబట్టిగావును కాకితం మీదకి ఉన్నాయిగాని రంగమెక్కలేదు. ఈ ఫార్సు అనే ఇంగ్లీషుమాట ఉపయోగించకుండా 'ప్రహసనం' అనే సంస్కృతపుమాట పేరట కొన్ని ఆంధ్రరచనలు క్రీ.శ. 1881 సం॥ నించీ బయల్దేరాయి. కందుకూరి వీరేశలింగాన్ని హేళనచేసిన 'నవనాగరిక నాటకము' అనే మొదటి తెలుగు ప్రహసనము పుట్టిన సంవత్సరం అది. సంస్కృతభాషలో ఇప్పటికీమిగిలి కొన్ని ప్రహసనాలున్నాయి అని చెప్పుగోడం చాలు. వాటిపేర్లు ఫలానా అని అనుకోడం కూడా సంస్కృతానికి తలవంపే. ఏమంటే, అంతకంటె అసభ్యత్వానికి ఉదాహరణలు మరి ఉండవ్. సంస్కృత నాటకాల్లో పాత్రలుగా వచ్చే విదూషకుళ్ళ కొన్నికొన్ని చమత్కారాలూ, మృచ్ఛకటికలో శకారుణ్ణి మినహాయిస్తే నవ్వుపుట్టించడం గురించి ఆలోచించేటప్పుడు అట్టే చెప్పుగోతగ్గది సంస్కృతంలో కనిపించదు. సంస్కృతలక్షణగ్రంథాలు రూపకాల్లో ప్రహసనం ఒకటే అని ఒప్పుగుని, అది ఎన్నిరకాల నీచత్వంతో ఉంటే, బాగుంటుందో బోధించాయి. ఆ మీదట, ఎవైనా సరే సంభావణలు కలిగి ఉండి లక్షణప్రకారం 'నాటకం' అనేటంత గొప్ప నామధేయం ధరించడానికి నోచుకోని ప్రతీ రచనా తెలుగులో గత్యంతరంలేక గావును ప్రహసనం అనే పేరు పొందుతోచ్చింది. కాని, పాపం, ఆంధ్రంలో ఆదిని ఆవిర్భవించిన ప్రహసనాలు సంస్కృత ప్రహసన నిర్వచనప్రకారం ఉండతగినంత నీచత్వంతో లేకపోయినా, చదువుకునే నిమిత్తం ప్రకటింపబడ్డవే కాని, సభాముఖాన్ని ఆడబడే నిమిత్తం కాదు. పద్యరచనలాంటి మహారచన చేసే రచయితకి పరవ్యక్తిమీద ఆగ్రహం వచ్చే సందర్భం రాగానే, అతడు ఆ పరవ్యక్తిమీద కసి తీర్చుగోడానికి ఏనియమాలూ లేనిదిన్నీ సత్వరంగా గిలకెయ్యడానికి వీలైనదిన్నీ జనంలో పాకే స్వభావం గలది గనక ఉద్దేశించిన యాగీ జరిపిపెట్టేదిన్నీ అయిన ప్రహసనం రచించి, నేలబారు జువ్వలాగ వదిలేవాడు. అవతల పరవ్యక్తికూడా రచయిత అయి ఉండడం తటస్థిస్తే అతను మొదటి రచయితమీద మరో ప్రహసనం (అనగా, మొదటి రచయితయొక్క జీవితంలో ఉండగల లోటుబాట్లు వ్యంగ్యంగా పలికే మాటలపోగు) ఈడ్చిరాసి ప్రతిముఖదిశలో పంపించేవాడు. అక్కణ్ణించి 'క్రమం' ఏర్పాటై అనంతంగా సాగేది. ఇటువంటి రచనల నిమిత్తం ప్రజ్ఞా, భాషా, కాలమూ, కాగితమూ ఖర్చుచెయ్యడంలో ఆంధ్రదేశం మొత్తానికి—కనుక్కోవాలి, ఇండియా మొత్తానికేమో రాజమండ్రీయే అగ్రతాంబూలం కొట్టేసిందని చెప్పడానికి, సగర్వంగా భయపడుతున్నాను. కొన్నికొన్ని అటువంటి రచనలు రచనాకాలంలో లక్ష్యంగా ఉద్దేశింపబడ్డ వ్యక్తులక్షోభా, మతిచాంచల్యమూ, ఒక్కొక్కప్పుడు మరణమూకూడా తెచ్చిపెట్టేటంత తీవ్రతతో వెలిగినా, కాలక్రమంలో ఆయావ్యక్తుల పూర్వచరిత్రలు ఆయావ్యక్తులతో మాసిపోడంవల్ల అవి ఏ సాధారణ చదువరికీ బోధపడడంగాని, ఏ సార్థక నటుణ్ణీ ఆకర్షించడం గాని మానేశాయి.

అవి ప్రయత్నించి చదివినా తెలియక, బలిమిని ఆడినా మాట దక్కదు. కాలం జరగగా, భాషా ఛందస్సూ వ్యాకరణమూ అలంకారమూ కావ్యరూపక

లక్షణాలూ సిగ్గుభిడియాలూ వినయవిధేయతలూ గుణశీలాలూ ఇటువంటి వాటిల్లో ఎంతమాత్రం ప్రవేశం కూడా లేకపోడం అనేదే ప్రహసనం రాయడానికి ఉండవలిసిన ఏకలక్షణంగావును అని నమ్మే రచయితలూ ప్రకాశకులూ ఆస్వాదకులూ ఉన్నారుగావును అనుకోవలిసిన స్థితిలోకి ప్రహసన రచన వచ్చింది. ప్రహసన రచనయొక్క దశ అట్లాఉన్నా, అంత అధమప్రహసనమూ, జనాకర్షణలక్షణంగలిగి ఉండడంవల్ల, సమావేశాల సందర్భంలో అవసరంగా ఉండడమూ, సమావేశనిర్వాహకులు అది అయ్యేవరకూ అడ్డమైనవాళ్ళనీ బతిమాలుకోవలసిరావడమూ నేటివరకూ తప్పిపోలేదు. సభాప్రణాళికల్లోకూడా వేర్వేరుగా కడం మహావిషయాలన్నీ సకర్తృకంగా ఎల్లానో అల్లా ఇరుక్కుంటాయి. చివరవిషయం 'ప్రహసనాలు' అని ఉంటుంది. ఏ ప్రహసనం పేరూ ఉండదు. ఒకవేళ ఉన్నా అది రాయడం అనే పాపం కట్టుకున్నవాడిపేరు చచ్చినా ఉండదు, బతికున్నా ఉండదు. కొన్నిచోట్ల కనుక్కుంటే, "అనుకుంటూండగానే పని తొందరలో మహాగొప్పపొరపాటు జరిగిపోయిందండీ కార్యక్రమం అచ్చుకొట్టించ మని ఓ కుర్రాడిచేతి కిచ్చాం. వాడికి తెలియకపోడంవల్ల ఇల్లా వచ్చింది." అంటూ పెద్దలు కారణాలు చెబుతూ, 'ఏం న్యాయమండీ!' అని మనం అంటే, "ఏముటో నీచపు సరుకు పోనీ అని చెప్పి మా అంతవాళ్ళం ఉద్ధరించినందుకు మా కేదేనా లంచం ఇవ్వడంమాట లేనేలేదు సరిగదా, మేం ఏదో నేరం చేసినట్టు మామీద పడ్డావేమిటి?" అనుకుంటూన్నట్టు ఘుసా అయిపోతారు. వారికి నేనేమీ దురుద్దేశం ఆరోపించను. ప్రహసనం గతి అదీ! మొదటి సంగతి; సభానిర్వాహకుల్లో చాలామందికంటె ప్రహసనం నీచం; రెండవది, ఏ ప్రహసనం ఆడబడుతుందో నిర్వాహకులకే తెలుస్తూండదుట; మూడవది, వాళ్ళకి దానిపేరు తెలిసినా ఏయే ప్రహసన నటులు ఆక్షణానికి పోగవగలరో వాళ్ళకి తెలియదుట; నాల్గవది, అదీ తెలిసినా ఆ ప్రహసన నటులు కర్త రాసిన ముక్కలు చెబుతారో లేక స్వంతంగా ఆశువుగా అప్పటి కప్పుడు అమోఘ ప్రహసనం సృష్టిచేసేసి ఆడేసేస్తారో బ్రహ్మకి తప్ప తెలియదుట! ప్రహసన ప్రయోగం విషయంలో కనిపించే సూత్రం ఏదీ అంటే అది ఆనందించి నవ్వుకోడం అనే ఘరానా విషయం ఒకటే తప్ప, దాని తక్కిన ప్రమేయా లన్నీ—దాని రీతీ దాని రాతా దాని కథా దాని కర్తా దాని తయారీ దాని నటుడూ మొదలైన వన్నీ—కొంచెం నీచమేమో అని!! లేకపోతే, చూడండి. ఒక సభయొక్క రెండున్నరగంటల కార్యక్రమంలోనూ చివర రెండుగంటలు మాత్రమే ఒక 'ప్రహసనం' కొందరొచ్చి గౌరవార్థం ఆడగా, అప్పట్లో హాజరైన రెండువేల పైచిలుకుమందిన్నీ సభ్యమైన నవ్వుతో ఆనందించి వెళ్ళిన కొంతకాలానికి ఆ సభావృత్తాంతం ప్రకటించడంలో మొదటి అరగంట కొండతోనూ నాలుగు రాయల్ పేజీలు నిండెయ్యగలిగిన నిర్వాహకవర్గంవారు, 'ప్రహసన' ప్రయోగం సంగతి అందులో ఎక్కడా రాకుండా జాగ్రత్తపడ్డారట! తరవాత ఎవరో వెళ్ళి, "ఏమండీ! మీరు ప్రకటించిన సభావృత్తాంతంలో అన్ని గంటలు ఉచితంగా జనం కోసం సార్థకంగా శ్రమపడ్డవాళ్ళస్మరణే లేదేమండీ?' అని అడగ్గా, వాళ్ళు, "ఏంజేస్తామండీ! బజారుమాటలు ఏదో నవ్వొస్తోందికదా అని చివరిదాకా కూచున్నాం కాని అందులో ఒఖ్ఖ కతనపదమేనా లేదు, పద్యంలేదు, రాగంలేదు, లవ్‌సాంగ్స్ లేవు, ఎల్లా? ఉంటే రాసి ఉందుం" అన్నారట! అదీ 'ప్రహసనం' అంటే నేటికీ తెలుగులో అభిప్రాయం!!

'ప్రహసనం' చందం ఇల్లా ఉండగా దీనికి అప్పీలుగా 'హాస్యం అనే ముక్క ఉంది. ఇంతాచేసి, హాస్యం అంటే నవ్వతగ్గది. గ్రంథస్థంగా హాస్యం గురించి ఏమిఉందీ అంటే అది శృంగారకరుణాది రసాలలో ఒకటనిన్నీ, బహుశా శృంగారంలోంచే జనించిందనిన్నీ. లేకపోతే, "పరస్పరవైరుధ్యంగల ఏ రెండు వ్యవహారాలైనా సరే ఒకే క్షణంలో యధార్థస్ఫురణ అయేలాగు ప్రకటన కావడం తటస్థించినప్పుడు ఆ రచనవల్ల ప్రేక్షకుడికి గాని శ్రోతకి గాని మనస్సులో జనించే ఫలితం 'హాస్యం' అనే రసవిశేషం" అని. కాని,

గ్రంథాల్లో ఏమిట ఉండనండి, అడ్డమైన సందర్భా ల్లోనూ అడ్డమైన ప్రయోగాలకీ ఒడిగట్టి శల్యావశిష్టమూ శవాకారమూ అయి తెలుగులో వాల్లాడిపోతూంటే మాటల్లో 'హాస్యం' అనేది ఒకమాట. నేటివరకూ హాస్యం చెప్పేవాళ్లు ఉన్నారట, వాళ్ళని బట్టి అను మానిస్తేట, కొందరి అభిప్రాయంలో 'హాస్యం' అంటే— తన గౌరవభంగంగురించి నగురూ బెగురూ లేని ఎవరో వ్యక్తి బరిమీదపడి కొంకక్రలాంటిది చేతులో ధరించి వికృతవేషం వేసుకుని వంకరజేష్టలు చేస్తూ లోగడే కొన్నికొన్ని పచ్చిమాటల్లో పొదిగిన అసందర్భపు సంగ తులు గల గోకలిపాట వాక్యాలూ వికటపు పద్యాలూ కంఠతాపట్టి వచ్చి ఎవర్నో అనుకరించో ఎత్తిపొడిచో యాగీచేసో తిట్టోలేక అశ్లీలవిషయాలుఉటంకించో లేక స్త్రీపురుషత్వాలు ధ్వనించేటట్టుగా కొకుస్వరం పలి కించో, చేసే ప్రసంగము—అనిట, శ్రోతలు, "సంతగ లెయ్యా, దుంపతెగా, నవ్ చచ్చిపోనూ" మాదిరి తిట్లతో మెచ్చుగోడానికి వీలుండేటట్టు తమఎదుట కూసి ఆడినవాడే 'హాస్యగాడు'ట. కొందరి ఊహ, 'హాస్యం' అని రాసి ఉండే రచన ఏదేనా సరే హాస్య మేట. అల్లా రాసిఉండకపోతే హాస్యం కిందికి రాదట! కొందరి ఉద్దేశంలో తమరికి బోధపడ్డది యావత్తూ 'హాస్యం'ట—గనక, అది తమరు ఆనందించి క్షమించ తగ్గదిట! తక్కినది యావత్తూ హాస్యేతరం-గనక అది తమకి తెలియకపోవడం అనే పుణ్యం చేసుగున్నందువల్ల తమరు నమస్కరించి క్షమాపణ వేడుకోతగ్గదిట! కొందరు హాస్యరచన అంటే, "మహారచన చేతకాక, ఏమీ యితరపని లేక, ఊరుకోనూలేక, ఏమీ రానివాడు అన్నీ వచ్చుననుకుని ఏమీకాని విషయం పుచ్చుగుని ఎవర్నో బాదడానికి ఏంబడితే అది వాఎవణిబడితే వాణ్ణి నవ్వించేబాపతు" అంటారు. అల్లాం హాస్యాభి నయం అంటే "రూపసౌష్టవం లేక వేషధారణం తెలియక పద్యగానం చెయ్యలేక రాగజ్ఞానం నోచు కోక మంచి పీకపెట్టిపుట్టక యాక్షన్ పస అలవ రుచుకోలేక, తగుడు నని రంగం మీదికి వికృతంగా తయారై నీచపు మాటలూ వెకిలి చేష్టలూ వెర్రి మెహాలూ ప్రయోగిస్తూ మూకని నవ్వించే వాడితాలూకు గింజు కోడం" అని, ఆంగ్లాంధ్రాలు రెండూ రెండు నేత్రాల్లాగ చూసుగునే ఒకాయన సెలవిచ్చాడట! ఒక దేవభాషా ప్రియుడు, 'నాకు మనం మాట్లేడే తెలుగు ఏదైనా సరే హాస్యమే' పొమ్మన్నాడు. గూఢ పద్య గాథ ప్రియుడైన ఒకాయన, మరోవ్యక్తి వచనరూపంలో తనకి ఒక వాక్యం వినిపించడం ప్రారంభించగానే, అందులో వృత్తాంతం ఏముందో అనే గమనింపేనా లేకుండా విసవిసా ఇకిలింపు మొదలెట్టి, 'అబ్బా, ఏమిటో అనుకున్నాను, మహా హాస్యంగా ఉందిస్మండీ!' అంటూ ఊరుకోమన్నా ఊరుకోకుండా ఇదయాడట! ఒక తెలుగాయన రేడియోదగ్గిర జరుగుతూన్న ఇటలీ భాషలోని ఉపన్యాసం వింటూ చుట్టుపక్కల జనం ఉన్నారనేనా గుష్టులేకుండా నవ్వుకి పడి, "అల్లా అగమ్యగోచరంగా మాట్లాడతాడేం, వీడి మాటలు మానిపోనూ! సుబ్బరంగానున్నూ తెలిసేటట్టుగా అహ రించడేం! దొరికిదొరికి రేడియోవాళ్లకి ఇల్లాంటివాళ్లు దొరుకుతారు!" అంటూ విచారించాడు. ఈ ఒరవడిని చూస్తే తనదికాకుండా ఉండే ప్రతీ వ్యాపారాన్నీ ఒక వేళ తనకి తెలిస్తే అందుచేతనున్నూ, సాధారణంగా తెలియకపోతే అందుచేతనున్నూ, తనికి తీసికట్టు అను కుని దాన్ని అమాంతంగా లాక్కెళ్లి 'హాస్యం' కింద జమకట్టో ఖర్చురాసో వ్యవహరించేటంత ఉన్నతంగా 'హాస్యం' గురించిన అభిరుచి కొందరిలో ఇప్పటికీ ఘనీభవించి నిల్చిపోయిఉందని మనం అనుకోవాలి. 'హాస్యం 'గురించిన గలిభీ ఇల్లా ఉండగా 'నవ్వు' అనే మహా పదార్థం ఒకటి ఉంది. నవ్వు అనేది ఒక ఫలితం అని చెప్పవలెసిన దినుసు. ఆ ఫలితం అనేక కారణాలవల్ల కలగచ్చు. ఆ కారణాలయొక్క పూర్తి పట్టీ, ఆ దినుసుయొక్క నిర్వచన వయినాలూ, దాని రకాలూ—అబ్బో, అదంతా వేరే సోది. కాని, దాని స్మరణ కొంచెం ఇక్కడ అవసరం. ఎవరికేనా శత్రు నాశనం ద్వారా ఆత్మోన్నత్యం గోచరించడంవల్ల 'అమ్మయ్య' అని పించి నవ్వు రావచ్చు. స్వంత ఉత్సాహంవల్ల స్మితంరావచ్చు. అసభ్యపు మాటలు విన్న

ప్పుడు హాస్యంతో కూడిన నవ్వు రావచ్చు. ఊళ్ళో ఉండే స్త్రీపురుషుల అక్రమప్రేమానుబంధాలగురించి, సంఘమర్యాదలకి అతీతుడైనట్టు పట్టాపుచ్చుకున్న ఒక్కొక్క వచోధురుడియొక్క బహిరంగ ప్రసంగ ధోరణి సయించనట్టు నటించి జాగ్రత్తగా వినేవాళ్ళకి నవ్వు రావచ్చు. భంగు సారా గంజా సేవించినవాడికి 'ఫుల్ స్టాప్' లేని నవ్వు రావచ్చు. హిస్టీరియా వాళ్ళకి మూడునాగ్గుల్లా ఏడుపుని స్ఫురించే నవ్వు రావచ్చు. దుఃఖంలో మతిపోయినవాడికి నవ్వు రావచ్చు. తుచ్ఛుడికి తనవిజయం రూఢే అని తోచినప్పుడు విషపునవ్వు పుట్టవచ్చు. ఉడుక్కునేవాణ్ణి చూసినప్పుడూ, వ్యర్థ కోపంలో పడ్డవాణ్ణి చూసినప్పుడూ, మిడిసిపడేవాడికి తగ్గశాస్తి అవడం చూసినప్పుడూ, ఇవతలవాళ్లకి నవ్వు రావచ్చు. ఇన్నెందుకు గనక, కేవలం కిచకిచలు పెడితే ఎవడికేనా నవ్వు రావచ్చు. ఇలా, లోకంలో, మాటలకీ సంభవాలకీ సందర్భాలకీ స్థితిగతులకీ నవ్వు జనిస్తుంది. కాని, లోకంలోని యథార్థ ప్రమేయాలవల్ల జనించే నవ్వునీ, రచనల్లోని కల్పనా వృత్తాంతాలవల్ల బయల్దేరే నవ్వునీ ఒకేమాటలో కట్టెసెయ్యకూడదు. మొదటిరకం హింసాకరం అయితే కావచ్చు. కాని, రెండవదాల్లో బుద్ధిపూర్వకంగా ఎవరేనా ఉద్దేశింపబడ్డప్పుడు గాని లేక సార్వత్రికమై ఉంటూండేదాన్ని ఎవరేనా స్వంతానికి ఆరోపణ చేసుకున్నప్పుడు కాని తప్ప హింస ఉండవలసిన అవసరంలేదు. మనం లోగడ గమనించిన ఫార్సు ప్రహసనం హాస్యం-ఇవి రచనల్లోవే గనక, అనగా కల్పనలే గనక, వీటిద్వారా హింసలేని నవ్వు కలిగించడానికి వీలులేక పోలేదు. అయితే, సర్వజనామోదం పొందడానికి నవ్వులో హింసలేకపోవడం అనే ఒకలక్షణమూ మాత్రం ఉంటే చాలదు. ఆ జనించిననవ్వు సారస్యంగానూ సమంజసంగానూ సత్యంగానూ సాధ్యంగానూ సహజంగానూ ఇష్టులతోనూ ఆప్తులతోనూ చెప్పుగుని ఆనందించుగోడానికి వీలైనదిగానూ ఉన్నప్పుడే అది వ్యాపించి సంఘవ్యాపారం అవుతుంది గాని, లేనినాడు నీచులుమాత్రం దానిని మెచ్చుకొండడమూ శిష్టులు దానిని గర్హించి అణిచివెయ్యడమూ సంభవించి అది సన్నగిల్లి అంతరించిపోతుంది. పైగా, రచన అనగానే పదరచనే కాదు, చాలా యితర రచనలు ఉండగలవ్-స్వరరచనలూ, రేఖారచనలూ, వర్ణరచనలూ, చేష్టారచనలూ, వీటిమిశ్రణాలూ మొదలైనవి. పదాలతో సంబంధంలేని వీటిల్లో అసందర్భత్వం స్ఫురింపచెయ్యగల గుణం ఉన్నప్పుడు నవ్వు పుడుతుంది. ఒక్కొక్క మాట విషయంలోనే ఇంతింత గొడవ ఉంటూంటే, లోకంలో వాటికీ రచనల్లోవాటికీ, మాటల్లో వాటికీ మాటల్తో నిమిత్తం లేని వాటికీ సభ్యమైన వాటికీ అసభ్యమైనవాటికీ- ఎల్లాగైతేం నవ్వువస్తోందికదా అని పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రంబనాయించి, ప్రతిమాటకీ ప్రతీఅర్థంలాగి, సర్వాన్నీ కళాయి చేసి, అన్నింటికీ ఒకేరకం నీచత్వం అంటగట్టి, వీటిల్లో ఏ రకం తన యెదట అవుతున్నా సరే, "ఓరి భలే తమాషా ఫార్సు", "చాలా ఇదైన ప్రహసనం", "మాంచి ఘట్టయిన హాస్యం", "గొప్పవిట్టీ", "ఎంతో ఖులాసా లవ్-కామిక్"— అంటూ సుస్వాదానంచేసే ఆస్వాదకులు నేటివరకూ ఆంధ్ర మహాజనుల్లో ఉన్నారన్న విషయం గుర్తించి, ఎవరేనా నవ్వుకుంటే ఎంత లాభమో ఏడ్చుకున్నా అంతే లాభంగదా !!!

# నాట్య కళ

శ్రీ తాడిపత్రి రాఘవాచార్యులు

ఆంధ్రశిల్పి ప్రారంభించే సందర్భంలో శ్రీ రాఘవాచార్యులుగారిని మా ఆంధ్రశిల్పికి నాట్యకళమీద ఒకవ్యాసం వ్రాసి పంపవలసిందని అడిగాము. మాప్రార్థన మన్నించి వెంటనే వారీ వ్యాసం పంపించారు. అయితే వారు సజీవులై ఉండగా ఆంధ్రశిల్పికి ఈ వ్యాసం ప్రకటించే భాగ్యంలేకపోయింది. ఈ వ్యాసంలో నాట్యకళ విషయంలో శ్రీ రాఘవాచార్యులుగారి ఆత్మ ఎంత ఆవేదన పడిందీ వ్యక్త మౌతుంది.—సంపాదకులు.

పాటా, పద్యమూ, వచనమూ నాట్యకళని ఇనుమడింపజెయ్యడానికే ఉద్దేశింపబడ్డాయి; గాని, నాట్యస్థానంఆక్రమించడంకోసం కాదు. శబ్దాడంబరంసామాన్యంగా అనుచితమే. అందులోనూ, నాట్యరంగంమీద దాని అనౌచిత్యం మరింత స్పష్టపడితీరుతుంది. సాధ్యమైనంత స్వల్పపదజాలంతో, భావం స్ఫురింపజెయ్యగల శక్తే నిజమైన నాట్యసామర్థ్యానికి చిహ్నం. అంతేకాదు; చక్కని విజ్ఞతకి గూడా అదే లక్షణం. నేనీ విషయాలు వ్రాస్తూఉంటే ప్రేక్షకుల మనస్తత్వాలు ప్రత్యక్షంగా గోచరిస్తూనే ఉన్నాయి. అయినా అత్యవసరమైతేనే తప్ప పదజాలం యవనికాంతరంలోనే బంధించి ఉంచాలని నా అభిప్రాయము. కథాకలి, తోలుబొమ్మలు మొదలైనవి దీనికి మంచి ఉదాహరణాలు. విజ్ఞానవంతమూ, స్వాతంత్ర్యపిపాసువూ అయిన హృదయం, సారళ్యమూ, విస్పష్టతా ఆకాంక్షిస్తుంది. శృంఖలాబద్ధములైన అల్పహృదయాలు కేవలం వాగాడంబరంతోనూ, డాబుసరివర్ణనలతోనూ, ఆనందిస్తాయి. అసలు నిజమైన నటుణ్ణి పదాలూ, సమాసాలూ బాధించనే లేవు.



పదాడంబరంతో కూడిన నటన—ఒక ఆంగ్ల మహాకవి అన్నట్లు కేవలం "Words" "Words" "Words" గా మారిపోతుంది! నాట్యానికి పాటలూ పద్యాలూ చాలా ప్రబలశత్రువులు. అయితే నేను నాటకాల్లోనించి పాటలూ, పద్యాలూ తరిమివెయ్యాలనే వాణ్ణి కాను. సంగీతానికి జీవితంలోలాగ నాట్యరంగంలో కూడా ఒక స్థానం ఉంది. దాన్ని అతిక్రమిస్తే సంగీతం నాట్యరంగం మీద అసత్యమూ అసహజమూ అయి, నిజమైన నాట్యకళని నిర్జీవం చేసి పారవేస్తుంది.

నేటికాలపు దాక్షిణాత్యనాటకరంగం మీద పదాడంబరమూ, సంగీతమూ, కలిసి, నాట్యకళని దూరంగా గెంటివేశాయి. ఈపరిస్థితుల్లో నటుడు నానావస్థలూ పడవలసివస్తోంది. నాటకకర్త వ్రాసిన పణుగుల్లాంటి పదాలూ, వర్ణనలూ కలిసి నటుడికి ఊపిరి ఆడనియ్యడం లేదు. పాపం నాటకకర్తకి తన పదగుంభన పాండిత్యం అంతా ఒక్కసారిగా ప్రదర్శించాలని ఉబలాటంగా ఉంటుంది. ఆపరిస్థితుల్లో నటుడు అర్థకుసిగా అర్థంచేసుకున్న పదజాలం అంతా సభ్యులమీద వడగళ్ళవాన కురిపిస్తూ ఉంటాడు. ఇంక హాల్లో కూర్చున్న సుప్రసిద్ధ సహృదయశేఖరులందరికీ (అందులోనూ మదరాసు, బెంగుళూరు పౌరులకి) దొర్లించిన సమాసం ప్రతీదీ కళే! ఆ కూర్చున్న సభ్యుల్లో నూటికి ఒక్కడూ కూడా భాషా, అభినయమూ, ముఖవైరీ, భావం సరిగ్గా చిత్రిస్తున్నాయో? లేవా? అని ఆలోచించడు. నటుడు కృత్రిమంగా, అభినయిస్తూ, డాంబికంగా పదాలు ఉచ్చరిస్తూంటే చాలు! అంతే! ఉదాహరణకి శివాజీ, కబీరు, రామదాసు పాత్రల అభినయపద్ధతి పరిశీలిద్దాము. శివాజీ మహమ్మదీయుల్ని జయించి, విఖ్యాతమైన మహారాష్ట్ర సామ్రాజ్యం నిర్మించిన వ్యక్తి. అందుచేత మనప్రేక్షకులకి శివాజీ పాత్రధారి, మంచి జబరదస్తీగా ఉన్న విగ్రహమూ, మంచి పొడుగుపాటి గరుడముక్కూ ఉన్నవాడై ఉండి, ప్రతీవాణ్ణీ తినేసేటట్లు చూస్తూ, హాలు ఎగిరిపోయేటట్లు కేకలు వేస్తూ, బుజాలు ఎగరవేసుకుంటూ నడుస్తూ ఉండాలి. పైగా మహమ్మదీయుల్ని న్యూనతపరుస్తూ దేశభక్తిఉద్రేకింపజేసే పద్యాలు శరపరంపరగా సభ్యుల మీద గుప్పివేస్తూ ఉండాలి. శివాజీ ఈ నియమాలకి లోబడి ఉంటే చాలు! అంతే! సూక్ష్మమైన శివాజీ మానసికప్రవృత్తి గాని, మానసికభావోద్రేకాల మీద, అతనికి ఉన్న అధికారం గాని, మనోజ్ఞమైన అతని వ్యక్తిత్వం గాని, అద్వితీయమైన అతని మాతృభక్తీ, గురుభక్తీ గాని ఎవరికీ అక్కరలేదు.

ఇంక కబీరుసంగతి చూద్దాము. కబీరు రామభక్తుడని ప్రసిద్ధి. అందుచేత, కబీరు అస్తమానమూ శ్రీ రామమహాత్మ్యాన్ని, స్వర్గలోకపు పావిత్ర్యాన్నీగురించి, (ఆలోకానికి మనం వెడతామో వెళ్లమో పరమేశ్వరు

డికే తెలియాలి!) గానం చేస్తూ ఉండాలి. అంతేగాదు. అతడు సంప్రదాయసిద్ధ మైన కంటకావృత జీవనపథాల్లో తచ్చాడుతూ ఉండాలి. ప్రతీ అడుగూ తూచితూచి వేసుగుంటూ, యంత్రంలాగ నడుస్తూఉండాలి. అంతేగాని, కబీరుకి దైవంమీదా జీవితం మీదాః ఉన్న నమ్మిక గాని, ఆవిషయాల్లో అతనికి ఉన్న అభిజ్ఞత గాని, వర్ణవ్యవస్థ మీదా మూఢాచారాలమీదా అతను లేవదీసిన గాలిదుమారం గాని, భక్త్యావేశంలో అతనికి కలిగే తన్మయత గాని ఎవరికీ అక్కరలేదు. ఏ నటుడైనా ఒకవేళ, వర్ణవ్యవస్థ నిర్ధూమధామం చేసిన, ఆ నిజమైన కబీరుని, అభినయిస్తే, బహుశః అది మన సభ్యు లెవరూ హర్షించ రనుకుంటాను. వాళ్లు ఎంతసేపూ వెనక చెప్పిన కబీరుని ఆకాశానికి ఎత్తివేస్తూ ఉంటారు. ఒక్కొక్కప్పుడు నా సనాతన మిత్రులు కొందరు వర్ణవ్యవస్థితి ఛిన్నాభిన్నం చేసిన కబీరుని అతిగా స్తోత్రం చేస్తూంటే నాలో నేను నవ్వుకుంటూ ఉండేవాణ్ణి!

ఇంక రామదాసు సంగతి చూద్దాము. మన ప్రేక్షకులికి రామదాసంటే కొంచెం చిన్న సైజు కబీరన్నమాట! మన సంప్రదాయాన్ని బట్టి రామదాసు తన భక్తిభావం ప్రకటించడానికి ఒళ్లంతా దట్టంగా పంగనామాలు పెట్టుగోవాలి! అతని శరీరంనిండా రోమాభివృద్ధి కనబడుతూ ఉండాలి. దాన్నిబట్టి అతని రోమకూపాలు కూడా భక్తిభావంతో భగవంతుడి వైపు పెరుగుతున్నా యని మనం అనుకోవాలన్నమాట. అదీగాక, అతను బాగా పాడుతూ నృత్యం చేస్తూ ఉండాలి. అసలు రామదాసు పాడిన కీర్తనలు ఏమైనా పట్టుగుని అవి పాడుతూ నృత్యం చేస్తూంటే మరీమంచిది. దీని కంతకీ కిరీటప్రాయంగా అతను జైలు సీనులో పిచ్చివాడిలాగ చేతులు తిప్పుగుంటూ, జుట్టు ఊడబెరుక్కుంటూ ఉండాలి. కళ్లల్లోకి మరమేకులు తిప్పుతూన్నట్టుగా కనుగుడ్లు తిప్పివేస్తూఉండాలి. ఇలాంటి వికారా లన్నీ చేస్తే మనకి రామదాసు అవుతాడు. ఇలాంటి వాళ్లని మన ప్రేక్షకు లంతా 'అభినవరామదాస' బిరుదంతో గౌరవించి ఆకాశానికి ఎత్తివేస్తూ ఉంటారు.

సంసారపక్షంగా ఉంటూన్న గోపన్న రామదాసుగా పరిణతిచెందడం గాని, క్రమికమైన ఆ పరిణామం గాని చూపిస్తే మనప్రేక్షకులు పెదిమలు విరుస్తారు. అతను స్వాతంత్ర్యమూః శరీరమూ రామార్పణం చేస్తూన్నప్పుడు అనుభవించిన యాతనలు కూడా మనసభ్యుల్ని ఆకర్షించవు. రామదాసుపాత్ర అభినయించడం చాలా కష్టం. అతను తన సర్వస్వమూ సమర్పించడానికి సంసిద్ధుడే కాని అతనికి 'సాంప్రదాయికమైన పూజలవల్ల గట్టి ఫలితాలు కలుగుతాయి. అనే మూఢనమ్మకం ఒకటీ, పరమేశ్వరుడు మానవమాత్రులమీద తనక్రోధం వెళ్లగక్కుతా డనే పిచ్చినమ్మకం ఒకటీ ఏవో

పెద్ద బరువుల్లాగ బాధిస్తూ ఉంటాయి. అందుకని అతను రక్త మాంసపూరిత మైన పరమేశ్వరుడి మూర్తిని సందర్శించా లనే తహతహతో ఒక శిశువులాగ మొర పెట్టుకుంటూ ఉంటాడు. రామదాసు ఒక పరిపూర్ణుడైన భక్తుడు కాడు. కబీరు అతన్ని భక్తిమార్గంలో ప్రవేశపెట్టాడు. అప్పణ్ణించీ అతను హృదయ విదారకాలయిన సంశయాలతో బాధపడుతూ, పడుతూ లేస్తూ నడుస్తూఉంటాడు. అసలైన రామదాసు మనప్రేక్షకులికి ఒక విదేశీయ వ్యక్తిలాగ కనిపిస్తాడు.

అంటే మన శివాజీలూ, కబీరులూ, రామదాసులూ ఇంకా మరికొందరు వీరులూ మన స్తోత్రపాత్రాలకి గురికావడానికి కారణాలు వాళ్లు భాష స్పష్టంగానూ, గట్టిగానూ ఉచ్చరించడమూ, ఔచిత్యం సంగతి ఏమీ చూడకుండా ఏవో అనవసర మైన సామాన్యాభినయాలు చేస్తూఉండడమూ మాత్రమే.

నేటి మన ఆంధ్ర కర్ణాటక తమిళ నాట్యరంగాల్లో పదాలూ, పద్యాలూ, పాటలూ కొన్ని పూర్వాభినయాలతో కలిసి నాట్యకళ కింద చెలామణీ అయిపోతున్నాయి. ఒట్టి పదాడంబరమూ, సంగీతమూ మనరంగస్థలాల్ని ముంచెత్తివేస్తున్నాయి. మననాటకాలు మెల్లిమెల్లిగా కేవలం వివిధ వినోద ప్రదర్శనాలు (Veriety entertainments) గా మారిపోతున్నాయి. అల్లాంటి పరిస్థితుల్లో నటులు ప్రేక్షకులు ఏమి పాడ మంటే అది పాడి, వాళ్లు ఏది చెయ్య మంటే అది చేసి తీరవలసిన పరిస్థితు లేర్పడుతున్నాయి. మన దాక్షిణాత్య రంగస్థలాల మీద జరిగే ప్రదర్శనాలు నాటకాలు అనడం కేవలం హాస్యాస్పదం! ఏదన్నా ఒక నవల సంభాషణలరూపంలో రాస్తే అది నాటకం అయిపోతుంది! అయిదారుగురు భాగవతారులు కలిసి చేసిన 'కాలక్షేపం' రూపకప్రదర్శనంగా చెల్లుబడి అయిపోతోంది. ఇంక నాట్యకళావిమర్శకు లనబడే పెద్దలు కొంతమంది ఇల్లాంటి ప్రదర్శనాల్నీ, నాటకాల్నీ బాగా ప్రోత్సహిస్తున్నారు కూడాను!

నాట్యకళ దేశీయుల్లో ప్రబోధం కలిగించి వారిని ఉద్బోధించుగాక! ఆ జగన్నాటక సూత్రధారుడు అల్లాంటి ప్రయత్నాలకి సాఫల్యం చేకూర్చుగాక!

---

# గ్రంథస్వీకృతి

౧. "నా జీవిత యాత్ర":

ప్రథమ ఖండము

ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు.

వెల రూ. ౩.

'శిల్పి' ప్రచురణలు,

౧౦, నరసింగపురం వీధి, మౌంటు రోడ్, మద్రాసు.

౨. Cochin Murals :

శ్రీ వి. ఆర్. చిత్రా : టి. యన్. శ్రీనివాసన్ గార్లు.

వెల రూ. ౧౦౦.

౩. Chitramala :

వెల రూ. ౩-౮-౦.

౪. Enchanting Himalayas :

వెల రూ. ౧౦.

౫. Furniture Designs :

వెల రూ. ౧౦.

(౩–౫) శ్రీ వి. ఆర్. చిత్రాగారు
'శిల్పి' ప్రచురణలు,
౧౦, నరసింగపురం వీధి,
మౌంటురోడ్,
మద్రాసు.

౬. మీనాంబిక.

శ్రీ పి. గణపతి శాస్త్రిగారు,

ప్రకాశకులు : రాతు బుక్ డిపో, రాజమహేంద్రవరము.

౭. "కళాతరంగిణి":

శ్రీ రామాచార్యులుగారు,

నర్తనశాల, మద్రాసు

౮. 'ఆంధ్రజాతీయగీతం':
'ఆంధ్రశ్రీ':
'దేశం':
'ఉషాసుందరి':

(౮) శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారు
పైడిపాటి ఆఫీసు, బెజవాడ.

౯. 'బుద్ధ దయామాత':

శ్రీ సుశర్మ,

ఆర్. యస్. గార్డెన్సు,

తిరుపతి, చిత్తూరు జిల్లా.

# బలహీనత

## జయించగలిగాము

### మెక్లిక్ శంఖారావము

మెక్లిక్ మాంసకృత్ ఆహారము: పెద్దల ఉపయోగార్థమై 'బి' విటమిన్‌తోనూ, నికోటానిక్ తోనూ, మేళవించి తయారుచేయబడినది. ఇది జీర్ణకోశంబలపరచి, అజీర్ణమును రూపుమాపును.

మెక్లిక్ బాలల ఆహారము. ఇది పిల్లలకు జీర్ణశక్తిని అభివృద్ధిచేయును.

అన్ని విటమినులు కలిసిన మెక్లిక్ మాత్రలు.

ఇవి శరీరంలో విటమినుల లోపమును సవరించి బలం చేకూర్చును.

వివరాలు:

**ది మెక్లిక్ న్యూట్రిమెంటు**

**అండ్ ఫార్మాటికల్ లిమిటెడ్**

| | |
|---|---|
| ఫాక్టరీ: | ప్రధాన కార్యాలయము, |
| తిరువల్లూరు | 86–A, ఆర్మీనియన్ వీధి, |
| యమ్, యస్. యమ్. రైల్వే | జి. టి. మద్రాసు. |


Printed at the B. N. K. Press Q. H. No. M. S. 100/B for T. P. No. E/46-8-46

శిల్పి ప్రచురణలు:

# 'నా జీవిత యాత్ర'

ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు

బాల్యం మొదలు పంచాశద్వర్షాలవరకూ గడిచిన మహోజ్జ్వల జీవిత గాథ.

ప్రథమ ఖండము

వెల రూ. ౩/—

౧౯౪౬ ఆగస్టు ౨౩వ తేదీనాడు శ్రీ ఆంధ్రకేసరి జన్మదినోత్సవ సందర్భంలో వెలువడింది.

## 'ఆంధ్ర శిల్పి'

ఆంధ్ర సాహిత్యానికీ, లలిత కళలకీ, సంస్కృతికీ దోహదమిచ్చే సచిత్ర మాస పత్రిక

సంపాదకులు:

వి. ఆర్. చిత్రా

పి. గణపతి శాస్త్రి



రాబోవు

## 'శిల్పి' ప్రచురణలు

ఆంధ్రకేసరి

శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు

రచించిన

౧. 'నా జీవిత యాత్ర'— ద్వితీయ ఖండము
౨. యోగసూత్ర సిద్ధాంతము
౩. ఈశావాస్యోపనిషత్తు
౪. ప్రశ్నోపనిషత్తు
౫. కఠోపనిషత్తు
౬. భగవద్గీతా భాష్యము

---

వివరాలకు:— మేనేజరు:

'ఆంధ్ర శిల్పి'

౧౦, నరసింగపురం వీధి,

మౌంటు రోడ్, మద్రాసు.

# ఆంధ్రశిల్పి



వ్యయ : భాద్రపదము ౧-౨

౧౯౪౬ : సెప్టెంబరు అణా

# ఆంధ్రశిల్పి

## సచిత్ర మాస సంచిక

సంపాదకులు :

వి. ఆర్. చిత్రా: పి. గణపతిశాస్త్రి

౧౦, నరసింగపురం వీధి,

మౌంట్ రోడ్, మద్రాసు.

# విషయానుక్రమణిక


చిత్రవివరణము : శ్రీ దండపాణిగారు ...

సమీక్షలు : సంపాదకులు ...

నవ్యశక్తి : శ్రీ కృష్ణశాస్త్రిగారు ...

సాగరగానము : శ్రీ త్రిపురారిభట్ల వీరరాఘవస్వామిగారు

హృదయోపహారము : శ్రీ పి. గణపతిశాస్త్రిగారు

సంధ్యా సంగీతము : శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావుగారు

పరిశ్రమలలో 'రూపలేఖనలు' శ్రీ వి. ఆర్. చిత్రాగారు

శిల్పము : శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు

నీడలనడవ : శ్రీ కవికొండల వెంకటరావుగారు

వారసత్వము : శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రిగారు

'నా జీవితయాత్ర' ఒక సమీక్ష శ్రీ కృష్ణశాస్త్రిగారు

చింతచిగురు : ఆరుద్ర ...

వినాయకచవితి : శ్రీ విస్సా అప్పారావుగారు

ఆర్తనాదము : 'శిల్పి' ...

గ్రంథవిమర్శనము : ...


## శిల్పాలు


ముఖచిత్రము : శ్రీ పిలకా లక్ష్మీనరసింహమూర్తిగారు

డోలిక : రాజపుత్రచిత్రము

నర్తకులు : శ్రీ నందలాల్ బోసుగారు

దాక్షిణాత్య దేవాలయ శిల్పపరిణామంలో ప్రధానఘట్టాలు



డో లి క

రాజపుత్ర చిత్రము

# చిత్రవివరణము

శ్రీ దండపాణి.

## డోలిక

అతిసామాన్యమైన విషయం కూడా రాజపుత్ర చిత్రకారులు ఎంత మహత్తరంగా చిత్రించారు ! ఉయ్యాల మనం అనుదినము చూచేదే కాని, చిత్రరచనా విధానం మాత్రం అసాధారణంగాఉంది. ఇందులో రాజదంపతులు భవనోద్యానంలో ఉల్లాసంగా ఉయ్యాల లూగుతున్నారు. చిత్తరువులో ముందుభాగమూ, వెనకభాగమూ అది వసంతసాయం సంధ్యాకాలం అన్నవిషయం సూచిస్తున్నాయి. ఆ సమీపంలో ఉన్నది జలపూరితమైన సరోవరము. దానికి దగ్గిరిగా ఉన్న లతలూ, తరువులూ వసంతసౌభాగ్యంతో కలకలలాడుతున్నాయి. సరోవరానికి ప్రాగ్భాగంలో నిమ్నోన్నతభాగాల్లో సుందర తరు విరాజితమైన క్రీడాపర్వతం కనుబడుతూంది. ఇంకా వెనకభాగంలో సంధ్యారాగ రంజితమైన నిర్మల నీలాకాశం కనిపిస్తూంది. సరిగా ఈ సమయంలోనే రాజదంపతులు తమ ఉద్యానడోలికల్లో విహరిస్తున్నారు. ఇది ప్రత్యేకంగా భారతీయమైన ఒక సుందర విషయం తీసుకుని కేవలమూ ప్రాచ్యసంప్రదాయంలో రచించిన రమణీయ చిత్రము.

## నర్తకులు

సృజనశీలమైన కళ సామాన్యమైన కళానియమాలనన్నింటినీ అతిక్రమిస్తుంది. స్రష్ట అయిన కళారాధకుడు ఎప్పుడూ ఒకదివ్యసందేశం అందిస్తూ ఉంటాడు. ఆ సందేశాని కనుకూలమైన చిత్రపరిభాషలో తన ఆదర్శాలు వ్యక్తీకరిస్తాడు. ఒకప్పుడు కళాస్రష్ట అత్యంత అసాధారణంగా భావించి, ఆ భావనకి రూపకల్పనచేస్తాడు. అలాంటప్పుడు కల్పనకీ మన ఇంద్రియ ప్రపంచానికీ ఉన్నసంబంధం చాలా స్వల్పంగా ఉంటుంది. ఐతే అనేక సందర్భాల్లో కళాస్రష్టలు తమ పరిసరాలు తమపై కలిగించిన ప్రభావాల్నీ, ఆ పరిసరాలు తమకిచ్చిన సందేశాల్నీ మాత్రం వ్యక్తీకరించి ఊరుకుంటారు. ఆ అభివ్యంజనలు చాలా వ్యక్తిగతంగానూ, సూక్ష్మంగానూ ఉండడంవల్ల సామాన్యమైన కళాసృష్టి సంప్రదాయాల ప్రకారం వాటిని నడిపించడము చాలా కష్టము. అందుచేతనే కేవలం కళాస్రష్ట మాత్రమే తనకు అనుకూలమైన సృజనపరికరాలు సమకూర్చుకుని

తద్ద్వారా తన భావాలని వ్యక్తీకరించడానికి ప్రయత్నిస్తాడు. అందుచేత మనం సామాన్యంగా చిత్ర పరిశీలనలో అవలంబించే సామరస్యాది నియమాలేవీ వీటిలో అవలంబించకూడదు. స్రష్ట అయిన కళారాధకుడు తన భావాభివ్యక్తికి భాష అత్యంత సంకుచితమైనదని భావించే రచయితవంటివాడు. ఒక్కొక్కప్పుడు రచయిత తన అభిప్రాయ వ్యంజనకోసం సామాన్య వ్యాకరణ నియమాలు కూడా ఉల్లంఘిస్తాడు. చిత్రకారులు కూడా అల్లాగే సామాన్యమైన కళాసంప్రదాయాలు అతిక్రమించి, స్వీయమైన ఆకృతులు చిత్రిస్తూ కొత్త కొత్త వర్ణసామరస్యాలు సృజిస్తారు.

శ్రీనందలాల్ బోసు 'నర్తకులు' అనే చిత్రాల్లో శాస్త్రీయమైన రచనా విధానం అతిక్రమించి నృత్యవేగం ప్రదర్శించడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. ఈ రెండు నృత్యచిత్రాలు సాంప్రదాయికరచనా పద్ధతుల్ని అతిక్రమించిన రచనలు. చిత్రకారుడు అతిచంచలమైన నర్తకుల నృత్యభంగిమలు వీటిలో అత్యంతసామర్థ్యంతో నిర్వహించాడు. చిత్రకారుడు నృత్యసమయంలో నర్తకుల హృదయంలో వెల్లివిరిసే ఆనందం మరింత ఎక్కువ సామర్థ్యంతో నిర్వహించగలిగాడు. సాధారణశక్తి గలిగిన చిత్రకారులు అత్యంత ప్రధానమయిన ఈ విషయం విస్మరించే ఉండేవారు. ఒకవేళ ఈ విషయం విస్మరించకపోయినా సామర్థ్యం లేకపోవడంవల్ల తప్పకుండా వైఫల్యం పొందిఉండేవారు.



నర్తకుడు



న ర్తకులు

# ఆంధ్రశిల్పి

## జాతీయ ప్రభుత్వము

చిట్ట చివరికి ఢిల్లీ నగరంలో జాతీయ ప్రభుత్వద్వారాలు తెరుచుకున్నాయి. దాదాపు నూటయాభై ఏళ్లనించి శృంఖలా బద్ధమైన భారత జాతి స్వాతంత్ర్యతూర్యనినాదాలు వినగలిగింది. ఈ సమయంలో మనం ఇంతకాలంనించీ ఈ స్వాతంత్ర్య రథ చక్రాల కింద పడి నలిగిపోయిన మహామహుల్ని ఎందరెందరినో స్మరించుకుని ఆ స్వాతంత్ర్య రథసారథు లందరికీ మనసారా జోహారు లర్పించాలి.

ఎంతో కాలంనించి మనం పాశ్చాత్య దాస్య శృంఖలాల్లోపడి చిత్ర విచిత్రమైన పీడకలలు కన్నాము. ఇప్పుడు అవన్నీపోయి బంగారు కలలు కనేకాలం సమీపించింది. మనకి ఇంతకి పూర్వం సంభవించిన దురదృష్ట సంఘటనల కన్నిటికీ పరప్రభుత్వాన్ని నిందించడం ఒక అలవాటయి పోయింది. అంతకంటె ఆ సంఘటనలకి మనం కూడా కొంతవరకు బాధ్యులమే నని గ్రహించాలి. అంతేకాదు. ఈ పాశ్చాత్య సంసర్గంవల్ల మనజాతి రక్తనాళాల్లో ఒక పెద్ద ఆఘాతం కలిగి, దానివల్ల ఒక నూత్న చైతన్యం ఆవిర్భవించిందని కూడా అంగీకరించాలి.

నెహ్రూ పండితుడు భారత జాతీయ ప్రభుత్వభారం వహించిన సందర్భంలో దేశీయ విదేశీయ నాయకుల మన్ననలు పొందాడు. సెప్టెంబరు ౨వ తేదీ భావి భారతీయ సంతతి సగర్వంగా సంస్మరించే సుదివసము.

## జాతీయ ప్రభుత్వము

అయితే భారత దేశంలో అందరూ ఆ నాడు సుదినంగా పరిగణించలేదు. ముస్లింలీగు ఆ నాడు విచారదినంగా ప్రకటించింది. క్రమ క్రమంగా అది దేశంలో అనేక విషాద సంఘటనలకి దారి తీసింది. మనం హృదయ విదారకాలయిన కలకత్తా సంఘటనలకి తలవంచుకుని పశ్చాత్తప్తులం కావాలి. ఇంకా బొంబాయిలో పూర్తిగా ప్రశాంత పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పడానికి వీల్లేదు. దేశంలో ఇంకా అనేక నగరాలు సంక్షోభ పూరితంగానే ఉన్నాయి.

ఈ సందర్భంలో ప్రజాభ్యుదయం కోసం అధికారం స్వీకరించిన కాంగ్రెసు నాయకులు ప్రతీ అడుగూ తూచితూచి వెయ్యవలిసిన అవసరం ఎంతైనా ఉంది. ఆంగ్ల ప్రభుత్వం ఇన్నాళ్లనించీ కాంగ్రెస్సుకీ లీగుకీ మధ్యవర్తిగా ఉండి తనకి అవసరం ఉన్నప్పుడు రెండింటికీ మధ్యన తగాదాలు పెడుతూ వచ్చింది. ఆ ఆంగ్ల ప్రభుత్వమే తీరా తన అధికారం జాతీయ ప్రభుత్వానికి సంక్రమింప జెయ్యాలనుకునే సరికి పూర్వకాలంనించీ ఆంగ్లప్రభుత్వభావాలు అనుమానించే లీగు కాంగ్రెస్సుతో కలిసి జాతీయ ప్రభుత్వం ఏర్పరచలేక పోయింది. ఇంక గత్యంతరంలేక, ఆంగ్ల మంత్రులు కాంగ్రెసు నాయకులకి స్వాధికారం సంక్రమింపజేశారు. దాంతో ముస్లింలీగు కడుపు మండి, ప్రత్యక్ష ప్రతిఘటన ప్రారంభించింది. ఈ ప్రతిఘటనల్లో అమాయికులూ, స్త్రీలూ, శిశువులూ ఆహుతి అయ్యారు. అనవసరంగా సామాన్య పౌరుల రక్త స్రవంతులు ప్రవహించాయి.

ఇన్నాళ్లనించీ ప్రభుత్వం మధ్యవర్తిగా ఉండడంవల్ల కాంగ్రెసు తన షరతులన్నిటికీ అంగీకరిస్తేనేగాని ప్రభుత్వంలో చేరననడంలో కొంత అర్థం ఉంది. కాని ఇప్పుడు అధికారం తన హస్తగత మయింది కనక కాంగ్రెసు ఎంత స్వార్థత్యాగమైనా చేసి, ముస్లింలీగును కూడ గట్టుకుని రావడానికి ప్రయత్నించాలి. మహమ్మదీయుల మనస్సులలో

ఉన్న అనుమానాలు తొలగించాలి. జనాబ్ జిన్నాకూడా తన మంకు పట్టు విడిచి, ప్రజా పరిషత్తుతోనూ కేంద్ర ప్రభుత్వంతోనూ సహాక రించి భారతపురోభివృద్ధికి తోడ్పడ గలడని ఆశిస్తున్నాము.

## ప ల్లె టూ రి ప రి శ్ర మ లు

భారత దేశం ఈనాడు దుర్భరదారిద్ర్యస్థితిలో ఉందంటే దానికి కేవలం పారిశ్రామికంగా వెనకబడి ఉండడమే కారణమని వేరే చెప్పక్కరలేదు. మనం భావిలో ఎటువంటి ఆర్థికవ్యవస్థ నిర్మించ దలిచినా అసంఖ్యాకంగా ఉన్న పల్లెటూళ్లని విస్మరించడానికి వీల్లేదు. అందుకనే మన దేశంలో కొందరు యంత్రపరిశ్రమల్లోగాని కుటీరపరి శ్రమల్లోగాని అంధప్రాయంగా పాశ్చాత్యానుకరణం ఆత్మవినాశహేతు వనీ మన దేశీయ పరిస్థితులకి అనుకూలమైన పారిశ్రామిక వ్యవస్థ నిర్మించుకోవాలనీ చెబుతున్నారు. ప్రపంచంలో అందరూ తమతమ పరిశ్రమలు పునరుద్ధరించుకొని వాణిజ్యం అభివృద్ధి పొందించుకోవాలని తహతహపడే ఈ సమయంలో, మన కేంద్ర ప్రభుత్వమూ రాష్ట్రీయ ప్రభుత్వాలూ ఈ విషయంలో చాలా జాగరూకులై ప్రవర్తించాలి.

ఈ సందర్భంలో మద్రాసు ప్రభుత్వంపల్లీపరిశ్రమల అభివృద్ధి కోసం అవలంబించదలిచిన విధానాన్ని సూచించే నివేదిక ప్రత్యేకంగా గమనించవలిసి ఉంది. ఇందులో ఖాదీ పరిశ్రమకి ప్రాధాన్యం ఇవ్వడం ముదావహం. అంతేకాక ఫిర్కావారీగా ఆయా జిల్లాలలో ఏ యే ప్రత్యేక పరిశ్రమలకి అవకాశం ఉందో పరిశీలించి ఆయా పరిశ్రమలకి తగిన ఉత్పత్తి కేంద్రాలు ఏర్పరచడానికి నిశ్చయించడంలో ప్రధాని ప్రత్యేక పరిశీలన ప్రశంసనీయము.

మనం దేశంలో ఇన్నాళ్లనించీ 'గ్రామాభివృద్ధి! గ్రామాభివృద్ధి' అని వేదికలమీద గంభీరోపన్యాసాలు చెయ్యడమేగాని, ఈ విషయంలో అణువంతైనా అభివృద్ధి జరగలేదు. ఆంధ్ర కేసరి ఆధ్వర్యంలో ఈ

విషయంలో సంపూర్ణంగా అభివృద్ధి జరగగలదని ఆశిస్తున్నాము. అయితే ఇన్నాళ్లనించీ రాష్ట్రీయ ప్రభుత్వం నిరంకుశుల చేతుల్లో ఉండడం మూలాన్ని ప్రభుత్వోద్యోగుల్లో అలసతా, తాటస్థ్యమూ, దురహంకారమూ, మొదలైనవి బాగా పేరుకున్నాయి. ఏ విధానమయినా సఫలం కావాలంటే అది స్వార్థరహితంగా ఆచరణలో పెట్టి ప్రజాభ్యుదయం కోసం పాటుబడే ప్రభుత్వోద్యోగుల తోడ్పాటు ఎంతైనా అవసరము. అది లేకపోతే ఎన్నెన్ని నివేదికలు తయారుచేసినా ఏమీ ప్రయోజనం ఉండదు. ప్రధాని ఈ విషయంలో ప్రత్యేక జాగరూకత వహించి పారిశ్రామిక శాఖలో ఒక నూతనోజ్జీవం కలిగించ గలరని ఆశిస్తున్నాము.

# నవ్య శక్తి

స్వార్థమ్ము కల్పాంత సమయాంధ్యమైన,
దారుణ దుషోద్ధరణ మారణమ్మైన,
ఏ యుదగ్రాగ్రహ
మ్మేయుదాత్తా వేళ
మావహించిన పురుగు నరుడై,
ఆవరించిన నరు డ మరుడై,

జరఠ జగతీ భువన నరక భవనమున నవ
మంగళ యుగ స్వర్గ మండల శ్రీరుచుల్
నిండించు,
సమసౌఖ్యము సమృద్ధి
పండించు,
ఆ శక్తి,
ఆ నేత్రి
ఆ నిత్య శుభదాత్రి
శాసించు మమ్ము! ఆశాసించు నహరహమ్ము!

శ్రీ కృష్ణశాస్త్రి.

# సాగర గానము

ఊగుమా నానీలి తూగు టుయ్యాలలో!
ఊగుమా నాచలువ తేట యుయ్యాలలో!
జననమరణక్రీడ జరుగు నా హృదయమున
మనసు పరవశ మంద మునిగిపోయితి వేని,
నీలిమబ్బులలోని కలలచాయలలోన
గాలిజోలలలోన లాలింతు తేలింతు!

కూలమే లే దనెదు! కూలమ్ము లేనియెడ
కాలు పెట్టు నెవండు గిలుగించు నాయలల
నాహృదయగానమున నీహృదయ ముప్పొంగి
నావవలె గాలిలో నవకముగ నటియించు!

నాహృదియె నీజాహ్నవీస్రవంతికి ముక్తి
నాహృదయరాగమే నవ్యకవులకు రక్తి
నాహృదిని చంద్రికలు తారకలు క్రీడించు!
నాహృదిని మేల్మిబంగరుసూర్యు డుదయించు!
నాజీవనమె దేవతలసుధకు కాణాచి!
నాజీవనమె యాకటిదప్పులకు శాంతి!
నాజీవనమ్మె ముత్యాలకోవలతాయి!
నాజీవనమె ప్రజల కానందసంధాయి!

నాహృదయదేశమున నాకసము పవళించు,
నాతీరదేశమ్ము మోహాముల కబళించు!
నాయూరుపుల గ్రోలి మానవులు తేరుకొని,
హాయిగా మరచిపోయెదరు కష్టము లెల్ల!
ఊగుమా నానీలితూగుటుయ్యాలలో!
ఊగుమా నాచలువ తేటయుయ్యాలలో!

శ్రీ త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి.
సాహితీ సమితి.

# హృదయోపహారము

నినుఁ బ్రేమింతు నటన్నఁ దథ్యమగుఁ; గానీ కేవలమ్మౌ జగ
జ్జన సామాన్యగతిన్ వచించుటగు; నాస్వాంతోజ్జ్వల ప్రేమ వ
ర్ణనకై లే దనురాగ లేశ మనినన్ నానావిధాల్పార్థ చిం
తన శీల మ్మగు లోకమం దది యథార్థమ్మై విభాసిల్లునో!

ప్రేమపదమ్మొ కేవిధిఁ గవిబ్రువులైన జనమ్మునోళ్ల నే
మేమొ విచిత్రభూమికల నృత్య మొనర్చుచు రూపరెన్ సరే
లే! మరి! దాని కేమి! సఫలీకృతమైనది నీవు నవ్వువిం
జామర మల్లపీవ నవశమ్మగు మామక పక్ష్మయుగ్మమున్

నీత్యవినీతులన్ వెలుగు నీడల పోలిక మారుటొక్కటే
సత్యము; వాని చర్చల నసంఖ్యమనీషులు మున్గిమున్గి కా
లాత్యయ మందియుంట, ననయ మ్మిక నీ సొగసుందనమ్ము నా
నిత్యవిలోకనోత్సవ వినిద్ర నిరీక్షలగ్రోలి సోలెదన్

నీ సౌందర్యము నాహృదంతరగుహా నిద్రాణమై చంచలా
హాసమ్ముం బ్రసరించు నొక్కొకపుఁ; డా హాసోజ్జ్వలచ్ఛాయ ను
ద్భాసించున్ మదగాధజీవితపయఃపాథోధిగర్భాంతరా
భాసద్దివ్యమహేంద్ర కార్ముక సమాభమ్మై జగజ్జ్వాలయో!

నీ వెపుడో వినిశ్చల కనీనికలం గికురించి, మెల్లనా
జీవనగుప్తదేహాళి విచిత్ర విధమ్ముగ దాటి, సాంధ్యరా
గావృతకృత్తికాతరళహారము నీరవ కైరవాకర
శ్రీ వెలిగించురీతి విరచించితి వీ యెదఁ బ్రేమదీపికన్

# ఆంధ్రశిల్పి

కార్తిక చంద్రికా శయిత గౌతమిలో నొక కాశపుష్పవి
స్ఫూర్తివలెన్ భవద్రుచిరమూర్తి యొకప్పుడు లోనవెల్గె; న
మ్మూర్తి క్రమక్రమమ్ముగ నపూర్వ మహత్త్వమునంద నేడు రా
గార్తుడ నే తదీయహృదయమ్మున ముత్తెమువోలె మారితిన్

నాజన్మమ్మిది ధన్యమయ్యె లలనా! నిన్నీవిధిం భావనా
పూజామల్లికతో నొకించుక యెదన్ బూజింప భావింప; నా
నాజన్మాంతర సంచితమ్మయిన పుణ్యమ్మేకమై పండి, ఓ
తేజోమాలిని! నీవె వచ్చిన సుఖార్తిం జీవమే ప్రీలునో!

నీలస్వప్న సరస్సువర్ణవికసన్నీరేజమై నీ తనూ
లాలిత్యమ్ము కనుంగవన్ బసని బల్మైకమ్ము నిండింప, నా
కీలోత్కైకలలామ! జీవన మిదేరీతిన్ సుఖాందోళ మం
దే లోలమ్మయి సోలునో యను తలంపే మేలుకొం టయ్యెడున్!

* * * *

శ్రీ. పి. గణపతిశాస్త్రి.



# సంధ్యా సంగీతము

౧

తరుణమిదే! సమీరముల దారుల నొయ్యన నూగులాడుచున్
విరు లొక టొక్కటే వలపు వ్రేల్చును హారతి దీపరేఖలై !
హరిదనిలమ్ములన్ తొణకు నద్భుతరాగములున్ సువాసనల్,
తరలెడు శ్రాంత నృత్యము ! నితాంతనటత్పదమూర్ఛలియ్యెడన్ !

విరులొకటొక్కటే వలపు వ్రేల్చును హారతి దీపరేఖగా,
అరచు విశోషితాత్మలటులై దురపిల్లును వాయులీనముల్,
తరలెడు శ్రాంతనృత్యము, నితాంతనటత్పదమూర్ఛ లియ్యెడన్,
సురుచిరశోభయున్ మృతియు సోలెడు వేది విహాయసంబనన్ !

అరచు విశోషితాత్మలటులై దురపిల్లును వాయులీనముల్ !
మరణవిశాల కాళనిశమాట కసహ్యము పొందునాత్మలై !
సురుచిరశోభయున్ మృతియు సోలెడు వేది విహాయసంబనన్,
స్ఫురదరుణాస్రధారలను సూర్యుడుమున్గుచు వీడు నూపిరిన్ !

మరణవిశాలకాళనిశమాట సహించని మామకాత్మ ఆ
దరమున విస్ఫురద్గతకథల్ సకలమ్మును సంస్మరించెడున్ !
స్ఫురదరుణాస్రధారలను సూర్యుడు మున్గుచు వీడునావి, బం
గరు కలశమ్ము నీప్రతిమ కాంతిలు నాహృదయాంతరమ్మునన్ !

౨

అదనిదే, మలయానిలాధ్వముల కదలాడి
హారతులవలె వలపు లలరుగములు వెలార్చు !
ప్రాకు, పవనములలో రాగములు, వాసనలు ;
స్విన్నలాస్యాలు మూర్ఛన్నృత్యచరణాలు !

# ఆంధ్రశిల్పి

హారతులవలె వలపు లలరుగములు వెలార్చు ;
అరచు క్షుద్బాధాత్మలటు లడరును విపంచికలు !
స్విన్నలాస్యాలు ! మూర్ఛన్నృత్యచరణాలు !
మృత్యుసౌందర్యాలు మెరయు వేది నభస్సు !

అరచు క్షుద్బాధాత్మలటు లడరును విపంచికలు,
మరణకాళనిశీథమథితదీనాత్మలై !
మృత్యుసౌందర్యాలు మెరయు వేది నభస్సు,
ఎరుపునెత్తుట మున్గి ఇనుడూపిరిని వీడు !

మరణకాళనిశీథ మథిత మీ నా ఆత్మ
కడచిపోయిననాటి కథల నెలమి స్మరించు!
ఎరుపునెత్తుట మున్గి ఇనుడు మరణించు, బం
గరు కలశి నీ ప్రతిమ కాంతిల్లు నాయెడద!

[ఫ్రెంచి మహాకవి Charles Baudelaire వ్రాసిన Harmonie Du Soir కు కొందరకాల తర్జుమాలు.]

శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు.



# పరిశ్రమలలో 'రూపలేఖనలు'

శ్రీ వి. ఆర్. చిత్రా

మనము ప్రతిదినమూ వాడుకునే గృహోపకరణాలు తయారుచేసే విధానాల్లో సుందరతరమైన రీతులు అవలంబించడంవల్ల వాటిని సులభంగా విక్రయించడానికి వీలవుతుంది. పారిశ్రామికంగా అభివృద్ధిపొందిన దేశాలన్నీ సౌందర్య దృష్టితోనూ, వాణిజ్య దృష్టితోనూ నిత్యకృత్యంలో వాడుకునే వస్తువులు ఉత్పత్తి చెయ్యడంలో జాగ్రత్తపడ్డాయి. అసలు ఆ దేశాల పారిశ్రామికాభివృద్ధిలో ఉన్న రహస్యం అంతా ఇదే! జపానులో వస్తువులు ఉత్పత్తిచేసే ముందు వాటి రూపచిత్రాలు (Designs) తయారు చేస్తారు. ఆ తయారు చేసేవారిని రూపలేఖకులు (Designers) అంటారు. జపానుదేశంలో ప్రతీ పరిశ్రమలోను నిష్ణాతులైన రూపలేఖకులు ఉంటారు. ఆయా పరిశ్రమల్లో వాటికి సంబంధించిన శాస్త్రవేత్తలు, కర్మకారులు, మొదలయిన వారికంటె ఈ రూపలేఖకులే ఎక్కువగా ఉంటారు. అసలు ఈ శాస్త్రవేత్తలూ, కర్మకారులూ కూడా రూపలేఖనలో బాగా పరిశ్రమ చేసిఉంటారు. బాగా ప్రఖ్యాతమైన వస్త్రాలు, పింగాణీ వస్తువులు, కాగితాలు మొదలైన పరిశ్రమల్లోకూడా సంప్రదాయాలకీ పరిసరాలకీ అనుకూలమైన రూపచిత్రాలు తయారుచేయిస్తూ ఉంటారు. బాగా సుప్రసిద్ధులైన చిత్రకారులు ఈ రూపచిత్రాలు పరిశీలించి ఇంకా కొత్త కొత్త రీతులు సూచిస్తూ ఉంటారు. ఇంతే కాదు; ఆయా శాఖలకి కావలసిన గ్రంథాలన్నీ సేకరించి చక్కని గ్రంథాలయాలుకూడా ఏర్పరుస్తారు. ఆ గ్రంథాలయాల్లో ఆయా దేశాల్లో సంపాదించిన అతి పురాతన వస్తువులు జాగ్రత్తచేస్తూంటారు. ఈ విధంగా పరిశ్రమలు ప్రోత్సహించడం వల్ల జపాను అనతికాలంలో ఊహించలేనంత గొప్ప పారిశ్రామికాభివృద్ధి పొందగలిగింది. రూపలేఖకులను ఏర్పరిచి పరిశ్రమలు అభివృద్ధి పొందించడం వల్లనే జపానుదేశపు వస్తువులు ప్రపంచంలో అన్ని మూలలకీ వ్యాపించాయి. ఇంతేకాదు, జపానులో నాలుగు మూలలా అనేకమైన పరిశోధనాలయాలు ఏర్పరిచారు. ఆ పరిశోధనాలయాల్లో రూపలేఖకులూ, పారిశ్రామిక శాస్త్రవేత్తలూ కలిసి, పరిశ్రమల అభివృద్ధి కోసం కొత్త కొత్త మార్గాల్లో పాటుబడుతూఉంటారు. మరిన్నీ జపానులో పరిశ్రమల అభివృద్ధికోసం పెద్ద పారిశ్రామిక పరిశోధనాలయాలు కూడా ఏర్పాటు చేశారు. ఉదాహరణకి జపానులో పింగాణీ పరిశ్రమ కోసం ప్రత్యేకంగా మూడు ప్రధాన పరిశ్రమాలయాలు నిర్మించారు. వాటిల్లో సుప్రసిద్ధులైన చిత్రకారులు, రాసాయనిక శాస్త్రవేత్తలు, రూపలేఖకులు కలిసి కొత్త కొత్త పరిశోధనలుచేసి నూతనమార్గాల్లో పింగాణీ పాత్రలు తయారుచేస్తూంటారు. ఆపైన వారివారి పరిశోధనా ఫలితాలన్నీ ఆయా పరిశ్రమలకి సంబంధించిన పత్రికల్లో ప్రచురిస్తూఉంటారు; ఆ పరిశోధనాలయాల్లో తయారైన వాటిని దేశంలో అనేక ప్రదర్శనాల్లో ప్రదర్శిస్తూంటారు.

జపానీయులు అనేక శతాబ్దాలనించి గృహపరిశ్రమల్లో అఖండమైన విఖ్యాతి సంపాదించారు. అదీగాక ఈ విషయంలో జపానీయులకి ఒక ప్రత్యేకశక్తి కూడా ఉంది. అందుచేత జపానీయులు పారిశ్రామిక

కళల్లోకూడా అత్యద్భుత విఖ్యాతి గడించారు. 'మేజి' ప్రభుత్వం మళ్లీ అధికారంలో ప్రతిష్ఠిత మయ్యాక ప్రాచీన జపానీయసంస్థలన్నీ పాశ్చాత్య నాగరికతా ప్రభావంలో పడ్డాయి. అందుచేత నేటికాలపు జపాను యంత్ర పరిశ్రమకూడా ఈ ప్రభావంలో పడడంలో ఆశ్చర్యంలేదు. ఈ పాశ్చాత్య ప్రభావంలోపడి కొత్త పద్ధతులు అవలంబించడంవల్ల వస్తువుల ఉత్పత్తిలో కళా దృష్టి చాలావరకు సన్నగిల్లింది. జపాను ప్రభుత్వం ఈ సంగతి బాగా గ్రహించింది. అందుచేత పారిశ్రామిక కళా పరిశోధనాలయం అనే పేరుతో ఒక సంస్థ స్థాపించింది. ఆ సంస్థ ప్రాచీన జపానీయాదర్శాలు, నేటికాలపు శాస్త్రీయపద్ధతులు మేళవించి, ఆ దేశపు పరిశ్రమలు అభివృద్ధిపరుస్తూఉంటుంది.

జపాను పారిశ్రామికాభివృద్ధికి, తయారుచేసిన ప్రతీ వస్తువూ చాలా మంచిదై ఉండడమూ, అన్నివస్తువులూ నాజూకుగాను సరళంగాను ఉండడమూ కారణాలు. వాళ్ల పరిశ్రమలన్నీ అత్యద్భుతంగా అభివృద్ధిపొందడా నికి ఇవే ముఖ్యకారణాలు. జపానీయులు తయారు చేసిన ఏ వస్తువు చూసినా వాటిల్లో చక్కని సౌకుమా ర్యంతో నిండిన సౌందర్యమూ, బలమైన భావనాశక్తీ కలిసిన సారళ్యం గోచరిస్తుంది. అందుచేత సాంప్ర దాయికంగా వస్తూన్న వారి పారిశ్రామికకళల్లో మూడు ఉత్తమగుణాల కలయిక కనిపిస్తుంది. వాటిల్లో అసలు వస్తువులు తయారుచెయ్యడానికి ఉపయోగించే పదార్థా ల్లోనే సరళసౌందర్యం ఉండడం మొదటిది. అత్యంత సుకుమారమైన రూపలేఖనా పద్ధతులు అవలంబించడం రెండవది. వస్తూత్పత్తిలోకూడా సున్నితమైన విధా నాలు అవలంబించడం మూడవది.

అయితే సామాన్యంగా అన్ని పరిశ్రమలలోనూ ఉండే లోపాలు ఈ విధమైన వస్తూత్పత్తిలోకూడా ఉన్నాయి. వివిధములైన ఈ పరిశ్రమలలో పనిచేసే వాళ్లందరికీ అనేక సంవత్సరాల అనుభవం ఉండాలి. అయితే ఈ విధమైన అనుభవం ఉన్నప్పటికీ ఇది సాము దాయికమైన వస్తూత్పత్తికి సహకరించదు. ఇది ఇల్లాగ ఉండగా సరళంగానూ సుందరంగానూ తయారుచేసిన వస్తువులు తొందర తొందరగా మారిపోయే లోకాభి రుచికి అనుకూలించకపోవడం సంభవిస్తూంటుంది. అందు చేత, జపానులో అధునాతన శాస్త్రీయవిజ్ఞానాన్ని అనుస రించి పరిశ్రమలు పునరుజ్జీవింపజేసే ప్రయత్నం జరిగింది. ఈ ప్రయత్నంవల్ల పరిశ్రమలు జనరంజకంగా వ్యాపిస్తు న్నాయి. ఇప్పుడు మనం చూచే జపానీయవస్తువుల ఆకృతులన్నీ ఆదేశపు ప్రాచీన రూపలేఖకులు చిత్రించి నవే.అయితే అవి కొంతకాలానికి జనాదరణం పొందడం మానివేశాయి. అప్పుడు అధునాతనాభిరుచులకి అను కూలంగా వాటిని మార్చారు.

మన దేశంలో శాస్త్రీయ పద్ధతులమీద తయారుచేసే పరిశ్రమల్లో రూపలేఖనకి ఉన్న ప్రాధాన్యం గమనించక పోవడం విచారకరము. మన దేశపు చేతిపరిశ్రమలన్నీ పంధొమ్మిదవ శతాబ్దం మధ్య భాగం దాకా బాగా ప్రపంచదృష్టి ఆకర్షించాయి. అయితే ఈ రోజుల్లో అవి అంతగా ప్రపంచదృష్టి ఆకర్షించడం లేదు. దీనికి ఆయా గృహ పరిశ్రమలు అవలంబించే వాళ్లు అధునాతనాభిరుచులకి అనుకూలంగా వస్తూ త్పత్తి చెయ్యకపోవడమే కారణము. మన పరిశ్రమ లన్నీ ఈ వేళదాకా ఈప్రాచీన కర్మకారుల చేతుల్లోనే పడిఉన్నాయి. వాళ్ల ఉపకరణాలూ శిల్పవిధానమూ కూడా ప్రాచీన సంప్రదాయానుసారంగానే ఉన్నాయి. ఇంకా, శాస్త్రీయ మార్గాలు అనుసరిస్తూన్న నూతన పరిశ్రమల్లో తయారైన వస్తువులన్నీ కళాకాంతి శూన్యంగానూ, ఎక్కువ ఖరీదుగలవిగానూ ఉన్నాయి. అందుచేత మన దేశంలోనూ పైదేశాల్లోనూ కూడా ఆ వస్తువులు కొనుక్కునేవాళ్లు లేకుండాపోయారు. అందు

చేత సహకార సంఘాలూ, వస్తు ప్రదర్శనశాలలూ ఏర్పరిచి, ఈ వృత్తులు అవలంబించే వాళ్ళకి తగినంత సహాయం చెయ్యడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయినా ఈ ప్రయత్నాలన్నీ చాలావరకు ఆయా వృత్తుల వల్ల జీవించేవాళ్ళకి సహాయం చెయ్యడానికీ, వాళ్ళ వస్తువులు ప్రదర్శించడానికీ మాత్రమే ఉపకరిస్తున్నాయి. అంతేగాని వస్తూత్పత్తి విషయంలో కొత్త కొత్త పంథాలు తొక్కడంలో ఏమీ ప్రయత్నాలు జరగడం లేదు. ఈ సంఘాలు వస్తూత్పత్తి విషయంలో ప్రాచీనకాలం నించీ వస్తూన్న రూపలేఖనాల్లో కొంత కొత్తమార్పులు తీసుకురావడానికి ప్రయత్నించాయిగాని, ఆ ప్రయత్నాలన్నీ పూర్తిగా వ్యర్థమయ్యాయని చెప్పక తప్పదు. అంతేగాదు, మన సాంప్రదాయికమైన కళాదృష్టికి అవి ఒక పెద్ద అపఖ్యాతికూడా తెచ్చిపెట్టాయి.

ఈ రూపలేఖన విషయంలో మాటిమాటికీ నొక్కి చెప్పవలిసిన అవసరం లేదనుకుంటాను. పారిశ్రామిక వేత్తలందరూ కూడా గృహపరిశ్రమల్లో రూపలేఖనకి ఎక్కువ ప్రాముఖ్యం ఉన్నదనీ, సరియైన శాస్త్రీయ పద్ధతులమీద అవి అభివృద్ధిపరచాలనీ గమనించారు. ఈ విషయాల్లో అభిజ్ఞులైనవాళ్ల సహాయంతో కొత్త కొత్త పరిశోధనలు జరపవలిసిన అవసరం ఎంతేనా ఉంది.



# శిల్పము

## శ్రీ వేలూరి శివరామశాస్త్రి

య ఇమే ద్యావాపృథివీ జనిత్రీ
రూపై రపింశ ద్భువనాని విశ్వా
త మద్య హోత రిషితో యజీయాన్
దేవం త్వష్టార మిహ యక్షివిద్వాన్

ఋక్ - 10-9-110

.. ఓ హోతా! ఎవడు భూమ్యాకాశములను భూత ములను, దేవ తిర్యఙ్మనుష్యాద్యాకారములచే రూప వంతములనుగాఁ జేసెనో ఆ దేవరను పూజింపుమా!

పాణినీయమున 'శిల్పమ్' 4-4-55 అను నొక సూత్రము కలదు. 'శిల్ప మనఁగా క్రియాకౌశలము. అది కలవాని విషయమున ష్ఠన్ అను ప్రత్యయము పుట్టును.' అని వ్యాఖ్యాతలు చెప్పిరి. ఐద్దాయులును అనఁగా వడ్లవాఁడును కుమ్మరవాఁడును కంచగవాఁడును అగసాలెవాఁడును కాసెవాఁడును చాకల మంగల ముచ్చివాండ్రు మొదలగు మఱికొందఱును శిల్పు లని ఆయాయీ 1 సూత్రములవలన నెఱుఁగ నగుచున్నది. పాణిని కాత్యాయనులు చెప్పినవారిలో పలువురు స్మృతులలో 2 కాన వత్తురు. నిఘంటువులలోను వేద సాహిత్యాది వాఙ్మయమునను ఈవిషయము బహుళముగా ఉపలబ్ధ మగుచున్నది.

ఓయీ శిల్ప మనఁగా ఏదియో ఒక పని, లేక ఉపయుక్తమగు ఒకపని, అని యేల చెప్పరాదు? నేరుపు కల పని అని యేల చెప్పవలెను? అనుచో నగరాత్కుత్సన ప్రావీణ్యయోః 4-2-128 అను సూత్రమున నిందగాని ప్రావీణ్యముగాని గోచరించుచో నగర శబ్దముకంటె వుఞ్ అను ప్రత్యయము కలుగు నని పాణినియే చెప్పుచున్నాఁడు.

కాశికాకారుఁడు ప్రశ్నోత్తరరూపముగా దీని నిటులు వివరించెను. 'మనో నేత్రమును వికసింపఁజేయు ఈ చిత్తరువు నెవరు వ్రాసిరి?'

'ఈ నగరమున నొక మనుష్యుఁడు.'

'ఔను. నాగరకుఁ డిటులు వ్రాయ సమర్థుఁడు. నాగరకులు నేర్పరులు కదా.' 1.

దీనినిఁబట్టి పాణినికి క్రియా కౌశలమునందు తాత్పర్య మని మనము గ్రహింపఁ గలుగుచున్నాము. మఱియు చిత్రకరుఁడుగూడ శిల్పి యనియు చిత్రకళయు నొక శిల్ప మనియు తెలిసికోఁ గలుగుచున్నాము.

## వ్యుత్పత్తి

'శీల' అను ధాతువునుండి శిల్ప పద ముత్పన్న మయినదని కోశ వ్యాఖ్యాతలు. ఈ ధాతువునకు ఉప ధారణ మర్థము. ఉపధారణమనఁగా అభ్యాసము. అభ్యాసబలమువలన పనులలో ప్రావీణ్య మేర్పడును గావున శిల్ప మనఁగా క్రియా కౌశలము. క్రియా కౌశలము కలలయందును కలదు కావున కళా శిల్ప పదములు ఏకార్థ బోధకములు.

---

1. శిల్పిని చాఽకృఞః 6-2-76. పాపం శిల్పిని 6-2-68. గ్రామః శిల్పిని 6-2-62. రాజా చ ప్రశంసాయాం 6-2-63. (వార్తి.) మడ్డుక ఝర్ఝ్హరా దనన్యతరస్యామ్, సృతి ఖని రజభజ్య ఏవ. 4-4-46.

2. తక్షా చ తంతువాయ శ్చ నాపితో రజక స్తథా
పంచమ శ్చర్మకారశ్చ కారవః శిల్పినో మతాః

1. 'కే నేదం లిఖితం చిత్రం మనో నేత్ర వికాశియత్?' 'ఇహ నగరే మనుష్యేణ'

'సంభావ్యత ఏత న్నాగరకేణ, ప్రవీణా హి నాగరకా భవన్తి.'

## నైఘంటుకులు

'కలా శిల్పే విపృద్ధౌ చ' అని వైజయన్తి. 'శిల్పం కర్మ కలాదికమ్' అని అమరుఁడు. కల మొదలయిన పని శిల్ప మని దీని యర్థము. ఈ మొదలయిన వేవి? అనుచో 1 గీతనృత్యాదులని ఒకరును 2 వాత్స్యాయనుఁడు చెప్పిన నృత్తగీతాదికములగు బాహ్యక్రియ లనువదియాఱును, ఆలింగనాదులగు అభ్యంతరక్రియ లనువదియాఱును, స్వర్ణకారాదిక్రియలును, అని మఱి యొకరును జెప్పిరి. మఱియు అమరుఁడు 3 కారు మాలాది కారాదులను, ఇంకను పలువురు శిల్పులను పేర్కొనెను. దీనినిఁబట్టి ఇతఁడును క్రియాకౌశలమును శిల్పమున కావశ్యకముగా ఎంచియుండవచ్చును. అమర శేషమున ఈ యర్థము కంఠోక్తము 4.

## జాతి

పూర్వకాలమున ఒకొక్కవర్ణమువారు ఒకొక్క పని చేయుట కలవాటు పడినటులు మన మూహింప వచ్చును. వారివారి పనులనుబట్టియే వారివారి కులము లేర్పడియుండు ననియు నూహింపవచ్చును. ఈరెండును ఇంచుమించు అన్యోన్యాశ్రయములు. మన దేశమున కుమ్మరులే కుండలు చేయుదురు. అగసాలెలే నగలు చేయుదురు. దీనివలన శిల్పమునకును గౌరవమునకును క్షతి కలిగినదని తలఁచువారు కొందఱు కలరు. సంఘమునందు మనుష్యునకు వానిచేయు పనినిఁబట్టియు నేర్పరితనమునుబట్టియు ఆదరానాదరములు మన కనుభవములో నున్నవి. కాని వేదపురుషుఁడు

'కుమ్మరులకు నమస్కారము. కమ్మరులకు నమస్కారము.'

అని అనుచున్నాఁడు. 1. ఆయాయీ పనులయందలి నేర్పరితనము ఒకానొక శక్తి యని గ్రహింపని వాఁడు వీరికి నమస్కరింపఁ బనియుండదు. లేక అంతయు బ్రహ్మమయ మని తెలుపుట కిటులు నమస్కరింప వచ్చును. 2 అటు లయినను ఇచట విభూతి ప్రావీణ్య స్ఫోరకము గాక మఱి యేమి?

కాళిదాసు వేణు వీణా వాదనములను శిల్పముగా వాడియున్నాఁడు. లలిత కళ యను మాటయు ఇతని కావ్యమునఁ జూచుచున్నాము. 3

తిక్కన నిర్వచనోత్తర రామాయణమున

'అమలోదాత్తమనీష నే నుభయ కావ్యప్రౌఢిఁ బాటించు శిల్పమునం బారగుఁడన్. 4

అని కవిత్వమునకూడ శిల్పముగా వాడుచున్నాఁడు. అప్పకవి చెప్పిన శిల్పకవిత్వము 4 శిల్పభేదము. ఈ రీతిగా ఘటనిర్మాణము మొదలుకొని త్రిభువన నిర్మాణమువరకుఁ గల పని యంతయు శిల్ప మనఁబడుచున్నది. ఇది యింత వ్యాపక మగు పదము. 5

## శిల్పము—ఉపయోగము

శిల్పి చేసిన కుండలతో నీరు తెచ్చుకొందుము. సాలెవాని బట్టలతో నగ్నత మాన్పుకొందుము. వడ్లంగి కట్టిన యిండ్లలో నివసింతుము. ఈ రీతిగనే ఆయా యీ పని బాగులవారి పను లన్నియు మన సుఖజీవనమునకు పనికి వచ్చుచున్నవి. కొందఱు పనివాండ్రు ఆకుండలమీఁద కొన్ని తీఁగలను జలదేవతలను వ్రాయుదురు. వీనివలన ఏమి ప్రయోజనము?

వట్టి కుండలను వ్రాఁత కుండలును అమ్మకమునకు వచ్చినపుడు నీవు వ్రాఁత కుండలనే కొందువు. ఏమి

---

1. కలాగీత నృత్యాదికం యత్కర్మ తచ్ఛిల్పమ్' అని మహేశ్వరుఁడు.

2. లింగభట్టు.

3. చూ. సేవాంత లక్షణకారిభ్యశ్చ. 4-1-151.

4. 'ప్రవీణం కుత్సితం వినా అసంజ్ఞా నగరే జాతం నాగరం నాగరాయకే...'

1. నమః కులాలేభ్యః కర్మారేభ్య శ్చ వో నమః

2. సర్వే చైతే శిల్పినో జాతి విశేషా దేవాధిష్ఠాన శఙ్కయా నమస్క్రియన్తే. భ. భా. భా.

3. 'ప్రియశిష్యా లలితే కలా విధౌ.' అజవిలాపము. వేణునా దశన పీడితాధరా వీణయా నఖపదాఙ్కితోరవః శిల్ప కార్య ఉభయేన వేజితా స్తం విజిహ్మనయనా వ్యలోభయన్. రఘు-19-35.

ప్రయోజన మని కొందురు? మఱియు చిల్లి కడవఁ గొనవు. వ్రాఁతపని యున్నచో ఒకటి కాదు, రెండు చిల్లు లున్నను కొందురు. ఏ మని కొందురు?

## ఆనందము

మనుజుఁడు దేహపోషణమును వంశవర్ధమున మాత్రమే చేసికొనుచు కూర్చుండలేఁడు. ఈ విచిత్ర ప్రపంచములో ఒకమూల కంటికి కనఁబడు ప్రకృతి లీల. మఱియొక మూల మనస్సున కందని తేజో జ్వాల. ఈ రెంటి నడుమను మానవుఁడు అచ్చెరుపడుచున్నాడు. ఆనంద మనుభవించుచున్నాఁడు. ఈ యానంద ప్రకాశమే శిల్పము. కావున శిల్పమున ఉపయోగమొండె ఆనంద మొండె ఉపయోగానందములొండె ప్రయోజనమే.

శిల్ప మానందప్రకాశ మని మన వేత్తలతోపాటు రస్కిన్ కూడ చెప్పెను. ఇతఁడు లలితకలలలో స్థాపత్య మునకు స్థానము చూపఁబోయి కట్టడములను మఱొక దృష్టితో చూచి వానివిషయమున సౌందర్యాదికము లనావశ్యము లనెను. 1. ఆలోచన లేని యే దుష్కృహాగ్రమున ఇతఁడిటుల నెనో ఆస్కార్ వైల్డ్ దీనినే పట్టు కొని శిల్పము లన్నియు ఉపయోగరహితము లనియు 1, శిల్పము తననుదక్క మఱి దేనిని దెలుప దనియు, 2 అని వేసెను.

## శ్రుతి

'ఆత్మ సంస్కృతి ర్వావ శిల్పాని' అనుచున్నది, అనఁగా శిల్పము లాత్మను సంస్కరించు నని అర్థము. దీనివలన శిల్పమునకు ఆత్మ సంస్కారము ప్రయోజన మని తెలిసినది. మఱియు

'ఛందోమయం వా ఏతై ర్యజమాన ఆత్మానం సంస్కురుతే' అనఁగా శిల్పములచే యజమానుఁడు ఆత్మను సంస్కరించుచున్నాఁడు. అని అర్థము. ఆత్మ సంస్కారము ప్రయోజన మనుట ఇట తెల్లము. ఈ సంస్కారమునుగూర్చి ముందు తెలిసికొందుము.

---

4. వినుతిఁ గాంతు రిల వివేకి వాచక రాచి కార్థశిల్పి ... అప్ప-1-46 'చెప్ప నెప్పట్ల యమకంబు శిల్పకుండు' 1-47.

5. శిల్పమునకు వట్టిపని అనియూ వాడుకకలదు. 'గత్యుక్త్యుత్సర్గ శిల్పాని కర్మాయతన సిద్ధయః భాగవత-11-12-17


1. All art is useless.

2. Art never expresses anything but itself.

1. Architecture is that art which taking up and admitting, as conditions of its working, the neccessities and common uses of the building, impresses on its form certain charactors venerable or beautiful but otherwise unnecessary.



# దాక్షిణాత్య దేవాలయ శిల్ప పరిణామంలో ప్రధాన ఘట్టాలు




మహాబలిపుర శిలా రథాలు

పల్లవ శిల్పము




శ్రీనివాస దేవాలయము : తిరుపతి

పల్లవయుగానికీ ఆ తరువాతి యుగానికీ చెందిన శిల




వరదరాజ దేవాలయము : కాంచీపురము

పల్లవ, విజయనగర శిల్పము



విఠ్ఠలరాయ దేవాలయము : హంపి
విజయనగర శిల్పము



మహాదేవాలయము : తంజావూరు

# నీడల నడవ

శ్రీ కవికొండల వెంకటరావు.

" గదిలోనుంచి దీపం వెలుగు,
ఇవతల నడవలోనికి,
గుమ్మంగుండా పడతూ:—
నడాడుతూవున్న వాళ్ళ నీడల్నీ,
నీడల క్కారణా లైన వాళ్ళ వాళ్ళ నడకల్నీ
వేర్పాటుగా కాపరుస్తూవుంది.

ఈ పై దృశ్యాన్ని నేను నా పాఠకుల యెదుట ''మాతృ చిహ్నము'' అనే రచన యందు లోగడ ప్రదర్శించియున్నాను. నాతో పాటు పాఠకు లీ పైనుంచి ఆ నడవను ''నీడల నడవ'' అనే పేరుతో గు ర్తింతురు గాక! ఆ దృశ్యము నేను ప్రత్యక్షంగా ఏ 1899 లోనో నా యేడవ యేట చూచిన దై వుంది. నా తల్లి గతించిన నాటి రాత్రి నీడ లవి ; నా బంధుగులివి; మా యూరివారివి; దీపం వెలుగులో నిశ్శబ్దంగా నడాడుతూ వున్న మర్త్యులవి.

మనుష్యులు నడాడుతూ వున్నంతసేపు, దీపం వెలుగుతూ వున్నంత మావు, నాకు భయ మనిపించ లేదు; తరువాత మరునాటి రాత్రి దీపం లేదు. నరసంచారం లేదు ఆ నడవలో— వీధిలోనుంచి ఆడుకుని ఆలా ఆలా పరుగెత్తు కుంటూ వచ్చి వీధిగుమ్మంలోంచి నడవలోకి అడుగుపెట్టాను. నడవ అంతా ఒక్కటే పెద్ద నీడగా తట్టి అట్టే భయపెట్టింది నన్ను! గుట్టుగా వీధిగుమ్మంలోనుంచి లోపలి గుమ్మంలోనికి ఒక్క దాటు దాటాను. ''అమ్మయ్యో!'' అంటూ—నా కేక ఎవ రైనా మాయింట్లో



పెద్దవాళ్లు గాని, మరొకళ్లు గాని విన్నారో లేదో! అని నాలో ఒకమహా సంకల్పాన్ని నెలకొల్పింది. ''ఆ నడవమ్మట నీవు అర్ధరాత్రి, అపరాత్రి, అంధకారంలో నడవరాదు. ఒక్క మట్టమధ్యాహ్నమే, మహాకాంతి, మార్తాండ తేజం, నడవీధిలోనుంచి నడవలోనికి ప్రసరించే టప్పుడే ఆ నడవమ్మట నడువు!'' అనే సంక

ల్పం వెంటనే జనించింది. నాలో నాకే జనించింది. ఆనాటినుంచి అంధకార సమయాన్ని అసురసంజప్పుడు ఆ నడవమ్మటనే నడవడం మానేశాను. ఒంటరిగా నడవడం మానేశాను అనుకోండి లేకపోతే — కాని మహత్తర మార్తాండ తేజమప్పుడు తరుచు ఒక్కణ్ణి ఆ నడవలో నిలబడిపోతూ, ఆ యొక్క తేజోరాశికి ఆశ్చర్యపోతూ వెనక గన్న నీడల్ని, అంధకారాన్ని దీపాన్ని పూర్తిగా మఱచిపోయిన వాణ్ణై ఒక్కొక్కప్పుడు అత్యుత్సాహంగా గంతులు వేసేవాణ్ణి, నృత్యం చేసేవాణ్ణి, ఏదో అర్థం లేని ఆలాపన గావించేవాణ్ణి కూడాను.

ఇలా ఉంటూ వుండగా, ఇదంతా నా చిరుత ప్రాయమందే ఒక మట్ట మధ్యాహ్నం పూట ఏం జరిగిందీ?— నా నృత్యంలో నా చేయి వీధితలుపును తగిలి మూసింది. ఏముంది? మఱి అంతా చీకటిమయంగా వెంటనే తట్టి అట్టె భయపెట్టింది నన్ను!— "అమ్మయ్యో" అని రెండో గుమ్మం అమ్మట లోగిలిలోపలికి పరుగెత్తుకు పోదామని తిరిగేలో, ఎదర వెల్ల గోడమీదను, తల్లక్రిందులుగా, మనిషిబొమ్మ అల్లలాడుతూ కాపడింది.— వెంట వెంటనే అదృశ్యమాతూ ఎవరో వీధితలుపు తెఱచినట్టయింది.

మఱి కాంతిల్లక తప్పదని, వీధితలుపు వంకకు జూచాను.— తోడి సహాధ్యాయి వాక్కడెవడో నడవలోకి వచ్చి "ఏమిటి చేస్తున్నావు?" అని అడిగాడు. వానికేమీ చెప్పకుండా "గోడమీద నీడ! ఏ మైందో? నీడ! తల్లక్రిందుల మనుష్యుల నీడ!" అన్నాను వాడు ఆ చెలికాడు "తల్లక్రిందుల మనుష్యుల నీడ ఏమిటి? ఎప్పుడూ వినలేదే!" అని వీధిలోనికి వెళ్ళి కనకనలాడే సూర్యబింబానికడ్డుగా చే యెట్టుకు ఆకాశం వంక చూడసాగాడు. నేనున్నూ అదే పనిగా చూడసాగాను. ఎందుకలా చూచామో మాకే తెలీదు. తిరిగి ఇద్దరం నడవలోనికివెళ్ళి వీథితలుపు వేసి చూచాము. నడవఅంతా అంధస్సు. గోడమీద నీడా లేదు గీడా లేదు.

మేమిద్దరం మాకు వుండివున్న వూహా విజ్ఞానాల సాహాయ్యంవల్లను ఒకానొక నిశ్చయానికి వచ్చేలో, ఏదో, మనిషి నీడే, గోడమీద తల్లక్రిందులుగా, మరోసారి, కనబడింది. ఎవరిదో, అలా, నిలుచుండిపోయినట్టుగా వుంది ఈ నీడ. తల్లక్రిందులుగానే వుంది. మా కా పర్యాయం వీధితలుపు తీయాలని తోచలేదు. లోపలి గుమ్మం గుండా లోగిలిలోనికి పరుగెత్తాలని అనిపించలేదు. ఇద్దఱం వున్నాం కాబట్టి ఒకరి వొంక వొకళ్ళం చూచుకు ధైర్యం వహించినట్టు సంచరిస్తూ అలా తల్లక్రిందులు నీడను పరీక్షింప సాగాం— పరీక్షిస్తూ— "కాళ్ళు ఆకాశాన్ని పెట్టుకు నడిచేవాళ్లు దేవతలు గాక మఱొకరు కారు. దేవతల నీడలు అవి" అని నిర్ధారించుకుని అదో పెద్ద రహస్యం కనిపెట్టినట్టు ఇద్దఱం కలిసి

ఆలా నిలబడి పోయి నీడను గంటూ వినడానికి చెవు లొగ్గాం—చెవు లొగ్గాం— ఆవలనుంచి ''అయ్యగారూ!'' అని కేక వినిపించింది. నీడ నోరు తెరచింది. నీడ నోరు తెరవడమే చూడనూ ఆవల అరిచింది ఎవరో తెలిసి కోమా?— ఒకడు నీడ చూస్తూవుంటే,



రెండో వాణ్ని నేను తలుపు తెరచి చూచాను. ''నీడ మాయమైంది అని నా మిత్రుడు, ''ఆవల నిలబడి. నోరు తెరచుక అఱచినవాడు వెలివాడ వీరడు— మా పాలి కాపురా!'' అని నేను నివ్వెరపోయాం. ''మఱి మాలకులాన్ని దేవతలు చూస్తారా? చూడ'' రని మేం, బ్రాహ్మణ మాణవ కులం, అనుకున్నాం.

క్రమంగా ఈ గోప్యం వూళ్లో పిల్లకాయల్లో వ్యాపించిపోయింది. మందు మట్టమధ్యాహ్నమప్పుడు, రోజుకు రోజుకు, మా నీడల నడలోనికి వచ్చే బుడుతల సంఖ్య ఎక్కువ కాసాగింది. వారూ వారూ లోపలికి రాక ముందు, నీడ, నీడ వెనుక నీడ,— తలుపు వారికోసంగాను నేను తెఱచే ముందు, గోడ మీద పడుతూ వచ్చేవి.—తుదకు ''ఆ నీడలు, మావే మా పిల్లకాయల నీడలే'' అనే ఒకానొక వివేకాన్ని బలిసి పోయినాం! కొందరం నడువీధిలో ఎండప్పుడు నిలబడ్డం, వీధితలుపు మూసివుంచడం, కొందఱం లోపల ఉండడం, ఈలా అన్యోన్యం నీడల ప్రదర్శనం గోడమీద కావించుకుంటూ నీడల్ని నృత్యంలోనికిదింపాం. చమక్‌గా సింహద్వారం మధ్యమధ్య తెరుస్తూ సత్యం చూఱగొనేవాళ్లం.

ఆ నృత్యాన్ని, ఆ సత్యాని పెద్దవాళ్ళకు కాపరుద్దాం అని అప్పటప్పట ఆదుర్దా పడేవాళ్ళం గాని, మేం, కుఱ్ఱవాళ్ళం,— అంతం తైవటు డంతయై— అన్నట్టు మాకు తెలియకుండా అంతలో ఎవరంతటవాళ్లం ఎదిగి, మేమే పెద్దవాళ్లం అయినాం. ఆ పురాతనపు టింటి వీధితలుపునకు ఒక బెజ్జం, అంతకన్న పురాతనపుది వొకటి వున్నట్టు కనిపెట్టాం. అంతకన్నా పురాతనపుది అని ఏలా అంటున్నానంటే, చెట్టున పుట్టిన బెజ్జం, రంపకారీ కోతకు కూడా వెలితిగా వుండిపోయిందట! తలుపు బల్లని!— ఆ చెట్టు ఏనాటి చెట్టైనా కావచ్చును— అడవి పొలంలో మ్రానులు కొట్టించి, తెప్పించి, కోయించినట్టు ప్రతీతి.

అడవి పొలం అనగా అనాదిది! ఔరా! ఆ బెజ్జంగుండా నడువీధిలోని మిడసరలగ్నపు కాంతి మా నడవలోనికి ఏరోజు కా రోజు పడుతూ నీడలుచూపించేది! నీడల నాడించేది!

ఇప్పటికీ ఆ బెజ్జం అలాగే వుంది. ఆ తలుపుని, ఆ తలుపు అలాగే వుంది ఆ యింటిని— ఆ యింటి ఆ నడవలో ఇప్పటికీ ఆ వేళకు ఆ నీడలు అలా కనిపిస్తూనే వుంటాయి. కాని ఒకటి జరుగుతూ వుండాలి. నడవలో ఒక డుండాలి ద్రష్ట. వీధిలో వొక డుండాలి ప్రదర్శించేవాడు.— ఇంతకూ లోపం, ఎవని నీడ వాడు చూడలేడు. ఎంత వాని నీడైనా తల్ల క్రిందులుగానే కనిపిస్తుంది!

అందుచేతను, నేను పెద్దవాణ్ణై, అందులోనూ పదార్థవిజ్ఞాన శాస్త్ర మందలి ''వేడిమి— వెలుగు''ను గురించిన పాఠాలు పదవ తరగతిలో నేర్చుకొని, సూర్యకిరణాలంటే ఏమిటో, బెజ్జాలు (ఛింక్సు) గుండా వాటి ప్రసార మెట్టిదో, అద్దాల్లో వాటి ప్రతిఫలం ఎట్లాంటిదో ఇదంతా బాగా అవగాహన అయిన ఈ తరువాతను, మరి ఆ నీడల నడవలో అదృష్ట్యా నేను అడుగు ఇడింది లేదు. నా తరువాతి తరం వారు ఆ ఆట అనుభవించింది కూడా మృగ్యం.

అయితే నీడలు! నీడలు!! చిన్నప్పుడు నేను గని ఆటాడించిన నీడల నడవలోని నా చెలికాండ్ర నీడలు నాతో కూడా, నేను పెద్దవాణ్ణైనా, వుంటూనే వచ్చాయి. ఇంటికి పెద్ద నయ్యాను గాని, కంటికి పెద్దను కాజాలక పోయాను.

మరి 1926లో నాకు చాలా జబ్బుచేసింది. బ్రదుకనే అనుకున్నా రట ఒకటి రెండు రోజులు కొందఱు కొందఱు. అప్పుడేం జరిగిందీ! నా గదిలో కెంద తెందఱో వచ్చి, నీడల్లా నిలబడిపోయి వున్న వాళ్లను, పొద్దోయి, ఒక రోజున మంచంమీద నుండే చూచాను. ''నీడల్లా'' అని అనడానికి కారణం వాళ్ళ చాయ నలుపు. పోనీ నా చిన్నప్పటి సహవాసుల నీడలా అని తలచేనో కావు. వీరు తల్ల క్రిందులుగా లేరు. నిలువుగా నిలబడి వున్నారు, నీలమేఘచ్ఛాయా శరీరులై. వారి నుదుళ్లపైని వైష్ణవనామాలు తేటతెల్లంగా కనిపించాయి. సశరీరులైన విష్ణు దూతలు కానోపుదురు! ఎందు క్కాకూడదు?— నాకొఱకు వా రేల వచ్చి యుండకూడదు?— ఒక్కుమ్మడి భయము భక్తీ నాలో నెలకొనసాగాయి. సంధిలో నే నెలకొనసాగాయి అనుకోవాలి మీరు. తేట తెల్లంగా తీర్చి దిద్దిన పంగనామాలు, బలు మొగాలూ వారూ గది క్రిక్కిరిసి పోయారు.

నాకు ఊపి రాడ్డం లేదు వారి ఊపిరుల దండడిని; నాకు మాటలు కట్టడ్డాయి వారి ఉబుసుల సందడిని. వారు నా మంచం చుట్టూ మూగి మూగి ఉగ్గబట్టుకు దేన్నో లాగుతూ వున్నట్టుగా, బలంగా లాగుతూ ఉన్నట్టుగా ప్రలాపించారు. మంచం పట్టినవాణ్ణి, బలహీనుణ్ణి, రోగిని— నేను— అమాంతంగా సశరీరంగా మహత్తమ మైన సత్త్వాలతో,

వైహాయసవీథికి ఉత్తీర్ణుడనుగా, ఉండిఉండి నిలువునా నిలబడిపోయాను.— విష్ణుదూత లందఱూ చెక్కు లల్లార్చుకుంటూ నాతో కూడా పైకెగిరి వచ్చేలా చేష్టించారు. నేను, ఆ మహావిష్ణువు యొక్క పాదారవిందా ల్ని అందుకున్నాను అంటే నమ్మండి! ఆ వైకుంఠవాసుని కన్నులకు సరాసరి ఎత్తున తిన్నగా నా కన్ను లుంచి సందర్శించాను అంటే విశ్వసించండి! కానీ ఒక చిత్రం! తోడి మానవుల దృష్టిలో నే నెక్క డున్నవాణ్ని అక్కడే వున్నాను. పుష్టి ఏమాత్రం నాలో లేనట్టే కనిపించేను వారికి—వారు వెంటనే వైద్యుని పిలిపించి నా గోడు నా గోష్ఠి విశదీక రించారు. నా నాడి పరిశీలిస్తూ నవ్వా డమ్మ హానుభావుడు. "నాడి మాంచి బలంగా వుంది! ముక్కోటి వేల్పులూ వచ్చి లాగినా లాక్కు పోలేరు. ఆ మహావిష్ణువు వేంచేసి కూడా సాధించలేడు. ఎందుకు మీకు సంశయం? నేను "క్వైనైన్" మోతాదు ఎక్కువచేసి యిచ్చాను, దాని లక్షణం గాని మతొకటి కాదు. ఏ విధమైన జంకూ లేదు." అని ధైర్యం చెప్పాడు.

వైద్యుణ్ని చూడ్డంతోనే ఏదో వికటప్రశ్న వేయాలని రోగి కెప్పుడూ బుద్ధి అయినా అందఱికీ ఆయన మాటలు ధైర్యం గొలుప వచ్చును గాక! నాకు? నా ముందు రంగు పుంత్రా లున్నంతసేపు?— "విష్ణుదూతలో?" అని అడిగాను సూటిగా చూపిస్తూ. నా చూపుడు వ్రేలు ఆ సమయాన్ని ఎవరిని చూపించిందో, ఎందాకా సాచబడిందో నాకే తెలియదు. గదిలో వున్న వాళ్ళ అందరి దృష్టీ, డాక్టరు మహాశయుని దృష్టిసమేతంగా, నా చూపుడు వ్రేలి మార్గాన్నే, అనంతపథంలోనో, ఇంకా దాని అవల దేన్నో, దేన్నో కేంద్రీకరింపం బడింది—తెప్పపాటు కాలం! "కళ్లు మూసుకు నిదరోండి. మరి మధ్యాహ్నం మందు వాడ కండి. మందు మారుస్తున్నాను. మార్చిన మందు వెంటనే తీసుకోండి" అని సలహా యిస్తూ, అతిశాంతంగా, మిక్కిలి నిశ్చింతగా నిష్క్రమించాడు డాక్టర్. నేను, దీర్ఘాయు ష్మంతుణ్ణేమో బ్రతికాను. "గండం గడిచింది" అనుకున్నారు కావలసిన వాళ్ళందఱూ. కాని నాకు, డాక్టరు గారికి ఆ దివ్యసందర్శనాన్ని గురించి తీరని చర్చ కొంతకాలం సాగింది. తుద కిలా తేల్చాం. "నేను వ్యాధిగ్రస్తుణ్ణై పరున్న రోజుల్లో కాపురమున్న చతురంగణం వైష్ణవాగ్రహారం కాబట్టిన్నీ, ఇంటి కెదురుగా శ్రీ ఎంబెరుమన్నారుస్వామి దేవాలయం వున్న కారణాన్ని బట్టిన్నీ—శ్రీ రామానుజ మతం మనస్సున కెక్కి అలాంటి మాయలో పడ ద్రొబ్బింది." అని తేల్చాం.

తేల్చామే కాని ఆ సందర్శించిన రూపాల్ని ఈ లోకంలో వాక్కరితోను సరిపోల్చ లేకుండా వున్నాను. తొల్లింటి వైకుంఠపురమునకు కల్లెదర కట్టి వున్న కోవెలకు హస్తిమశకాంతరం. అసలు రెండింటికీ పరస్పరం పోలికే లేదు. కాబట్టి మందుతోను మతంతోను సంబంధం లేని చిన్మయ స్వరూప సాక్షాత్కార మేల కాకూడ దది? పక్షాంతరంలో చిన్నప్పుడు గన్న తల్లక్రిందుల నీడలే, తోడునీడలై, కాళ్ళ మీద నిలబడి నామాలు ధరించి నాకు అమృతం పోసి వున్నాయేమో? ఈ కడాపటిదే సిద్ధాంతం.

మా ''నీడల నడవ'' యొక్క వీథి తలుపు నెలావున్నదాన్ని అలా అనశ్వరంగా అట్టే పెట్టండి. ఇదే నా తుది కోరిక.



# వారసత్వం

శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రి

వెంకట్రావు—స్కూలు మేష్టరు.

నారాయణరావు—స్నేహితుడు.

రాజేశ్వరి—భార్య.

రమణరావు—రాజ్యంపినతండ్రి.

ప్రవేశం : రాజేశ్వరి - నారాయణరావు.

[లోపలనుంచి చెంబులు గ్లాసులు గిరవాటేస్తూన్న చప్పుడు. అమ్మా! అన్న పెద్ద నిట్టూర్పు. ఆ నిట్టూర్పులో నారాయణరావు ప్రవేశం.]

నా:- అదేమి టమ్మా! రాజ్యం! వెంకట్రావు కేమైనా వంట్లో...

రా:- బాబుగారు! సమయానికి వచ్చారు. జబ్బూ లేదు, ఏమీ లేదు.

[లోపలనించి మళ్ళీ పెద్దమూలుగు.]

నా:- ఏమి టమ్మా మరీ- అంత- అలా.

రా:- ఏమీ లేదు బాబుగారూ మీరేం ఖంగారుపడకండి. నిక్షేపంలా ఉన్నారు. మధ్య మధ్యను అలా మతిపో తూంటుంది ఆయనకు. ఏం చెయ్యడానికి తోచక చస్తున్నాను.

[లోపలినించి మళ్ళీ పుస్తకాలు గిరవాటేస్తూన్న చప్పుడు]

రా:- వింటున్నారా బాబూ. మీరేనా కాస్త చెప్పి ఈ గొడవ మానిపిస్తేనేకాని నే నీ ఇంట్లో ఒక్కక్షణం కాపురం చెయ్యలేను.

నా:- ఏమిటమ్మా అసలుసంగతి ఏమిటి?

[లోపలనించి పద్యం.]

కనికరము లేని దుఃఖవేదనల సెగల
పొగల విరజిమ్ము వలపుటూర్పుల భరమ్ము
మోసికొని, నేనె నాలోనె మూల్గుకొనుచు
గాలివోలె సమ స్తావకాశములను
నెడతెరపిలేక తిరుగాడి బడలినాను
దారుణపు జీవితంపు టెడారిలోన
తీరని పిపాస నే దారితెన్ను లేక
నేనె నా దుఃఖబాష్పశోణితలహరుల
నే విసుగువేసటలు లేక త్రావినాను.
కడుపుగాల్చెడు మండుటాకటను రేగి
కోర్కె లొండింటిని గ్రసించుకొనెడికాలది
నొడలెరుంగక కాలమృత్యువును నేనె
కొంచెముగ గొంచముగ గబళించినాను.

[విచారంలోకి మారిన పెద్దనిట్టూర్పు.]

రా:- ఇదీవరస. ఏమని చెప్పను బాబు గారు. ఏమీ తోచనప్పుడు తీరి కూచుని ఇల హంగామా చేస్తారు. ఇంట్లో వున్న చెంబులూ, గళాసులూ గిరవాటెట్టడం. ఈ పద్యాలు చదవడం, ఏడుస్తూ కూచోడమూను. శలవుగోజు వచ్చిం దంటే హడలి చస్తున్నాను.

నా:- ఎందు కమ్మా అంత భయం- నిన్నే మన్నా......

రా:- అబ్బె బ్బే... ఏమాట కామాటే అనుకోవాలి, నన్నేమన్నా అంటున్నారని కాదు.

[మళ్ళీ లోపలనించి పద్యం నిట్టూర్పు.]

నాకు ప్రశాంతి లేదు, కఠిన మ్మగు
 శూన్యమునందు గ్రుంగి చీ
కా కయిపోయె నా బ్రదుకు, కన్నులు వి
 ప్పిన మూసికొన్న బా
ధాకలుషమ్ము లాశ లెడదన్ విద
 ళించుచు నిస్సహాయతా
వ్యాకుల శోకగీతులె యహర్నిశ
 మున్ వినవచ్చు రోదసిన్.

నేను నిశీధి నొంటి శయనించ గ
 భీరతమోబ్ధి సంకులో
ర్మీనికరమ్ములుం బులకరింపగ నా
 తుదిలేని సైపగా
రాని ప్రవాసజీవనభరమ్ము స్మరించు
 చు రక్తబాష్పముల్
సోనలువార నేడ్చెద నులూకవిలో
 కనముల్ చెమర్పగన్.

నాయెద కీ ప్రపంచమనినన్ మృగతృష్ణల
 యింద్రజాలమై
పోయెఁ గలంతనిద్రఁ గనుమూసితి
 నేని మనోహరాకృతి
చ్ఛాయ యెదో కనంబడుచు స్వప్నములం,
 బవలెల్ల దుఃఖముం
బాయనియట్టి నా హృదయ మర్మములన్
 మెలివైచి త్రుంపెడున్.

నాకిపు డెల్లవేళల వినంబడుచుండె నకాలమృత్యు గర్జాకలి తాట్టహాసముల సందదులందున ప్రేమవిహ్వలా శాకరుణమ్ము లొగుసగుసల్ మరి చైత్రశుభప్రభాత వం. శికల గాన మీ శిశిరజీవనమం దిక లేనెలేదొకో!

రా:- అనకపోతేమట్టుకు ''ఊరికే పుణ్యానికి తిని కూచుని ఎందుకు చెప్పండి, ఈ పద్యాలు, ఏడుపులూ, గందరగోళమూను; ఆయన, ఆ కవి- ఎవరో ఈ పద్యాలు నన్నేడిపించడానికి రాసినట్టుంది కాని-పోనీ ఆరాసిన ఆయన ఇలా అస్తమానం ఏడుస్తూ కూచుంటూ డండీ! కూచుంటే ఆ పెళ్ళాం సహించి వూరు కుంటుందా! ఆయనకు లేని ఏడుపు మధ్యను ఈయన కెందు కంట——

నా:- వాళ్ళ ఏడుపంతా ఒక్కసారి పద్యంలో వెళ్ళబోసుకున్నారు. తీరిపోయింది. దాని కేం కాని, పోనీ ఎందు కితను ఇలా బాధపడుతున్నాడో ఒక్కసారి నెమ్మదిగా కను క్కోకపోయినావు!

రా:- అడిగా నండి! అడక్కనా- అడుగుతే నా కేమైనా సరిగ్గా సమాధానం చెపుతారా ఏమన్నానా!

నా:- ఏ మంటాడు?

రా:- ఏమిటో ఆయన బాధపడుతున్నా రట. ఆయన బాధ అర్థంచేసుకునేవాళ్లెవళ్లూ లేరట.

నా:- ఏమిటా బాధ.

రా:- ఏమో అదే నాకూ అర్థంకాక ఛస్తు న్నాను.

నా:- రంభలాంటి భార్య, రత్నాలులాంటి పిల్లలూ, ఏదో చిన్నదైనా ఉద్యోగం, కొద్దో గొప్పో వెనక కొంత ఆదరువూ, ఇన్నివుంటే యింక నేం బాధమ్మా. ఏమీ లేనివాళ్లం మేము నిక్షేపంలా ఉంటేను.

రా:- ఆయన కివేవీ అక్కరలేదట. ఈ సంసారంమీద అసహ్యం పుడుతోందిట.

నా:- ఏమిటో! ఇంతవైరాగ్యానికి కారణ మేమిటో! కొంపతీసి ఆశ్రమస్వీకారం చెయ్య వలె ననె ఆశ బయలుదేరలేదుకదా!

రా:-అబ్బెబ్బే అ దేం కా దు. ఆశవున్నది ఆశ్రమంమీద కాదు. అర్థం మీద.

నా:- దానికీ దైవానుగ్రహంవల్ల లోటు లేదుకా!

రా:- వున్నది చాలదట- ప్రపంచంలో తమ రొక్కరూ తప్ప అందరూ సుఖపడుతున్నారట. తమకు ఎందుకూ ఈ వెధవ సంపాదన చాలడం లేదట.

నా:- పోనీ అయితే వేరే వ్యాపారం ఏమైనా పెట్టుకుని సంపాదించుకోకూడదూ!

రా:— అది పనికిరాదుట మళ్ళీని- ఊరికే రావాలట. అందరికీ వూరికే వస్తోందిట. ఆపైన మా పినతండ్రి ఇంకా బ్రతకడ మేమి, తమకు త్వరగా ఆ డబ్బు రాకపోవడ మేమని అదుర్ధ!

నా:- అదేమిటి?

మీ రెరుగరా ఏమిటి? నాకు పినతండ్రి ఒకాయన ఉన్నారు, రమణారావుగా రని. ఆయన చిన్నప్పుడే దేశాంతరం వెళ్లిపోయాడు. పెళ్లి చేసుకోలేదు. అక్కడ వ్యాపారం చేసి చాలా డబ్బు సంపాదించాడట. ఆయనకు చిన్నప్పటినుంచీ నే నంటే చాలా అభిమానం.

నా:- అలాగా. నే నెప్పుడూ వినలేదు. మళ్ళీ ఎప్పుడూ రాలేదూ? ఇక్కడికి?

రా:- లేదు. కాని నాపెళ్ళికి చాలా బహుమతులూ వస్తువులూ పంపించాడు. మళ్ళీ మా పెద్దవాడు పుట్టా డని విని చాలా సంతోషించి వాడి కేవేవో పంపించాడు. వాడికే తనపేరు పెట్టవలసిందనీ, తన ఆస్తి అంతా నాపేర వ్రాశాననీ, అందులో సగం పెద్దాడికి యివ్వ వలె ననీ విల్లు రాశాడట. అప్పుడప్పుడు నాకు వుత్తరాలు రాస్తూంటాడు. ఎప్పుడేనా ఏదేనా ఇబ్బందిగా ఉందంటే సహాయపడు తూంటాడు.

నా:- మ రింక నే మమ్మా!

రా:- అది చాలదట. రోజురోజు నన్ను రాసి డబ్బు తెప్పించమని చంపుతారు. బాగుం టుందా బాబుగారూ మీరే చెప్పండి. ఆయన ఒక్కడే కదా! మనం పిల్లలతోటి ఇబ్బంది పడుతున్నాం కదా, ఆయన అవసరాని కేదో కాస్త వుంచుకుని తక్కిన డ బ్బంతా ఇక్కడికి పంపకూడదా అంటారు. ఇంత అన్యాయం ఎక్కడేనా ఉంటుందా?

నా:- అన్యాయమూ మరీ అన్యాయమూ! ఎంతమాట. ఆయన అక్కడకి ఏదో తోచిన సహాయం చేస్తూనే ఉన్నా డంటివి. ఏమి టింత ఇలా అయిపోయా డేమి టితను. ఇన్నాళ్ళనుంచీ ఊరికే ఆధునిక కవిత్వం మీద అభిమాన మనుకున్నా కాని, ఇంత అధ్వాన్నంగా తయా రయ్యా రనుకోలేదు.

రా:- ఈ పద్యాలతోటే మరీ వుట్టిముల కొచ్చిపడింది బా బూ! అస్తమానం ఆ పద్యాలు చదవడం, ఆయాసపడడం, కంట

తడిపెట్టుకోడం! నిక్షేపంలా ఇంట్లో కూచుని పిల్లలముందు ఏం బాగుంటుంది చెప్పండి! తమ కేమి లోటొచ్చిం దని! సాటి వాళ్ళ కంటే తమ కేం తీసిపోయారు. నే ననకూడదు కాని, తమకు ఎక్కడ ఏం లోటొచ్చిపోతుందో, ఏం మనస్సు ఇబ్బంది పెట్టు కుంటారో అని, నమ్ముతారో నమ్మరో వెయ్యి కళ్ళతో కనిపెట్టి సంసారం ఈదుకువస్తున్నాను.

నా:- అయ్యో! కాదుటమ్మా—ఎంతమాట నమ్మక పోవడం కూడానా, నా కళ్ళతో నేను చూడడం లేదుకనకనా! నిజానికి నీవంటి యిల్లాలు ఇంట్లో ఉందికనకనే అతను ఏ ఇబ్బంది పడకుండా, ఏ బాధ్యతా వహించ నక్కరలేకుండా హాయిగా సుఖపడుతున్నాడు. అతన్నీ చూసి అసూయపడేవా ళ్ళెంతమంది. తనసుఖం అతను తెలిసికోలేకుండా ఉన్నాడు. కాని ఇంతదృష్టవంతుడు మాలో మరొకడు లేడని మేమూ అస్తమానం అనుకుంటూం టాము.

రా:- మీరు ఆయనతోటి ఒక్కమాటు చెప్పాలి, ఈ వరస ఏం బాగుందికా దని. మీరు పెద్దలు. మీ మాటంటే ఆయన కెంతో గౌరవం.

నా:- అయ్యో— అలాగేనమ్మా: చెప్ప డాని కేమి? కాని ఇలాటిదానిలో నేను పై వాడిని ఎలా కలగజేసుకోవడం. నా సంసార గొడవ నీ కెందు కంటె నే నేంకావలసింది. ఒట్టప్పు డెంత గౌరవ మున్నా ఇలాటి వాటిలో,....

రా:- పరవాలేదు బాబుగారూ! మీ రేం సందేహించకండి.

వెం:- రాజా! ఈ మాటేనా నా ఉత్తరానికి జవాబు లేదుకాదూ.

ఆ ముండాకొడుకు ఉన్నాడో ఊడాడో... [అంటూ వెంకట్రావు ప్రవేశం]. [నారాయణ రావుని చూచి] ఇదిగో నారాయణరావుగా రొచ్చారే! ఎంతసేపయిం దండీ వచ్చి- రాజా! చెప్పేవుకావేం! వీ రొచ్చినట్టు.

రా:- ఏంచెప్పినా మీ రేమన్నా వినిపించు కునే స్థితిలో ఉన్నారు కనుకనా; మీ పద్యాలలోనూ, మీ విచారసాగరంలోనూ మునిగి ఉంటే ఎవరు వచ్చిందీ పోయిందీ మీ కేం తెలుస్తుంది. మీ కేంకావాలి. [అని లోపలికి పోతుంది.]

వెం:- రండి నారాయణరావుగారు. కూర్చోండి. చాలాసే పయిందా వచ్చి.

నా:- ఏదో పదినిముషా లయింది; కాని ఏమిటో హడావుడిలో ఉన్నట్టున్నావు?

వెం:- హడావు డేముంది! ఏమీలేదే!

నా:- ఏదో లోపలనుంచి చప్పుళ్లూ, పద్యాలూ, నిట్టూర్పులూ వగైరా చాలా వినపడ్డాయి.

వెం:- ఏదోలెండి, మధ్య మధ్య నాకు Depression వస్తూ ఉంటుంది.

నా:- అంటే వంట్లో బాగాలేకనా!

వెం:- అబ్బే— అదేంకాదండీ!

నా:- మరి ?

వెం:- అదో Mood—

నా:- ఏమిటో నాకీ Moods ఏమీ అర్థం కావు— చెప్పొద్దూ!

వెం:- కాకపోవచ్చు. మీ దంతా అదో పద్ధతి.

నా:- అంటే!

వెం:- మీకు ఒడుదుడుకు లేమీ లేవు, వాంఛ లేమీ లేవు. ఉన్నా లేనట్టు నటించ గలరు. కాలవమీదికి పడవలా వెళ్ళిపోతుంది మీ జీవితం.

నా:- నీదిమట్టుకు ఎందుకు వెళ్లదు అలాగ?

వెం:- ఎందుకు వెళ్ళదంటే ఏమి చెప్పను? నా దురదృష్ట మనుకోవాలి. చిన్నప్పటినుంచీ కూడా నేను పూర్వపుబాటలో నడవడం నా కిష్ట ముండేదికాదు. నేను ఈ కాలపువాడిని. ఈ నాటి ఆలోచనలూ, కోరికలూ, ఆశయాలు, నా ప్రతి రక్తనాళంలోనూ పరుగులెడుతూం టాయి. ఇప్పుడున్న పద్ధతులు నాకేమీ నచ్చవు మనఖర్మం అనుకుని వాటికి లొంగి బానిస నై ఉండడం నా చేతగాదు. అది దాస్యలక్షణం. దాసుడి ననిపించుకోడం నాకు సుతరామూ గిట్టదు.

నా:- అందుకని ఏమంటావు ?

వెం:- ఏమంటానా ఉన్నదానితో అసం తృప్తి. లేనిదానికోసం తీవ్ర వాంఛ. అందు కని అస్తమానం జీవితంలో అశాంతి.

నా:- ఈ జబ్బుకి మందేం లేదా ?

వెం:- లేకేం ఉంది, ఎటొచ్చీ నా కందు బాటులో లేదు. ఈ కాలంలో సమస్త వ్యాధు లకూ దివ్యౌషధం ధనం. అది వుంటే అన్ని వాంఛలూ తీరతాయి.

నా:- వ్యాధి ఫలానా అని తెలిసి దానికి చికిత్స కూడా తెలిసిఉండే ఇంక బాధపడడ మెందుకు ?

వెం:- మందుకోసమే ఇప్పుడు పడుతూన్న బాధ. ఈ వెధవ మేష్టరులో మనకు కను బొమ్మ మీద వెంట్రుకలాగ ఎదుగూ బొదుగు లుండవు కదా! వాళ్లు కడిగి ఇచ్చిన జీతపు రాళ్ళతో కాలక్షేపం చెయ్యడం నాచేత గావడంలేదు. పోనీ యిది మానేసి మరో టేమైనా చూసుకుందామంటే మనం మరెం దుకూ పనికిరాం.

నా:- అందుకని మన కామాత్రం స్వస్వ రూపజ్ఞానం ఉందికనుక ఊరికే బాధపడేకంటే ఉన్నదానితో తృప్తిపడడం మంచిది కదూ!

వెం:- మంచిదే! కాదన్నవా రెవరు? "ఫలములు చాలు జీవికకు, బానముసేయ జలంబు చాలు, వల్కలములు చాలు కట్టుట, కిలాతలముల్ శయనింప చాలు" నన్న సంగతి తెలియకనా! ఇలాటి వేదాంతాలు చాలా తెలుసును! తెలియక కాదు. కాని చెప్పాను కదూ. నేను సంతృప్తిపడి ఊరుకోలే నని, సృష్టిలో ఇంత సౌందర్య ముండగా ఇన్నిరకాల భోగ్య పదార్థా లుండగా, ఎలా నోరు మూసు కూరుకోవడం? పోనీ మనకు గతిలేదు, లాభం

లేను, అనే నిరాశేనా కలుగుతే మనఖర్మం అనుకుని ఒక్కసారి నీళ్లు వదలుకోవచ్చు.

నా:- అయితే నీకు వేరే ఆశ ఏమైనా ఏడిపిస్తోందా ఏమిటి?

వెం:- అదే వచ్చిన చిక్కు. నాకు పిన మామగారు, ఒకాయన ఏడిశాడు. కానైతే నే నెప్పుడూ చూడలేదు. కాని ఆయన ఏదో న న్నేడిపించడానికే పుట్టినట్టున్నాడు. ఆయన బ్రహ్మచారి. బోలెడంత సంపాదన. ఖర్చు అయే మార్గం లేదు. పోనీ ఆయన క్షోభ మన కెందు కని ఊరుకునేవాళ్ళం. అలా ఊరుకో నివ్వక ఆయన ఆస్తంతా మా రాజాకి, మా పెద్దాడికి రాశా నని ఉత్తరం; మధ్యమధ్య ఏదో కాస్త మా మొహాన్న రాలుస్తూండడం; దానితో లేని పోని ఆశలు బయలుదేరాయి.

నా:-అయితే ఇంకనేం బాగుంది.

వెం:- బాగేమిటండీ నాబొంద. ఆయన కొంచె మించుమించుగా నా ఈడువాడు. ఆయన చచ్చే దెప్పుడు. ఆ ఆస్తి మాకు వచ్చే దెప్పుడు? మేం అనుభవించే దెప్పుడు?

నా:- అయితే నువ్వు- ఆయన్నిప్పుడు నీ సౌకర్యం కోసంఅర్జంటుగా అవతారం చాలించ మంటావు. మంచి పెద్దమనిషివే!

వెం:- నే నంత దారుణం కోరడంలేదు. కాని కొంతమా మొహాన్ని ఇప్పుడే తగలెయ్యక కూడదా అంట.

నా:- అది కాస్తా నువ్వు తగలేస్తావేమో నని ఆయన భయం కాకూడదా అంట.

వెం:- నే నెలా తగలేస్తే ఆయన కెందుకు. ఆయన duty ఆయన చెయ్యాలి కాని——

నా:- కష్టపడి సంపాదించిన వాళ్ళకు డబ్బు విలువ తెలుస్తుంది. నీపాటివాడు, తేరగా వచ్చిందికదా అని తగలేస్తాంటే చూచి వూరుకోలేరు. అదలాఉంచి నువ్వెందుకా డబ్బుకోసం ఆశించడం! నీకేం లోటు. ఏదో ఒక సుఖమైన ఉద్యోగమా! పైన మరికాస్త సంపాదనా! ఆపైన మరికాస్త పిత్రార్జితమా! ఇవన్నీ జాగ్రత్తపెట్టి నీ కేలోటూ రాకుండా వెయ్యికళ్ళతో, కన్నతల్లిలా కనిపెట్టే కళత్రమా! పళ్ళలాంటి పిల్లలా! ఇవేవీ చాలక నీకు అశాంతా! విచారమా! జీవితం నరకమా! ఎందు కొచ్చిన కబుర్లయ్యా ఇవి. ఇందులో అర్థమేమైనా ఉందా!

వెం:- ఏమీ ఎందుకు లేదూ? జీవితమంటే తిండి, పెళ్ళాము,పిల్లలూనా? ఇంకేమీ లేదూ? గోచీకి పెద్ద అంగోస్త్రానికి చిన్న అయిన ఆస్తులూ, సంపాదనలతో తృప్తిపడడంఎలాగ? రెండు పూటలా భోజనం తప్ప మరేం కావా లన్నా దరిద్రమా? నేను ఎంతో ప్రేమించే భార్యనూ బిడ్డలనూ అలంకరించుకుందామంటే దరిద్రమా! అవసరమైన పుస్తకాలు కొనుక్కుందామంటే దరిద్రమా? శుభ్రమైన కుర్చీలకు బల్లలకు మొహంవాచా! ఆఖరుకు చక్కని తివాసులుకాని చాపలుకాని దేనికికాని చాలని సంపాదన. ఆస్తిఎందుకండీ! ఏడవను!

నా:- అవీలేక ఏడ్చేవాళ్ళు ఎంతమంది బాబూ——ఉండడానికి ఎక్కడికి? నీ కంటె

మరొకడు గొప్పవాడు. మరొకడికంటె విజయనగరం మహారాజు, ఆయనకంటె హైదరాబాదునవాబు, ఆయనకంటె Rock feller లేక Carnegie గొప్పవాళ్ళు ఎక్కడికి అంతు ? నీకంటె తక్కువ వాళ్ళు కోటానుకోట్లు ! వాళ్ళందరిముందూ నువ్వో పిల్లజమీందారువి. ఎక్కడదాకానో ఎందుకూ ? మనమేష్టర్లందరికంటే నీ స్థితి మంచిదని ఒప్పుకోక తప్పదు. ఈ అశాంతి, అసంతృప్తి, ఈ వేదన ఇవన్నీ అర్థం కాని మాటలు. దాన్నే Byronic unhappiness అంటారు. సమస్తసుఖములూ అనుభవిస్తూ ఏదో బాధపడుతున్నాననడం కవులకు చెల్లుతుందేమో కాని మనకు కాదు. ఇంతదూరం చెప్పవలసినవాడిని కాను కాని, నీవు చేస్తూన్న గందరగోళంచూచి, పాపం రాజ్యం పడుతున్న బాధ చూచి వూరుకోలేక పెద్ద వాడిని కనుక, సాహసించి ఈ మాటలు నాలుగూ అన్నాను. మరోలాగ అనుకో వనుకుంటాను. వస్తాను పనుంది. నీవుకూడా బయలుదేరి వస్తావేమోనని యిలా వచ్చాను.

వెం:- నే ననుకోవడాని కేముంది. మీలాంటివాళ్ళకు – కేవలం Prosaic people కు ఇవేమీ అర్థంకావు లెండి. వెడుదురుగాని లెండి. కంఠశోష చాలాపడ్డారు. కాస్త కాఫీ పీల్చి పోదురుగాని.

నా:- ఇప్పుడు కంఠశోషలా కనబడ్డా నిదానంమీద నిజం నీకే తెలుస్తుంది. మళ్ళావస్తా.

[అని నిష్క్రమిస్తాడు]

వెం:- ఈ పెద్దవాళ్ళతో ఇదే వచ్చింది. నట్టి Matter of fact గాళ్లు! ఎక్కడా Imagination కాని Romance కాని Sentiment కాని ఏ కోశాన్ని ఉండ దనుకుంటాను.

కష్టభూయిష్ఠ దుఃఖాంత కథలతోడ
విసివిపోతిని పుటలు త్రిప్పినకొలంది;
కునుకు దీప మారదు; పొడికనుల నిదుర
రాదు; బరువైన యెద మనోరథము పోదు;
పేద మృగముల నెత్తురు పీల్చిపీల్చి
బలిసిపోయిన శ్వాపదమ్ముల విధాన
పెరగొలుపుగాని, ఘట్టముల్ వేగదనవు;
మనుజ పశువుల దౌర్జన్యమునకు లాగి
యినుప తలుపుల చెరబడ్డ యనపరాధి
కీరమట్టులు స్వేచ్ఛా విహారమునకు
రెక్కలార్చు ప్రాణము సుఖ స్పృహల కలల;
దేవతా విగ్రహము లేని తేరువోలె
నీరస నిరుత్సవ నిరలంకారమైన
ఈ వ్యథా క్లిష్టజీవిత కావ్యమునకు
నంతిమాశ్వాస శాంతిసమాప్తి ఎపుడొ.

## [రెండో రంగం]

ర:- అమ్మా ! వెంకట్రావుగా రిల్లి దేనా ?

రా:- అవునండి.

ర:- ఇంట్లో ఉన్నారమ్మా, ఇలా కూచోనా అమ్మా నిలబడలేకండా ఉన్నాను. మీ రేనా అమ్మా ఆయన భార్య.

రా:- అవునండి. దయచెయ్యండి. చాలా నీరసంగా ఉన్నారు. దూరాన్నించి వచ్చినట్లున్నారు పాపం! దాహం ఇవ్వ నాండీ.

ర:- నువ్వేనా తల్లీ రాజేశ్వరి. ఎన్నాళ్ళకు చూచానమ్మా. నేను బ్రతికి ఉండగా నిన్ను

చూడడం పడదను కున్నాను తల్లీ. నిన్ను కళ్ళతో చూడడానికే బ్రతికి ఉన్నా నమ్మా!

రా:- అయ్యో! బాబయ్యగారా! ఎప్పుడు వచ్చారు? ఎక్కడనుంచి? ముందు ఉత్తరమైనా రాశారు కారేం? ఇంత నీరసంగా ఇలా ఉన్నా రేమిటి? జబ్బు పడ్డారా? ఉండండి ముందు కాఫీ తీసుకొస్తాను.

ర:- నాఅమ్మ—నాతల్లి నామీద ఇంతప్రేమున్నదా? ఇక్కడికి రావడానికే భయపడ్డా నమ్మా—చాలా సందేహించాను.

రా:- ఎందుకూ—సందేహ మెందుకు, బాబయ్యగారూ—మీ యిల్లు కాదూ ఇదీ.

ర:- అలాగే అనుకొన్నా నమ్మా. కాని కాలం, పరిస్థితులన్నీ మారిపోయినాయి. అంతా తలక్రిందయింది. ఏమి చెప్పను. సిగ్గేస్తోంది చెప్పడానికి. నా ఆస్తంతా చూస్తూండగా హారతి కర్పూరంలా హరించిపోయింది. ఎందుకు పోయిందో, ఎలా పోయిందో ఇప్పటి కేనా నాకు వింతగానే ఉంటుంది. ఎలా వచ్చిందో అలా పోయిం దనుకుని కాళ్ళు నిలదొక్కుకుని మర్యాదగా బ్రతుకుదా మని మూడుసంవత్సరాల నుంచి విశ్వప్రయత్నం చేశాను. నేను చెయ్యని ప్రయత్నం, తిరగని వూరు, చూడని పెద్ద మనిషి లేరంటే నమ్ము. ఎక్కడా నాస్తి వాచకం తప్ప మరోమాట వినబడలేదు. అంత సంపాదించి అంత ఉచ్ఛస్థితికి వచ్చి, అంత పేరుప్రతిష్టలతో బ్రతికి, అక్కడినుంచి పాతాళంలో పడితే ఇంక మళ్లీ లేవడం ఎక్కడా? జీవితంలో ఉచ్ఛ ఒక్కసారే కాని ఇన్నిసార్లు రాదను కుంటాను. అదృష్టవంతులకుఆఉచ్ఛస్థితి చివరను వచ్చి జీవితాంతంవరకూ లాక్కొనిపోతుంది. నాపాటి నిర్భాగ్యుడికి ముందువచ్చి చివరకు ఇలా నరకకూపంలో పడదోస్తుంది. మీకెన్నో ఆశలు కల్పించి ఎన్నో వాగ్దానాలు చేసి, ఈస్థితిలో ఇక్కడకు ఎలా రానా అని సిగ్గుపడి, అడుక్కుతినడం మంచిదని నిశ్చయించుకుని తిరిగాను. అలాగే స్వదేశం చేరుకున్నాను. ఇక్కడ ఆ ముష్టికూడా పుట్టడంలేదు. అంతా నాకంటే దరిద్రులులా ఉన్నారు. ఈవేళకు నాలురోజులైంది అన్నం కళ్ళచూచి. ఇంక ప్రాణం పోయేటట్టుంది. పోయినా యిబ్బంది లేదు. నాకోసం ఏడ్చేవాళ్ళు ఎవళ్లూలేరు. కాని అలా వీధులో చావలేకపోయాను. ఎక్కడకి వెళ్ళను. ఆఖరుకు భయపడుతూ ఇక్కడికొచ్చాను.

రా:- (దుఃఖం ఆపుకుని) బాబయ్యగారూ ఎంతపనిచేశారు! ఇక్కడ నేనుండగా మరో ఆలోచన మీ కెందుకు కలగాలి!

ర:- అప్పుడు అన్ని ఆశలు కల్పించి ఇప్పుడు రిక్తహస్తాలతో వచ్చి మీ నెత్తిన...

రా:- న్యాయమా అలా అనడం నేను మీ పిల్లనుకానూ! డబ్బంటే నా పినతండ్రి అయి లేకపోతే కాకపోతారా! మీ అల్లుడు కూడా మరోలాంటి మనిషికాదు. మీ కేసందేహం అక్కరలేదు. మీ రిక్కడనుంచి కదలడానికి వల్లకాదు. ముందు స్నానం చెయ్యండి భోజనం

చేతురుగాని. [అని ఆయన్ని లోపలికి తీసుకు వెళ్ళి మళ్లీవచ్చి.] ఇదుగో ఏమండోయి మీకో శుభవార్త!

వెం:- ఏమిటది. మీ బాబయ్య డబ్బు పంపాడా.

[అంటూ వెంకట్రావు ప్రవేశం.]

రా:- అంతకంటె తమాషా! మా బాబయ్యగారే వచ్చారు!

వెం:- ఆ! నిజంగానే! ఏరీ నన్ను వెంటనే పిలిచావుకావేమి? ముందు వుత్తరమేనా వ్రాశారుకారేం. స్టేషనుకు వెళ్ళేవాళ్ళం.

రా:- లోపల స్నానంచేస్తున్నారు.

వెం:- కాసిని వేడినీళ్ళేనా పెట్టకపోయావు. Boilerలో క్షణంలో కాగుతాయి కదా! వంట చెయ్యాలో పలహారమో త్వరగా కానియ్యి.

రా:- పాపం భోజనమే చేస్తారుట. నాల్గు రోజు లయిందిట భోంచేసి.

వెం - ఏం వంట్లో బాగా లేదా!

రా:- లేదు. శారీరకంగాను, మానసికంగానూకూడా బాగాలేదు. పాపం.

వెం:- కొన్నాళ్ళిక్కడుండమందాం. హాయిగా ఉంటారు. దేశాటనం చేసివచ్చిన మీదట ఇల్లంటే ఏమిటో, సౌఖ్యమంటే ఏమిటో తెలుస్తుంది. పాపం శుభ్రమైన ఆవకాయకు కూడా మొహంవాచి ఉంటారు.

రా:- అవును పాపం.

వెం:- అయితే ఆయన ఆస్తంతా తీసుకు వచ్చేసి జీవితశేషం ఇక్కడనే గడపకూడదూ. ఇంకా ఎన్నాళ్ళు యిలా విదేశవాసం. సంపాదించినకొద్దీ ఇంకా సంపాదించాలనే ఉంటుంది. ఈ ఉన్నది చాలదుకనుకనా?

రా:- ఇక్కడుందామనే వచ్చేశారు. చాలా సిగ్గుపడుతూ, భయపడుతూ.

వెం:- ఏమి?

రా:-ఏమీలేదు. ఆస్తి అంతా ఒక్కకానీ కూడా లేకండా పోయిందిట.

వెం:- ఆఁ!!!

రా:- మూడేళ్ళనుంచి అష్టకష్టాలు అనుభవించి యాచనచేసుకుని బ్రతుకుతూ, అదీ దొరక్క ఎక్కడికి వెళ్ళడానికీ తోచక, ఈ రిక్తహస్తాలతో ఇక్కడికి వస్తే మీ రేమైనా అనుకుంటారేమో నని భయపడుతూ గత్యంతరం లేక నాలుగు ఉపవాసాలతో వచ్చారు.

వెం:- ఆ పాపం! ఎంతగూట. ఏమనుకుంటాము. ఎంతపనిచేశారు.

రా:- భయంకాదా పాపం. మన కేదో కనకాభిషేకం చేస్తానని ఆశకల్పించి ఇప్పుడు ఏమీ లే దని చెప్పడానికి మొహం చెల్లక, అబ్బ! ఎన్ని బాధలుపడ్డారో! ఆయన్ని చూస్తే కడుపు చెరు వౌతోంది.

వెం:- ఆస్తి పోతే మన మేం చేస్తాం. మన మేమైనా దాచిపెట్టామా! ఉంటే మన అదృష్టం. లేకపోతే మన దురదృష్ట మనుకుంటాం. అందుకని పాపం ఇంతకాలం ఇంత బాధ పడాలా! ఇంత సందేహించాలా! నీకు తండ్రిఅయినా, పినతండ్రిఅయినా ఉన్నది

ఆయనఒక్కరాయను. కష్టంలో కూతురుకాక ఎవరవుతారు. నేను మట్టుకు వద్దంటానా! అంత అవివేకినా!

రా:- ఆయనకేకాదు నాకూ భయంగానే ఉంది మీ రేమంటారో అని. ఇన్నాళ్ళనుంచీ మీరు చేస్తూన్న హంగామాకి.

వెం:- రాజా! ఇంతేనే నన్ను అర్థంచేసుకున్నది. ఇన్నాళ్ళనుంచీ కాపురంచేస్తూ నా స్వభావం సరిగా తెలుసుకోలేకపోయావు కదా!

రా:- తెలుసుకున్నాలెండి. ఆమాత్రం తెలుసుకున్నా గనుకనే ఇన్నాళ్ళు మీతో కాపురం చేయగలిగాను. లేకపోతే అప్పుడే విడాకు లిచ్చిఉందును.

వెం:- సంతోషించానుకాని ముందు పాపం ఆయనకు భోజనప్రయత్నం చెయ్యి—నిస్త్రాణ వస్తుందేమో కూడాను.

రా:- ఆ— (రా. నిష్క్రమిస్తుంది.)

వెం:—

అవని సురావళీ హుతహుతాశన కోమల
 ధూపధూమలా
ప్రవిశదవాటియందు వనభాగములందు
 గపాలపాణియై
భవనములందు భిక్షగొని ప్రాణము దా
 ల్చుట కొంత మేలు బాం
ధవులను జేరవేడి కడు దైన్యము జెందు
 టకంటె మానికిన్.

అది మేలైన పురంబు, పూజ్యచరితుం డా రాజు, రాణ్మండలం
బది, పార్శ్వంబున నా విదగ్ధసభ. వారణ్యాస్య, లత్యుద్ధతం
బది రాజన్యక, మద్దివందిని కరం, బా గాథలున్ సర్వముం
గదలంజేసిన కాలమూర్తికి నమస్కారంబు సత్కీర్తిన్.

[పూర్తయ్యేసరికి నారాయణరావు వస్తాడు.]

నా:- ఏమోయి వెంకట్రావు! ఇప్పుడేనా వస్తావా? రావా? లేక ఇంకాఅలా విచారసాగరంలో మునిగి తేలుతూ వుంటావా! రా పోదాం. రేడియోలో మంచి ప్రోగ్రాం ఉంది. మన కృష్ణశాస్త్రి నాటకం.

వెం:- ఇప్పుడు రాను. మా పినమామగారు వచ్చారు.

నా:- ఏమిటి వారే ఆ బంగారుగుళ్లు పెట్టేవారే!

వెం:- వారే కాని ఇప్పుడు బంగారుగుళ్లే కాదు. అసలు గుళ్లే పెట్టడమే మానేశారు.

నా:- అంటే!

వెం:- వారి ఆస్తి అంతా పోయిందిట. మూడు సంవత్సరాలనుంచి పడరానిపాట్లు పడి పడి బాధలు సహించలేక పాడలిపోతూ మేము గుమ్మంలోకి రానిస్తామో రానివ్వమో నని ఇక్కడికి వచ్చారు. అందుకనే పాపం ఈ మధ్యను ఆయననుంచి ఉత్తరమేనా లేదు.

నా:- ఆహా! దైవసంకల్పం— అయితే ఇంక ఆయన—

వెం:- ఇక్కడే ఉంటారు. పాపం ఆయనకు ఈ పెంపుడుకూతురు తప్ప ఎవరూ లేరు. ఎక్కడికి వెడతారు.

నా:- అయితే నీకు వచ్చే వారసత్వం పిన మామగారు మాత్రమే నన్నమాట.

వెం:- అవునండీ పోనీ పెద్దవాడు, బోలెడంత అనుభవశాలి. ఇంట్లో ఉంటాడు. నాకు కొంత బాధ్యత తగ్గుతుంది. ఇదీ ఒకందుకు మంచిదే.

నా:- బాగుంది బాబూ That is the Spirit.

వెం:- లేనివాళ్ళను చూస్తేనేకాని మనకు ఉన్నదానివిలువ తెలియదు.

నా:- నిజమే. Good bye.

వెం:- (పద్యం.)

బాలకుడై క్షణంబు, యువభావయుతుం.
డయి కొంతకాల, ము
ద్వేల దరిద్రుడై క్షణము విత్తసమన్వితుడై
క్షణంబు జీ
ర్ణాలసగాత్రుడై నటునియట్ల నటించి
తుదిన్ నరుండు యా
మ్యాలయ నామ మైన తెరయందు జొరం
బడు సత్వరంబుగన్.

ఏల పరిభ్రమించెద వి భిన్నవిధముల
వెట్టిచిత్తమా
తాలిమి విశ్రమింపు మొకతావున; యత్నము
లేకయే యగున్
మేలును కీడు; నే దలప మించిన కార్యము;
భావి సౌఖ్యమున్
లాలసవృత్తి గోర; విధిలబ్ధఫలంబులు
నే భుజించెదన్



# ‘నా జీవితయాత్ర’: ఒక సమీక్ష

**శ్రీ కృష్ణశాస్త్రి**

ప్రస్తుతం ప్రకాశం మకాం మద్రాసు గవర్నరు భవనంలో. భక్తులైన పూజారులకు గాని స్వామి గర్భాలయం తలుపులు ఇదివరకు నడలేవికావు. ఇప్పుడు ముఖద్వారం తలుపులు మూతపడడమే మానివేశాయి. ఎప్పుడూ వచ్చేప్రజ, వెళ్లేప్రజానూ! తీర్థం! వారిలో కానూరి రంగడు, ఆలీబేగ్, అద్దేపల్లి అప్పడు, మస్తాన్, ‘కింగ్ ఆఫ్ ఒంగోల్’ నవులూరి రమణయ్య, రాజమహేంద్రవరం బెస్తలూ కూడా ఉన్నారా! అనిపిస్తుంది. ఎందుకు ఉండకూడదు?

డెభ్భైయేళ్ల క్రితం, నాయుడుపేటలో సువర్ణముఖి ఒడ్డున వెంచేసిఉన్న ఆంజనేయస్వాముల వారగింపుగా కోడిగుడ్లు నైవేద్యం పెట్టిన పరమ భాగవతుడు కానూరి రంగడు. అక్కడ తోటల్లో విడిదిచేసిన వెంకటగిరి వారి ఏనుగుల మీద ఎక్కడానికి మావటి వాడికి కానో అర్ధణో కానుక ఇచ్చేవాడు నవాబ్ ఆలీబేగ్. బొంగరాలూ గోళీలూ కొనడానికి దొంగతనాలు అవసరమై సర్దారు అద్దేపల్లి అప్పడు చిన్నముతాలు చేరదీసి చిల్లర దుకాణదారుల గల్లాపెట్టెలబరువు ఒంగోలు నడిబజారు వీథుల్లో వదిలించేవాడు. అందరికన్నా అసాధ్యుడు నవులూరి రమణయ్య; ఇతని ‘ఊట్’కంపెనీలో మస్తాన్ సాహెబు వంటి మహాసాహసికులు ఉండేవారు; రంగారాయుడు చెరువుకింద వరిగె పంటని రాత్రిరాత్రే కోయించి నెత్తిని పెట్టించి పొలందాటించిన పోటర్లు.

ఇలాంటి వారితో అప్పుడు ప్రకాశానికి జట్టు! కనక ఇప్పుడు వాళ్లుంటే — ఎప్పుడూ వాళ్లు ఉంటూనే ఉంటారు—వాళ్లది సూడా డెబ్బైఅయిదో పుట్టినరోజు ఈ ఏడాదికి ఇటో అటో పడిఉండేదేమో! అయినా మొన్న ప్రధానమంత్రి జన్మదినోత్సవం జరిగినప్పుడు వాళ్లందరి పుట్టినరోజుల పండుగలూ జరిగినట్లే! ప్రకాశం ప్రజ.

ప్రభువుల్లోకంటె ప్రజల్లోనే ఉదాత్తత ఎక్కువ ఉందంటాను. సామాన్యులకున్న దర్జా సామంతులకే లేదు. గద్దెమీదా గరికనేల మీదా ఒకేఠీవితో కూర్చోగలిగిన వాడిదే హుందా. వాడికి ఒక సింహాసనం గౌరవం ఇవ్వనక్కర్లేదు. పంచఅడుగుని పట్టపుత్తు చెయ్యగలవాడు వాడు. సామాన్యప్రజ సహజంగా రాజు. కొందరు దోపిడీవల్లా దొంగతనంవల్లా దొరలౌతారు.

ప్రకాశం ప్రకృతిసిద్ధంగా దర్జా అయిన వాడు. ఇతన్ని ‘ప్రకాశంగారు’ అనలేము. అలాగఅంటే ఆప్తత పోతుంది. నన్ను నేను

'గారు' అనుకున్నంత దుస్సహంగా ఉంటుంది. 'ప్రకాశంపంతులు' అనికూడా అనలేము. మతంలేదు, కులంలేదు, మస్తానుకీ బెస్తకీ నేస్తమయినవాడు 'పంతు' లెలాగవుతాడు! పంతుళ్లు వేరు. న్యాపతి సుబ్బారావుపంతులు! మోచర్ల రామచంద్రరావుపంతులు! 'పంతులు' గాని, బిరుదుగాని తగిలించకుండానే 'ప్రకాశం, అన్న పేరులో కావలిసినంత బరువూ ప్రతిష్ఠా ఉన్నాయి. అందులోనే ఉన్నాయి కూడా. మన ప్రధానమంత్రి పలుకుబడీ ప్రభావమూను.

ప్రకాశం అంటే ౧౯౨౧ తరవాత వచ్చిన ప్రజాజాతీయోద్యమానికి ప్రబలచిహ్నం. అన్నమాట. మన రాష్ట్రంలో ఆ ఉద్యమ చైతన్యం అంతా అతనిలో ఇమిడిఉంది. ఇతని మూర్తిలో మనకు ఆశక్తి స్ఫురిస్తుంది.

ఆ ఉద్యమాన్ని గూర్చి ఇక్కడ ఒక్క మాట. ౧౯౨౧కి పూర్వం జాతీయోద్యమంలో విద్వాంసులూ, అధికారులూ ప్రసంగాలిచ్చి పత్రికలకు వ్రాసీ కొంత కృషిచేస్తూఉండే వారు. ఇక నలభైకోట్లప్రజ స్తిమితంగా నిద్ర లాంటిమగతలో పురాణస్మృతులు నెమరు వేసుకుంటూ ఉండేది. ఆ నీరసస్థితికీ నిర్వీర్యానికీ సిగ్గుపడడం అప్పటిప్రజకి తెలియదు. మానంలేదు; అభిమానంలేదు; తృష్ణలేదు; ఆత్మవిశ్వాసంలేదు; తననీడ తన్నే తరుముతుంటే తల్లడిల్లిపోయేది. అప్పుడు భారత రంగంలోనికి గాంధీ అవతరించాడు. ఈయన చిత్రమైనవాడు. ఈయన్నిమించిన మేధావులు వర్తమాన భారతంలో ఉన్నారు. ఈయన కన్న విద్యాసంపత్తీ అర్థబలమూ శరీరసౌష్ఠవమూ రాజకీయ విజ్ఞానమూ కళావైభవమూ ఉన్నవారు, హిమాలయ శిఖరాలవంటివారు, ఎందరో నేటి భారతవర్షంలో కనిపిస్తున్నారు. దవ్వుదవ్వుల నిలబడి వారిని గౌరవిస్తుంటాము. వారిలో ఒక్కొక్కరిలో ఉన్న ఒక్క ప్రత్యేక శక్తిముందు మన కించుదనం నిలబడితే వాళ్లు మనకి అందరాని అసాధ్యులు అయిపోతున్నారు. వాళ్ల గొప్పతనం సామాన్యులమైన మన కొద్దితనం చూపిస్తుంది కాని ఆశాబలంగాని, ఆత్మవిశ్వాసంగాని ఇవ్వలేదు. గాంధీ మాహాత్మ్యం ప్రత్యేక ప్రతిభలోలేదు. ఈయన మనకళ్లు మిరుమిట్లుగొలపడు. ఈయన కైలాస శిఖరంకాడు. దేశం అంత జలాశయం. గంగానది. దానిలోని అమృతం మీకూ నాకూ అందరికీ అహరహమూ అన్నిపనులకీ అందుబాటులో ఉంటుంది. ఈయనశక్తులు మనకూ ఉండవచ్చు ననిపిస్తుంది. ఈయన కట్టూ బట్టా మనలో అందరికన్నా సామాన్యుడి కట్టూ బట్టా స్ఫురింపజేస్తాయి. ఈయన కుటీరమూ అలాగే. ఈయన ఉపవాసాదులూ అలాగే. కనక తనవంటివాడే ఒకడు నలభైకోట్లమందికి నాయకుడైనప్పుడు, 'రాజమాన్య రాజపూజితు' డైనప్పుడు, ఆ నలభైకోట్లలో ప్రతిదరిద్రుడూ తానుకూడా ఆ నాయకుడైనట్లే గర్వపడడం ప్రారంభించాడు. గాంధీ వైస్రాయిని చూసినప్పుడు, ప్రతి కుగ్రామంలోనూ ప్రతి కాంగ్రెసు వాలంటీరూ ప్రతిమనిషీ వైస్రాయి తనతోనే సంప్రతింపులకు వేంచేసినట్లు అనుకోవడం

మొదలుపెట్టాను. 'నావంటివాడు అంతవాడైనప్పుడు నే నెందుకు కాగూడదు?' అన్న ఆశావాదమూ ఆత్మవిశ్వాసమూ మొదటిసారి వానిలో విజృంభించాయి.

౧౯౨౧తో నలభైకోట్ల బొరియల్లో ఉన్న పురుగులు నలభైకోట్ల మానవులయ్యాయి. నలభైకోట్ల మానవులు సముద్రంలాగ పొంగి వస్తూంటే ఎందరు 'కాన్యూట్లు' (Canutes) దానికి అవధులూ అడ్డుకట్టలూ కట్టగలరు!

ఈ దృష్టితో చూస్తే ఆచార్యులూ, పండితులూ, భాష్యకారులూ, ప్రభువులూ వీళ్లెవ్వరూ గాంధీ శిష్యులుకారు; సూక్ష్మంగా చూస్తే గాంధీ అనుచరులు ఒక్క కాంగ్రెస్ వారులే కాదు. కాంగ్రెస్‌వారూ, కమ్యూనిస్టులూ, అన్ని రాజకీయ పక్షాలవారూ ఖద్దరు కట్టేవారూ, కట్టనివారూ, అహింస అనేవారూ, అననివారూ, హరిజనోద్ధరణకి బుజాలొగ్గేవారూ, ఒగ్గనివారూ, అందరూ ఆయన అనుచరులే. అంటే అనిబద్ధమైన అశేషభారత ప్రజాను.

ఇలాగ ౧౯౨౧తో మనరాష్ట్రంలో ఒక్కసారి ఒళ్లువిరుచుని హుమ్మనిలేచిన జనసామాన్యానికి ప్రజలో ఉన్న గుణాలన్నీ ఉన్నాయి. ఆవేశం, ఉత్సాహం, ఆగ్రహం, అనుగ్రహం, ఔదార్యం, అసూయ, సాహసం, తిక్క అన్నీను. అన్నింటికీ అడుగున అంతర్వాహినిగా సహజమైన బుద్ధిసూక్ష్మతా ఉంది. ఈ గుణాల కలయిక అతన్ని అప్రతిహతమైన ఒక శక్తిగా చేసింది. మేధావిగా కనపడే వాని సమక్షంలో మనం కూడా మేలుకుని ఒడుపుగా తిరుగుతాము. అలాగ కనపడకుండానే తెలివైనవాడే నిజంగా మన్నిలో బరుచ్చుకుంటాడు. ప్రకాశం అలాంటి వాడు.

ఈ భావాలన్నీ మొన్న 'జీవితయాత్ర' చదివాక నా మనస్సులో స్ఫురించాయి. అప్పుడే అతని చిన్నతనపు చేతలు, గాథలుగా అయి పోయాయి; ఆ తరవాత ౧౯౨౧ మొదలుకొని మొన్నటి శాసనసభా నాయకత్వపు సందడుల దాకా జరిగిన సంఘటనలన్నీ మనస్సులోకి పరుగెత్తుకుని వచ్చాయి. ఒకటి తేలింది. చిన్ననాటి ప్రకాశమే ఇప్పటి ప్రకాశమూను. కొందరి జీవితాల్లో లాగ ఇతని జీవితంలో మార్పులూ విప్లవాలూ వచ్చిపడి ఇతన్ని ఒక కొత్త మనిషినో వింత మనిషినో చెయ్యలేదు. ఇతని బ్రతుకులోని స్వచ్ఛతా, వేడీ పోగొట్టలేదు. పాతగుణాలే జాతి అంత విశాలంగా పెరిగాయి.

ఎంత బాగుంది 'నా జీవితయాత్ర!' యాభై ఏళ్లగాథ పందెపు గుర్రంలా పరిగెత్తింది. ప్రకాశం గొప్ప రచయితకాడు. 'శిల్పి' కాడు జవహరిలాల్ నెహ్రూలాగ నెహ్రూ స్వీయచరిత్ర గడసరీ, కళావేత్తా, ఉత్తమ సంస్కర్తా రంగులు దిద్ది, రాగాలుపోసి సుందర నిర్మాణంగా తయారు చేశారు. దానిలో ఒక అపూర్వ సంఘటన వచ్చినప్పుడు, ఒక అద్భుత వ్యక్తి అవతరించినప్పుడు, ఒక తీవ్ర సమస్య ఎదురు కొన్నప్పుడు గ్రంథకర్త మనస్సు ఎన్ని

విధాలుగా ఆలోచించిందో ఎలా పనిచేసిందో అన్నీ విపులంగా వివరింప బడ్డాయి! 'నాజీవిత యాత్ర' అలాక్కాదు. సంఘటన తరవాత సంఘటన! సమరం తరవాత సమరం! ఎటొచ్చీ చిన్నతనంలో చిన్నవీ పెరిగాక పెద్దవీ. చరిత్ర కారుని అభిప్రాయాలు వినం. మన అభి ప్రాయాలు ఇవ్వం. సరదాగా చదువుకుంటూ పోతాము.

'Rough, and tough, we are the stuff! We want to fight and cannot get enough!'

అన్నట్టు మన కనిపిస్తుంది. ఒక్కొక్క యాత్రకి, గమ్యస్థానం ఉంటుంది. కనక ఆ యాత్రామార్గం గమ్యస్థానంకోసం తీర్చి దిద్ది నట్లుంటుంది. మరి అతని యాత్రకి గమ్య స్థానం లేదు. కనక యాత్ర ఆగిపోవడమూ లేదు. అలాగ సాగిపోవడమే; అంటే స్వరాజ్య స్థాపనతో ఆగిపోదన్న మాట! ఆ మార్గం తీర్చి దిద్దినట్లుకాక మలుపులతోనూ వంపులుతోనూ నిండిఉంటుంది. ప్రతి మలుపు వెనకాలా ఏదో వింతో వేడి వేడి పోట్లాటో ఉండితీరుతుంది. మలుపులేని మార్గం మనకి బాగుండదు. దానిలో సరదా ఉండదు.

వన్నెలు, చిన్నెలు వేయకుండా 'జీవిత యాత్ర' వ్రాయడంవల్ల ఒక విధమైన ఆకర్షణ లేకపోయినా కథకి బలమూ, తీవ్ర గమనమూ వచ్చాయి. తనకి అనుకూలమైనవీ, విరుద్ధ మైనవీ అయిన విశేషాలన్నీ సమానోత్సాహంతో ఒకటే రుచితో చెబుతాడు. సందె చీకట్లో కిటికీలో కూర్చున్న అతన్ని యెన మండ్ర కొండయ్య ఊచి పుచ్చుకుని కొడ తాడు. పట్టపగలు రాజమహేంద్రవరం తాసి ల్దారు కచేరీదగ్గిర కొండయ్యని బండిలోనుంచి పడదోసి చలపతిరావూ, తానూ చావబాది ఒదుల్తారు. తననీ తనముఠాసీ పచ్చడి చెయ్య డానికి కాకినాడ నడివీధిలో కదిలివచ్చిన సింగి తపు అబ్బాయి వీరగాథ భారతంలోంచి కత్తి రించిన కథాఖండంలా లేదూ? ఘల్లుమనే బాణాకర్ర, తాడిలాంటి తాడి వెంకటరత్నం ఒక్క దెబ్బతో చిత్తవడం, ఒకేదెబ్బ ఇద్దరు యోధులకు ఒక్కసారి తగిలి ధూళిలో పడుకో పెట్టడం—ఈ చిత్రాలన్నీ తన శత్రువే చేసినా యెంత ఆత్రత తోను, ఆనందంతోనూ వర్ణిస్తాడు! తరవాత మునిసిపల్ వ్యవహా రాలలో తన ప్రతిస్పర్థి నిడమర్తి దుర్గయ్య గారిని అలాగే మెచ్చుగుంటాడు. మైలాపూరు మేధావులతో—మహామహా న్యాయమూర్తు లతో—మాట పట్టింపులదాకా ఈ గుణం కనబడుతుంది. మెచ్చుకుని వెన్నుచరచ గలడు! నొచ్చుకుని వెన్ను చీల్చగలడు!

మరొక విశేషం. ఎక్కడా తనలోపాలకు కూడా తళుకుమలామా పూయడు. అల్లాడి ఆ దెయ్య కొడుకు చిన్న ప్రకాశాన్ని తన్నాడు. వాడి గూబ తన కందదు. వాడి పుస్తకం దొంగతనంచేసి సువర్ణముఖి వొడ్డున ముక్కలు ముక్కలుగా చింపి పారేస్తాడు. ఇదో రకం పగ. అయితే మాత్రం! నాట

క్లాల్లో వేషాలు వేసేటప్పుడు నారీమణులతో సహవాసం తప్పదు! ఏంజెయ్యమంటారు! అమాంతంగా ఒక అభూతవిప్లవం వచ్చి అహింసలో పడిపోవడం, నైతికకైలాసం అధిరోహించడం—ఇలాంటి వేవీ జరగవు.

అసలు ఇతని జీవితంలోఉన్న బలం అంతా ఇదే. ఇతగాడు సామాన్య ప్రజ!

జవహరిలాల్ జీవితంలో వచ్చే సంఘటనలు ఒక్క జవహరిలాల్ జీవితంలోనే వస్తాయి. పండితుడు మోతీలాలుప్రభువు ఏకమాత్ర పుత్రుడు. బాల్యంలోనే భారతీయ ప్రముఖులతో సహవాసము. నూలవ్యాజీ, సర్. సప్రూ అనుదినమూ ఆనందభవనానికి విచ్చేసే అతిథులు. ఇంగ్లాండులో చదువు. ముందే తేలిపోతుంది మనకందనివాడని. ఆయన అనుభూతులు మనకిరావు. పుట్టుకతోనే కాంగ్రెసు ప్రెసిడెంటుగా పుట్టినట్లనిపిస్తుంది. జవహరిలాల్ ప్రత్యేక వ్యక్తి, గొప్ప వ్యక్తి, అసాధారణుడు. ప్రకాశంచేసే పనులు మనమూ చేస్తాము. అనే మాటలు మనమూ అంటాము. కన్నతల్లి, కడుపుతీపివల్ల పూటకూటిఇల్లు పెడితే కాలక్షేపంచేసినది మొదలుకొని ప్రధానమంత్రి పదవి అధిష్ఠించినదాకా ఏ వాక్కూ ఏ కార్యమూ మనకి దూరమైనదిగా కనబడదు. ప్రజే ప్రధానమంత్రి అయింది. సాధారణతలో ప్రత్యేకత కూడా ఉంది కనక, ప్రకాశాన్ని ఏరి పట్టం కట్టింది. ఇక్కడ ఒక్కమాట! ఇతని జీవితయాత్రా మార్గమంతా బాణా కర్రల ఘులఘులలతోను, తుపాకీ గుండ్ల తొందరలతోనూ మాత్రమే నిండిఉంటుందని అనుకోకూడదు. నిజమే! ఇతగాడు తుపాకీమందు వాసన కొడితే దూకే రకమే! కాని ఇతని బ్రతుకులో గుండెలు కరిగించే కరుణఘట్టా లెన్ని ఉన్నాయి! తండ్రిగారు కేవలము స్మరణీయుడే అయిపోతే తల్లిగారు వంటపూటిఇల్లు పెట్టడమూ, నాలుగు రాళ్ళకోసం మేనమామ బావమరదుల ఇళ్ళమధ్య అల్లల్లాడడమూ, నిరుపేద కుర్రవాడు లాయర్లని చూచి లాంగ్‌కోట్లు కుట్టించుకుని బడాయిగా వేసుకోవడమూ, రైలులేని రోజుల్లో పన్నెండేళ్ల పిల్లవాడు ఒంగోలునించి రాజమహేంద్రవరందాకా వెళ్లడమూ, ఇమ్మానేని హనుమంతరావు నాయుడుగారు, ఇల్లాలు లక్ష్మమ్మగారు ఈ పెంపుడు బిడ్డతో ఎడబాటు సహించలేక ఏడవడమూ, తరవాత తాను బారిష్టరయ్యాక కృతజ్ఞతా ప్రదర్శనానికి కాక కేవలమూ ప్రేమవల్ల వారిఋణము తీర్చుకోవడమూ, తాను నెలకు ఏడెనిమిదివేల రూపాయలు తెస్తూంటే తల్లిగారు మరణశయ్యమీద ఏడెనిమిదివందల రూపాయలు కూడబెట్టి ఇవ్వడమూ, ఈ గాథలు చదువుతూంటే ఒక్కొక్కసారి గుండెల్లో పోటుపొడిచినట్లవుతుంది. కళ్లు కరుగుతూంటాయి.

౧౯౨౧ తరవాత సాగే 'నాజీవిత యాత్ర' ఎలా ఉంటుందో! త్వరత్వరగా చదవాలని ఉంది.

ఇది ప్రజాయుగం అంటున్నారు. ఇక్కడ ప్రజా ప్రభుత్వం వచ్చిందంటున్నారు. ఈ రోజుల్లో ఎంత సామాన్యాతి సామాన్యుడైనా తనకంటె ఎత్తుగా నిలబడినట్లుగా ఉన్నవాణ్ణి సహించలేడు. అధికారం అసహ్యంగా ఉంటుంది. అది రకరకాలు. మెదడుకు సంబంధించినది, నైతిక వర్తనకి సంబంధించినది, అర్థ మత్తతకి సంబంధించినది—ఇలాగ. జాతీయనాయకుల్లో ఒక్కొక్క గొప్ప మేధావి ఉంటాడు. ఒక్కడు పదివేలమందిలో ప్రసంగం ఇస్తున్నప్పుడు తన తెలివితేటలు చూపిస్తూ పరమతత్వాలు విశదపరుస్తూ లెఖ్ఖలతో, అంకెలతో, సుభాషితాలతో జనానికి ఊపిరాడనీయక తన ఔన్నత్యము తెలిసో తెలియకో చాటుతూ ఉంటాడు. మరొక్కడు అహింసా, ప్రేమలు, ఆర్జవావేశమూ తానే మూర్తికట్టినట్లనిపిస్తూ నీతికథలు మెత్తమెత్తని మాటల్లో పొదిగి, అపరధర్మరాజులా అయిపోయి, మనకి అందరానంత మంచివాడుగా సాక్షాత్కరిస్తాడు. వీళ్లు గొప్పవాళ్లు కారనను. మనలోని వారనిపించరు. ఈ ప్రజాయుగంలో అసలే అనిపించరు. వీళ్లు,

Too bright and good, for human nature's daily food !

మనలాగ అంటాడు, మనలాగ చేస్తాడు, మనలాగ బాధపడ్డాడు, సుఖపడ్డాడు, మనకి మించిన తెలిసి తేటలున్నా మన బుర్రలకి రుద్దడు. మనకి తెలియకుండానే వాటిని మన కోసం ఉపయోగిస్తాడు. అలాంటి వాడు కాకపోతే, ఇంకెవ్వడు ఈ రోజుల్లో మన రాష్ట్రానికి ప్రధానమంత్రిగా ఉండడానికి అర్హుడు చెప్పండి ! ప్రత్యేక వ్యక్తి లాగకాక ప్రజకులాగే తనకు కులంలేదు, మతంలేదు, వయస్సులేదు. డెభ్భైయైదేండ్ల వాడయి తాతలాగ పాత స్మృతులు నెమరువేసుకోకుండా జాతితో సమానంగా పరిగెత్తుకుంటూ వచ్చేవాడు కాకపోతే ఇంకెవ్వడు మనరాష్ట్రానికి ప్రధానమంత్రిగా ఉండడానికి అర్హుడు చెప్పండి ! పాకీవాళ్లు, పారిశ్రామికులు, కర్షకులు, కష్టజీవులు అటువంటి వాడితో కాక మరెవ్వరితో తమ కష్టసుఖాలు వెళ్ళబోసుకుంటారో చెప్పండి ! రాళ్లు విసిరే వారిలోనూ తుపాకీ దెబ్బలు తినే వారిలోనూ మాత్రమే ఉండే స్వభావంగల వాణ్ణే నాయకుణ్ణిగా వీళ్లు స్వీకరించగలరు గాని, మరెవ్వరి సాన్నిధ్యానికి ఆప్తతతో వస్తారయ్యా !

మళ్లీ అంటున్నాను. ఇది ప్రజా ప్రభుత్వం అయితే ప్రకాశంలాంటి ప్రధాని మరొక్కడు ఇప్పుడు దొరకడు. ఈ దృష్టితో చూస్తే ప్రస్తుత భారతదేశంలో ఏ రాష్ట్రానికీ ఇంత అర్హుడయిన ప్రధాని లేదు !

# చింతచిగురు

'ఆరుద్ర'

ఆకలిరంగు చర్మాల్లో రెండెముకల గూళ్లు నిర్జనమైన, మాడుతున్న రోడ్డుమీద వారంట తూలుతూ నడుస్తున్నాయి. దరిద్రాన్ని కట్టుకొన్న, తెగమాసిన ఒకగూడు ఆడదానిలా కనబడుతున్నాది. నిరాశనీ మూలుగునీ మోసుకొంటూ ఆడగూడు పక్క నడుస్తున్న, బతుకు చస్తూన్న కళేబరం మొగదాని పోలికలతో కుంటుతున్నాది. కొలిమిలాంటి సూర్యుడిలోంచి బాగా కాలిన యినప ఊచల్లాంటి కిరణాలు నుదుటిమీద గుచ్చబడుతున్నాయి.

దారికి రెండుప్రక్కలా ఎలక్ట్రిక్ స్తంభాలు, టెలిగ్రాఫు స్తంభాలు వరుసగా నిలుచున్నాయి. టెలిగ్రాఫు స్తంభాల్లో కంపించిన గాడ్పు ఓంకారనాదం చేస్తున్నాది. ఎలక్ట్రిక్ స్తంభాల ఒంటికళ్లు జాలిగా, తెల్లగా శూన్యాన్ని పరీక్షిస్తున్నాయి. దారికి యిరుప్రక్కలా శ్మశానం అంత ఎడారిలాంటి బయలు క్షణక్షణానికి విస్తరించుతున్నాది.

ఎముకలగూళ్లు ఎక్కడ నుంచి ఎక్కడికి ఎందుకు ప్రయాణం చేస్తున్నాయో చెప్పకోడం బహుసులభం. ఆ ఆకలిరంగు చర్మాలే వాళ్లు అడుక్కుందుకు బయలుదేరారని అడక్కుండా చెప్తాయి. ఇద్దరూ ఒకరిమీద ఒకరు ఆనుకొంటూ అతికష్టంమీద అడుగుతీసి అడుగు వేస్తున్నారు. మొగాడి చేతులోని ఊతకర్ర రోడ్డుని కొలుస్తున్నాది.

గాడి పొయ్యిలాగ రోడ్డు సెగలు చిమ్ముతున్నాది. ఏనాటికి ముగుస్తుందో ఈ రోడ్డుమీద జరిగేవంట. ఏ కడుపులు నింపేందుకు జరుగుతున్నాదో ఈ వంట. ఇద్దరూ సోలుతూ నడుస్తున్నారు. ఇద్దరూ తూలుతూ సాగుతున్నారు. ఇద్దరూ నీరసంగా భూమిలోకి కుంగిపోతున్నారు.

దారి అంచుమీద జారుతూ నడుస్తున్నారు.

దారి అంచుమీద జారుతూ నడుస్తున్నారు. కంకర రాళ్ళమీద గుండం తొక్కుతున్నారు. ఎవరో ముందుకు తోస్తూ ఉంటే ఆశతో సాగుతున్నారు. ఏదో వెనక్కు లాగేస్తూ ఉంటే బాధతో ఆగిపోతున్నారు. మళ్ళా ఎవరో నెట్టుతూ ఉంటే పచ్చతనాన్ని ఆలోచించుకొంటూ ముందుకు అడుగేస్తున్నారు.

ఇద్దరిలో ఒకరు మాట్లాడడం లేదు. వాళ్ళ నాలికలు చాలాకాలం నుంచీ, యుగయుగాల నుంచీ పిడచకట్టుకు పోయాయి. ఎండిపోయిన దిగుడుబావుల్లాంటి వాళ్ళగొంతుకలలో నరాలు ఏ స్వరాలని పలకడం లేదు. నాలికమీద ఆకలి వాయించే మాటలు హరించుకు పోతున్నాయి. ఆడగూడు నాలికని మీదపెదవిమీదుగా పోనిచ్చి తడిచేసుకుంది, చేసుకున్నట్టు అనుకుంది.

మొగాడు భుజంమీద జారుతున్న జోలెని ఎగసన తోసుకొన్నాడు. ఇద్దరూ మాట్లాడ కుండా నడుస్తున్నారు.

రోడ్డుకి ఇరుపంచలా ఉన్న కుక్కగొడుగు ల్లాంటి వృక్షరాశి ఉన్నా లేనట్టే ఉంది. ఎంత దూరం నడిచారో చెప్పడం కష్టం. ఊతకర్ర కూడా మూగిదయింది. కనుచూపుమేరలో మాత్రం ఒక చింతచెట్టు అభయహస్తాలని నాలుగుప్రక్కలా చాపి ఏడుకొండలవాడి పోజులో రాచారి పోలీసువాడేలా నించుంది. ఈ ఈ ముష్టివాళ్ళగమ్యస్థానం అదేనని సులువుగా పోల్చుకోనచ్చు.

కిందా మీదా పడుతూ ఇద్దరూ చెట్టుకిందకి చేరుకున్నారు. చెట్టుకింద చేటంత నీడలో కూల బడ్డారు. ఇద్దరూ ఒకేసారి నిట్టూర్చారు. వేడిగా ఒక చెమట బొట్టూ, ఒక కన్నీటిచుక్కా రాల్చారు. మగఆకారం జోలెలోంచి ఒక సీసా తీసింది. కొన్నాళ్ళ కిందట అతివిలవైన సీమ చేపనూనె ఆ సీసాలో కూర్చుని ఈ దేశంలో దిగింది. ఈసీసాలో నీళ్ళుపట్టి కాగితం మూత పెట్టి ఇద్దరూ దాచుకున్నారు. మొగాడు బుడ్డితీసి గొంతు తడుపుకున్నాడు. నీళ్లు వేడెక్కి పోయాయి. సీసాని ఆడదానికి అందిచ్చాడు.

ఎండకి వెరచిన కాకొకటి చెట్టుమీద కదలి ఒక ఎండుబొట్టని రాల్చించి. అదిసమంగా ఆడ దాని వళ్లోపడ్డాది. ఆడది చింతబొట్టని రుచి చూసి ప్రాణాన్ని సర్దుకుంది. మొగాడికి సలహా యిచ్చింది. మొగాడు నిటారుగా నిల్చుని చెయ్యి మీది కెత్తాడు. కొమ్మ అందుకురా లేదు. ఊతకర్రతో చిగురుని కదిపాడు. జీర్ణించి పోతున్న 'సత్తువని కూడదీసుకుని పూరాగా కొమ్మని కొట్టాడు. కొంత చిగురు రాలింది. ఆడ దాన్ని తినమన్నాడు. ఆడది రెండు చిరుఆకుల్ని నాలికమీద పెట్టుకొని చప్పరించింది. తల ఊపి చిగురంతా రెండుచేతులా తీసుకొని నోట్లో కుక్కుకుంది, అతివేగంతో నమిలింది.

మొగాడు మరి ఒక ఆకేనా రాల్చలేక పోయాడు. మొదలు తెగిన చెట్టులా కూలి పోయాడు. మూర్ఛలక్షణాలు మొగంమీద పచారుచేస్తున్నాయి. ఆడది సీసాలో నీళ్లని వాడి మొగంమీద జల్లబోయింది. మొగాడు కళ్ళు విప్పకుండా ఆడదాన్ని ఆనీళ్ళు తాగమని సంజ్ఞ చేశాడు. ఏడ్చి కన్నీళ్లు రాల్చేందుకు సరిపోయిన సత్తువ ఆడదానిలో ఉంది.

# వినాయక చవితి


శ్రీ విస్సా అప్పారావు.

భాద్రపద శుద్ధ చవితినాడు ప్రతి సంవత్సరము వినాయకుని పండుగను మన మందరము చేయుచుందుము. హైందవ సంప్రదాయములో ఈ పండుగకు ఒక గొప్పతనము కలదు. ఆ బాలగోపాలము వారివారి స్థితి ననుసరించి వినాయకుని వ్రతమును ఆచరించుచున్నారు. ఈ గణపతిదేవుని రూపము, గుణములు, వైఖరి, మొదలైనవాటి కన్నిటికిని ఏదో ఒక అంతరార్థము కలదని, పురాణగాథలు కూడ అట్లు సార్థకములే యై యుండవలెనని నాతలపు. ఈ తలంపుతో నాకు తోచిన రీతిని వినాయకుని గురించి కథ కట్టుటకై ప్రయత్నించుచున్నాను. వివిధవిషయములను ఏకముఖముగ జేయుటకు, ఏకాభిప్రాయమును సూచింపజేయుటకు బహుశ్రమగా ప్రయత్నించుచున్నాను.

## I

1. భాద్రపద శుద్ధ ౪ నాడు సాధారణముగా హస్త నక్షత్రమై యుండును. చంద్రుడు తిరిగి ఆనక్షత్రమునకు వచ్చుటకు 27 ది. 7 గం. 12 ని. లు పట్టును. దీనిని నక్షత్ర మాసమందుము. ఇది 27.3 దినములు, రమారమి. అమావాస్యనుంచి అమావాస్యకు 29½ దినములు రమారమి. దీనిని చాంద్రమాస మందుము. 13 నక్షత్ర మాసములు ($13 \times 27.3$) 354.9 దినములు. 12 చాంద్ర మాసములు ($12 \times 29.5$) 354 దినములు. అందుచేత సాధారణముగా హస్త నక్షత్రముతో భాద్రపద శుద్ధ చతుర్థి కలియుచుండును. ఇతర మాసములలోని, శు ౪ తులు హస్తతో కలియవు. హస్తముకలది హస్తి, ఏనుగు. ఈహస్తము విశిష్టమైనది. ఇట్లే కరి, కరముకలది. ఈ సామ్యముతో హస్తనక్షత్ర యుక్తమైన చవితికి కూడ హస్తిత్వము కల్పించవచ్చును. అందుచేతనే చవితికిని గజాననుడగు వినాయకునకును సంబంధము కలిగినది.

2. ఖగోళమందు అనేక నక్షత్రమండలములు గలవు. కొన్ని కొన్ని నక్షత్రముల గుంపులకు మీనము, మేషము మొదలగు ఆకారములు కల్పింపబడినవి. అన్ని నక్షత్రములును తూర్పున ఉదయించి సూర్యునివలెనే ప్రతి దినమును పడమట అస్తమించుచుండును; రోజున కొకసారి ధ్రువ నక్షత్రముచుట్టు వలయాకారముగా తిరుగుచుండును. ౧ వ పటములో చుక్కల గీత యగు క్షితిజము (క్షి.)- ఆకాశము భూమి కలసినట్లు కనబడు దిక్చక్రము. కుడి భాగము తూర్పు. వి అనునది వినాయకుని పోలి యుండు నక్షత్ర మండలము. తలకాయ, తొండము మాత్రము ముఖ్యముగా గోచరించును. పైనుండు చుక్కలు తలను, క్రింది నాలుగు తొండమును సూచించును. ఈ వినాయక మండలమునకు అట్లు క్రిందనే సప్తఋషి మండలమున్నది. ఈ భాద్రపద శుద్ధ చవితినాడు సూర్యోదయమునకు పూర్వము తూర్పున క్షితిజము పైని విఘ్నేశ్వర మండలమును చూడవచ్చును. ఈనాడు సూర్యోదయ కాలమున వినాయక మండలముకూడ ఉదయించును గనుక, ఈ చవితిని





౧. పటము

# వి నా య క చ వి తి

'వినాయకచవితి' అని అనుచున్నాము. ఈచవితికి మరునాటి పంచమినాడు కొద్దిగా క్రిందుగానున్న సప్త ఋషిమండలము తలచూపును కనుక భాద్రపద శుద్ధ పంచమిని 'ఋషిపంచమి' అని పిలుచుచున్నాము. ఆనాడు ఋషిపంచమి వ్రతమును చేయుదురు. ఇట్లే కొన్ని తిథులు, పండుగలు ఏర్పడినవి.

• ౩. బొజ్జగణపతిని చూచి వినాయక చవితినాడు చంద్రుడు నవ్వినట్లును, అందుచేత చంద్రునికి శాపము కలిగినట్లును, ఆనాడు ఎవరైనా చంద్రుని చూచి నచో నీలాపనిందకలుగు ననియును కథ చెప్పుదురు. ౨వ పటములో ఆకసమున చవితినాటి చంద్రుడెట్లు కనపడునో చిత్రించబడినది. చంద్రునియొక్క పూర్తి వలయాకారము



౨-వ పటము

లీలగా చుట్టును కనిసించును. క్రింది భాగము మాత్రము వంకగా తెల్లగా నుండును. చంద్రబింబ మంతయు ముఖముగా పోల్చుకొన్నచో చంద్రుడు నవ్వుచున్నట్లు భావించుట సమంజసముగనే తోచగలదు. నవ్వినప్పుడు పెదవులు విప్పితే కాన్పించు తెల్లని దంతకాంతిగా చంద్రవంకను భావించవచ్చును.

## II

౪. హనుమంతుడు బ్రహ్మచారి, చిరంజీవి, మహాబలశాలి,పరాక్రమశాలి, పరతత్త్వమునెరిగిన బ్రహ్మవేత్త; భీష్ముడు బ్రహ్మచారి, వీరాగ్రగణ్యుడు, మేధావి, ధర్మసూక్ష్మములనెరిగిన దిట్ట, స్వచ్ఛందమరణము కలిగినవాడు అని మన పురాణేతిహాసములు తెల్పుచున్నవి.వీరికిట్టి శక్తి కలుగుటకు కారణమేమి? వారి బ్రహ్మచర్యమే. బ్రహ్మచర్యమును ఆచరించువారికి అమృతత్వము, బ్రహ్మత్వము కలుగునని మన సంప్రదాయము. భారతములో అనుశాసనిక పర్వమందలి ఈ క్రింది విషయములు చూడుడు.

(i) సత్కర్మలకయ్యెడి ఫలములను వివరించుచు భీష్ముడు ధర్మరాజుతో ఇట్లనెను. "బ్రహ్మచర్యమునకు పరమాయువు, ఉపవాసమునకు చిత్తశుద్ధి."

(ii) లక్ష్మీనివాసస్థానములను చెప్పుచోట ఇట్లున్నది. 'తపము, దానము, బ్రహ్మచర్యంబు శమమునుగల్గు వారలు ప్రీతిసావసియించు నిక్కలు.'

(iii) కృష్ణుడు భీష్మునితో ఇట్లనెను.

'మానవులు, కామక్రోధములవలన వారె తెగుదురు, మృత్యువు నిమిత్తమాత్రము—
ఇంద్రియ నిగ్రహముత్తమ ధర్మంబు - పగను. గాంచు విధము—
బ్రహ్మచర్యంబు బ్రహ్మవిద్యాప్రాప్తికి ముఖ్యకారణంబు —
బంటువలె గాంగేయ! మృత్యువు నీవశమున నిలిచె—'

ఇందుచేత శక్తివంతులు, బుద్ధిమంతులు, జ్ఞానవేత్తలు, విద్యావంతులు కార్యసాధకులు కావలెనంటే, ఆయురారోగ్యములు పూర్తిగా కావలెనంటే బ్రహ్మచర్య వ్రతము ఉచితరీతిని ఆచరించవలసియున్నది. ఇట్టి మహనీయమైన బ్రహ్మచర్యమును ఒక దేవతగా భావించి ఆరాధించుట భారతీయ సంప్రదాయమై యున్నది. ఈ మహనీయతకు అధిష్ఠాన దేవతయే విఘ్నేశ్వరుడు, గణపతి, బ్రహ్మణస్పతి. చూడుడు ఋగ్వేదము ఇట్లు చెప్పుచున్నది.

గణానాంత్వా గణపతిం హవామహే
కవిం కవీనా ముపమశ్రవ స్తమం
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత
ఆనఃశృణ్వన్నూతిభిః సీదసాదనమ్.

II. 23.1.

దీనికి అర్థము ఇట్లు చెప్పవచ్చును.

సమస్త దేవగణములకు నీవే ప్రభుడవు, నాయకుడవు. బుద్ధిమంతులలో నీవే బుద్ధిమంతుడవు. ప్రఖ్యాత పురుషులలో నీవగ్రగణ్యుడవు, బ్రాహ్మణులలో నీవు అగ్రగణ్యుడవు. ఓ బ్రహ్మణస్పతీ! మా ప్రార్థనల నంగీకరించి యజ్ఞస్థానము నధిష్ఠింపుము. మరియును ఇట్లు విఘ్నేశ్వరునికి నమస్కరించుచున్నాము.

యంబ్రహ్మ వేదాంతవిదో వదంతి
పరేప్రధానం పురుషం తథాన్యే
విశ్వోద్గతేః కారణ మీశ్వరంవా
తస్మైనమో విఘ్నవినాయకాయ.

వేదాంతవిదులు ఇతనే పరబ్రహ్మ అని ఎవరిని చెబుతారో, కొందరు ప్రకృతియని, కొందరు పురుషుడని ఎవరిని చెబుతారో, విశ్వోత్పత్తికి కారణమైన ఈశ్వరుడెవరో అట్టి విఘ్నరాజగు వినాయకునికి నమస్కారము.

మరియును ఇతనిని అష్టోత్తర శతనామములతో పూజ చేయునప్పుడు బ్రహ్మచారిణేనమః, బ్రహ్మరూపిణేనమః, *బ్రహ్మవిద్యానిదానభువేనమః, అని అనుచున్నాము.

ఈ అభిప్రాయమే విఘ్నేశ్వరునికి సంబంధించిన కథలలోని పరమార్థము, అంతరార్థమును. దీనికి తార్కాణముగ కొన్ని ఉదాహరణములను ఇచ్చుచున్నాను.

'ఆదౌపూజ్యో గణాధిపః' అని ఏకార్యము తలపెట్టినను గణపతిపూజ చేసిగాని ప్రారంభించము. మనలో ఒక ఆచారము కలదు. వివాహకార్యము గాని, మరే కార్యముగాని తలపెట్టినప్పుడు మంచిరోజు చూచి విఘ్నేశ్వరునికి 'మీదు' కడతాము. వివాహమైన తరువాత, 16 రోజుల పండగ చేసికొని విఘ్నేశ్వరునికి ఉండ్రాళ్లు పోసికొని మీదు విప్పేస్తాము. * దీనిని పరిశీలింతాము. పెండ్లికార్యమునకు దీక్ష, శక్తి, పదుగురసహకారము అవసరము. ఈ శక్తిని, దీక్షను పొందుటకు ఇంటిలోనివారందరు పూనుకొనవలెను. అందుచేత ఎవరిదోవను వారుండక, సాంసారిక నిత్యవినోద వ్యవహారములను 'మీదు' కట్టవలెను. తాత్కాలికముగ బ్రహ్మచర్యదీక్ష పూనవలెను. అప్పుడు అందరు ఏకకార్యమందు నిమగ్నులై రాత్రింబగళ్లు కష్టించి, శక్తివంతులై, నిర్విఘ్నముగా కార్యమును కొనసాగించగలరు. ఇట్టి శక్తిసంపాదన, దీక్ష, లేకుండుటయే విఘ్నకారణముకొని ఇతరము కాదు. అందుచేతనే 'గణపతి విఘ్నముల కీశ్వరుడు' అని అంటాము. కార్యానంతరము, పండుగ జేసికొని నిత్యజీవనంలో తిరిగి ప్రవేశిస్తాము. ఈ కారణముచేతనే "విద్యారంభే, వివాహేచ, ప్రవేశే, నిర్గమేతథా, సంగ్రామే, సర్వకార్యేషు విఘ్నస్తస్య నజాయతే" అనుట.

5. విఘ్నేశ్వరుని ఆకారములో అతని వర్ణనలలో కూడ గూఢమగు అభిప్రాయము, పైన సూచించినదానికనుగుణముగా ఇమిడియున్నది.

(i) శుక్లాంబరధరం, విష్ణుం, శశివర్ణం, చతుర్భుజం
ప్రసన్నవదనం, ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే.

సత్వగుణము, సత్వముకలవాని గుణము. సత్వగుణమును తెలుపు వర్ణముతో పోల్చుట ప్రసిద్ధము. బ్రహ్మచర్యమునకు సత్వమునకు గుర్తు తెలుపు. సత్వసంపన్నునికి పోషకత్వము, ప్రసన్నవదనము సహజములే.

* మీదు కట్టుట అంటే ఉపయోగించకుండుట, అని అర్థము కలదు. 'ఏమయ్యా చేయి మీదు కట్టేవా? ఉపయోగించవేమి?' అంటాము.

* బ్రహ్మవిద్యకు ఆది కారణభూతునికి నమస్కారము.



3-వ పటము

(ii) తుండము నేకదంతమున, తోరపు బొజ్జను వామహస్తమున్,
మెండుగ మ్రోయు గజ్జెలును, మెల్లని చూపులు, మందహాసమున్,
కొండిక గుజ్జురూపమును కోరిన విద్యల కెల్ల నొజ్జవై
యుండెడి పార్వతీతనయ! యోయి గణాధిప! నీకు మ్రొక్కెదన్

ఏనుగ తలకాయి కలవాడనగా పెద్ద బుర్ర కలవాడన్నమాట. గొప్ప మేధావి. 'తోరపుబొజ్జను' జఠర పుష్టిని సూచించును. 'వామహస్తమున్' భోజనము పుష్టిగా చేసి ఆనందముచేత ఎడమచేతితో బొజ్జ నిమురుకొనుచున్నాడనుట. మెండుగమ్రోయుగజ్జెలు, ఎగిరి గంతులు వేయగలిగిన కదలిక, చైతన్యమును స్ఫురింపజేయును. మెల్లనిచూపులు, మందహాసము, ప్రశాంతతను, ప్రసన్నతను అనగా సత్వమును వెల్లడిచేయును. కోరిన విద్యల కెల్ల నొజ్జయనుటచేత ఏ విద్యకావలెనంటే ఆ విద్యను ఇవ్వగలవాడు అని చెప్పుట. వీటివలన పైన ఉదహరించిన విశేషముల నే ఈ విధముగ ఆకారముచేత స్థూలముగా శిల్పమూలముగా వ్యక్తపరచుట యని భావించవచ్చును. ఈ ఆకారమును 3వ పటమున చూడవచ్చు. ఇది అందరికి తెలిసిన ఆకారమే. కుడిచేతిలో ఉండ్రము భోజనప్రియత్వము, ఏకోశమున అజీర్ణమను నది లేదను అభిప్రాయమును సూచించుచున్నది.

(iii) విఘ్నేశ్వరునికి ఎలుక వాహనము. ఎలుక ఎట్టి గట్టి నేలనైనను దొలుచుకొనిపోగలదు. ఎలాటి చిక్కులు, ముళ్లు గల వలలో చిక్కుకున్నా నిశితమగు పండ్లతో వాటిని కొరికి బైటపడగలదు. ఇట్లే బ్రహ్మచర్యము నాచరించువాడు మేధావియై, నిశితమైన బుద్ధిచేత ఏ విషయగ్రహణమందైనను చురుకుగా ప్రవేశించగలడు. ఎట్టి క్లిష్టమగు, చిక్కగు, సందేహభూయిష్టమగు, విజ్ఞానవిషయము లయినను సునాయాసముగా గ్రహించగలడు.

(iv) వ్యాసుడు భారతరచనకు తనకు తగిన తెలివైన లేఖకునికై ప్రయత్నించెనట. అందరికన్న మిన్నయని విఘ్నేశ్వరుని ఎన్నుకొనెనట. వినాయకుడు చెప్పెడు దానికంటె చురుకుగా వ్రాయుటచేత వ్యాసుడు ఆపుకొనుటకయి అచ్చటచ్చట బహుక్లిష్టములగు వ్యాసఘట్టములను సర్దుకునేవాడని కూడ కథ ప్రసిద్ధము.

6. వినాయకునికి సిద్ధి, బుద్ధి అని యిద్దరు భార్యలని ఒక కథ కలదు.

(i) అనగా కార్యసిద్ధికి, బుద్ధికి వినాయకుడు సాధుడని భావము. వినాయకుని సిద్ధివినాయకుడని అందుము. బ్రహ్మచర్యముచేత కార్యసిద్ధి, బుద్ధి లభింపగలవని తాత్పర్యము. ఈ విషయములో ఇంకొక కథ కలదు. తల్లియగు పార్వతి విఘ్నేశ్వరుని, కుమారస్వామిని పిలిచి 'నాయనలారా! చక్కని కన్య లిద్దరు సిద్ధి, బుద్ధి అని ఉన్నారు. మీలో ఎవరు ముందుగా భూప్రదక్షిణము చేసివస్తారో వారి కిచ్చి ఈ కన్యలను వివాహము చేసెదను' అని అన్నదట. తక్షణం కుమారస్వామి రివ్వుమని నెమలి ఎక్కి ప్రయాణమై పోయినాడట. పెద్దవాడగు విఘ్నేశ్వరుడు 'స్థూలకాయుడనే! ఏమిదారి!' అని యోచించి 'తల్లిభూదేవితో సమాన'మను ఆర్యోక్తి ననుసరించిపార్వతీ దేవిని చుట్టి ప్రదక్షిణముచేసి ఒక తృటిలో కార్యము సాధించి కన్యలను పాణిగ్రహణము చేసెనట. తరువాత

కుమారస్వామివచ్చి విషయము తెలిసికొని ఖిన్నుడయ్యెనట. దీనివలన బుద్ధిమంతుడయినవాడు ఎట్టి కష్టతమమైన కార్యమునైనను సునాయాసముగా నెరవేర్చి ఫలమును పొందగలడను అర్థము గ్రహించవలసి ఉన్నది.

(ii) వినాయకుడు, గణాధిపతి, గణపతి కూడాను. భూతగణాది సేవితుడు. అనగా సత్వసంపన్నుడును, ఇంద్రియనిగ్రహము గలవాడును అగు బ్రహ్మచారికి భూతప్రేత పిశాచాదులవల్ల ఎట్టి భయము ఉండదు అనీ, అవి అతని భృత్యులై సేవించుచుండుననీ తాత్పర్యము.

(iii) మరియొక చిత్రకథ కూడ చెప్పెదను:— అభ్యంతరమందిరమున నున్న పార్వతి లోపలికి ఎవరినయినాసరే రానియ్యవద్దని చెప్పి, విఘ్నేశ్వరుని ద్వారమున కాపలా పెట్టినదట. కామాతురుడును, సతీపతియైనను పరమశివుడు ఆ సమయమందే పార్వతీమందిరము ప్రవేశింప నుత్సహించెనట. విఘ్నేశ్వరుడు — అనగా బ్రహ్మచర్యమునకు అధిష్ఠానదేవత శివుని నివారించెననియు, ఎంతచెప్పినను వినక విఘ్నేశ్వరుని అతిక్రమించి, కోపోద్రేకమున వినాయకుని తలద్రుంచి, అనగా బ్రహ్మచర్యము చంపివేసి అభ్యంతరమందిరము జొచ్చెనట.

7. వేదాంతశాస్త్రరీత్యా, యోగశాస్త్రరీత్యా, మంత్రశాస్త్రరీత్యా, గాణపత మతరీత్యా వినాయకునికి విశేషార్థములు గలవు. ఇవన్నియును దీక్షితులవారు వ్రాసిన 'వాతాపిగణపతిం భజేహం' అను హంసధ్వని కీర్తనలో సూచింపబడినవి.

వాతాపిగణపతి—మంత్రశాస్త్రములో గణపతి మంత్రములో అనేక భేదములు కలవు. వాతాపి గణపతి, వల్లభగణపతి, సువర్ణాకర్షణ గణపతి, ఉచ్ఛిష్ట గణపతి, అనునవి తద్భేదములు.

త్రికోణమధ్యగతకు— త్రికోణమను మంత్ర చక్రము.

కరాంబుజపాశబీజపూరం —వాతాపిగణపతి చేతిలో పాశము, బీజపూరము అను ఒక కాయయు నుండును.

నిజవామ కరవిధృతేక్షుదండం — ఎడమ చేతిలో చెరకుగడ. ఇందుచేతనే నాల్గుచేతు లుండును. 'చతుర్భుజం.'

8. మూలాధార క్షేత్రస్థితమ్—మూలాధార చక్రము పరబ్రహ్మస్థానము. అచ్చటనే సాధకులగు యోగులు పరబ్రహ్మమును చూడగలరు.

ప్రణవస్వరూప వక్రతుండమ్— నాగర లిపిలో ఓంకారము వ్రాసిన అది ఏనుగుతొండము వలె నుండును. 4-వ పటము చూడుడు. వినాయకుడు ప్రణవస్వరూపుడని అర్థము. ప్రణము నుండి నాదము, నాదమునుండి శబ్దము పుట్టినవని శాస్త్రము.



౪. పటము

పరాది చత్వారివాగాత్మకమ్— పైమూడింటిలో అక్షరశబ్దమునకు నాల్గురూపభేదము లున్నవి, పర, పశ్యంతి, మధ్యమ, వైఖరి అని. ఈ నాల్గు కలిసి వాగాత్మ స్వరూపమగును. ఇందు నాల్గవదియగు వైఖరి మాత్రమే బాహ్యముగా గోచరించు వాగ్రూపము.

హంసధ్వని భూషిత—యోగశాస్త్రములో, సః అనగా ఉచ్ఛ్వాసము. అహమ్ అంటే నిశ్వాసము. ఉచ్ఛ్వాసనిశ్వాసలు చేరి సః + అహమ్ = సోహమ్ అగును. నిశ్వాస ఉచ్ఛ్వాసలు చేరి హంస యగును. ఈ హంసలే ప్రాణాధారమునకు కారణములు. యోగాభ్యాసములో, ఈ హంసలను స్వాధీనము చేసికొనుట సాధనకు ముఖ్యము. అందుచేత హంసధ్వని భూషితుడు, గణపతి—పరబ్రహ్మము.

నిరంతరం నిటల చంద్రఖండమ్, మురారి ప్రముఖాద్యుపాసితమ్— మొదలైన విశేషణములు.

గణపతికి చేర్చుటచేత ఇతడే పరమశివుడని చెప్పబడినది. వినాయక చతుర్థికి (శివచతుర్థి) అనికూడ పేరు కలదు.

హంసధ్వని రాగం

ప॥ వాతాపి గణపతిం భజేహం వారణాస్యం వరప్రదం ॥

అ. ప. భూతాది సంసేవితచరణం భూతభౌతిక ప్రపంచ భరణం
వీతరాగిణం వినతయోగినమ్ విశ్వకారణం విఘ్నవారణం ॥వా॥

చ. పురాకుంభ సంభవ మునివర ప్రపూజితమ్ త్రికోణ మధ్యగతమ్
మురారి ప్రముఖాద్యుపాసితం మూలాధారక్షేత్రస్థితమ్
పరాది చత్వారి వాగాత్మకం ప్రణవస్వరూప వక్రతుండమ్
నిరంతరం నిటల చంద్రఖండం నిజవామకర దృతేక్షు దండమ్
కరాంబుజపాశబీజాపూరం కలుష విదూరం భూతాకారమ్।
అనాది గురుగుహాతోషితబింబం హంసద్వని భూషిత హేరంబమ్॥ వా॥



# ఆర్తనాదము

'శిల్పి'

అది నిరంతరంగా అల్లాగే వినిపిస్తూంటుంది. పొద్దున్న వెళ్ళినా, మిట్టమధ్యాహ్నం వెళ్ళినా, రాత్రి చీకటి పడ్డాక, వెళ్ళినా అది ఆ స్థలంలో అల్లాగే మోగుతూంటుంది.

అది నిర్జనప్రదేశంకాదు; మహారణ్యంకాదు. ఆ ముసలిది కూర్చున్నది రోడ్డుపక్కని. రోడ్డుమీదనించి మోటార్లూ, గుఱ్ఱపుబళ్ళూ, సైకిళ్ళూ అన్నీ రణగొణధ్వనిచేసుకుంటూ వెళ్ళిపోతూంటాయి. వేలకివేలు జనం క్రమక్రమంగా అల్లాగే నడిచిపోతూంటారు. సాయంత్రం అయ్యేసరికి పొద్దుటినించీ లేచిన రోడ్డుదుమ్మంతా ఆ రోడ్డుకి రెండువైపులా ఉన్న చెట్లఆకులమీద పేరుకుంటుంది. క్రమంగా ఆ పరిసర వాతావరణానికి అంతటికీ కంకర బూడిదరంగు ఏర్పడుతుంది.

ఆ ముసలిది 'బాబూ!' అనిదీనంగా సన్నంగా అల్లాగే మూలుగుతూన్నట్లు అంటూంటుంది. దాని కంఠంలో యుగయుగాలనాటి దైన్యమూ, ఆవేదనా, ఆక్రోశమూ పేరుకుని పేరుకుని కదలలేక కదలలేక అస్ఫుటంగా వినిపిస్తూన్నట్లుంటాయి.

అసలుదాన్ని 'ముసలిది' అని చెప్పడానికి వీల్లేదు. దుర్భరమైన దారిద్ర్యమూ ఆకలీ ఆ వ్యక్తిశరీరంలోని లింగభేదం పూర్తిగా రూపుమాపాయి. ఆ శరీరానికి పూర్తిగా ఆచ్ఛాదనలేదు. ఏదో చాలీచాలని గుడ్డపేలిక.

అప్పుడప్పుడు జనం దానికి ఎదురుగుండా పరిచిన గుడ్డపేలికమీద కానులూ, అర్ధణాలూ విసిరివేస్తున్నారు. ఆ గుడ్డిది తడుముకుంటూ అవి ఏరుకుంటూ ఉంటుంది. మళ్ళీ అల్లాగే బాబూ!......బాబూ!.........అని దీనంగా ఆర్తనాదము!

నేనూ ఒకకానీ విసిరివేశాను. కాని నా మనస్సులో ఏదో దొంగతనం చేసినంత భయంవేసింది. నేను దొంగతనం ఏంచేశాను! ఆ ముసలిదానిమీద దయతలిచి ఒక కానీ విసిరివేశానే! కాని ఆ ముసలిదాని కంఠధ్వని దీనంగా "అవును! నువ్వు దొంగతనం చేశావు! నా దగ్గిర అపహరించిన ధనంలో ఈ కానీ ఇచ్చినంత మాత్రాన్ని నువ్వుచేసిన దొంగతనానికి బంగారు మలామూ పుయ్యగలవా?" అన్నట్లు వినబడింది.

నే నాశ్చర్యపోయాను. పక్కనేఉన్న ఒక పార్కులో కూర్చుని సిగరెట్టు తాగుతూ మంథరమంథరంగా పైకిలేచిపోయే ధూమమాలికలు చూస్తూ కూర్చున్నాను. మళ్ళీ దీనాతిదీనమైన, నిద్రాళువైన ఆ కంఠధ్వని అలాగే ఆ మహానగరపు రణగొణధ్వనికి ఒక మూలుగు శ్రుతిలా వినిపించింది.

నాలో అనేకప్రశ్నలూ, సమాధానాలూ బయలుదేరాయి. నాలో అనుకున్నాను. ఇది అంతా ఒక విధి విధానము. ఎవడో ఒక సృష్టికర్త ఆమె నా విధంగా సృష్టించి ఉంటాడు. లేకపోతే బలీయమైన ఆమె పూర్వజన్మపరిపాకము ఆమెకు ఆ దుర్గతి సమకూర్చి ఉంటుంది. మనకి దురూహ్యమైన శక్తులు నిర్మించిన ఈ ప్రపంచపు మంచిచెడ్డలని గురించి మనం ఎంత తల మొత్తుకుంటేమాత్రం ఏమి ప్రయోజనము? నా పెదవుల మీదనించి అప్రయత్నంగా ధూమమాలికలు మెలికలు తిరుగుతూ పైకిలేచిపోయాయి.

మళ్ళీ దూరాన్నించి ఆర్తనాదం వినబడింది. ఆ ఆక్రోశం వింటూంటే అది నాతో "ఈ దేవుళ్ళూ, ఈ పరమేశ్వరుళ్ళూ పచ్చి అబద్ధాలు! ఈ కర్మసిద్ధాంతం

అంతా కట్టిబూటకం! దీనాతి దీనురాల్ని! గుడ్డిదాన్ని! ముసలిదాన్ని! నన్ను కొల్చుకుతినడానికి ఈ అబద్ధాలన్నీ ఎందుకు ప్రచారంచేస్తారు! మీకు నిజాయితీ ఉంటే నా ఎదురుగుండా వచ్చి మీరు చేస్తూన్న ఘోరానికి క్షమాపణ చెప్పండి! ఇంత చిన్నవిషయానికి, నాకు చేస్తూన్న ఈ అన్యాయానికి ఇన్ని మాయ పన్నాగా లెందుకు?'' అని అన్నట్లయింది. అప్పుడు నా కళ్ళ ఎదురుగుండా యుగయుగాలనించి మానవుడు మానవుణ్ణి వేధించుకుతినడానికి నిర్మించిన, మూఢ విశ్వాసాలూ, బూటకపుదేవుళ్ళూ, మతాలూ, సిద్ధాంతాలూ, స్వర్గాలూ, నరకాలూ, నమ్మకాలు, అన్నీ మెల్లిమెల్లిగా ప్రత్యక్షమౌతూ మంచువిడిపోతూన్నట్లు అదృశ్యమైపోయాయి.

ఒక చిన్న వేసంకాలపు జల్లుపడింది. పక్కనే చెట్టుమీద కూర్చున్న ఒక కోంగ రెక్కల ల్లాడించి మళ్ళీ నిద్రపోతూన్నట్లు కూర్చుంది. కొట్ల ఆకులమీదనించి వర్షబిందువులు జారి పసిరిపచ్చికమీద పడ్డాయి. వెంటనే పచ్చికమీద ముడుచుకొని కూర్చున్న సీతాకోకచిలకలు కలకలలాడుతూ ఎగరడం మొదలుపెట్టాయి. ఆపక్కగా ఒక యువతి విలువైన చీరలతోనూ నగలతోనూ కులుకుతూ పచారుచేస్తూంది.

నా మనస్సులో అనేక భావాలు రేకెత్తాయి. ఒక విజ్ఞుడు చెప్పినట్లు ధనసంగ్రహణానికి మూడేమార్గాలు. దొంగతనం, భిక్షాటనం, చెమటఊడ్చి పనిచెయ్యడమూను. చివరి రెండుమార్గాలూ అవలంబించనివాళ్ళు—ఎన్నికమాపా కబుర్లుచెప్పినా!—దొంగలే కాదూ! అయితే నేడు సమాజంలో వాళ్ళకి చిత్రవిచిత్రమైన పేర్లు చలామణీ అయిపోతున్నాయి. సమాజంలో సమూహం దొంగలైనప్పుడు దీనులకీ, దరిద్రులకీ దేవుళ్లని సృష్టించడంలోనూ, కర్మసిద్ధాంతాలు కల్పించడంలోనూ ఆశ్చర్యం ఏమిఉంది?

మళ్ళీ అల్లాగే దూరాన్నించి 'బాబూ!' అని వినిపించింది. తరవాత చెవులు గింగురుమ నేటట్లు 'ఇంక్విలాబ్! జిందాబాద్!' అని వినిపించింది. ఒక్క గొంతుక 'ఇంక్విలాబ్!' అంటే జనసమూహం అంతా చెవులు చిల్లులు పడేటట్లు 'జిందాబాద్!' అని అరుస్తున్నారు! వాళ్ళకళ్ళల్లో ఏవో నూతనస్వర్గజ్యోతులు మెరుస్తున్నాయి. వాళ్లల్లో ఎంత ఆవేశమూ, అమాయికత్వమూ తాండవిస్తున్నాయి! వాళ్ళు ఒక్కొక్క కేకతో జీవితాన్ని ఆవరించుకుంటున్న దారిద్ర్యమూ, మాంద్యమూ, జరాభారమూ మొదలైన వాటినన్నింటినీ అదిలించివేస్తూన్నట్లున్నారు! వాళ్ళవెనకాల వెళ్ళే చింపిరిజుట్లూ, బిక్కమొహాలూ అన్నీ ఒకసరికొత్త ప్రపంచం ఈ నల్లరేగడి మట్టిలోనించి పెకలించేటట్లున్నాయి! బహుశః వాళ్లు ఒక నూత్నప్రపంచం సృష్టించగల రనుకున్నాను.

మళ్ళీ ఆ దౌర్భాగ్యురాలి కంఠస్వరం 'బాబూ'!...... అంది. కొన్నికానులు గళ్ళు గళ్ళుమన్నాయి. కాని వాళ్ళు కొత్తలోకం నుంచున్నట్టుగా సృష్టించేటంత తొందరతో సాగిపోతున్నార్లు! వాళ్ళ కోలాహలంలో ఆమె కంఠస్వరం మెల్లిగా నీటిలో మునిగిపోతూన్నట్లనిపించింది.

వాళ్ళందరూ వెళ్ళిపోయారు. బాగా చీకటిపడింది. ఆమె కంఠస్వరం అల్లాగే దీనంగా, సన్నంగా, జాలిగా వినిపించింది. ఆ వెళ్ళిపోయేవాళ్ళు ఏదో కొత్తలోకం సృజించే తొందరలలో ఆమెని బాగా పరకాయించ లేదు! నేను పాతప్రపంచపు కలవరింతలలో పడ్డాను. ఒకకానీ గిరవాటు వేసి నా పూచీ ఏమీలేదని సంతృప్తి పడ్డాను! నాకళ్ళు అప్రయత్నంగా సంధ్యాంధకారంలో కలిసిపోతూన్న ధూమలతికల వెనువెంటనే ఆకాశానికి ఎగిరి కొత్తసుందరలోకాలు నిర్మించుకుంటూ కలలు కంటున్నాయి.

ఆ దీనురాలి ఆ ఆర్తనాదం ఆ అంధకారగర్భంలో మెల్లిమెల్లిగా తలవాల్చింది.



స ర స ము ర ళి

ఆనందవాణి: సెప్టంబరు ౧౫. కాంగ్రెసు సంచిక

ఆనందవాణి ఆంధ్రలోకమునకు పరిచితమే. నేడు వెలువడిన యీ కాంగ్రెసుసంచిక ఒక ప్రత్యేక సంచిక. ఇట్టి ప్రత్యేకసంచికలలో ప్రజాదరణ పొందుచుండుట ఆనందవాణికి క్రొత్తగాదు. నేటి సంచిక యందు కొంత విలక్షణత కన్పట్టుచున్నది.

సంచిక విప్పగనే, మాటలకన్న హెచ్చు ఘాటుగా ౧౮౮౫-౧౯౪౮ విశేషములు చెప్ప పోళిన చిత్రకూటము, తరువాత కుదించిన అక్షరములకన్న స్పష్టముగ వ్యక్తి ప్రత్యేకతను తెలుపు కాంగ్రెసు నూతన కార్యదర్శుల గీతల బొమ్మలు, భారతావనినంతనూ ఆనందింపించిన నెహ్రూ నూతన కేంద్ర మంత్రివర్గము, పిమ్మట ఆంధ్ర కేసరి మంత్రివర్గమును, చదువరుల నాకర్షించును.

ఇవిగాక ఆంధ్రులకు బహుపరిచితులయిన రచయితల వ్యాసములున్నవి. వీటిలో నన్నియు "నేనా, నీవా" అను ప్రజ్ఞగలవిగా నున్నను కొన్నిటిని ప్రత్యేకించక తప్పగు.

పట్టాభిగారి స్వాతంత్ర్య యుద్ధములో 'ఎత్తుపై ఎత్తులు' అను వ్యాసము చదువునప్పుడు, ఇట్టి విషయములను ఎత్తులమారి గాక మరెవరు వ్రాయగలరు? అని అనిపించును. జీవితమంతయూ కార్మిక సమస్యలో కృషి సలిపిన శ్రీ గిరిగారి 'సమ్మెలు' వారికీ విషయమునం దున్న ప్రస్తుతాభిప్రాయమును తెలుపుచున్నది.

ఆంధ్రరాష్ట్రము, ఆంధ్ర వ్యక్తిత్వము అను పీఠికలోనున్న 'ఆంధ్ర లోకము' అను నండూరివారి వ్యాసమును చదవక తప్పదు. తనకునూ, కార్యక్రమ ప్రణాళికలోనూ, కొండంత భేదమున్ననూ నిష్పక్షపాతముగ చిత్రింపబడిన 'మూర్తి' గారి అంబేద్కరు మూర్తి చదువరులు పరిశీలింపతగ్గది.

'రాణి'

దేశం: శ్రీ విద్వాన్ పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారు. వెల రు. 0-8-0లు. ప్రాప్తిస్థానం. మణిమాలికా గ్రంథమాల. శాయపురం. ఉయ్యూరు పోష్టు

ఇది శ్రీశైలం, కాళహస్తి, ద్రాక్షారామం స్వాములకు అంకితమయిన చిన్న పద్యకావ్యం. 'భారతీయుడ! పట్టపగటీ నిదురేరా, పిట్టపిడుగూ వోలె రారా! అన్న పిలుపుతో బాటు, త్రిలింగదేశం మనదేనోయ్ తెనుంగులంటే మనమేనోయ్! అను చక్కటి హెచ్చరిక జేశారు, కవిగారీ చిన్న గ్రంథంలో.

ఆంధ్ర జాతీయ గీతం. శ్రీ పైడిపాటి సుబ్బారామశాస్త్రి పైడిపాటి ఆఫీస్ బెజవాడ.

ఇది ఆంధ్రుల అన్ని వైభవాలూ ఉగ్గడిస్తూ ప్రబోధించే ప్రచార గీతం. పుస్తకాకారంలో ముద్రితమైంది.

'బసవ'

కళా తరంగిణి: ముడుంబై శ్రీ రామాచార్యులుగారు. నర్తనశాల. రాజమండ్రి. వెల ఒక రూపాయి.

నర్తనశాలను నడిపిన రామాచార్యులుగారు ప్రభోధానికి పూనుకున్నారీ చిన్ని పుస్తకంలో. వారి శ్రమకు కృతజ్ఞులము. ఎందువలననో, ఎటులనో కొన్ని లోటులీ

పుస్తకములో కనబడుతున్నాయి. మచ్చుకు కొన్ని మాత్రమిచ్చి, వారి శ్రమకు సంతసము వెలిబుచ్చుతున్నాము.

నటరాజు నాట్యమనగా స్త్రీ పురుష సమ్మేళన మన్నారు! ఇది బహుశః వేదాంతంలోని, ప్రకృతి పురుష సమ్మేళనానికి వికృతిగాబోలు!

తొల్లి ఋషులు ఈ కళను వినోదమునకు కాలక్షేపమునకు మాత్రమె పరిగణించి యుండిర న్నారు. నటరాజు నాట్యమున కంతరార్థమిదియా! వలయుచో ఇంకొక పరి చెప్పెదను.

నాద బిందువులకు పిదప మూడవదానిగా కళకు స్థానమిచ్చినారు. నాదబిందు సమ్మేళనమే కళ గాని వేరు గాదు.

కళకు ప్రాముఖ్య మిచ్చిన వారిని కళారాధకుల న్నారు. అభ్యసించి ఆచరించినవారు ఆరాధకులుగాని, ప్రాముఖ్యమునకునూ ఆరాధనకునూ సంబంధము లేదు.

కళారాధకులు, కళోపాసకులు వేరన్నారు. సాధనకు ఆరాధనా ఉపాసనా రెండూ ఉండాలిగాని వేరుపరచుటకు వీలులేదే!

మ్యూజియంలోని యీజిప్టు మమ్మీలమయి పోవుచున్నామన్నారు. యే మ్యూజియంలోనో గదా వీరీ మమ్మీలను జూచినది!!

పురుగు మొదలు పరమయోగివరకూ అన్నారు. శివ శివా! పురుగే దొరికిందా పరమయోగివరకూ పోవుటకు!!

ప్రతివ్యక్తి రూపవిషయంలో వహించు శ్రద్ధ వర్ణనాతీతమన్నారు. వీరు చూచిన ప్రతివ్యక్తీ చలనచిత్ర సంబంధియా?

ప్రపంచమనగా పంచీకరణ మూలకమన్నారు. "అనగా"కు స్థానమేది? శుద్ధ తెలుగుపదముల ప్రక్కని అవి అర్థమగుటకు గాబోలు ఆంగ్లేయ పదముల నుదహరించినారు. ఎందులకో?

ఇట్టివి చాలా ఉన్నా ఇంతటితో విరమిస్తాను.

'బసవ'

# గ్రంథస్వీకృతి

---

## సాహిత్య సమాలోచనము

పిల్లలమర్రి వెంకట హనుమంతరావు, ఎం. ఏ.,

శారదాపీఠము; గుంటూరు.

---

## నివేదన

శ్రీ చింతాదీక్షితులు

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై.

---

Printed at the B. N. K. Press Q. H. No. M. S. 100/ B for T. P. No. E 46/9-46.

# ఆంధ్రశిల్పి

## సచిత్ర మాస సంచిక

సంపాదకులు:

వి. ఆర్. చిత్రా: పి. గణపతిశాస్త్రి

౧౦, నరసింగపురం వీథి,


మౌంట్ రోడ్, మద్రాసు.

# విషయానుక్రమణిక


| | | పుట |
|---|---|---|
| సంపాదక సమీక్షలు | సంపాదకులు ... | ౩ |
| పులియాకు ... ... | శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు | ౭ |
| శివతాండవము ... ... | శ్రీ పుట్టపర్తి నారాయణచార్యులుగారు | ౮ |
| హృదయోపహారము ... | శ్రీ పి. గణపతిశాస్త్రిగారు | ౧౩ |
| దీపావళి ... ... | శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు | ౧౪ |
| శకటమాపండి! ... ... | శ్రీ మహంకాళి భీమశంకరమూర్తిగారు | ౧౫ |
| రాకెట్టులో ఆకాశయానం ... | శ్రీ వసంతరావు వెంకటరావుగారు | ౧౭ |
| రవీంద్రస్మృతి ... ... | శ్రీ కృష్ణశాస్త్రిగారు | ౨౭ |
| విన్నపాలు ... ... | 'చలం' ... | ౩౨ |
| తీర్థపు టుద్రేకాలు ... ... | శ్రీ పాలగుమ్మి పద్మరాజుగారు | ౩౪ |
| భరతుని రసవాదము ... | శ్రీ ఆచార్య పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు | ౩౯ |
| రూపశ్రీ ... ... | శ్రీ సంజీవదేవ్ గారు ... | ౪౨ |
| ప్రాచీన చలనచిత్రాలు ... | శ్రీ డాక్టరు పి. వి. పతిగారు | ౪౬ |
| చిత్ర వివరణము ... | శ్రీ టి. యస్. శ్రీనివాసన్ గారు | ౫౧ |
| గ్రంథ విమర్శనము ... | ఉషా సుందరి | ౫౩ |
| గ్రంథ స్వీకృతి ... | | ౫౮ |


## శిల్పాలు


| | |
|---|---|
| ముఖచిత్రము ... ... | శ్రీ పిలకా లక్ష్మీనరసింహమూర్తిగారు |
| పార్వతీదేవి కదంబారాధనము ... | శ్రీ నందలాల్ బోసుగారు |
| సువర్ణ హరిణసంహారము, నర్తకులు ... | శ్రీ టి. యస్. దండపాణిగారు |
| వృద్ధశీర్షము ... ... | శ్రీ కుప్పురావుగారు |
| వర్షాదివసము ... ... | శ్రీ తణికాచలంగారు |
| వసంతదివసము ... ... | శ్రీ హిరాసూ హిరాఫోక్ గారు |
| పూతనాసంహారము, వరాహావతారము ... | దేవాలయ రథశిల్పాలు : తిరుపతి |



పార్వతీదేవి కదంబారాధనము — ప్రొ॥ సంపత్రావు గోపనాథ

శ్రీ, తలావఝుల శివశంకర శాస్త్రిగారి సౌజన్యముతో

# సంపాదక సమీక్షలు

## మరి మర్యాదగా దయచెయ్యండి!

భారత రాజకీయరంగంలో ఎత్తు పై ఎత్తులు విద్యుద్వేగంతో మెరిసిపోతున్నాయి. ఎల్లాగైతేనేం ముస్లింలీగు భారతప్రభుత్వంలో జేరింది. కాని చేరకపోయినా బాగుండు ననిపించే విషమ పరిస్థితుల్లో లోపలికి ప్రవేశించింది. కాంగ్రెసుకీ ముస్లింలీగుకీ రాజీ కుదరడంలేదు. ముస్లింలీగు భారతప్రభుత్వంలో శత్రుభావంతో చేరిందో మిత్రభావంతో చేరిందో చెప్పలేము. బహుశః కొంత తటస్థభావంతో ప్రవేశించిందనే అనుకుందాము.

కాని ఆ ప్రవేశంమాత్రం అతివిచిత్రంగాఉంది. కేవలం మహమ్మదీయులందరికీ ఏకైక ప్రాతినిధ్యం వహిస్తున్నానని గర్వోక్తులు పలికే ముస్లింలీగు తన ప్రతినిధులలో నిమ్నజాతుల 'ప్రతినిధి' అనే ఒక ఆసామీని చేర్చడమూ, అతగాడు తన వర్గానికి ముస్లింలీగు న్యాయం ప్రసాదించిందంటూ ప్రపంచానికి చాటడమూ, ఈనాటకంఅంతా తగునని రాజప్రతినిధి ఆమోదించడమూ భారతరాజకీయరంగంలో చాలాచిత్రాతివిచిత్రమయిన సంఘటనలు! ఇందులో కేంద్రప్రభుత్వంలో ఉన్న కాంగ్రెసునాయకుల ఆమోదం ఉన్నదో లేదో తెలియదు. ఉంటుందని అనుకోడానికి అవకాశాలులేవు.

ఏది ఏమయినా ఈవిషయంలో రాజప్రతినిధి చేసినది ఏమాత్రమూ సమంజసంగాలేదు. గత సిమ్లాసమావేశం దగ్గిరనించీ ముస్లింలీగుని సమాధానపరచడానికి రాజప్రతినిధి కాంగ్రెసుతో జాతీయమహమ్మదీయుల్ని

చేర్చుకోవద్దని చెబుతూండడమూ, దానికి కాంగ్రెసు అంగీకరించకపోతూండడమూ అందరికీ తెలిసిన విషయాలే. ఆరాజప్రతినిధే ఇప్పుడు కులతత్వమయమైన ముస్లింలీగుప్రతినిధివర్గంలో కాంగ్రెసుకి వ్యతిరేకి అయిన నిమ్నజాతి ప్రతినిధిని చేర్చడం దేశంలో సామరస్యసంపాదనకోసమేనా? ఇటు మహమ్మదీయులకీ మహమ్మదీయేతరులకీ ప్రతినిధిగాఉన్న కాంగ్రెసుని మహమ్మదీయులవిషయంలో తన ప్రాతినిధ్యం మానుకోమనడమూ, అటు నిమ్నజాతుల గోడేలేని ముస్లింలీగుకి వారి ప్రాతినిధ్యం ప్రసాదించడమూ అనుమానకారణాలుకావూ? అనుమానకారణాలే! సందేహంలేదు! అయినప్పటికీ మేము రాజప్రతినిధి ఎల్లాగో అల్లాగ ఏదో ఒక సామరస్య ప్రాతిపదికకోసమే ఈవిధంగా ప్రవర్తించి ఉండాలని అనుకుంటున్నాము.

అది అటుకాక రాజప్రతినిధి సామ్రాజ్యవాద దృష్టితోనే ఈ కథ నడిపించిఉంటే అతనికీ ఆ సామ్రాజ్యవాదులకీ నిష్కర్షగా ఒకమాట చెబుతున్నాము! మహమ్మదీయులకీ మాకూ అనేకాభిప్రాయభేదా లుండవచ్చును. హిందూమహమ్మదీయులు ఏకోదరులు. ఎంతకాలం కలహించినా వారు ఎప్పటికైనా ఏకంకావలసినవారే! అంతవరకూ అవసరమయితే కొంత బలాబలాలు చూచుకోవచ్చును! కాని ఈ సామ్రాజ్యవాదులు ఈ కుటుంబకలహం తమస్వార్థానికి ఉపయోగించుకోవాలని అనుకోవడం మాత్రం చాలాగర్హ్య విషయము.

ఆంగ్లజాతి చేతుల్లో ఈ దురదృష్టదేశం అనేక దుఃఖాలకీ అవమానాలకీ గురి అయింది. ఆంగ్లపాలకులు సాగినంతకాలం తమభేదోపాయాలు పన్నుకుంటూ తమసామ్రాజ్యం నిలబెట్టుకున్నారు. మరి ఆరోజులన్నీ వెళ్లిపోతున్నాయా! ఇన్నిజరిగినా భారతజాతి ఆంగ్లదేశంతో మిత్రభావంతోనే విడిపోవాలని చూస్తోంది. అందుచేత ఆంగ్లమిత్రులతో ఇక లేనిపోని కుతంత్రాలు పన్ని వ్యర్థంగా కాలహరణం చెయ్యవద్దని చెబుతున్నాము. ఇది ఆంగ్లభారత దేశాలకేగాక ప్రపంచానికంతటికీ క్షేమంకరమైన విషయము. అందుచేత కొంచెమైనా భావిదృష్టి అవలంబించండి! మరి మర్యాదగా దయచెయ్యండి!

# నవకాళీ దురంతాలు

పాపం! వంగదేశంలో దారుణసంఘటనలకి అంతూదరీ కనబడడం లేదు. పూర్వం వంగక్షామం వచ్చినదిమొదలు ఇప్పటివరకూ ఆదేశంలో అన్నీ విషాదసంఘటనలే. ఈ మధ్యన కలకత్తాసంఘటనలు సభ్యప్రపంచాన్ని స్తంభింపజేశాయి. ఇంకా కలకత్తా సంఘటనల విషాదగాథలు స్మృతిపథంలో మాసిపోనేలేదు. ఇంతలోనే మళ్లీ ఈ నవకాళీదురంతాలు! దారుణహింసాకాండలో ఇవి కలకత్తాసంఘటనల్ని తలదన్నాయి! వేలాదివేల స్త్రీశిశుహత్యలు! ఆపైన బలవన్మతాంతర ప్రవేశాలు! మరి ఆచేర్చినవారికీ ఆచేరినవారికీ ఆమతదైవమైనా మనశ్శాంతి ప్రసాదిస్తుందో! ప్రసాదించదో!

ఇల్లాంటిదారుణ సంఘటనలు ఎప్పుడో యూరపులో మధ్యయుగాల్లో జరిగాయి. మరి ఆధ్యాత్మికదేశం అనీ, ప్రపంచానికి 'శాంతిదూత' అనీ చెప్పబడే ఈదేశంలో ఈమతకలహాలూ, మతాంతర ప్రవేశాలూ ఒళ్లు జలదరింపజేస్తున్నాయి! ఇందులో మేము ప్రత్యేకంగా హిందువులని గాని, మహమ్మదీయుల్నిగాని నిందించ దలుచుకోలేదు. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క మతంవారు కొంతనిగ్రహం చూపించవచ్చును. సమూహం అంతా క్రూరమృగాలకన్న అధమాధమస్థితిలో పడిపోయే ఆ మతావేశ సమయంలో ఏమతానికి చెందినవారైనా కొంతమంది వ్యక్తులు దివ్యత్వం చూపించవచ్చును; ఆవిష్టులైన అల్పసంఖ్యాకులు కొందరు కేవలమూ పాశవిక ప్రవర్తనలో పడిపోవచ్చును!

అయినా గాఢంగా ఆలోచిస్తే ఈవిషయంలో కొన్ని తీవ్రాభిప్రాయాలు కలగకమానవు. కొన్ని వేలఏళ్ళనించీ మతాలు మానవజాతిలో ప్రవేశించాయి. మేము ఈమతప్రవక్తలని గురించిగాని ఈమత సిద్ధాంతాలనిగురించికాని శంకించడంలేదు. ప్రవక్తలు లోకోత్తరపురుషులు కావచ్చును; మతసిద్ధాంతాలు మహోన్నతమైనవే కావచ్చును. కాని అవి అనుసరిస్తున్నామని చెప్పే జనసామాన్యంలో వాటివల్ల మంచిఫలితాలేవీ కలగడం లేదనడం సత్యదూరంకాదు. మతప్రవక్తలు గతిస్తున్నారు, మతాలు గతిస్తున్నాయి. కొన్ని కొత్తమతాలు తలలెత్తుతున్నాయి. జన

సమూహాలు అల్లాగే మార్పులేకుండా నడిచిపోతున్నారు. అంతేకాదు! ప్రపంచంలో మతంపేరటా భగవంతునిపేరటా ప్రవహించిన రక్తప్రవాహాలు మరి ఏఇతర రక్తప్రవాహాలకీ తీసిపోవు! మరి ఈ మతాలవల్ల మానవసభ్యతకి ఏమిమేలు జరిగినట్టు!

అందుచేత ఇంక మనిషి మతం అన్నదానికి దేనికీ చెందకుండా కొంత మానవమాత్రుడుగానే ఎందుకుండిపోగూడదు? ప్రతీమనిషికీ ఏదో ఒక ప్రత్యేకమతం ఉంటే ఉండవచ్చును. దానివల్ల అంత ఆపత్తు లేదు. కాని పదిమందిచేరి ఒకమతంగా సంఘీభవించి, ఒక దేవుణ్ణీ, కొన్ని మూఢాచారాలనీ సృష్టించుకోవడంలోనే ఈ అనర్థాలన్నీ కలుగుతున్నాయి. ఇన్నాళ్ళనించీ మతాలు పట్టుకుని వ్రేళ్లాడిన మానవజాతి ఇకనించి పూర్తిగా ఈ ఆసూత్రిత మతానికి (Organized Religion) స్వస్తిచెప్పి నూత్నకళ్యాణమార్గాలు అవలంబించకూడదా? బహుశః ౨౧ వ శతాబ్దానికైనా మానవజాతి ఈకొత్తమార్గం తొక్కుతుందేమో! కాని ఆ మతం లేకపోవడం' మాత్రం మళ్లీ ఒక 'ప్రత్యేక మతం'గా పరిణమించి ప్రాణాలు తియ్యగూడదు!

# పులియాకు

ఏ పసికొండదండ నటియించు సరిల్లలనా నితంబ బిం
బోపరిభాగభోగముల యోజ విరాజిలు సైకతంబులన్
కాపుర ముండిరో ! గదె వనస్పతు లాదిని నీసగోత్రు, లీ
మాపుల కక్కటా ! బయిసిమాలితి వో ! పులియాకు విస్తరీ !

చైత్రుడు ముద్దులాడుటకు సాగిలి వ్రాలిన బాల్యరేఖలున్
రాత్రుల చందమామ నిను రాగిలి డాసిన పచ్చిప్రాయమున్
చిత్రముగా నదృష్టసరణిం బడి రూపఱె ; కాని భావనా
సూత్రమునందు మాయ వతి చోద్యముగా పులియాకు బిత్తళీ !

ఏ ముత్తైదువ మేనిచాయ గృహామున్ హేమింప కల్యాణవీ
క్షా మౌగ్ధ్యంబు కపోలదీధితుల స్నిగ్ధస్నిగ్ధముల్ చేయ, నా
నా మాధుర్య రసానుపాకచయమున్ వడ్డించెనో నీపయిన్
ఏమై పోయెనో నాటి భోగమహిమం హేవాక పత్త్రావళీ !

పోలున్ ఛాత్రు డొకం డనధ్యయనమున్ పోనాడ మిట్టాడుచున్
మ్రోలం గాంచి లవించి తెచ్చె నిను, తేపో మాపో వారింట, కా
జాలున్ బ్రాహ్మణి లక్షదీపముల దీక్షామంగళోద్యాపనల్
ఏలోలాక్షికో పాత్ర మైతివట, అంతే చాలులే బిత్తళీ !

నవరక్తుల్ చవి చూపగా తను సుగంధస్నేహవేణీరుచుల్,
చిపురుంగుత్తుల బోని పాదముల కుచ్చె ళ్ళాగి త్రుళ్ళాడ, నే
యువతీరత్నము పుణ్యహస్తముల పీయూషంబు వడ్డించెనో
భవదభ్యర్హిత భోగకాలమున, పాపం బెట్లు మార్చెన్ దుదిన్ !

పూగుత్తుల్ విదిరించునట్లు చిరునవ్వుల్ చిందు నెమ్మోమునన్
పూగప్రాయపు మొగ్గచన్నుగవ దోబూచాడ పయ్యంటలో
రేగీ రేగని ముంగురుల్ నొసల నర్తింపంగ నేకొమ్మ బా
హాగంధామల వీచికల్ సుడియ నిన్నందించెనో బిత్తళీ !

శ్రీ రాయప్రోలు సుబ్బారావు.

సాహితీసమితి.

# శివతాండవము

శ్రీరమణీ లలితకటా
క్షారోపణ చంపక ప్రసవమాలాశ్యాం
గారిత వక్షుండు దయా
వీరుఁడు పరదైవమెపుడు వెలిగెడుగాతన్.

కన్నుల కల్వచూపులు వికస్వరము ల్గగనాంచలంబున
న్దన్నగ, ధింధిమిధ్వనులు దట్టములై ప్రతిశబ్దమీన నా
సన్న గుహాంతరాళముల సంధ్యల తాండవమాడు దుఃఖితా
పన్న శరణ్యు డీశ్వరుఁడు భావమున న్జిగిరించుగావుతన్.

౧

తలపైని చదలేటి యలలు తాండవమాడ
అలల త్రోపుడుల – క్రొన్నెలపూవు గదలాడ
మొనసి ఫాలముపైన ముంగురులు చెఱలాడ
కనుబొమ్మలో మధురగమనములు నడయాడ

కనుపాపలో గౌరికసినవ్వు బింబింప
కనుచూపులను తరుణకౌతుకము చుంబింప
కడగి మూడవకంట కటికనిప్పులురాల
కడుబేర్చి పెదవిపై – కటికనవ్వులుప్రేల
ధిమిధిమిధ్వని సరిద్గిరిగర్భములు తూగ
నమితసంరంభ హాహాకారములు రేగ,

ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

# శివతాండవము

౨

కిసలయజటాచ్ఛటలు ముసరుకొని వ్రేలాడ
బుసలుగొని తలచుట్టు భుజగములు పారాడ
మకర కుండల చకాచకలు చెక్కులబూయ
సకలంక కంఠహారాళి నృత్యముసేయ
ముకుజెఱమలను శ్వాసములు దందశింపంగ
ప్రకట భూతిప్రభా వ్రజ మావరింపంగ
నిటల తటమున జెమట నిండి వెల్లువగట్ట
కటియుగమ్ముల నాట్యకలనంబు జూపట్ట
తకఝణుతఝణుత యను తాళమానముతోడ
వికచ నేత్రస్యంది విమలదృష్టులతోడ.

ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

౩

భుగభుగ మటంచు నిప్పులు గ్రుమ్మ నూరుపులు
ధగ ధగిత కాంతితంద్రములుగా కకుభములు
దంత కాంతులు దిశాంతముల బారలు వాఱ
కాంతవాసుకి హస్త కటకంబు దిగజాఱ
భావోన్నతికి నలసి వలమేను వలపూఱ
భావావృతంబు దాపటిమేను గలుపార
గజకృత్తి కడలొత్తి భుజముపై వ్రేలాడ
నజుడు కేల్గవమోడ్చి "హరహరా!" యనివేడ
ఝణుత తద్ధిఝణుత తదిగిణతో యనుమద్దెలల
రణనములు మేఘగర్భములు దూసుకపోవ

ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

## ఆంధ్ర శిల్పి

౪

ఎగు బుజమ్ములు దాచి - నగు మొగమ్మునజూచి
వగలురమ్మున దూచి - భావాభి రతి నేచి
తరళ తంద్రమ్ము మధ్యమ్ము కిటకిట లాడ
వరసాంధ్య కిమ్మీర ప్రభలు దనువునగూడ

కణియు నెడ వలయంపుమణులు చిందఱ లాడ
కిణుకిణు మటంచు పదకింకిణులు బిరుదాడ
శృంఖలాదండములు చెలగి తాండవమాడ
శంఖావదాతలోచనదీప్తి గుమిగూడ
వలగొన్న యెముక పేరులు మర్మరముసేయ
పులకింపగా నొడలు మురజమ్ములును మ్రోయ.

ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

౫

మొలక మీసపుకట్టు ముద్దుచందురుబొట్టు
పులితోలు హొరొంబట్టు - జిలుగువెన్నెలపట్టు
నెన్నడుమునకు చుట్టు క్రొన్నాగు మొలకట్టు
క్రొన్నాగు మొలకట్టు గురియు మంటల రట్టు
సిక పై ననల్ప కల్పక పుష్పజాతి - క
ల్పక పుష్పపంక్తిఁ జెల్లాడు మధువాసనలు
బింబాధరము గదంబించు తాంబూలంబు
తాంబూలవాసనల దగులు భృంగగణంబు
కనుల పండువుసేయ మనసు నిండుగబూయ
ధణధణ ధ్వని దిశాతతి బిచ్చులింపంగ.

ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

# శివ తాండవము

౬

సకల భువనంబు లాంగికముగా శంకరుడు
సకల వాఙ్మయము వాచికముగాగ మృడుండు
సకల నక్షత్రంబులు కలాపములుగాగ
సకలంబు దనయెడంద సాత్త్వికంబునుగాగ

గణన చతుర్విధాభినయాభి రతి దేల్చి
తననాట్య గరిమంబు దనలోనె దానలచి
నృత్తంబు ఝుళిపించి - నృత్యంబు వెలయించి
నృత్త నృత్యములు శబలితముగా జూపించి
లాస్య తాండవభేదరచనాగతులు మీఱ
వశ్యులై సర్వ దిక్పాలకులు దరిజేర
ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

౭

అంగములుగదుర ప్రత్యంగంబులును చెదర
హాంగునకు సరిగా నుపాంగంబులును గుదుర
తతసమత్త్వాదులంతః ప్రాణదశకంబు
లతిశస్తములగు బాహ్య ప్రాణసప్తకము
ఘంటా సదృక్కంఠ కర్పరముగానంబు
కంఠగాన సమానకరయుగాభినయంబు
కరయుగము కనువైన కనులలో భావమ్ము
చరణముల తాళమ్ము - చక్షుస్సదృక్షమ్ము
ఒరవడిగ నిలువంగ నురవడి దలిర్పంగ
పరవశత్వమున శ్రీపతియు జైమర్పంగ
ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుండు!

౮

కరభావములతోనె గనులచూపులు దిరుగ
తిరుగు చూపులతోనె బరుగెత్త హృదయమ్ము
హృదయమ్ము వెనువెంటఁ గదిసికొన భావమ్ము
కుదిసిభావముతోనె గుదురుకోగ రసమ్ము
శిరము గ్రీవమ్ము పేరురము హస్తయుగమ్ము
సరిగాగ మలచి గండరువు నిల్పినయట్లు
తారకలు చలియింప తారకలు నటియింప
కోరకములై గుబురుగొన్న జూటమునందు
సురగాలి నలిరేగి చొక్కి వీచినయట్లు
పరవులై పడ కల్పపాదపంబులపూవు

లాడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

౯

మొగ్గలై, ప్రేమంపుబుగ్గలై, యమృతంపు
నిగ్గులై, తమలోన మొగ్గరంబులుగట్టి—
నునుసిగ్గుతో ముడ్చికొనిపోయెడు విధాన
పెనువెఱపుతో రాలి వణకాడెడు విధాన
వలితంబులై యలసి పొలసి పోవువిధాన
పలపలని వెన్నెలలు చిలికించెడు విధాన
రోసంబు గ్రసియింప రూక్షమైన విధాన
వేసరికతో సరిగ వికసింపని విధాన
అచ్చెరువుతో స్తబ్ధమై నిల్చినవిధాన
కుచ్చులుగతిగ కన్నుకొనలచూపులు పెనఁగ

ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

* * *

శ్రీ పుట్టపర్తి నారాయణచార్యులు

# హృ ద యో ప హా ర ము

నీ కనుసోగవంపుల వినిద్రత గన్న జగద్రహస్య మే
దో! కళుకుందళ త్తళ సముజ్జ్వల మై వెలుగం బ్రసన్న ది
వ్యాకృతి! యర్ధమీలితదృగంతతఁ జొక్కెడు నే ప్రపంచ త
త్త్వాకలనాగ్ని జీవిత మహాహుతి వేల్చెడు వారి నవ్వుదున్!

నీ కవనావగుంఠిత మణిస్ఫురదాకృతి యామె యెవ్వ రో
యీ! కవిమిత్ర! మాకు వచియింపు మొకించుక యన్న నాసుహృ
ల్లోకముతో యథార్థ మొక లోపము లేక వచింపనెంచి, యా
లో కమనీయతావధి! విలోలమనస్కత నూగులాడెదన్ —

కొందరు లోకత త్త్వ మతిగూఢ మనారతముఁ మథించు వా
రందరు సత్యసుందర శివాత్మకమైన మహాత్మశ క్తి యా
నంద మయైకలీల లలనాపురుషాకృతు లంది యంది, నీ
యందతిచారుతాంశ గగనాంచల మంటిన రమ్యపద్ధతిన్

భౌతిక వాదులైన పెరవార లనేక పదార్థత త్త్వ ని
ష్ణాత హృదంతరమ్ము లనిశమ్ము నహంకృతి హుంకరింప, శా
స్త్రేతర మార్గదృశ్యము లవెల్ల మృషాకృతు లే ప్రపంచ భూ
తాతి సమేళనమ్ము భవదాకృతి నందె నటంద్రు సుందరీ!

ఇది యెటు లంద మన్న నటులే స్ఫురియించును; వాఙ్మహేంద్ర జా
లదములు సృష్టిచింతలు! చలల్లలితాలక! వీనికేమిగా
ని, దరచలద్రదచ్ఛదమణిం జిరునవ్వొక యించుకైన న
భ్యుదితమయేని నుత్తర ముహూ ర్తమె నిల్చెద నిర్మనస్కతన్!

శ్రీ పి. గణపతి శాస్త్రి.

# దీపావళి

దీపావళి! దీపావళి! జగమంతా దీపావళి!
మా పేదల కాపురాలవైపు రాని దీపావళి!
నామడిలో - నీ గుడిలో నాటి యుగయుగాలనుండి
వేరుదన్ను చీకటిపై వెలుగలేని దీపావళి!
దారితప్పి తరతరాల దాస్యము మెడగట్టుకొన్న
పతితజాతి గాజుకళ్ళబడ నేరని దీపావళి!
కష్టజీవి నెత్తురుతో కార్తికదీపమ్ము లెత్తి
విశ్వనాథుదయ విలిచే విత్తేశుని వాకిలిలో
దీపావళి! దీపావళి! దీపావళి! దీపావళి!

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి.



# శకటు మాపండి!

కాఱునల్లని కాటకేశ్వర
రణాశంతాంగం కందలివస్తోంది!
కదలివస్తోంది!
ప్రజలగుండెల భయవిహంగం
గిలగిలామని తన్నుకుంటోంది!
తూర్పుద్వారం తెరచుకొన్నది,
గాడ్పుదారులు పరచుకొన్నవి,
కోటిమానవ మనశ్శలభా
లంటుకొన్నాయి!
ఏటికావల యమునిపోతులు
కాటిమేరల పలవరింతలు
ఎదురు తెర తొలగించుచున్నై!
ఎగిరిపడి వినిపించుచున్నై!
గాలిదారకక పక్షి పక్షి
కలవరిస్తోంది!
కడలి కడుపులు తరగిపోయే
కథలు చెపుతోంది!
హుంకరించే అగ్నిపర్వత
శంఖమేదో మ్రోగుతూఉంది!
అబ్ధిఘోషపై శకటఘోటక
కృద్ధరింఖానాదములు క
ర్ణములు తాకినవి—తా
రకలు వ్రేలినవి!
గగనమున రక్తాగ్నికళికలు
పొగలు చిమ్మే కోటి ఉల్కలు
జడలుజడలై కొసరిపడుతున్నై!

గాశి.

# శ క ట  మా ప ం డి

మనిషి మనిషికి మధ్య పడుతున్నై !
మెరపులారిన చూపు లోత్తై
మొరటుబారెను, తారులాడెను !
'ఆకలో !' యను కేక వలయా !
లాకళించాయి !
వికటహాసపు విలయగోళా
లాకృతించాయి !
రథంచుట్టీ పథంపట్టీ
తోకచుక్కల తోరణమ్ములు
మండుతున్నాయి—
రథపతాకల నేత్రములవలె
మండుతున్నాయి !
ప్రజలుకుళ్ళిన రుజల మళ్ళీ
పడక, నడపండి—శకటమాపండి !
శకట మాపండి !

శ్రీ మహంకాళి భీమ శంకరమూర్తి.



# రాకెట్టులో ఆకాశయానం

శ్రీ వసంతరావు వేంకటరావు.

స్వశక్తిని వెచ్చించి కాళ్లతో నడిచి ప్రయాణం చేసేవరకు మానవు డశ్వవృష భాది మృగాల నుపయోగింపనేర్చుకొన్నాడు. తదనంతరం, నిర్జీవయంత్రవాహనాలని సృష్టించాడు. వాటి మూలంగా భూ జల వాయు యాన త్రయం సులభసాధ్య మైంది. స్టీమరులో సముద్రయానం చేయడ మొక విశేష మనుకొన్నరోజులు గతించాయి. వాయుసాగరంలో అనవలంబంగా సాగు విమానయానం అద్భుత మనుకొన్న దినాలు గతిస్తున్నాయి. వాయుపదా న్నధిగమించి, అంతరిక్షాన్ని దాటి గాఢాంధకారాన్విత మైన శూన్యాకాశంలో యాత్ర సాగించి, చంద్రలోకాన్ని శుక్రాది గ్రహాలను చేరుకొనుటకై ఖగోళయానం గావించు శుభ దినాలు రానున్నాయని సంరంభించు సమయ మాసన్న మౌతూంది. భూలోకాన్ని విడిచి పెట్టి, ము న్నెన్నడు కని విని యెరుగని విపరీత వేగాలతో ప్రయాణించడం, భూవాసులకు నిరంతర విముఖమై యున్న చంద్ర గోళార్థంలోని విశేషాలను కన్నులార చూడగలగడం, అనారాధ్యంగా ముంచుకొస్తూన్న సర్వనాశనంనుండి రక్షించుకొను ప్రయత్నంలో మహా మేధావు లైన కుజ గ్రహవాసులు ధ్రువప్రాంత హిమంనుండి లభ్యమగునీటిని జీవోపయోగార్థం ప్రవహింపచేయుటకై త్రవ్విన పెద్దపెద్ద కాలువలుగా భావింపబడుచూన్న ఋజురేఖా సమూహాన్ని పరిశీలించి దాని యథార్థత నిర్ణయించగలగడం, శని నావరించియున్న వలయ ప్రాకార విశేషాన్ని అవగాహన చేసికొనడం, భూలోక యాంత్రిక దృష్టి కభేద్య మైన శుక్ర వాతావరణంలో జొరబడి స్వయంగా శుక్రతలాన్ని పరిశీలించడం, ఇవన్నీ అత్యంత ముదావహ మైన భావ వికాసాలు.

అయితే, ఆకాశయానంలో గల కష్ట సుఖాలను సమగ్రంగా విచారించనిదే దాని కుద్యమించరాదు. ఆలీ బాబా కథలో "ఓపెన్ సెసే" మని, దొంగల గుహలో బంగారానికై దూరి పైకి రాలేక ప్రాణాలు గోల్పోయిన దౌర్భాగ్యుడు కాసీమ్ గతి మనకు పట్టకుండా, ఒకవేళ భూమిని విడిచి పైకి పోయినప్పటికి సురక్షితంగా భూమిని తిరిగి చేరుకొను అవకాశాన్ని స్థిరపరచుకోవాలి. ఏమంటే, మనం ప్రయాణం చేయ నెంచిన యంత్రాన్ని ఒక కృత్రిమ ఉల్క (Meteor)గా భావించవచ్చును. ఆ ఉల్కలో

మనుష్యులుంటారు, అది వారి ఇష్టానుసారంగా నడవాలి. పైగా, వాతావరణం లేని శూన్యాకాశంలో వస్తువులు బరువును పూర్తిగా కోల్పోయిన అంతరాళంలో గల విపరీతపరిస్థితులలో మానవ శరీరం ఏ విధంగా ప్రవర్తిస్తుందో యోచించాలి. ద్రవ్యం ప్రకృతిశక్తులచే ఎట్లు ప్రబోధింపబడుతూందో, జీవంగల ద్రవ్యఖండమైన మానవుడు వాటి దౌష్ట్యాన్ని ఎట్లు ప్రతిహరించగలడో విమర్శించి యాత్రానుకూలమైన సంభారాలను సేకరించాలి. సర్వ సౌకర్యాల కాలవాలమైన కాశీరామేశ్వరాది పట్టణాలలో భూతాదులకు వలయు సామగ్రి యథేచ్ఛగా లభిస్తున్నప్పుడే తీర్థయాత్రలంటే ఎంతో సన్నాహమవసరం గదా! మన వాంఛితార్థాలలో మచ్చునకొక్కటైనా లభించని శూన్యాకాశంలో విశ్వయాత్ర చేయదలచినప్పు డెంత జాగ్రత్తగా యోచించి ఏర్పాట్లు చెయ్యవలసిఉంటుందో చెప్పనక్కర లేదు.

ఇంతకు, మన కతి సమీపంగా నున్న చంద్రలోకానికి పోవుటకైనా అభ్యంతరం కలిగించేది భూమియొక్క గురుత్వాకర్షణ బలము. ప్రతివస్తువుని భూమి తనవైపు లాగుతూంది; ఆ ఆకర్షణాన్ని ప్రతిఘటిస్తేనే కాని భూమిని విడిచి పైకి పోలేము. భౌమాకర్షణం ప్రతివానికి విదితమే. ఒక బంతిని గాని, ఏ వస్తువును గాని పైకి విసిరినప్పుడు కొంతవరకు మీదికి పోయి క్రింద పడుతుంది. అది మీదికి పోతున్నంతసేపు భౌమాకర్షణ బలాన్ని ప్రతిఘటిస్తూంది. దానినే మరికొంత బలంతో విసిరినప్పు డది మరికొంతసేపు మరికొంత మీదికి పోతుంది. వస్తువుని ఎంత బలంతో విసిరితే అంత దూరం పోగలదని పోతుందని స్పష్టమయింది. కాబట్టి, మహాబలవంతమైన యంత్రంతో ఏ వస్తువునైనా ఎంతదూరమైనా పంపగలమని సిద్ధాంతరీత్యా సత్యమే కాగా, భూమిని విడిచి, గురుత్వాకర్షణ బలాన్ని జయించి ఆకాశంలో సూటిగా మీదికి పోవుటకై ఎంత బలంతోను ఎంత వేగంతోను వస్తువును విసరవలసి ఉంటుందో గణించవచ్చును. న్యూటన్ యొక్క గురుత్వాకర్షణ నియమప్రకారంగా గణితంవల్ల తెలిసిన దేమంటే భౌమాకర్షణ బంధనాలనుండి విముక్తమై ఆకాశంలోనికి పలాయనమొనర్చునట్లు చేయడానికి వస్తువుని సెకనుకి 7 మైళ్ల వేగంతో విసరాలి.

సెకనుకి 7 మైళ్ల వేగమంటే సామాన్యమైన వేగం కాదు. వేగతమమైన ఫిరంగి గుండు యొక్క వేగం సెకనుకి 3000 అడుగులు, అంటే సుమారు అరమైలు. తుపాకి మందుతో 7 మైళ్ల వేగం లభ్యం కాదు. అంత వేగాన్ని కలిగించగల శక్తి ఆమందులో లేదు. ఒక పెద్ద షెల్లులో యాత్రికులనుంచి బృహత్తరమైన ఫిరంగితో దానిని

పేల్చడ మొక విధానంగా కొందరు విజ్ఞు లూహించారు. కాని, దానికా ఆంతరంగిక శక్తి లేకపోవుటచేత అది భూమిని విడిచి పోలేదు. విమానాన్ని యాత్రాసాధనంగా ఉపయోగిద్దామా అంటే అంతరాళంలో వాయువు లేదు ; వాయుసాగరంలోనే కాని విమానం పోలేదు. నౌకలకు జలంవలె విమానాలకు వాయు వవసరం. విమానముఖమందున్న ప్రొపెలర్‌తో దారిచేసికొంటూ అది గాలిలో తేలిపోవలసిందే కాని గాలి లేకపోతే అంగుళమైనా ముందుకి పోలేదు. శూన్యాకాశంలో ప్రయాణం చేయగల యంత్రం కావాలి. అట్టి యంత్రం రాకెట్టు. రాకెట్టుకి గాలి నీరు అక్కరలేదు. దాని అధోభాగంనుండి మహా వేగంతో బహిర్గమించు తప్తవాయువుల పీడనానికి కలుగు ప్రతి పీడనం వల్ల అది ముందుకి సాగిపోతుంది. ఆగమనంలో విశేషం లేదు. ప్రతి కర్మకి సమానమును వ్యతిరేకమును నైన ప్రతికర్మ కలుగుతుం దని న్యూటను సిద్ధాంతీకరించాడు. తలుపుని గట్టిగా తట్టుతే చెయ్యి నొస్తుంది. గట్టివస్తువును మన మెంతబలంతో పీడిస్తే అంత బలంతోను మనం పీడింపబడతాము. తుపాకి పేల్చినప్పుడు ముందుకి పోతూన్న గుండుయొక్క ప్రతికర్మగా తుపాకి వెనుకకి నెట్టబడుతుంది. షికారీల కావిషయం అనుభవైకవేద్యమే. తారాజువ్వలో సూక్ష్మరంధ్రంద్వారా వెనుకకు వచ్చు పొగమంటలచేత జువ్వ ముందుకి పోతుంది. ఆ విధంగానే రాకెట్టు గమిస్తుంది. దాని దారిలో ఎట్టి పదార్థ మున్నా లేకపోయినా సరే, పొగలను వెనుకకు తన్నుతూ దారి చేసికొని పోతుంది. సౌరమండలంలో గ్రహాలమధ్యనున్న శూన్యాకాశాన్ని తరించి గ్రహం నుండి గ్రహానికి ప్రయాణం చెయ్యడానికి రాకెట్టుకన్న వేరొక సాధనం లేదు.

నిరాధారమైన ఊహాపథాలలో పోక కేవల వైజ్ఞానిక దృష్టితో విశ్వయాత్రావకాశాలను విమర్శించి తత్సందర్భంలో కొన్ని ప్రయోగాలు చేసిన విజ్ఞాని ఆర్. హెచ్. గొడ్డార్డు. మన కర్మేంద్రియాలకన్న సున్నితమైన యంత్రాలతో వాతావరణమండలిపై పొరలయొక్క తాపక్రమం, (Temperature) వాయువేగం, సూర్యాతపోగ్రత, విద్యుదావేశం (Electric charge) మొదలైన విషయాలను కనుగొందామని అతని ప్రధానోద్దేశం. కొంతద్రవ్యాన్ని చంద్రలోకంలోనికి పంపించగల అవకాశ ముం దని గణితంవల్ల అతను కనుగొన్నాడు. కొంత మెగ్నీషియమునుపంపి, దాని నక్కడకాల్చి ఆ మహోజ్జ్వల కాంతిని దూరదర్శినితో పరీక్షించవచ్చును. రాకెట్టుయొక్క ముఖాన్ని అనుకూలంగా నిర్మించి సెకెనుకి ౧౨౦౦౦ అడుగుల వేగం చేరుకొన్నాడు. రాకెట్టు పోతూన్నప్పుడు వ్యయమైపోయిన పదార్థాలమూలంగా దాని బరువు తగ్గుతుండడంచేత అది ఆవేగింప (Accelerate) బడుతుంది. గొడ్డార్డుయొక్క గణన ప్రకారంగా అరవీశ

మెగ్నీషియమును చంద్రలోకాని కంపడానికి 300 వీశల గమనసామగ్రి కావాలి. రాకెట్టుయొక్క భారాన్ని తగ్గించడానికై భస్మమైన పదార్థాలుగల భాగాలు ఎప్పటికప్పుడు సహజంగా రాలిపోయేటట్టు ఏర్పాటు చేయవచ్చును.

కాని. ౧౨౦౦౦ అడుగుల వేగమైనా ఆకాశయానాని కనువైన వేగం కాదు. కాబట్టి రాకెట్టుయొక్క మోటార్లను అధికతర వేగంతో గమింపజేయు పదార్థాల నుపయోగించాలి. తుపాకి మందు, నూనె, పెట్రోలు మొదలైనవి పనికిరావు. ఉదజని (Hydrogen) ప్రాణవాయువు (Oxygen) ల మిశ్రాన్ని భస్మీకరించడంవల్ల కావలసిన శక్తి లభ్యంకావచ్చునని తెలియవచ్చింది. దానికా వాయువులు ద్రవస్థితిలో నుండాలి. ద్రవస్థితి అంటే అత్యల్ప తాపక్రమ మన్నమాట. నిరుష్ణస్థితికి దగ్గరగా నుండుసట్టి స్వల్ప తాపక్రమంలో పచ్చిమిరపకాయలు కమలాఫలాలు కూడ గట్టిపడి పెళ్లున విరుగుతాయి. కాబట్టి, ద్రవిత వాయువులను భద్రపరచినప్పుడు ఫెళఫెళార్భటులతో ముక్కలుకానటువంటి పదార్థాలతో సీసాలను తయారుచెయ్యాలి. యుక్త పరిమాణాలలో మిశ్రితమైన ఒక మణుగు వాయువులతో అరవీశ పదార్థాన్ని భౌమాకర్షణ క్షేత్రంనుండి పైకి పంపవచ్చునని కొందరి అభిప్రాయం. ఏటామిక్ శక్తి లేక పారమాణుకశక్తిచేతనే గ్రహదర్శనం కాగలదు కాని ఇతర శక్తులవల్ల అది సాధ్యం గాదని కొందరి ఉద్దేశం. పారమాణుకశక్తి సైతం మానవ సామర్థ్యంలోనికి వచ్చింది. ఎటామిక్ బాంబుయొక్క విపరీత శక్తి లోకవిదితమే. గత మహాసంగ్రామంలో జర్మను లుపయోగించిన "వి. ౨" రాకెట్లు పారమాణుకశక్తిచే నడిపింపబడ్డాయా అను సందేహం లేకపోలేదు. కాగా భౌమాకర్షణబలాన్ని ప్రతిఘటించి శూన్యాంతరాళంలోని కెగిరిపోవు సాధనం మానవునికి చిక్కినట్లే భావింపవచ్చును.

అయితే, ఒక్కసారిగా పెద్దరాకెట్టు విమానాన్ని విడిచిపెట్టరు. ముందుగా చిన్న చిన్న రాకెట్లను అంతరిక్షంలోనికి పంపి ఫలితాలను పరిశీలిస్తారు. తరువాత కొంత మెగ్నీషియమును చంద్రలోకానికి పంపి దానిమంటలో చంద్రతలాన్ని పరిశీలిస్తారు. తదనంతరం రాకెట్టువలె నున్న విమానాన్ని నిర్మించి మన వాతావరణంలో దాని నెగురవేస్తారు. అట్టి విమానంలో ఢిల్లీనుండి లండనుకు ఒక పూట ప్రయాణం. తదుపరి సుమారు 400 మైళ్ళ ఎత్తుకి పోగల రాకెట్టుని విడిచిపెట్టుతారు. దానితో భూమిని చుట్టి రావడానికి ఒక్కపూట చాలును.

రాకెట్ల విషయమై ఎక్కువగా కృషి చేసిన విజ్ఞాని ఓబెర్తు. కుజ శుక్ర గ్రహాలకు పయనమవారు మొదట చంద్రలోకంలో దిగి, వలసినంత గమన సామగ్రి నెక్కించుకొని బయలుదేరవచ్చును. చంద్రునియొక్క

గురుత్వాకర్షణబలం భూ బలం కన్న తక్కువ కాబట్టి సెకెనుకి 2 మైళ్ళ వేగంతోనే చంద్రుని విడిచి అంతరాళంలో ప్రవేశించవచ్చును. కాని, చంద్రలోకా వాసం సుఖప్రదం గాదు. చంద్రునిలో గాలి లేదు, సూర్యరశ్మి పడిన అర్ధ భాగం ఉడికిపోతూండగా చీకట్లలముకొన్న అర్ధభాగం ఉష్ణరహితంగా కొఱుకువార చేయునంత శీతలంగలదై యుంటుంది. ఆ పరిసరాల కనువగు దుస్తులు తయారు చెయ్యాలి. రెండు పొరలుగల గలీబులవంటి సూట్లు ధరించి మధ్యభాగాన్ని దూదితో గాక, ద్రవితవాయువుతో నింపాలి. చంద్రలోకం మజలీగా ఉపయోగించుకొనడానికి కారణ మేమంటే అచ్చటి స్వల్ప గురుత్వాకర్షణంచేత మణుగులకొద్దీ బరువులను సులభంగా ఎత్తి దించవచ్చును. కాబట్టి చంద్రలోకంలో సాధనసామగ్రిని తినుబండారాలను నిలువచేయు పెద్దపెద్ద కొట్లను సులభంగా నిర్మించుకొనవచ్చును.

సెకనుకి 7 మైళ్ళ వేగంతో బయలుదేరినప్పుడు ఎప్పుడెప్పుడు భూగోళం ఎంతెంతగా కనిపిస్తుందో గణించిన పట్టి ఉంటుంది. రాకెట్టు విమానాన్ని నడుపు వైమానికుడు శూన్యాకాశంలో తన దారిని గుర్తించడానికి భూమియొక్క దృశ్య పరిమాణాన్ని స్థానాన్ని తెలిసికొంటే చాలును. భూగోళంయొక్క వ్యాసాన్ని సత్యంగా కొలుచు సాధనంతో వానిమార్గాన్ని నిర్ణయించుకొనగలడు. బయలుదేరిన కొంతకాలానికి పట్టీలో సూచింపబడిన కన్న భూబింబం పెద్దదిగానో చిన్నదిగానో కనిపిస్తే నియమిత వేగంకన్న బయలుదేరిన వేగం తక్కువో ఎక్కువో అని తెలిసికొంటాడు. నక్షత్రాలకు సాపేక్షంగా నున్న భూమియొక్క స్థానాన్ని బట్టి వైమానికుడే దిక్కున పోతున్నాడో తెలిసికొంటాడు.

రాకెట్ల రాకపోకల వేళలను సూచించు పట్టీలను ఖగోళజ్ఞులు తయారు చేస్తారు. గ్రహచలనాలను బట్టి అనుకూల ముహూర్తాన్ని నిర్ణయించాలి కాని, మన ఇష్టానుసారంగా ప్రయాణం చెయ్యడానికి, వీలు లేదు. ఏమంటే, కుజుడు భూమి కతిసమీపంగా నున్నప్పుడు బయలుదేరకపోతే ప్రయాణకాలం కొన్ని సంవత్సరాలు పట్టవచ్చును; ప్రయాణాని కమిత వ్యయం కావచ్చును. మన కతి సమీపంగా నున్నప్పుడు సుమారు 360 లక్షల మైళ్ళదూరంలో నున్న కుజుని చేరుకోడానికి 7 మైళ్ళ వేగంతో బయలుదేరినప్పుడు సుమారు 2 నెలలలో చేరుకొనవచ్చు ననిపిస్తుంది. సూటిగా పోగలిగితే అది నిజమే. కాని, సూటిగా పోయినప్పటికి శూన్యాకాశంలో గ్రహాలవలె వక్రమార్గాన్నే అనుగమించవలసి వస్తుంది. అందుచేత భూలోక విమాన యానంవలె కాక ఆకాశయానాకి సమగ్రమైన గణితజ్ఞుడు ముహూర్తం పెట్టాలి. తన లెక్కలలో భూమియొక్క అంతర్భ్రమణాన్ని సూర్యుని చుట్టుచేయు ప్రదక్షిణాన్ని, గమ్యస్థానమైన

కుజునియొక్క స్థానాన్ని గుర్తించుకొని గణించాలి. నిర్ణీతసమయాన్ని ఆకాశరంగంలో ఒక నియమిత స్థానాన్నిగల కుజునిలో ప్రవేశించాలి.

ఆకాశంలో సూటియైన మార్గం లేదని గమనించాము. సూటిగా బయలుదేరినప్పటికి రాకెట్టు వక్రమార్గాన్నే పోతుంది. కొంత దూరం పోయినపిదప అంతరాళంలో రాకెట్టు యొక్క మోటార్లను ఆపివేస్తే అదొక కృత్రిమ గ్రహంవలె నియత వేగంతో సూర్యునికి ప్రదక్షిణాలు చేస్తూంటుంది. కక్షలో తిరుగుచున్న కుజలోకసమీపానికి వచ్చేసరికి మోటార్లను పనిచేయిస్తే రాకెట్టు గమ్యస్థానాన్ని చేరుకోగలదు. బాగానే ఉంది. కాని, ఎట్టిదీర్ఘతర వృత్తమార్గాన్ని భ్రమిస్తూంటే కుజుని కతి సమీపంగానుండి స్వల్పతమకాలంలో కుజుని చేరుకోగలమో నిర్ణయించడం సులభంగాదు. అనేక దీర్ఘ వృత్తకక్ష్యల ప్రదక్షిణ కాలాలను గణించారు. కుజుని స్వల్ప కాలంలో స్వల్ప వ్యయంతో చేరుకోవాలంటే రాకెట్టు సుమారు రెండు సంవత్సరాలు ప్రదక్షిణ కాలంగా గల దీర్ఘవృత్త మార్గాన్ని ఆశ్రయించాలి. ఆ మార్గంయొక్క కక్ష్య భూకుజకక్ష్యలను సకాలంలో కలిసిన పక్షమందు కుజుని 267 రోజులలో రాకెట్టు చేరగలదు.

ఇంతవరకు ప్రయాణ సౌకర్యాలు బాగున్నాయి. కాని, తన శీతోష్ణస్థితికి తన పరిసరాలకు అలవాటుపడిన జీవి మానవుడు. అట్టి మానవుడు అంతరాళంలోను సముద్రగర్భంలోను సజీవుడై యుండాలంటే తనతోపాటు తన కనుకూలమైన వాతావరణాన్ని కూడ తీసికొనిపోవాలి. గాలి ఒక్కటే చాలదు. రాకెట్టులో కొన్ని గదులను వేడి చెయ్యాలి. కొన్నిటిని చల్లార్చాలి. ఏమంటే కుజముఖంగా పోతూన్న రాకెట్టులో సూర్యరశ్మికి గురియైన భాగం తప్తమైపోతుండగా మిగిలిన భాగం జీవం మనలేనంత చల్లగానుంటుంది. కాబట్టి ఉష్ణాధిక భాగంలోని వేడిమిని నల్లపదార్థాలచే గ్రహింపచేసి దానినే రెండవభాగంలో ప్రసరింపచేయు ఏర్పాట్లు చెయ్యాలి. లేక, కాఫీఫ్లాస్కులోని వేడిమి పైకిపోకుండా పై వేడిమి లోనికి రాకుండా రెండుపాత్రలమధ్య శూన్యాకాశాన్ని కలిగించినట్లు రాకెట్టు నంతటిని శూన్యాకాశంలో నిమిడ్చి సూర్యరశ్మి కది వేడెక్కకుండునట్లును, కొలదిపాటి వేడితో లోపల అనుకూల పరిస్థితు లేర్పడునట్లును చెయ్యవచ్చును. ఇట్లు బాహ్యశక్తులు ప్రయాణాని కంతరాయం కలిగించనట్లు కట్టుదిట్టం చేయుట కష్టంగాదు.

కాని, అధికవేగంతో బయలుదేరునప్పుడు కలుగు ఒత్తిడినుండి కాపాడుకొనుట మాత్రం కష్టం. బండీ ముందుకి కదిలినప్పుడు బండిలో నున్న వారొక్కసారి వెనుకకు నెట్టబడతారు. బండి సాఫుగా సాగిపోతూన్నప్పు డెట్టి అలజడి ఉండదు. కాని ఆవేగం

(Acceleration) తో అంటే క్షణక్షణానికి అధికమౌతూన్న వేగంతో పోతూన్న రాకెట్టులో వెనుకకు త్రోయ్యబడడం కూడా ఎక్కువౌతూనే ఉంటుంది. ఎంత వేగమైనా ఇబ్బంది లేదు. కాని, అధికమౌతున్న, వేగమైన ఆ వేగం ప్రమాదకరమే. ఆ వేగంవల్ల ఒత్తిడి కలుగుతుంది; ఒత్తిడితోపాటు బరువెక్కువౌతుంది. ఆ ఆవేగానికి ప్రయాణికుల గుండెలమీద ప్రతి చదరపుటంగుళాన్ని సుమారు ౫౦ మణుగుల బరువుతో నొక్కుచున్నట్లనిపిస్తుంది. వారి జేబులలో నున్న రూపాయీలు గుండెల్లోనికి చొచ్చుకొనిపోతాయి. శ్వాసోచ్ఛ్వాసాల కతికష్టంతో గుండె ఉబుకుతుంది. చెయ్యెత్తడానికి ప్రయత్నించిన వారతికష్టంమీద ఎంతో ప్రయాసంతో సాధించగలుగుతారు.

ఆకాశనౌక పోయిపోయి భూమియొక్క గురుత్వాకర్షణ క్షేత్రాన్ని దాటిపోతుంది; అంటే, దాని మోటార్లు నాపివేసినప్పటికి భూముఖంగా పడదు. అప్పటినుండి భౌతికావస్థలు మారిపోతాయి. భౌమ్యాకర్షణ క్షేత్రంలో ఆవేగంతో రాకెట్టు పోతూన్నప్పుడు ఒత్తిడిచే పీడింపబడ్డ ప్రయాణికులు ఆ క్షేత్రాన్ని దాటగానే పీడన మేమాత్రము లేక తల్లడిల్లుతారు. ఒక్కసారి వారు అతి చులకనైపోతారు; కూర్చున్న కుర్చీని భీతావహంతో పట్టుకొంటారు. రాకెట్టు పడిపోతూన్నట్లనిపిస్తుంది. యథార్థంగా పడుతుంది; కాని సూటిగా మాత్రం గాదు. భూమిపై పడనున్న చంద్రుడు వక్రమార్గాన్ని భూమిచుట్టు తిరుగుచున్నట్లు, రాకెట్టుకూడ వక్రమార్గాన్ని అనుగమిస్తుంది. అప్పటికది సౌరకుటుంబంలో ఒక గ్రహమై సూర్యునికి ప్రదక్షిణం చేయ మొదలిడుతుంది. చేతనున్న కలాన్ని విడిచిపెట్టినప్పుడది క్రింద పడదు. భూమిలో అనవలంబనవస్తువు క్రింద పడినట్లు రాకెట్టులో ఏవస్తువు క్రింద పడదు. ఏమంటే, గ్రహాలవలె రాకెట్టు బరువైనది కాదు. కాబట్టి దానిలో గురుత్వాకర్షణమంతగా లేదు. ఆ కారణంచేతనే రాకెట్టుయొక్క భ్రమణ వేగంచే పైకెగిరి పోకుండా కుర్చీలను బల్లలను మంచాలను మేకు బందీచేసి భద్రపరచాలి. భూలోకవాసులవలె రాకెట్టువాసులు నడవడానికి వీలులేదు. అడుగువేసి నడిచినవారు ఆగలేరు. అందుచేత రాకెట్టుయొక్క నేలను అయస్కాంతీకరించి ప్రయాణికులకు ఇనుపజోళ్లనిస్తే గురుత్వాకర్షణానికి అయస్కాంతత్వాకర్షణం ప్రబలడంచేత ప్రయాణికులు మనవలె కొంతవరకు నడవడానికవకాశం కలుగుతుంది. రాకెట్టువాసులు వారిశరీరాల బరువునే ఎరుగరు కాబట్టి రాకెట్టులో నిద్రించడానినికి పరుపులు తలక్రిందికి దిండులు అక్కరలేదు.

రాకెట్టులో ఆహారవిషయం. రాకెట్టువాసులు నిత్యోపవాసులై యుండవలసిందేమో! వాయుభక్షణకు వాయువైనా లేదు. ప్రాణాన్ని నిలబెట్టు అన్నపానాదులు ప్రాణాంతకము లౌతాయి. త్రాగడానికై బుడ్డీలో

నీరు గలాసులో పోయబోతే నీ రొలుకదు; ఎంత ఒంపినా లాభంలేదు. నీటికి బరువు లేకపోవడంచేతను, మంచుకన్న గడ్డవారి ఘనీభవించుటచేతను, పాత్రను ముక్కలు చేసి నీటిని పై కూడతీయవలసిందే. పులుసు చారు, మజ్జిగ మొదలైన వేవీ ద్రవస్థితిలో నుండవు. ఇంతకు, రుచ్యము లైన పదార్థాల నాతురతతో చూస్తూ యాత్రికులు తృప్తి పడవలసింది. తను ముట్టుకొన్నవన్నీ బంగారు కాగోరిన మైడాసురాజువారి మనోవీథిలో తాండవిస్తాడు. దేనిని కబళించినప్పటికి చేజేతుల ఆత్మహత్య గావించుకొనడమే! మన భోజనపదార్థాల బరువుచేత గొంతులోనుండి జీర్ణకోశంలోనికి దిగుతాయి. క్రిమిచలన క్రియ (Peristaltic Action) వాటికి సహాయమౌతుంది. కాగా, మనం పడుకొని భుజించినప్పటికి ప్రమాదం లేదు. కాని, రాకెట్టులో పదార్థాలకి బరువు లేదు. అందుచేత వాటిని మింగినప్పుడు కడుపులోనికి కాక వాయునాళంలోనికి పోవడాని కవకాశ మెక్కువ వుంది. పురిపెడు నీళ్లతోనో, అరకప్పు కాఫీతోనో—అవి ఘనస్థితిలో నున్నప్పటికి—రాకెట్టువాసు లాత్మహత్య చేసికొనుట అసంభవం గాదు.

గాలితో దట్టింపబడిన సూటు వేసికొని, ఇనుపజోళ్లు ధరించి, రాకెట్టుపైకి వచ్చి పరిసరాలను పరిశీలించిన ప్రయాణికునికి పాదలేపనం కరగిపోయిన ప్రవరాఖ్యుని స్థితి జ్ఞాపకంరాగా "బుద్ధిజాడ్యజనితోన్మాదమల్గదా" యాత్రికుల్ అని వాని అంతరాత్మ ఘోషిస్తుంది. అనంతాకాశంలో ఏకాకిత్వభావం హృదయాన్ని క్రుంగతీస్తుంది. ఎటుచూచినప్పటికి చూపుకి ఆనిక దొరకదు. వారి కహోరాత్రాలు లేవు. భూవాసులకు జీవరక్షకు డైన సూర్యుడు రాకెట్టువాసులకు ప్రచండభాను డై తీక్ష్ణ కరాలతో భస్మాసుర సన్నిభు డౌతాడు. నిశ్చలంగా, నిద్రాక్షీణ్యంగా, భయానకంగా నున్న సూర్యబింబం కాలాకాశంలో తప్తమానలోహగోళంవలె వారికి గోచరిస్తుంది. ఆ బింబానికి చేతి నడ్డుపెట్టితే సూర్యు నావరించియున్న మంటలు, కొరోనా (Corona) కనిపిస్తాయి. అట్టి దృశ్యం భూవాసులకు సంపూర్ణ సూర్యగ్రహణ సమయంలోనేగాని గోచరించదు. కాని, అనుక్షణం సూర్యవాతావరణంలో లక్షలకొలది మైళ్లు పైకెగయు మంటలను వారు చూడగలరు. సూర్యాతపోగ్రతలో నక్షత్రకాంతి మునిగిపోదు. ఆకాశంలో ఏవంకచూచినా ఖాళీగా విద్యుద్దీపాలవలె వెలుగొందుచు, బాధకరమైన తేజఃకిరణాలను ప్రసరించు నక్షత్రాలు కనిపిస్తాయి. వారి కప్పుడు భూవాతావరణంలోని రమ్యతరదృశ్యాలు జ్ఞప్తికి వస్తాయి. దూళి ధూసరిత మైసూక్ష్మజలబిందు పూరితమైన భూలోకవాతావరణం సూర్యకాంతిని విక్షేపింపబట్టికదా ఆకాశం నీలవర్ణాపాదితమైన దని, సంధ్యాకాంత బహువర్ణ శోభితమైన దని వారు గుర్తిస్తారు! భూచంద్ర

సమ్మేళన మొక ద్వంద్వగ్రహంవలె కనిపిస్తుంది. భూవాతావరణంలో జొరబడి భూమిచే పరావర్తింపబడిన సూర్యరశ్మిచే భూగోళంచుట్టు రక్తవర్ణవలయ మొకటి, దాని నావరించిన నీలవలయ మొక్కటి చక్కగా దృశ్యమౌతాయి. ధ్రువాలదగ్గర అనేక వర్ణజ్వాలామాలికలైన ధ్రువకాంతులు అరోరాలు దీపిస్తాయి. మేఘమండలావృతమైన పచ్చని కాంతారాలు, రంగురంగుల ఎడారులు, ఛాయామాత్రంగా అప్పుడప్పుడు కనిపిస్తాయి.

హృదయంగమమైన ఆ దృశ్యాలను ఆలోచిస్తూ ప్రయాణికులు కూర్చుంటే నిరంతరం ఆ రాకెట్టు ఒకగ్రహంవలె సూర్యప్రదక్షిణం చేస్తూఉంటుంది. ఇతర గ్రహాలవలె దానినికూడ గురుత్వాకర్షణ బలాలు నిజమార్గంలో నుంచుతాయి. కాని, వైమానికుడు పుణ్యకాలానికై వేచియుండి కుజగ్రహం అనుకూలస్థలంలో నున్నప్పుడు మోటార్లను పనిచేయిస్తాడు. కుజసమీపానికి పోవుసరికి అదొక ఉపగ్రహంవలె కుజుని చుట్టు భ్రమణ మారంభిస్తుంది. అట్టిస్థితిలో కుజుని విశేషంగా పరిశీలించి, సాధ్యమైనంత జ్ఞానం సంపాదిస్తాడు. కాని కుజునిలో ప్రవేశించడు. ఏమంటే కుజప్రవేశం ప్రాణాపాయకరమైనది. పరిశీలనానంతరం, భూమి అనుకూల స్థలంలో నున్న సమయమందు కుజాకర్షణాన్ని విడిచి రాకెట్టును భూముఖంగా పోనిస్తాడు.

ఎంత నిరుపద్రవంగా కుజసమీపానికి పోయినప్పటికి గృహోన్ముఖులైన రాకెట్టువాసులు సురక్షితంగా భూమిని చేరుకోగలరా ? అని ప్రశ్న. భూ గురుత్వాకర్షణక్షేత్రంలో ప్రవేశించినంతనే రాకెట్టు భూముఖంగా ఆవేగింపబడుతుంది. మోటారులన్నీ ఆపివేసినప్పటికి రెక్క లూడిన పక్షివలె క్రిందపడక తప్పదు. అందుకని రాకెట్టును తిరోగమింపచేయు మోటార్లను పనిచేయిస్తారు. అయినప్పటికి అదొక ఉల్కవలె ఆవేగ మొందుతుంది. ఉల్కలు దృషలోహాన్వితమైన ద్రవ్యఖండాలు. అవి భూముఖంగా ఆకర్షింపబడి వాతావరణంలో ప్రవేశించినప్పుడు వాయువులతో కలుగు రాపిడికి జనించిన వేడిమిచే కరిగి మరిగి భస్మమైపోతాయి. మనం చూస్తూన్న ఉల్కలు సామాన్యంగా 50, 60 మైళ్ళ ఎత్తునే మండిపోతున్నాయి కాబట్టి భూమాకర్షణాన్ని ప్రతిఘటించడానికిన్ని మోటార్లచే రాకెట్టును వెనకంజలు వేయించినప్పటికి దాని ఆవేగానికి కది భస్మమౌతుంది. ప్రతిదినం లక్షలకొలది ఉల్కలు, ఉద్భ్రాంతారలు (Shooting stars) భూవాతావరణాన్ని ఢీకొంటాయి. పరిమాణంలో అవెంత చిన్నవైనప్పటికి ఒక్కొక్కటి భస్మమైనక్షణంలో వేలకొలది దీపాలకు సమానమైన శక్తినిస్తుంది. కొన్ని ఉల్కలు సుమారు 60 మైళ్ళ వేగంతో క్రింద పడతాయి. ఆ విపరీత వేగంగల ఇసుకరేణు వొక్కటి మానవుని

చంపగలదు. మన అదృష్టవశాత్తు వాతావరణ వాయువులు భూమి నావరించి యున్నాయి కనుక ఉల్కాల నవి ఎదుర్కొని రాసి రంపాన్నపెట్టి భూసమీపానికి రాక పూర్వమే వాటిని భస్మం చేస్తున్నాయి. లేనియెడల, మున్నెన్నడో మనభూమి మరుభూమియై యుండేది. అందుచేత గృహోన్ముఖమైన రాకెట్లులో కూర్చుని సహేంద్ర తక్షకాయస్వాహా! అని దానితోపాటు భస్మం కాకుండా అంతరిక్షంలోనే దానిని విడిచిపెట్టి, ప్రత్యేక గాలిగుమ్మటాలలో సర్పిలమార్గాన్న యాత్రికులు సురక్షితంగా భూమిని చేరుకొంటారు; రాకెట్టుమాత్రం సామగ్రి యావత్తుతోను మండి బూడిదై వాతావరణంలో లీనమైపోతుంది.

ఇట్టి ఆకాశయానం కేవల భావవిలాసం గాదు. మునుముందు సూర్యుడు క్షీణించినప్పుడు మనవాతావరణం హరించిపోతుంది. నదీనద సముద్రాదు లెండిపోతాయి; నిరాఘాటంగా శతసహస్రాధికంగా ఉల్కాలు భూతలాన్ని మర్దిస్తాయి; శీతలాధికంతో కొఅడువారిన భూగోళం మృతగ్రహమై జీర్ణిస్తుంది. అట్టి దురవస్థలో అంత్యమానవులగతి యేమి? అన్నపానాదులకు నోచుకోజాలక ఆకలిబాధచే అలమటిస్తూ కృశించి భౌతికశక్తులచే పీడింపబడి మరణించవలసినదేనా? అంటే భూమినుండి వేరొకలోకానికి వలస పోకపోతే ఆదుర్గతినుండి రక్షించుకోలేరని చెప్పవచ్చును. భూమి జీవానుకూల్యాన్ని కోల్పోవుసరికి శుక్రగ్రహంలో జీవానుకూలపరిస్థితు లేర్పడతాయి. అప్పుడు మేధావులైన మానవులు నిరుపయోగ భూలోకాన్ని విడిచి కాందిశీకులవలె రాకెట్లలో శుక్రలోకానికి పోతారు. వారికి తిరిగి రావాలన్న ఆశ లేదు. పోయి, శుక్రలోకంలో మానవరాజ్యం స్థాపిస్తారు. సంకుల జీవంతో, అత్యుత్తమ విజ్ఞాన ప్రౌఢిమతో, విశిష్ట కళాసంపదతో కొంతకాలం మురిసిపోయిన భూలోకం యావజ్జీవరాశిని కోల్పోయి, కళావైదగ్ధ్యాన్ని విజ్ఞాన వికాసాన్ని నష్టపోయి, నిర్జీవ మృతగ్రహంగా ఆకాశయానం చేస్తూంటే శుక్రలోకానికి వలసపోయిన మానవధీరులు విచారగ్రస్తులై నిర్విణ్ణులై విలోకిస్తూంటారు. యావజ్జీవం నశించినప్పటికి మానవజాతి నశించకూడదు. బృహత్తమ శరీరాలు గల డైనసారులవలె భౌతిక శక్తులవశమై లయమొందక మన జాతికి ప్రత్యేకమైన బుద్ధికౌశల్యంతో భావనాశక్తితో పరిశోధనా సామర్థ్యంతో, నిర్మాణ చాతుర్యంతో, ధైర్యసాహసాలతో యుక్తమగు ప్రయాణ సాధనాలు నిర్మించుకొని సమయానుకూలంగా మానవుడన్యలోకాలకు ప్రయాణించి మానవ విశిష్టతను కాపాడగలడు; పరలోకాలలో క్రమేణ ప్రతిష్ఠించగలడు. 1

1 క్లైంప్‌ఫర్టు ననుసరిం

# కాగితం కత్తిరింపులు



సువర్ణహరిణ సంహారము

—శ్రీ టి. యస్. దండపాణి



నర్తకులు

—శ్రీ టి. యస్. దండపాణి



వృద్ధ శీర్షము

—శ్రీ కుప్పురావు



వర్షా దివసము

—శ్రీ కె. తణికాచలం

# రవీంద్రస్మృతి

## శ్రీకృష్ణశాస్త్రి

ఎన్నోస్మృతులు ఇట్టే మాసిపోతాయి. ఒక్కొక్కస్మృతి మంచి అత్తరువాసనలాగ మనస్సుని పట్టుకుని ఒక పట్టాని వదలదు. కొన్ని స్మృతులు, మరీ గొప్పవి మనస్సులో మూలమూలల చీకట్లను తరిమి పున్నమి వెన్నెల లాగ లోపలఅంతా నిండిపోతూనేఉంటాయి. రవీంద్రునిస్మృతి అలాంటిది.

రవీంద్రునికి కాళిదాసుస్మృతి అలాంటిది. రవీంద్రుడు ఇలాగ అంటాడు. "యావన పట్టాభిషేకోత్సవంలో, కాళిదాసూ! నీవు ఆసీనుడవయ్యావు. సింహపీఠంమీద్ధ నీ ప్రక్కన నీదేవి కూర్చున్నది. భూమి నీ కాలికింద పచ్చని తివాసీ పరిచింది. రత్నాలతోనూ, బంగారవు పూవులతోనూ పొదిగిన చాందినీ ఆకాశం నీ మీద పట్టింది. మధుపాత్రలు చేతుల్లో పట్టుకుని ఋతువులన్నీ నీ చుట్టూ నృత్యం చేస్తున్నాయి. నీ స్వర్ణయుగంలో పుట్టాలని నాకెంతో ఉండి, నిట్టూరుస్తుంటాను. నేను కొన్నియుగాలు ఆలస్యంగా పుట్టినకాళిదాసుని." వేలేండ్లనించివచ్చిన కవి కులగురువు స్మృతిలాగే ఈ కవిదేవుని స్మృతిన్నీ మనకెప్పుడూ పచ్చ పచ్చగా పరిమళభరంగా ఉండిలీరుతుంది.

కాని ఆయన కనబడకుండా శూన్యమై పోయిన ఈ బాహ్యలోకాన్ని యిప్పుడు చూసేటప్పటికి ఒక్కొక్కప్పుడు అల్ప విశ్వాసులకి ఒక పెద్ద దిగులు పట్టుకుంటుంది. కారణం ఇది. ఆయనమూర్తీ, ఆయనవాక్కులూ, ఆయనచేతలూ మనస్సులో నిండినిండి, జీవితంలో ఇంకి ఇంకి, అన్నింటికీ అవే అయిపోతే, ఒక్కొక్కసారి సామాన్యసమయాల్లో అవి కనపడక వినపడకపోతే ఈగుండె కుంగిపోక ఏమౌతుంది?

రవీంద్రుని తుదిగీతాల్లో ఒకటి ఉంది అది చదివితే నాకు దుఃఖం వస్తుంది.

"ఈ ఏకాకిమధ్యాహ్నంలో ఎండ మండిపోతూంది. ఆ ఖాళీగాఉన్న ఆ కుర్చీ కేసి నేను చూస్తున్నాను. ఊరడించేది ఏదీ అక్కడ కనబడదు. నిస్పృహవాక్కులు ఏవో ఆ కుర్చీలోపల అంతా నిండి రోదనంలాగ పైకి లేస్తున్నట్లున్నాయి. పోగొట్టుకొన్న యజమాని కోసం జాలిగా చూస్తూ ఒక కుక్క దుఃఖంవల్ల తనగుండె ఏడుస్తూ ఉంటే ఏమి జరిగిందో ఎందుకు జరిగిందో తెలియకుండా చలించిపోయే ఒక కుక్కబాధకంటె ఎక్కువ పదునైనదీ మృదువైనదీ బాధ ఆ కుర్చీ కంఠస్వరంలో ఉన్నట్లుంది."

ఆ కుర్చీకి ఉన్నంత బాధ గురుదేవుని ఏక లవ్యుల హృదయాలకి అప్పుడప్పుడు కలుగుతుంటుంది.

రవీంద్రుని వ్యక్తిత్వం చాలా అపూర్వమైనది. ఎంతో ఉదాత్తమైనది. అంతవిశాలమైనదీ అంత సుందరమైనదీకూడా. చిత్రం, బాహ్యమూర్తికీ ఆంతరప్రకృతికీ అంత సామరస్యం ఇంకెవరిలోనూ కనపడదు. కాళిదాసులో ఉండేదేమో! ఉన్నట్టనిపిస్తుంది. ఎన్నియుగాల వాసనలో రవీంద్రుని వ్యక్తిత్వంలో పరిమళిస్తాయి. ఎన్ని దేశాల సంస్కృతులో దానిలో వెలుగుతుంటాయి. ఆ వ్యక్తిత్వానికి జాతిలేదు, మతంలేదు, వయస్సు లేదు. అలాగ అని అది పాతబడ్డదీ కాదు, పరాయిదీ కాదు. అసలాయన చిరయాత్రికుడు. పథిక చక్రవర్తి.

ఒక్కొక్క గొప్పవాడు కేవలం పురాణం సంస్కృతికేసే చూస్తూ 'అదే గొప్పది. అంతకంటె మరేదీ లేదు' అంటాడు. మరొక్కడు తన దేశానిదో జాతిదో అయిన సంస్కారావరణలోనికే చూస్తూ ఆ గోడ అవతల దాన్ని దేన్నీ రానివ్వద్దంటాడు. వీరికి చారిత్రికదృష్టి లేదన్నమాట. వైజ్ఞానికదృష్టీ లేదు. వీరు ప్రయాణమేమానుకున్నారు. రవీంద్రుని కావ్యాలూ సందేశాలూ చదివితే వాల్మీకి నుంచి కాళిదాసుదాకా, కాళిదాసు నుంచి కబీరుదాకా, కబీరునుంచి ఈ రోజు దాకా ఒక్కొక్కరితోనే చెయ్యీ చెయ్యీ కలిపి పలకరిస్తూ పాడుతూ ఆయన అలాగే వస్తూ ఉన్నట్టుంటుంది. అలాగే ఈ దేశంనుంచి ఆ దేశానికీ, ఆ ఖండంనుంచి ఈ ఖండానికీ తన మనస్సులోని అఖండదీపికలో విజ్ఞాన స్నేహాలు పోస్తూ, పలకరిస్తూ, పాడుతూ ఆయన తిరుగుతూ ఉన్నట్టుంటుంది. అలాగ వస్తూ ఉన్నవాడు అలాగే ముందు ముందుకీ కూడా కాలాంతందాకా పలకరిస్తూ, పాడుతూ, పయనిస్తూ ఉంటున్నట్టనిపించదూ! అందుకే రవీంద్రునిలో 'వయస్సులేనితనం' ఉన్నట్టు ఒక్కొక్కప్పుడు అనిపిస్తుంది. 'నాతో ముసలివాడవు. అన్నిటికంటె మంచిది యింకా ముందుంది' అనే ఆంగ్లకవితో ఆయన తన ప్రస్థానం సాగిస్తూ ఉంటాడు.

అందుకనే ప్రస్తుతయుగప్రభావాలు ఆయన బాగా గ్రహించాడు, ముందువచ్చే స్థితిగతులూ గ్రహించాడు. అందుకనే కూడా ఆయన వ్యక్తిత్వానికీ జాతీయతకీ విరోధం లేదు; ఆయన జాతీయతకీ మానవసభ్యతకీ విరోధం లేదు. ఆయన ప్రత్యేకవ్యక్తికి ప్రాధాన్యం ఇస్తాడు. కానిఒకలాగే ఇస్తాడు. ప్రత్యేక వ్యక్తి శరీరంలో ఒక అణువు(cell) వంటివాడు. దానికి ప్రత్యేకం జీవం ఉంది. అది ప్రత్యేకంగానూ పెరుగుతుంది. శరీరాన్ని సమగ్ర సుందరంగా ఉంచడానికీ పెరుగుతుంది. అలాగే ప్రతివ్యక్తికిన్నీ అఖిలమానవకోటి అనే దేహంలో. అలాగే జాతిన్నీ పెరగాలి; తాను ప్రత్యేకంగానూ పెరగాలి; మానవాభ్యుదయానికీ ప్రస్తుత ప్రపంచసభ్యతకీ అనుకూలంగానూ పెరగాలి.

అందుచేతనే రవీంద్రునిజాతీయత కుంటిదీ గుడ్డిదీకాదు. ఒకొక్కప్పుడు ఆయన వాణి తన భారతీయుల్ని ఎంత తీవ్రంగా ప్రబోధించేది! ఆయనకి ఏ వ్యక్తీ లోపం లేనిది కాదు. ఏ గ్రంథమూ లోపంలేనిది కాదు. ఏ జాతీ లోపంలేనిది కాదు. కనకనే ప్రతి వ్యక్తిపై, ప్రతిగ్రంథంపై, ప్రతిజాతిపై ఆయనకి గౌరవానురాగాలే. భయం, బానిసతనం, అజ్ఞానం, అవిశ్వాసం, అంధాచారం, అలసత ఇవన్నీ ఇటు తనజాతిలో భయంకర లోపాలనడానికి ఆయనకి భయంలేదు. అటు ఆ జాతుల్లో రేగిపోయే అధికారార్థ మత్తతల మీాదా, దురాశమీాదా, ద్వేషంమీాదా, ఉన్మత్తహింసమీాదా ఆగ్రహించడానికీ భయంలేదు. "ఎక్కడ మనస్సుకి భయం లేదో, ఎక్కడ వాక్కులు సత్యగర్భంలో నుంచి దొలుచుకొని పొడుచుకుని వస్తాయో, ఎక్కడ శిరస్సు గౌరవంవల్ల ఉన్నతమో, ఎక్కడ వివేకవిజ్ఞానధారలు శుష్కసంప్రదాయాచారాలనే ఇసుకలో ఇంకిపోవో, ఎక్కడ పాడుగదులూ, ఇరుకు టరలూ లేవో, ఎక్కడ దుర్వారమైన కర్మధార సంతత ముక్తమై అభ్యుదయమార్గంలో ప్రవహిస్తుందో, అక్కడికి, ఆస్వర్గంలోనికి నా దేశాన్ని మేలుకొలుపు; నీదయాహస్తంతో నిర్దయగా కొట్టి లేపు!" అని అంటా డాయన.

'బుద్ధదేవేర్ ప్రతి' అనే మరోగీతంలో, బోధివృక్షచ్ఛాయలో మేలుకున్న వెలుగు అజ్ఞానపు తెరలను చీల్చివేసింది. స్వచ్ఛమూ, నిశితమూ, నిర్భయమూ అయిన అట్టి విజ్ఞానమూ మేధస్సూ మన సోమరి మనస్సులకు కొంతచైతన్యమునివ్వాలి" అనిఆక్రోశిస్తాడు.

'దేశదేశ నందితకరి

మంద్రిత తవభేరి!' అన్న ఉజ్జ్వలగీతంలో ఎంతకర్కశంగా నిద్రాణమైన ఈదేశాన్ని ప్రబోధిస్తాడు!

"నీదుందుభి దేశదేశాలని పిలిచింది. నీపీఠంచుట్టూ మానవులందరూ గుమిగూడారు. శుభముహూర్తం వచ్చింది. నా భారతదేశంఏదీ! వెనకనే కాళ్ళీడుచుకుంటూ పాకుతుందా! తనబరువులు బుజాన్ని వేసుకుని అందరితోనూ ముందుకి నడవదేం? నిత్యజాగ్రన్నేత్రివైన శక్తీ! మేల్కొల్పు! నీ విజయ కాహళిని వినిపించు! అందరూ మాయలు అనే తెరలను చింపిపారేశారు. బాధపడ్డారు. శ్రమపడ్డారు. మా దేశంమాత్రం రాత్రుళ్లూ పగళ్లూ చేతులు పక్కని వేళ్లాడవేసుకుని సిగ్గులేక బద్ధకంగా కూర్చుంది. కొత్తసూర్యుడు ఉదయించాడు. ఏమియాత్రికులు! ఎందఱు యాత్రికలు! మానవాలయప్రాంగణంలో తన్నుతా నవమానించుకుని ధూళిలోపడిఉంది నాభారతదేశం. మానవమందిరంలో ఆమెకు చోటులేదు. లోకమార్గాలన్నీ ఎల్లాగ కిక్కిరిసి పోయాయో! నీ రథచక్రాల సందడులతో రహదారులు ఎల్లాగచకితం అవుతున్నాయో! బాటసారులపాటలతో ఆకాశం నిండిపోయిందే! అబ్బా! పాతబడ్డ పాడుటింట్లో తలుపులు

వేసుకుని కూర్చుంది నా దేశం. ఆమె హృదయమూ కంఠమూ నిశ్శబ్దంతో లోనికి కుంగిపోతున్నాయి. అహా లోకంఅంతా ఏమి జనం! ఎందరెందరు! గుండెల్లో ఛాతీల్లో భుజాల్లో కండరాల్లో ఏమిశక్తి! ఏమి నిర్భయం! నా దేశానికి తనంటే తనకే అనుమానం! సందేహం! నిస్పృహ! తననీడ తననే తరుముతుంటే ఎట్లాగ వణికిపోతుంది! ఓమహాశక్తీ! చైతన్యదాత్రీ! భారతదేశాన్ని మేల్కొల్పు! నీవిజయకాహళిని వినిపించు!''

ఈతీవ్రతతో మెరసిపోయే ఆయనదృష్టికి భావిమంగళయుగం సాక్షాత్కరిస్తుంది. ఆయన అభిమానాలూ ఆవేశాలు ఎంత ఆప్తమైనవైనా పక్కకి తోసివేయ గలిగిన ధీరోదాత్తుడు! క్రొత్తదనానికి విముఖుడుగాడు. బెదరడు. ప్రస్తుత స్థితిగతుల్ని చూసి నీరసపడే అలతీ అల్పవిశ్వాసీ కాడు!

'హింసేఉన్మత్తపృథివీ' వంటి క్రొత్త గీతాలు చూడండి. దురాశా, ద్వేషమూ, స్వార్థమూవల్ల ఈలోకంలో కట్టినమహానిర్మాణాలు పెళపెళమని కూలిపోవడం, వాటిమీద అసంఖ్యాక మానవకోటి నిలబడి అదే పనిగా క్రొత్తనిర్మాణాలతో క్రొత్తలోకం కట్టుకోవడం స్పష్టంగాచూస్తాడు. ఆలోకంలో మానవులు తామే కర్ణధారులై తామే తెడ్లతో పడవల్ని నడుపుతారు. తామే పొలాలుదున్నీ తామే బీజాలుచల్లీ తామే కోసుకుంటూ తింటారు. రాజదండం ఛిన్నాభిన్నమైపోతే కూలిపోయిన శతసహస్ర రాజ్య నిర్మాణాలమీద నిలబడి శ్రమించే కోటానుకోట్ల మానవుల కంఠస్వరాలు ఉరుముల్లాగ మోగుతూ పడుగూ పేకాలాగ కలిసిపోతూ రాత్రీపగలూ లోకంలో జీవికలమీద హోరుమంటాయి. మానవులందరికీ సమాన సుఖదుఃఖాలు ఒక్క జీవగీతంగా వినిపిస్తాంటే రుజాలసతలు దులిపి భుజంభుజంకలిపి ఛాతీలు విప్పి శిరస్సులుయెత్తి మానవులు తమకోసం శ్రమిస్తూ సమంగా జీవిస్తారు.

ఇక ఇతర దేశాల్లో లాగే మనవంగంలో, అంగంలో, కళింగసముద్రాల్లో, గంగాఘట్టాల్లో, పాంచాలంలో, ఘూర్జరంలో సామాన్య మానవుని ఈనూత్న చైతన్యం కలకలంచేస్తుంది. చిరగాఢనిద్ర వదలి, పాశ్చాత్య పురాణంలో శాంసన్ (Samson) లాగ అశేషమానవకోటి ఒక్క మహాశక్తిలాగ లేచి, ఊగి, హుమ్మని, స్తంభాలు చేతితోపట్టుకుని ఊపిఊపి, ఊపి రాడనీయని పురాణసౌధాన్ని నేలమీదికి ఫెళఫెళమని విరిచి లాగేస్తున్నట్టు కొన్ని గీతాలు చదివినప్పుడనిపిస్తుంది.

ఇట్టి లోకంలో రవీంద్రుడు కేవలం అస్పష్టస్వప్నాలు పేనుతూ కూచోలేదు. మనకి స్వప్నమాత్రంగా ఉన్నవి అతనికి స్పష్టదృశ్యాలు. అదృశ్యాలు చూశాడు కనకనే దుర్వారమైన కర్మచైతన్యానికి తనవారిని పురికొలుపుతూంటాడు. ఇలాగ ఒకసారి ప్రబోధిస్తాడు. ''రా! స్నేహితుడా! భయపడకు! దిగు! ఈకర్షకు నేలపై

అడుగుపెట్టు! మునిమాపుల్లో స్వప్నాలను ఏరుకుంటూ కూర్చోకు! ఆకాశంలో తుపానులు మూలుగుతున్నాయి. మెరుపులూ ఉరుముదెబ్బలూ మననిద్రమీద పడికొడుతున్నాయి. సామాన్యజీవితంలోనికి దిగు! రావయ్యా! మాయాజాలకం చిరిగిపోయింది. కరకు రాతిగోడల మధ్య నిలబడు!''

''సోమరికలల్లోకి మమ్మల్ని జోకొట్టకు! కదిలించు, ఈధూళిలో కుంగిపోయేగుణాన్ని వదిలించు! మామనస్సుల్ని బంధించే సంకెళ్ళని తెంపి ప్రారబ్ధకర్మం అనేదాన్ని తుడిచి వెయ్యి! నిరంకుశప్రభువుల కాళ్లకింద పడవేస్తూ మా అభిమానాన్ని పోగొట్టే అంధత్వాన్నిపోగొట్టు. యుగయుగాల అవమానాల్ని నిర్మూలించు.'' అని ఇంకొకచోట అంటాడు.

రవీంద్రుని సంస్కృతి స్థిరంగా దృఢంగా ఈభూగర్భంలోనికి వేళ్లని పోనిచ్చి పెనవేసుకున్న వాస్తవిక సంస్కృతి. మళ్లీ పూవులతోనూ పళ్లతోనూ, కొమ్మలతోనూ, గాలుల్లో కాంతుల్లో శిరస్సుఊగించే సత్యసుందర సంస్కృతిన్నీ.

ఇది రవీంద్రుని తుదిగీతం. తాన స్తమించినతరవాత ఆ పృల్ని పఠించమని ఆయన ఆదేశించాడట. ''ముందు శాంతిసాగరం పరుచుకునిఉంది. కర్ణధారీ! దానిమీద పడవని వదులు. నీవెప్పుడూ ఇతనికి సహాయాత్రికుడవుగా సఖుడవుగా ఉంటావు. ఇతన్ని నీఅంకంలోనికి చేర్చుకో, దయచేసిచేర్చుకో! అనంతమార్గంపై ధ్రువతార మెరుస్తుంది. ఓముక్తిదాతా! నీక్షమా నీ అనుగ్రహమూ ఇతనికి నిత్యయాత్రలో అక్షయమైశ్వర్యంగా ఉండుగాక! ఈనశ్వరబంధాలు తెగిపోవుగాక! ఈ విశాలవిశ్వం చేతులుచాపి తనకౌగిలింతలోనికి ఇతన్ని తీసుకొనుగాక! తన నిర్భయ హృదయంలో అజ్ఞేయమైన ఆమహాశక్తిని ఇతడు తెలిసికొనుగాక!''

రవీంద్రునితో అతనికావ్యలోకంలో సుపరిచితులుగా తిరిగినవారికి ఈగీతం ఏదో గాలిగా ఆవిరిగా ఉండదు. మనకు గోచరించని ఆవలితీరమో, అఖాతమూ శాంతమూ నిశ్చలమూఅయినసాగరమూ, మధ్యపడవా, దానిమీద రాజర్షి కవిదేవునిది నిర్భయ సుందరమూర్తీ, దూరాన ధ్రువతారా, అన్నీస్పష్టంగా దర్శనమిస్తాయి. ఇంతలో స్మృతిపథంలో 'భానుసింహపదావళి' మొదలుకొని, 'బలాక' దాకా, 'బలాక' మొదలుకొని ఫాల్గునిదాకా, తుదిగీతావితానందాకా అన్నీ మెరపుమీద మెరపు లాగ స్ఫురిస్తాయి. ఈదివ్యస్మృతి మాసేది కాదయ్యా!

—ఆలిండియా రేడియో వారి అనుమతితో.

# విన్నపాలు

## "చలం"

నీకంత నే నక్కర్లేకపోతే, నువ్వేనా నాకంత కావల్సింది!

నాకూవుంది నాగర్వం. తెలుసా?

'ఎక్కడికి పోతాడు? వెతుక్కుంటో రాక!' అని కుదురుగా కూచున్నావులే.

చూద్దాంగా.

నేను నీకెంత అవసరమో నాకు తెలీదనుకుంటున్నావా?

నువ్వు లేకపోతేనేం, నాకు నా ప్రపంచముంది, ఆకాశం, చెట్లు, నవ్వులు, కన్నీళ్లు, ఉత్సవాలు, మరణాలు, అనురాగాలు ద్వేషాలు ... వెలుగునీడల ప్రపంచముంది నాకు.

అన్నీ వొదులుకున్న నీకేముంది ఇంక నేనూ నా ప్రేమాగాక.

ఇదుగో చూడు.

నా శక్తినంతా ఇచ్చుకుని వొచ్చాను నీవేపు. ఇంక నా చాత కాదు. ఒక్క అడుగు కదలలేను.

నా అశక్తత నీకు అర్థంకాదా, అర్థమైనా నిర్లక్ష్యమా! నా విషాదం, నీమీది నా వియోగం, ఆ వియోగాన్ని కూడా ఉపయోగించుకోలేని నా అలసత నీకు పట్టవా? అట్లాంటి వాడివి నువ్వు మాత్రం నాకెందుకు?

నీకూ శక్తిలేదా? నీకూ చాతకాదా? నిన్నూ నన్నూ మించినవిధి నిన్నూ కట్టేస్తోందా?

ఇంతేనా నువ్వు! ఎంత విశ్వసించాను? నా బలహీనాన్ని కప్పగల బలం నీలోవుందని!

అంతా వుత్తదా?

నా జాలినిస్తున్నాను నీకు తీసుకో.

మరిఅంత గొప్పగా లోకాన్నంతా ఆవరించుకుని నీలోకి తీసుకున్నట్టు ఎందుకు అట్లా చూస్తో కూచుంటావు?

గోచీ దులిపేసుకుని, నాకేం చాతకాదని మాయంకారాదూ, మమ్మన్నిట్లా మాయ చెయ్యకపోతే!

ఎంత నమ్మించావు నన్ను!

"తెచ్చుకో. బలం తెచ్చుకో" అంటావు. నా మొహం ఇంకా బలం ఎక్కణ్ణించి తెచ్చుకోను! బలం. నాకే బలంవుంటే నువ్వెందుకోయ్ నాకు! ఎవరి లెఖ్ఖా లేకండా నీకంటే గొప్పగా కూచుందును ఇంకా నాలుగుదిళ్లు ఎక్కువ వేసుకుని! నాకు చేతగాకనేగాక, నీకోసం చేతిని జాచింది!

నాకు విసుగెత్తించకు. నా సామర్థ్యం నీకు తెలీదు.

## విన్నపాలు

విరహాన్నే, ఖేదాన్నే, నా అల్పత్వాన్నే,
గట్టిగా కప్పుకుని నిద్రపోగలను అనంతంగా!

కుయ్యో మొర్రో, కరుణించు, ఇంక
దిక్కు లేదు అనిపించాలని చూస్తున్నావులే.

నరకంలో కాల్చు. పళ్లు బిగపట్టి ఇంకా
ఏం బాధలున్నాయి, యాతనలున్నాయి

నీచేతుల్లో, తీసుకురా. అని ధిక్కరించగలను,
తెలుసా!

ఎవరనుకున్నావు? ఇది చలం.
నీ కాఠిన్యానికి నీకు సిగ్గు తెప్పిస్తాను.

జాగ్రత్త భగవాన్.
అంటాడు చలం.



# తీర్థపుటుద్రేకాలు

## శ్రీ పాలగుమ్మి పద్మరాజు

వెంకరెడ్డి ఆఫీసువదలి తనఇంటికి బయలు దేరేసరికి 5-30 గంట లయింది. ఆవేళే ముట్టిన నలభయి రూపాయల జీతం పక్క జేబులో బరువుగా ఉంది. ఎల్లా గయినా బ్రదుకు మొత్తంమీద బరువుగా ఉంది. తాలూకా కచ్చేరీలో గుమాస్తాపని సృష్టిలో అతని నొక్కణ్ణీ కష్టపెట్టడానికి సృష్టించబడి ఉంటుం దని అతని నమ్మకం. అంతులేని మడతకాగితాల దొంతరలు కట్టలు కట్టలుగా బల్లమీద చూస్తుంటే అతని మనస్సు దిగాలుపడిపోతుంది. అయితే ఎప్పుడూ దిగాలుపడే ఉంటుంది గనక అతని మనస్సు ఇంకో ఉద్వేగాన్ని ఎరగదు.

దారిలో గోపాలస్వామివారి ఆలయ ముంది. అన్నట్టు ఆవేళ పెద్ద తీర్థం ఉంది. జనం తండతండాలుగా పోతుంటే అతనికి ఆ సంగతి జ్ఞాపకం వచ్చింది. అతడు రోజూ భక్తిగా అసలు గోపాలస్వామికి గుడి ఇవతలినించే దండం పెడుతుంటాడు. గుడి దగ్గర మలుపు తిరిగేచోట ఒకక్షణం ఆగి చేతులు జోడించి పెదవులు మెదిలించి మెల్లగా లెంపలు వాయించుకుంటాడు. ఆఫీసులో మాత్రం అతను అన్ని సంగతులూ మరిచిపోతాడు. అతని మనస్సు ఒక్క ఊహ అయినా లేకండా ఖాళీఅయి పోతుంది. లేకపోతే తీర్థం సంగతి ఎందుకు మరిచిపోయాడు! అతనికి ఆఫీసు విషయాల మీద అంత పెద్ద శ్రద్ధా లేదు. మరిచిపోవడం అతనికి అలవాటయిపోయింది.

రంగురంగుల చీరలు కట్టుకుని రకరకాల ఆడవాళ్లు ఒత్తుకుంటూ నవ్వుకుంటూ తీర్థం వేపు పోతున్నారు. ఇంత మంది ఆడవాళ్లు లోకంలో ఉన్నా రని అతనికి వింతగా తట్టింది. తన ఇంట్లో ముసిలితల్లి తప్ప ఇంక లోకంలో ఆడవాళ్లు ఉంటా రన్న సంగతి అతను మరిచిపోయాడు.

గుడి ఇవతల చెరువులో ఆడవాళ్లంతా దిగి కాళ్లు కడుక్కుంటున్నారు. మోకాలు వరకూ జాగ్రత్తగా చీర ఎత్తి కడుక్కుం టున్నారు. కొందరు వయసులో ఉన్న కొంటెపిల్లలు ఒకళ్లమీద ఒకళ్లు నీళ్లు జిమ్ముకుని పరుగెత్తుతున్నారు. వాళ్ళ రొమ్ములు బిగుతుగా గుత్తంగా కదలడం వెంకటరెడ్డి చూశాడు. అతనికి పాతపాత సంగతు లన్నీ గుర్తుకు వచ్చాయి.

మిఠాయి దుకాణాలు నూనె వాసన కొడుతున్నాయి. నీరెండలో లేచిన దుమ్ము గొప్పగా ఆనుతోంది. చెరుకుగడలు

గుట్టలుగా పడవేసి ఉన్నాయి. ఎక్కడ చూసినా జనం జనం. కొత్త బట్టలు కట్టుకుని పిల్లలు చేతులు నాకుకుంటూ ఏవేవో తింటున్నారు. కొందరు అప్పుడే పాడయిన బూరాలను నిస్పృహతో ఊదడానికి ప్రయత్నిస్తున్నారు. రంగురంగుల బుడగలు ఎగరవేస్తూ ఒక ఆడది అమ్ముతోంది. కిర్రుకిర్రు మనే పిచికలు గాలిలో గిరగిర తిరుగుతున్నాయి. నిన్నటిదాకా నిర్జనంగా ఉన్న ఇసుకపఱ్ఱ ఒక పట్టణంగా మారిపోయింది. కిక్కిరిసిన జనప్రవాహంతో మెల్లగా నడుస్తున్నాడు వెంకటరెడ్డి.

అతని కప్పుడే కొద్దికొద్దిగా గడ్డం నెరుస్తోంది. నలభయి సంవత్సరాలు దాటుతున్నాయి మరి. అతనికి ఒకసారి పెళ్ళి అవబోయి తప్పిపోయింది. ఆ తరవాత అతను మళ్ళీ పెళ్ళికోసం ప్రయత్నించలేదు. అతని కసలు చిన్నతనంలో పెళ్ళి అంటే కొంత భయంగా ఉండేది. అంత జనసమూహంలో ఎంతో ఒంటరితనం దిగులు అతని మనస్సుని ఆవరించాయి. తన పెళ్ళి తప్పిపోయిననాటి ఘట్టం అతను జ్ఞాపకం చేసుకుంటూ ముందుకు నడుస్తున్నాడు.

నాగమ్మని అతను బాగానే ఎరుగును. నాగమ్మ తండ్రి తన తల్లి దగ్గరకు వచ్చి పెళ్ళిసంబంధం సంగతి మాట్లాడడం అతను తలుపు పక్కనించి విన్నాడు. ఇరవయి ఏళ్ళ క్రితం నాటి సంగతి. అప్పు డతనికి పెళ్లి అన్నా, అసలు ఆడవా ళ్ళన్నా ఎంతో సిగ్గు. అతనికి నాగమ్మని చూపించారు. ఓనాడు వాళ్ళ ఇంటి ముందునించి వెడుతుంటే నాగమ్మ అరుగుమీద కూర్చుంది. అతనికి భయం వేసింది కాని ఆగాడు. ఏదో పలకరించాడు. ఆమె ముఖం వంచుకుని ఏదో సమాధానం చెప్పింది. ఇంట్లో ఎవరూ లేరని గావును చెప్పింది. అతని బుర్రలో ఏదో గింగురుమంటోంది. తల తిరుగుతున్నట్టు అనిపించి అరుగుమీద కూర్చున్నాడు. ఆమె లేచిపోలేదు. కొంత నత్తిగా, కంగారుగా ఏదో అడిగాడు. నేను నీకు నచ్చానా? అని అడగాలని అతని ఉద్దేశం. ఆమె చిరునవ్వు నవ్వినట్టు అతనికి అనుమానం. ఆమె చటుక్కుని ఇంట్లోకి పారిపోయింది. అతనికి ఏంచెయ్యాలో తోచలేదు. అతనుకూడా ఇంట్లోకి పరిగెత్తాడు. ఆమె గబుక్కుని గదిలోకి పోయి తలుపు వేసుకోబోయింది. అతను అనుకోకుండానే ఆమెవేపు చేతులు జాచాడు. ఆమె తలుపు వేసుకుంది. కాని ఆమె చీరచెరగు అతని చేతుల్లో చిక్కుకుంది. అతనికి ముచ్చెమటలు పోశాయి. గదిలోనించి ఆమె ఆపత్తులో పడ్డ మనిషిలాగ మెల్లగా ఆదుర్దాగా అంది "నీకు దండం బాబోయి! నన్ను వొదులు బాబోయి!" అతనికి అమిత భయం వేసింది. అతనసలు ఏమీ చేద్దామనుకోలేదు. మనస్సంతా స్తబ్ధంగా అయిపోయింది. చిత్రం ఏమిటో చేతులు

మాత్రం చీరచెరగు వొదలలేదు. లోపల నించి ఆమె ఏడుపు సన్న సన్నగా వినపడింది. అతని చేతినరాలు పట్లువిడ్డాయి. అతని కాళ్లు కదిలాయి. ఒక చెడ్డ కలలో నించి మేలుకున్నట్టు అతను అవతలికి వెళ్ళి పోయాడు. అతనికి రాత్రులు ఆనా ఏడుపు కలలో వినపడింది. నాగమ్మ తండ్రి మళ్లీ వస్తే తనికి పెళ్లాడ్డానికి అసలు ఇష్టం లేదని చెప్పేశాడు. అంతా ఆశ్చర్యపడ్డారు. అయినా అతను పట్టిన పట్టు వదల లేదు. నాగమ్మ ఎక్కడుందో ఇప్పుడు! ఈ తీర్థంలోనే ఉండొచ్చు!!

అతను ఒక్కసారి నిలబడి నాలుగు పక్కలా చూశాడు. ఒక గాంధీటోపీ పెట్టుకున్న వ్యక్తి కాంగ్రెసు జండా పట్టుకుని ఆ మూకలో గొంతెత్తి అరుస్తున్నాడు. కొంత మంది అతని చుట్టూ చేరారు. వెంకటరెడ్డి దగ్గరగా వెళ్లాడు. అతను కాంగ్రెసుకి వోటు ఇమ్మని అరుస్తున్నాడు. ఎన్నికలు దగ్గరపడుతున్నా యని అతనికి వెంటనే జ్ఞాపకం వచ్చింది.

చీకటిపడుతోంది. అతనికి దిగులుగా ఉంది. పక్కని ఉన్న సోడాకొట్టుదగ్గర ఆగాడు. తెల్లని దీపపు కాంతిలో ఎర్రగా పచ్చగా అమర్చిన సీసాలు చూస్తే అతనికి దాహంవేసింది. ఒక క్షణం ఆగాడు. సోడా అర్ధణా. జేబుమీది చెయ్యి పోనిచ్చాడు. రంగు తాగితే అరు కానులు అనుమానించాడు. ఇంతలోకే జనప్రవాహం తోసుకువస్తోంది. అతను ఏదీ తాగకుండానే ముందుకి నడిచాడు. అతని చెయ్యి పక్కజేబుమీద ఉంది.

అతనిచుట్టూ చీరలు రెపరెపమంటున్నాయి, మెత్తని భుజాలు రాసుకుంటూ పోతున్నాయి. చేతికి తగులుతూ అందీ అందకుండా ఒక పెద్ద ఆడప్రపంచం వెళ్లిపోతోంది. అతనికి అంగుళం దూరంలోనించి అద్భుతమయిన వ్యక్తులు పోతున్నారు. అతనికి ఏదో చెయ్యి దాటిపోతున్నట్టు ఆదుర్దాగా ఉంది. తీర్థపు ఉత్సాహం వాళ్ల నున్నని ముఖాల మీద ప్రతిబింబిస్తోంది. ఉత్సాహంతో వాళ్లు మరీ పొంకంగా కనబడుతున్నారు. కొత్త చీరల అడుగున వారి శరీరపు రేఖలు చూచాయగా అతనికి మ త్తెక్కిస్తున్నాయి.

దీపా లన్నీ వెలిగించారు. చీకటి పడింది. అతను గుడి గుమ్మంలోకి వచ్చాడు. అక్కడ జనసమ్మర్దం ఎక్కువగా ఉంది. గుమ్మంలో నించి మగ ఆడ ఒత్తుకుంటూ నొక్కుకుంటూ లోపలికి పోతున్నారు. అతను కూడా ఆ సమ్మర్దంలో పడ్డాడు. అతని ఊపిరితిత్తులకు అన్ని పక్కలా ఒత్తిడి తగిలింది. కాని గుమ్మందగ్గర చీకటిలో వ్యక్తులు ఆగలేదు. ఇంతాజేసి అతను కొబ్బరికాయలూ, అరటిపళ్లూ కొనుక్కురావడం మరిచిపోయాడు. అంచేత గర్భగుడిలోకి పోకుండా మండపం పక్కని నిలబడ్డాడు. ఆవేళ అతనికి దేవుడికి దండం పెట్టాలని ఎందుకో తోచలేదు. చుట్టుప్రక్కల కుర్ర

వాళ్లు ఆడవాళ్ళతో హాస్యాలాడుతున్నారు. విరగబడి నవ్వుకుంటున్నారు. ఒకరినొకరు తోసుకుంటున్నారు. లోపలినించి గుడిగంట తరుచు మోగుతోంది. గర్భగుడిలోనించి మంత్రాలు, సంభాషణ అనే ప్రతిధ్వనులతో ఇవతలికి వినబడుతోంది.

వెంకటరెడ్డి ఒక్క నిట్టూర్పు విడిచి, పక్క గుమ్మం వెంట గుడి ఇవతలికి వచ్చాడు. పక్కగుమ్మం ఒక సందులోకి ఉంది. సందు చీకటిగా ఉంది. గుడినించి ఇవతలికి వచ్చే జనం సందులో క్రిక్కిరిసి ఉన్నారు. తీర్థం వేపు దీపాలవెలుగు దూరంలో కనబడుతోంది. చీకటిలో తోసుకుంటూ అటువేపు జనం నడుస్తున్నారు. మనిషికీ మనిషికీ అంగుళం ఖాళీ లేదు. అనంతమైన ఒక చీకటి సొరంగంలో నడుస్తున్నట్టు అనిపించింది వెంకటరెడ్డికి. అతనిచుట్టూ దేహాల ఒత్తిడి అతన్ని తొందరపెట్టింది. ఒక పది గజాలలో సందు పెద్దరోడ్డులో కలుస్తుంది. అప్పుడు ఏదో జరిగింది.

అవతల తీర్థంలో పెద్ద కల్లోలం చెలరేగింది. దీపాలవెలుగులో చెరుకుగడలు గాలిలో ఎగురుతున్నాయి. 'అమ్మోయి! బాబోయి' అని కేకలు వినబడుతున్నాయి. సందులోకి జనం తోసుకువస్తున్నారు. సందుకొసని కొంచెం వెలుగూ, చీకటిగా ఉంది. పక్కనున్న గుమ్మంమెట్లు ఎక్కి అరుగుని ఆనుకున్నాడు వెంకటరెడ్డి. సందులో కల్లోలం ఎక్కువయింది. ఇంతలో అతని దగ్గరగా 'బాబోయి!' అని ఆర్తనాదం వినపడింది. ఎవరో తూలి అతనిమీద పడ్డారు. మెట్టు జారిందికాబోలు కింద పడబోయారు. అతను ఒకచేత్తో పట్టుకున్నాడు. మెత్తని స్త్రీ దేహపు స్పర్శకు అతనిఒళ్ళు పులకరించింది. అతని చేతులు పట్టువదలలేదు. ఆ స్త్రీ పట్టు వదిలించుకోలేదు. చుట్టూ జనం ఒత్తిడి ఎక్కువయింది. అతను నిలబడ్డ మెట్టుమీదికి ఆమె కూడా ఎక్కింది. అరుగుమీద చెయ్యి ఆనుకోబోయి అతని రొమ్ము మీదికి వాలిపోయింది. అతను మెల్లగా ఆమె పక్కలు చేతులతో తాకాడు. ఆమె లేచిపోలేదు. 'బయమేస్తుంది బాబోయి!' అంది ఆమె. అతను



అప్రయత్నంగా అభయమిస్తున్నట్టుగా తన చేతిని ఆమె నడుముచుట్టూ పోనిచ్చాడు. ఆమె గబగబా ఊపిరి తీసుకుంటోంది. ఊపిరితో ఆమె రొమ్ములు సూటిగా అతని

రొమ్ముమీద బరువుగా ఆనుతున్నాయి. ఆ కనుచీకటిలో ఆమె ఆకారంఅస్పష్టంగా అతనికి ఆనింది. అతని రెండో చెయ్యికూడా ఆమె నడుమునుచుట్టింది. ఆమెను మెల్లగాఅదుముకున్నాడు. ఆమెతల అతనిమెడదగ్గర ఆనింది. ఆమె అతని చేతులు విదిలించి తీసివెయ్యలేదు. అతను సాహసించి ఆమె మెడమీద పెదవులు ఆనించాడు. కిచకిచలు పెట్టినట్టు ఆమె చటుక్కుని మెడవంచింది. ఒక క్షణం అయిన తరవాత ఆమె తొందరగా అతని కౌగిలినించి విడిపించుకుని ఆ జనంలోమాయమయి పోయింది. అతని శరీరంచుట్టూరా ఏదో ఒత్తిడిచటుక్కుని పోయినట్టు అతనికి అనిపించింది. అతనిగుండె పిచ్చెక్కినట్టు కొట్టుకుంటోంది. మెల్లగా తప్పించుకుని సందులోనించి రోడ్డుమీదికి వచ్చాడు. ఆమె ఎల్లాఉంటుందో ఊహించుకోబోయాడు పద్దెనిమిది సంవత్సరా లుండొచ్చు. ఎంతసూటిగా గట్టిగా ఉన్నాయి రొమ్ములు! అతని చేతులకి తగిలిన ఆమె శరీరపు నున్నదనాన్ని అతడు గుర్తుకు తెచ్చుకుంటున్నాడు. ఆమె మెడ ఎంత మెత్తగా ఉంది! అందులోనూ ఏదో వింత వాసన!

అతని జీవితంలో అది మొదటిసారి స్త్రీ స్పర్శ తగలడం. అతని నవనాడులు ఏదో మోతలాగ మోగుతున్నాయి. అతని శరీరం అంతా చెమటతో తడిసిపోయింది. ఇంత వింత అనుభవం అతనికి ఎన్నడూ కలగలేదు. తనవంటి వాడి రొమ్ముమీద ఒక స్త్రీ ఎన్నడయినా ఆనుకుంటుం దని అతనికి ఎప్పుడూ అనిపించలేదు. ఎవరికీ ఎప్పుడూ లభించని అనుభవం ఏదో అతనికి దొరికినట్టు అతనికి అనిపించింది. ఆమె స్పర్శ అతన్ని ఇంకా వొదలలేదు.

అతను ఎవరినో ఆ గోలని గురించి అడిగాడు. కొందరు తాగుబోతులు కొట్టుకున్నారట. ఏవో పాతవైరాలున్నాయట. సోడా కొట్టు ఇంతలోకే అతనికి కనబడింది. రంగు రంగులబుడ్లు దీపపువెలుగులో ఆకర్షణంగా కనబడ్డాయి. అతనికి అమితమయిన దాహం వేసింది. అరుకానులు ఇచ్చి రంగు తాగాలని నిశ్చయించుకున్నాడు. అలవాటు ప్రకారం అతనిచెయ్యి పక్క జేబుమీదికి పోయింది.

జేబులో పర్సు లేదు.

అతడు పిడుగుపడినట్టు అల్లాగే నిలబడిపోయాడు. ఆ రంగురంగుల బుడ్లు దీపపు వెలుగులో వెగటుగా కనబడ్డాయి. బ్రతుకు వెగటుగా తోచింది. కుంగిపోయి అతని మనస్సు బరువుగా వేలాడింది.

అతడు ఇంటికి మళ్లాడు.



వసంత దివసము



పూతనా సంహారము



వరాహావతారము

# భరతుని రసవాదము

## శ్రీ ఆచార్య పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

సూత్రాలు, వాటిపై భాష్యాలు, వ్యాఖ్యలు, టీకలు, వివరణలు రచించటం సంస్కృతభాషాచరిత్రలో సదా కన్పిస్తుంది. భాష్యకారాదులు సూత్రకారుని భావాన్వేషణకు, తద్వివరణకు సిద్ధులై బయలుదేరినారు. కాని ఈవివరణాల్లో ప్రసంగాలలో తమతమ భావాలనే స్పష్టీకరించారు. "ఎక్కడ సందు దొరకుతుందా మనపాండిత్యం ప్రకటించటానికి" అని యెంచుతూ కాపువేసికొన్నట్లుగా వీరు కన్పిస్తారు. కాకపోతే రసవాదానికి 'రసో వైసః' అనే శ్రుతివాక్యమును అసంబద్ధముగా జగన్నాథు డుదహరించి, తనకు వైదికవాఙ్మయము బొత్తిగా అర్థంకాలేదని ఎందుకు ధ్వనింపచేసికొన్నాడు? ఈ వ్యాఖ్యాతలు పూర్వుల భాష్యాలను మించాలని యెంచి ఇష్టము వచ్చినంత వరకు క్లిష్టభాషనుకూడా తెచ్చారు. పంచపాదికమీద వివరణ, శాంకరభాష్యంమీద భామతి, అమలానందుని పైన పరిమళ చూడండి.

అలంకారశాస్త్రంకూడా ఇదే ఫక్కీలో నడచింది. శాస్త్రకారుని భావాలకు,తద్వ్యాఖ్యాతల భావాలకు ఎంతో వ్యత్యాసం కన్పిస్తుంది. ఐనా వ్యాఖ్యాతభావములే శాస్త్రకారుని వని సంప్రదాయ మంటుంది. ఐతే శంకర రామానుజుల భాష్యాలలో భేద మెట్లా వచ్చిందో పరమాత్మున కెరుక. 'శంకుక, లొల్లట, భట్టనాయ కాదులలోని భేదా లెలా బయలుదేరినవో మనతరం కాదు చెప్పటము' అని అనాలి. ఈ విషయనిర్వచనానికి భరతుని రసవాదమును దివ్యమైన ఉదాహరణగా గ్రహించవచ్చును.

నాట్యశాస్త్రములో షష్ఠాధ్యాయంలో భరతుడు 'విభావానుభావ వ్యభిచారి సంయోగాద్రసనిష్పత్తిః'అని రసనిష్పత్తిని సూత్రించినాడు. దీనిపై వ్యాఖ్యకూడా తానే చేసినాడు. విభావములు, అనుభావములు, వ్యభిచారిభావములు అనువాని సంయోగముచే రసముసిద్ధించుచున్నది. నానావ్యంజనౌషధి ద్రవ్యసంయోగంచేత భోజనంలో షడ్రసాలు ఎలాగ కలుగుచున్నవోఅలాగే కావ్యంలోకూడాను. కొన్ని వస్తువుల సంయోగము నందిన భోజనపదార్థములలో తీపి, పులుపు మొదలైన రుచులు బయలుదేరుచున్నవి. బెల్లంలో తీపి, చింతపండులో పులుపు, మిరపకాయలో కారము రసాయనిక పరిణామాలని మనకు తెలుసు. ఈ పరిణామమెలా వస్తుందో కూడా మనకు తెలుసు. ఇలాంటి రసాయనిక పరిణామాలు సాహిత్యంలో కలిగితే శృంగార హాస్యాది నామముల నందుచున్నవి.

పంచదారలో తీపిని కలుగచేసే పదార్థాలు కొన్ని ఉన్నవి. అవి ఆయా నిష్పత్తులలో ఏకత్రసమ్మేళనము కాగా,భిన్నపదార్థాలు తమతమస్వతంత్రతనుకోల్పోయి ఒకేరూపంలోనికి పరిణమించు తున్నవి. అనగా రసములో వివిధ భాగములు ప్రథమమున ఉన్నప్పటికీ, అవి తమ వైశిష్ట్యాన్ని కోల్పోవుచున్నవి. అలాగే కావ్యరసముకూడా విభావానుభావ వ్యభిచారభావముల సంయోగముచేత కలిగే పరిణామమేనని యెంచాలి. అనగా విభావాదు లంతర్లీనాలైనా, అవి రసములో స్పష్టముగా కన్పించరాదు. ఇలాంటి రసమును అను

చేత అనుమితిలేదు. ఇది కేవల పరిణామమే కావటం చేత ఉత్పత్తికూడా కాదు. భావుకత్వ భోజకత్వాది అసంబద్ధప్రలాపానికి ఇక్కడ తావులేదు. ఇలాంటి రసం వ్యంగ్యమనేవారికి మతివిభ్రమ మనాలి.

వ్యంగ్యవాదము, అనగా ధ్వనివాదము, అద్వైత వేదాంతములోని వివర్తవాదము నాశ్రయించుకొని బయలుదేరినది. కాని భరతుడు పరిణామవాదమునే అంగీకరించినాడు. ఈ వాదమే అతిప్రాచీనమైన సాంఖ్యదర్శనములో కలదు. అభినవుని కాశ్మీరశైవము కూడా పరిణామవాదమునే అంగీకరిస్తుంది. ఐనా అభినవగుప్తుడు అద్వైతంతో తనశైవమును సమన్వయింప ప్రయత్నించి, భరతుని భావమునకు వ్యతిరేకముగా వ్యాఖ్యచేసినాడు.

రసమునుగురించి భరతుడు చెప్పిన కొన్ని వాక్యాలను పరిశీలించట మీ సందర్భములో ఉచితము. ఆస్వాద్యత్వమే రసలక్షణమని భరతుని అభిప్రాయము. మానవునిచే ఆస్వాదింపబడాలి. వ్యంగ్యవస్తువు ఆస్వాదనకు పరిణామపదార్థమనుమించినదికాజాలదు.

నానావ్యంజనసంస్కృతమైన అన్నమును భుజించేవారు రసములను ఆస్వాదనచేసి, సుమనస్కులై, హర్షాది అనుభూతుల నందే విధముగానే, నానాభావాభినయవ్యంజితాలు, వాగంగసత్త్వోపేతాలు ఐనస్థాయి భావములను ప్రేక్షకులు ఆస్వాదనచేస్తారన్నాడు. అనగా రసాస్వాదన భరతునిమతములో ప్రేక్షకనిష్ఠమని తేలుతుంది.

అభినవగుప్తుడు, తదనుయాయులు రసము నటనిష్ఠమా, ప్రేక్షకనిష్ఠమా అని తర్కించినారు. చివరకు ఉభయనిష్ఠమూనని నిర్ధరించినారు. కాని ఇది భరతుని మతముకాదు. భరతుడు స్పష్టముగా "ఆస్వాదయంతి సుమనసః ప్రేక్షకాః" అని నొక్కి చెప్పినాడు. నటుని రసానుభూతితో మనకు సంబంధములేదు. నాటకములో రసము నటనిష్ఠమైతే నాటకానికి, కావ్యానికి ఈషత్తైనా భేదములేదు. ఈ కావ్యధర్మమును నాటకాని కాపాదించి, లాంబ్ (Lamb) మొదలైనవారు షేక్స్పియర్ నాటకాలు ప్రదర్శనార్హాలు కావన్నారు. కాని మనవారుకూడా ఈ అపార్థంలో పడిపోయినప్పటికీ, ఈ సిద్ధాంతాన్ని అంగీకరించటానికి వెనుదీస్తారు. అంటే నాటకమునకు ప్రధానలక్షణము ప్రదర్శనయోగ్యత్వమని తేలుతుంది. ఇదే నేటి ఆంగ్లవిమర్శకుల [1]అభిప్రాయముకూడాను.

భరతుడు సహితము రసాస్వాదన మనస్సుతో చేయబడవలెనన్నాడు. అనగా ప్రేక్షకుడు తనభావపథములో, తనమనస్సుతో పరిణామితరసమును భావించికాని, లేక గుర్తించికాని ఆస్వాదించవలెను. ప్రదర్శకత్వము నాటకలక్షణమైనట్లు, సుమనస్కత్వము ప్రేక్షకలక్షణము.

నానాభినయసంబంధులైన రసములను భావింపచేయునవి భావములు. బహువిధములైన నానాద్రవ్యములతో షడ్రసాదులు భావింపచేయబడునట్లుగానే కావ్యంలో కూడా భావాలు ద్రష్టవ్యాలు. అందుచేత భావంలేని రసము, రసంలేని భావము లేనేలేవు. భావములు రసములు అన్యోన్యాశ్రయములుగా యెంచాలి. భావము రసముగా పరిణమించినా, భావముయొక్క ప్రధానాంశము రసములో అంతర్లీనమని సత్కార్యవాదము చెప్పుతున్నది. రసముయొక్క వివిధవికృతులు తత్తద్భావాలలో కన్పిస్తున్నవి. వీటిసమ్మేళనమే రసము. దీనినే భిన్నత్వములో నేకత్వమంటారు. రసము అంతర్యామిగా అన్నిభావాలలోను కలదని, అన్ని

[1] A. Nicoll: Theory of Drama చూడుడు.

భావాలకలయికకన్నారసము కించిద్విశిష్టమేననీఅంగీకరిస్తేనే ఈ ఏకత్వబహుత్వాలకు సంబంధమునకు తగిన సమాధానము కుదురుతుంది!

రసములలో భావాలు వ్యవస్థితాలు. బీజంనుంచి వృక్షము, వృక్షంనుంచి పుష్పం పరిణమించి ఉత్పత్తి చెందేవిధంగా రసము అంతర్యామిగాగల భావముల నుంచి రసములు ఉత్పత్తిచెందుతున్నవి. ఇక్కడ ఉత్పత్తి అనేశబ్దమును భరతుడు పరిణామమనే అర్థంలో ప్రయోగించినాడని యెంచవలెను. తత్ప్రయోగానికి, ఆ అర్థానికి అంగీకరించజాలనివారు ఉపనిషత్సాంఖ్యమును, సాంఖ్యకారికలను పరిశీలించవలసి ఉంటుంది. ప్రాచీనభారతదేశములో ప్రప్రథమమున బయలుదేరిన తత్త్వదర్శనము సాంఖ్యదర్శనమేనని మా అభిప్రాయము.

దీనినే 'Immanence and Transcendence of the One in relation to the Many' అని అంటారు.

పరిణామవాదమునకు సత్కార్యవాద మాశ్రయము. కార్యకారణముల ప్రధానాంశముల కైక్యత, కార్యజననక్షీణమున కారణనివృత్తి ఇక్కడ అంగీకృతాలు. కార్యము ఇతరకార్యములను జన్మింపచేయగల్గినచో వాటిరీత్యా కారణావస్థను పొందుతుంది. అనగా సౌకర్యార్థము మనము ఉత్పత్తిశబ్దమునుగ్రహించవచ్చును. కావుననే భరతుడు రసమును ఉత్పాద్యమన్నాడు. విభావాదుల సంయోగముచే రసము జన్మిస్తుంది. అందుచేత భరతుని మతానుసారము రసనిష్పత్తిశబ్దమునకు రసఉత్పత్తి అని అర్థము చెప్పుకోవాలి.

పైగా భరతుడు శృంగార, రౌద్ర, వీర, బీభత్సాలను ప్రధాన రసాలుగా స్వీకరించినాడు. దీనినుంచి మిగిలిన రసములు ఉత్పాద్యము లగుచున్నవి. ఈ నాలుగున్నూ మిగిలిన వాటికి ఉత్పత్తిహేతువులు. శృంగారంనుంచి హాస్యము, రౌద్రంనుంచి కరుణ, వీరంనుంచి అద్భుతము,బీభత్సమునుంచి భయానకము కలుగుచున్నవి. ఇక్కడ కంచు కాగడాపెట్టి వెదకినా అభినవగుప్తుని వ్యంగ్యము కనబడదు.

రసములకు కారణత్వము నంగీకరిస్తే తజ్జన్యరసముల ప్రాణప్రదాంశాలకు వాటికి భేదము లేదనాలి. మృల్లక్షణవిశిష్టము ఘటమైనట్లు, శృంగారలక్షణవిశిష్టము హాస్యము కావాలి. అందుకనే భరతుడు శృంగారానుకృతి హాస్యమనీ, రౌద్రానుకృతి కరుణ అనీ, వీరానుకృతి అద్భుతమనీ, బీభత్సానుకృతి భయానకమనీ అన్నాడు. విపర్తవాదాశ్రయమైవ్యంగ్యభావనలో ఇలాంటి అనుకృతికి సుతరాం తావులేదు.

ఈ పై విషయములవల్ల అభినవగుప్తుని రససూత్రవ్యాఖ్యకు, భరతుని వ్యాఖ్యకు చాలా భేదమున్నదని తేలుతున్నది. అభినవుడు తనభావమును ప్రదర్శించి, అదే భరతుని వాదమన్నాడు. తర్వాతి ఆలంకారికులు అభినవుని కళ్ళతో భరతుని పఠించారు. భరతుని వాదము యుక్తమైనదా, కాదా అనేది వేరొకప్రశ్న. కాని భరతుడు ధ్వనివాదానికి ఎంతమాత్రమూ అంగీకరించడని చెప్పాలి. ఇంతేగాక నేటి ప్రతీచీనాటకవిమర్శనలోని ముఖ్యాంశములు భరతునిలోనే ఉన్నవి. ఇవి అభినవుని కళ్ళతో చదివినవారికి గోచరించవు. 'నా అనుయాయులనుంచి నన్ను భగవానుడు రక్షించుగాక' అని భరతుడు ఇప్పుడు బ్రతికిఉంటే ప్రార్థించి తీరుతాడు.

# రూపశ్రీ

## శ్రీ సంజీవదేవ్

మానవ జీవితం యొక్క ఉత్తమ రూపం సంస్కృతి. సంస్కృతికి ఉత్తమరూపం లలిత కళలు. రూపకళ లలితకళల ఉత్తమరూపం. రూపసాధనద్వారా రూపాతీతాన్ని పొందటమే ఆశియా ఖండపు శిల్పంయొక్క ఆదర్శం. రూపం రూపాతీతానికి అతి సమీపం కనుకనే ప్రాచ్యదేశాల్లో భావ వాదానికీ కళకూ అంత సాన్నిహిత్యం. అంటే కళ నిత్యజీవితంతో వేరు అని అర్థం కాదు.

తన భావాన్ని అభివ్యక్తపరచేందుకు మానవుడు నాలుగువిధాల సాధనాలను ఆచరణలోకి తెచ్చాడు. మాటలద్వారా భావ ప్రకటన అనగా సాహిత్యం. శబ్దం ద్వారా భావప్రకటన అనగా సంగీతం. అంగభంగిమల ద్వారా భావప్రకటన అనగా అభినయ నృత్యాలు. రూపంద్వారా భావప్రకటన అనగా చిత్రకళా, భాస్కర్యమూ. వీటిలో భావప్రకటనకు ప్రతీదీ తన విశిష్టతను కలిగిఉంటుంది. ఒకటి ఎక్కువనీ మరొకటి తక్కువనీ తీర్పు తీర్చటంలో అర్థం లేదు. దేని ఆరాధకునికి అదే గొప్ప. కాని ఏ విషయాన్ని గురించి చెప్పవలసివస్తే దాన్ని ఆకాశానికెత్తి చూపి మిగతా వాటి కంటె ఆ విషయం అత్యంత ఉత్కృష్టమైన దని చాటడం ఒక ఆచారమైపోయింది సర్వకాలాల్లోనూ, సర్వదేశాల్లోనూ.

కాని ఒక్క ఉదాహరణను అనుసరించి చూస్తే శ్రావ్యకళలకంటె దృశ్యకళలకు ప్రాధాన్యం ఎక్కువా అని అనుమానం వెయ్యకపోదు. కారణం ఏమంటే దృశ్య కళలు కంటికి సంబంధించినవి. సర్వేంద్రియాల్లోకీ నయనం ప్రధానం అన్నారు. అనటమే కాదు. నిజంగా నేత్రానికి మించిన సున్నితమైన అవయవం మరొకటిలేదు. మనస్సుకు కంటితో ఉన్న సంబంధం మరే అవయవంతోనూ లేదు. మనకేమాత్రం ఆనందం కలిగినా అసుఖం కలిగినా దాని ఫలితం కన్నీరుద్వారా వ్యక్తమవుతుంది. ఎవరైనా చెవిటివారయేందుకు ఇష్టపడతారు కాని, గ్రుడ్డివారయేందు కంగీకరించరు. కన్నే లేనిచో జగత్తే లేదు. పంచేంద్రియాల్లోనూ నేత్రానికందువల్లనే అంత గొప్పస్థానం. అందుకనే రూపకళకు కూడా నేమో.

కళాపోషణకు రెండువిధాల వ్యక్తుల వసరం. ఒకడు స్రష్ట, అనగా కళావస్తువును సృష్టించేవాడు. రెండవవాడు ద్రష్ట, అనగా

ఆ కళావస్తువుని చూచి ఆనందించువాడు. ప్రదర్శకుడొకడు, దర్శకుడొకడు. ఒకడు 'రసకృత్' మరొకడు 'రసవిత్'. చిత్రకారుడు సృష్టించిన రూపాన్నిచూచి ఆనందించేందుకు దర్శకుని కన్ను తగిన అర్హతను సంపాదించి ఉండాలి. చిత్రకారుని హృదయాన్ని బోధచేసుకోగల శక్తిని కలిగి ఉండాలి దర్శకుడు. అప్పుడే నిజమైన చిత్ర రసికుడవుతాడు దర్శకుడు. చిత్రకారుడు సంవత్సరాల పర్యంతం శ్రమపడి తన జీవితాన్నంతా అర్పించి ఒక చిత్రాన్ని తయారుచేస్తే దర్శకుడు ప్రథమ దృష్టిలోనే ఏమీ బాగా లేదనటంలో కాని, లేక చాలా బాగున్నదనటంలో కాని ఏమాత్రం అర్థం లేదు. చిత్రాన్ని ఆనందించటానికి కూడ కొంత శిక్షణ కలిగి వుండాలి.

మనం సాధారణంగా ఒక చిత్రాన్ని చూడగానే అందులోని విషయవస్తువు మనకు నచ్చితే ఆ చిత్రం బాగున్నదంటాం. విషయవస్తువు నచ్చకపోతే బాగా లేదంటాం. చిత్రంలోని రేఖాపాతంయొక్క మాధుర్యాన్ని కాని, వర్ణవిన్యాసంలోని కమనీయకాంతిని గాని చూడం. కళ ఎప్పుడూ విషయవస్తువు ననుసరించి నీచంగా కాని ఉచ్చంగా కాని ఉండదు. ఆ విషయ వస్తువుకు రూపం ఇవ్వటంలో కళాకారుడు చూపే హస్తకౌశలమూ, నిష్కాపట్యమూ మొదలైన వాటిపై ఆధారపడి వుంటుంది ఆ చిత్రంయొక్క నిజమైన విలువ. ఒక చిత్రకారుడు తాజమహలును చిత్రించి తెస్తాడు.

మరొక చిత్రకారుడొక పానశాలను చిత్రించి తెస్తాడు. తాజమహలు చిత్రానికంటె పానశాలచిత్రం రేఖాలాలిత్యంలో కాని, వర్ణవైచిత్ర్యంలో కాని, వస్తురచనలో కాని, భావసామ్యంలో కాని ఏమాత్రమూ తీసివేతగా లేదు. కళాకౌశలంలో రెండూ సమానంగానే ఉన్నాయి. అప్పుడు మామూలు దర్శకుడు, తాజమహలు చిత్రం అద్భుతంగా వున్నదనీ, పానశాలచిత్రం అసహ్యంగా వున్నదనీ అంటాడు. కాని వాస్తవ కళారసికుడు వాటిని చూచి రెండు చిత్రాలూ అద్భుతంగా ఉన్నవంటాడు. విషయవస్తువునుబట్టి కళారూపానికి బాగోగులు ముడిపెట్టరాదు.

మహానీతిప్రధానమైన రామాయణాన్ని రచించిన వాల్మీకినీ అశ్లీల కథాసాహిత్యాన్ని సృష్టించిన పరాసుదేశపు మపాసానూ కూడా గొప్ప కళాస్రష్టలన్నారు రసజ్ఞులంతా. అనగా కళ నీతికీ అవినీతికీ అతీతమయిందని. నీతిని కాని, అవినీతిని కాని ప్రచారంచేయటం కళయొక్క కర్తవ్యం కాదు. కళయొక్క కార్యం కేవల రససృష్టి మాత్రమే. ఇచ్చట మరొకమాట నొక్కి చెప్పేదేమంటె, కళయొక్క ఆశయం అవినీతినీ, భోగవాదాన్నీ ప్రచారంచేయటం ఎంతమాత్రమూ కాదు. ఆధిభౌతిక అసంపూర్ణత్వాన్ని ఆధ్యాత్మిక పరిపూర్ణత్వం

లోకి రూపాంతరం చేయుటే కళయొక్క నైజలక్షణం. ఇంద్రియానుభూతి ద్వారా రసచేతనాన్ని అతీంద్రియ శిఖరాల కెత్తుటే కళయొక్క చరమలక్ష్యం. మృణ్మయపాత్ర ద్వారా చిన్మయ సుధను ప్రసాదించేదే కళ. రూపంద్వారా రూపాతీతాన్ని లభ్యం చేయుటే చిత్రకళయొక్క పరమావధి. అయితే ఇలాంటి కార్యాచరణ అంతా వస్తువుతో పనిలేకుండా కేవలరేఖల్లోనూ, రంగుల్లోనూ కలదని.


సంగీతం ఇందుకు చక్కని ఉదాహరణ. ఒకరు శ్రావ్యంగా రాగాలాపన చేస్తుంటారు, లేక వీణ వాయిస్తుంటారు. ఆనాదం ఫలాని అర్థాన్నికాని ఫలాని మాటలనుకాని వ్యక్తపరచదు. కేవలం ఒక సుమధుర ధ్వని తరంగాలు మాత్రం వినిపిస్తుంటుంది. ఆసునాద తరంగాలు శ్రోతల మానస సరోవరాల్లో ప్రకంపనలను కలుగచేసి వారి చేతనాన్ని ఒకవిధమైన అశరీరలోకాల కెత్తివేస్తుంది. ఆ రసానందానికి హద్దులులేవు. కాని ఆనాదం ఒక విషయాన్ని కాని, ఒక అర్థాన్నికాని మనకు తెలియపరుచుటలేదు. కళ ఇచ్చటే ఆధ్యాత్మికతతో ఏకమయేది.

ఏవిషయవస్తువునూ వ్యక్తపరచని కేవల నాదం శ్రోతల హృదయాన్ని సుందరబృందావనంగా మార్చకలిగితే, ఏ విషయవస్తువునూ వ్యక్తపరచని కేవలరూపంమాత్రం దర్శకుల హృదయాన్ని నందనోద్యానంగా ఎందుకు మార్చజాలదా అని. సంగీతాన్ని సవ్యంగా ఆనందించాలంటే రాగజ్ఞానం, ఎంత అవసరమో చిత్రకళను ఆనందించాలంటే రేఖాజ్ఞానం, వర్ణజ్ఞానం అంత అవసరం. అప్పుడు శుద్ధనాదం వలెనే శుద్ధరూపం యొక్క శోభను ఆనందించవచ్చు. రూపశ్రీ నిజరూపాన్ని చూపుతుంది.

ప్రతి చిత్రమూ రెండు రకాలైన రేఖలతో నిర్మితమై వుంటుంది; వక్రరేఖతోనూ, సరళరేఖతోను. మన కంటికి వక్రరేఖ ప్రసాదించే ఆనందాన్ని సరళరేఖ ప్రసాదించలేదు. ఒకవక్రరేఖను మనం చూడాలంటే మనకంటిగ్రుడ్డును ఇటూఅటూ కదల్చాలి. గ్రుడ్డుకు రెండు ప్రక్కలావున్న కండరాలు(Ciliary muscles)మనగ్రుడ్డునుకదల్చుతవి. ఒక సరళ రేఖను చూస్తున్నామంటే మనకంటిగ్రుడ్డు ఒకేవైపున కదలక మెదలక ఆగివుంటుందన్నమాట. అప్పుడు మన కన్నులకండరాలు ఒకేవైపున పనిచేస్తుంటవి. అందువల్ల కంటికి విసుగుకలిగి మనసుకు సుఖం వుండదు. కాని వక్రరేఖవైపు మనం చూస్తుంటే మన గ్రుడ్డు ఇటూ అటూ తిరుగుతున్నదన్నమాట. అప్పుడు ఒకవైపు కండరం పనిచేస్తూంటె రెండవవైపు కండరం విశ్రాంతి పొందుతూంటుంది. అందువల్ల కంటికి అలసట వుండదు; మనసుకు సుఖంగా వుంటుంది. కనుకనే వక్ర

# ఆంధ్ర శిల్పి

రేఖలతో నిర్మితమైన చిత్రాన్ని చూస్తుంటే కలిగే సుఖం సరళ రేఖామయ చిత్రాన్ని చూస్తుంటే వుండదు. అందుకనే సాధారణంగా చిత్రకారులు తమ చిత్రాల్లో వక్ర రేఖలను ఎక్కువ కల్పించాలని చూస్తారు. ప్రతివారూ రూపస్రష్టలు కాజాలకపోయినా రూపద్రష్టలు అయేందుకైనా సరిపోవు రేఖాజ్ఞానాన్ని, పర్ణజ్ఞానాన్ని అలవరుచుకోవాలి. అప్పుడే రూపశ్రీ యొక్క సహజస్వరూపాన్ని తిలకించటానికి వీలు.



# ప్రాచీన చలనచిత్రాలు

శ్రీ డాక్టరు పి. వి. పతి

చలన చిత్రాలు ఒక్క యిరవయ్యో శతాబ్దంలోనే బయలుదేరలేదు. పూర్వకాలంలో ఛాయారూపకాలని (Shadow Plays) ఒక తరహా నాటకాలుండేవి. అవి ఈరోజుల్లో మనఫిలుముల మోస్తరుగా బాగా జనరంజకంగా ఉండేవి. ఇప్పుడు రేడియోలు, సినీమాలు అనుదినమూ వివిధములైన మానవుల మనోవృత్తులు ప్రదర్శిస్తున్నాయి. ఇప్పుడు ప్రాచ్యదేశాలలో ఈ ఆధునిక యంత్రనిర్మాణాలతోపాటు రంగు రంగుల తోలు బొమ్మలు కూడా ప్రదర్శింపబడుతున్నాయి. ఇవి చాలా ప్రాకృతికంగా (Primitirve) ఉంటాయి. అయినా ఇవి బాగా అభివృద్ధి చెంది అనేక శతాబ్దాలనించి అత్యంతమూ జనరంజకంగా ఉన్నాయి. ఇంకా ఇప్పటికీ భారతదేశపు పల్లెటూళ్ళలో జనసామాన్యానికి ప్రతిదినమూ ఆనందం కలిగిస్తూనే ఉన్నాయి.

తోలుబొమ్మలు ఆడించేవాళ్లు తమ కుటుంబాలతో నిత్యమూ ఆంధ్రదేశంలో సంచారంచేస్తూంటారు, రంగురంగుల బొమ్మలు ప్రదర్శిస్తూ పల్లీప్రజలని సంతోషపరుస్తూంటారు. వాళ్లు వచ్చారనేసరికి రైతులు, భూస్వాములు, ఒకళ్ళేమిటి, అందరూ ఈ ప్రదర్శనాలకి గుమిగూడుతారు. చదువుకున్నవాళ్ళు కూడా వీటికోసం తహతహలాడుతూంటారు. తోలుబొమ్మలాట ఆడిస్తే బాగా వర్షాలు కురుస్తాయని ఒక నమ్మకం ఉంది. బహుశః ఈ నమ్మకం మూలాన్నే పల్లెటూరు ప్రజలు వీటికోసం అంత ఔత్సుక్యం కనబరచడానికి కారణం అనుకుంటాను. నీటికోసం ప్రజలు అల్లల్లాడే రోజుల్లో పల్లెటూరి ప్రజలంతా కలిసి చందాలు వేయించుకుని తోలుబొమ్మలాటలాడిస్తూ ఉంటారు.

పూర్వం యూరపులో కొందరు నటకులలాగ వీళ్ళు తమ రూపక మందిరాలు తామే నిర్మించుకుంటారు. సామాన్యంగా వీళ్ళ ఆటలు సాయంత్రం వేళ ప్రారంభించి, ఛళ్ళున తెల్లవారేదాకా ఆడుతూంటారు. వీళ్ళు ఆడే ఆటల్లో చాలావరకు పురాణ కథలే ఆయిఉంటాయి. అందులోనూ అవి చాలావరకు రామాయణ భారత కథల్లో నించి సంగ్రహించినవి. విశాలమైన పచ్చిక బయళ్ళే వాళ్ళకి రంగమందిరాలు. రంగస్థలాలు తాటి ఆకులు కొబ్బరి ఆకులునూ వెదురు కర్రలు, మొదలైనవాటితో నిర్మిస్తూంటారు. ఈ రంగస్థలానికి మూడువైపులా నల్లని తెర ఉంటుంది. మిగిలినవైపున తెల్లని తెరవేలాడుతూంటుంది. దాని పొడవు నేలమీదినించి సుమారు నాలుగైదు అడుగులుంటుంది ఆ తెరమీదనే తోలు బొమ్మల ప్రదర్శనం జరుగుతూంటుంది. నేలమీది నించి కొంత ఎత్తుదాకా తాటిఆకులతో కట్టిన దడి ఒకటి ఉంటుంది. దానివల్ల ప్రదర్శకులూ, వాళ్ళకి సంబంధించిన సామానులూ పై వాళ్ళకి కనబడకుండా ఉంటాయి. పైనకూడా తాటాకులు మొదలైనవాటితో కడతారు. తాటాకులతో కట్టిన దడిమీద ఒక బల్ల అమరుస్తారు. ఆ బల్లమీద ఆముదపు దీపాలు కల

కల్లాడుతూ వెలుగుతుంటాయి. వాటి వెలుగువల్ల తెరమీద బొమ్మలన్నీ సుస్పష్టంగా ప్రేక్షకులకి కనిపిస్తూంటాయి. తెరలో బొమ్మలు ఆడించేవాళ్ళే ఇంకా కొంతమంది సంభాషణలు నడిపిస్తూ హంగుచేస్తూంటారు. సామాన్యంగా ఒక స్త్రీ లోపల ఉండి కథలో వచ్చే పాటలన్నీ పాడుతూ ఉంటుంది. ప్రాకృతమైన ఈ ప్రదర్శనానికి ఆ స్త్రీయే సూత్రధారిణి అని చెప్పాలి.

ఈ ప్రదర్శనాల్లో వాడే బొమ్మలు మద్దెళ్ళకి ఉపయోగించే చర్మాలంత పలసరిగా ఉంటాయి. వీటి మీదవేసేరంగులు సుస్పష్టంగా ఉండడంచేత, అవి దీపాలకి ఎదురుగుండా ఉంచేసరికి సుందర వర్ణాలలో కుడ్య చిత్రాల మోస్తరుగా మిలమిలా మెరుస్తూంటాయి. బొమ్మల కరచరణాలు వదులుగా ఉండి




ప్రదర్శకులు పనిచేస్తూన్న దృశ్యం.

ఆంగికాభినయానికి చక్కగా తోడ్పడుతూంటాయి. అసలు ఒక్కొక్క బొమ్మ ఒక్కొక్క పొడుగైన యష్టిమీద ఆధారపడి ఉంటుంది. అందుచేత ప్రదర్శకులకి బొమ్మల కదలికలన్నీ తమ గుపిళ్ళలో పెట్టుగోవడానికి వీలవుతుంది. ఈ బొమ్మల్లో కొన్ని స్వీయస్రష్టల సుందర నిర్మాణ చాతురికి తార్కాణలుగా వెలుగుతుంటాయి. అందులోనూ కొన్ని నర్తకీ పాంచాలికల అలంకార సౌందర్యమూ వస్త్రధారణశోభా అతి మనోహరంగా మెరుస్తాయి. ప్రతి ప్రదర్శనానికీ ఒక్కొక్క బొమ్మకి ఒక అడుగు మొదలుకొని ఏడేసి అడుగులవరకూ పొడవైన ఆకృతు లుపయోగిస్తారు. వీటిని అవసరాన్నిబట్టి హ్రస్వదృక్పథానికీ దీర్ఘదృక్పథానికీ వాడుతూంటారు. సామాన్యంగా ఒక్కొక్క రంగానికి కావలిసిన



శూర్పణఖ.



రాముడు

అయిదారు బొమ్మలు కలిసి తెరకు ఏదో ఒకవైపున గుచ్చుతారు. ఆముదపు ప్రమిదల కాంతులలో వాటి ఆకారాలూ వర్ణాలూ తళతళా మెరుస్తూ కళ్ళకి మిరుమిట్లు గొలుపుతూంటాయి. ఈ సందర్భంలో ఒక విషయం చాలా ముఖ్యమైంది. గెరార్డ్ డి నెర్వల్ అనే అభిజ్ఞుడు కాన్‌స్టాంటినోపిల్‌లో ఖారగోజ్ అనే ప్రదర్శనాలని గురించి వ్రాస్తూ అవి ఫ్రాన్సులో ఛాయా చిత్రాలలాగ లేవనీ వాటిల్లో రంగురంగుల బొమ్మలున్నాయనీ వ్రాశాడు. దీనినిబట్టి దక్షిణా పథంలోని తోలుబొమ్మలాటలకీ టర్కీలో ప్రదర్శనాలకీ చాలా దగ్గిర సంబంధం ఉన్నట్టు కనిపిస్తుంది.

ఈ ప్రదర్శనాల్లో జనానికి 'లంకాదహనం' కథ చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. దశరథుడు రాముణ్ణి ౧౪ ఏళ్ళు అరణ్యవాసానికి పంపుతాడు. అతనిభార్య ఎన్ని కష్టాలకైనా ఓర్చి అతన్ని అనుసరించడానికే నిశ్చయిస్తుంది. అరణ్యంలో ఆమెను రావణాసురుడు అపహరిస్తాడు. లంకలో సీత రావణాసురుడు పెట్టిన బాధలన్నీ ఓర్మితో సహిస్తుంది. ఆమె చుట్టూ రాక్షస స్త్రీలు కాపలా కాస్తూంటారు. రామలక్ష్మణులు ఆమెను వెతకడానికి బయలుదేరతారు. వారికి అడివిలోఉండే భల్లూకాలు వానరాలు, సహాయంచేస్తాయి. క్రమంగా రాముడు హనుమంతుణ్ణి లంకకి పంపిస్తాడు. హనుమంతుడు సీతాదేవికి రామసందేశం అందిస్తాడు; రాముడిచ్చిన అంగుళీయకం ఆమెకిచ్చి, ఆమె ఇచ్చిన చూడామణి తిరిగి రాముడికి అందజేస్తాడు. తిరిగి తను మళ్ళీ కిష్కింధకు వెళ్ళబోయేటప్పుడు



రావణుడు

లంకా పట్టణం పూర్తిగా పరశురాము ప్రీతిచేస్తాడు దాంతో లంకాదహనం కథ పూర్తి అవుతుంది.

అనేక శతాబ్దాలనించి మనదేశంలో నాటకాలు ప్రారంభించే ముందు దేవతారాధనం చెయ్యడం ఆచారంలో ఉంది. అల్లాగే తోలుబొమ్మలాటలు కూడా దేవతాప్రార్థనతో ప్రారంభిస్తారు. ఈ ఆటల్లో సూత్రధారిణిగా ఉండే స్త్రీ విఘ్నేశ్వర చిత్రము తెరకి ఒకవైపున నుంచి, విఘ్ననివారణకోసం మధుర కంఠముతో విఘ్నేశ్వరప్రార్థన పాడుతుంది. ఆ తరవాత తెరకి మరొకవైపున నిలిచి ఉన్న హనుమంతుడు, రావణాసురుడు సీతని అపహరించుకొని పోయిన కథ అంతా చెబుతాడు. సీతాదేవి చుట్టూ రాక్షస స్త్రీలు పరివేష్టించి ఉంటారు. ఈ దృశ్యం ముద్దులొలికే చిత్రాలతో ఎంతో చూడముచ్చటగా ఉంటుంది. కనురెప్పపాటులో ఈ దృశ్యం హనుమంతుడు లంకలో ప్రవేశించిన దృశ్యంలాగ మారిపోతుంది. రావణసభలో హనుమంతుడు మొదట చిన్న కోతిలాగ ప్రవేశించి క్రమంగా పెరిగి పెద్దవాడై గుండ్రంగా స్తంభంలాగ నిలబెట్టిన తోకమీద కూర్చుని ఉంటాడు. ఇక్కడ జరిగే సంభాషణలూ ధ్వనులూ కలిసి మారుతూన్న హనుమదాకృతులకు ఒక అనుస్యూతత్వం కల్పిస్తాయి. సరే దీనితో ప్రథమాంకం ముగిసిపోతుంది. మళ్ళీ ప్రదర్శకులు ద్వితీయాంకానికి కావలసిన బొమ్మలన్నీ తెరమీద గుచ్చుకుంటూ ఉంటారు. ఇంతలో ఒక నర్తకీ చిత్రం వచ్చి రకరకాల నృత్యాలుచేస్తూ ప్రేక్షకుల్ని సంతోషపెడుతూఉంటుంది. ఆమెచేసే నృత్యం అంతా సాంప్రదాయికమైన భారతీయ నృత్యమే. ఆ తరవాత కొంచెం హాస్యప్రసంగం నడుస్తుంది. గ్రంధారిగాడు తెరమీదికివస్తాడు వాణ్ణిచూడగానే ప్రేక్షకులలోనించి విచిత్రమైన కలకలం బయలుదేరుతుంది. ఇంతలో నర్తకి అదృశ్యమౌతుంది. ఇంతట్లో గ్రంధారిగాడు పక్కనేఉన్న తన స్నేహితుడితో ఏదో గిల్లికజ్జా పెట్టుకుని దెబ్బలాడుతూంటాడు. ఆ దెబ్బలాటతో ప్రేక్షకులంతా కడుపుబ్బేటట్లు నవ్వుకుంటారు. వాళ్ళిద్దరూ కొంత మోటుభాషలో సరసా లాడుకుంటూంటారు. అంతలోనూ గ్రంధారిగాడు తన శత్రువుతో తన గొప్పతనాన్ని గురించి డాబులుకొడుతూన్న కొద్దీ జనంలోనించి హాసతరంగాలు పొంగులు వారుతూంటాయి. ఇంతలో కనురెప్పపాటులో తెరమీద మూడో బొమ్మ ప్రత్యక్షమౌతుంది! ఆచిత్రం చూసే సరికి గ్రంధారిగాడు కుప్పలాగ కూలబడిపోతాడు; ఆ బొమ్మ మరెవ్వరిదీకాదు; ఆ గ్రంధారిభార్యదే; అసలు ఆగ్రంధారి ఒకపెట్టమారి! వాడు ఆమెకు వంగి నమస్కారంచేస్తాడు! ఆమె దానికి సమాధానంగా ఒక్కలాపు తన్నుతుంది. ఆపైన ప్రేక్షకుల్లో బయలుదేరిన హాసకలకలానికి అంతే ఉండదు! ఆ గందరగోళంలో ఆ ముగ్గురూ అదృశ్యులౌతారు. "పంచ్" 'జూడీ'లనే దురదృష్టవంతులైన పాశ్చాత్య హాస్య నర్తకుల ప్రదర్శనం ఇంతకంటెబాగా ప్రాచీనం అనుకుంటాను."దురదృష్టవంతు"లని ఎందుకంటున్నానంటే ఈచర్మపాంచాలికలలోని గ్రంధారికి అలవాటైన హాస్యం చాలా మోటుగా ఉంటుంది. ఇది ఇల్లాగ ఉండగా ౧౭వ శతాబ్దంలో ఖారఘేజ్ ప్రదర్శనాలు చూసిన గెరార్డ్ డి నార్వెలు తానుచూసిన ప్రదర్శనాల్లో హాస్యగాళ్ల హాస్యం చాలా మోటుగా ఉన్నదని వ్రాశాడు.

ఈ హాస్యఘట్టం అయిపోయిన తరవాత గూడా కథ నడుస్తుంది. మళ్ళీ ఒకపాట, అందులో లంకా నగరీ వర్ణనం. తరవాత సీతాదేవి శింశపా వృక్షం

ఖ్యంద కూర్చున్న దృశ్యం. హనుమంతుడు చెట్టు మీదనించి ఆమె ఒడిలో ఉంగరం జారవిడుస్తాడు. ఆమె పైకిచూస్తుంది. ఆ తరవాత హనుమంతుడికి తన ఉంగరం ఇస్తుంది. హనుమంతుడు లంక ప్రజ్వలిస్తూండగానే రాముడి సన్నిధికి చేరుకుంటాడు. ఈ చివరి దృశ్యం అంతా చర్మపాంచాలికల రంగుల తళతళలతోనూ పాటలుపాడే స్త్రీల ఆక్రందన ధ్వనులతోనూ ప్రేక్షకులకి కళ్ళకి కట్టినట్టుంటుంది. చివరికి హనుమంతుడు తన సందేశకృత్యం సామర్థ్యంతో నిర్వహించాడనే మాటతో ఆ దృశ్యం పరిసమాప్తమవుతుంది. క్రమంగా ఆ స్త్రీకంఠస్వరం అస్పష్టంగా అలా అలా తగ్గిపోతుంది. ఆమె యుగయుగాలనాటి ఆసీతాపహరణ గాథ, ఆ దీర్ఘమయిన రామవనవాసగాథా, మనోవీధిలో అదృశ్యమవుతుంది. క్రమంగా ఇంతవరకూ మన మనోనేత్రంలో ప్రతిబింబించిన చిత్రాలన్నీ మాయమైపోతాయి.

ఆ రంగురంగుల బొమ్మలు సృజించిన దృశ్యాలన్నీ మందమందంగా అదృశ్యమైపోతూంటాయి. బొమ్మల ప్రదర్శనంలో తగిన ఆకారాలుగల చిత్రాలు ఏరుకొనడమూ బొమ్మలు కదిలించడంలో ఆ కళాకౌశలమూ మొదలైనవన్నీ చూస్తే ఈ కాలపు చలనచిత్రాల్లో ఛాయాచిత్రగ్రాహకులని ఆశ్చర్యపరిచేవి అనేకం ఉంటాయి. ఆ బొమ్మలకేసి చూస్తూంటే మానవజాతి ఎప్పుడూ 'తన అభివ్యక్తికి అనుకూలంగా ఉండే చిత్రాలు సృజించుకుంటూనే ఉంది.' అనే అభిప్రాయం కలుగుతుంది. ఈ తోలుబొమ్మలాటలు ఆడించేవాళ్ళు రంగురంగుల టాకీప్రదర్శనాలు చూసి వారు తమ దగ్గర ఉన్న ప్రాచీనకళ అపహరించారని అనుకుంటారు. అయితే ఈ టాకీలూ ఈ తోలుబొమ్మల ప్రదర్శనాలూ కూడా ఒకదానిప్రక్క ఒకటి అల్లాగే నడుస్తూనే ఉంటాయి. పల్లెటూరి ప్రజలు పురాణవీరుల పరాక్రమం కోసమో గ్రంధారిమోటు హాస్యంకోసమో ఈ ప్రదర్శనాలూ చూస్తారు; ఈ ప్రదర్శకులిన్నీ అభిమానిస్తారు. ఈ ప్రదర్శకులు కూడా మాయావాస్తవికతల సమ్మేళనంతో ప్రజాసామాన్యానికి అనుకూలమైన అభిరుచిలో ప్రదర్శనాలు నడిపిస్తూంటారు. నేటివరకూ జావాద్వీపంలో ఇల్లాంటి ప్రదర్శనాల్లో జనసామాన్యానికి హిందూ పురాణగాథలు అందిస్తూంటారు. ఇవి మనదేశంలో జనసామాన్యాన్ని బాగా పట్టుకోవడం మూలాన్నే అంతదూరంలో ఉన్న జావాద్వీపందాకా ప్రయాణం చేశాయని చెప్పాలి.

అనువాదకుడు: 'శిల్పి'



# చిత్ర వివరణము

శ్రీ టి. యస్. శ్రీనివాసన్

శ్రీనందలాలబోసు చాలాకాలం కిందట సెమీటెంపెరా షక్కీలో ఈ చిత్రం చిత్రించాడు. ఈత్రివర్ణ చిత్రము దానిముద్రణము. ఆయన వివిధములైన చిత్రపరికరాలతో పరిశోధనలు చేస్తూండే కాలంలో దీనినిరచించాడు.

కదంబవృక్షము ఎంతో శివప్రీతి కరమయిన వృక్షమని చెబుతారు. హాలాస్య పురాణంలో ఇది మధురమీనాక్షీ దేవాలయ ప్రదేశంలో ఉన్న స్థలవృక్షమని చెప్పబడి ఉంది. అనేకయుగాలకిందట ఇంద్రాది దేవతల కందరికీ ఈవృక్షంకిందనే శ్రీసుందరేశ్వరలింగము ప్రత్యక్షమైనదనీ, పార్వతీదేవి పరమేశ్వరుణ్ణి వివాహం చేసుకునే అభిలాషతో ఈవృక్షాన్ని గాఢభక్తితో అర్చిందనీ, ఆ తరవాతనే ఆమె శ్రీమీనాక్షీదేవిగా అవతరించినదనీ తెలుస్తూంది. ఈకదంబ పుష్పాలు చక్కని పరిమళంతో ఘుమఘుమ లాడుతుంటాయి. ఇప్పటికీ వీటిని శివపూజార్థం ఉపయోగిస్తారు.

చిత్రకారుడు ఈ చిత్రంలో పార్వతీదేవిని ఒక ప్రసన్నభావనలో చిత్రించాడు. తద్ద్వారా ఆమె తపోదీక్షా, శ్రద్ధా అభివ్యక్తమవుతున్నాయి. చిత్రానికి రెండు వైపులా కదంబ వృక్షం పువ్వులతో కలకల లాడుతూంది. ఇందులో చిత్రాలంకరణం చాలా తక్కువగాఉంది; చిత్రకారుడు కేవలం విశేషమైన వ్యక్తీకరణం వల్లనే ఈ చిత్రవస్తువును అత్యద్భుతంగా చిత్రించాడు.

## కాగితం కత్తిరింపులు

సామాన్యంగా చూస్తే ఈ సంచికలోని నాలుగు కాగితం కత్తిరింపులూ ప్లైవుడ్డుతో తయారుచేసిన సిల్‌హౌట్లు లాగ కనిపిస్తాయి. కాని ఇవి నల్లని దళసరి మెరుగు కాగితం కత్తిరించి, తయారుచేసినబొమ్మలు. కాగితం ఈవిధంగా కత్తిరించడానికి మంచి నైపుణ్యమూ సూక్ష్మరేఖాచిత్రణంలో నిశిత దృష్టీ కావాలి. ఇవి తెల్లని కాగితంమీద ప్రదర్శిస్తే 'నీలశ్వేత' చిత్రాల్లాగ స్ఫురిస్తాయి. అందులోనూ పార్శ్వముఖాకారము మొదలుగాగలవన్నీ చక్కగా సరిదిద్దాలి. లేకపోతే పూర్తి అయిన చిత్రం ఎబ్బెట్టుగా ఉంటుంది. ప్రస్తుతం హిందూ పత్రికలో కళాసంపాదకులైన శ్రీ టి. యస్. దండపాణిగారు, 'నర్తకులు' 'సువర్ణహరిణ సంహారము' అనేవి రెండూ రచించారు. మొదటిదానిలో సత్వరచలనమూ, చల

నాంతర్భూతమైన ఆంతర సామరస్యమూ బాగా ప్రదర్శితము లయ్యాయి. 'నర్తకుల' మృదువస్త్రాలంకారాలు ఎంతో మనోహరంగా చిత్రింపబడ్డాయి. ఆ నర్తకుల ఆకృతులుకూడా నృత్యకళావిలాసాలకి అనుకూలంగా అమిరిఉన్నాయి. 'సువర్ణ హరిణసంహారము'లో అరణ్యప్రాగ్భాగం అత్యద్భుతంగా చిత్రించబడింది. అందులో లేడినోరు కొంచెం తెరచినట్లు కనబడుతుంది. బాణాఘాతం వల్ల మరణిస్తున్న ఆ హరిణావేదన చాలా సున్నితంగా అభివ్యక్తమయింది. ఆ ముందరి కాళ్లు రెండూ వంగిపోవడం కూడా భావవ్యక్తికి బాగా సహాయపడుతుంది.

శ్రీ. కె. తణికాచలంగారు తయారు చేసిన 'వర్షాదివసము' ఎంతో వ్యంగ్యపూర్ణంగా ఉంది. పెద్దవాన పడుతూండడమూ, ఆ ఇద్దరు పాదచారు లూలతాడుగా ఉన్న నేలమీద నడుస్తూండడమూ బాగా వచ్చాయి.

శ్రీ కుప్పురావుగారి 'వృద్ధశీర్షము' జీవిత సాయం సంధ్యాసమయం సూచిస్తూంది. ఆ ముఖంలో వార్ధికభారంలో కలతా, కంగారూ, మొదలైనవన్నీ దున్నిన దీర్ఘదుఃఖ రేఖలన్నీ విస్పష్టంగా చిత్రించబడ్డాయి.

## ఒక వసంత దివసము

ఇది జపానీయ చిత్రకారుడు కుంచికతో తయారుచేసిన 'నీలశ్వేత' చిత్రము. చైనీయులూ, జపానీయులూ ఈవిధమైన చిత్రాల్లో చాలా గట్టివారు. ఇవి తయారు చెయ్యడానికి వాళ్లు ముందు పెన్సిలుతో రేఖాచిత్రంకూడా గీయరు. అదీగాక వాళ్లు ఒక్క వర్ణంలో సూక్ష్మాతి సూక్ష్మాలూ, క్రమికములూ అయిన వర్ణచ్ఛాయలన్నీ కుంచికతోనే ప్రదర్శిస్తారు. ఇందులో ఒక పల్లెటూరి పిల్లవాడు ఒకవసంత సంధ్యాసమయంలో ఎద్దుమీద స్వారీచేస్తూన్న విషయం మాంచి బలంగానూ, బరువుగానూ వ్యక్తమయింది. వసంతదివసంలో వెలుగు నీడలు కూడా కుంచికానైపుణివల్ల స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## తిరుపతి దారుశిల్పాలు

ఈరెండు తిరుపతిదారుశిల్పాలూ దేవాలయ రథాలకి ఉపయోగించే దారువుమీద చెక్కారు. ఈరెండు పౌరాణిక శిల్పాల్లోనే అతి సున్నితమైన చెక్కడాలు కూడా చక్కగా వచ్చాయి. ఇప్పుడు ప్రస్తుతం ఈరథంలేదు. ఇది రెండు శతాబ్దాలకి పూర్వం ఉండేదని అంటున్నారు.

అనువాదకుడు : 'శిల్పి'

# గ్రంథవిమర్శనము

## ఉషాసుందరి

ఉషాసుందరి—శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి గారి రచన—అయిదంకముల నాటిక—కథ పౌరాణికము-నాట్యీకరించుటయందు మంచి నిపుణత ఉంది.

రచన అంతయు వ్యాకరణ కట్టుబాటులతో గ్రాంథికభాషలో నడచినది. భాష శ్రావ్యముగను రసవంతముగను ఉన్నది. ప్రస్తుత భాషాస్రవంతినుండి తప్పి, మారుమూలల నిరుకుకొనియున్న మాటలు కొన్నిటిని అక్కడక్కడ ఇముడ్చుకున్న మరింత తీయగనుండెడిదేమో ! అదిగాక, ఈభాష చదువుట కింపుగనున్నను ప్రదర్శించునపుడు నాటకపుసొంపును కొంత దిగలాగునేమో !

పాత్రశిల్పమందు నూతనరీతులు గనబడవు. ప్రాత దారులనే నడిచిది. ఉషాసుందరి బహులావణ్యముగ చిత్రించబడినది. బాణుని అనుపమానమైన భక్తిమూర్తియందు రెండవ యంకములోని నడత యొక మోట గంటు. పాపము! బ్రహ్మమానస పుత్రుడైనను, భక్తి సూత్రముల రచయితయైనను, దివ్యగాయకమణియైనను దేవమునియైనను, నారదునకు ఈకవియైనను, దేవతల గూఢాచారిపదవిని, దానవులవంక పంచమదళసభ్యుని (Fifth columnist) పదవిని తప్పించలేకపోయెను.

ఐదవ అంకములో మూడవరంగమందు శంకరుని క్లిష్టసమస్యను దీర్చి శివకేశవుల సమానాధికారము నిరూపించుచు ధర్మమునకు జయము ప్రసాదించుటకై బ్రహ్మను రప్పించి రాజీకుదిర్చిన ఘట్టనమొక క్రొత్తసృష్టిగాని, సమస్య కనుకూలముగ నుండుటకై త్రిమూర్తులను చెక్కుటలో రవివర్మ బొమ్మలలోవలె వారిదైవత్వము సన్నగిలి సామాన్య మానుషత్వము ప్రబలినది.

పుస్తకము చక్కని లేతరంగుల అట్టతో, కనుల నాకర్షించు నారీ (silhouette) చిత్రముతో ముద్దులొలకు చున్నది.

‘ రా జ్ఞి ’

## నివేదన

### శ్రీ చింతాదీక్షితులుగారు

వెల. ౬ అణాలు.

శ్రీ రమణాశ్రమం. తిరువణ్ణామలై.

ఆంధ్రుల ఆదరాభిమానముల ననేకకేతుల తమ రచనా శక్తులతో చూరగొన్న శ్రీ చింతాదీక్షితులు గారు, తమకు రమణమహర్షి దర్శన ప్రభావంవలన కలిగిన ఆవేదన నివేదించారు యీచిన్నిపుస్తకంలో. మహాఋషిని పరిపరివిధముల ప్రస్తుతించారు. అందు చిన్నపిల్లలకు శ్రీరమణులు ప్రాశస్త్యం తెల్పుటలో వీరికవితాశక్తి అనర్గళంగా ప్రవహించింది. యీచిన్ని పుస్తకం చదువుతూఉంటె ‘తల్లీ! యందున! తండ్రీ! యందున ! ప్రేమనిలయమగు ప్రియుడా ! అందున !’ అన్న బ్రహ్మోపాసనగీతమూ ‘గురుర్బ్రహ్మ, గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్ పరబ్రహ్మ’ అనే పురాతనసంస్కృతశ్లోకమూ స్ఫురణకు వచ్చాయి ఆయాసందర్భాలలో!

‘ బసవ ’

# గ్రంథస్వీకృతి

## నవ్యసాహిత్య పరిషత్తు గుంటూరు వారి

౧. ఉపాసన – రామచంద్ర అప్పారావు ౦—౧౨—౦

౨. పటీరావు కథలు – చింతాదీక్షితులు ౧— ౪—౦

౩. హాస్యకథలు ,, ౨— ౦—౦

౪. టీకప్పులో తుఫాను – ముద్దుకృష్ణ ౦— ౮—౦

౫. భీమాకలాపములో భానూవిలాసం – ముద్దుకృష్ణ. ౧— ౦—౦

౬. దేశయాత్రల కథలు పా. జగన్నాథస్వామి ౧— ౮—౦

## జాతీయ జ్ఞానమందిరం, త్యాగరాయనగరం, మద్రాసు.

౧. నిర్మాణకార్యక్రమం – మహాత్మాగాంధీ
రాజేంద్రబాబు వ్యాసాలకు అనువాదం ౦—౧౨—౦

౨. ప్రజాపరిషత్తు – ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య ౧— ౮—౦

౩. మానవుల హక్కులు ,, ౧— ౮—౦

శ్రీ ఆచార్య కాకాకలేల్కర్ గారి

---

సాహిత్యసంజీవి. అనువాదకులు పోట్లూరి – వెంకటేశ్వరరావుగారు

అడపా రామకృష్ణరావుగారు, ఇంగ్లీషుపాలెం, బందరు

---

పి. వి. భయంకరాచారిగారి సంపాదకత్వంలో వెలువడుచున్న
'యశోద' అను ఇంగ్లీషు వారపత్రిక. శ్రమజీవి ముద్రణాలయం, రాజమండ్రి ౦— ౪—౦

---

స వ ర ణ

'ఆంధ్ర శిల్పి' భాద్రపద సంచికలో పడిన 'వారసత్వం'లో కొన్ని పద్యాలు
శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రిగారివి.



న ర న ము ర ళి

# వివేకానంద ఇండస్ట్రియల్ ఇంజనీర్స్

## పెరంబూరు, మదరాసు

### ఎలక్ట్రికల్

డిజైన్లు—కట్టడములు

★ ★ ★

బంగాళాలు, సినీమాలు, ఫాక్టరీలలో, ఇంజను ఫిట్టింగులు దీపాలు ఏర్పాటులు

★ ★ ★

కోల్డుస్టోరేజి, ఫ్రిజిడరీలు

★ ★ ★

గ్రామసీమలలో విద్యుచ్ఛక్తి ఏర్పాటులు

★ ★ ★

అన్నిరకాల మోటార్లూ, జనరేటర్లూ మరమ్మతు చేయబడును.

★ ★ ★

ట్రాన్సఫారమర్లూ, స్విచ్ గియర్లూ సప్లయి చేయబడును.

### మెకానికల్

రిపేరీలు—తయారీలు

★ ★ ★

చేతి-మర-మగ్గములు నూలుయంత్రాలు అంటే వైండింగ్, వార్పింగ్, సైజింగ్ మెషీనులు మొదలయినవి.

★ ★ ★

చేతికాగితపు గ్లేజింగు, వగైరాయంత్రాలు.

★ ★ ★

బియ్యము, పిండి, నూనె, పంచదార, మరల బాయిలర్లు, స్టీముఇంజన్లు, పంపులు.

గ్యాస్ ఆయిలు, ఇంజన్లు, వర్కుషాపు పనిముట్లు, టూనరీయంత్రాలు.

ఉక్కు, బీడు, ఇత్తడి, కంచు వగైరా పంచలోహములలో మీకు కావలసిన ఇంజను సామాన్లయినా సరిగా సకాలమునకు పోతపోసి తయారుచేసి ఇవ్వగలము. సరసమయిన ఛార్జీలు! నికరమయిన పనివాడితనం.!

ప్రొప్రయిటరు,

టి. సి. యస్. ఆచారి.

శిల్పి ప్రచురణములు:

# 'నా జీవిత యాత్ర'

ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు

**బాల్యం మొదలు పంచాశద్వర్షాలవరకూ గడిచిన మహోజ్జ్వల జీవిత గాథ.**

ప్రథమ ఖండము

వెల రూ. ౩/—

౧౯౪౬ ఆగస్టు ౨౩ వ తేదీనాడు శ్రీ ఆంధ్రకేసరి జన్మదినోత్సవ సందర్భంలో వెలువడింది.

## 'ఆంధ్ర శిల్పి'

ఆంధ్ర సాహిత్యానికీ, లలిత కళలకీ, సంస్కృతికీ దోహదమిచ్చే సచిత్ర మాస పత్రిక

సంపాదకులు :

**వి. ఆర్. చిత్రా**

**పి. గణపతి శాస్త్రి**

సాలు చందా ౯ రూపాయలు

విడి కాపీ ౧౨ అణాలు.



రాబోవు

## 'శిల్పి' ప్రచురణలు

ఆంధ్రకేసరి

శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు

రచించిన

౧. 'నా జీవిత యాత్ర' ద్వితీయ ఖండము
౨. యోగసూత్ర సిద్ధాంతము
౩. ఈశావాస్యోపనిషత్తు
౪. ప్రశ్నోపనిషత్తు
౫. కఠోపనిషత్తు.
౬. భగవద్గీతా భాష్యము

---

వివరాలకు :— మేనేజరు :

'ఆంధ్ర శిల్పి'

౧౦, నరసింగపురం వీధి,

మౌంటు రోడ్, మద్రాసు.

# ఆంధ్రశిల్పి



# ఆంధ్రశిల్పి

## సచిత్ర మాస సంచిక

సంపాదకులు :

వి. ఆర్. చిత్రా: పి. గణపతిశాస్త్రి

౧౦, నరసింగపురం వీథి,

మౌంట్ రోడ్, మద్రాసు.

# విషయానుక్రమణిక


| | | | పుట. |
|---|---|---|---|
| సంపాదక సమీక్షలు | | సంపాదకులు ... | ౩ |
| కవిప్రియ ... | ... | శ్రీ శివశంకరశాస్త్రిగారు | ౭ |
| శివతాండవము ... | ... | శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులుగారు | ౯ |
| జీవతంత్రి ... | ... | శ్రీ పువ్వాడ శేషగిరిరావుగారు | ౧౩ |
| అనాధగీతం ... | ... | శ్రీ అనిసెట్టి సుబ్బారావుగారు | ౧౬ |
| దృశ్యచిత్రాలు ... | ... | శ్రీ సంజీవదేవ్ గారు ... | ౧౭ |
| ప్రతిఫలం ... | ... | శ్రీ 'సంపత్' గారు ... | ౨౧ |
| శిల్పము ... | ... | శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు ... | ౩౦ |
| మనకా మతాభిమానం | ... | శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు | ౩౮ |
| వీణాచార్య శ్రీ సంగమేశ్వరశాస్త్రి | | శ్రీ ధన్వూరి నరసరాజుగారు | ౪౩ |
| MUSINGS ... | ... | శ్రీ 'చలం'గారు ... | ౪౭ |
| చిత్ర వివరణము ... | ... | శ్రీ టి. యస్. శ్రీనివాసన్ గారు | ౫౧ |
| గ్రంథ విమర్శనము | ... | ... ... | ౫౩ |
| గ్రంథ స్వీకృతి ... | ... | ... ... | ౫౪ |


## శిల్పాలు


| | | |
|---|---|---|
| ముఖచిత్రము ... | ... | శ్రీ పిలకా లక్ష్మీనరసింహమూర్తిగారు |
| త్రివర్ణచిత్రము ... | ... | శ్రీ సి. యస్. వాసుదేవన్ గారు |
| కొంగలజంట, తోడేలు ... | ... | శ్రీ రొమేన్ చంద్రచక్రవర్తిగారు |
| వెదురుపొద ... | ... | శ్రీ అర్ధేందుప్రసాద బెనర్జీగారు |
| మూర్తిచిత్రణము ... | ... | శ్రీ నందలాల్ బోసుగారు |
| గృహిణి, పల్లెపట్టు ... | ... | శ్రీమతి జమునాబోస్ గారు |




ఊర్ధ్వ నృత్యము

శ్రీ సి. యస్. వాసుదేవన్ గారు

# ఆంధ్రశిల్పి

## సంపాదక సమీక్షలు

### మద్రాసు ప్రభుత్వం వస్త్రోత్పత్తి విధానం

మద్రాసు ప్రభుత్వం వస్త్రోత్పత్తివిధానం మీద రేగుతూన్న గాలి దుమారాలకి అంతూ దరీ కనబడడం లేదు. అసలు గాంధీజీ ౨౫ ఏళ్ళ క్రిందట ఖాదీసందేశం వినిపించినప్పుడు బయలుదేరవలసిన వాదోపవాదాలు ఇప్పుడు బయలుదేరడం చాలా ఆశ్చర్యకరమైన విషయము !

అసలు ఈ సందర్భంలో ముఖ్యంగా కొన్ని ప్రధానవిషయాలు విస్మరించడానికి వీల్లేదు. మనం ఈ వస్త్రోత్పత్తి విధానం కేవలం తాత్కాలిక ప్రయోజనాలకోసమే కాక భావిభారత పారిశ్రామిక దృష్టితోకూడా పరీక్షించవలిసి ఉంది. ఆ పారిశ్రామికవ్యవస్థ పునాదిగా ఉంచుగుని మనం నేటి వస్త్రోత్పత్తి విధానం సరిదిద్దుకోవాలి. ఈ విధమైన ఏర్పాటువల్ల తాత్కాలికంగా కొన్ని యిబ్బందులు కలిగినా భరించకతప్పదు.

భారతదేశంలో అసంఖ్యాకంగాఉన్న పల్లెటూళ్ళలో వ్యవసాయదారులకి సంవత్సరంలో చాలకాలం చేతినిండా పనిదొరకడం లేదు. ముఖ్యంగా పల్లీయులందరికీ చేతినిండా పని కల్పించి, వారి దైనందినాదాయం వృద్ధిపొందించాలి. దీనికోసం గృహపరిశ్రమలు బాహాటంగా అభివృద్ధి పొందించాలి. వస్త్రపరిశ్రమ మనరాష్ట్రంలో ప్రధాన గృహపరిశ్రమ కాగలదనడంలో సందేహంలేదు. మనరాష్ట్రంకృషిప్రధానమైనది కావడమే దీనికి కారణము.

అది అల్లాఉండగా పరిశ్రమలు కేంద్రీకరించడంవల్ల అనేకమైన అనర్థాలు కలుగుతున్నాయనీ అందుచేత వికేంద్రీకరణం(Decentralisation)

చాలా అత్యవసరమనీ విజ్ఞులైన ఆర్థికశాస్త్రవేత్తలు అంటారు. పల్లీ ప్రధానమైన మన దేశంలో ఈ వికేంద్రీకరణం చాలా ముఖ్యమైన విషయం. జపానులో ఈ వికేంద్రీకరణంవల్ల పారిశ్రామిక కలహాలూ మొదలైన సమస్యలు లేకుండాపోయాయనీ పరిశ్రమలు సర్వతోముఖాభివృద్ధి పొందాయనీ తెలుస్తుంది.

అయితే యంత్రపరిశ్రమవల్ల దేశసంపద అభివృద్ధిపొందినంతగా ఈ గృహపరిశ్రమవల్ల అభివృద్ధి పొందుతుందా ? అనేప్రశ్న బయలుదేరవచ్చును. మనం ఎప్పుడూ ప్రస్తుతం మనకిఉన్న ఈరాట్నాల మీాద నూలు తీస్తూ ఈమగ్గాలమీాదే బట్టలు నేసుకుంటూ కూర్చోవలసిన అవసరంలేదు. క్రమక్రమంగా గ్రామాలకి విద్యుచ్ఛక్తి సరఫరాచేసి తద్వారా రాట్నాలూ మగ్గాలూ ఆ విద్యుచ్ఛక్తివల్ల నడిచే ఏర్పాటుచేస్తే, రైతులకి ఈ వృత్తి వల్ల నికరమైన ఆదాయం ఏర్పడుతుంది. అంతేకాదు. అనేకమంది ఈ వృత్తులే ప్రధానంగా అవలంబించి జీవించడానికి అవకాశం కూడా ఏర్పడుతుంది, దీనివల్ల వేలాదివేల శ్రామికులు అనుదినమూ పట్టణాల్లో గుమిగూడి అనారోగ్యకరమైన పరిసరాల్లో జీవించవలసిన అవసరంకూడా తొలగిపోతుంది. దీనివల్ల భారతదేశానికి పునాదులైన పల్లెటూళ్ళలో నివసించేవాళ్ళకి నిరుద్యోగసమస్య చాలావరకు తొలిగిపోతుంది,

ఇప్పుడు మన దేశంలో చేనేతపరిశ్రమ దీనికి ఉదాహరణంగా తీసికోవచ్చును. దీనివల్ల పల్లీయుల నిరుద్యోగసమస్య కొంతవరకు పరిష్కరించగలిగాము. అయితే ఈ ఖాదీవిధానంవల్ల ప్రస్తుతంఉన్న చేనేతపరిశ్రమకి విఘాతంరాదా ? అనేప్రశ్న ఉదయించవచ్చును. ఈమధ్య ఒకచర్చల్లో శ్రీ భాష్యంగారు మాట్లాడుతూ ప్రస్తుతం మనరాష్ట్రంలో మిల్లుల్లో తయారయ్యే నూలంతా మన మగ్గాలకి చాలునన్నారు. అందుచేత ప్రస్తుతం ఉన్న మిల్లులకిగాని, మగ్గాలకిగాని ఈ విధానం వల్ల నష్టం ఏమీా రాదని తేలింది. అయితే క్రమంగా ఈ విధానంవల్ల పెద్ద పెద్ద వస్త్రయంత్రాల పరిశ్రమ నశించిపోయే పరిస్థితులు ఏర్పడవా ? అనవచ్చును. అల్లాంటి పరిస్థితులు ఏర్పడాలనే ఉద్దేశంతోనే ఈ విధానం అవలంబించబడిందని చెబుతున్నాము !

చేనేతపరిశ్రమ మోస్తరుగా వడకునూలుపరిశ్రమ మాత్రం పల్లీయులకి ఎందుకు సహాయకారి కాగూడదు? ఈ విధానం పూర్తిగా ఆచరణలో పెట్టడానికి కొంతకాలం పట్టవచ్చును. అంతవరకూ ఈ రాష్ట్రవాసులకీ తాత్కాలికంగా కొన్ని చిన్నచిన్న ఇబ్బందులు కలిగినా కలుగవచ్చును. భారతీయభావి నిర్మించుకునే ఈ సమయంలో తాత్కాలిక ప్రయోజనాలకోసం తప్పుడుదారులు తొక్కడం చాలా ప్రమాదాలకి దారితీస్తుంది. ఈ విషయంలో మద్రాసు ప్రభుత్వం దూరదృష్టితోనూ, ధైర్యంతోనూ అవలంబించిన ఈ వస్త్రోత్పత్తివిధానాన్ని మనసారా అభినందిస్తున్నాము.

## జనాబ్ జిన్నా వింత వైఖరి

ఈ మధ్య జనాబ్ జిన్నా ఒక చోట మతకలహాలని గురించి ముచ్చటిస్తూ ఆయారాష్ట్రాలలో ఉన్న అల్పసంఖ్యాక సంఘాల్ని ఆ సంఘాలు అధికసంఖ్యాకులుగా ఉన్నరాష్ట్రాలలోకి మార్చడంకన్న గత్యంతరం లేదన్నాడు. ఒక పక్కనించి పాకీస్థానంలో ఉన్న అల్పసంఖ్యాకులకి అన్ని విధాలా న్యాయం కలగ జేస్తామని చెబుతూ మళ్లీ ఇదేమిధోరణి! అసలు జిన్నా మనస్తత్వమూ పాకీస్థానువాదము మహమ్మదీయేతరుల మీద అవిశ్వాసంవల్ల ఆధారపడింది. అల్లాంటప్పుడు పైకి ఎన్ని ధర్మపన్నాలు చెప్పినా ఇతర మతస్థుల్ని లక్షలాదిగా ఒక రాష్ట్రంలోనించి మరి ఒక రాష్ట్రంలోకి మార్చడమే అతని దృక్పథానికి సరియైన పరిణామము! అయితే మద్రాసు మొదలైన రాష్ట్రాల్లో ఉన్న మహమ్మదీయులంతా జిన్నా ఆజ్ఞానుసారం తమ ఇళ్లూవాకిళ్లూవిడిచి మరి ఒక రాష్ట్రానికి వలస పోవడానికి సిద్ధంగా ఉన్నారా? ఒకవేళ అతని ఆజ్ఞప్రకారం అల్పసంఖ్యాకులంతా తాము అధిక సంఖ్యాకులుగా ఉన్న రాష్ట్రాలకి వలసపోతారనే అనుకుందాము! అప్పుడు మాత్రం ఆ హిందూస్థాన్‌కీ పాకీస్థానుకీ సామరస్యం ఎల్లాగ కుదురుతుంది? ఇది ఈ విధంగా ఎప్పటికీ తెగని సమస్య.

ఇన్నాళ్లనించీ కాంగ్రెసు కొంత సామరస్యంకోసం ముస్లింలీగుతో సంధిబేరాలకి దిగింది. కాని దానివల్ల అణువంతైనా ప్రయోజనం కలగ

లేదు. పైగా ముస్లింలీగు కేంద్రప్రభుత్వంలో ప్రవేశించినప్పటికీ మత కలహాలు మరింత హెచ్చు పెరిగాయి.

ఇంక కాంగ్రెసు ఒక నిశ్చితమయిన పద్ధతికి రావలసిన అవసరం ఏర్పడింది. ఇంక ముస్లింలీగుతో ఏవిధమయిన సంబంధమూ సంధీ లేకుండా కాంగ్రెసు స్వతంత్రంగా ఒకదారి తొక్కాలి. ఈ సమయంలో సహజంగా ఆంగ్లపాలకులు మహమ్మదీయులతో చేతులు కలుపుతారు. దీనిలో ఆశ్చర్యమేమీ లేదు. అయినా కాంగ్రెసు దానికి కూడా సిద్ధపడవలసిఉంది. భారతరాజకీయాలు ఒక అంతిమావధికి వచ్చాయి. ఈ సమయంలో కాంగ్రెసు నాయకులు దృఢమైనవిధానం అవలంబించి భారతజాతిని భద్రమార్గంలో నడిపించగలరని ఆశిస్తున్నాము. అవసరమైతే తమపదవులు విడిచి అంతిమ సమరానికికూడా సంసిద్ధులు కావాలని హెచ్చరిస్తున్నాము!

# క వి ప్రి య

కవిప్రియ అను పద్యనాటికలోని లేశము

(సాయంకాలము : పాఠశాలాభవనమున బిల్హణకవి యిటు నటు తిరుగుచు మెల్లగా పాడుచుండును.)

క వి

"అద్యాఽపి తాం ప్రథమసంగమ జాత లజ్జాం
నిధ్యాయతి వ్యతికరే మయి మందధీరం
సీత్కార కంపిత శిఖాతరల ప్రదీప్త
కర్ణోత్పలేన లసతీం సుదతీం స్మరామి!"

యా మి ని

వెనుకనుంచి చల్లగా ప్రవేశించి

సుదతి నెవ్వతెనో మహాసుందరాంగి
నర్ధమీలిత నయనులై అస్ఫుటాక్ష
రముల జపియించుచున్నవారలు మదీయ
జీవితేశులు! పే రేమొ చెప్పగలర!

క వి

మందహాసముతో

నేను స్మరియించుచున్నాను నిరుపమాన
విమల లావణ్య దేవతా విగ్రహమును!
వెలువడును వసంత తిలక వృత్త మామె
మధురనామమ్ము తలచినమాత్రముననె!
ఆ మహామాన్య నామధేయాక్షరములు
దేవతాత్రయ మట్లు దేదీప్యమాన
ములు మదీయేక్షణోత్సవమ్ములు లతాంగి!
రజని కాశబ్ద మగును పర్యాయపదము.

యామిని ప్రియుని కౌగిలించుకొనును

నాకు జూపగ నరుదెంచినావె తొలుత
ప్రియతమా, నేటిగోష్ఠిలో పెద్దలకడ

# ఆంధ్ర శిల్పి

నీవు పఠియింపదలచిన నిజరచనల ?
ఏమి లిఖియించినావో యీక్షింప నిమ్ము.

చేయి చాపును

యా మి ని

లోపములు లేవు పద్యాలలో త్వదీయ
కరుణచే జీవితేశ్వరా, కాని నాకు-
తలచుకొన్నంత మాత్ర- సాధ్వసము కలుగు
చదువలేనేమొ యని గురుజనుల మ్రోల.

క వి

కలుగుచున్నది యించుక కంప మెడద
లోన ప్రాణప్రియా, గోష్ఠిలోన నీవు
సక్రమమ్ముగ తుదిదాక చదువగలవొ
పద్యముల, నెచ్చటే నట్టుపడుదు వేమొ.
మరియు నిం కొకభీతి : ఏ మాత్ర మైన
వర్ణనల గాని హావభావముల గాని
జీవితేశ్వరి, అనురాగ చిహ్న దీప్తి
పొడమగూడదు సుమి బుద్ధిపూర్వకముగ.

యా మి ని

నాకు దెలియునుగా మనోనాథ, యిట్టి
సమయముల జాగరూకత సముచిత మని
కాని యెడనెడ మీవిలోకనముతోడ
శిష్యురాలికి నుత్సాహసిద్ధి యగును.

ఆలింగనము చేసి


అస్మదాచార్యునకు జయం బగును గాక !
ఆత్మవల్లభునకు శుభం బగును గాక !

క వి

ఆమె శిరస్సు మూర్కొని వీపు తట్టి

శిష్యురాలికి శుభజయసిద్ధి రస్తు !
ప్రాణకాంతకు మంగళప్రాప్తి రస్తు !

శ్రీ శివశంకరశాస్త్రి
సాహితీసమితి



కొంగల జంట

శ్రీ రామేన్‌చంద్ర చక్రవర్తిగారు



తోడేలు

శ్రీ రామేన్‌చంద్ర చక్రవర్తిగారు

# శివతాండవము

౧౦

తరితీపువెన్నెలలు విరిసికొన్న విధాన
నెఱజాదులవికప్పు నెఱసికొన్న విధాన
తెలిబూది పూత తెట్టులు గట్టిన విధాన
చలకొండ మంచుగుప్పలు గూర్చిన విధాన
పొసఁగ ముత్తెపు సరులు, పోహళించు విధాన
అసదృశము నమృతంబు నామతించు విధాన
ఘనసారమును దెచ్చి కలయఁజల్లు విధాన
మనసులో సంతసము — కనులజాఱు విధాన
కులుకుసీలపు కండ్లఁదళుకు చూపులు బూయ
ఘలుఘల్లుమని కాళ్లఁ జిలిపిగజ్జెలు మ్రోయ
ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

౧౧

మబ్బుగము లుబ్బుగొని ప్రబ్బికొన్న విధాన
నబ్బురపు నీలములు లిబ్బిసేరు విధాన
నల్లగలువలు దిక్కులెల్ల విచ్చు విధాన
మొల్లముగఁ దుమ్మెదలు మొనసికొన్న విధాన
వగలు కాటుకగొండ పగిలి చెదరు విధాన
దగిలి చీకటులు గొప్పుగఁ గప్పెడు విధాన
దనలోని తామసము గనులజాఱు విధాన
దనలోని వక్రతయె గనులఁ దీఱు విధాన
గులుకుసీలపు కండ్లఁదళుకు చూపులు బూయ
ఘలుఘల్లుమని కాళ్లఁ జిలిపిగజ్జెలు మ్రోయ
ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

౧౨

తమ్ములై, ఘటితమోదమ్ములై సుకృతరూ
పమ్ములై, శాస్త్రభాగ్యమ్ములై, నవకోర
కమ్ములై, వికచపుష్పమ్ములై, తుమ్మెదల
తమ్ములై, భావమంద్రమ్ములై, హావపు
ల్లమ్ములై, నూతనరత్నమ్ములై, వల్గుహా
సమ్ములై, కన్గొనలసొమ్ములై, విశ్రాంతి
దమ్ములై, రక్తకిసలమ్ములై, రక్తి చి
హ్నమ్ములై, తంద్రగమనమ్ములై, గెడగూడి
కులుకునీలపుకండ్లఁ దళుకుచూపులు బూయ
ఘలుఘల్లుమని కాళ్లఁ జిలిపిగజ్జెలుమ్రోయ
ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

౧౩

తరగలను చిరుగాలి పొరలు లేచినయట్లు
చిరుగాలిలో తమ్మి విరులు గదిలినయట్లు
విరులలోనునుతావి తెరలు లేచినయట్లు
తెరలపై చిత్రాలు పరిఢవించినయట్లు
కమ్మకస్తురివీణె కడిగివిడిసినయట్లు
నెమ్మిదన పింఛమ్ము నెమ్మివిప్పినయట్లు
చిగురుటాకులుగాలి వగలువోయినయట్లు
నగవులో లేవగపు బిగువుజారినయట్లు
ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

౧౪

మొగలి పూవులుదావి బుక్కిలించినయట్లు
తొగకన్నె నీలంపు నగవుజార్చినయట్లు
నవవసంతపుశోభ భువినప్పిగొన్నట్లు
శివుచెంత శర్వాణి సిగ్గుజారినయట్లు

# శివతాండవము

కన్నెమది కోరికలకలలు దూకినయట్లు
సన్నజాజులతేరు సంధానమైనట్లు
పచ్చిసంపెంగపూలు పరవులై పడినట్లు
అచ్చెరువురూపుగొని యాక్రమించినయట్లు
కులుకుసీలపుగండ్ల దళుకుజూపులుబూయ
ఘల్లుఘల్లుమని కాళ్ల జిలిబిగజ్జెలుమ్రోయ
ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

౧౩

నగవులే నగవులై బిగువులే బిగువులై
సొగసులే సొగసులై చూడ్కులే చూడ్కులై
తొలుకారు మెఱుపుల్లు దోబూచులాడినట్లు
తొలిచూలి కన్నెకోర్కులు విచ్చుకొన్నయట్లు
తొలుసారిరతి వింతసొలపుగ్రమ్మినయట్లు
తొలిగట్టుపై జొత్తు బులకరించినయట్లు
తొలిసంజలోఁ దెల్వి దూకివచ్చినయట్లు
మలుసంజలో శాంతి మరలిపోయినయట్లు
కులుకుసీలపుఁగండ్ల దళుకుజూపులుబూయ
ఘల్లుఘల్లుమని కాళ్ల జిలిబిగజ్జెలుమ్రోయ
ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

౧౬

తీగలై, సోగలై, తీరుకొని బారులై
మూగుకొనిజొంపమై మురిపెంపుదారులై
మలకలై మొలకలై మలపుగొని నేరులై
పొలపంబు వెలయించి పూలతోలు బారులై

౧౧

# ఆంధ్రశిల్పి

ముడులుగొని సుడులుగొని మొగుడుకొని మొగ్గలై
జడిమగొని తడబడుచు వడికి కడుఁదగ్గులై
చలువగొని కెలకులను నెలవుకొని మూఁగలై
పిలపిలమటంచుఁ దావులు మూఁగ బాగులై
కులుకు నీలపుగండ్ల దళుకు జూపులుబూయ
ఘల్లుఘల్లుమని కాళ్ల జిలిబిగజ్జెలుమ్రోయ
ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

౧౭

మలకమెఱుపులుగొన్ని – నిలువుమెఱుపులుగొన్ని
సొలపుమెఱుపులుగొన్ని – సూదిమెఱుపులుగొన్ని
కోలమెఱుపులుగొన్ని – క్రొత్తమెఱుపులుఁగొన్ని
చాలుమెఱుపులుగొన్ని – జాఱుమెఱుపులుగొన్ని
ప్రక్కమెఱుపులుగొన్ని – సొక్కుమెఱుపులుగొన్ని
నిక్కుమెఱుపులుగొన్ని – నిండుమెఱుపులుగొన్ని
క్రేళ్లమెఱుపులుగొన్ని – క్రీటుమెఱుపులుగొన్ని
సుళ్ళమెఱుపులుగొన్ని – త్రుళ్లుమెఱుపులుగొన్ని
కులుకునీలపుకండ్ల దళుకుజూపులుబూయ
ఘలుఘల్లుమని కాళ్ల జిలిబిగజ్జెలుమ్రోయ
నాడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

౧౮

గఱులుగల యంపగమి కరణిఁదిరిగెడుఁగొన్ని
యరమోడ్పుఁ గనుదోయి నణఁగిపోవును, గొన్ని
యుయ్యాల తూఁగులై యూగులాడెడుగొన్ని
లేయెండవలె దట్టమైయేచు మఱిగొన్ని

* * * *

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు

# జీవతంత్రి

భారతదేశ చక్రవర్తి షాజహానుకు చతుర్థ పుత్రరత్నం ఔరంగజేబు—ఔరంగజేబు సింహాసన మెక్కగానే తన అన్నలు ముగ్గుర్ని అంతమొందించాడు. తన తండ్రిని చెఱసాలలో పెట్టించాడు. తండ్రి లలితకళోపాసకు డవటంచేత ఫిడేలు తనకు జీవిత తరణోపాయంగా చేసికొని చెఱసాలలో సంవత్సరములపై సంవత్సరములు త్రోసుకు వెడుతున్నాడు. ఇలా ఉండగా ఒకసారి తన ఫిడేలుకు తీగ ఒకటి తెగిందనీ క్రొత్త తీగ నొకదానిని దయసేయించుమనీ షాజహాను ఔరంగజేబుకు ప్రార్థన పంపుకొన్నాడు. ఔరంగజేబు అందు కనుమతింపకపైగా, తండ్రి చెఱసాలలో పెట్టుకొన్న చిత్తరువులూ, వాయులీనమూ (అంటే ఫిడేలు) నగలూ, దుస్తులూ, సర్వమూ ఒడిసి తీసుకురమ్మని తన కొడుకు మహమ్మదు సులతానును పంపాడు. మనుమడు తాతగారినుండి అవన్నీ ఒడిసికొని తీసికొనివెళ్లాడు.—ఈ కథ యిప్పుడు 'జీవ తంత్రి'అనే తాజ మహలు కావ్యభాగంలో చిత్రితమైంది.

బహు విధయుక్తి సువ్యంజిత ధాతువుల్ ప్రకృతిగానములోనఁ బలుకవేమొ?
తారక మధ్య మందరసువ్యవస్థితి ప్రకృతి గానము పట్టుపడవదేమొ?
ద్రుత మధ్య లంబితాదులుపట్టి తాళముల్ ప్రకృతి గానములోనఁ బడవాయేమొ?
అతుల గోపుచ్ఛాది యతులు మూఁడునుసాగి ప్రకృతి గానమునందుఁ బాఱవేమొ?

తత్త్వమోఘానుగత వాద్య తత్త్వవిధులు
ప్రకృతి గానములో సరిపడవాయేమొ
ప్రకృతి రమణీ సుధర్మాంక పాళిలోని
దివ్య వీణకు నొక తంత్రి తెగనాయేమొ?

గళితాశా ప్రవిషణ్ణా
కులచిత్తము బంధనాగ్నిఁ గుములఁగ బడుగై
లలిత కళాస్థాన మహా
త్కల పూర్వచరిత్రుఁ డొక ప్రకారము తోఁచెన్.

భరత ఖండేంద్ర పదమును బట్టి విడిచి
పుష్కలైశ్వర్యములు త్రావి పుక్కిలించి
యుమిసిన విరాగి రాగమ్ము తమి లపించి
భావమున నించెఁ బతిత పావన పదమ్ము.

తేనెల్ సోనలు సోనలై కురిసెనో, తేటైన ద్రాక్షాసవం
బానీతంబయి వాకలై మలఁగెనో, యాదివ్యగాంధర్వ గీ
తీనాదమ్ములు క్రోవులై విరిసెనో, తీపారు తత్కన్నరీ
వీణానాదము మూర్తమయ్యెనో, యనం బెందీపు లూరించుచున్.

అల తొలినాళ్ల నా మహజహాల్ లపియించు నిశాంత గీతికన్
కిలకిల లాడియాడి తమకించి నటించిన యామునాపగా
శిలలఁటె యీదృశంబుగఁ గృశించి ద్రవించి స్రవించి కాకలీ
కలకలనాద రోదనము గల్పెడి నేఁటి విషాద గీతికన్.

పలు తొలియేండ్ల నెయ్యముల పాఁతు లగల్చి పెకల్చు తియ్య తీ
పుల పతిపాటలల్ మునుపు పొంగిన యా ప్రియురాలు తాజి, యా
విలగతి భగ్నగీతి విని వెల్వెలఁ బోవుచు నేఁడు దుఃఖ వా
ర్మలిన ముఖాబ్జయై యెడద అంపఁపుఁ గోతఁకు నిచ్చికుయ్యిడున్.

కుహుకుహూహు కుహుగానసంగతులు వాగుల్ వాఱఁ బూర్వమ్మున
త్సహకారాగ్ర కిసాల యాశనము పెల్చంగ్రోల్చి రెట్టించెఁ బ్ర
త్యహముల్ భూపసుధాశనాలపిత దీవ్యద్గీతికా మాధురిల్
రహిఁ, నేఁడో కొసరంగఁ బోవ దది ప్రారబ్ధమ్ము మున్నాడుటల్.

మొదలినఁ జాలుఁ దక్కఁధను మేకొని తండ్రికిఁ జేర్చు నమ్మహా
మ్మదు సులతాను పితామహుని మైమయి నిల్చి కనం దొడంగె, న
మ్ముదుసలి వెల్లుప్రోవు కనుబొమ్మల నల్లన నెత్తి కొల్లఁగాఁ
జెదరిన పెన్నరల్ పొదువు చిక్కని చూపులుచిమ్మి యిట్లనున్.

“ఓయీ! ప్రభువేమనె? నీ
వాయు విలీనమ్ము తీవ్రవస్నెఁ గళాస్థా
నాయతనమ్ముం దంత్రిక
నే యొక్కండేని యాజ్ఞ నిమ్మంటిఁగదా!

త్రెస్సిన ప్రాణతంత్రి, తెగఁద్రెక్కొని నీరసమౌ నెలుంగు, పైఁ
గ్రుస్సిన మేని త్రెవ్వన, యరుంతుదమైన విరాగ, మెంతయున్
డస్సిన యంతరంగమును నావలెఁ దాల్చి కళావిహీనమై
యున్నరు గాడుపుల్ చెలఁగుచున్నది నా తుదితోడు పాటిదై.

జీవన శేషమల్పము, విశీర్ణ మదాత్మకు శాంతినున్న, యీ
జీవనతంత్రి మేళనము సేయఁగఁజాలిన తంత్రి తెమ్మ, నా
జీవిక నెల్లఁబుచ్చు, నెది సేయని సాంత్వన మద్దిసేయు, రా
రా వచియింపురా, ప్రభువు నానతి సెప్పుమురా! కుమారకా!”

# జీవతంత్రి

అని దురపిల్లి యుమ్మగిలినట్టి యెదం బొదువఁగవచ్చు భా
వ నివహ మొయ్యనొయ్య నిలుపన్ నిలుపం బ్రయతించు షాజహా
నును మనుమండు డగ్గఱి వినూతన మాజ్ఞ నొకండు చెప్ప కా
పిన మతి బాహిరించి పెదవిం గదలించియు మిన్నకుండినన్.

ముదుసలి వగ్గు చూపులు మోసుల సూత్రము పట్టి 'ఏమిరా!
యెదొ వచియింపనోడెదు, వచింపుమురా! యరయేలరా? మహా
మ్మదు సులతా' నటంచుఁ దఱుమం దఱుమం బొరదూసి విచ్చి నె
మ్మది గల రాజునాజ్ఞ నొకమై వచియించె నిటుల్ కలంగుచున్.

రవల కిరీట మూనిన శిరమ్ము ధరాఘ మహాసనమ్ము, భూ
ధవ భుజభార మూడ్పగల దక్షుఁడు పుత్రుఁ డొకండె, జ్ఞాన వై
భవ మొసగంగ దక్షుఁడు ప్రవక్త యొకండె, సుతుండు దూత మే
మపుట ఘటిల్లె, స్వాస్థ్య మిఁక నందక డెందము కందు వార్చెదే?

పొగిలెదవేల పూర్వసుఖ పుంజములం దలపోసికొంచు? రా
జగు నతఁ డట్టె యూడిపడి స్వామ్యములం గొనిరాఁడు, తోడ నే
లగఁ గొనిపోఁడు, కూడిన యిలా ధనముల్ పదిలమ్ము సేసి వ
చ్చిగఁ బ్రజయాత్రఁ బోనడిచి చెందుఁ గృతార్థత స్వార్థ మొద్దుచున్.

అది యంతే నెఱనెమ్మిగద్దె కధిపుం డౌ నెవ్వఁ డవ్వానివే
గద నీ పేటికనిండ భూషలును ముక్తా విద్రుమ శ్రేణియున్
తుది నీ పూను సమాజె పేరులును 'దుస్తుల్ వాయులీనమ్ము నీ
మది కింపందగు సర్వ చిత్రములు నిమ్మా' యంచు రాజాడెడిన్.

అని మనుమఁడు రాజాజ్ఞను
వినుచునె తడవుఁగను రాజభృత్యుఁడు కార్యం
బును శిరసా వహియింపఁగ
మునుకొని ముదిగాజు ముందు పొన్పడి నిలిచెన్.

శ్రీ పువ్వాడ శేషగిరిరావు.

# అనాధగీతం

ఎందుకు తల్లీ ! నన్నీ
వింతమానవుల అడివిలో
విడిచి వెళ్ళి పోయావు !
పగలులేచు పడగెత్తిన
పగతీర్చు కునేపామై—
రాత్రి రక్కసయి విసురును
తళతళమను బల్లెములను—
కడుపులోన గర్జించే
భక్షించే ఆకలిపులి !
మెడచుట్టూ పాశములై
శపిస్తున్న పసికందులు !
చుక్కల లోతులుకొలిచే
శోధకునకు కానివాణ్ణి !
ఆనంద మనంతమనే
వేదాంతికి కానివాణ్ణి !
అందరి కన్నము విడిచే
అన్నలకే కానివాణ్ణి !
సాగిన బంగరు తీగెల
చనును కాలమే వారికి !
ఘడియ ఘడియ గండముగా
నిప్పుల గుండమ్ము నాకు !
నా ఎముకలు కాలిపోవు
నాగరికుల చలిమంటలో !
నా నెత్తురు కారిపోవు
నాగరికుల చలివేంద్రలో !
ఇంటిని పెద్దన్నను—
నన్నొంటిగ హతప్రాణినిగా
వింతమానవుల అడవిలో
విడిచితి వెందుకు తల్లీ !

శ్రీ అనిసెట్టి సుబ్బారావు.

# దృశ్య చిత్రాలు

## శ్రీ సంజీవదేవ్

ఈ అనంత విశ్వంలో ఎటుచూచినా నయనానందాన్ని కలిగించే ప్రకృతిదృశ్యాలకు రంగుల్లోనూ, రేఖల్లోనూ రూపం ఇవ్వటంలోనూ, ఆ ఇచ్చిన రూపాన్ని ఆనందించటంలోనూ శిల్పికీ, సహృదయునికీ జనించే రసానుభూతి మానవమూర్తులను రచించి ఆనందించటంలో దొరికే రసానుభూతికి ఏవిధంగానూ తీసిపోదు. ప్రభాతకాంతులతో ఆరక్తమై ఉండే పూర్వాగంతం కానీ, సంధ్యాకాంతులతో వెలిగే పశ్చిమదిగంతం కాని ఏ రసహృదయాన్ని ప్రకంపితంచేయదు? నవవసంతంలో ప్రకృతిలో కలిగే నవచైతన్యం ఏ చిత్రకారుని హృదయంలో నూతన రూపకల్పనను రేకెత్తించదు? ఒక అంతులేని ఎడారిలోని నిర్జీవత్వాన్ని భంగపరుస్తూ ఒకటిరెండాకులతో నిల్చునివుండే ఒక ఏకాంతవృక్షాన్ని చూడడంలో కాని, చిత్రించటంలో కాని కలిగే ఆహ్లాదం, భావవిలాసంతో ఉత్ఫుల్లమై ఒక సుందర మానవాకృతిని చూడటంలో కాని, చిత్రించటంలో కాని కలిగే ఆహ్లాదానికి ఏమాత్రమూ తగ్గదు.

మూర్తిచిత్రణ మనుష్యత్వంలో అంతర్భూతమైన భావమాధురిని వ్యక్తపరిస్తే దృశ్యచిత్రణ ప్రకృతిలో అణిగిఉన్న నీరవసంగీతాన్ని వినిపిస్తుంది. ఒకదాని విలువకంటె ఒకటి తీసిపోదు. శిల్పపరిణతికి రెండూ అవసరమే. విచిత్రమైన కొండలూ కోనలూ, వాగులూవంతలూ, మఖమలులాంటి పచ్చికతో పచ్చబారిన భూమి, నీలమణిలాగ ప్రకాశించే ఆకాశం, వర్షారంభంలో తేలియాడే మేఘఖండాలు, శారద ప్రభాతాలూ, శిశిరసంధ్యలూ, ఇవన్నీకూడా శిల్పిమానసాన్ని ఆకర్షించి అతని కుంచెద్వారా రేఖల్లోనూ రంగుల్లోనూ రూపొందుతాయి. ఈ దృశ్యచిత్రకారులకు ప్రకృతంతా చైతన్యమయమై తన మౌనగానంద్వారా వారి హృదయవీణను మ్రోగిస్తుంది.

ఈ దృశ్యచిత్రాలు పాశ్చాత్య కళాజన్యం అనే భ్రమ కొందరిలో వ్యాప్తమైవున్నది. ఇది వాస్తవం కాదు. దృశ్యచిత్రకళ ప్రథమంలో జన్మించింది చీనాదేశంలో. క్రీస్తుశకం ఏడవ శతాబ్దప్రాంతంలో, చీనాలో రాజ్యాధికారంలోవున్న 'తాంగ్' వంశీయుల పోషణక్రింద దృశ్యచిత్రకళ ఉద్భవించి, పదవ శతాబ్దంనుండి పదమూడో శతాబ్దంవరకూ అధికారంలోవున్న 'సంగ్' వంశీయులకాలంలో అమితమైన ఉన్నతిచెందింది. ప్రథమంగా 'తాంగ్' కాలపు చిత్రకారుడైన ఉతావ్-చు అనువానికి దృశ్యచిత్రకళ దానంతది ప్రత్యక్షమై అతనిద్వారా చిత్రించబడిందని ఒక చైనీయగాథ. ఈ చిత్రకారుని అలౌకిక చిత్రశక్తిని తెలిపే గాథకూడ ఒకటున్నది. చక్రవర్తియొక్క బలవంతంపై యీ చిత్రకారుడు రాజప్రాసాదంలోని గోడపైన ప్రకృతిసౌందర్యం తొణికిసలాడే ఒక దృశ్యచిత్రాన్ని చిత్రించాడట. ఆ దృశ్యచిత్ర సౌందర్యానికి చక్రవర్తి సమ్మోహితుడైపోయినాడట! అంత, ఆ చిత్రకారుడు చక్రవర్తియొక్క చేయి పట్టుకొని ఆగోడపై చిత్రించిన పర్వతపు గుహలోకి ప్రవేశించాడట. అంతటితో అదృశ్యమైపోయినారట ఉభయులూ ఆ గుహలో. ఈ గాథ చీనావారిలో దృశ్యచిత్రాలపైగల భక్తిగౌరవాలను తెలియచేస్తుంది.

పాశ్చాత్యదేశాల్లోకి పదహారు పదిహేడు శతాబ్దాల్లో కాని దృశ్యచిత్రకళ అడుగుపెట్టలేదు. దృశ్య

సుమారమైన విశాలప్రదేశాలూ ఒక అలౌకికమైన అస్పష్ట వాతావరణంతో కూడుకొని స్వప్నజగత్తులోని మాయాపురివలె గోచరిస్తుంటవి. చెట్లను పర్వతాలకు వెంట్రుకలవలె చిత్రిస్తారు వీరు. చెట్లులేని కొండలు జుట్టులేని తలలు అనుకుంటారు వీరు. చీనా దృశ్యచిత్రం మూడు ప్రదేశాలుగా విభజింపబడుతుంది; దీనిని 'స్వర్గం,' 'భూమి,' 'మనిషి,' అని పిలుస్తారు. మొదటిది చిత్రంలోని సుమారమైన అస్పష్ట పృష్ఠభూమి, రెండవది అంతకంటె స్పష్టతరమైన మధ్యప్రదేశమూ, మూడవది బాగా విశదంగా చూపబడిన సమ్ముఖప్రదేశమూ. ప్రథమంగా సిరాతో రేఖలను గీచి తదుపరి సున్నితంగా వర్ణలేపన చేస్తారు. ఇదంతా ఎక్కువ భాగ పట్టుబట్టపైనే. తమ దృశ్యచిత్రాల్లో ఒక లోకాతీత మాధుర్యాన్ని సృష్టించే అందుకై ఎక్కువ భాగం చైనికశిల్పులు తమ చిత్రాల్లో ఏకవర్ణప్రయోగాన్నే చేసేవాళ్ళు. నేడు యీ 'సంగ్' కాలీన దృశ్యచిత్రాలు యావత్తూ యూరపులోనూ, అమెరికాలోనూ సంగ్రహించబడి వున్నవి. ఇప్పటికీ చీనాలో చాన్‌గ్-పాన్-చెలాంటి ప్రతిభగల చిత్రకారులు సంప్రదాయ ప్రకారం దృశ్యచిత్రరచన చేస్తుంటారు.

ఇక భారతదేశంలో దృశ్యచిత్రాల విషయాని కొస్తే ప్రాచీనభారతీయ చిత్రకళలో కాని, తరువాతి రాజపుత్ర మొగలు చిత్రకళలో కాని కేవల దృశ్యచిత్రాల అస్తిత్వం గోచరించటం చాలా కఠినం. అజంతా మొదలైన కుడ్యచిత్రాలలో మూర్తిచిత్రణకు పృష్ఠభూమిగా అచ్చటచ్చట ప్రకృతి చిత్రాలు గోచరించినా కేవల ప్రకృతిచిత్రాలు మాత్రం గోచరించవు. ప్రాచీన గ్రంథాల్లో అచ్చటచ్చట దృశ్యచిత్రాల ఉనికిని వర్ణించినప్పటికీ అట్టి చిత్రావళిమాత్రం ఇంతవరకూ ఎచ్చటా కళా పరిశోధకుల కన్నుల్లో పడినట్లులేదు. మహా ఉమ్మగ్గ జాతక కథలో ఒక సౌధంలో గచ్చుచేయబడిన గోడలపై నదులూ, సముద్రాలూ, సుమేరుపర్వతమూ, హిమాలయాలూ, సూర్యచంద్రదృశ్యాలూ చిత్రితమై వున్నట్లు ఉదహరించబడివున్నది. పదకొండో శతాబ్దపు ఒక జైనగ్రంథంలో సూర్యోదయ చిత్రం ఒకటి రంగుల్లో చిత్రించబడివున్నదని ప్రసిద్ధ శిల్పసమీక్షకుడగు రాయకృష్ణదాసు తన భారత చిత్రకళా చరిత్రలో ఉదహరించాడు.

భారతీయ చిత్రకళలో కేవల దృశ్యచిత్రాలు ఎచ్చటైనా మచ్చుకు కొన్ని దొరికినప్పటికీ కేవల దృశ్యచిత్రణ భారతకళా సంప్రదాయంలో వ్యాప్తి చెందలేదనే చెప్పాలనొస్తుంది. ఇందుకు కారణం భారతీయులు ప్రకృతికంటె మానవునికి ప్రధాన స్థానం ఇవ్వటమె. భారతీయులు ప్రతివిషయాన్నీ మానవరూపంలో చూడటాని కిష్టపడేవారు. నిరాకారమనబడే దైవానికి కూడ మానవాకృతి కల్పించటంలో వీరు వెనుకాడలేదు. అటువంటప్పుడు ప్రకృతిని ప్రకృతిగామాత్రమే చిత్రించటం ఏవిధంగానూ సంభవించదు. నిజంగా భారత శిల్పానికంతకూ హిమాలయాలే మహాప్రేరణ అని హావెల్ మహాశయుడు రుజువు చేశాడు. హిమాలయాలకు మించిన లీలానికేతనం ప్రకృతికి మరొకచోట లేదు. ఇటువంటి హిమాలయాలనే మహాప్రేరణగా కలిగిన భారతశిల్పంలో దృశ్యచిత్రణకు స్థానం లేకపోవటం నిజంగా మహాశ్చర్యకరం. కాని యదార్థానికి దిగితే హిమాలయాలు పర్వతరూపంలో కాక మరొక రూపంలో భారత శిల్పజగత్తులో ఓతప్రోతమై వున్నాయి.

భారతీయ చిత్రకళలో కేవల దృశ్యచిత్రాలు లేకపోవటానికి కారణం భారతీయశిల్పులు ప్రతి విషయాన్నీ చిహ్నరూపంలోనూ, రూపకంద్వారానూ ప్రదర్శించటమే. హిమాలయపర్వతాలను చిత్రించా

చిత్రకళ కేవలం ప్రాచ్యం. ప్రాచ్యమైనదంతా మహోత్కృష్టమైనదనీ, పాశ్చాత్యమైనదంతా పనికి మాలినదనీ అర్థంకాదిచ్చట. దేని గొప్పతనం దానికే వున్నది. పాశ్చాత్య దృశ్యచిత్రాలకు జన్మదాత క్లాడ్‌లొరెయిన్ అను ఫరాసుదేశీయుడు. ఇంతకు పూర్వం దృశ్యచిత్రకళ మూర్తిచిత్రకళకు కేవలం పృష్ఠభూమిగా మాత్రం అక్కడక్కడ ఉంటూ వుండేది. ఇప్పటినుండి దృశ్యచిత్రాలు ఒక స్వతంత్ర అస్తిత్వాన్ని స్థాపించుకున్నాయి. తరువాత డచ్చి వారు దృశ్యచిత్రాల్లో చాలా అభిరుచి కనపరుస్తూ వచ్చారు. కాని నిజానికి కాన్‌స్టెబిల్, టర్నరు ప్రభృతుల చేతుల్లోనే పాశ్చాత్య దృశ్యచిత్రాలు ఉన్నతి పొందాయి.

చీనాదేశంలో అంతప్రాచీనకాలంలోనే దృశ్య చిత్రాలు ప్రావిర్భవించటానికి కారణం చీనావారిలో జీర్ణించివున్న దృశ్యప్రకృతిపట్లగల భక్తిగౌరవాలే. చీనాలోప్రకృతి మానవునికంటె హెచ్చుస్థానం ఆక్రమించి ఉండేది. విశ్వసృష్టిలో ప్రాధాన్యం మనుష్యునికి కాదు ప్రకృతికి మాత్రమే, అనే ధార్మికవిశ్వాసం చీనావారికి ఐతిహ్యం. వారు పర్వతాలను ప్రత్యేకశ్రద్ధతో పూజిస్తారు. ఈ దృశ్యావళిలోనే చీనాదేశీయ ఆధ్యాత్మికతంతా అంతర్లీనమై వుంటూవుండేది. నిజానికి సమతలాలకంటె పర్వతాలవంటిఉన్నతప్రదేశాల్లోని వాతావరణంలో ఒకవిశేష శక్తివుంటుంది. ఇది ఉన్నతమైన పర్వతప్రదేశాల్లో సంచరించినవాళ్ళందరికీ అనుభవంలోనిదే. ప్రతి పర్వతశిఖరమూ దానిఎత్తు ననుసరించి కొంత విశిష్ట శక్తిని కలిగివుంటుంది.

భారతదేశంలో మానవునిది ప్రధానస్థానం. చీనాలో ప్రకృతిదే ప్రధానస్థానం. ప్రకృతిని కూడ మానవరూపంలోనే చూడటం భారత సాంప్రదాయం, మానవునికూడ ప్రకృతిరూపంలోనే చూడడం చీనా సాంప్రదాయం. ఇలాంటి ప్రకృతిపూజ చీనాలో వ్యాప్తిలో వున్నప్పుడు దృశ్యచిత్రకళ చీనాలోనే ఉద్భవించిందనటంలో ఆశ్చర్యం లేదు. దృశ్యచిత్రకళా చరిత్రలో 'సంగ్' కాలం (క్రీ. శ. ౯౬౦-౧౨౭౯) మహోజ్వలమయింది. చీనావారు దృశ్యచిత్రాలను రచించటంలో ఒకప్రత్యేక ఆచారాన్ననుసరించే వాళ్ళేకాని ప్రకృతికి ప్రతిబింబాలను తయారుచేసేవాళ్ళుకాదు. ప్రకృతిదృశ్యాన్ని చూచినప్పుడు శిల్పి హృదయంలో జనించిన రసరూపాన్నిమాత్రమె చిత్రించేవాళ్ళే కాని ప్రకృతిదృశ్యాన్ని ఉన్నదున్నట్టు చిత్రించేవాళ్ళుకాదు. దృశ్యం కేవలం వస్తుగత సత్యం మాత్రమేకాక వ్యక్తిగత రసానుభూతి మిశ్రితమై వుండేది. అనవసర ఆడంబరాన్ని విసర్జించటం అనే సూత్రంపై ప్రత్యేకశ్రద్ధ చూపసాగారు చీనాలోనూ, వీరిననుసరించి జపానులోను. దూరప్రాచ్య శిల్పమంతా ఈ 'అనవసర వస్తువిసర్జన' పైనే ఆధారపడివుంటుంది. సాధ్యమైనంతగా బాహుళ్యాన్ని వర్జించి తమ కళాసృష్టిని ఎంత సాదాగా, వ్యంజన మాత్రంగా చూపకలిగితే అది అంత ఉత్తమం అనే ఆచారానికి బద్ధులైవుండేవారు చైనీయశిల్పులు. రూపానికి సాధ్యమైనంత భౌతికభారాన్ని తగ్గించచూచేవాళ్ళు.

చీనావారి 'సంగ్' కాలీన దృశ్యచిత్రాలు ప్రపంచ దృశ్యచిత్రకళకే శిరోమణులు. ఇవి కేవలం బాహ్యప్రకృతికి ప్రతిబింబాలూకావు, అంతర్జగత్తులోని ఊహా చిత్రాలూకావు. ప్రకృతిలోని భౌతిక రూపం శిల్పియొక్క భావజగత్తులో పోతపోసిన రసరూపాలు వీరి దృశ్యచిత్రాలు. వీరి చిత్రాల్లో అత్యున్నతమైన గిరిశిఖరాలూ, లోతైనలోయలూ,

లనుకొంటే ఆ హిమాలయాలలోని విశేషాలనన్నిటిని కలిపి ఒక మూర్తికల్పనచేసి ఒక దివ్యగుణమయమగు మానవవ్యక్తిగా చిత్రించేవాళ్ళు. నదులను చిత్రించాలంటే ప్రవాహరూపంలోకాక ఒక స్త్రీరూపంలో చిత్రించటం, ఇలాంటి అభ్యాసంవల్ల భారతీయ చిత్రకళలో స్వతంత్ర దృశ్యచిత్రాలు లేకుండా పోయినవి. ఇంత మాత్రంచేత భావరూపాత్మకమైన భారతకళ యొక్క ఔన్నత్యాని కేమీ భంగం వాటిల్లలేదు.

అవనీంద్రుని అసాధారణ ప్రజ్ఞవల్ల కలిగిన నవచైతన్యంవల్ల నవ్యభారత చిత్రకళలో ప్రాచీన సాంప్రదాయాన్ని అనుసరించటానికి తోడు అభినవ రీతులుకూడ వ్యాప్తిచెందినవి. ఇందులో దృశ్యచిత్ర రచన ఒకటి. నవ్యభారత చిత్రకళలో మూర్తి చిత్రణంత ఉన్నతిగాంచక పోయినా దృశ్యచిత్ర రచన బాగానే సృష్టించబడుతున్నది. ప్రత్యేకం దృశ్యచిత్రాలనే రచించటానికి తమ ప్రతిభను ఉపయోగపరచే వారిలో వంగీయుల్లో వీరేశ్వర సేనూ, ఆంధ్రుల్లో భగీరథి గారొకరూ కనిపిస్తున్నారు. ఇంకా ఇతర ప్రతిభావంతుల నేకులు అత్యుత్తమమైన దృశ్యచిత్రాలను రచించారు. వి. ఆర్. చిత్రా గారు రచించిన హిమాలయ దృశ్యాలు ఒక విశిష్ట రేఖతోను, ఒక ప్రత్యేకరంగుతోనూ రసానందమయంగావున్నవి. వీటిని "Enchanted Himalayas" అను పేరుతో చక్కగా ముద్రించి దృశ్య చిత్రకళకు చాల సహాయపడ్డారు శ్రీ చిత్రా గారు.



# ప్రతిఫలం

"సంపత్"

నీకీ ఉత్తరం వ్రాయాలని చాలారోజులుగా అనుకుంటున్నాను. కానీ నేనేం చెయ్యను? చెరసాల అధికారులు నెలకో సారిగాని వ్రాయనివ్వరు. అయినా ఏం రాయాలి? ఇక్కడి మా బ్రతుకంతా గానుగు తిరుగుడు కదా అని అంటావేమో! కానీ ఇక్కడకూడా ఒక్కొక్కప్పుడు ఎంత చిత్రమైన సంఘటనలు వొస్తాయనుకున్నావ్? అవతలివాళ్ళ కెప్పుడూ రానివి! ఈ జీవితాన్ని గూర్చి పైవాళ్ళకేమీ తెలీదు. చివరకి ఒకళ్లొకళ్లు ఆత్మకథలు చెబుతూ ఉంటే చాలు. నాకగాధమైన సముద్రాలలోకి దిగి రత్నాలు ముత్యాలు కాళ్ళకింద తగులుతూ నడుస్తున్నానా అనిపిస్తుంది.

మేమిక్కడ రకరకాల వాళ్ళం పోగయ్యాం. ప్రపంచంలో దొరికే చిత్రమైన వాళ్ళని తెచ్చి ఒక గదిలో ఉంచారేమో! ఒకరకంగా దీనిని జంతుప్రదర్శన శాల అనవచ్చును. జంతువులకు బదులు జంతువులుగా చేయబడ్డ మానవులం మేమున్నాం. కత్తెరదొంగలు, హంతకులు, అప్పులెగేసిన వాళ్లు, దివాలా తీసిన వాళ్లు, స్వామి ద్రోహులు, దేశభక్తులు, అమాయికులు, అందరూ!

రోజూ మేమనేక విషయాలు చర్చిస్తాం. మేము కదపని విషయ ముండదు. ప్రపంచమంతా మా సంభాషణలో తిరిగి పోతుంది. అదేమిచిత్రమోకాని ప్రతిగోష్ఠి, ప్రతిసంభాషణా, ఏ ఇద్దరి మధ్యఐనాసరే ఒకేరకంగా అంతమవుతుంది. స్త్రీనిగురించే. ఎవ్వరు మాట్లాడినా అంతే. ఎప్పుడు మాట్లాడినా అంతే. మేమొక ఇరవైమంది ఉంటాం మా గదిలో. అతిరథులం. మహారథులం.

ఇంతకూ చెప్పవచ్చిన విషయమేటంటే-ఒకసాయంకాలం; చీకటిపడుతోంది. ప్రపంచాన్ని మమ్మల్ని వేరుచేస్తూ ఆకాశాన్ని తాకే గోడలు మూచుట్టూ వున్నాయి. కటకటాలు గడ్డకట్టుకుపోయిన మనధర్మసూత్రాల్లాగ నిలబడి కాపలా కాస్తున్నాయి. దూరంగా మేమలవాటుపడిన పారాఅడుగుల చప్పుడు వినిపిస్తోంది.

మా గదిలో నేనున్న అరలో కూచొని కొందరం కాలక్షేపం చేస్తున్నాం. కడమ రెండరలలోను మరికొందరున్నారు. మా గోష్ఠి మామూలుపాకంలో పడ్డది. పురుషుల కోసం స్త్రీలు చేసిన మహాత్యాగాలను స్మరిస్తున్నాం. పూర్వమెప్పుడో జర్మన్ కవి ఉండేవాట్ట. పెళ్లైన తరువాత వాడిలోఉన్న కవితాశక్తి పనిచేయకండా పడుకుంది. తన భార్యని అస్తమానం కళ్లతో కావలించుగుని తన జీవితాన్ని ఆమె సౌందర్యానికి పెనవేసి ఈ ప్రపంచాన్ని మరచిపోయాడట.

స్వప్న దేవత అని కవులు పులకించే దేదో ఒకటుందే అది ఆమెలో కనిపించింది గావును. ఇల్లా ఉండగా తనభర్తలోఉన్న శక్తంతా ఆరిపోతుందనీ, మామూలు మని షవుతాడనీ, ఆ ఇల్లాలు భయపడి ఎంతో చెప్పిచూచిందట. వాడు వినలేదు. వాణ్ణి ఎల్లాగైనా మళ్ళీ కవిని చెయ్యాలనుకుంది. తాను లేకపోతే తన విరహంలో కలిగేబాధ భర్తహృదయాన్ని వూపి కవిత్వంగా మారు స్తుందని ఆలోచించింది. తన వియోగంవల్ల వొచ్చేతపనలో అతనిలో కప్పేసిన కవితా శక్తి కదిలి, మేలుకుని జీవశక్తి తీసుకుంటుం దని నమ్మి ఆ అమాయకురాలు ఆత్మహత్య చేసుకుందట!

ఈ కథ ఎవడో చెబుతున్నాడు. నాకు కూడా ఆమెమీద జాలివేసింది. అంతలోనే ఒక సందేహం వచ్చింది. ఆ వియోగంలో కవిత్వం రాకండా వాడి గుండె ఆగి ఊరు కుంటే ఏమవుతాడనే ప్రశ్న ఆలోచిస్తున్న నా కళ్ళ ముందు వచ్చివంగింది. స్త్రీఅంటే కవిత్వాన్నేకాదు. రాజ్యాల్నీ, పదవుల్నీ నిర్లక్ష్యంగా తన్నేసి ఆమె పాదాలదగ్గిరే జీవితాన్ని ధారపోసిన ఉదారమూర్తు లెందరో వున్నారని ప్రసంగించాలని మన స్సులో సిద్ధపడుతున్నాను. ఇంతలో రెండో అరలోంచి మావాడొకడు (నేనంటే వాడికి చెడ్డసరదా) దేగలాగవచ్చి "రండి, రండి" అని నన్ను లాక్కుపోతున్నాడు. వాడు నిలవ నిచ్చాడుకాడు. ఏమీ అడగనిచ్చాడు కాడు. దేనికీ వ్యవధిలేదు.

క్షణంలో రెండో అరలో ఉన్నాం. అందులో ఉత్తరానికేసి ఒక పెద్ద తిరగలి, తూర్పుకేసి ఒక చిన్నకిటికీ ఉన్నాయి. ఆ కిటికీ రెండడుగులిటూ, రెండడుగులటూ ఉంటుంది. తలుపులులేవు. నేలమట్టాని కై దడుగులపైన ఉంటుంది. దాన్ని కిటికీ అనడం కంటె, ఊచలు బిగించిన కన్నమంటే బావుండును. చెరసాల గోడలకికూడా ఆత్మ ఉండి మేమంటే జాలిపడి, నిస్సహాయంగా, దీనంగా, దిగులుగా, మాకేసి ఆకన్నం ద్వారా చూస్తోంది కాబోలు అనిపిస్తుంది. ఆ కన్నంలోంచి అవతలికిచూస్తే మా కగు పించే ప్రపంచంకూడా చిన్నదే. ఒకచిన్న మైదానం. దానిచివర ఒకగది (త్వరలో విడుదలచేసే ఖైదీలని ఆ గదిలో ఉంచు తారు) ఆ గది వెనకాల ప్రపంచాన్ని మమ్మల్ని వేరుచేస్తూ ఆకాశాన్ని తాకుతూ ఆలోచిస్తున్న గోడలు. ఇంతే. ఏదో విశేష మున్నప్పుడు మేమంతా ఆకన్నందగ్గిర పోగ వుతూ ఉంటాం. నేనా అరలోకి వెళ్ళిచూసే సరికి అందులోని జనమంతా కన్నందగ్గిర పోగయ్యారు. అదిచూడగానే అవతలేదో జరుగుతోంది అనుకున్నాను. తిరగబడ్డ ఖైదీ గాని, పలాయనానికి ప్రయత్నించిన అభా గ్యుడుకాని కొరడాదెబ్బలు తింటూఉండాలి అనుకున్నాను. అలాంటి శిక్షలు తరుచు

చూస్తాం. మా కళ్ళ ఎదుటే జరుగుతాయి. "ఎవరేనా ఇంతే ఇల్లాగే శరీరాలు వాలి చేస్తాం జాగర్త!'' అని గావును దాని ఉద్దేశం. ఒకళ్ళమీద ఒకళ్లు పడిచూస్తున్నారు నా కవకాశం దొరికిందికాదు. మా వా డూరుకోలేదు. నలుగుర్ని ఏనుగుల్లాంటి వాళ్లని ఇవతలికిలాగి చూడమన్నాడు.

చూశాను! మామూలు కొరడాదెబ్బలు కావు. దూరంగా ఉన్న గది ఇనపతలుపులు తెరిచిఉన్నాయి. లోపలిద్దరాడాళ్లున్నారు. ఒకతి అందమయింది. యౌవనంలో ఉంది. మరొకతి ముసల్ది. కొంతసేపటికి ముసల్ది ఇవతలకొచ్చి కటకటాల తలుపులు మూసి తాళమేసింది. నా కర్థమైంది. ఇవతల కొచ్చిన మనిషి వార్డ్రెస్. లోపలమనిషి ఖైదీ. త్వరలోనే విడుదల చేస్తారు గావును. కాని మాజైలులో ఉన్న ఖైదీలంతా వెరసి అయిదువంద లుంటారని అంటారు. అందరు మొగాళ్లే. ఆడది లేదు. ఆమె నెక్కణ్ణించి తెచ్చారో ఎందుకు తెచ్చారో.

అంత అందమైన ఆడదాన్ని చూడగానే నా నాడుల్లో రక్తం దూకుతూ ప్రవహించింది. ఆకటి కళ్లతో ఆమె అందాన్ని ఆస్వాదించిన ఆ రసనిమిషంలో నాలో ఎక్కడో శోషిల్లి, చుట్టచుట్టుకొని దాగిన వాంఛ ఊపిరి తీసింది. నిశ్వసించి మళ్లీ మత్తుగా మైకంగా నాలో ఇంకిపోయింది.

ఇంతలో మే మామెకేసి చూట్టం ఇష్టం లేక చీకటి క్రమంగా ఆవరించి ఆమెను, ఆ గదిని తనలో ఇముడ్చుకుంది. మరీ కుర్రకారు మాత్రం "నీదే మన్నట్లు'' చీకటిని చీల్చుకొని ఆకటి కళ్ళతో ఆమెను వెదుకుతున్నారు.

రాత్రి మా సంభాషణకంతా ఆమే కేంద్రం. "ఎవరు? ఏం నేరం చేసింది? అంత అందమైనది ఏం నేరం చేస్తుంది? చేయగలదు?'' ఇవే ప్రశ్నలు. సమాధానాలు లేవు. చివరికి ఆవిణ్ణి వొదిలి వూసు కథల్లోకి దిగిపోయాం. మాలో దాగిన



బూతులన్నీ బయటికి వచ్చేశాయి. మా నరాలలో బాధ కొంచెం తగ్గింది.

రాత్రి కొందరికి చిత్రమైన కలలు వచ్చాయి. మరుసటిరోజు కిటికీదగ్గర చెప్పు

కుని నవ్వుకున్నాం. ఒకడికి రెక్కలొచ్చాయి. ఒకడికి గది గోడలు రహస్య కవాటాలు తెరిచాయి. ఒకడికి దూరంగా ఉన్న ఆ గది తెప్పలాగ తేలి మా గదిలోకి వొచ్చింది. మావాడు పొగలా ఆ గదిలోకి దూరి నిద్ర పోతున్న ఆమెను మీద దుప్పటిలాగ కప్పు కున్నాట్ట.

ఆరోజు ఎప్పటికిమల్లే గంట వినిపించింది. వెనకాల తుపాకీలతో సహా వొచ్చిన నలుగురు సిపాయీలతో వార్డరొచ్చాడు. మేమెనుగురం రాజకీయ ఖైదీలం ఒక సిపాయి వెంట వెళ్ళిపోయాం. కాలకృత్యాలు తీర్చుకున్నాం.

మళ్లీ గంట వినిపించింది. ఎనిమిది. మాకుకూడా కఠిన శిక్షే. పిండి విసరాలి. మా గదిలోనే. అప్పుడు మేము మాత్రమే ఉంటాము. తక్కిన వాళ్ళెక్కడో రాళ్లు మోస్తారట. మాగదికి మేము తిరిగొచ్చాం. ఆ రోజు మాతోకూడ ఉన్న సిపాయి లోపలికొచ్చాడు. మేము తిరగలిముందు నుంచున్నాం. నిలబడే విసరాలి. ఎత్తుమీద ఉంది తిరగలి. రోజూ తెచ్చే ముసలాడే ఒక తట్టలో జొన్నలు తెచ్చిపెట్టేడు.

మేము విసురుతున్నాం. సిపాయి సిగరెట్టు కాలుస్తూ కిటికీలోంచి అవతలికి ఉమ్మి వేస్తున్నాడు. మా పనిలో వాణ్ణి మరిచిపోయాం.

మళ్లీ గంట వినిపించింది. తొమ్మిది. కిటికీ దగ్గిర నిలబడి అవతలికి చూస్తున్నవాడు మాకేసి తిరిగి దూరంగా ఉన్న గది కిటికీలో కనపడే ఆమె నుద్దేశించి "దాన్ని చూశారా" అన్నాడు. మీసంమీద చేయి పోనిస్తూ, కళ్లతో చూపిస్తూ. నేను చూశానన్నట్టు తలాడించాను. సూదుల్లాగ నిలిపిన కోరమీసాల కేసి కళ్లువాల్చి చూసుకుంటూ మా దగ్గరికొచ్చాడు.

"ఎవరో తెలుసా" అన్నాడు, నాకేసి చూసి. బొమలెగరేస్తూ తెలీదన్నట్టు చప్పరించాను.

మావాడూరుకోక నాతో "వెనకాల ఏదో కథానాయకత్వం వెలిగించింది గావును" అని అన్నాడు.

"ఆఁ. అలాంటిదే. భోగంజాతి." అని ఆగి మళ్లీ "మనమే దీనికి కన్నెరికంచేస్తం" అన్నాడు కర్కశంగా సకిలిస్తూ.

ఆమాట వినగానే నాలోని అసూయ పడగ విప్పింది. వాణ్ణి నూరితాగెయ్యాలనిపించింది. ఆ కోపంతో తిరగలిని గిరగిరా తిప్పేశాను. నా కంగారుచూసి వాడు నవ్వాడు. ఆ నవ్వు నన్ను కనబడని కొరడాతో కొట్టింది.

"నీ మనిషైతే ఇక్కడికెల్లా వొచ్చింది" అన్నాడు మావాడు. తిరగలిని మా కొదిలేస్తూ పిండిచేతులు దులుపుకుంటూ.

"నా మనిషేమిటి? దాని సిగతరగా, అది చాలాకాలం క్రితం. ఇప్పుడా! ఆ రేళ్ళ మాట. మూణ్ణాళ్లే నాతో ఏడిసింది. తర

వాత ఒహూడేమిటి. .. .. వాళ్లు, ఏడాది కంతా కడుపొస్తే, మందులు తాగి, అది పీకమీాది కొచ్చి, ఊరంతా పాకి, కేసై, ఆరేళ్ల శిక్ష వేశారు.'' అని సిగరెట్టు తీసి అగ్గిపెట్టెకోసం జేబు తడుముకున్నాడు.

''ఇన్నాళ్లిక్కడ లేదేం?'' అని అడిగాను. ఉన్న గ్రంథం యావత్తు లాగేదామని.

''సెంట్రల్ జైలులో ఉండేది'' అన్నాడు. తాపీగా సిగరెట్టును పెదవుల్తో నొక్కుతూ.

''ఇక్కడి కెందుకు తెచ్చారు. నీ సొమ్మునీ కిచ్చేద్దామనా'' అని అనేసి, వాడి కేసి చూడకండా తిరగలి దగ్గరి కొచ్చాడు మావాడు.

పడబోతున్న తుపాకిని పట్టుకొని, క్షణం మావాడి కేసి, గుడ్లురిమి చూసి ఏమీా అనలేక, సిగరెట్టు వెలిగించి, పొగ వొదిలి, వాదూరుకున్నాడు.

ఎందుకు తెచ్చారని నెమ్మదిగా నే నడిగాను. మనిషి కొంచెం తేరుకుని అధికారి కుండదగిన గొంతుకతో ''నాలుగేళ్ల శిక్ష అనుభవించింది. ఏం చేసిందో మరి.'' అని కొంచెమాగి, ''రెండేళ్ల శిక్ష రద్దుచేయించు కుంది. పదిహేను రోజులలో వొదిలేస్తారు. నిన్ననే సెంట్రల్ జైలునుంచి వొచ్చింది. నేనూ మరొకడు స్టేషన్ నుంచి, యస్కార్టు చేసి తెచ్చాం'' అని సిగరెట్టు కాలుస్తూ కిటికీ దగ్గిరికి పోయాడు.

మళ్లీ గంట వినిపించింది. పది. ఇంకా జొన్నలు తరగలేదు. వాణ్ణి కిటికీకి వొదిలేశాం, వా డక్కడికి వెళ్ళగానే ఆ గదిలో కనపడే మనిషి తప్పుకుంది.

తిరగలి నిలవకండా తిరుగుతోంది. జొన్నలు తిరగలి కన్నాలద్వారా అడుక్కి పోతున్నాయి. ప్రతి గింజా ఒక ఖైదీలాగ కన్నంలోకి జారి నలిగిపోతోంది. పిండి తెల్లగా, మెల్లగా పడుతోంది.

మళ్లీ గంట వినిపించింది. పదకొండు. తట్ట ఖాళీ అయింది. పిండి తీశాము. ముసలాడొచ్చి పిండి, తట్ట పట్టుకుపోయాడు. తక్కిన మాసోదరులు, వారి వెనకాల, తుపాకీలతో సిపాయీలు, వారి వెనకాల వార్డర్ వొచ్చారు.

మావాళ్ళంతా గదిలో ప్రవేశించాక మా సిపాయి మమ్మల్ని లెక్కెట్టి వార్డరికి చెప్పాడు. సరి. తాళాలు వేసి, ఎక్కడివాళ్లక్కడికి వెళ్లిపోయారు. మే మలవాటు పడిన పారా అడుగుల చప్పుడు దూరంగా వినిపిస్తోంది.

ఆమె సంగతంతా అయిదు నిమిషాలలో మా గదిలో అందరికీ తెలిసింది. అంతా ఆ నడిమి అరలోనే వున్నాం. అవతలికి చూస్తూ కిటికీదగ్గర నేనున్నాను. ఆమె తన గది కిటికీలో కూచుని మా కేసి చూస్తోంది. మావాడు మెల్లిగా ఈలవేశాడు. ఆమె నవ్వింది. మావాడు నవ్వాడు. నేనూ నవ్వాను.

నేనూ మావాడు అవతలికి చూస్తున్నాం. ఇన్నాళ్లూ దిగులుగా దీనంగా, అగుపించే కిటికీ అప్పు డందంగా మారి హాయిగా గాలి, వెలుగు ఇస్తోంది.

మళ్లీ గంట వినిపించింది. పన్నెండు. మేమామె కేసి, ఆమె మా కేసి, చూస్తూ కూచున్నాం. మాకు రోజు అన్నము, రొట్టెలు తెచ్చే కుర్రాడే ఆమెకు అన్నం పట్టుకెడుతున్నాడు. ఇనపకటకటాలకిందనించి ఆమెకు పళ్లెమిచ్చాడు. ఇచ్చి అక్కడే ఉన్నాడు. ఏమో చెబుతోంది.

అది చూడగానే మావాడి కళ్లల్లో ఆశ కనిపించింది. అరగంటలో ఆ కుర్రాడు మాకూ అన్నం పట్టుకొచ్చాడు. మే మైదుగురు మాత్రమే మా అరలో భోంచేస్తాం. అక్కడి కెవరూ రారు. అదీకాక మాకు మజ్జిగ, రొట్టెలు కూడా ఇస్తారు. తక్కిన వాళ్లకీరు. వాళ్లకి పులుసు అన్నం మాత్రమే.

ఆ కుర్రాడు కటకటాల కిందనుంచి అయిదు కంచా లందిచ్చాడు. ఇచ్చి వెడుతున్నాడు. "మాట! ఇలారా" అన్నాడు మావాడు. మేమంటే వాడికి కొంచెం గౌరవం. కడమవాళ్ళకి మల్లేఖైదీలంకాముగా మరి. అదీకాక తరుచు రొట్టెముక్క లిస్తాం. ఇంటి నుంచీ డబ్బొస్తే వాడికేదో తగిన సంభావన ముట్టచెబుతాం.

వెడుతున్నవా డాగి దగ్గిరికొచ్చాడు.

"ఇందాకా నీతో ఏంమాట్లాడుతోంది ఆ చివరిగదిలో మనిషి" అని అడిగాడు మా వాడు.

"ఏంలేదు బాబు! ఆ విడికి వొట్టిరొట్టె లిచ్చారు. అవి తిన లేదట అన్నంకావాలట!"

"పాపం! ఎల్లా తినగలదు. మేమయితే యేదోతింటాం. ఆడది...అందులోను..." అని మాటకోసం తడుముకున్నా డో ముసలాయన మాలో.

మా వాడింతలో అందుకుని "మరే... అందులోను మీ యిల్లాలుకు మల్లే చాలా సుకుమారమైంది" అని అన్నాడు.

ముసలాడిముఖం జుమాలుమంది. కుర్రాడు పక పకా నవ్వి ముసలా డేమనుకుంటాడో అనుకుని కళ్లలో పశ్చాత్తాపం కనబరుస్తూ నుంచున్నాడు.

మావాడు వాణ్ణి దగ్గిరికి పిలిచి "అయితే నా కీవేళ ఆకలిగాలేదు. ఈరొట్టెలు చాలు. నా అన్నం ఆమెకీ" అన్నాడు.


నే నేమీ అన లేదు. మా గదిలో కడమ ముగ్గురూ పట్టుకెళ్ళవోయ్ అన్నారు. మా వాడు రొట్టెలుతీసి నా పళ్లెంలో ఉంచి కుర్రాడికి కంచమిస్తూ "అప్పుడప్పుడా కిటికీలో కనపడుతూ ఉండమను" అన్నాడు.

కుర్రాడేమీఅనకుండా పళ్లెంపట్టుకెళ్లాడు. ఆమె పుచ్చుగుంది. చాలాసేపు వాడితో మాట్లాడింది. చివరికి కటకటాల్లోంచి వాడి బుగ్గ కూడా గిల్లింది. ఇదంతా మా కిటికీలోంచి చూశాం. భోంచేసి కిటికీదగ్గిర కబుర్లు

చెప్పుగుంటున్నాం. ఆమె మా కెదురుగుండా తన కిటికీలో కూచుంది.

మళ్ళీ గంట వినిపించింది. రెండు. వార్డర్ సిపాయీలు వొచ్చారు. మామూలుగా మా పనులకి వెళ్లిపోయాం. మేము జొన్నలు విసురుతున్నాం. మాకు కాపలాగా మరో సిపాయి వొచ్చాడు. వాడు లోపలికి రాలేదు. కాసేపయ్యాక మా వాడు తిరగలి వొదిలేసి కిటికీదగ్గిరి కెళ్లాడు. ఆమెవీడికేసి చూస్తోంది. భోంచేశావా అన్నట్టు సంజ్ఞచేశాడు. నాకు భయమేసింది. చేశానంటూ ఆమె కూడా తలాడించింది. తన బలమైన రొమ్ముతో కిటికీ ఊచల్ని అదుముతూ మావాణ్ణి అక్కడికి రమ్మని చేయాడించింది. "ఆగాలి, ఇప్పుడు సమయంకా" డన్నట్టు సంజ్ఞచేశాడు.

"రావోయి. నీ ప్రేమ రాయబారాలు మాడిపోను. జైలులోను మొదలెట్టి ప్రాణం



కొరికేస్తున్నావ్. తిరగలి కదలటం లేదు." న్నాను. వాడొచ్చాడు.

రాత్రిమళ్ళీ కుఠ్రాడురాగానే "ఏమంది" అన్నాడు మా వాడు. "మీ విషయమంతా అడిగింది. నేనుచెప్పేను. మిమ్మల్ని మెచ్చు గుంది." అని కుఠ్రాడు బదులు చెప్పేడు.

"అంతే! మరేమీ అనలేదూ?" అని మళ్లీ అడిగాడు మా వాడు నిరాశతోకూడిన ఆశ గొంతుకలో ధ్వనిస్తూ.

"చెప్పిందండి. ఇంతలోనే ఆ విడకి ఖైదీ అయిపోతుందట. యీ ఊళ్ళోనే ఉంటుం దట. మీరు విడుదలైన తరువాత ఆ విణ్ణి చూసి వెళ్లాలటండి" అని జంకుతూ చెప్పాడు.

"ఓష్! ఇంకా ఆరు నెలలకికదా! అప్పటి కేమవుతామో! ఎవడుచూశాడు. ఇప్పుడా విణ్ణి సంతోషపెట్టాంకదా! ప్రతిఫలం ఏం చూపుతుందో అడుగు." అని వాణ్ణి పురమాయించి మా వాడు రొట్టెలుంచేసుగుని అన్నమామెకు పంపించాడు. కుఠ్రాడు వెళ్లి పోయాక మేము తలాకొంచె మన్నం మా వాడికి భాగమిచ్చాం.

వారంరోజులు గడిచాయి. రోజు మాలో ఎవరో ఒకరు ఆమె కన్నంపంపించే వాళ్ళం. బలమైన ఆకర్షణతో కూడుకొన్న ఆ పరిచయం చిరకాల స్నేహంలాగ ఏర్పడింది. మేము పంపేప్రశ్నలకి ఆమె చమత్కారంగా సమాధానం పంపుతుంది. రోజూ మేము ప్రతిఫలం కావాలంటాం. రోజూ మమ్మల్ని

ఊరించే మాటల్తో మా నరాల వేడి తగ్గిస్తుంది. చాలా చిత్రమైన సంబంధం. మా గదిలో అందరి హృదయాలలోను ఆమెకు స్థాన ముంది. పరిచయంకాని పరిచయంతో మాలో ఉన్న స్నేహం ఆమెను వెదకుతూ ప్రవహించింది. ఆమెకూడా ఈప్రవాహాల్ని తనలో ఇముడ్చుకుంది.

రోజుకు రోజు మా సంబంధం గాఢమై పోతోంది. ఆమె తొరలోనే వెళ్ళిపోతుందనే బాధ మా గుండెల్ని తొలిచేస్తోంది.

పద్నాలుగురోజులు గడిచాయి. మమ్మల్ని మాకంటె ఆమె బాగా అర్థంచేసుగుంది గావును. ప్రతిఫల మిస్తున్నాను. అందరూ రేపుదయ మారింటికి కిటికీదగ్గిర ఉండాలని ఆ రాత్రి కబురంపింది.

ఉదయ మైదింటికే మేమంతా కిటికీదగ్గిర పోగయ్యాం.

గంట వినిపించింది. ఆరు. చీకటి విడిపోతు వెలుగు రేకులు మా గదిలోకి పాకుతున్నాయి. నిశ్శబ్దంగా చూస్తున్నాం. నా గుండెదడ నాకు వినిపిస్తోంది. అందరు బరువుగాఊపిరితీస్తున్నారు. నా నాడులలో రక్తం ఉరికే వేడి నాకు తగులుతోంది. తక్కిన ఇంద్రియాలన్నీ తమశక్తంతా మా కళ్లల్లోనే వుంచాయేమో! ఆగదిలోని వస్తువులు కూడా కనిపిస్తున్నాయి. మాకళ్లు నొప్పేస్తున్నాయని మరచిపోయాం.

అదోవచ్చిందన్నాడు మావాడు. నా గుండె జల్లుమంది. నా కళ్లను నేను నమ్మలేకపోయాను. వొంపులు తిరిగిన గాజువంటి ఆమె నగ్నశరీరం కిటికీలో కనిపించింది. అడ్డంగా నిలబడి చేతులెత్తి, రొమ్ము వెనక్కివొంచి మాకేసి తిప్పి, ప్రతిఫలం అందిందా అన్నట్టు నవ్వింది. మాకెవ్వరికి నవ్వు రాలేదు. తరవాత ఏంజరిగిందో నా కళ్ళకి చూసేశక్తి లోపించింది. నా మెదడు కరిగి తిరిగిపోయింది.

క్షణంలో మళ్లీ నాకళ్లకి చూసేశక్తి వచ్చింది. ఆమెకనబడలేదు మాగదికీ ఆమె గదికీ నడమ జైలర్ కా రాగింది. మాకు గుండెలు జారిపోయినాయి. మే మివతలికి తప్పుకున్నాం. ఎక్కడివాళ్ళక్కడకూచున్నాం. నా అరలో నేను చతికిలపడ్డాను. నా పరువూ ప్రతిష్ఠల్ని ఇవతలికితీసి కొరతలేసి వేసినట్లు ఏదో యాతనలో నామనస్సు గిజగిజలాడింది. అదిరి, అదిరి, గుండె బరువెక్కిపోయింది. చేతులు కాళ్లు కంపించాయి. చెమటతో శరీరమంతా తడిసిపోయింది. ఎక్కడో దాగిన క్షుద్రమైన అల్పత్వాన్ని చూసి నా అంతరాత్మ వాణికి పోయింది. నాలో భూకంపం కలిగే సూచన లేవో కనిపించాయి.

మళ్లీ గంటవినిపించింది. ఏడు. వార్డర్ సిపాయీలు వొచ్చారు. నానాడులలో రక్తం గడ్డకట్టుకుని శరీరం చల్లబడింది. మా సిపాయి వెంట నాకు తెలియకుండా నాకాళ్లు

నన్ను తీసుకపోతున్నాయి. ఎక్కడికో అనుకున్నాను. ఎక్కడికి కాదు. మామూలు తంతే. కాలకృత్యాలు తీర్చుగుని మాగది కొచ్చాం. గుండెలో బరువు తగ్గింది.

ఆమె మళ్ళీ కనబడలేదు.

మూడో రోజు తెలిసింది. ఆమె మాకిచ్చిన ప్రతిఫలానికి,—కాదు ఆమె చేసిన ఈ నేరానికి ప్రతిఫలంగా మళ్లీ రెండేళ్ళ శిక్ష విధించారట. మా శోకక్షణకాలం సంతృప్తి ఇవ్వాలని (నిజానికి సంతృప్తి అవునో కాదో) తనమానాన్ని అర్పించి త్యాగం చేసిన స్త్రీకి రద్దుచేసిన శిక్ష మళ్లీ వేసి అన్యాయం చేశారు.

ఆమెను మానుండి తీసుకపోయారు. ఆమెతో పాటు మా ఆనందాన్ని, మా వుత్సాహాన్ని ఆమె తీసుకుపోయింది.

మా కిటికీ మళ్ళీ నిస్సహాయంగా, దిగులుగా, దీనంగా చూసింది.



# శిల్పము

శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి

శిల్ప మనుమాట చెవిని పడినంతనే పండిత పామర సాధారణముగా నేదో భావవిశేషము పైకుబుకును. వివిధములైన విషయము లనేకము లిమిడియున్న కొలదిశబ్దములలో నిది యొకటి. దీనియర్థము సర్వతోముఖము దీనిభావ మతిగంభీరము. ఇంత యేల? ఇష్టార్థ చింతామణి యనదగిన దీశబ్దము. దీనియందంతమహత్త్వ మున్నది కావుననే యిది ప్రాచీనుల హృదయ మాకర్షించి వివిధములైన స్తుతులకు పాత్రమైనది. ఛాందోగ్యమతమున నిది దేవజన విద్య. చరణవ్యూహ మతమున యథర్వవేదమున కనుబంధమైన యుపవేదము. మఱియొకమతమున నిది యష్టాదశవిద్యలలో కడపటిది. ఇంకొక మతమున నిది స్థాపత్యవేదము. వేఱొకమతమున నిది వివిధకలా నిపుణ క్రియానిధానము. ఇట్లు వేలు వేలుకాలముల నాయా విద్యావేత్తల నుతిగాంచుచు దేశమునలుగడల వ్యాపించి సంఘశ్రేయము సమకూర్చిన దీని మహిమ యిట్టిదని యీ చిన్నవ్యాసమున నిరూపింపగలమా?

శీలధాతువునుండి పుట్టినది శిల్పశబ్దము. అభ్యసింపబడుపని శిల్ప మనియు, నిపుణమైనకర్మ శిల్ప మనియు, క్రియాకౌశలము శిల్ప మనియు, అర్థములు కనవచ్చును గాని యింతమాత్రమున దీని తత్త్వము తెలియదు. నృత్తగీతవాద్యాదు లఱువది నాలుగు బాహ్యక్రియలును ఆలింగనచుంబనాదు లఱువదినాలు గాభ్యంతరక్రియలును, స్వర్ణకారాది బహువిధక్రియలును శిల్పశబ్దవాచ్యము లన్నచో దీని పరమార్థము బైటబడును. దీనినిబట్టి, విచిత్రమును ప్రతిభాచాతుర్యద్యోతకమును విజ్ఞానవిశేషబోధకము నగుచు శ్రవణ నయన హృదయ రంజకమైన యే పనియైనా శిల్ప మన్నభావము తెల్లమగును. ఇపుడు దృగ్గోచర మగుచున్న మృద్దారుశిలాదిక్రియలు కొన్ని మాత్రమే శిల్పము లని చెప్పబడుచున్నవి కాని, నేర్పు చూపుపనియు - పనియందలి నేర్పును శిల్పము లన్న ప్రాచీనుల నిర్వచనములనుబట్టి పూర్వ మార్యుల సంఘమందలి వివిధజాతులవారి జీవనార్థము కల్పించిన వివిధవృత్తులును వినోదార్థము కలిగించిన యెల్లకళలును శిల్పములే యనుట స్పష్టము. నృత్తగీతవాద్యకవితాదికళలును, వడ్రము కమ్మరము కుమ్మరము మొదలుగా చెప్పలు కుట్టుట వఱకు కలయన్ని జాతుల యన్నివృత్తులును శిల్పము లనియే వారి యాశయము. రాను రా నట్టివృత్తు లొనరించు వారిలో వడ్రంగి సాలె మంగలి చాకలి ముచ్చి యను నైదుగురు మాత్రమే శిల్పు లన్నవాడుక వచ్చినట్లమరసింహునిమాటవల్ల తెలియుచున్నది గాని, పాణినిమతమునుబట్టి గాయనీగాయనులు నర్తకీనర్తకులు మార్దంగికుడు మొద లగుకళావిశారదు లందఱు శిల్పులే. అందుచే, అతనినాటి కితరవృత్తు లాచరించువారికన్న వడ్రంగి మొదలగువారికి శిల్పిసంజ్ఞ యెక్కువగా వాడుకలో నుండెనని యూహించవలెను గాని వారే శిల్పు లని భావించరాదు. శిల్ప మాచరించువా రందఱును శిల్పులే. ఇపుడు శిల్పి యన్నమాట వాడుకలో నెక్కడనో కాని వినబడదు. అందుచే పూర్వోక్తక్రియ లాచరించువారు శిల్పులు కాకపోవుదురా? శిల్ప మెంత

యుపయోగకరమో సంఘమునకు తెలియనిది కాదు. మన్ను పేర్కొన్నయేక్రియ వాడుకలో లేక పోయినా లోకము నడవదు. అందుచే వృత్తి యనఁ బడుప్రతిశిల్ప మావశ్యకమే కాదు, గౌరవార్హ మనియు, శిల్పి యేజాతివాఁడైనా మాన్యుఁడే యని యు భావింపఁదగును. ఇందుకు విశ్వకర్మ మయుఁడు మొదలగు సనాతనశిల్పులయుదంతములే నిదర్శనము.

ప్రాచీనవిద్వాంసులు నిరూపించిన పూర్వోక్త నిపుణకర్మలు మాత్రమే శిల్పములు కావు. అవి యపారములు. పరమేశ్వరుని సంకల్పమున దావిర్భ వించి యావిష్కృతి కాంచిన యీ భౌతికసృష్టి యంతా గొప్పశిల్పము కాదా? ఇందలి నదీగిరికాన నాదుల సహజశోభాచిత్ర విచిత్రరూపములును అం దలి సూర్యాచంద్రాదుల తేజోవిశేష క్రియలును శిల్పములు కావా? ఒకమహర్షి కశ్యపసూర్యుని శిల్ప మెట్లు వర్ణించెనో విన్నచో శిల్ప మన్న నేమో అది యెంత మహనీయమో విశదమగును.

"యత్తే శిల్పం కశ్యప రోచనావత్,
ఇంద్రియా వత్పుష్కలం చిత్రభాను,
యస్మిన్ త్సూర్యా అర్పితాః సప్త సాకమ్,
తస్మిన్ రాజాన మధివిశ్ర యేమ మితి"

''ఓకశ్యపసూర్యా! నీశిల్పము దివ్యప్రకాశ లక్షణము. సర్వేంద్రియసామర్థ్యసంపన్నము. అట్టి యేచిత్రకర్మయం దారోగాదిసప్తసూర్యులను నిలిపి ప్రకాశింపఁ జేయుచున్నావో దానియం దీయజ మానుని గూడా దీప్తిమంతుని గావించి ప్రతిష్ఠిం పుము.'' జగదాద్యమును సృష్టిసాధనము నైన కశ్యప సూర్యునిదివ్యప్రకాశరూప మైనవిచిత్రకర్మ శిల్ప మన్న ఋషులభావము గ్రహించినచో శిల్ప మెంత పూజ్య మైన క్రియావిశేషమో బోధపడును.

శిల్పము సహజము ప్రకృతిసిద్ధము. ప్రకృతియే దాని కాద్యగురువు. అటు దివ్యక్రియలను ఇటు తిర్యగ్జడాసుల స్వాభావికక్రియలను పరిశీలించి ప్రాచీనార్యులు చిత్రవిచిత్రము లైన బహువిధ శిల్పములు కల్పింపఁ జొచ్చిరి. నిజమైనశిల్పసంప్ర దాయ మిదే యని నాయభిప్రాయము. ఇందుకు కొన్ని దృష్టాంతములు:—

చెట్లకొమ్మలు ముక్కుతో చెక్కి తొలిచి రంధ్రములు చేయునొకపక్షికి దానిక్రియావిశేషమును బట్టి పూర్వులు వర్ధకి (వర్ధచ్ఛేదనే) యనుపేరు పెట్టిరి. దారుక్రియ చేయుశిల్పికి వృత్తినిబట్టి యదే పేరు వచ్చినది. తెలుఁగులో నది వడ్రంగిపిట్ట. ఇతఁడు వడ్రంగి యనఁబడుదురు. ఆపిట్ట కితఁడు వడ్రము నేర్పెనో, అది యితనికి నేర్పెనో విదితమే. దాని కీశిల్పము ప్రకృతిసిద్ధ మనియు నితని కభ్యాస సిద్ధమనియు స్పష్టము.

గృహద్వారగవాక్షాదులు మఱుఁగుపడునట్లు తన నాభినుండి పైకి తీసిన (ఊర్ణనాభి) సన్నని తంతు వుతో పడుగు పేకలుగా తెరవలె నేత నేయుకీటక మునకు దానిక్రియనుబట్టి తంతువాయ మని పేరు పెట్టిరి. నేతపని చేయుశిల్పికిని వృత్తినిబట్టి తంతు వాయుఁ డన్నపేరే వచ్చినది. తెలుఁగులో దానికి నితనికి సాలీఁ డనియే పేరు. మానవుఁ డభ్యసించిన నేత శిల్పములకు స్వాభావసిద్ధ మైన యాకీటకము చూపినశిల్పము ప్రమాణమని భావించుట యసంగ తమా? ఇట్లే కుమ్మరపురుగు చేయుమృత్కృతి యను చూచి యొకఁడు మృన్మయశిల్పవృత్తికి దిగి కుమ్మరి యయ్యె ననుటయు మయూరలాస్యము నృత్యకల కును దానికేక షడ్జస్వరమునకును బోధకము లను టయు సుసంగతములు. ఇట్లు పరిశీలించినచో ప్రకృతిలోని సహజశిల్పములను చూచి ప్రాచీనులు

పెక్కు శిల్పములను నిర్మింపఁ జొచ్చి రన్నమాట విశ్వసనీయ మని తోఁచక పోదు. ఇంకొక్కమాట—

బంగారు పిచికగూడు పాఠకు లెందఱో చూచి యుందురు. విశ్వకర్మకు కూడా ఆహా పుట్టించెడియా రమ్యనిర్మాణచాతురి కీ డైన శిల్పచాతురి కలదా? తాజ్ మహల్ నిర్మించిన యా శిల్పిశేఖరునివంటివా డైనా దానిని చూచి యట్టిగూడు నిర్మింపలేఁడు. సరిగదా, దాని మొద లేదో తుద యేదో తెలుసుకొనలేఁ డనుట సాహసము కాదు. అభేద్య మైన యా యల్లిక జిగిబిగి యేమి? ఆ యంతరువు లేమి? ఆహా! ఆ గూడు గృహకటాది నిర్మాణశిల్పము లెన్నిటి కుపదేశకమో యూహింపవలసినదే. ఇఁక నాభ్యంతరక్రియ యనెడికల కొక్కయుదాహరణము.

పద్మిని సూర్యునిరాకకు కమలమును వికసింపఁ జేయును. అతని పోకకు ముకుళింపఁజేయును. దాని స్వాభావికములైన యీవికాససంకోచక్రియలు కవుల నాకర్షించి వర్ణనల కెక్కినవిగదా! మనము తెలివి లేని దనుకొనుచున్న యొకతీఁగకు సహజము లైన యీరెండు నాభ్యంతరక్రియలే, శిల్పములే. ప్రియనాథుని సంయోగవియోగముల కనుకూలనాయికముఖపద్మమునందు ప్రత్యక్షము అగు నాభ్యంతరక్రియ లట్టివే. ఇట్లనుటచే తామరలతను జూచి నాయిక యాక్రియ లభ్యసించెనా యని శంకింపరాదు. అచేతనములందు కూడా యట్టికలాశిల్పములు గోచరించుచున్న వని విశ్వసించినఁజాలును.

ఇట్టి ప్రకృతిలోని శిల్పములను చూచి ప్రాచీనులు కొన్నిశిల్పము లేర్పఱచినా, వారిలోని ప్రతిభాశాలులు సంఘోపయోగకరములైన బహుశిల్పములను కల్పింపకపోలేదు. వానిని పాఠకులు భావింపఁగలరు. దానినిబట్టియు దీనినిబట్టియుఁ గూడా శిల్పసిద్ధి కభ్యాసము తప్పక కావలె నన్నమాట నిజమే కాని, పూర్వజన్మ కర్మవాసననుబట్టి యాయా శిల్పజ్ఞానము బీజరూపమున బుద్ధియం దున్నవాఁడే కృతార్థుఁ డగును. అది లేనివాఁడు కానేరఁ డనుట సత్యము. ఇందు కొక్క దృష్టాంతము చాలును.

చిత్రకారలోక ప్రసిద్ధుఁడును చిన్నతనముననే దుర్దైవము తనపొట్టలో పెట్టుకొన్నవాఁడును చిత్రకలలో తనదేశమునకు పేరు తెచ్చినవాఁడు నగు దామెర్ల రామారావు పాఠశాలావిద్యార్థిగా నున్నపుడు వారమునకు సుమా రిరువదిగంటల కాలము చదివెడి యాంగ్లాదిపాఠములం దతనికి రుచియే పుట్టలేదు. వారానికే రెండుగంటలలో నేర్చుకొనే చిత్రలేఖనమం దతనియభిరుచికి మేరలేక పోయెడిది. తుద కాతఁ డాంగ్లవిద్యకు స్వస్తి చెప్పి చిత్రకలయం దెంతవాఁ డయ్యెనో చెప్పనక్కఱలేదు. దీనినిబట్టి యే విద్యయైనా యే శిల్పమైనా కేవల మభ్యాసమున సిద్ధిగాంచఁజాల దన్న నిజము గోచరింపక పోవునా? "ప్రపేదిరే ప్రాక్తనజన్మవిద్యాః" అన్న పెద్దలభావ మదేగదా!

ఏ శిల్పమైనను బాహిర మగుటకు ముందు దానికాంతరరూప మేర్పడియుండు ననుట తథ్యము. శ్రీకృష్ణవిగ్రహము చెక్కఁబూనిన శిల్పి యది యెట్లుండఁ దగునో యెట్లున్న దర్శనీయ మగునో ముందు భావించి భావించి పిదప దానిని రాతిపై నిర్మించునుగదా! ఆ భావనయే దాని యాంతరావస్థ. అదే దాని మొదటిరూపము. కావుననే శిల్పమేని యే కళయేని యాయా ప్రజ్ఞాశాలి బుద్ధివిశేషమున ముందావిర్భవించి తరువాత నావిష్కృతి గాంచు ననుట తెల్లము. అట్లు ప్రతిభావిలసిత మైనశిల్పమే శ్లాఘ్యమై చిరస్థాయి యగును.

— శిల్పము లన్నిటిలో నెక్కువ స్థిరముగా నుండునది

ప్రతిమాశిల్పము. అది శిలాలోహమయము. ప్రతిమా శిల్పమునకు భరతఖండము పట్టుగొమ్మ. ఆసేతు హిమాచలము భక్తహృదయంగమము లైన స్త్రీపురుష దేవతావిగ్రహము లెన్ని యున్నవో లెక్కలేదు. అందు కేదారనాథ బదరీనాథప్రతిమలు నేఁటి కౌఱువేలసంవత్సరముల క్రిందటి వనుటకంటె ప్రతిమాశిల్పప్రాచీనతను వేఱుగా వర్ణింపఁ బనిలేదు. దేవాలయాదులందు ప్రతిష్ఠించు ప్రతిమలే కాదు, జీవికార్థము సీతారామాద్యుత్తమ స్త్రీ పురుషవిగ్రహములు నిర్మించి యమ్మికొనెడియాచారము పూర్వమే కలదని "జీవికార్థే చాపణ్యే" అనుపాణిని సూత్రము సాక్ష్య మిచ్చుచున్నది. ప్రతిమాశిల్ప మానాఁటి యార్యుల నెక్కువగా నాకర్షించినట్లు భాసుని ప్రతిమానాటకము వక్కాణించుచున్నది. భరతు నానందపెట్టిన దిలీపాది ప్రతిమలశోభ నాఁటి విద్యానైపుణ్యమును వేనోళ్లఁ జాటుచున్న దన్నాఁడు భాసుఁడు.

శిలాశిల్పము నెక్కువగా ప్రేమించిన సూరనార్యుఁడు తా నెందైన చూచిన యొకయువతి ప్రతిమను సుగ్రహునికథ కతిదేశించెనో లేక కల్పించెనో చెప్పఁజాలను గాని, యొక దేవాలయద్వారమందున్న యొక సుందరీప్రతిమ సర్వసంగపరిత్యాగము చేసి యడవులపాలైన యొక సన్యాసికి కూడా మన్మథవికారము పుట్టించె నని యిట్లు వర్ణించి యున్నాఁడు.

"సీ. ఆయతీశ్వరుఁ డంత నతిరమ్య మైనయా
లెప్పంపుఁ బూఁబోఁడియొప్పుఁ జూచి
బళిర శిల్పికులేంద్ర! బ్రహ్మను మీటి తే
పగిదిఁ జేసితిర యీప్రతిమ? ననుచు
తనమదిఁ గడు మెచ్చి తల యూఁచుచును నిట్టి
పడఁతులు గల రొకో పుడమి? ననుచు
అతనువికృతికి లోనయ్యె........"

దీనినిబట్టి యేప్రతిమ కానీ యేచిత్తరువుకానీ మఱి యేక్రియకానీ, జీవ ముట్టిపడునట్లు దృశ్య మైనపుడే యది శ్లాఘ్య మగునని తెలియఁగలదు.

శిల్పము లనఁబడుకళలలో చిత్రక్రియ సంగీతము కవిత్వము ననునవి సకలజనరంజనము లనుట సుప్రసిద్ధము. ఇవి యనాదు లనఁదగినంత ప్రాచీనములు. మంత్రద్రష్టలు కవు లని వేదమే తెల్పినది. సంగీతమునకు సామవేదము మూల మని పూర్వులే వక్కాణించిరి. చిత్రక్రియ కూడ వేదములనాఁ డున్న దని విశ్వసింపవచ్చును.

వైదికర్షులు ఖగోళము పరిశోధించి సాధించిన విజ్ఞాన మపారము. బహుసూర్య మండలములయు బహుభూమండలములయు స్థితిగతులను కనిపెట్టి వారు విస్మయానందభరితులై కావించిన సూర్యస్తవములు వేదము నెల్లెడ నున్నవి. అందు చిత్రశబ్దము కనవచ్చును. సారస్వతమం దాశబ్దమున కాశ్చర్యకర మన్నయర్థము సాధారణముగా నుండుటంబట్టి మొన్న మొన్నటి భాష్యకర్త లాయర్థమే వ్రాసిరిగాని, ఒక చోట దానికి చిత్తరు వన్నయర్థము కూడా పొసఁగుచున్నను వ్రాయనికారణ మూహ్యము. చిత్తరు వన్న యర్థము కూడా పొసఁగు ననుట కామంత్ర ముదాహరింతును.

"చిత్రం దేవానా ముదగా దనీకం
చక్షు ర్మిత్రస్య వరుణ స్యాగ్నేః,
ఆ ప్రాద్యావాపృథివీ అంతరిక్షం
సూర్య ఆత్మా జగత స్తస్థుషచ్చ"

ఇందలి పూర్వార్థము బాలసూర్యమండల వర్ణన. ఉత్తరార్థము సూర్యమహిమవర్ణన — మిత్రాగ్ని వరుణలోకములకు దివ్యచక్షువును సహస్రరశ్మి పుంజము నైనచిత్రము (చిత్తరువు) ఉదయాద్రిమీఁద దృగ్గోచర మగుచున్న దని తొలిభాగమున కర్థము.

ఈ వర్ణించినఋషి యాజన్మము చూచుచున్నదే కాని యాబాలసూర్యమండల మానాఁడు కనవచ్చినది కాదుగదా! అట్టియెడ నది యాశ్చర్యకరముగా నున్న దనుటలో విశేష మేముండును? కావున నరుణకాంతు లెగఁజిమ్ముచు వర్తులమై మనోహరమై ప్రకృతి చిత్రించిన జగన్నయన చిత్రమువలె నా మండల మున్న దని యా ఋషి భావించె ననుట సముచితము కాదా? ఇట్టి ప్రాసంగిక విషయము లెన్నేని వైదికార్యులు చిత్రక్రియ నెఱుఁగుదు రనుటకు చాలి యున్నవి. వేదమందలి వర్ణశబ్ద మక్షర మనే కాక శుక్లాదివర్ణములను కూడా తెలుపు నని ప్రాచీను లంగీకరించి యున్నారు. పాణినీయమున వర్ణధాతువునకు వర్ణక్రియ (శుక్లనీలపీతాదిక్రియ) అనునర్థము కనఁబడుచున్నది. బుద్ధుని కాలమందున్న యఱువదినాలుగు లిపులలో చిత్రలిపి యొకటి యని లలితవిస్తరము చెప్పుచున్నది గాని, అంతకు పూర్వము మూఁడువేల సంవత్సరముల నాఁటి మహింజోదారో యను ప్రదేశమున చిత్రలిపితోడిముద్రలు లభించిన విషయ మిపుడు బయటికే వచ్చినది. ఇంక దీని యతి ప్రాచీనత నిరూపింప గ్రంథవిస్తర మేల?

వత్సరాజు సత్యవాసవదత్తయే యనుకొనునట్లు భాసుఁడు వాసవదత్తను చిత్రించినాఁడు. కాళిదాసు బ్రహ్మచే ప్రాణము పోయించి చిత్రగత శకుంతల నాడించినాఁడు. ఇంక చెప్పెడి దేమి? నాఁటి చిత్తరువులు జగన్మోహనములుగా నుండెననుటకు పూర్వమహాకవుల చిత్రవర్ణనలు చాలవా? ఈ కళ తొల్లి పారము ముట్ట వెల్లివిరిసిన దనుట ముమ్మాటికి నిజము. భవభూత్యాది మహాకవులకు పిదప నీ శిల్పవిద్య కొన్ని శతాబ్దు లొకవిధముగా నుండెను గాని, ఆలోపము తీర్చుకొనుటకో యన నిది యిపు డువ్వెత్తుగా విజృంభించుట యెంతయు ముదావహము. పాశ్చాత్య శిల్పకలాసహవాసము దీనికి క్రొత్తమెఱుఁగు తెచ్చె నని కొంద ఱందురు. నేనారీతిని వివరింప వలఁతినిగాను. చూచినంతనే దృష్టిని పరిశీలించినంతనే భావమును పరవశమును గావించుచిత్రమే చిత్ర మని మాత్రము తలంతును. రవివర్మాదుల పూర్వచిత్రములే రంజకము లనుకొనుచుండ నిపుడు రామారావు చిత్రములు వాటిని మించె నని వినుచున్నాము. అతని చిత్ర పద్ధతి దేశమున విస్తరించుఁగాక.

సంగీతకల సామవేదముతో పుట్టి పిదప గాంధర్వవేద మన్న పెద్దపేరు తెచ్చుకొని యెంతో సారస్వతము గాంచినది. దీని యుత్పత్తి వికాసములను గూర్చి నా సంస్కృతవాఙ్మయచరిత్ర ద్వితీయ సంపుటమున సవిస్తరముగా వ్రాసియున్నాను. సరస్వతీ తుంబుర నారదాదుల వీణావాదనములను బహువిధముల స్తుతించిన పురాణవచనములే దీని ప్రాచీనతయెడ మనకు విశ్వాసము పుట్టించును. "హసితగ్ం రుదితం గీతం. వీణాపణవలాసితమ్" అను వేద వాక్యమున వీణా, మృదంగములు పేర్కొనఁబడినవి. వాల్మీకి మొదలుగా మహాకవులందఱు సందర్భోచితముగా సంగీతమును ప్రశంసించినవారే. ఈ కళలో నౌత్తరాహులపద్ధతి వేఱు. దాక్షిణాత్యులరీతి వేఱు. దక్షిణాపథమందలి పూర్వరాజు లందఱు వీణాగానము నాదరించినవారే. శ్రీకృష్ణదేవరాయ లీకళ నెక్కువగా పోషించినవాఁడే. పెద్దనార్యుఁడు జంత్రగాత్రముల పాటలు హాయిగా విని యానందించినవాఁ డని యతఁడు వరూధినిచే,

"రహి పుట్టి జంత్రగాత్రముల రాల్గరఁగించు
విమలగాంధర్వంబు విద్య మాకు"

అని సందర్భ సంగతిగా ననిపించినవాక్యమే సాక్షి. తరువాత తంజావూరు సంస్థానమును మన

# శిల్పము

విజయనగర సంస్థానము నీగాన కళకు వ్యాప్తి తెచ్చి మహావిద్వాంసులను సిద్ధముచేసినవి. ఇపు డా మాట లేల? మనదేశమంతు కర్ణాటపక్కి యనఁ బడు సంగీతవిద్యకు శారదాతనయుని యవతారమో యన జన్మించిన త్యాగరాజే పరమగురువు. ఈ విద్య యిపు డే రాజు నవలంబనము లేకున్నను గానరస పిపాసువులగు ప్రజలయాదరము గాంచుచు వర్ధిల్లు చున్నది. ప్రజాదరణము గాంచిన యే విద్యకును క్షతి కలుగదు. ఇంక కావ్య శిల్పమునుగూర్చి యొక్కింత :—

చిత్రాదికళలు మూఁడును మిక్కిలి మనోహరము లనుట నిర్వివాదమే కాని, వాటిలో హెచ్చుతగ్గులు లేకపోలేదు. ఆ రెంటికిని సాహిత్యజ్ఞానముతో పని లేదనియే చెప్పవచ్చును. కావ్యకలకో, అది యత్యా వశ్యకము. చిత్రము కేవలము దృశ్యకల. గీతము కేవలము శ్రావ్యకల. కావ్యమో దృశ్యము శ్రావ్యము పాఠ్యము నైనకల. చిత్రము భావములను వ్యంగ్య ముగా చూపును. కావ్యమో వ్యంగ్యముగాను వాచ్యముగాను గూడ చూపించును. గానముకూడా యట్లు చేయు నందురా, అట్టి పాట కావ్యమే. కాంభోజి మొదలగు కొన్నిరాగములు కరుణాది రసహేతువు లందురు. కాని, కావ్యమువల్ల రస మభివ్యక్త మగునట్లు కేవల రాగాలాపమువల్ల కానేరదు. చిత్రకారుఁడును కవియు నంతరించినా చిత్ర మును కావ్యము నంతరింపవు. గానమో గాయకు నితో సరి. మఱియు, చిత్రమును గానమును కన్న పుడు విన్నపుడు నానందము కలిగించునుగాని, యది తరువాత నిలవదు. స్మరించినా కన్నవిన్ననాఁటి సంతోషము కలుగదు. కావ్య మట్లుకాదు. చదివి నపుడు విన్నపుడు చూచినపుడే కాదు భావించినపు డెల్ల రసము హృదయమున నుబుకుచునే యుండును. కావున, తరతమ పరీక్ష చేసినపు డీ మూఁడింటిలో కావ్య ముత్తమ మని తోఁచక పోదు.

కావ్యకళ పుట్టినది మొదలుగా నేఁటివరకు నొక్కరీతిగానే వచ్చుచున్నదని యెవ్వరు ననఁ జాలరు. అది యొక్కొక్కదేశమునం దొక్కొక్క కాలమునం దొక్కొక్కరీతిగా మాఱుచునే వచ్చినది. వైదర్భి గౌడీ పాంచాలీ రీతు లన్నను, ప్రత్యక్ష బాహాట పాంచాలశయ్య లన్నను నర్థ మదే. శ్లేష యమక చిత్ర బంధకవిత లన్న నర్థమదే. శ్రవ్య దృశ్య పాఠ్యభేదము లన్న నదే. ఈ పరిణామావస్థలు సంస్కృతమున కట్లు లాంధ్రమునకు నున్నవనుట విదితము. ఇట్లు వివిధావస్థలలో వివిధదేశములలో నుదయించుచు వచ్చిన కావ్యములలో నెందు నిజ మైన కావ్యకళ మూర్తీభవించినదో వాటికి మాత్రమే వ్యాప్తివచ్చినది. అట్టివానియెడ ప్రాజ్ఞులు ప్రాఁత క్రొత్తభేదమును పాటింపరు. సహృదయ హృదయం గమమైన కావ్యము ప్రాచీనముకానీ, అర్వాచీనము కానీ, నవీనముకానీ కవితాకలాభిలాషి దానిని చూచి యుపేక్షింపఁజాలఁడు. చదివి మఱవఁ జాలఁడు. అందుకు నిదాన మాయాకావ్య శిల్ప చాతురియే యనుట పునరుక్తము.

భావస్వతంత్రుఁడైన యొకకవి కవితలో క్రొత్త దారి త్రొక్కినపుడు లోకమునఁ గొంత యసమ్మతి తలయెత్తుట సహజమే. పింగళి సూరనార్యుఁడు వినూ తన విచిత్రకథా కావ్యము నిర్మించినతఱి నట్టి యసహనముతోడి యవరోధము బయలువెడలి యా కావ్యమును చిరకాలము పైకిరాకుండ నణఁగఁ ద్రొక్కినది. అయితే నేమి? మణి మణియే! అది మట్టిలో నణఁగియున్నను సమయము వచ్చినపుడు కిరీటము నధిష్ఠించును. తుదకది యట్లే సకల ప్రబంధ

శిరోరత్నమైనది కదా! అట్లే యిపుడు పాశ్చాత్య కవితాసహవాసమున నేమి భావకుల బుద్ధివైశద్యము మూలముగా నేమి నేఁటికవితలో నూతనమార్గ మొకటి యేర్పడినది. దాని నవలంబించు వారి సంఖ్యయు, ఆదరించువారి సంఖ్యయు పెరుగుచున్న దనుట వాస్తవము. ఈదారి శుభ్రముగా విశాలముగా సుఖగమనమున కనుకూలముగా ముందుముందుకు సాగుచుండెనేని పదిమంది యీ త్రోవనే నడవఁ జొత్తురనుట నిరాక్షేపము. అందు కీసందర్భమున నవ్యకావ్యములు చదివిన కొందఱి యభిప్రాయము లెఱిఁగించుట యావశ్యకము కాకపోదు.

ఏశిల్పమైనా యాది నున్నట్లే యుండక కాలక్రమమున నభివృద్ధి కెక్కుచు జనరంజక మగు నొక్కొక్కవిశేషము చూపుచునే యున్న దనుట నేఁటి శిల్పద్రష్టల కనుభూతమే. ఇందుకు ప్రతిమా శిల్ప చిత్రశిల్ప దారుశిల్పము లెన్నెన్ని తెఱఁగుల వికసించెనో చూచినఁ జాలును. అట్లే కావ్యశిల్పమును గూర్చియు నూహింపనగును.

తక్కిన యెల్ల శిల్పములకంటెను కావ్యశిల్పము కష్టాతికష్ట మనుట తెల్లము. కావుననే యిది యెల్ల కళలలో నగ్రస్థాన మధిష్ఠించి 'విశ్వశ్రేయః కావ్య' మ్మన్న గొప్పఖ్యాతి గాంచినది— నేఁటియేశిల్పి యైనను మున్నున్నదానికి పెంపు కూర్చి మెఱుఁగు తెచ్చుటకు యత్నించును గాని తొల్లిటిదానిని పనికి మాలిన దని త్రోసివేయఁడు. అతఁ డట్లు గర్హించితి నని చెప్పుచు తాను క్రొత్తగా కల్పించిన దేది నిర్మించినా అది మున్నున్నదానికి రంగుపూఁతతోడి రూపాంతరమే యని లోకజ్ఞులు భావింపకపోరు. కావున పాఁతదంతా పాడని భావించుట పాడి గాదు. మన బహుళ సారస్వతప్రపంచమున వెదకి నచో కనఁబడనివస్తు వుండదు. అందుచేతనే - కవి బహుగ్రంథద్రష్ట కావలెనని పెద్దలన్నారు. పూర్వకవులు సాధారణముగా ప్రాచీనకథనే ప్రధానముగా గ్రహించినా, నాఁటి సాంఘికధర్మములను ప్రాసంగికముగా వర్ణించకపోలేదు. అయినా, యిపుడాపుంత పూర్తిగా విడిచి, సంఘాభివృద్ధి నభిలషించి సంఘమందలి కథాపాత్ర వ్యవహారముగనే గ్రహించవచ్చును. అందు కాక్షేపించువా రుండరు. ఈ యభిప్రాయమును నా యాంధ్రదశరూపక పీఠికలో విశదీకరించియున్నాను. ఇంక నేఁటి ఖండకావ్యములు చదివిన కొంద ఱెత్తిన యాక్షేపములలో మొదటిది భాషావిషయము.

అన్నిటివలెనే భాష కూడా క్రమక్రమముగా మాఱుచు వచ్చినమాట సత్యము. సముచితమైన భాషాస్వాతంత్ర్యము కవుల కున్నమాట నిజము. అట్టి భాషాసంప్రదాయము ననుసరించి, 'ప్రయోగశరణం వ్యాకరణ' మ్మనుసూక్తి యాధారముగా, పూర్వకవిపరంపరలోని యెల్లప్రయోగములును శిష్టులవాడుకలోని పెక్కు శబ్దరూపములును గ్రాహ్యము లనుచు సోదాహరణముగా నాంధ్రభాషానుశాసనము నిర్మించియున్నాను. అది చదివిన కీ. శే. గిడుగు రామమూర్తిపంతులుగారు "మే మనుచున్న దానిలో నూటి కఱువదివంతులు మీరు సమ్మతించినా"రని పలికియున్నారు. వా రయినా వ్యవహారమందు వినవచ్చే యెల్లశబ్దము లట్లే ప్రయోగింపవచ్చునని భావించలేదు. శిష్టులు నెమ్మదిగా మాటలాడునపు డెట్లుండునో యట్టి భాష ప్రయోజ్య మన్నారు. అంతే కాని, "అల్లా చెయ్యాల్సొచ్చింది" వంటివాక్యములు కావ్యములందు వాడవచ్చు ననలేదు. పెద్దలు 'అల్లాగ చెయ్యవలసివచ్చింది' అని పలుకుదురు. అట్టియెడ నెవరో తొందరగా పలికెడి పైవాక్య మట్లే ప్రయోగించుట భాషాగౌరవమునకు

కళంక మాపాదించుచేకదా! మఱియు, శబ్దముల స్వరూపము పూర్తిగా చెడిపోయిన యట్టివాక్యము చదువరి కింపు పుట్టింపదు సరిగదా! చదువుటయే కష్టమగును. అందుచే వ్యావహారిక భాష వాడవచ్చునని స్వరూపము పూర్తిగా చెడిన యతినింద్య గ్రామ్యములను కావ్యమందు ప్రయోగించుట మంచిది కాదు. కావ్యభాష కొంచెమేని యుదాత్తముగా నుండవద్దా? ఇంక—

"ఈ పద్యములయర్థమే తెలియరాదు. వీటిభావమేమో గోచరింపదు" అనుచు నేఁటికావ్యములు చదివినకొంద ఱనుట కలదు. ఒకరిద్దఱు పెద్దమనుష్యులు నాతో నన్నపైమాటలు తత్కవులకు చెప్పియున్నాను. మన కిపు డాపాఠకాభిప్రాయము తెలియుట ముఖ్యము గాని, తద్విషయవిచారణ యావశ్యకము కాదు.

కవికి కావ్యరచనవల్ల కలుగు ప్రయోజనము యశస్సు, దొరకితే ధనము, అంతే. తక్కినప్రయోజనమంతా పాఠకునిదే. అందుచే కవికర్మ ప్రజోపకారిగా పాఠకరంజనముగా నుండఁదగు ననుట సర్వసమ్మతము కాదా? ఇపుడు సంఘక్షేమ మభిలషించియో సంఘములోని గుణదోషములను విమర్శింప నెంచియో దేశాభ్యుదయము కాంక్షించియో వివి విజ్ఞానబోధకముగానో పాఠకవినోదార్థముగానో యెన్నోవిధముల రచన లావిర్భవింపకలసి యున్నది. అట్టివి కొన్ని పుట్టినవి. పుట్టుచున్నవి. అట్టి వన్నియు సర్వసాధారణములై యుత్సాహము పుట్టించున ట్లుండవలె నని యభిలషించుట రచయితల ధర్మము. వస్తు పాత్ర రసౌచిత్య మావశ్యకమన్న విశేషలక్షణము కావలసిన కావ్యవిశేషము నటుంచి చూచినా, శబ్దార్థభావౌచిత్య మెట్టివిషయమెత్తి నిర్మించు నెట్టిరచన కైన ముఖ్యమే కదా! కావున నేకవియైనను, రమ్యనిర్మాణశాలి యన్న పేరు తెచ్చుకొనఁగోరినచో నేఁటి కనుగుణ మైనరీతినే కావ్యలక్షణము పాటింపవలెను. ఇందు కితరులు చెప్పినమాట లేల?

"సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకలితార్థయుక్తిలో
నారసిమేలునా, నితరు లక్షరరమ్యత నాదరింప—"

అని పదౌచిత్యము నర్థౌచిత్యము కావ్యరచన కావశ్యక మని తెలుపుచున్న యీ నన్నయార్యుని మాట యేనాఁటికవుల కైన ననుసరణీయమే కదా! ఇంకా సూరనార్యాదులు చెప్పినకావ్యౌచితీ లక్షణము లుగ్గడింప నేల? ఇది చాలదా? కావున నేఁడు కావ్యనిర్మాణము సముచితపదరమ్యత అర్థప్రసన్నత భావస్ఫూర్తి కలుగున ట్లుండి వివిధవిజ్ఞాన విశేషబోధకమగుచు సంఘాభివృద్ధికి తోడ్పడున ట్లుండుఁగాక! యని యాశించుచున్నాను.

"ప్రకృతిమహతే శర్మ స్తస్మై నమః కవికర్మణే"



# మనకీ మతాభిమానం

## శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

"మతాభిమానం మంచిదా, చెడ్డదా?" అని కాదు ప్రశ్న, మరి "మంచిదైతే అది మనకి ఉందా, చెడ్డదైతే లేకుండా పోయిందా?" అని.

ఇది తెలుసుకోవాలంటే ముందు చాలా సంగతులు తేల్చుకోవాలి.

ఏమంటే?

మనకి మతాభిమానం ఉందనుకుందామా అంటే ఉండవలసినట్టూ లేదు.

పోనీ, లేదనుకుందామా అంటే లేకుండా పోయినట్టూ లేదు.

బతుకూ కాకుండా, చావూ కాకుండా వుండే స్థితిలాగ, యిది, చాలా అపాయకరమైన సన్నివేశం.

ఒక్క మనలో తప్ప యీ పరిస్థితి మరే మతం వారిలోనూ వున్నట్టు లేదు.

దీని కంతకీ కారణం, ఐహికం తుచ్ఛం అన్న భావమూ, ఆముష్మికం గొప్ప దన్న నమ్మకమూ మన పూర్వులకు ముదిరిపోవడమే.

నిజానికి, ఎంత యేవగించుకున్నా, యిక్కడ పుట్టాం కనక, బతికివుండినంతకాలమూ మనకి ఐహికం తప్పదు.

తరవాత గాని అనుభవానికి రాని ఆముష్మికం కోసం యిది తుచ్ఛం అనుకుంటే, యీ బతుకు పాపిష్ఠిది అని కుళ్లుతో ఐహికం నరకంచేసుకోడం తప్ప మరేమీ ప్రయోజనం లేదు.

అదీకాక :

ఐహికంమీద గట్టిగా కాలూనుకోందే ఆముష్మికాని కెలా యెగరగలుగుతామూ?

ఐహికవాంఛలు చంపుకుంటేగాని, ఆముష్మికం లభించ దంటే, ఆముష్మికం వుందని దృఢంగా చెప్పడంమాత్రం యెలాగా?

ఐహికం ప్రత్యక్షం.

దీని విషయమై ఊహల కగత్యం లేదు.

ఆముష్మికం అప్రత్యక్షం.

ఏదీ, ఎటూ నిర్ధారణగా చెప్పడానికి వీలులేదు.

బుద్ధి నిశిత మైనకొద్దీ ఊహలు వెడతాయి.

ఊహలు వెళ్లినకొద్దీ ఆలోచనలు సాగుతాయి.

ఆలోచనలు సాగినకొద్దీ చర్చలు ముదురుతాయి.

చర్చలు ముదిరినకొద్దీ అహమిక ప్రబలిపోతుంది.

అహమిక ప్రబలినకొద్దీ అభిప్రాయాలు భేదిస్తాయి.

దాంతో, సిద్ధాంతాలు వేరయిపోతాయి.

అవి పాతుకునిన్నీ పోతాయి.

చివరి కవి జనంమీద విరగబడి తెగలకింద బద్దలుకొట్టేస్తాయి.

మతం విషయమై చూస్తే మనలో యీ క్రమపరిణామం స్పష్టంగా కనబడుతుంది.

ఇది సోదాహరణంగా చెప్పాలంటే,

"మతం" అంటే యేమిటి?

ఇవాళటి స్థితి చూస్తే, మతస్వరూపజ్ఞానం, ఉన్న చోటనైనా ఉండవలసినట్టు లేదు.

లేనిచోట లేదని ఆవేదనా లేదు, ఏమిటని జిజ్ఞాసా లేదు.

పోనీ, మన మతం యేది?

దీనికి సమాధానం రావాలంటే, ముందు, మనం యెవరమో తేల్చుకోవాలి.

# మనకా మతాభిమానం

మనం అంటే హిందువులం అనుకుందామా, మన సనాతనత్వం పోతుంది.

ఏమంటే ?

ఈ పేరు మనకి దరిమిలా వచ్చింది.

పైగా, యిది జాతివాచకం గాని మతవాచకం కాదు.

నిజం గుర్తిస్తే, అసలు, మనం హిందువులమే కాము.

హిందూశబ్దం మనం సృష్టించుకున్నది కాదు.

ఆశబ్దానికి సాఫీ అయిన అర్థమూ లేదు.

పోతే, మనం ఆర్యులం.

అయితే, హిందువు లనిపించుకుంటున్నవా రందరూ ఆర్యులు కారు.

హిందూదేశం అంతా ఆర్యావర్తమున్నా కాదు.

ఆర్యావర్తం చాలా చిన్నది.

విశాల మైన యీహిందూదేశంలో అది వొప్పెడున్నా కాదు.

అక్కడివా రైనా అందరూ ఆర్యులు కారు.

ఆహద్దులు దాటివున్న ఆర్యులలో అక్కడివారు లక్షాంశమూ కారు; కాని, వారు, అతీతులకంటే తమ కేదో కొంత విశిష్టత వుండినట్టు మహా గర్విస్తారు.

ఆర్యుల విధినిషేధాలను పట్టి చూస్తే, ఆర్యుడైన వాడు, ప్రపంచంలోనే కాదు, పవిత్ర మైన యీ భరతఖండంలోనే అన్నిప్రాంతాలకూ వెళ్లి చూడ్డం కూడా మహాపరాధం.

వెడితే పతితు డయిపోతాడు.

ప్రాయశ్చిత్తం చేసి, మళ్లీ ఉపనయనాదికం జరిగిస్తేగాని వాడికి మళ్లీ ఆర్యత్వం సంక్రమించదు.

ఆనిషిద్ధ ప్రాంతాలలో, యివాళ, దారుణ మారణహోమం జరుగుతున్న వంగదేశం వొకటి.

పోనీ, ఆర్యావర్తవాసు లైన ఆర్యు లందరిదీ అయినా వొకటే మతమా ?

ఎన్నడూ కాదు.

కావడానికిన్నీ వీలులేదు.

ఏమంటే ?

ప్రపంచంలో తక్కిన మతాలవారి కందరికీ వొక్కొక్క వేదమే వుంది; కాని, ఆర్యులకు, ఋగ్యజుస్సామాథర్వణా లని వేదాలు నాలుగు.

ఇతరుల నందరినీ వారివారి ఒక్కొక్క వేదమే నిబంధిస్తుంది.

మనకి వేదాలు నాలు గైనా అవి మనల్ని అందరినీ నిబంధించలేవు.

వాటిలో అథర్వణం ఖిలంకూడా అయిపోయింది.

"ఇది ఆర్యత్వానికి అపకీర్తికరం కాదూ? భంగకరమున్నూ కాదూ?" అన్న ప్రశ్న అలా వుండనిద్దాం.

పోతే, యజుర్వేదం కృష్ణం అనీ, శుక్లం అనీ రెండుగా చీలిపోయింది.

... "ఈద్వైధీభావం హైన్యానికి గుర్తా, ఆధిక్యానికి గుర్తా ?" అన్న ప్రశ్నకూడా అలా వుంచేద్దాం.

ఇలాగు వేదాలకు, బాహుళ్యం రావడంతోటే, వాటి ననుసరించి ఆర్యులలో భిన్నశాఖ లేర్పడ్డాయి.

దాంతో, ప్రత్యేకాభిమానాలు బలపడ్డాయి.

చివరికి, ఆశాఖలు, ఒక వేదశాఖవారితో మరో వేదశాఖవారు సంబంధబాంధవాలు చేసుకోగూడదన్నంతవరకూ ముదిరిపోయాయి.

అయితే,

ఇవాళ, యీధర్మం తిరస్కరించి భిన్నవేద శాఖలవారు వియ్యం అందుతున్నారు. పైగా, ఏ వేదంలోనూ యేశాస్త్రంలోనూ లేని రకరకాల

నాడులు భరతఖండం అంతటా ప్రబలిపోయాయి. ఆశాస్త్రీయా లైన యీనాడులు, వేదశాఖల కుద్దిష్టా లైన విధినిషేధాలు అనుసరించి తమలో తాము సంబంధబాంధవాలు నిషేదించుకుంటున్నాయి. ఈ అవాంతరవైపరీత్యం విషయంకూడా అలా వుండనిచ్చేద్దాం.

ఇక తేలిం దేమిటీ?

"మీరందరూ వొకటి కాగూడదు. అసలు, వొకటి కానేకారు" అని ఆర్యులను శాశ్వతంగా విడగొట్టిన మొదటి గొడ్డలిపెట్టు యీ వేదవిభాగం.

ఇది యిలా వుండగా,

ఆర్యులలోనే, యీ వేదాలను బహిష్కరించి కొందరు జైను లయినారు.

కొందరు బౌద్ధు లయినారు.

కొందరు చార్వాకు లయినారు.

కొందరు కొంద రింకా యింకా అయినారు.

వారికీ మతవాఙ్మయం హెచ్చుగానే ఏర్పడి పోయింది.

కాలక్రమాన, ఆ వేదశాఖలవారికీ యీ వేద బాహ్యులకూ, తమలోతమకూ, ఒకళ్లతోవొకళ్లకీ ద్వేషాలు ప్రబలాయి.

కొట్టుకున్నారు.

ఇది యిలా జరుగుతూ వుండగా, కృష్ణయజుర్వేదానికి చెందిన తైత్తిరీయోపనిషత్తుకి శంకరాచార్యులవా రొక భాష్యం రచించారు.

అది భరతఖండం అంతటా వ్యాపించింది.

దానినిబట్టి అద్వైతం ప్రబలింది.

శంకరాచార్యులవారు తక్కిన అనేకమతాలను, చెరిగేసి, ఆరింటిని మాత్రం అంగీకరించి, షణ్మత స్థాపనాచార్యు లైనారు.

ఇక్కడ వొక చిత్రం.

భిన్నవేదశాఖలకు చెందిన ఆర్యులు, ఆభేదాల ననుసరించి కుమ్ముకుంటున్నా శంకరులవారి తైత్తిరీయోపనిషద్భాష్యం శిరసావహించి అద్వైతం అవలంబించారు.

దాన్ని అంగీకరించనివారున్నూ వున్నారు.

వారిలో వొకరు రామానుజులవారు.

వారి తరవాత మధ్వరాయలవారు బయలుదేరి శంకరులనూ రామానుజులనూ కూడ అంగీకరించలేక పోయారు.

రామానుజులవారు ఆ తైత్తిరీయోపనిషత్తుకే మరో భాష్యం రచించి విశిష్టాద్వైతం ప్రతిపాదించి ప్రబల చేశారు.

మధ్వరాయలవారున్నూ దానికే మరొక భాష్యం రచించి ద్వైతం బలపరిచారు.

దీంతో, అదివరకే చీలివుండిన ఆర్యులలో మరి మూడు చీలిక లేర్పడ్డాయి.

అయితే, రామానుజులవారి విశిష్టాద్వైతమూ, మధ్వరాయలవారి ద్వైతమూ దక్షిణదేశంలోనే వుండిపోయాయి.

ఈ రామానుజవైష్ణవానికి బదులుగా, ఉత్తరదేశంలో చైతన్యవైష్ణవమూ, వల్లభాచార్యవైష్ణవమూ మరికొన్నీ ప్రబలాయి; కాని వాటికి వైదికసంపత్తి చాలదు.

ఇక్కడ మరో విశేషం యేమిటంటే?

రామానుజవైష్ణవులు కూడా భిన్నవేదశాఖల ననుసరించి ప్రవర్తిస్తూ వుండిన్నీ, యిలాగ తైత్తిరీయోపనిషత్తును శిరసావహించారు.

మాధ్వులున్నూ అంతే.

ఆర్యావర్తవాసుల వేదాల ననుసరించిన అద్వైతం, విశిష్టాద్వైతం, ద్వైతం అన్న యీమూడు మతాలూ ఆర్యావర్తానికి బయటనే పుట్టాయి.

మరి, అసల్లో, ఆర్యావర్తంలో పుండిన మతం అక్కడ యిప్పటికీ పుందా ?

దీనికి సాయం, ఉన్న అయిగు వేదాలూ చాలక, దక్షిణదేశంలో ద్రావిడవేదం వొకటి ప్రబలింది.

అది రామానుజవైష్ణవులకు మాత్రమే స్వత్వం అయింది.

పోనీ, వారు, దీన్నే నమ్ముకునివున్నారా అంటే, వారిలో ఋగ్యజుస్సామవేదులూ, శుక్లయజుర్వేదులూ కూడా పున్నారు.

వారు ఉభయవేదాంత ప్రవర్తకులు.

- ఇక్కడ, ఆరామద్రావిడ బ్రాహ్మలలో కూడా రెండువేదాలకు చెందినవా రున్నట్టు కనపడుతుంది.

అయితే, వొక ఆర్యుడు రెండు వేదధర్మాలకు బద్ధుడై పుండడం ఆర్యత్వానికి బలకరమేనా ?

ఇది యేమయినా, యీమతాలతో పాటు దక్షిణదేశంలో శైవం వొకటి ప్రబలింది.

అది వైదికం కాదు.

అయినా, ఋగ్యజుస్సామవేదు లైన ఆర్యులలో కూడా అది వ్యాపించింది.

ఇవన్నీ భిన్నప్రదేశాల్లోనూ, భిన్నకాలాల్లోనూ తీవ్రంగా తలపడ్డాయి.

ఉత్తరదేశీయా లైన జైనబౌద్ధాలుకూడా యీ సంకులసమరంలో పురికాయి,

ఒకరి నొకరు నరుక్కున్నారు.

రాజులను లోపుచేసుకుని ఘోరయుద్ధాలే సాగించారు; కాని అంతంతలేసి రక్తనదులు ప్రవహించినా ఆమతాలలో వొక్కటీ అంతం కాలేదు.

చార్వాకాదులున్నూ యిప్పటికీ పుండనే పున్నాయి.

నేటికీ ఆ మతాలవారు తమత మగొప్పతనం మననం చేసుకుంటూ గర్విస్తూనే పున్నారు.

తమతమ మతాల సుస్థితికోసం తీవ్రప్రయత్నాలు సాగిస్తూనే పున్నారు.

తమతమ పూర్వవైరాలున్నూ స్మరించుకుంటూనే పున్నారు.

కనకనే, వెనక, కాంగ్రెస్సు పక్షం ప్రభుత్వాధికారం స్వీకరించినప్పుడు వైష్ణవమంత్రాంగం శైవక్షేత్రాలమీదా, విశేషించి మధురమీనాక్షమ్మగుడిమీదా విరుచుకుపడింది.

ఇదిన్నీ యిలా పుండగా,

వైదికమతాలను చూసినా, ఆదిలో, కొన్నిమినహాయింపులతో ద్విజుల కందరికీ వేదాధికారం పుండేది; కాని, తరవాత్తరవాత, క్షత్రియులూ వైశ్యులూ వేదబాహ్యులలో జమ అయిపోయారు.

సరే, శూద్రులు, అసలు ఆర్యులే కాకపోయిరి.

వారికి, అసలే, వేదాలే లేకపోవడమే కాదు, ఆర్యుల వేదాలు వింటే ఆశూద్రుల చెవుల్లో సీసం కరిగించిపొయ్యవలసిం దని ధర్మశాస్త్రం విధిస్తోంది.

శూద్రుని దగ్గిర డబ్బుచేరితే, ఆర్యులను పీడించవచ్చుకనక, రాజు, అదంతా బలవంతాన స్వాధీనపరుచుకోవా లనిన్నీ శాస్త్రం విధిస్తోంది; కాని, ఆశూద్రులను—అనేక అంతశ్శాఖాభేదాలతో చీలిపోయివుండిన ఆవేదబాహ్యులను వేరుపరిస్తే ఆర్యులకు కాలూ చెయ్యీ ఆడదు.

వారు ఆదుకునివుండకపోతే, ఆర్యజాతికి ఆర్యజాతేనామరూపాలు లేకుండా తుడిచిపెట్టుకుపోయి వుండేది.మరి వేదాధికారం లేని ఆశూద్రులకు వైదికమతా లెలా పనికివస్తాయీ ?

అయితే, వారికి మతం వుందా ?

వారూ మనమూ వొకటే అనుకోడాని కెలావీలు?

శూద్రులను కూడా అలావుంచితే అస్పృశ్యులున్నారు.

వారి సంఖ్య ఆర్యులసంఖ్యకంటే యెన్నోరెట్లు పెద్దది; గాని, వారున్నూ వేదబాహ్యులు.

మతబాహ్యులు.

మానవత్వానికే బాహ్యులు.

ఆర్యవాఙ్మయం వారి వునికినే అంగీకరించలేక పోయింది.

పోనీ, అంటే వారిలోనూ ఎన్నో తెగలు.

అస్పృశ్యులలోనే మళ్లీ అస్పృశ్యత.

తెల్లవారి లేస్తే కుమ్ములాటలు.

ఏసంస్కృతీ లేని అస్పృశ్యుల సంగతి యెందుకూ, ఆర్యజాతికి ఆదిశిరాట్టు అయిన బ్రాహ్మణ వర్ణాధిక్యత మాత్రం యేమిటీ?

వారిలో గౌడు లనీ ద్రావిడు లనీ రెండు శాఖలు.

గౌడబ్రాహ్మలు మత్స్యభుక్కులు.

ద్రావిడబ్రాహ్మలు చేపలను తాకితే సచేల స్నానం చేస్తారు.

ఇద్దరికీ వేదా లొక్కటే.

శాస్త్రా లొక్కటే.

మరి యెవరి బ్రాహ్మణ్యం ఉత్తమం?

ఈమతాల ఉల్బణం పాతవాటితో నిలిచిపోయినా ఫోకదారే; కాని, యిప్పటికీ కొత్త మతాలు పుడుతూనే వున్నాయి.

బ్రహ్మసమాజం,

ఆర్యసమాజం,

రాధాస్వామిమతం,

హరనాథమతం,

సాయిబాబామతం,

దివ్యజ్ఞానమతం,

పులిమీద పుట్ర అన్నట్టు, అన్నిటికీ పైని రాజకీయమతాలు.

ఇలాగ ఆర్యుల దగ్గిరనుంచీ—అంటే, ఆర్యులలోనూ ఉత్తమోత్తములైన బ్రాహ్మలదగ్గిరనుంచీ-ఆబ్రాహ్మలలోనూ, భిన్నమతాల--భిన్నశాఖల—భిన్ననాడుల దగ్గిరనుంచీ, వేదబాహ్యులదాకా, వేదబాహ్యులలోనూ అస్పృశ్యులదాకా, అస్పృశ్యులలోనూ మళ్లీ అస్పృశ్యులదాకా వున్న నానావర్ణ, నానాకుల, నానావర్గ, నానాదృక్పథాలవారూ, నానా ప్రాప్యాలవారూ హిందువులు.

ఆహిందువులం మనం.

ఈ 'మన'కా మతాభిమానం?

ఛిక్!



# వీణాచార్య శ్రీ సంగమేశ్వర శాస్త్రి

శ్రీ దువ్వూరి నరసరాజు



నేను ఆనాడు గోఖేలు హాలులో జరిగిన వీణాగానం ఎన్నటికీ మరవలేను. ఈ నాటికీగూడా అది నా చెవుల్లో మోగుతూనే ఉంది. అది ౧౯౨౩ లో శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారు ప్రత్యేకంగా ఏర్పాటు చేయించిన కచేరీ. అక్కడ ప్రఖ్యాతసంగీత విద్వాంసులూ, విమర్శకులూ సమావిష్టులై ఉన్నారు. యథాప్రకారంగా మార్దంగికుడూ వాయులీన విద్వాంసుడూకూడా ఇటూ అటూ కూర్చున్నారు. శాస్త్రిగారు ఆవేళ చాలా గొప్పగా వాయించారు! అయిదారు నిమిషాల్లోనే హాలంతా ఓంకారనాదంతో నిండిపోయింది. కొంతసేపటికి వాయులీనమూ, మృదంగమూకూడా ఆవీణా మాధుర్యానికి అవాంతరం కలిగిస్తూన్నట్లనిపించింది. అందుచేత కీర్తిశేషులు శ్రీ యస్. సత్యమూర్తిగారి మాటమీద వాయులీనమూ, మృదంగమూకూడా ఆపివెయ్యడం జరిగింది. నాకు ఆవేళ ఆయనవినిపించిన భైరవీ తానమాధుర్యం ఇంకా స్మృతిపథంలో ఆనందం కలిగిస్తూనే ఉంది. కచేరీ అయిపోగానే శ్రీ సత్యమూర్తిగారు పట్టరాని సంతోషంతో లేచి నిలబడిం "ఆంధ్రదేశం మాకు త్యాగయ్యగారిని ప్రసాదించింది

మళ్ళీ ఆ ఆంధ్రదేశమే శ్రీ సంగమేశ్వర శాస్త్రిగారిని ప్రసాదించింది!'' అన్నారు. అది ఊరికే ముఖస్తుతికోసం అన్నమాటేనా? లేకపోతే అందులో ఏదైనా పరమార్థం ఉందా? శ్రీ సత్యమూర్తిగారు అన్నమాటల్లో ఆంధ్రప్రశంసమాట అల్లాగ ఉండనిద్దాము. త్యాగరాజుగారు తిరువయ్యూరులో ఉండి తమగీతామృతం వర్షించారు కాబట్టి తమిళులు 'త్యాగయ్య మావాడే' అన్నా అనవచ్చును. త్యాగరాజు ఆంధ్రంలోనే కృతులు రచించాడు. అయినా ఆయన ఆంధ్రానికిగాని, తమిళానికిగాని చెందినవాడని అనడానికి వీల్లేదు. ఆయన వీటి అన్నింటికీ అతీతుడు. బహుశః కృతులు రచించడంలో ఆయనకి తమిళంకంటె తెలుగు ఎక్కువగా నచ్చిఉండవచ్చును. ఒకవిషయంమాత్రం నిశ్చయం. సారళ్యంలోనూ హృదయానికి సూటిగా దూసుకుపోవడంలోనూ అవి అద్వితీయమైన వనడంలో సందేహం ఏమీలేదు. ఇంకొకవిషయం. ఆయన ధనంకోసం గాని రాజాదరణంకోసంగాని ప్రజల మెప్పుకోసంగాని ఇవి రచించలేదు. హృదయావేశమే ఆయనకృతులు రచించడానికి కారణము. పాటలు పాడకపోతేనేగాని ఆయనకి రోజుగడిచేది కాదు! లోలోపలినించి ఒక దివ్యావేశం ఆయన్ని ఉర్రూతలూగించేది. ఆయన ఆ ఆవేశంలో వివశుడై కృతులు రచించేవాడు! సంగమేశ్వర శాస్త్రిగారికీ త్యాగరాజుకీ ఈవిషయాల్లో చాలాదగ్గిర పోలికలున్నాయి.

శాస్త్రిగారికి కీర్తి మెరుపులు అంటే ఇష్టంఉండేది కాదు. సమకాలీనులు ఆయన గొప్పతనం అంతగా గుర్తించలేదు. శ్రీశాస్త్రిగారికి అసలు అల్లాగ ఉండిపోవడమే ఎక్కువహాయి కలిగించేది. ఆయన కొంతకాలం కసింకోటలో ఉన్నారు. ఆతరవాత పీఠాపురంవచ్చి, శ్రీపీఠాపురం మహారాజావారి ఆస్థానంలో ఆజన్మాంతమూ సంగీతవిద్వాంసులుగా ఉండిపోయారు. ఒకప్పుడు రవీంద్రమహాకవిమహారాజావారికి అతిథిగా ఉన్నాడు. ఆసందర్భంలో మహారాజావారు మహాకవి గౌరవార్థం కొన్ని వినోదాలు ఏర్పాటు చేశారు. అందులో పది నిమిషాలపాటు శ్రీశాస్త్రిగారి వీణాగానంకూడా ఉంది. ఆపదినిమిషాలలోను మహాకవి ఏలాంటి ఆనందతరంగాలలో ఉయ్యాలలూగారో మనకి తెలియదు! కాని ఆతరవాత ఆయన మహారాజావారి అనుమతి తీసుకుని, శాస్త్రిగారిని శాంతినికేతనానికి వెంటబెట్టుకు వెళ్లారు. కాని శాస్త్రిగారికి అక్కడివాతావరణం అంతగా అనుకూలించనట్లు కనబడింది. అక్కడి ఆచార వ్యవహారాలు వేరు. భాష వేరు. ఒక్క వీణ మినహాయిస్తే ఆయన భావాభివ్యక్తికి సరియైన సాధనం ఏమీలేదన్నమాటే. వీణాగానంద్వారా ఆయన చేసిన భావవ్యక్తిమాత్రం సంపూర్ణంగాను, ఆదర్శప్రాయంగాను ఉండేది. మహాకవీ, సంగమేశ్వరులు పరస్పరాత్మాంతరాళాల్లో, పరస్పర ప్రతిభలు అభినందించుకుంటూ అలాగ కూర్చుండి పోయేవారు. శాంతినికేతనంలోఉన్న గొప్పసంగీత విద్వాంసులు, విమర్శకులు అంధకారంలో నిశ్చల నిమీలిత నయనాలతో సంగమేశ్వరులచుట్టూపరివేష్టించి ఉండేవారు. మహాకవి ధ్యాననిమగ్నులై ఆయనగానసుధ ఆస్వాదించేవారు. శాస్త్రిగారు మనోహరంగా వీణాగానవర్షం కురిపిస్తూఉంటే మహాకవికపోలాలనించి అల్లనల్లన ఆనందబాష్పాలు దిగజారుతూ ఉండేవి. ఈవిధంగా సుమారు ఆరుమాసాలకాలం ఒకమెరుపులా గడిచిపోయింది! ఖండఖండాలనించి వచ్చిన కళాశీలు లందరూ అమాయికులైన శాస్త్రిగారి వీణాగానం విని తన్మయులౌతూ ఉండేవారు.

# వీణాచార్య శ్రీ సంగమేశ్వర శాస్త్రి

ఆతరవాత మహాకవి శాస్త్రిగారివల్లకీసందేశం పాశ్చాత్యులికికూడా అందించాలని నిశ్చయించారు. ఆయన అంతటితో ఊరుకోలేదు. ఓడలో శ్రీశాస్త్రి గారికి ప్రయాణం అదీ ఏర్పాటు చేయించి ఇటలీ, జర్మనీ, ఫ్రాన్సుదేశాలలో కార్యక్రమాలు నిర్ణయించారు. అయితే శాస్త్రిగారి మనస్తత్త్వం మహాకవికి కూడా బోధపడలేదు! ఒకనాడు శాస్త్రిగారు రవీంద్రుడి దగ్గిరికివచ్చి "కొంచెం కలకత్తా వెళ్లవలసిన పనిఉంది. మళ్ళీ మర్నాడు తిరిగివస్తాను" అనిచెప్పి సెలవుతీసుకుని వెళ్లారు. కాని శాస్త్రిగారు తిన్నగా పిఠాపురం చేరుకున్నారు! శాస్త్రిగారు శాంతినికేతనంలో ఉన్నప్పుడు మహాకవి ఆయనకి 'వీణాచార్య' అని చెక్కిన బంగారుపతకం ఒకటి బహుమతీ చేశారు. శాస్త్రిగారికి ఇంకా చాలమంది ఎన్నో పతకాలు బహూకరించారు. ఆయనకి అవి ధరించాలనే ధ్యాసే ఉండేదికాదు. అంచేత ఆబహూకృతుల సంగతి ఎవరికీ తెలియనే తెలియదు! శాస్త్రిగారు శాంతినికేతనంలో ఉన్నప్పుడు రుద్రవీణ, సుర్‌బహార్, సారంగి అనే ఈమూడు ఔత్తరాహ జంత్రవాద్యాలు బాగా పరిశీలించారు. ఈమూడూ శాస్త్రిగారికి ఎక్కువగా నచ్చాయి. వాటి పరిశీలన వల్ల శాస్త్రిగారి గానదృక్పథంలో బాగా మార్పు కలిగింది.

ఆయన హిందూస్థానీ సంగీతంలోఉన్న గొప్ప లక్షణాలన్నీ ఆకళించుకుని అవి సరస్వతీవీణలో ప్రదర్శించి ఆ జంత్ర వాద్యంలో ఉన్న లోతులన్నీ కొలిచారు. ఆయనవీణ విన్నవారు యమునాకళ్యాణి, దేశ్, దర్బారి, కన్నడ, సింధు భైరవి వినిపించడంలో ఆయన కౌశలమూ, మాధుర్యమూ ఎన్నటికీ మరవలేరు. ఆయన్ని సుర్బహార్‌ధ్వనివ్యక్తిత్వము, మాధుర్యము ఎంతో ఆనందింపచేశాయి. అందుచేత ఆయన వీణాధ్వని అభివృద్ధి పరచాలనే ఉద్దేశంతో ఎస్‌రాజ్ కమానుతో వీణవాయించడానికి చాలా కుతూహల పడేవారు.


మనదేశంలో చాలామందికి శాస్త్రిగారు మొట్ట మొదట గాత్రపాట పాడేవారన్న విషయం తెలియదు. కొంతకాలం ఆయన గాత్రపాటకులుగానే ఉండిపోయి 'ఇది మనం సాధించలేమా, అన్న ధీమాతో నందిగామ వెంకన్నపంతులుగారితో కలిసి వీణాసాధన ప్రారంభించారు. వెంకన్న పంతులు గారు ఆయన బావమరిది.

ఒకసారి ఆయన నాతో "నేను స్వరశుద్ధములోను, శ్రుతిలయంలోను తన్మయత్వం పొందాలని ఎప్పుడూ తహతహ పడుతూంటాను. అందుకని రాత్రి తొమ్మిది మొదలుకొని తెల్లవారుజాము నాలుగు గంటలదాకా వీణాగానంలో మునిగి తేలుతూంటాను. అందుచేత పగలు నిద్రపోతూఉంటాను" అన్నారు. ఈ విధంగా ఆయన కొన్ని సంవత్సరాలు చేశారు. ఆయనచేసినది చాలాదుష్కరసాధన. చివరికి ఆయన దానిలో దిగ్విజయం పొందారు! ఆయన గాత్రపాట ఎన్నడూ విడిచిపెట్టలేదు. ఆయనకి వాయులీనంమీదకూడా మంచి అధికారం ఉండేది. అంతేకాదు ఆయన ఏజంత్రవాద్యంలోనైనా అసాధారణ కౌశలం కనబరచేవారు. అయితే వీణ ఆయనకి 'నల్లేరుమీద బండినడక!' ఆయన వీణలో మహాపాండిత్యం గణించుకున్నారు. వీణకూడా ఆయనకి తనహృదయ రహస్యాలన్నీ విప్పిచెప్పింది. ఆయన వీణ వాయిస్తూంటే అచ్చంగా మనిషి పాడుతూన్నట్లుగానే ఉండేది. శాస్త్రిగారు గాత్రపాటలో కూడా చాలాగట్టివారు కనక అందులో ఉండే గమకాలు, హెచ్చుతగ్గులు, నైరంతర్యమూ, మానవ కంఠంలో ఉండేఆవేదన వీణమీద బహుసున్నితంగా పలికించేవారు.


ఆయన నాలుగున్నరలో కాని ఐదులో కాని వీణకి శ్రుతివేసేవారు. ఆ శ్రుతిలో వీణతీగెలు మంచిబిగిలో ఉంటాయి. ఎంతటి నేర్పరులైనా వాటిమీద వాయించడానికి జడుస్తారు. శాస్త్రిగారు మంద్ర స్థాయిలోను చౌకకాలంలోను వీణలో ఉన్న లోతులన్నీ పలికించవచ్చునని నమ్మేవారు. అప్పుడప్పుడు ఆయన ద్రుతకాలంలో మెరుపులు మెరిపిస్తూ చటుక్కుని అన్ని స్థాయీలమీద అంగుళులు నృత్యం చేయించేవారు. ఆయనరాగాల్లో చక్కని సారళ్యము, సహజత్వము, క్రమికత్వము గోచరిస్తూ ఉండేవి. ఆయన ఏరాగం వాయించినా దాని జీవస్వరంలో చిక్కని తియ్యదనాలు పలికించేవారు. ఏరాగం వినిపించినా అప్పుడే అది సరికొత్తగా వాయిస్తూన్నట్లుండేది. అందులో ఏవేవో కొత్త సౌందర్యాలు మెరిసిపోతూ ఉండేవి. పునరుక్త్యాది దోషాలు మచ్చుకైనా కనబడేవికావు.

ఆయన ౧౯౩౧ జనవరి ౧౭ వ తేదీని స్వర్గస్థులయ్యారు. మరణానికి పూర్వం ఒకగంట, గంటన్నరసేపు ఆనందభైరవి వాయించి' తన జీవిత సహధర్మచారిణి అయిన వీణకి వీడ్కోలు వినిపించారు

అనువాదకుడు : 'శిల్పి'



# రేఖా చిత్రములు



వెదురు పొద

—శ్రీ అర్ధేందు ప్రసాద బెనర్జీ



మూర్తి చిత్రణము

—శ్రీ నందలాల్ బోసు

# దారు చిత్రములు



గృహిణి

—శ్రీమతి జమునాబోస్



పల్లెపట్టు

—శ్రీమతి జమునాబోస్

# MUSINGS

## ‘చలం’

హత్యలు, ఎక్కడచూసినా హత్యలు యుద్ధం ముందు హత్యలు. యుద్ధమంతా హత్యలు, యుద్ధం తరవాత హత్యలు. పదివేల మందిని హత్యచేశారంటే, అది వినేవాళ్ళకి అవి వుత్తఅంకెలు. చీమలమల్లే పుట్టుకొచ్చే యీ ప్రజలలో పదివేలమంది ఒకసంఖ్య కాదు. మళ్ళీ నిండుకుంటారు అవలీలగా.

కాని ఒక్కజీవితం - ఒకమనిషిని, ఆలోచించి, మాట్లాడి ప్రేమించి, కలలుగనే ఒక్కజీవితం- ఇంకఎన్నడూ మళ్ళీ తిరిగిరాని జీవితం, అనేక సజీవమైన లతలతో ఇతరుల్ని పెనవేసుకున్న జీవితం- ఎంతవిలువ !

గొప్పజ్ఞాని, అందమైన స్త్రీ, ఒక్క సీతాకోక చిలక—ఎంతనష్టం! జీవితానికే ఎంత అపకారం!

హత్య, సృష్టిసూత్రాలలో — యీ జీవితం Existence - సృష్టి - ఎంత వాస్తవమో, హత్య అంత నిజమైన సూత్రంలాగు కనిపిస్తుంది. ఒకదాన్ని ఒకటి తింటేనేగాని బతకవు యీ జంతువులు.

ఆనాడే పూసింది చంద్రకాంత, దానిజీవితానికి మొదటిసారి. దాని లాలిత్యం, యౌవనం, జీవితం అంతా ఎర్రని ఉత్సాహంలో పొంగింది ఆకుల్లోంచి. గర్వంగా సాయంత్రం గాలిలో నవ్వుతో, పైనున్న ఎర్రని మబ్బుల్నిచూసి వెక్కిరిస్తోవు పొరిగింటిపిల్ల, నల్లని అందవికారపు, రంపపుకోత కంఠంపిల్ల,

‘రావే, కోకిలా, రావే’

కాముడురాసిన ప్రేమగీతమే పాడవే.’

అని కాకి మల్లే పాడుతో వొచ్చి.

‘‘ఇది నా మొక్క. ఎవరు కాదంటారు ?’’ అన్నట్టు, చుట్టూచూసి వొక్కపువ్వునీ మిగలకండా కోసుకు వెళ్ళింది.

ఆకాశం చూస్తోంది, గాలి నవ్వింది. కాని ఆ అందవికారపుపిల్ల జడలో ఆ పువ్వుల్ని పెట్టుకుని అందం తెచ్చుకోవాలని ఆశపడుతుంది !

ఎవరికోసం నా బాధ, నా హృదయంలో కన్నీళ్ళు ! మొక్క కోసమా ? కన్యకోసమా ?

మరి ఆపిల్ల తలలో ఆపూలు పెట్టుకుంటేనేగాని రాయప్రోలు సుబ్బారావుగారికి వర్ణించేందు కేముంటుంది ?

ఇట్లా ఒకదానిని ఒకటి తింటేనేగాని బతకలేని జీవులు, ఉన్నవారిని దోచుకుంటేనే గాని ఆకలి తీర్చుకోలేని ఆర్తులు, తక్కిన దేశాల మానో పలీల్ని ఎదిరించి బాంబులతో పేలిస్తేనేగాని తాము సమృద్ధిపడని దేశాలు,

ఇంతలేని తనం, దరిద్రం, లోటు ఆశ చాలకపోవడం, ఎందుకీ ప్రపంచంలో !

ఒక పక్షంవారిమీద కోపం తెచ్చుకుని, ద్వేషించి, రెండోపక్షంతో హృదయాన్ని కలపడం చాలా సులభం. కాని జీసస్ మల్లే బీదవారి దారిద్ర్యాన్నీ, ధనవంతుల ఇరుకుబతుకుల్నీ ఒకసారి హృదయానికద్దుకోడం, దుస్సాధ్యం. వొళ్లు చాచుకోవాలని ఆవలించిన జర్మనీ ఇరుకునీ, ఇదంతా నేను చచ్చి చెడి సంపాయించుకున్నాననే బ్రిటన్ హక్కు స్వార్థాన్ని రెంటినీ లోపలికి తీసుకోగలిగిన ఉదారత్వం, హిందూమత నిస్సాంగత్యాన్ని, మహమ్మదీయమత పౌరుషాన్ని ఒకేవిధంగా లోపలికి తీసుకోగలగడం చాలా కష్టం.

ఇట్లా ప్రతిదానికి feel కావడం బలహీనమా ?

కాని feel కాని మనషులు...తనూ, భార్యా, పిల్లలూ, ఆస్తీ - అని బతికేమనుషులు - అట్లా ఉండగలరా ? కాని నువ్వు feel కావడం ఎవరికి ఏం ఉపయోగం ? నీ బాధే మిగిలింది నీకు. కాని ఆ బాధే నా ప్రత్యేకత్వం. తటస్థుడవై, సాక్షివై నుంచోమంటుంది వేదాంతం. బెంగాలులో చైనాలో హత్యలు జరిగితే, సాక్షినై నుంచుంటాను. కాని నా వాళ్లు, నా ఆప్తులు, ఎవరు లేకండా నేను బతకలేనో వాళ్లు హత్యపాలౌతోవుంటే, సాక్షినై నుంచోనా ? వుత్తకబుర్లు.

నేను Feel ఐనప్పుడే, వుపయోగ పడగలను. Feel కానినాడు ఏ పనీ చెయ్యలేను.

జీవితాన్ని తరిచినకొద్దీ వుత్త Paradoxes కింద తయారౌతోంది. అసలు యీ విరుద్ధం జీవితంలో లేనేలేదేమో ! ఎందుకూ కొరగాని యీ ఆలోచనలలోనే వుందేమో యీ వైరుధ్యం అనిపిస్తుంది. జీవితాన్ని నడుపుకోడానికి, తోవ చూసుకోడానికి, ఉద్దేశింపబడ్డ యీ ఆలోచనా కాంతి, తోవని వెలిగించడం బదులు, అమితమై, మిరుమిట్లు కొలుపుతోందిగావును. Facts ని గురించి యోచించడం కష్టం Thoughts ని గురించి యోచించడం సులభం అంటాడు గోర్కీ. ఆలోచనల్ని గురించి ఆలోచనలు - ఇట్లా ఒకసున్నాలో ఎక్కడికీ తీసుకుపోని ఆలోచనలు. ఏయోచనా లేకండా, జీవితాన్ని ఉన్నదున్నట్టుగా అంగీకరించడం ఎంత శాంతి ! ఈ బాధ ఎందుకొచ్చింది ? ఈ సుఖమెట్లా వొస్తుంది? జీవితంలో ఏం చెయ్యాలి? అని కాకండా బాధనీ సుఖాన్ని ప్రశ్నలేకండా అంగీకరించి అనుభవించడం. ధర్మం, నీతి, పాపం, ఇట్లాంటి మాట లేకండా.

స్వేచ్ఛ కావాలంటామే అది ఒక Paradox. స్వేచ్ఛ లేకపోవడమే చాలాసార్లు చాలసుఖం. సుఖాన్ని పోగొట్టుకుని తెచ్చుకునేస్వేచ్ఛవల్ల ఉపయోగ మేమిటి? కాని స్వేచ్ఛలోనే ఎదోశాంతి,బాధలున్నాసరే. బానిసత్వంలోనే ఎదో అశాంతి, బాధ లేకపోయినాసరే. అందుకనే స్వేచ్ఛకోసం ఈ పెనుగులాట. ఈ దేహం, యీ గుణాలు, యీ మృత్యువు, అనేదాంటోనే గొప్ప ఇరుకు. అందుకునే యీ ఆత్మ పడే ఆరాటం స్వేచ్ఛకోసం.

Freedom of Speech and Press.

వాక్కుకీ వ్రాతకీ స్వేచ్ఛ. కాని మాట్లాడకండా వ్రాయకండా, లోపలి స్వేచ్ఛవుండదా ? Press controle అయిన దేశాల్లో ప్రభుత్వంచేసే అబద్ధ ప్రచారం. నిజంకోసం మనసు దేవుల్లాట. Free press and Free speech ఉన్నదేశాల్లో ఎవరు చక్కగావ్రాస్తే, ఎవరు గట్టిగా మాట్లాడితే అదే నిజం. ఇన్ని నిజాల్లో ఏది నిజమనే దేవుళ్ళాట.

ఇంతేగావును మానవజీవితం.

మూర్ఖుల్లారా, మీకు స్వతంత్రం ఇస్తే వుత్త తగవేసుకుని ఏడుస్తున్నారు. మేము మిమ్మల్ని బలవంతాన ఓ మార్గాన నడిపించి శాంతి నిస్తామని డిక్టేటర్లు. చివరికి గాంధిగారుకూడా. కత్తి బలవంతమే కాదు. మాట బలవంతం, మనసు బలవంతం అనేవి వున్నవి. ఆయన యదటపడితే ఈన్‌స్టిన్ తన రెలిటివిటీ థియరీనీ, స్టాలిన్ తన ఆర్థికపద్ధతినీ మార్చుకోవలిసి వొస్తుందేమో !

Persuation, — no, ever tyrrany of Truth, and Love.

ప్రేమ అంతఘాతుకమైన బలవంతం ప్రపంచంలో లేదు. అందువల్లనే తల్లిప్రేమ అంతవుక్కిరి బిక్కిరి. ఎదురుతిరిగిన నాడు ఆ హృదయాన్ని హత్యచేశా మనిపిస్తుంది.

పడకపోతే ప్రియులు విడిపోయే స్వేచ్ఛవుండాలి అంటాడు చలం. కాని ప్రియులుఅంటే వాళ్ళమధ్య ప్రేమవుంది. ప్రేమని త్యజించి స్వేచ్ఛని పొంద గలరా? స్వేచ్ఛలేకపోతేనేం? అనని ప్రేమ ఏం ప్రేమ! స్త్రీ తన బలహీనత్వంతో, ప్రేమతో, శృంగారంతో, చూపే బలవంతం— ఏ హృదయమున్న వాడు తప్పించుకోగలడు? స్వతంత్రమైన ప్రేమలో జరిగే బానిసత్వం ఎక్కడ వుంటుంది?

నేను మీ పాపాలకోసం ఉపవాసంచేస్తాను అనే మాటకన్న Tyrrany ఏ బాంబులలో వుంది? బాంబుకి మన ప్రాణమిస్తాం. సరిపోతుంది. మనం Martyrs. కాని ఉపవాసానికి మనస్వేచ్ఛనిస్తాం. ఇష్యమా చాలా నీచులమౌతాం, మన మనసుల్లో మనమే. కాని గాంధిగారి ఆత్మశుద్ధివాదనలో గొప్ప సత్యం కనబడుతుంది. నవకాలి కన్న బీహారు ఆయన్ని కదిలించడంలోనే వుంది ఆ లోపం.

“నాకు అందరూ సమానమే. కాని నేను హిందువు.” అనడంలోనే పుట్టుకొస్తుంది అపనమ్మకం.

కులంలేని బ్రహ్మసమాజపు గురువులు ఎట్లా బ్రాహ్మణేతర వుద్యమంలో చేరారని వెంకట్రత్నం నాయుడు గారిని మేము నిలిచి ప్రశ్నించిన అర్ధరాత్రే వ్యక్తమైనాయి చాలాసంగతులు. అది కులఉద్యమం కాదు, కమ్యూనిటీ వుద్యమమని ఆయనవాదన.

“అయితే మమ్మల్ని చేర్చుకుంరా?” అని Prof. సుబ్బారావుగారు.

“మీపుట్టక బ్రాహ్మణపుట్టక. ఎంతయత్నించినా మీరు అర్థంచేసుకుని లోపలికి తీసుకోలేరు మా బాధలు” అన్నారు ఆయన.

అవును. అర్థంచేసుకోలేరు. కలిసి పనిచెయ్యలేరు ఈ దేశంలో. ఈ దేశంలోని కులమత బేధాలకీ, ఇతర దేశపు అంతర్యాలకీ చాలా భేదముంది.

ఆ అర్ధరాత్రే ధ్వనించింది కులమత భేదాల్ని పాటించమనే బ్రహ్మసమాజపు సమాధిగంట.

“మార్చుకోండి, జతలు నిరంతరం మారండి.” అంటాడు చలం. “జీవితంలో ఒకరు ఇంకోరిలో భాగమయ్యాక, ఆసంబంధాని కెడన్నా విఘాతం కలిగితే, ఇంకోకొత్త స్నేహం కావాలని అనిపించినా, ఆబలం, ప్రయత్నం, శక్తీ, మళ్ళీ వొస్తాయా? జీవితమంతా ఒకేతపస్సు అయిపోయిం తరవాత! ఆ పూర్వపు అందాన్ని మళ్ళీ ఎట్లా తెచ్చుకోగలడు? వుత్త శవం అయిపోతాడుగాని! అన్నాడు ఒకయువకుడు, సమర్థుడు నాతో” అన్నారు రశీల.

అట్లా అన్నది నన్ను గొప్పగా అర్థంచేసుకున్న యువకుడు. ఎక్కడలోపం? నేను చెప్పడంలోనా? చదవడంలోనా? అర్థంచేసుకోడంలోనా? ఒక ప్రేమస్థితి హృదయానికి తృప్తినిచ్చి, జీవితాన్ని వెలుగుతోనింపుతోవుంటే, చివరికి విరహమే, విడిపోవడమే గొప్పశృంగారమైతే, అంతకన్న గొప్ప ప్రపంచంలో లేదనే నేను ప్రేమసంబంధం రసహీనమై, ఎండి, భారమైన రోజున ఎదోనియమాలనీ, సంశయాలనీ, వాగ్దత్తాలనీ పెళ్ళాడడం మూర్ఖమన్నాను.

అవును సృష్టిఇచ్చిన కామాన్ని Sublimate చేసుకుని మానవుడు స్వయంగా తాను సృష్టించుకున్న భూతల స్వర్గం, శృంగారం. ఎదోతింటాం, కాపరిస్తాం, కంటాం, పెంచుతాం, చస్తాం, అనే మనషులుగాక, యీ లోకంలోని రసాన్ని అందుకుంటామని ప్రయత్నించే ఏ మనిషికైనా శృంగారాన్ని మించిన అనుభవం లేనేలేదు ఏమూలనైనా! ఋషులు ప్రవక్తలూ ఎంత నిశ్చయంతో ఆధ్యాత్మికానుభవాన్ని స్వర్గానందాల్ని మాట్లాడారో, అంత కన్న బలంతో వ్రాస్తాను శృంగారం నేను.

శృంగారం బూతు అన్న రోజుల్లోనూ,

శృంగారం బూర్జువా అన్న రోజుల్లోనూ కూడా.

ఎందుకు సరిగా చదవరు? అర్థంచేసుకోరు? అని నన్నడిగే అనేక ప్రశ్నలకి సందేహం కలుగుతుంది.

నవకాళీలో నూర్గురు స్త్రీలు గాంధిగారి ముందు తమ కష్టాలు చెప్పుకుని ఏడ్చారుట. ఆ దృశ్యం తలుచుకుంటే భయమవుతుంది, ఆ స్త్రీలకన్న గాంధగారికోసం "స్వేచ్ఛ అన్నావు. అర్పించమన్నావు. రామరాజ్యమన్నావు. నీమాట నమ్మాం. మాభర్తలు, మా పిల్లలు మా కళ్ళముందు బలిఅయ్యారు. ఇదేనా పర్యవసానం నీ దీక్షకీ, మా దీక్షకీ?"

అని వాళ్ళ కంఠాలు అడుగుతున్నట్టు వినిపిస్తాయి నాకు. వాళ్లు అట్లా యోచించకపోయినా, వాళ్ళ ఘోరంచూసే ఆయనకి అనిపించి తీరుతుంది. ఎవరాగగలరు ఆ నిందకి గాంధగారి నిశ్చలహృదయం కాక!

ఏ మాలోచించారు ఆయన?

స్వేచ్ఛాసమరం ముగిసిందా మరి?

తన సోదరుడి మీది ఈర్ష్యవల్ల క్రోధంవల్ల పరుడే తనకి ఆప్తుడని, పిలిచి, దేశద్రోహం చేసుకున్న మీపూర్వుల కర్మఫలితం అనుభవించవొద్దా?

ప్రారబ్ధం ఎవరు తప్పించగలరు?

ఏ విధాన మీ ఆర్తిని తీర్చగలను? ఒక్కచూపుతో మాటలో శాంతినిచ్చే బుద్ధుణ్ణికాను నేను.

నా హృదయంలో ఇంకా మిగిలిన మలినమే, మీకీ ఆపదలు తెచ్చింది. ఇంకా తపస్సు అవసరం ప్రాయశ్చిత్తం అవసరం నాకు.

ఇట్లా సమర్థించుకుంటున్నారా ఆ మహాత్ములు!

హిందూ సంఖ్యాబలంలోని మనోగర్వం, ఏనాటికెట్లా వుంటుందో ఎట్లా నమ్మడం? అనే మహమ్మదీయ అనుమానం ఈ రెండూ తనదిగా అర్థం చేసుకొనే ఔదార్యం ఔన్నత్యం, కలవా రెందరున్నారు? కొత్తయుగం సృష్టికావాలంటే!

రాజకీయావసారాన్నిబట్టి నన్ను సోదరుడంటున్నాడు ఈనాడు హిందువుడు అనేసంగతిని మరిచిపోగలడా మహమ్మదీయుడు ఏనాటికైనా. ఆ అనుమానాన్ని శమింపచేసేందుకు ఎంత హృదయ పరివర్తన కావాలి! అదేగా గాంధిగారి ఘోష!



# చిత్రవివరణము

శ్రీ టి. యన్. శ్రీనివాసన్‌గారు

'ఊర్ధ్వనృత్యము'

శ్రీ. సి. యన్. వాసుదేవన్‌గారు చాలా ముందుకువస్తూన్న యువకచిత్రకారులు. వీరు దాక్షిణాత్యులు. సుప్రసిద్ధమైన ఈశివనృత్య భంగిమను వీరు చాలా మనోహరంగా చిత్రించారు. పూర్వం శివుడికీ కాళికా దేవికీ నృత్యకళలో ఎవరు గొప్పవారనే వివాదం వచ్చింది. ఆతరవాత శివుడు అనేక భంగిమల్లో నృత్యంచేశాడు. కాళికాదేవి కూడా ఆతరవాత అతనితో సమానంగా నృత్యంచేసింది. చిట్టచివరికి శివుడు ఆమెకి గర్వభంగం చెయ్యాలనే ఉద్దేశంతో తన పాదంఒకటి కిరీటంతో సమానంగా ఉండే టట్లు ఎత్తి నృత్యంచెయ్యడం ప్రారంభించాడు. కాళిక ఆవిధంగా నృత్యం చెయ్యడానికి సిగ్గుపడి తాను ఓడిపోయినసంగతి ఒప్పుగుంది. శివుడుచేసిన నృత్యానికి 'లలాటతిలకనృత్య' మనిపేరు. కాలి బొటనవేలితో లలాటఫలకంమీద తిలకం ఉంచినట్లుగా పాదం ఎత్తడంవల్ల దీనికీపేరు వచ్చింది.

'తిరువిలయడల్' అనే తమిళ పురాణంలో ఈకథ సవిస్తరంగా వర్ణితమైంది. అందులో ఇంకా అనేకమైన శివలీలాగాథలున్నాయి. ఈ చిత్రంలో శివుడి వామహస్తంలో ఒక వినీలవిహంగం ఉంది. పూర్వం చెప్పిన పురాణంలో ఆపక్షి అల్లాగ పాలి ఉండడంలో గల అంతరార్థంకూడా వర్ణితమైఉంది. ఆ వినీలవిహంగం పూర్వజన్మంలో ఒకదివ్యవ్యక్తి. అది చేసిన ఒక చిన్నతప్పువల్ల ఈ జన్మలో పక్షిగా జన్మించింది. ఆతరవాత ఒక శాపంకూడా సంభవించింది. ఈరెండిటికీ ప్రాయశ్చిత్తంకోసం భూలోకంలో నల్లపిట్టగా జన్మించింది.

అయితే ఆపక్షి సహజంగా దివ్యవ్యక్తి కావడంవల్ల భూలోకంలో ఉన్న కాకులు మొదలైన పక్షులు దాన్ని అనేకవిధాల వేధించుకుతినడం మొదలుపెట్టాయి. పాపం! ఆపిట్ట వాటిపోరు పడలేక మనశ్శాంతికోసం ఒకదుర్గమారణ్య మధ్యంలో దాక్కుని ఉంటుంది.

ఒకనాడు ఒక శివభక్తుడు ఆదారమ్మటే వెడతాడు. అతనికి అలసటవచ్చి, ఆపక్షి ఉన్న చెట్టుకిందకివచ్చి, కొంచంసేపు విశ్రమిస్తాడు. ఇంతలో కొంతమంది పథికులు అతనిచుట్టూ చేరతారు. ఆతడు వారిని చూసి ఆనందంతో మధురాస్తోత్రం పఠిస్తూంటాడు. ఆ సంగీతమాధుర్యానికి ఆపక్షి పరవశమై అతని సమీపానికివచ్చి వింటూంటుంది. క్రమంగా ఆగానమాధుర్యంవల్ల ఆపక్షికి పూర్వజన్మస్మృతి కలుగుతుంది.

దాంతో ఆపక్షి అక్కడినించి బయలుదేరి వెళ్లి ఆమధురలో ఉన్న తటాకంలో

స్నానంచేసి పరిమళ భరితమైన ఆసమీపోద్యానవనంలో తనప్రకృతిసహజమైన సంగీత మాధుర్యంతో సుందరేశ్వరుణ్ణి స్తుతిస్తూ ఆదేవాలయానికిచుట్టూ ప్రదక్షిణాలు చేస్తూంటుంది. క్రమంగా ఆప్రభువు దయవల్ల దానికి శాపవిముక్తికలిగి మనశ్శాంతి ఏర్పడుతుంది.

ఇల్లాగ ఉండగా ఒకనాడది శివునిసన్నిధికి వెళ్ళి తనజాతి పక్షుల్ని మిగిలిన పక్షులన్నీ పొడిచి పొడిచి నానాబాధలూ పెడుతున్నాయనీ, దానివల్ల తనజాతిపక్షులు అనేకమైన యాతనలు అనుభవించవలసి వస్తోందనీ చెబుతుంది. అందువల్ల తనజాతిపక్షులన్నింటినీ రక్షించవలసిందని ప్రార్థిస్తుంది. సుందరేశ్వరుడు ఆపైన వాటికి అభయం ఇచ్చి రక్షిస్తాడు. అప్పటినించీ శివుడికి "పరాక్రమశాలి" అనేబిరుదు వస్తుంది.

ఈయువచిత్రకారుడు ఈవిషయం అత్యద్భుతంగా చిత్రించాడు. శివచిత్రణము సాంప్రదాయికమైన ప్రతిమా లక్షణాలన్నింటికీ సరిగా సరిపోయింది. ముఖంలో ఆనంద తన్మయత్వమూ సౌందర్యమూ పొంగులువారుతున్నాయి. గంగాతరంగాల్లో నృత్యానందం ఉయ్యాల లూగుతూంది. చిత్రకారులు సామాన్యంగా గంగ శివుడి శిరస్సుమీద ఉన్నట్లు వర్ణిస్తారు. ఇక్కడ గంగ శివుడి శిరస్సుమీదనించి దక్షిణభాగానికి ప్రవహిస్తూనట్లు చిత్రితమైంది. ఈ విషయం సూచించడానికి చిత్రకారుడు గంగావాహనమైన మత్స్యాన్ని చిత్రించాడు.

అల్లాగ కాకపోతే ఈగంగాప్రవాహాన్ని మనం ఇంకొకవిధంగా భావించవచ్చును. శివుడు మంచి ఉద్ధతంగా నృత్యంచేస్తూంటే శివుని శిరోలంకారాలన్నీ చిందరవందరగా పడిపోతూ ఉండవచ్చును. జటలు కలిగిపోయిఉండానికికూడా అదే కారణమై ఉండవచ్చును. అయినా తన శరణార్థియై వచ్చిన పక్షిని ఆప్యాయంగా లాలించడమూ, నర్తకుని ప్రశాంతత్వమూ అతిసూక్ష్మంగా చిత్రించబడ్డాయి.

రేఖాచిత్రాలు. కొంగలజంట : తోడేలు

ఈ రెండూ శ్రీరోమేన్ చంద్రచక్రవర్తిగారు చాలాకాలంకిందట రచించిన చిత్రాలు. ఇందులో చిత్రకారుడు,. అల్పరేఖలలో తాను వ్యక్తంచెయ్య దలుచుకున్న విషయాలన్నీ మాంచి బలంగానూ సూటిగానూ వ్యక్తీకరించాడు. శ్రీచక్రవర్తిగారిప్పుడు ఢిల్లీపోలీటెక్నిక్ విద్యాలయానికి ప్రధానాధికారిగా ఉన్నారు. ఆయన సుప్రసిద్ధ చిత్రకారులు. ఆయన రచించిన దారు చిత్రాలూ రేఖాచిత్రాలూ అమితమైన ప్రఖ్యాతి గడించుకున్నాయి.

దారుచిత్రాలు :

ఇవి శ్రీ నందలాల్ బోసుగారికుమార్తె శ్రీ జమునాబోసు రచించిన చిత్రాలు. వీటిలో సహజమైన సరళత్వము అంతటా గోచరిస్తూంది.

రేఖాచిత్రాలు :

వెదురుపొద. శ్రీఅర్ధేందు ప్రసాదబెనర్జి.
మూర్తి చిత్రణము—శ్రీ నందలాల్ బోసు.

# గ్రంథవిమర్శనము

## సాహిత్య సమాలోచనము

[కర్త: శ్రీ పిల్లలమర్రి వేంకటహనుమంతరావు, ఎం. ఏ. క్రౌనుసైజు. వెల రెండు రూపాయిలు. దొరకుచోటు, శారదా పీఠము, గుంటూరు.]

ఈ కాలంలో తక్కిన విషయాలతో పాటు సాహిత్యంకూడా విప్లవోద్యమానికి గురి అయింది. చాలామంది కవికుమారులు పూర్వనియమాలని తెంచుకొని స్వేచ్ఛా విహారాలకి దారితీస్తున్నారు. అంచేత అన్ని విషయాల్లోనూ అనేక కారణాలవల్ల మార్పులు కలుగుతున్నాయి. శ్రీ హనుమంతరావుగారు అటు ప్రాచీన నియమాలనీ, ఇటు నవీన స్వేచ్ఛావిహారాన్నికూడా గమనిస్తూ, విమర్శిస్తూ యీ 'సాహిత్య సమాలోచనాన్ని' తెలుగువారికి అందిస్తున్నారు. ఇందులో నన్నయ మొదలు నారాయణబాబుదాకా సాహిత్యంలోని వివిధ విషయాలూ 'సర్వే' చెయ్యబడ్డాయి, సంగ్రహంగా.

సాధారణంగా విద్వాంసులు ప్రాచీనపద్ధతివేపు మొజు చూపిస్తారు. భాషాంతరాల సంపర్కంగల యువకులు నవ్యపద్ధతులని మెచ్చుకుంటూరు. మంచి, చెడ్డలకి ప్రతీపద్ధతిలోనూ అవకాశంవుంది. నిష్పాక్షికంగా విమర్శించేవారికి రెండు పద్ధతుల్లోనూ మంచి పరిశ్రమ వుండాలి. శ్రీ హనుమంతరావుగారు అటువైపు శ్రీ కురుగంటి గురువుల శిష్యులు; ఇటువైపు ఎం. ఏ. బిరుదధారులు. వారి కలానికి రెండువైపులా పాళీలున్నాయి. అంచేత హనుమంతరావుగారు సాహిత్యాన్ని సమాలోచన చెయ్యడానికి మంచి సమర్థులు.

మరోవిషయం ఏమిటంటే - సమాలోచనలు వ్రాసేవిమర్శకులు సాధారణంగా గ్రంథరచనకి పూనుకొన్నపుడు ఏక పూపున సాహిత్యంలోని అన్ని భాగాలమీదా వ్రాస్తారు. అలా కాకుండా ఒక్కొక్క విషయాన్ని గురించి అప్పుడప్పుడు చర్చిస్తూ ఒక సిద్ధాంతానికి రావడమునేది మంచి పద్ధతి. ఈ 'సమాలోచన' కర్త ఆ పద్ధతినే అనుసరించి, తాను అప్పుడప్పుడు ఇచ్చిన రేడియో ఉపన్యాసాలనీ, అధ్యక్షోపన్యాసాలనీ, ఉపన్యాసాలనీ, ఇతరత్రా ప్రకటితాలైన వ్యాసాలనీ కూడా సంపుటీకరించి ఇలా గ్రంథరూపంగా తెలుగులోకానికి అర్పిస్తున్నారు. ఈయన ఎలాటి పక్షపాతమూ చిన్నా, పెద్దా భేదం చూపకుండా, సారస్వతంలో స్వల్పంగా కృషిచేసినవారికి కూడా సమానమైన స్థానం చూపడం ఈ గ్రంథంలోని ఒక గొప్ప విశేషం.

శ్రీ హనుమంత రావుగారి సిద్ధాంతాలు చాలా మట్టుకు గ్రాహ్యాలు. మహదాశయాలతోను, నిష్పాక్షిక బుద్ధితోనూ విషయ వ్యక్తీకరణమే, విమర్శకుడి ప్రధాన కర్తవ్యమనీ, కవి, చిత్రకారు లిద్దరికీ మానవాభ్యున్నతే ప్రధాన లక్ష్యమనిన్నీ వీరు చెప్పిన పలుకులు బంగారు తునకలు. ఇలాంటి ఆశయాలు కల, కవి విమర్శకులు ఏది వ్రాసినా అది అందరికీ శిరోధార్యం!

శ్రీ హనుమంతరావుగారు బాగా అవలోడనం చేసి సిద్ధాంతాలని విశదీకరించారు. కాని కొన్నిచోట్ల పొరపాటు పడ్డారు. 'వాచ్యార్థము నట్లేయుంచి, యీ షద్భేదమైన అర్థమును ప్రసాదించునది లక్ష్యార్థము' అనిన్నీ 'వాచ్యార్థమునకు వ్యతిరేకార్థ స్ఫురణము కలిగించునది వ్యంగ్యార్థము' అనిన్నీ చెప్పడం పొరపాటు. వాచ్యార్థానికి బాధకలిగితే. వచ్చే అర్థం లక్ష్యమనీ, బాహాటంగా తెలిసే అర్థంతోకూడా

వచ్చే అర్థాంతరం వ్యంగ్యమనిన్నీ చెప్పాలి. ఇక— ముద్దుపళని సప్తపదులని వ్రాసిందంటూ చెప్పారు. సప్తపదులు ఆమెరచన కాదని యిదివరకే నిర్ణీతమైంది.

'ముదివిటులు విధవలంజలు — పదకవితలు...' అనే పద్యభాగాన్నిబట్టి శ్రీనాథుడు పదకవిత్వాన్ని విధవలంజెలతో పోల్చాడని వీరు పొరపాటుపడ్డారు. కడిదిపురపు సౌభాగ్యం ఆపద్యంలో వర్ణింపబడ్డాది. లంజెలకీ, పదకవిత్వానికీ అందులో ఏలాటి సంబంధమున్నూ లేదు. గురజాడ శ్రీరామమూర్తిగార్ని గూర్చి చెప్పేటప్పుడు రామమూర్తిగారనీ, అనంతపంతుల రామలింగస్వామిగార్ని గురించి చెపుతూ మధునాపంతుల రామలింగస్వామిగారనిన్నీ వ్రాయబడడం పొరపాటు. ఇలారాస్తే— అసలు—వారి పుస్తకాలే వీరు చూడలేదేమో అని చదివేవాళ్లు అనుకోవచ్చు. ఇలాంటి పొరపాట్లు మరోకూర్పులో సంస్కరింపబడతాయని అనుకుంటున్నాను.

శ్రీ హనుమంతరావుగారు సంక్షిప్తంగా ఆంధ్రసాహిత్యాన్ని వివరించి చెప్పడమే కాకుండా, సాహిత్య విమర్శనలను కొన్నిటిని పట్టికలో చూపారు. అది మంచిపద్ధతి. శ్రీ శివశంకర శాస్త్రిగారి కవి "పరిచయము," శ్రీమల్లంపల్లివారి గ్రంథ "ప్రవేశిక" ఈ గ్రంథానికి అందం కూరుస్తున్నాయి. శ్రీ మల్లంపల్లివారి ప్రబోధం కవికుమారుల కందరికీ గ్రాహ్యమైనది.

"సాహిత్య సమాలోచనం" లాంటి గ్రంథాలు మన వాఙ్మయానికి అలంకారాలనడంలో ఏమీ సందేహంలేదు.

బు. వేం. ర.

---

# గ్రంథస్వీకృతి

౧. శ్రీ మాతారవింద సుభాషితములు
అనువాదకులు :
అరవింద పాదసేవానంద ౦—౭—౦

౨. నూతన వర్ష ప్రార్థనలు
శ్రీ మాత ౦—౩—౦

౩. మెఱపులు - తలపులు
అనువాదకులు :
పుట్టపర్తి నారాయణాచార్యులు ౦—౧౦—౦

౪. కాళిదాసు
అనువాదకులు :
రూపనగుడి నారాయణరావు ౧—౦—౦

౫. శ్రీ అరవిందుని యోగము
(మొదటి భాగము)
శ్రీ నళినీకాంత గుప్తగారి ఆంగ్ల గ్రంథమున కనువాదము ౦—౧౨—౦

౬. శ్రీ అరవింద జీవితసంగ్రహము
అనువాదకుడు :
రూపనగుడి నారాయణరావు ౦—౬—౦

ఈ పైపుస్తకములు దొరకుస్థలము,
శ్రీ అరవిందాశ్రమము, పాండుచేరి

౧. వారం వారం
శ్రీరంగం శ్రీనివాసరావు
ప్రకాశకులు :
ప్రతిమా బుక్స్: ఏలూరు ౧—౦—౦

'ఆంధ్రశ్రీ' ప్రచురణాలయం
6782, ఇమాంబావి వీధి, సికింద్రాబాదు (దక్కన్)



నర్తనమురళి

# వివేకానంద ఇండస్ట్రియల్ ఇంజనీర్స్

## పెరంబూరు, మదరాసు.

### ఎలక్ట్రికల్

డిజైన్లు—కట్టడములు

* * *

బంగాళాలు, సినీమాలు, ఫాక్టరీలలో, ఇంజను ఫిట్టింగులు దీపాలు ఏర్పాటులు

* * *

కోల్డుస్టోరేజి, ఫ్రిజిడరీలు

* * *

గ్రామసీమలలో విద్యుచ్ఛక్తి ఏర్పాటులు

* * *

అన్నిరకాల మోటార్లూ, జనరేటర్లూ మరమ్మతు చేయబడును.

* * *

ట్రాన్సుఫారమర్లూ, స్విచ్ గియర్లూ సప్లయి చేయఃబడును.

### మెకానికల్

రిపేరీలు—తయారీలు

* * *

చేతి-మర-మగ్గములు నూలుయంత్రాలు అంటే వైండింగ్, వార్పింగ్, సైజింగ్ మెషీనులు మొదలయినవి.

* * *

చేతికాగితపు గ్లేజింగు, వగైరాయంత్రాలు.

* * *

బియ్యము, పిండి, నూనె, పంచదార, మరల బాయిలర్లు, స్టీముఇంజన్లు; పంపులు.

గ్యాస్ ఆయిలు, ఇంజన్లు, వర్కుషాపు పనిముట్లు, టూనరీయంత్రాలు.

ఉక్కు, బీడు, ఇత్తడి, కంచు వగైరా పంచలోహములలో మీకు కావలసిన ఇంజను సామాన్లయినా సరిగా సకాలమునకు పోతపోసి తయారుచేసి ఇవ్వగలము. సరసమయిన ఛార్జీలు! నికరమయిన పనివాడితనం. !

ప్రొప్రయిటరు,

టి. సి. యస్. ఆచారి.

Printed at the B. N. K. Press Q. H. No. M. S. 100/ B for T. P. No. E 46/11-46.

శిల్పి ప్రచురణలు:

# 'నా జీవిత యాత్ర'

ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు

బాల్యం మొదలు సహాయనిరాకరణము వరకూ గడిపిన మహోజ్జ్వల జీవిత గాథ.

ప్రథమ భాగము

[illegible]

౧౯౪౬ ఆగస్టు ౨౩ వ తేదీనాడు శ్రీ ఆంధ్రకేసరి జన్మదినోత్సవ సందర్భంలో వెలువడింది.

## 'ఆంధ్ర శిల్పి'

ఆంధ్ర సాహిత్యానికీ, లలిత కళలకీ,

సంస్కృతికీ సేవచేస్తున్న

సచిత్ర మాస పత్రిక

సంపాదకులు:

వి. ఆర్. చిత్రా

పి. గణపతి శాస్త్రి

సాలు చందా ౯ రూపాయలు

విడి ప్రతి ౧౨ అణాలు.



రాబోవు

## 'శిల్పి' ప్రచురణలు

ఆంధ్రకేసరి

శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు

రచించిన

౧. 'నా జీవిత యాత్ర'
ద్వితీయ భాగము

౨. యోగసూత్ర సిద్ధాంతము

౩. ఈశావాస్యోపనిషత్తు

౪. ప్రశ్నోపనిషత్తు

౫. కఠోపనిషత్తు.

౬. భగవద్గీతా భాష్యము

---

వివరాలకు:— మేనేజరు:

'ఆంధ్ర శిల్పి'

౧౦, నరసింగపురం వీధి,

మౌంటురోడ్, మద్రాసు.

# ఆంధ్రశిల్పి



# ఆంధ్రశిల్పి

## సచిత్ర మాస పత్రిక


సంపాదకులు:

వి. ఆర్. చిత్రా: పి. గణపతిశాస్త్రి



౧౦, నరసింగపురం వీథి,


మౌంట్ రోడ్, మద్రాసు.

# విషయానుక్రమణిక


| | | పుట. |
|---|---|---|
| సంపాదక సమీక్షలు | సంపాదకులు ... | ౩ |
| తెలుఁగు తల్లి ... ... | శ్రీ వోలేటి పార్వతీశముగారు | ౯ |
| శివతాండవము ... ... | శ్రీ పుట్టపర్తి నారాయణచార్యులుగారు | ౧౦ |
| హృదయోపహారము ... ... | శ్రీ పి. గణపతిశాస్త్రిగారు | ౧౩ |
| THE SNOWS OF YESTERYEAR | శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావుగారు | ౧౪ |
| కార్తికపౌర్ణమి ... ... | శ్రీ కందుకూరి రామభద్రరావుగారు | ౧౫ |
| కోనేటిగట్టంట ... ... | శ్రీ కొనకళ్ల వెంకటరత్నంగారు | ౧౬ |
| శిల్పాచార్య అసిత్ కుమారునిఇంట ... | శ్రీ సంజీవదేవ్ గారు ... | ౧౭ |
| అగ్నిపరీక్ష ... ... | శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రిగారు | ౨౨ |
| రాజమాత ... ... | శ్రీ పి. గణపతిశాస్త్రిగారు | ౩౦ |
| MUSINGS ... ... | "చలం" ... | ౩౯ |
| కళకోసమే కళ ... ... | శ్రీ అరవిందులు ... | ౪౪ |
| సాహిత్యప్రతీక్ష ... ... | శ్రీ జమ్ములమడక మాధవరామశర్మగారు ... | ౪౮ |
| భారతకళా పరిషత్తు : ఆంధ్రశాఖ ... | శ్రీ బి. వి. సింగరాచార్యగారు | ౫౨ |
| మననాటక ప్రదర్శనములు ... | శ్రీ తలిశెట్టి రామారావుగారు | ౫౫ |
| కోచిన్ భవనంలోని కుడ్యచిత్రాలు ... | శ్రీ టి. యన్. శ్రీనివాసన్ గారు | ౬౧ |
| ఒక నిర్వచనం ... ... | ఎమ్. నరసింహాచార్యగారు | ౬౩ |
| గాంభీర్యము : నన్నయ ... | శ్రీ బొడ్డపాటి కుటుంబరాయశర్మగారు | ౬౫ |
| పెద్దన కవితాదర్శము ... | శ్రీ వడలి మందేశ్వరగారు | ౬౯ |
| గ్రంథస్వీకృతి ... | ... ... | ౭౩ |
| గ్రంథ విమర్శనము ... | ... ... | ౭౪ |
| చిత్రవివరణము శ్రీ టి. ఎన్. శ్రీనివాసన్ గారు | ... ... | ౭౫ |

## శిల్పాలు

ముఖచిత్రము : శ్రీ పిలకా లక్ష్మీనరసింహమూర్తిగారు. పరశురామ గర్వభంగము : త్రివర్ణచిత్రము. రామపట్టాభిషేకము, రాసలీల : శ్రీ డి. పి. నారాయణరావుగారు. అభిసారిక : శ్రీ కె. తణికాచలంగారు. ఎద్దు : ఒక జపాను చిత్రకారుడు. తరంగాలు : మేఘాలు. త్రివర్ణచిత్రము : శ్రీ వి. ఆర్. చిత్రాగారు.



తరంగాలు : మేఘాలు

శ్రీ వి. ఆర్. చిత్రా.

౧ సంపుటి

# ఆంధ్రశిల్పి

౫, ౬ సంచికలు

# సంపాదక సమీక్షలు

## స్వవిషయము

ఆంధ్రశిల్పి ప్రారంభించి అయిదు మాసాలు కావస్తోంది. ఈ అయిదు నెలలోనూ ఆంధ్రశిల్పి క్రమక్రమంగా పాఠకుల ఆదరణకు పాత్రమాతూ న్నందుకు మాకృతజ్ఞత నివేదించుకుంటున్నాము. ఈసంక్రాంతిసమయంలో ఆంధ్రుల కీ ప్రత్యేకసంచిక సమర్పిస్తున్నాము. ఈ సందర్భంలో రచయితలు మాయెడల కనపఱచిన అదరాభిమానాలు మరవరానివి.

ఇక్కడనించి ఆంధ్రశిల్పి ప్రతినెలా ౫వ తారీఖున వెలువడుతుంది. క్రమక్రమంగా ఆంధ్రశిల్పి పుటలు ౯౦ దాకా పెంచాలని అనుకుంటున్నాము. కొంచెం కాగితం కరువు తగ్గగానే మాఆశయం సఫలంకావచ్చుననీ, అప్పటినించీ ఆంధ్రశిల్పిలో ప్రఖ్యాత రచయితలు రచించిన నవలలు క్రమక్రమంగా వెయ్యాలనీ, ఇంకా కళలకు సంబంధించిన వ్యాసాలు ఎక్కువగా ప్రకటించాలనీ అనుకుంటున్నాము.

ఆంధ్రులు కళాభివృద్ధికి ఏకైకంగా పరిశ్రమిస్తూన్న ఆంధ్రశిల్పికి ఇతోధికమైన ఆదరం చూపించగలరని ఆశిస్తున్నాము.

## ఇప్పటికైనా ఆంధ్రవిశ్వ విద్యాలయం కళ్లు తెరుస్తుందా?

ఇంతకు పూర్వం స్నాతకోపన్యాసాలంటే ఎవరో మితవాదవృద్ధులు ఏవేవో నాలుగుమాటలు చెబుతూండడమూ, పట్టభద్రులంతా ఆ ఉపన్యాసాలు ఆవలిస్తూ ఆలకించడమూ ఒకపరిపాటి అయిపోయింది. కాని మన ఆంధ్రకేసరి అవలంబించిన పంథాయే వేరు! హరిః ఓమ్మని ఆయన ఆంధ్రంలో ఉపన్యాసం చేశారు. ఆపైన అది ఆంధ్రవిశ్వవిద్యాలయానికి ఇన్నాళ్లనించీ కంటకంగా ఉన్న వ్యావహారికభాషలో జరిగింది!

మన ఆంధ్రవిశ్వవిద్యాలయం గొడ్డు గ్రాంధికవాదులకు పెట్టనికోట! శ్రీరామమూర్తిపంతులుగారివంటి ప్రఖ్యాత భాషా శాస్త్రజ్ఞులు గాని, వంగాది విశ్వవిద్యాలయాల్లో అవలంబిస్తూన్న వ్యావహారికభాషా సంప్రదాయాలుగాని వారిని కదల్చలేకపోయాయి. ఒక్క ఆంధ్రవిశ్వవిద్యాలయంతప్ప దేశం అంతా వ్యావహారికమయం అయిపోయింది! ప్రఖ్యాత విద్వాంసులూ, కవులూ వ్యావహారికరచన చేస్తున్నారు. అయినా మనవిశ్వవిద్యాలయం చలించలేదు! ప్రధానామాత్యులు ప్రజాస్వామ్యవాదులు కనక, వారికి వ్యావహారికాంధ్రం అంటే సజీవమైన ప్రజాహృదయ స్పందన మన్నమాట! అందుచేత వారు వ్యావహారికాంధ్రంలో ఉపన్యసించడం సహజమే! ఇప్పటికైనా మన విశ్వవిద్యాలయం ప్రజాసామాన్యం విజ్ఞానావసారాలు గుర్తించి, సజీవమైన వ్యావహారికాంధ్రానికి స్వాగతం ఇస్తుందా? లేకపోతే కాన్యూటు రాజులాగ సాగరప్రవాహానికి అడ్డు కడుతూ కూర్చుంటుందా?

శ్రీ ప్రకాశంగారు పట్టభద్రులకి సజీవమైన స్నాతకోపన్యాసం ఇచ్చారు. వృద్ధులైనా వారిది నిత్యపురోగామి అయిన దృక్పథము. వారు చెప్పిన పారిశ్రామిక వికేంద్రీకరణము, విద్యార్థులకు సైనిక శిక్షణము, పల్లీప్రధానమైన విద్యాపద్ధతి మొదలైనవన్నీ విశ్వవిద్యాలయాధికారులు విశేషంగా గమనించవలసిన విషయాలు. ఈ విషయాలన్నీ చెప్పిన తరవాత ప్రధానామాత్యులు మన ప్రాంతీయసంస్కృతి విషయంలో చెప్పినవి మరీ ముఖ్యమైనవి. వారు అన్నట్లు మనది ప్రాంతీయ విశ్వవిద్యాలయము. ప్రాంతీయ సంస్కృతికి—అంటే ఆంధ్రసంస్కృతికి—మన విశ్వవిద్యాలయం చేసింది ఏమిఉంది? ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రారంభించి ఇంచుమించుగా ఇరవైఏళ్లు కావస్తోంది. ఆంధ్రుల జాతీయగ్రంథం అయిన ఆంధ్రమహాభారతానికి ఇంతవరకు సుసంస్కృతమయిన ముద్రణం జరగలేదు. చివరికి ఆంధ్రులందరికీ శాస్త్రీయదృష్టితో రచించిన ఆంధ్రనిఘంటువుకూడా కరువైపోయింది. ఇక మిగిలిన ప్రఖ్యాతాంధ్రకవుల గ్రంథాలు సుసంస్కృతంగా ప్రకటించడం మాట వేరే చెప్పవలసిన అవసరమే లేదు. మనకి ఇంకా

# ఇప్పటికైనా ఆంధ్ర విశ్వవిద్యాలయం కళ్లు తెరుస్తుందా ?

బాగా విస్తారమైనది సంస్కృతభాషకి ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ప్రత్యేక స్థానంలేకపోవడం! ఈ విషయంలో ఆంధ్రవిశ్వవిద్యాలయం మద్రాసు విశ్వ కళాపరిషత్తు మాత్రమైనా చెయ్యకపోవడం చాలా విచారకరమైన విషయం! బహుశః విశ్వవిద్యాలయాధికారుల దృష్టిలో సంస్కృత సంస్కృతి ఆంధ్రులకు సంబంధించనిదేమో!

ఇతరరాష్ట్రాల్లో ప్రాంతీయ విశ్వవిద్యాలయాలు ఆయా ప్రాంతాల సంస్కృతులకు అపారమైన సేవచేస్తున్నాయి. ఉదాహరణకు సంయుక్త రాష్ట్ర విశ్వవిద్యాలయాలు తీసుకుందాము. సంయుక్తరాష్ట్రాలలో అలహాబాదు, ఆలీఘరు కాశీ, లక్నో, ఆగ్రా, నగరాలలో అయిదు విశ్వవిద్యాలయాలున్నాయి. ఈ అయిదు ప్రదేశాలలోనూ ప్రత్యేక సంస్కృతులకు ప్రధానస్థానా లున్నాయి. సామాన్య విజ్ఞానానికికూడా సముచిత స్థానమూ, ఆదరమూ ఉన్నాయి.

మొన్న మొన్న బయలుదేరిన అన్నామలై విశ్వవిద్యాలయంలో కర్ణాటక సంగీతానికీ ద్రావిడసంస్కృతికీ ప్రధానస్థానంఇచ్చి పోషిస్తున్నారు.

విశ్వవిద్యాలయం ప్రారంభించిన తరవాత ఒక మూడుసంవత్సరాలు మాత్రమే రాధాకృష్ణ పండితులువైసుఛాన్సలరుగా ఉన్నారు. మిగిలిన కాలమంతా విశ్వవిద్యాలయం శ్రీరామలింగారెడ్డిగారి పరిపాలనలోనే ఉంది. వారు విశ్వప్రఖ్యాతవిద్యావేత్తలు. ఆంధ్రంలో మంచి విద్వాంసులనీ, విమర్శకులనీ, కవులనీ పేరుపొందినవారు. అయితే వీటి అన్నింటివల్లా ఆంధ్రసంస్కృతికి కలిగినఫలితం మాత్రం పూర్ణానుస్వారము. పైగా రెడ్డిగారు సర్వులూ అంగీకరించి ఆచరిస్తూన్న వ్యావహారిక భాషావాదానికి అడ్డుతగులుతున్నారని కూడా వింటున్నాము. ఈపరిస్థితుల్లో ప్రధానామాత్యులు వ్యవహారికాంధ్రంలో ప్రశంసనీయమైన స్నాతకోపదేశంచేస్తూ సమగ్రమైన విద్యావిధానసమీక్ష చేశారు. ఆంధ్రులకీ విశ్వవిద్యాలయానికీ జాజ్వల్యమానమైన మెరుపుదివ్వె వెలిగించి మార్గదరకులైనారు. మరి ఇప్పటికైనా మన విశ్వవిద్యాలయం కళ్లు తెరుస్తుందా? ప్రధానామాత్యులు అన్నట్లు అది ఆంధ్రసంస్కృతికి 'ఒకసముజ్జ్వలదీపిక' అవుతుందా?

# సా హి తీ స మి తి

రజతోత్సవానంతరం ప్రప్రథమంగా సాహితీసమితి మళ్లీ సమావిష్ట మైంది. సుప్రసిద్ధ సాహితీసమితిసభ్యులూ, ఇంకా ఇతర సాహితీపరులూ విచ్చేసి సభలు విజయప్రదంగా కొనసాగించారు.

సాహితీసమితి ఇంతకుపూర్వం నవ్యవాఙ్మయానికి చేసినసేవ అపారము. ఖండకావ్యము, కథ, ఏకాంకనాటిక, వ్యాసము మొదలైన సాహితీశాఖలన్నీ సాహితీసమితిసభ్యుల చేతుల్లో అపూర్వగౌరవం సంపాదించుకున్నాయి. సుప్రసిద్ధులయిన ఏ కొంతమంది సాహితీపరులనో విడిచివేస్తే నవ్యసాహితీస్రష్టలంతా సాహితీసమితిసభ్యులే అనడం అతిశయోక్తి కాజాలదు. సాహితీసమితిలో ఆ నాడు సభ్యులయిన వారందరు ఈ నాడు ఏదోవిధంగా వాఙ్మయరంగాల్లో సుప్రసిద్ధులైనారు. సాహితీసమితివల్ల నవ్యసాహిత్యం దేశంలో బాగా సుప్రతిష్ఠితమైంది.

ఆనాడు సాహిత్యపరిణామంలో ఏర్పడిన కొన్ని ప్రత్యేకపరిస్థితుల వల్ల సాహితీసమితిప్రారంభం అవసరమైంది. సాహితీసమితి ప్రస్థానంచూచి కొంతమంది విజ్ఞులే ఆ రోజుల్లో ఈ నూతనమార్గం సరియైనదా యని శంకించారు. సమితీ, సభ్యులూ దానివల్ల అనేక అవహేళనలకు గురి అయ్యారు. ఏమయితేనేమి చివరికి ఆ నూతనప్రస్థానం సర్వజనాంగీకృతమయింది.

పాతికసంవత్సరాలు గడిచిన తరవాత, వాఙ్మయరంగంలో నిలబడి ఒకసారి సింహావలోకనంచేసి వాఙ్మయపరిణామం పరిశీలిస్తే, సాహితీసమితి ప్రారంభించిననాటి పరిస్థితులు కొంతవరకు మారాయని అంగీకరించాలి. మళ్లీ సమితి పునరుద్ధరించి దాన్ని విజయవంతంగా నిర్వహించదలిస్తే ఈ నూతన పరిస్థితులన్నీ గమనించి, కొంతనూత్నదృక్పథాలతో సానుభూతి కలిగిన యువకరచయితలను సాహితీసమితి తనలో ఆకళించుకుని వారిని ప్రోత్సాహించడము అవసరము. యువకులెవరైనా సాహిత్యంలో కొత్త దారులు తొక్కదలుచుకుంటే వారి స్వాతంత్ర్యం గుర్తించాలి. అన్నిటి

కన్నా ముఖ్యమైనదీ, దుష్కరమైనదీ ప్రతిభావంతులయిన యువక రచయితలను సమితిలోకి ఆకర్షించుకోవడము. ఒకప్పుడు కేవల సంప్రదాయ పద్ధతులమీద కులాసారచనలు చేసేవారికంటె నూత్నమార్గాలలో కొంతవరకు మాత్రమే కృతకృత్యులయినవారి రచనలకే ఎక్కువ విలవ ఉంటుందని గ్రహించాలి.

మరి ఒక విషయము. మనదేశంలో ఉన్న సాహిత్యసంఘాలు కొంతకాలం నడిచి ఆ పైన అంతర్ధాన మవుతున్నాయి. దీనికి నూత్నాభిప్రాయాలు సరియైన దృక్పథంలో అవగాహనచేసుకోలేక పోవడమూ, సరియైన ప్రజాస్వామ్యసూత్రాలమీద సంస్థలు నడిపించకపోవడమూ ప్రధాన కారణాలు. సాహితీసమితి ఈ రెండు అవాంతరాలు గడిచి సమర్థులైన సమితి నిర్వాహకులచేతుల్లో మళ్ళీ ఒకసముజ్జ్వల భావి సృజించుకో గలదనీ, మళ్ళీ సాహితీరంగంలో ఒకఅపూర్వ సంచలనం కలిగించగలదనీ ఆశిస్తున్నాము.

## ఉ పా ధ్యా య ప ం డి తు లు

ఉపాధ్యాయ పండితులు చాలాకాలంనించి తమ విషయాలు తీర్మానరూపంగా ప్రజలకీ, ప్రభుత్వానికీ నివేదించుకుంటున్నారు. వాటివల్ల వారికి ఇంకా సరియైన న్యాయం జరగలేదు. మద్రాసు రాజధానిలో కాంగ్రెసుప్రభుత్వం వచ్చాక మాతృభాషకి ప్రథమస్థానం ఇచ్చింది. అంతవరకు బాగానేఉంది. కాని మాతృభాషలు బోధించేవారి పరిస్థితుల్లో ఏమీ మార్పులు రాలేదు.

చాలాకాలంనించి మనవిద్యావిధానం మాతృభాష రాకపోవడం ఒక మహాగౌరవంగా భావించే వాతావరణంలో నడిచింది. ఆపరిస్థితుల్లో మాతృభాషా బోధకులకు అధమాధమస్థితి కల్పించడంలో ఆశ్చర్యంలేదు. కేవలం దేశభాషల్ని చిన్నచూపుచూసే విదేశప్రభుత్వమూ, దాని తాబేదారులూ అంతకంటె ఎక్కువ చేస్తారనికూడా అనుకోవడానికి వీల్లేదు. జాతీయప్రభుత్వం వచ్చిన తరవాత దేశభాషలకు ప్రథమగౌరవమే కాకుండా, తద్బోధకులకు ప్రథమస్థానం కలిగించాలి. అధమపక్షం ఇతర బోధకులతోనైనా సమానస్థానం కలిగించాలి. అసలు పాఠశాలల్లోను,

కళాశాలల్లోను ఈ ప్రత్యేక 'పండిత' పదం లేకుండాచేసి వీరికి మిగిలిన ఉపాధ్యాయులతో సమానప్రతిపత్తి కలిగించాలి. విద్యార్థులకు అన్నివిధాలా మాతృభాషలో చక్కని ప్రవేశం కలిగేటట్టు విద్యావిధానం మార్పించాలి. అన్నివిషయాల్లోనూ ముందంజవేస్తున్న మద్రాను ప్రభుత్వం ఈ విషయంలోకూడా త్వరలో మేల్కొని ఉపాధ్యాయపండితులకు న్యాయం కలిగిస్తుందని ఆశిస్తున్నాము.

## భారతకళా పరిషత్తు

ఈ విషయంమీద శ్రీ. బి. వి. సింగరాచార్యగారు వ్రాసిన వ్యాసం ఒకటి ఈ సంచికలో ప్రకటిస్తున్నాము. అది పరిశీలిస్తే శ్రీ దేవగుప్తాపు విశ్వేశ్వరరావు ప్రభృతులు ఈ విషయంలో ఎల్లా పరిశ్రమిస్తున్నదీ తెలుస్తుంది.

అసలు మనదేశంలో వాఙ్మయ సంఘాలపరిస్థితులు ఏమీ బాగుండడంలేదు. ఇక మిగిలిన కళాపరిషత్తులుగూడా ఇంచుమించుగా ఇల్లాగే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఆంధ్రకళాశీలు రందరూ ఒకపరిషత్తులో చేరి, తద్ద్వారా భారతీయ కళాపరిషత్తు స్థాపించబూనడం ఎంతైనా ఆశించదగిన విషయము. ఈ విషయంలో కాంగ్రెసువంటి దేశీయసంస్థ పూనుకుంటే ఎంతైనా పని సాధింపవచ్చును. పోనీ స్వయంగా ఆచరించక పోయినా, దానికోసం నిరంతరమూ శ్రమించేవారికి సహాయం చెయ్యడమైనా దాని కనీసధర్మము.

అయితే మనం అంతవరకూ ఎదురుచూస్తూ కూర్చోకుండా ఈ విషయంలో పరిశ్రమించేవారికి తగిన సహాయం చెయ్యాలి. ఆంధ్రులందరూ ఈ విషయంలో తగినంత శ్రద్ధ తీసుకుని అధమపక్షం ఆంధ్రశాఖా స్థాపనకైనా తగిన సహాయం చెయ్యగలరని ఆశిస్తున్నాము. ఈ విషయంలో విజ్ఞులైనవారు చూపించే ఉత్తమమార్గాలేమైనా ఉంటే ఈపత్రికా ముఖంగా సూచించవలసిందని ప్రార్థిస్తున్నాము.

# దా రు చి త్రా లు



అభిసారిక

శ్రీ. క. తణికాచలం

# తెలుగుఁ తల్లి

రావమ్మ మా తెలుఁగుతల్లీ – మమ్మేలు
కావమ్మ మా తెలుఁగుతల్లీ !
నీవె తల్లియుఁ దండ్రి – నీవె దైవము గురువు
నీవె సర్వస్వమని – నెఱనమ్మియున్నాము ! రావమ్మ !
కులవృత్తులనుబట్టి – పలుతెఱంగుల నున్న
తెలుఁగు లందఱికొక్క – కొలువిచ్చి కొలిపింప ! రావమ్మ !

పాడిపంటలు దేల్చి – పచ్చపట్టులు దాల్చి
భాగ్యభోగాలతో – బంగారుబొమ్మవై ! రావమ్మ !

తెలుఁగు పువ్వుల తేనె ! తెలుఁగు దివ్వెల తేజ !
తెలుఁగు గీముల గోము ! దెసలెల్ల దీపింప ! రావమ్మ !

కవిరాజహంస - కవికులాలంకార
శ్రీ వోలేటి పార్వతీశము
[వెంకట పార్వతీశ్వర కవులు]

# శివతాండవము

పండెవ్వుగుజ్జాలవలెఁ బరుగులాడునుగొన్ని
మందముగ మంచువలె మలసితిరుగునుగొన్ని
క్రిందుమీఁదై యీడిగిల బడును మఱికొన్ని
సందుసందున నక్కిసాగి పోవునుగొన్ని
కులుకునీలపుగండ్ల దళుకుజూపులుబూయ
ఘలుఘల్లుమని కాళ్లఁ జిలిపిగజ్జెలుమ్రోయ
ఆడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు

౧౯

కరశాఖలను నూర్మికలవోలె లగియించి
కరబంధములను గంకణములై జిగినించి
కరరుహంబుల యావకపు బొత్తుబండించి
యఱుత నూతనతారహారములు నిండించి
చరణముల మంజీరసౌందర్యములు గూర్చి
యురముపై నెఱబూత నెఱసినటు రుచిజేర్చి
యువలగ్నమున మేఖలవలె జట్టునజుట్టి
శ్రవణముల గుండలవిలాస సంపదగట్టి
కులుకునీలపుగండ్ల దళుకుజూపులుబూయ
ఘలుఘల్లుమని కాళ్ల జిలిపిగజ్జెలుమ్రోయ
నాడెనమ్మా! శివుడు!
పాడెనమ్మా! భవుడు!

౨౦

ఎలగాలి పై దేలి పొలయుగీతికవోలె
నెలపాప బెదవిపై మలయునవ్వునువోలె
కులపాలికా ముగ్ధ కిలికించితమువోలె
జలదాంగనాలలిత సంచారములువోలె

# కార్తికపౌర్ణమి

కార్తికపౌర్ణమీ చంద్రకాంతి పుంజ
ములు నటించెడు గౌతమీ జలములందు
సద్దుమణగిన యర్ధనిశా ప్రశాంత
వేళ విహరింప దోనెపై వెడలినాను.
పడవనడపు చుక్కాని త్రోపుడుల మెదలి
కలతనిద్దుర గంగమ్మ కలవరించె.
మినుకుబేడిసచేపల కనులు తెరచి
రెల్లుసందుల పొరలాడి మెల్లనవ్వె!
పాయలందేలు లంకల చాయలందు
ముమ్మరమ్ముగ కాశసుమమ్ము విరిసి,
పండుపున్నమి వెన్నెల పాలుగురిసి,
మడుగులంగట్టి పొంగిన వడుపుతోచె.
శివజటాజూట మల్లికాస్మిత మరీచి
వెల్లివొడువగ జగతి ప్రఫుల్ల మగుచు
స్నిగ్ధపీయూష ధారాభిషేచనముల
నార్ద్రమై నిల్చె మౌన ముద్రాంకితమయి!
రేయి యంతయు నొక్కటే హాయిలోన
స్వప్నసుందరదృశ్యమై సాగుచుండ
పాటువడె నేరు; నీటిత్రొవ్వడికి పడవ
కొట్టుకొనిపోయె నది వార్ధిఁగూడు కడకు.
పడవ దిగలాగు నీటిప్రవాహ సరణి,
సద్దు రవ్వంతలేని ప్రశాంత ప్రకృతి,
ఏదియొ 'లోకపు పిలుపుగా నుదధిఘోష,
అపుడు స్ఫురియించె ప్రాణప్రయాణమటులు!
భయము మూగిన యెడదతో నడచు పడవ
పరిమితియె లేని వారాశిపైన నిలిచె;
జిలుగువెన్నెలతెర వ్రాలి వెలుగులెసగి
తూర్పు మలపైన నుదయించె తొగరుప్రొద్దు!

శ్రీ కందుకూరి రామభద్రరావు.

# కోనేటి గట్టంట

ఆనాటి మనమాట
లంతలో మరుపటర ?
ఆరనీ చిచ్చు వెలిగిస్తావటోయీ ?
అరిపేదగుండె రగిలిస్తావటోయీ ?

పుచ్చపూ వెన్నెట్లో
పూతమామిళ్లలో
కలిసి మసిలిన రేల
మనసు కలిసిన వేళ

ఆ నా టి.........

కోనేటి గట్టంట
కూనిరాగము తీవు ;
నీలాటి రేవులో
నిలువునీరై పోన ?

ఆ నా టి.........

చీడీల పయినేటొ
సిగపూవు గాలింది !
నిన్న మొన్నటి బ్రమత
నేలపా లయ్యేన ?

ఆ నా టి.........

కడవనీళ్లు బుజాన
కరుడుగట్టే నోయి
దారి నొకమారైన
తారసిల్లవు నేడు !

ఆ నా టి.........

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం.

# అర్ధ శిల్పాలు



రామ పట్టాభిషేకము

శ్రీ డి. పి. నారాయణ రావు.

# శిల్పాచార్య అసిత్ కుమారుని ఇంట

శ్రీ సంజీవదేవ్

ఝాన్సీస్టేషన్ నుండి లక్నో వెళ్ళేబండి బయలు దేరింది. ఇంతవరకూ నీరవంగా కూచున్న ఒక బ్రిటిషు సైనికోద్యోగి నావైపు చూచి "ఎక్కడినుండి ఎక్కడకు" అన్నాడు. "దక్షిణాదినుండి లక్నోకు" అన్నాను. "జర్నలిస్టులా మీరు?" అన్నాడు. "నా వృత్తి జర్నలిజం కాదు కాని ఆరుసంవత్సరాల కొక సారి ఎప్పుడైనా గాలితిరిగితే కొద్దో గొప్పో కలం ఆడిస్తా." "మరి ఆర్టిస్టులా మీరు" అన్నాడు నవ్వు కొంటూ. "నేను ఆర్టిస్టును కాను కాని ఆర్టిస్టులకు మిత్రుడిని." "మరి లక్నో పోయే పనేమిటి" అన్నాడు మరల. "మిత్రుడు ఆచార్య అసిత్ కుమార హాల్దార్‌ను చూడపోతున్నాను" అన్నాను.

ఆ బ్రిటిషు సైనికోద్యోగి ముఖం ఏదో పరిచితవిష యాన్ని గ్రహించినట్లు ఆశ్చర్యసంభ్రమాలతో నిండింది. "ఓ, ఆయన్ని నే నెరుగుదును, అద్భుత మైన నవ్యభారతచిత్రకారుడు. నేనీదేశం రాక పూర్వమే హాల్దార్ గారి చిత్రావళితో నాకు పరిచయం కలిగింది. నేను ఇంగ్లాండులో ఉండగానే వీరి ప్రఖ్యాత "ఉమర్ ఖయాం చిత్రావళి"ని ప్రథమంగా చూట్టం జరిగింది. మా దేశంలో హాల్దార్ గారి చిత్ర కళకు మంచి ప్రేమగౌరవా లున్నయి." అని బండి కాన్పూరు రాగానే ఆయన సంతృప్తిసూచక ముఖంతో దిగివెళ్ళినాడు.

లక్నోలో గోమతినది దాటినపిమ్మట విశ్వవిద్యాల యానికి వెనకప్రక్కనే పెద్దతోట, అందులో విశాల మైన ప్రభుత్వపు బంగళా. అప్పటి కింకా అసిత్ కుమారహాల్దార్ ప్రభుత్వకళాసంస్థయొక్క ప్రిన్సి పాలుపదవినుండి విరమించుకోనందున ఆబంగళా లోనే నివసిస్తున్నాడు. తోటలో కాశ్మీర్ నుండి తెచ్చి నాటిన చీనార్ వృక్షాలు తమ విచిత్రమైన పత్రగుచ్ఛాలతో ఆ సంజకెంజాయలో అదేదో పరాయిదేశపు వాతావరణాన్ని సూచిస్తున్నాయి. తోటనిండా మొగలిపొదలూ ఇంకా అపరిచితా లైన అనేకరకాల, పూలుకలవీ లేనివీ, చాల చెట్లు న్నవి. మొత్తంపైన చూడగనే ప్రాచ్యవనంగానే కనపిస్తుంది.

పలచగా, పొడుగ్గా, పసిమిగా వుంటాడు హాల్దార్. వయస్సు ౫౫ వున్నప్పటికీ ౪౦ సంవత్సరాలకంటె ముదురుగా కనపడడు. సదా నూతనోత్సాహంతో వుంటాడు. వెళ్ళిన రాత్రి ప్రొద్దుపోయేదాకా చీనార్ చెట్లక్రింద మాట్లాడుతూకూచున్నాం. "ఎండా కాలపునెలవలు, ఈ సంవత్సరం ఎటూ కొండలకు పోదలచుకోలేదు. ఏదో వర్షాలు దేశంలో దిగేదాకా ఈ నెలరోజులపాటు మీరు ఇచ్చట కులాసాగా కాలం గడుపుతారుగదా అని మీకు రావలసిందని తంతి నిచ్చాను. కాని యీవేసంగి మండుటెండల్లో దక్షిణాదినుండి ఇక్కడకు రావటం మాటలుకాదు." అని చిరునవ్వు నవ్వినాడు.

బంగళాహాలులోకి ప్రవేశించగానే గోడపై, చెక్కమీద లక్కతో హాల్దార్ చిత్రించిన తన మొదటిభార్య చిత్రం నన్నాకర్షించింది. హాల్దార్ చిత్రంవైపు తదేకధ్యానంతో చూచి పైకుబికే పూర్వస్మృతుల నన్నిటినీ అణచుకొని ఒక్కబరువైన నిట్టూర్పు వదిలాడు. ఆ హాల్లోనే ఒకమూల ఒక చీనాదేశపుడోలు పెట్టివున్నది. ఇది చీనాడ్రాగన్లతో చిత్రితమై ఉన్నది. చీనాల్లో యీడోల్ను అని

బిసెంటమ్మగారికి కానుకగా ఇవ్వబడింది. హాల్దార్ అడయారు ఆహ్వానింపబడినప్పుడు బిసెంటమ్మగారు అడ్డోలును హాల్దార్‌కు బహూకరించిందట.

నవ్యభారత చిత్రకారుల్లో నందలాల్ బోసుకు పిమ్మట అసిత్ హాల్దారే దిట్ట. రవీంద్రనాథటాగూరుకు మేనకోడలు కొడుకు హాల్దార్. చిన్నతనంనుండీ రసతృష్ణా, జ్ఞానతృష్ణా ఆయన నవనీతహృదయాన్నీ, సునిశితబుద్ధినీ పీడింపసాగినవి. హాల్దార్‌కు వాస్తవంగా చిత్రకళలో గురువు అవనీంద్రనాథటాగూరైనప్పటికీ రవీంద్రుడు తనజీవితానికే గురువు అని అంటాడాయన. తనకళావికాసానికీ, కవితావికాసానికీ రవీంద్రుడే మహాప్రేరణ అని అంటాడు. రవీంద్రుని మృతి లోకానికంతా ఎంతలోపమో తన ఒక్కనికే అంతలోపం అంటాడు. రవీంద్రుడు తనకు కేవల బంధువేకాక ఆపద్బాంధవునివలె ఉండేవాడట. హాల్దార్ చిత్రరచనమాత్రమేకాక మూర్తినిర్మాణం కూడా చేస్తాడు అప్పుడప్పుడు. రవీంద్రుని మరణానంతరం ఒక పెద్దపరిమాణంలో ప్లాస్టరుతో రవీంద్రుని అర్ధమూర్తి (Bust) నిర్మించాడు హాల్దార్. ఈ మూర్తి రవీంద్రుని ప్రతికృతి అనేదానికంటె ఆయన మృతివల్ల హాల్దార్ హృదయంపై ముద్రితమైన విషాద, విరక్త, పూజ్యఅనుభూతులకు భౌతికరూపం అనటం మంచిదేమో.

ఒకరోజు మధ్యాహ్నం, రవీంద్రుడు తనకు ధారావాహికంగా వ్రాసిన జాబులకట్టను తెచ్చి చదివి వినిపించాడు. అన్నీ సుందరమైన పద్యాలు అనదగు బంగాళీ గద్యలో వ్రాసిఉన్నాయి. ఈలేఖ లన్నీ అనంతమైన విజ్ఞానంతోనూ, ఆనందమైన శిల్పానుభూతులతోనూ తరంగాయితమై ఉన్నవి. వీటిని ఒక పుస్తక రూపంలో సచిత్రంగా ప్రకటించమని సూచించాను, ఆయన సరే అన్నాడు. కాని ఇంతవరకూ అలాంటిపని ఏమీ ప్రారంభించినట్లులేదు. హాల్దార్ చిత్రకారుడూ, మూర్తికారుడూ మాత్రమేకాదు, కవీ, పండితుడూకూడ. ఈయన వంగభాషలో చాల కావ్యాలు రచించాడు. కాళిదాసు సంస్కృతకృతుల నన్నిటినీ బంగాళీకవితలో కనువదించి వాటికి చిత్రాలుకూడ రచించాడు. ఇప్పు డవి ముద్రితమవుతున్నాయి. కాళిదాసుని 'మేఘదూత'లో, విచిత్రమైన ప్రకృతిదృశ్యాల వర్ణనలుండగా వాటిని రంగులోనూ రేఖల్లోనూ చిత్రిస్తూ అన్నీ మానవచిత్రాలనే రచించాడు కాని ఒక్కటైనా ప్రకృతిసౌందర్యాన్ని తెలిపే దృశ్యచిత్రాన్ని రచించలేదు. ఇందుకు కారణం అడిగితే అన్నాడు, "కాళిదాసు ఉద్దేశం కేవలం ప్రకృతిని వర్ణించటం కాదు. ఆప్రకృతిసౌందర్యాన్ని తిలకిస్తున్నప్పుడు మానవహృదయంలో జనించే వివిధ మధురానుభూతులను ప్రదర్శించటమే కాళిదాసు ప్రకృతివర్ణనల్లోని ప్రాధాన్యం. కాబట్టి కాళిదాసు వర్ణించిన ప్రకృతిదృశ్యాలకు, నేను రంగుల్లోను, రేఖల్లోను రూపం ఇవ్వక ఆ దృశ్యాలను చూస్తుంటే మానవమానసంలో రేగే అనుభూతిప్రకంపనలకు మాత్రమే నాకుంచెలో రూపకల్పన చేశాను."

నే నచ్చట వుండగా 'రాజగాథ' అనేపేరుతో రాజస్థానవీర గాథలను వీరవంతమైన శైలిలో బంగాళీ కావ్యం వ్రాయ ప్రారంభించాడు. ఏరోజువ్రాసిన సర్గలు ఆరోజు నాకు వినిపించేవాడు. ఆయన ఆ గీతాలను గానంచేస్తూంటే. అవి ఆయనయొక్క శ్రావ్య చిత్రరచన కాబో లనిపించేది. కలకత్తా విశ్వవిద్యాలయంవారు ఈయనచేత కారుశిల్పాన్ని గురించి కొన్ని ఉపన్యాసాలిప్పించి దాన్ని ఒకగ్రంథంగా వంగభాషలో ప్రకటించారు. ఇంకా ఈయన వ్రాసిన 'భారతశిల్పకథ' 'యూరపుశిల్పకథ' అనే

కళాచరిత్రలనుకూడ కలకత్తా విశ్వవిద్యాలయం ప్రచురించింది. ఇంగ్లీషులో వ్రాసిన కొన్ని శిల్ప సమీక్షలను ఒక గ్రంథరూపంలో ప్రకటించారు. హాల్దార్ కళాస్రష్టమాత్రమే కాక ఒక నిశితసమీక్షకుడుకూడ. సృష్టి, సమీక్షా ఒకరిలోనే ఇమిడి వుండటం విచిత్రమైన సమావేశం!

హాల్దార్ యొక్క శిల్పశిక్షణ అవనీంద్రనాథ టాగూరువద్ద పూర్తిఅయిన పిమ్మట కొంతకాలానికి రవీంద్రుని ఆహ్వానంపై శాంతినికేతనంలోని కళాభవనపు ప్రధానిపదవిని స్వీకరించి, నందలాలుబోసు కంటె ముందే, చాలకాలం శాంతినికేతనంలో వున్నాడు. ఇచ్చట వీరి చేతిక్రింద అనేక ప్రతిభాశాలురగు చిత్రకారులు తయారైనారు. వీరిలో ఆంధ్రదేశంనుండి వెళ్ళిన వి. ఆర్. చిత్రా గారొకరు. ఈ సమయంలోనే హాల్దార్ కొన్ని విఖ్యాత చిత్రాలను రచించాడు. అందులో 'రాసలీల' అనేది ప్రధానం. నవ్యభారత చిత్రకళలో వ్యాప్తిలోవున్న చిన్న చిన్న చిత్రాలను రచించే అభ్యాసాన్ని ముందుగా అతిక్రమించి పెద్దపెద్ద చిత్రాలను రచించటం ఆరంభించింది హాల్దారే. అదీకాక అవనీంద్రుడు ప్రారంభించిన నవ్యరీతిలో ఎక్కువగా ఏకమూర్తి చిత్రాలే కాని సామూహిక రచనలు తక్కువ. సమూహరచనకు సరియైన భారసామ్యంతోకూడిన రచనాశక్తి అవసరం. ఇట్టి సమూహరచనను హాల్దార్ ప్రారంభించి చాల విజయవంతంగా తీసుకువచ్చాడు. హాల్దార్ యొక్క 'రాసలీల' యీ సమూహ రచనాపటిమకు సుందర సాదృశ్యం. ఇందులో రేఖల భంగిమాల మేళన అనుమేళనాల సామరస్యం అతి మధురం. భావప్రదర్శనలో ఈయనగారి 'దుర్దినాల్లో' అనే చిత్రం అద్భుతంగావుంటుంది. ధారాపాతంగా వర్షం, గాలీ, ఒక దీనురాలు శిశువుని వడిలోవుంచుకొని, ఉండ ఇల్లులేక, కట్ట బట్టలేక, ఒక చెట్టు వేళ్ళమీద నిరాశతో కూర్చొనివుంటుంది. ఆకాశం ఆహ్లాదకరమేఘాలతో ఆవృతమైవుంటే యీ దీనురాలిముఖం విషాదం, నిరుత్సాహం, నిరాశ, అయోమయంతో కూడిన మేఘాలతో ఆచ్ఛాదితమై వున్నది. ఇది మహాసూక్ష్మభావచిత్రణ.

హాల్దార్ రేఖానైపుణ్యంలో సిద్ధహస్తుడు. నందలాలుబోసు కూడ రేఖలో ఆచార్యుడే. వీరిద్దరి రేఖారచనలో ఒక తారతమ్యంవున్నది. బోసు రేఖ అజంతారేఖవలె ప్రస్ఫుటంగానూ పుష్టిగానూవుంటే, హాల్దార్ రేఖ రాజపుత్ర, మొగలు చిత్రాల రేఖవలె సూక్ష్మంగానూ, సుకుమారంగానూ, స్త్రీలాలిత్యం వలెనూ వుంటుంది. అంటే నందలాలు అజంతానూ, అసిత్‌కుమారు రాజపుత్ర, మొగలు చిత్రాలనూ అనుకరిస్తారని అర్థంకాదు. నందలాలుబోసు రేఖ గతిశీలమయితే అసిత్‌కుమారుని రేఖ లయశీలం. నందలాలు రేఖ మహాకావ్యపు గాంభీర్యమయితే అసిత్‌కుమారునిది ఖండకావ్యపు మాధుర్యం. ఒకరిది శివుని చేతి డమరుయొక్క మహారవమైతే రెండవవారిది శ్రీ కృష్ణుని వేణువుయొక్క ప్రశాంతగానం.

హాల్దార్ శాంతినికేతనాన్ని వదలిన తరువాత ఒక సంవత్సరంపాటు యూరపులో సంచారంచేసి అచ్చటి శిల్పసంపదను, శిల్పుల కార్యకలాపాలనూ, రసజ్ఞుల వాదాలనూ అనుశీలించి తిరిగివచ్చాడు. తదుపరి జయపుర మహారాజా శిల్పసంస్థకు ప్రిన్సిపాలుగా ప్రవేశించాడు. ఇచ్చటవుండగా జయపురరాజ్యంలో వ్యాప్తిలోవున్న అనేక దేశీయ చిత్రరచనా విధానాలతో పరిచయం చేసుకున్నాడు. చెక్కపై లక్కతో చిత్రించే రీతిని ఇచ్చటనే ప్రారంభించాడు. ఈ చిత్రరీతిననుసరించిన ఆధునిక భారతీయులలో ఈయనే ప్రథముడు. అసలు హాల్దార్

శిష్యులు తప్ప మరే భారతీయ చిత్రకారుడూ యీ లక్కచిత్రణను సాగించినట్టు కనుపించదు. ఇచ్చట ఈయన మొదటి భార్య, ఒక బాలికా, ఇద్దరు బాలురనూ విడిచి చనిపోయింది.

తరువాత ౧౯౨౫ వ సంవత్సరం లక్నోలో ప్రభుత్వ కళాసంస్థయొక్క ప్రిన్సిపాలు పదవిని స్వీకరించి అతి నైపుణ్యంతో నిర్వహిస్తూవచ్చాడు. సంయుక్తప్రాంతంలో కళాప్రచారం హల్దార్ కాలంలో పూర్తిగా సాగింది. ఇచ్చటనే హల్దార్ యొక్క అసలు జీవితం ప్రారంభించింది. రకరకాలైన నూతన చిత్ర సృష్టిచేయసాగాడు. అన్నిరకాలైన విషయవస్తువునూ తన రచనలోకి తీసుకొన్నాడు. పౌరాణిక, ఐతిహాసిక, సాంఘిక, భావ, సాంకేతిక, నైరూప్య (Abstract) చిత్రాలననేకం అనేకరీతులలో చిత్రించాడు. భారతీయ కళా ప్రచారానికి ఈయనచేసిన శ్రమ ఇంతింతకాదు. హల్దార్ ప్రతిభనుగుర్తించి అలహాబాదు మ్యూజియంలో 'హల్దార్ హాల్' అను పేర ఒక ప్రత్యేక చిత్రశాలాభాగాన్ని ఈయన చిత్రాలకై అంకితంచేశారు. ఈ చిత్రశాలలో హల్దార్ యొక్క అన్నిరకాల చిత్రాలూ అనేకం శాశ్వతంగా ప్రదర్శితమైవున్నవి. ఈ చిత్రశాల హల్దార్ జీవితంలోని ఆనందమయ, విషాదమయ దశలయొక్క దృశ్యరూపం అన్నమాట. ఇచ్చటి చిత్రమాల హల్దార్ భావరాజ్యాన్ని రేఖల్లోనూ, రంగుల్లోనూ వ్యక్తపరుస్తుంటుంది.

ప్రతిసాయంత్రం అయిదున్నరకు రాత్రిభోజనం ముగించుకొని లక్నోలోని దూరపు తోటలకో లేక హల్దార్ గారి మిత్రుల ఇళ్ళకో వెళ్ళి రాత్రి పదకొండు గంటలకు తిరిగివచ్చేవాళ్ళం. ఒకసాయంత్రం బాబూ మాతాప్రసాద సక్సేనా అనే చిత్రసంగ్రహాకుని ఆహ్వానంపై ఆయన ఇంటికి వెళ్ళాం హల్దారూ నేనూ. మాతాప్రసాదు అరవై సంవత్సరాలవాడు. వీరిల్లు పురాతనలక్నోలో వున్నది. ఈయన చాలాకాలం నుంచి ప్రాచీనచిత్రసంగ్రహం చేస్తుంటాడు అమెరికాలోని ఆనందకుమారస్వామికీ, కలకత్తాలోని ఒ. సి. గంగూలీ మొదలగు విఖ్యాత శిల్పరసికుల కందరకూ ఈ మాతాప్రసాదు చిత్రాలను అమ్ముతుంటాడు. ఈయన్ని చిత్రసంగ్రహాకుడనే కంటె చిత్రవ్యాపారి అనటమే సమంజసం. మాకు మంచులాంటి చల్లని షర్బత్తు త్రాగించినపిదప తన చిత్రసంగ్రహాన్ని ప్రదర్శించసాగాడు. అతని దగ్గిర అనేకకాలాల చిత్రాలున్నాయి. ముఖ్యంగా మొగలు, రాజపుత్ర చిత్రకళయొక్క ఇతరశాఖలైన కాంగ్రా, బసోలీ, బుందేలీ మొదలగు సాంప్రదాయాలకు చెందినవి వున్నవి. ఈ ప్రాచీన చిత్రవ్యాపారంలో కొంత మోసంకూడ వుండకపోదు. ఏవో కొన్ని నకలు చిత్రాలుతెచ్చి ఇవి కాంగ్రా చిత్రాలని, ఇవి జహంగీరు కాలంనాటివనీ అనుభవంలేని చిత్రరసికులను మోసగించే వ్యాపారులుకూడా వున్నారు. ఇందులో అసలేదో నకలేదో తెలుసుకోటం అంత సులభం కాదు. చిత్రవ్యాపారం రత్నవ్యాపారంతో సమానం. చిత్రపరీక్ష రత్నపరీక్షకంటె కఠినతరం.

ఒకసాయంత్రం పెద్దగాలీ చినుకులూ సాగినవి. ఎటూ బయటికి పోవటానికి వీలులేకపోయింది. వరండాలోవున్న సోఫాలమీద కూర్చొని గాలిదుమ్ము యొక్క శోభను చూడసాగాం. ఆకాశమంతా ధూసరవర్ణంతో నిండిపోయింది. తోటలో ఎటు చూచినా చెట్లు ఊయ్యాలలూగుతున్నాయి. కొన్ని కొమ్మలూ, రెమ్మలూ విరిగిపడుతున్నాయి. అస్పష్ట సంధ్యాకాంతిలో ప్రకృతంతా ఏకవర్ణంలో చిత్రించిన చిత్రమా అన్నట్లున్నది. హల్దార్ రసమయ ఏకాగ్రతతో ఆ విచిత్ర వాతావరణాన్ని చూస్తూ

కూర్చున్నాడు. ఇట్టి రసమయ ముహూర్తాల్లో కళాకారుల చిత్తవృత్తి ఏవిధంగావుంటుందా అని ఆయన ముఖంపైనకలిగే భావముద్రలను పరిశీలిస్తూ నేను కూచున్నాను.

"మీరు యీ దృశ్యాన్ని రేపు చిత్రిస్తారా" అన్నాను. "నేను వేసిన 'తుపాను' చిత్రాన్ని త్రివేంద్రంలో మీరు చూచియేవుంటారు. ఇందులోవున్న వేగాన్నీ, ఆవేగాన్నీ నేనా చిత్రంలో మూర్తికల్పన ద్వారా చూపించాను. కాని ఇలాంటి గమనశీల ప్రకృతిదృశ్యాలకు రేఖల్లోనూ, రంగుల్లోనూ రూపం ఇవ్వాలంటే ఆ చీనా, జపాను చిత్రకారులకే తగును. ప్రకృతిలోని గతినీ, స్థితినీకూడ సామరస్యపరిచి దృశ్యచిత్రానికొక అలౌకిక శోభను తెస్తారు. ప్రతి చిన్న గాలికీ, ప్రతి చిన్న గడ్డిపోచయొక్క ఊపుకూ, ప్రతిచిన్న వర్షబిందువుకూ వారి హృదయాలు చలిస్తుంటవి" అన్నాడు.

ఉదయం స్నానానంతరం తోటలో అటూ, ఇటూ తిరుగుతున్న సమయంలో ఆయన చిత్రించిన నైరూప్య (Abstract) చిత్రాల ప్రసక్తివచ్చింది. "నేను నైరూప్య చిత్రాలను రచించేటప్పుడు శిల్ప కౌశలమే ప్రధానమనే దృష్టి నాకుండ నేవుండదు. మన అవచేతన (Sub-conscious) లో సంచలనం కలిగినప్పుడు ప్రకృతిలోని ఏ ఆకారంతోనూ సాదృశ్యంలేని కొన్ని అసాధారణ రూపాలు గోచరిస్తవి. ఇవి దాదాపు మనం స్వప్నంలోచూచే రూపాలలాగా బుద్ధియొక్క హేతువాదాని కతీతంగా వుంటయి. వీటికి రూపం ఇవ్వటంలో కళాకారులు ఒక్కొకసారి ఆనందాన్ని పొందుతుంటారు. కాని వీటికి రూపంఇచ్చి చిత్రాన్ని హాస్యాస్పదంగా మారకుండా చేయటం చాలకష్టం. ప్రతిరూపానికీ మామూలుగా బహిరంగంగా కనుపించే ఆకారమే కాక ఆంతరంగిక ఆకారం ఒకటి వుంటుంది. ఇది మానవుని సహజచేతనలో మార్పు కలిగినప్పుడుగాని గోచరించదు. నైరూప్య చిత్రణకూ అతివాస్తవిక (sur-realism) చిత్రణకూ చాలా తేడా వున్నది. నైరూప్య చిత్రణలో అతివాస్తవిక చిత్రణవలె వికృతాకారాలను చూపాలసిన అవసరం వుండదు. నైరూప్యవాదం అటు సాదృశ్య చిత్రణా కాదు, ఇటు ఊహాచిత్రణా కాదు. ప్రతివస్తువుయొక్క బాహ్యరూపాన్ని కాక, దానిలో అణగిఉండే సూక్ష్మరూపాన్ని చూపటం నైరూప్యచిత్రణయొక్క కార్యం. అతి రసవంతమైన కవి హృదయంలేనిదే యీ చిత్రణ అసులభం" అన్నాడు గంభీరంగా.

దేశంలోని చిత్రకళ విషయం వచ్చి "ప్రథమంలో వంగీయులలోనే గొప్పచిత్రకారు లున్నమాట అవాస్తవం కానప్పటికీ ఇప్పుడు భారతవర్షపు ప్రతిప్రాంతంలోనూ వంగీయులను తలదన్నిన చిత్రకారులున్నారనేది నిర్వివాదాంశం" అన్నాడు. హాల్దార్‌లో సామాన్యంగా బంగాళీవారిలో కనుపించే బంగాళీలే మనుషులనే ప్రాంతీయత్వం గోచరించదు. ఒకసారి అన్నాడు "ప్రతిరాష్ట్రంయొక్క ఆర్టుస్కూలుకూ బంగాళీప్రిన్సిపాలులే నియమితులైయున్నారు. ఈపద్ధతి మంచిదికాదు. ఇందువల్ల ఆయాప్రాంతాలవారికి అసహిష్ణుతా అవమానమూను." సాధారణంగా ఇట్లాంటిమాటలు ఏబంగాళీ వ్యక్తిముఖంనుండీ రావు.

అసిత్‌కుమారహాల్దార్, కళాకారుడుగానూ, కవిగానూ, పండితుడుగానూ మాత్రమేకాక మనిషిగా కూడా చాల మంచివాడు. ఎన్నికష్టాలలోనైనా చాల ఉల్లాసంగా వుంటాడు. నైరాశ్యాన్ని దరిచేరనీయడు. నిరంతరం ఏదో ఒకపని చేస్తూనేవుంటాడు. సంకుచితప్రాంతీయవాదంనుండి విముక్తంగావుండి అన్నిప్రాంతాలవారియెడల భ్రాతృభావాన్ని కనపరుస్తాడు. ఎప్పుడూ తనహృద్ వీణాతంత్రులను అనంతచైతన్యంలోని అస్ఫుటనాదంతో మేళవింప చూస్తుంటాడు.

# అగ్నిపరీక్ష*

శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రి
సాహితీ సమితి

నా వింతజీవితంలో అనేక విచిత్ర విషయాలు విన్నాను; కన్నాను. అనేకమైన అద్భుతసంఘటనల్లో తటస్థంగానో, సాక్షీభూతంగానో కూడా ఉండడం సంభవించింది. కాని ఇప్పుడు చెప్పబోతున్నదిమట్టుకు చిత్రాతిచిత్రము. నిజమా! కలా! కల్లా! ఏమో ఏంచెప్పను. ఆమనిషిదగ్గరున్నంతసేపూ, అతని మాటలు వింటున్నంతసేపూ నిజమేనని నమ్మాను. అతను చెప్పిన భయానక, విషాదగాథకూడా నిజమనే నా నమ్మకం. కాని ఆ మనిషి? అక్కడే నాకు సందేహం. స్థూలంగా మనకు కనపడే పాంచభౌతిక శరీరంతో ఉన్నమనిషా? లేక ప్రేతో, భూతమో, పిశాచమో అంటే కానూవచ్చును. ఇందులో ఏది అని గట్టిగా నన్ను ప్రమాణంచేసి చెప్పమంటే నేను చెప్పలేను. ఆనాటినుంచీ నన్నా ఆ సందేహం బాధిస్తూనే ఉంది. ఇప్పటికేం తేలలేదు. నా జీవితాంతంవరకూ తేలుతుందనే నమ్మకం కలగడంలేదు. పోనీ ఆ వ్యక్తి ఎవరైతే మనకేం! అతను చెప్పిన కథాంశం ప్రధానం. అదిమట్టుకు నిజం. ముమ్మాటికీ నిజం అని తోస్తుంది. నీ కెలా తెలుసును? నువ్వుచూచావా అంటే, చెప్పలేను. నేను చూడలేదు. కాని కొన్ని విషయాలు విన్నప్పుడు మనలో ఒక అశరీరవాణి ఇది నిజమే! సందేహంలేదు. సందేహించకూడదు అని చెవులో హోరెత్తి చెపుతుంది, ఈ మనిషి మీ తండ్రి, ఈమె మీ తల్లి అంటే అవుననో కాదనో విశ్వాసం ఎలా కలుగుతుందో అలాగే ఇదీననుకోండి.

మొన్న నీమధ్య పెద్ద తుపాను వస్తుందనుకున్నాం చూచారూ! తుపాను లేకుండా పెద్దగాలి రోజున్నర వర్షంతో తేలిపోయింది. ఆనాడు జరిగిన సంగతిది. ఆ క్రితం రాత్రంతా ఆకాశం చిల్లుపడ్డట్టు ఏకధారగా వర్షం. ఆ రోజుకూడా మధ్యాహ్నం మూడు గంటలవరకూ తెరలు తెరలుగా, అంతులేని ఆగని దుఃఖంలాగ, కన్నీటి జడులులాగ వర్షంకురుస్తూనే ఉంది. మూడుగంటలయిన తరువాత శరీరాయాసంచేత దుఃఖోపశమన మయినట్లు, కొంచెం వర్ష ధారలుతగ్గి, తెరిపిచ్చింది. అయిదుగంటలవరకూ ఇంట్లోకూర్చుని, ఇంకవర్షంరాదని నిశ్చయంచేసుకొని, ఈ వర్షానంతరం పట్నం ఎలాఉన్నదో చూదామని బయలుదేరాను. వీధిలోకి వచ్చి నెమ్మదిగా సముద్రం వైపుగా దారి తీశాను. ఆకాశాన్ని ఇంకా కారుమేఘాలు కష్టపరంపరలులాగ తరుముకెడుతున్నాయి. పట్టణాన్నంతా ఒక బూడిదరంగు దుప్పటితో చుట్టిపెట్టినట్లు ఎటుచూచినా పొగమంచు కమ్మేసింది. పది గజాల దూరంలోకూడా మనిషి స్పష్టంగా కనపడడం లేదు. కారులూ, బళ్లూ, సినీమాలోలాగ, దెయ్యాలులా హఠాత్తుగా మన దృక్పథంలోకివచ్చి మాయమవుతున్నాయి. మెరీనా పేవుమెంటుమీద నిలబడి సముద్రంకేసి చూశాను. సముద్రపు ఘోష వినపడడమేకాని, సముద్రుని దర్శనంమట్టుకు కాలేదు. ఒడ్డునున్న ఇసుకమీద పల్లెవాళ్లు కాబోలు అస్పష్టంగా కలలో మనుష్యులులాగా ఇటూ అటూ తిరుగుతున్నారు. నేను అలాగే నిలబడి, ఈ వాస్తవికమనిపించే మిథ్యాజీవనం. దానిలోని వ్యర్థమైన కామక్రోధాలూ, రాగద్వేషాలూ మొదలైన వాటిని గురించి యోచిస్తూ, ఆశ్చర్యపోతూ, సత్యమైన అలౌకిక ప్రపంచానికి సోపానాలు ఎలా ఉంటే బాగుంటాయో అని ఊహాగానంచేస్తూ జాగ్రత్స్వప్నములకు

---

* రజతోత్సవానంతరం జరిగిన సాహితీసమితి ప్రథమ సమావేశంలో చదివిన కథ.

మధ్యనున్నట్టున్నాను. నన్నూ నా ప్రపంచాన్నీ కూడా మరచిఉన్న ఆస్థితిలో యముడి నిట్టూర్పులాంటి అతి శీతలవాయువొకటి నాకుసోకి, నా శరీరాన్నంతనీ ఒక్కసారి ఝుల్లుమనిపించింది. దానితో ఊహాప్రపంచంలోకి, ఒక్కసారి పైనుంచి ఎవరో తోసినట్టు, పడ్డాను. అప్రయత్నంగా పైనున్న ఖండువా దగ్గరగా కప్పుకుని, వెనక్కు తిరిగాను. అక్కడనుంచి కదులుదామని. కాని, వేళ్లుతన్నుకుపోయినట్టు కదలలేక పోయాను.

నా వైపుకు ఒకమనిషి వస్తున్నాడు. ఇంతసేపటినుంచీ, ఎంతమంది నా పక్కనుంచి వెళ్లారో నేను గమనించలేదు. కాని ఈ మనిషి చూపుమేరలోకి రావడంతోనే, నేను దివాస్వప్నంలోనుంచి జాగ్రదవస్థలోకి వచ్చానను కుంటాను. అతని సామీప్యమే నన్ను కదలనివ్వకుండా చేసిందనుకుంటాను. సన్నంగా పొడుగ్గా, గాలిలో తేలిపోతున్నట్టు నడుస్తూవచ్చాడు. తలంతా రేగిపోయిఉంది. పెద్ద గాలిదుమారంలో నడిచివచ్చినట్లు ముఖమంతా పీక్కుపోయి, అస్థిపంజరంమీద చాలీ చాలక చర్మంతొడిగినట్టుంది. కళ్లుమట్టుకు రెండు చీకటిగుహల్లోనుంచి మెరుస్తున్న అగ్ని శిఖల్లా కనపడ్డవస్తువునల్లా దహించేట్టున్నాయి. అతని వయస్సు 40 సంవత్సరము లుండవచ్చు లేదా 20 కంటె ఎక్కువలేవన్నానమ్మవచ్చు. శరీరంలో రక్త, మజ్జ, మాంసాదులున్నాయా లేవా అంటే లేనట్టే అనుమానం. అందుకనే ఆవ్యక్తి సజీవుడైన మనిషా లేక దెయ్యమో భూతమేనా అంటే యదార్థం చెప్పలేకపోవడం. ఆ మనిషి దగ్గరకు వచ్చినకొద్దీ, ఒక విధమైన భయంకలిగింది. ఒక విధమైన ఆకర్షణా ఏర్పడ్డది. ఆ మనిషినుంచి దూరంగా తొలగిపోదా మనిపించలేదు. అంతకంతకు దగ్గరగా వెళ్లుదామనిపించింది. కాని అతనే నెమ్మదిగా గాలికెరటంమీద వచ్చినట్లు తిన్నగా నాదగ్గరకు వచ్చాడు. మళ్ళీ ఒకసారి నా శరీరం కంపించింది. ఇతను మామూలుమనిషి కాడనే అనుమానం నాకు అప్పుడే కలిగింది. త్వరగా ఇంటికి పోదామనిపించింది. కాని కదల్లేకపోయాను. కణకణలాడే విస్ఫులింగములలాంటి కళ్లతో ఒక్కసారి నా కళ్లలోకి చూచాడు. ఆచూపుతో నాపంచప్రాణాలనూ గాలంవేసి లాగినట్టులాగి తన దారిని తను నడవసాగాడు. నా శక్తి నా స్వేచ్ఛ యావత్తూ పోయినాయి. నేను అప్రయత్నంగా అయిష్టంగా అతని వెనకాలే నడిచాను. కొంతదూరంసాగి నిర్జనంగా ఉన్నచోట, పేవుమెంటుమీదనుంచి ఇసుకమీదకు నడిచాడు. వెనకనే నేనూ దిగాను. నేను వస్తున్నానాలేదా అని మట్టుకు అతను వెనక్కు తిరిగి చూడలేదు. కాని నేను వస్తున్నానని అతనికి తెలుసననుకుంటాను. నాలుగడుగులువేసి ఆతను ఇసుకమీదనే కూర్చున్నాడు. నేనూ కూర్చున్నాను అతని కెదురుగా. కొన్ని నిముషాలవరకూ ఏమీ మాటలాడలేదు. అంతసేపూ నాకు భయంవేసేటట్లు నా కేసికాదు. నాలోనుంచి ఎక్కడికో మాస్తున్నాడు. అతనికళ్ళలో ఎక్కడివో, ఎంతోదూరాన్ని ఉన్నట్టు అగ్నిజ్వాలలు కనపడ్డాయి. ఆకాశం మరీ కారుకమ్ముకుపోయింది. మా చుట్టూఉన్న చేతనాప్రపంచమంతా స్తంభించిపోయింది. సముద్రఘోషలో ఎక్కడివో భయంకరమైన రోదనలు వినపడ్డాయి. గాలిలో శ్మశానవాసనలు మానాసికలకు సోకినాయి. ప్రపంచమంతాపోయి మేమిద్దరమే మిగిలినట్లనుపించింది. అతనికళ్ళవెంట కన్నీళ్లుకారడం మొదలుపెట్టినాయి.

భయంతో, గద్గదికతో 'ఏమండీ! విచారిస్తున్నారు విచారించకండి. మీ కభ్యంతరం లేకపోతే నాతో చెప్పండి. కొంత బరువు తగ్గుతుందేమో' అన్నాను.

ఉప్పెనలా పొంగివస్తున్న దుఃఖాన్ని నెమ్మదిగా ఆపుకుని 'చెపుతాను నాయనా. చెపుదామనే వచ్చాను. చెప్పాలి, అందరితోనూ చెప్పాలి. దాచి లాభంలేదు. చెపుతాను!' అన్నాడు. అని నెమ్మదిగా తనకథ ప్రారంభించాడు.

౨

తరుచుగా మనలో చాలామందికి అనవసరమైన విషయాలనుగురించి, అసాధ్యమైన ఆదర్శాలను గురించి, అర్థంలేని తత్త్వాన్నిగురించి తేలికగా మాట్లాడుతూఉండడం అలవాటు. కాని మధ్య మధ్యను అప్రయత్నంగా ఈవ్యర్థసంభాషణలోనే మనకు తెలియకుండానే సన్నిహితసంఘటనలు కొన్ని మనసంభాషణను రాజకీయసిద్ధాంతాలవైపో, జీవితాదర్శంవైపో, అహింసాసిద్ధాంతంవైపో, సత్యసాధనవైపో తిప్పినడిపిస్తాయి. నేనూ, రాజారావు— అన్నట్టు రాజారావును మీరెరుగరు కాదూ! మొదటి నుంచీ చెపుతాను. రాజారావూ నేనూ కూడా ఈ ప్రాంతాలవాళ్ళమే కాని చిన్నప్పటినుంచీ 'ఉత్తరదేశంలోనే చదువుకుని కలకత్తాలో ఒక పెద్ద కంపెనీలో చాలాకాలంనుంచి పనిచేస్తున్నాం. నెల రోజులు శలవు తీసుకుని ఇక్కడ పనులు చక్కపెట్టుకోడానికివచ్చాం. రాజారావు భార్యా, తల్లీ, తండ్రీ అంతా కలకత్తాలోనే ఉన్నారు. నాకు తల్లీ తండ్రీ లేరు. భార్య ఈప్రాంతాలనే పుట్టింటికి వచ్చింది. నేను నా భార్యనూ, రాజారావు తనసోదరినీ తీసుకుని కలకత్తా వెళ్ళవలెనని సంకల్పించుకుని మదరాసు నుంచి బయలుదేరాం. మాలో ఎవ్వరికీ శకునాలన్నా సూచనలన్నా నమ్మకంలేదు. మేము ప్రయాణం పెట్టుకున్నరోజు మంచిది కాదనీ, మరొక్క నెల రోజులు కూతుర్ని ఇక్కడనే ఉంచమనీ మా అత్తగారు చాలా బలవంతపెట్టారు. 'ఏమంటావు?' అని నా భార్యనడిగాను. ఆదివరదాకా ఉత్సాహంగా ప్రయాణమైనమనిషి కొంచెం మెల్లగా 'మీ ఇష్టం' అంది. 'నాకు చాలా తొందరపని ఉన్నది. నేను వెళ్ళక తప్పదన్నాను' 'అయితే నేనూ వస్తానన్నది' 'మీ అమ్మగారు అలా అంటున్నారు. నీకూ ఏవో కొన్నాళ్ళు ఇంకా ఉండవలెననే ఉన్నట్టుంది...' 'అబ్బే, లేదు, ఏంలేదు. మనస్సులో ఏవో ఆందోళన, భయం బయలుదేరింది హఠాత్తుగాను. కారణం ఏంలేదు, ఫరవాలేదు. వెడదాం. మీ రొక్కరూ ఇంకా ఎన్నాళ్ళు ఇబ్బంది పడతారు, నాకుమట్టుకెక్కడేం తోస్తుంది... ఎప్పుడూ ఇలా లేదు, ఎందుచేత నింతభయం... ఏ అజీర్తో, పైత్యమో... ఫరవాలేదు, రెద్దురూ అదే సర్దుకుంటుంది. మీరు వెళ్ళక తప్పదంటే నేను ఉండలేను. అనుకున్న ప్రయాణం ఆపడమెందుకు - నడవండి' అన్నది. కాని ప్రతిమాటలోనూ ఏవో వెనక్కిలాగుతున్నట్టే తోచింది. 'అయితే ఈపూట ప్రయాణమే'నన్నాను.

మళ్ళీ ఒకసారి రాజారావుదగ్గరకెళ్ళాను త్వరగా బయలుదేరమని చెప్పడానికి. 'ఏం రాజా! ఇంకా నిస్త్రాణగా అలా కూర్చున్నావేమిటి? ఇంక నాట్టే వ్యవధిలేదు. త్వరగా డబ్బాడవాలీ సర్దు' అంటూ లోపలికెళ్ళాను. రాజారావు ఏవో పరాకుగా ఎక్కడో చూస్తూఉన్నట్టుగా కూర్చున్నాడు. ఒక్కక్షణం నాకు సమాధానం చెప్పలేదు. 'వెడదామంటావా' అన్నాడు పెద్దనిట్టూర్పుతో ... 'అదేమిటి' అన్నా... 'ఏంలేదు ఏవో నాకు మతిపోతోంది. ఏదో మహాప్రళయం వస్తోన్నట్టు భయంకరమైన గర్జనలూ రోదనలూ వినపడుతున్నాయి. పెద్ద యుద్ధం జరుగుతోన్నట్టు దృశ్యాలు నాకళ్ళకు కట్టినట్లు కనుపిస్తున్నాయి. ఏవో ఆర్తనాదాలు, గర్భనిర్భేదకంగా నా చెవుల్లో హోరెత్తుతున్నాయి...

ఏమిటంటావు ఇదంతాను. నాకు అదోవిధమైన భయంగా ఉంది.' అన్నాడు. 'అయితేపోనీ ప్రయాణం మానేద్దామా. మా ఆవిడా కొంచెం సందేహిస్తోంది' అన్నాను. 'అలాగా...అయినా సరే, మనం వెళ్ళక తప్పదు. వెళ్లాలి. నేను అక్కడ ఉండితీరాలి. అనేక వేల గొంతుకలు నన్ను పిలుస్తున్నాయి. అనేక వేల చేతులు నాకేసి చాపిఉన్నాయి...ఇదేదో... కాదులే వెళ్లాలి. వెడదాం' అని లేచాడు ఉద్రేకంతో.

నేను ఇంటికొచ్చాను. నాకేమిటో అంతా అయోమయంగా ఉన్నది. నేను మామూలు మనిషిని. నాలో ఏవిధమైన సున్నితాలూ లేవు. కవిత్వాలూ, ధ్వనులూ నా కర్థంకావు. కాని రాజారావు, అతి సుకుమారి ...రూపంలోనూ, మనస్సులోనూ, హృదయంలోనూ కూడాను. ఎక్కడో జరుగుతున్నది అతను ప్రత్యక్షంగా చూస్తూన్నట్టు చెపుతా డొక్కొక్కప్పుడు. ముందురాబోయేవీ జరగబోయేవీ ఒకొక్కప్పుడతనికి తెలుస్తాయి. అతనిది Psychic nature అనీ experiments కు మంచి subject అనీ కొందరు అనగా విన్నాను. అందుచేతను అతనిలా అన్నాడంటే నాకూ ఏదో కొంతఅనుమానం కలిగింది. అయినాసరే అనుకుని కలకత్తా మెయిలుకు రెండుగంటల ముందుగానే బయలుదేరాం...సామాను బండిలో పెట్టి మేమూ బండిలోకూర్చుని పోనివ్వ మనేసరికి కట్టెల బండి ఒకటి ఎదురుగావచ్చింది. బండి ఆపి మా ఆవిడ ఒక్కమాటు లోపలికివెళ్ళి కాళ్లు కడుక్కుని మళ్ళీ వచ్చింది. మా అత్తగారు వచ్చే దుఃఖాన్ని ఆపుకుని కళ్లు వొత్తుకుంటూ నిలబడ్డది. తిన్నగా రాజారావింటికి వచ్చాం. వాళ్ళూ వీథిలోకిఅప్పుడేవచ్చి బండి ఎక్కుతున్నారు ... మా రెండు బళ్ళూ బయలుదేరి పదిగజాలన్నా సాగకముందు, మా ఎదట భయంకరమైన ప్రమాదం జరిగింది. ఒక లారీవచ్చి రిక్షాను డీకొట్టింది. రిక్షాలో ఉన్న మహమ్మదీయ స్త్రీ కెవ్వుమని కిందపడింది. వెంటనే ప్రాణంపోయి ఉండాలె. హాహాకారాలు, జనసమూహం కేకలూ... మాదారిని మేం వెళ్ళిపోయాం. అది పదహారో ఆగష్టు.

మేం వచ్చేసరికే రైలు సమ్మర్దంగాఉంది. మేం ఇంటరు క్లాసులో నెమ్మదిగా ఎలాగో ప్రవేశించాం. ఒక యుగంగా గడిచిన గంటతరువాత రైలు బయలుదేరింది. ఒక్కక్షణానికల్లా గభీమని ఆగింది. విచారించగా పడికట్టుమీదనున్న కుర్రవాడెవడో క్రిందపడ్డాడని తెలిసింది. వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పాపం ఏమయ్యాడో తెలియదు. పదినిమిషాలు తరువాత మళ్ళీ దుఃఖంతో బయలుదేరినట్లు బలువుగా బయలుదేరింది రైలు.

సుమారు ఎన్నూరు దాటేవరకూ పెట్టెలో గందరగోళం తగ్గలేదు. నెమ్మదిగ, నయాన్ని, భయాన్ని, కొంతచోటు సంపాదించి కూర్చున్నాం. మాలో ఎవ్వరికీ మనస్సులో ఉత్సాహంగా లేదు. ఎవరికీ మాట్లాడాలనిలేదు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మునిగి తేలుతున్నాం. ఒక్కక్షణంలా గడిచినకాలంలో సూళూరుపేట చేరాం. మళ్ళీ గందరగోళం, తిండికి పరుగులు, మళ్ళీ పావుగంటలో అంతా యథాస్థానాలు చేరుకున్నారు. మళ్ళీ రైలు బయలుదేరింది.

'కలకత్తాలో మతకలహాలు బయలుదేరాయట' అన్నాడు ఒకాయన పేపరుచేతపుచ్చుకుని. అందరి చూపులూ, చెవులూ ఆయనమీద కెళ్ళి చుట్టవేసినాయి. ఇవాళ ముస్లింలీగువారి Director action Day గనుక కలకత్తాలో అన్నిఆఫీసులకూ శలవు ఇచ్చారనీ, దుకాణాలన్నీ బలవంతాన మూయించారనీ, అలా అంగీకరించని దుకాణాదారులను చావ

మోది, వారిదుకాణాలు కొల్లగొట్టి కొన్నిటిని తగల పెట్టారనీ ఇంకా ఏవేవో చదువుతున్నాడు. మా కాళ్ళూ చేతులూ చల్లపడ్డాయి. మేము కూర్చున్న చోటునుంచి కదలలేదు. మా చెవులు పత్రిక చదివేవారి దగ్గరున్నాయి. మాహృదయాలు కలకత్తాలో ఉరికాయి. మామనస్సులలో మహాసంక్షోభం బయలుదేరింది. ఎవరికీ ఏమనడానికీ తోచలేదు.

అలా ఎంతసేపు కూర్చున్నామో తెలియదు. రైలు శ్మశానయాత్రలా నెమ్మదిగా పాకుతోన్నట్టనిపించింది. చుట్టూ అంధకారం మృత్యువులా ఆవరించింది. కొన్ని వేలక్షతగాత్రుల హాహాకారాలులా రైలుహోరు మా చెవులలో హోరెత్తుతోంది.

'మహా చెడ్డదారుణంగా ఉంది' అన్నాడు ఒకతను పక్కమీద సావకాశంగా పడుకుంటూ.

'ఈ జిన్నాగాడికేం పొయ్యేకాలం' అన్నాడు మరొకడు సిగరెట్టు పీలుస్తూ.

'అబ్బే వాళ్ళను దేశంలోనుంచి తరిమేస్తేనేకాని లాభంలేదు'

'తరిమెయ్యడమేమిటి. నల్లిని నలిపినట్టు నలిపి పారెయ్యాలి'

'అహింసనుకుంటూ ఈ గాంధీ ఒకడు మనకి...' తనేదో ప్రతీకారం చెయ్యబోతున్నట్టూ గాంధీవచ్చి తన చెయ్యి పట్టుకున్నట్టూను.

'ఈ కాంగ్రెసువాళ్ళు కొని తెచ్చుకున్నారు' అన్నాడు ఒక కమ్యూనిస్టు.

'కాంగ్రెసు కొని తెచ్చుకోడమేమిటి'

'వాళ్ళందరినీ చంపమన్నారుటయ్యా'...

'వాళ్ళేమైనా పల్లెత్తుమాటన్నారూ వాళ్ళని'...

'నీలాంటివాళ్లుండమట్టే దేశం ఇలాఅఘోరిస్తోంది.'

'మాటలు సరిగ్గా రానియ్యి'...'ఏంచేస్తావేం'...

'ఈమాట మళ్ళీ అనియ్యి'...'ఓమాటకాదు లక్షమాట్లంటా. అబ్బో ఈమాత్రం దానికే భయపడతాననుకున్నావా'...'అంత ధైర్యశాలివి కలకత్తా పోరాదూ' 'వెళ్ళనా మరీ. నీకు మల్లే దొంగతనంగా తప్పించుకు తిరిగేవాళ్ళంకాదు'...

'అహింస మంచిదేకాని, ఇప్పుడు గాంధీగారేమంటారో'...'ఆయన ఎప్పుడు చెప్పినా ఒక్కటే. మంచివల్ల చెడు నశిస్తుందంటాడు'...కాని ఇలాటప్పుడు ఇలాటి అత్యాచారాలు జరుగుతుంటే ఎలా చూస్తూ ఊరుకోడం'...

'ఇలాటప్పుడు కాకపోతే నీఅహింస మరెప్పుడు... ఇది పరీక్షాసమయం. పరీక్ష కాగలేకపోతే దాని ప్రయోజనమేముంటుంది'

'నిజమే ననుకో. కాని, నీకళ్ళఎదుట నీభార్యనో తల్లినో మానభంగంచేసి ప్రాణం తీస్తుంటే చూస్తూ ఊరుకోడం అహింసా, పిరికితనమా...' 'చూస్తూ ఊరుకోమని ఎవరన్నారు. ఊరుకుంటే పిరికితనమే!

'మరేం చెయ్యమంటావు'...'అయినా గాంధీగారేమంటారో ... ఆయనేదో ఒకదారి చూపిస్తే బాగుండును'...'చూపిస్తాడు. ఎలాగూ చూపిస్తాడు కాని ఎంతకాలం ఆయనమీద ఆధారపడడం, ఒక మహానుభావుడు ఒక సిద్ధాంతాన్ని మనకు చెప్పినప్పుడు దాన్ని ఆచరణలో పెట్టవలసినబాధ్యత మనది. ఏ పరిస్థితులలో ఎలా సరిపెట్టుకోవాలో నిర్ణయించుకోవలసినబాధ్యత మనది' అన్నాడు పిడుగులా రాజారావు. అంతవరకూ మేము ఆసంభాషణలో కలగచేసుకోలేదు. కలగచేసుకోవలెనని అనుకోలేదుకూడాను. మామనస్సులలో బయలుదేరిన తుపానులనే ఆపుకోలేకుండాఉన్నాం. ఈమాట అనడంలో రాజారావు ఇంతసేపటినుంచీ ఆలోచిస్తూ ఏదో నిశ్చయానికి వచ్చినవాడికి మల్లే మాట్లాడాడు, మేమంతా తెల్లపోయాం.

# అగ్నిపరీక్ష

'నిజమేనండి... కాని ఇలాటప్పుడు... ఎలా... ఏం చెయ్యడం. ఏమీ చెయ్యకుండా ఊరుకోడం ఎలాగ. ఇంతదారుణం ఎక్కడైనా ఉంటుందండీ' అన్నాడు భయపడుతూ ఆ పెద్దమనిషెవరో...

'ఊరుకోమని ఎవరన్నారు, ఊరుకోకండి. చేతనైతే వెళ్ళి ఆపండి' అన్నాడు రాజారావు. 'ఆపడమా! ఎవరాపగలరు ఆ రాక్షసులని. అంగుళో అహింస ఒకటూను...'

'ఏమీ!' తలుచుకుంటే ఎందుకాపలేరు. కాని మనం ఇక్కడనుంచి కదలం. మీనమేషాలు లెక్కపెడుతూ ఇక్కడే కూచుంటాం. ఎక్కడో ఎవళ్లో చస్తే మనకేం మన సిగరెట్లూ, మన కాఫీలూ, మన భార్యలూ ఉంటే చాలు—మనకు ఆత్మగౌరవం ఏనాడో చచ్చింది. అన్ని వేలమంది హిందూ స్త్రీలకు మానభంగం అవుతుంటే మనంకనక ఊరుకున్నాం కాని మరే జాతివాడూ ఊరుకోడు. మనం ఇలా ఊరుకుంటామని తెలిసేవాళ్లు చెలరేగడమున్నూ. ఇక్కడ హాయిగా కడుపులో నీళ్లు కదలకుండా కూర్చుని హింసా అహింసా అని తర్కించుకుంటూ మన మాంద్యానికీ అశక్తతకీ బాధ్యత ఎవరినెత్తిని తోద్దామా అని ఆలోచిస్తాం' అన్నాడు రాజారావు గుక్కతిప్పుకోకుండాను. తక్కినవాళ్ళ సంభాషణలు కట్టిపెట్టి, అంతా మావాడి కేసి చూచారు.

'మీరుమట్టుకేం చేస్తారేం' అన్నాడాయనెవరో.

ఏంచేస్తానా- వాడి దౌర్జన్యాన్ని శాయశక్తులా ఆపడానికి ప్రయత్నిస్తాను. ఆ ప్రయత్నంలో నా ప్రాణమైన ఒదులుకుంటాను. మా ఆడవాళ్ళమీదకు వొచ్చి పడితే మా వాళ్లని నా ముందు నా చేత్తో కడతేరుస్తాను. వాళ్ళచేతుల్లో మట్టుకు పడనివ్వను. ఇంకా అవసరమైతే వాడినీ చంపుతాను' అన్నాడు రాజారావు. అతని నోటివెంట ప్రతిమాటా మరఫిరంగిలోనుంచి వచ్చే గుండులా వచ్చి మాకు తగిలింది. అతని ముఖం వర్షాకాల సూర్యాస్తమయంలా ఉంది. అతని కళ్లు దివ్యజ్యోతుల్లా వెలుగుతున్నాయి. మా కందరకూ భయంవేసింది. అతను అవసరమైతే అంతపనీ చేస్తాడనే నమ్మకం మాకు కలిగింది.

ఇలా ప్రతిస్టేషనులోనూ ఎక్కేవాళ్లూ దిగేవాళ్లూ, ఈ విషయాన్ని గురించే వాదోపవాదాలూను. వార్తలలో ఇంకా భయంకరంగా చెప్పుకున్నారు. బరంపురం చేరేసరికి అక్కడవార్తలు - వినేసరికి గుండె లాగిపోయినాయి. కాని మాలో ఆడవాళ్ళకు కాని మగవాళ్ళకు కాని వెనక్కుపోదామని అనిపించలేదు. మాలో ఒక్కళ్ళకూ మళ్ళీ ఒకళ్ళనొకళ్ళం కలుసుకుంటామని కాని మళ్ళీ మనదేశం చేరుకుంటామని కాని నమ్మకం కించిత్తుకూడా లేదు. అయినా ఏదో అతీంద్రియమైనశక్తి మమ్మల్ని ముందుకు లాక్కుపోయింది... ఏలాగో కలకత్తా చేరుకున్నాం.

అక్కడ స్టేషనులో దృశ్యం వర్ణించడానికిశక్యం కాదు. దెబ్బలు తిన్నవాళ్ళు, కత్తిపోట్లు తిన్నవాళ్లు, పట్టణం విడిచి పారిపోయేవాళ్ళు, వయసువారు, ముసలివారు, బాలురు, స్త్రీలు—ఎన్నివేలమందో స్టేషనులో ఇసుకవేస్తే రాలకుండా ఉన్నారు. ఆ దృశ్యంచూస్తేనే పట్నం ఏ పరిస్థితులలో ఉన్నదో అర్థమయింది. ఎవ్వరినీ అడగకుండానే... ఊళ్ళోకి ఎవ్వళ్ళూ బళ్ళుకట్టమన్నారు. కార్లుకూడా ఏమీ దొరకలేదు. మేము సామాను అక్కడే పడేశాం. అదేమవుతుందన్న ఆలోచనే మాకు కలగలేదు. తిన్నగా ఊళ్లోకి బయలుదేరాం. వద్దని చాలా మంది వారించారు. ఆగమని బలవంతపెట్టారు. అక్కడున్న ఆడవాళ్ళు మా వాళ్ళను కౌగలించుకుని వెళ్ళవద్దని ఏడ్చారు. మేమూ మా వాళ్ళని అక్కడ

ఉండమన్నాం. వాళ్ళు ఉండమని మా వెంటబయలు దేరారు.

కలకత్తావీథుల్లో అహర్నిశాదు వెప్పుడూ సాధారణంగా తెరిపిఉండదు. ఎప్పుడూ జనం తిరుగుతూనే ఉంటారు. అలాటిది ఆనాడు వీథులన్నీ నిర్జనంగా ఉన్నాయి. బస్సూ కార్లూకూడా అట్టే తిరగడం లేదు. అప్పుడో ట్రాముూ అప్పుడో ట్రామూ హడిలిపోతూ వస్తోంది. చాలా దుకాణాల తలుపులు బద్దలకొట్టిఉన్నాయి. లోపల సరుకుపోగా మిగిలినది చెల్లాచెదరుగా ఉన్నది. అక్కడక్కడ కొన్ని కాలిన ఇళ్ళు ఇంకా కాలుతూనే ఉన్నాయి. రోడ్ల మీద అక్కడక్కడ శవాలు పడిఉన్నాయి. మేము మహాశ్మశానంలో నడుస్తున్నామనిపించింది. మమ్మల్ని చూచినవాళ్లు ఆశ్చర్యపోయారు మా మొండితనానికి. మేమూ అరిచేతుల్లో ప్రాణాలుపెట్టుకుని రాజమార్గాలు తప్పించి సందులా గొందులా పడి మా వీధి చేరుకున్నాం. మా వీధిచివర పెద్ద మిఠాయి దుకాణం ఎప్పుడూ తెరిచి ఉండేది. ఎప్పుడూ ఎంతో మంది అక్కడ మిఠాయిలు కొనుక్కుపోతుండే వారు. ఇవాళ ఎవరూలేరు. అలాగే అన్నీ మూయబడో బద్దలకొట్టబడో ఉన్నాయి దుకాణాలు. మా వీధిలోకి వెళ్ళుతుండగానే కొందరు తురకలు కత్తులుచ్చుకుని కేకలేసుకుంటూ మా వేపు పరుగెత్తుకొచ్చారు. మేము ఒక్కపరుగున మా గుమ్మంలోకి ఉరికాం. తలుపు వెయ్యబోతున్నాం నలుగురు తురకలు తలుపుతోసుకుని లోపలపడ్డారు. మా కందరకూ వొళ్ళు చల్లపడి రక్తం గడ్డకట్టినట్లై పోయింది. లోపల అంతా నిర్జనంగావుంది. మాకు పది అడుగుల దూరంలో రాజారావు తండ్రి చనిపోయి ఉన్నాడు. ఆయన వైపు చూస్తే చాలా ఘోరమైన దెబ్బలాట జరిగిఉండవలె ననిపించింది. అతనిమీదనే ఒకసాయిబుశవం పడిఉంది. ఇంకొంచెముఅవతలగా రాజారావు తల్లిశవం ఉన్నది. ఆత్మహత్య చేసుకున్నట్లుంది. మేము ఆలోచించడానికీ ఆశవాలను పరీక్షించడానికీ వ్యవధిలేక పోయింది. లోపలికివచ్చిన ముసిలిములు మమ్మల్ని ముట్టడించారు. ఇద్దరు మా ఆడవాళ్ళమీదకు దూకారు. నేనూ రాజారావు అడ్డు పడ్డాం. తక్కిన వాళ్ళిద్దరూకూడా వచ్చి మా మీద పడ్డారు. ఆడవాళ్లు గొల్లుమన్నారు. ఏం ప్రయోజనం. ఆ అరణ్యరోదనం ఎవరికి వినపడుతుంది. ఎవరువచ్చి అడ్డుపడతారు. వాళ్ళు కెవ్వుమనగానే ఒకముసిలిము వాళ్ళమీద కెళ్లాడు. మేము ఇంకా ఎక్కువగా కుస్తీపట్టాం. ఇంతలో హఠాత్తుగా నావీపుమీద బాకుతో ఒకడు పొడిచాడు. 'అబ్బా' అని నేను ముందుకుపడ్డాను. నేను కదలేరానను కుని ముసిలిములు ముగ్గురూ రాజారావుతో యుద్ధం ప్రారంభించారు. రాజారావు ఒక్కసారి దెబ్బలాటలోనే నాకేసి చూశాడు. నేను కదలలేకపోయాను కాని స్మారకం తప్పిపోలేదు. రాజారావు అభిమన్యుడులా, సవ్యసాచిలా దెబ్బలాడుతున్నాడు. చూస్తుంటే ఆశ్చర్యం వేసింది ఇంతశక్తి ఇతని కెలావచ్చిందని. అవతల ఆడవాళ్ళిద్దరూ కలిసి వాళ్ళమీదకు వచ్చిన మహమ్మదీయునితో దెబ్బలాడుతున్నారు. ఆపేచీలో ఎలాగో ఆతురకచేతులో కత్తిజారి నేలమీదపడింది. మెరుపులా నాభార్య ఎలాగో తప్పించుకుని ఆకత్తిని తీసి వాడిని పొడిచింది. వాడు కిందపడ్డాడు. సెబాష్ అన్నాడు రాజారావు. అంతా ఒక్కరెప్పపాటులో జరిగింది. రాజారావుతో దెబ్బలాడుతున్నవాళ్ళు ఇది చూచి ఇద్దరు అమాంతం ఆడవాళ్ళమీదికెళ్ళి వెంటనే నాభార్యను పొడిచేశారు. 'శివశివా' అని ఆవిడ ప్రాణాలు విడిచింది. రెండోవాడు రాజారావు చెల్లెలిని పట్టుకుని బలాత్కరించబోతున్నాడు.

రాజారావు ఒక్క ఊపులో తనను పట్టుకున్నవాడిని విదిల్చి పారేసి వాళ్ళమీదకురికి వాడిని చంపాడు. మిగతావాళ్ళ ఒకడు తనమీదకొచ్చాడు. రెండో వాడు అతని చెల్లెలిమీద కెళ్ళాడు. ఆ అమ్మాయి చటుక్కున పమిటకొంగుతో మెడకు ఉరిపోసుకుని ప్రాణం విడిచింది. చేతులోచిక్కిన ఇద్దరు ఆడవాళ్లూ కూడా దక్కలేదు కదా అనేకోపంతో ఆ సాయీబులలో ఒకడు ఆ అమ్మాయిని— చనిపోయిన దాని రొమ్ములు ... అబ్బ - దారుణమైన అత్యాచారాలు చెయ్యబోయాడు. ఎలా తప్పించుకున్నాడో మళ్ళీ రాజారావు తప్పించుకుని వాడినొక్కపోటు పొడిచాడు, వాడు చచ్చాడు. ఇంతలో నాలుగోవాడు వచ్చి రాజారావును చంపాడు. ఆడవాళ్ళ మెళ్ళో వస్తువులు తీసుకున్నాడు. వాళ్ళమీద మూత్రవిసర్జనం చేశాడు. వెడుతూ నన్నొకతాపు తన్ని చక్కాపోయాడు. ఈగాథంతా విద్యుద్వేగంతో జరిగిపోయింది.

ఇంక నేం చెప్పను. ఆ తురకలదౌర్జన్యం తలుచుకుంటే నఖశిఖపర్యంతం మండిపోతుంది. ఎందుకు వాళ్ళకు మనమీద నింతకోపం. వాళ్ళకు ఏమి అపకారం చేశాం. దారినపోయే ఆడవాళ్లను మానభంగం చెయ్యమనీ నిర్హేతుకంగా నిరపరాధులను చంపమనీ ఏధర్మశాస్త్రం చెపుతుంది. ఏమతప్రవక్త బోధించాడు. దానివల్ల వాళ్ళు సాధించే దేమిటి...... నేను మందుడను. వాటికేమి సమాధానాలు నాకు తోచడంలేదు. కాని మావీరవనితలను తలుచుకుంటే స్త్రీజాతిలో పరమేశ్వరి ప్రత్యక్షమవుతోంది. మా రాజారావు పరాక్రమం తలుచుకుంటే లయకారుడు రుద్రుడు ప్రత్యక్షమవుతాడు. అతను పోయినందుకు నేను విచారించడంలేదు. తలుచుకుని గర్వపడుతున్నాను. కాని తురకలొస్తున్నారని విని, ఇళ్ళూ వాకిళ్ళూ, భార్యలూ, బిడ్డలూ అన్నీవిడిచి పారిపోతున్న పిరికిపందలను చూచి సిగ్గుపడుతున్నాను. ఎక్కడో జరిగినది, మనకేం అనుకుంటూ, రేపు తమమీదకూ రావచ్చునన్నసంగతి గ్రహించకుండా, తమజాతిస్త్రీలకు జరిగే మానభంగాలుకూడా మరచిపోయి, హాయిగా నిశ్చింతగా తిరిగే...ఏమనను అని వలవల ఏడిచాడు.

నాకూ పట్టరాని దుఃఖం వచ్చింది. నేనెక్కడున్నది మరచిపోయాను. నా వంట్లో రక్తం ఉడికిపోతోంది. నా ఎదుట తెరమీద నాటకంలా, అంతకంటె స్థూలంగానే కలకత్తాదురంతాలు కొన్ని కనపడ్డాయి. దూరశ్రవణ దూరదర్శనాలలో కాని, Fourth dimension లో కాని నాకు నమ్మకం కాలేదు. కాని ఆనాడు నాకు ప్రత్యక్షమైనదృశ్యం భావనాచిత్రం అని ఒప్పుకోలేను. రేడియో మాటలులా వినపడుతున్న ఆ అపరిచితుని మాటలు కొంతసేపటికి వినపడడం మానేశాయి. కలకత్తాలో మనుష్యులు పరుగెడుతున్న చప్పుళ్ళూ, కత్తుల ఝళిపింపులూ, ఆర్తుల రోదనలూ మాత్రం వినిపించాయి. క్రమేణా అవికూడా Fade out అయిపోయాయి. నేనుమాత్రం కొయ్యబారిపోయి అలాగే కొంతసేపు కూర్చున్నాను. సముద్రం నన్ను పరామర్శిస్తున్నట్లు నెమ్మదిగా రోదించింది. కలకత్తా దురంతాలకు కన్నీరుకారుస్తున్నట్లు హఠాత్తుగా వర్షం ప్రారంభించింది. నేను జాగ్రదవస్థకు వచ్చాను. నా ఎదట ఎవ్వరూ లేరు.

నేను విన్నదంతా కలా, నిజమా? ఏమో!

# రా జ మా త

## శ్రీ. పి. గణపతి శాస్త్రి

అంకితం : కొమర్రాజు లక్ష్మణరావుగారికి

భారత యుద్ధానంతరము : హస్తినాపురమందలి రాజమందిరము ; సాయం సంధ్యా ప్రారంభ సమయమున దూరంగా గంభీరమైన ప్రయాణ భేరీధ్వని వినబడుతుంది. క్రమంగా ఆధ్వని సమీపిస్తూ రాజభవనంలో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. రాజభవన ప్రాంగణంలో కుంతీ గాంధారీ ప్రవేశిస్తారు.

[ తె ర లో ]

ధరణిఁ జతుస్సముద్ర పరిధౌతదుకూల, మహాత్మ ధోర్ద్వయిం
గరమనురాగమొప్ప, చిరకాలసుకమ్ములఁ దేల్చి, యింకను
ద్ధురపతిభక్తి, రాజ్ఞిదనతోఁ జనిరావనికేగఁ, బాలితో
ర్వర సెలవీయఁ గోరుధృతరాష్ట్రమహీపతి కానతీయరే!

గాం ధా రి

మహారాజ్ఞీ ! అదిగో ! ప్రయాణభేరీధ్వని గంభీరముగా వినబడుచున్నది. మహారాజుకూడ ప్రయాణోన్ముఖులై యున్నారు. నాకింక సెలవిప్పింపవామరి.

కుం తి

అమ్మా ! నీకీ పరిణతవార్ధకంలో వనవాసముచేయవలసిన ఆవశ్యకత ఏమికలిగినది ! నీవొక్కతెవైనా, పుత్రదుఃఖపీడితనైన నాసమీపంలో నివసించి, నాకు కొంచెము హృదయశాంతి కలిగింపఁగూడదా?

గాం ధా రి

మహారాజ్ఞీ ! నాకేలేని మనశ్శాంతి నీకెట్లు కలిగించఁగలను ? అదీగాక, మహాంధురాలివైన నాకుఁ గూడ, ఈ హస్తినాపురంలో, ఒక దుఃఖమయమైన స్మృతిలోకం, నిత్యమూ, కన్నులకు కట్టినట్లు కనఁబడుచున్నది. మరి యీ రాజధానిలో నే నింక నివసించఁగలనా ?

కుం తి

నీవన్నమాట సత్యమేకావచ్చును. కాని, దుఃఖధూమ పరివృతమైన ఆ పూర్వవృత్తాంతం స్మరించుకొని ఎంతకాలం కుములుతూ, కృశించగలవు ? నా సాన్నిధ్యంలో కొంచెమైనా నీ హృదయతాపం శమింపఁజాలదా ?

గాంధారి [నిశ్శబ్దము]

కుం తి

ఏమి మహాదేవీ ! సమాధానమీయవు ? నీ మనస్సంశయమేమో నా కెరిగింపఁగూడదా ?

గాం ధా రి

మహారాజ్ఞీ ! నీకేమో ఆ పూర్వవృత్తాంతం విస్మరించటం అంత దుష్కరము కాకపోవచ్చును. ఏమైనా తుదకు జయించినదానవుగదా ! నీవు !

# రాజమాత

### కుంతి

సోదరీ ! కొంత పొరబడుచున్నావుసుమా నీవు ! నాలోమాత్రం అగ్నిపర్వత సమానమైన దుఃఖోద్వేగం లేదనుకొన్నావా ? అభిమన్యు కుమారుని ఒక్క చిరునవ్వుతో ఈహస్తినాపురసామ్రాజ్యం సమానం కాగలదా?

### గాంధారి [సాక్షేపముగా]

నిజముగా అభిమన్యు కుమారుని ఒక హాసలేశంతో ఈ మహాసామ్రాజ్యము సమానము కాఁజాలదా ?

### కుంతి

కాఁగలదా ? మరి ! మహాదేవీ ! ఏమంతగా అనుమానించుచున్నావు ?

### గాంధారి

అనుమానించుట కేమున్నది ? కాని లోకప్రమాదము మాత్రము నీవన్నదానికి విరుద్ధముగానున్నవి.

### కుంతి [తీవ్రముగా]

ఆ లోకాపవాదమేమో నేను వినవచ్చునా ?

### గాంధారి

సహోదరవధకు కొంత సంకోచించిన అజాతశత్రువును—భీమార్జునాదులను—నీవే యీ మహమారణ హోమమునకు ప్రోత్సహించితివని లోకమంతా ముక్తకంఠముతో ఘోషించుచున్నది!

### కుంతి

ఏమని ? నేనే ఈ మారణ హోమమునకు ప్రోత్సహించితినని లోకమంతా అనుకొనుచున్నదా ? కావచ్చును—కాని —మహారాజ్ఞీ ! ఇంతేనా నీవు గ్రహింపఁగలిగినది ! నూర్గురు పుత్రులను కన్నదానవు నీవైనా నా హృదయము గ్రహించలేవా ? నా పుత్రపౌత్రులను—కేవలము —సామ్రాజ్యకాంక్షకై బలివేసితినని నీకే అభిప్రాయము కలిగినదా !

### గాంధారి

పోనిమ్ము మహారాజ్ఞీ ! గతమునుగూర్చి యిప్పుడీ వితర్కమెందులకు ? కాని సత్యము నిరూపింపవలసినప్పుడు మాత్రము కేవలము పుత్రవాత్సల్యము వలన ఇట్టి మహాసంగ్రామములు జరుగవుసుమా ! అయినా మరి—గతజల సేతుబంధనమేల ? దుఃఖవేగంవల్లవచ్చిన నా మాటలు మన్నించి నాకింక సెలవీయవా? మహారాజప్పుడే రాజద్వారముదాటి ప్రయాణోన్ముఖులై బంధువృద్ధామాత్యులతో సంభాషించుచున్నారు !

### కుంతి [నిశ్శబ్దము]

### గాంధారి

ఏమి! మహారాజ్ఞీ ! దీర్ఘాలోచనా నిమగ్నవైనావు! నన్ను మన్నించి వనవాసానికి సెలవీయవామరి!

### కుంతి

నీ మాటలలో మన్నింపవలసిన దేమున్నది ? నీ వన్నది యథార్థమే కావచ్చును.—కాని ఒక్క నిమిష మాగుము ! నేనుగూడ నీవెంటనే అరణ్యవాసమునకు వచ్చుచున్నాను—ఎవరక్కడ

పరిచారిక [ప్రవేశము]

జయము మహారాజ్ఞికి !

కుంతి

నేనుకూడ మహాదేవితో అరణ్యనివాసమున కేగుచున్నాను. వెంటనే వనవాస పరికరములను సిద్ధముచేయింపుము.

పరిచారిక

అమ్మా ! పాంచాలీ మహాదేవిగారికీ విషయము తెలియనే తెలియదుగదా !—మరి—

కుంతి

రాజమర్యాదలు నాకు నీవు తెలియఁజేయ నక్కరలేదు ! తత్క్షణమే సన్నాహము చేయింపుము.

పరిచారిక

చిత్తము. అమ్మగారి సెలవుప్రకారమే చేయుదును.

గాంధారి

మర్యాదకై ఉపచార వాక్యములు పలుకుచున్నావు కాఁబోలును !—మహారాజ్ఞీ ! ఇది మర్యాదా సమయముకాదు. ఇక నేను సెలవుతీసుకొందునా ?

కుంతి

ఎంత నిర్దయరాలవు మహాదేవీ ! ఇటువంటి సమయంలోకూడా నేను మర్యాదామాత్రానికే మాటలాడుచున్నానని తలచితివా ! పొరబడితి విసుమా ! నేనును స్థిరమైన వనవాసమునకే నిన్ననుసరించుచున్నాను.

గాంధారి

నాకు దిగ్భ్రాంతిగా నున్నది నీమాట ! పౌరుషముగా మాటలాడి నొప్పించితినేమో నిన్ను ! కడసారి నన్ను క్షమించి దయతో సెలవిమ్ము.

కుంతి

ఇందు క్షమింపవలసిన దణుమాత్రమైనాలేదు నీవాక్యములవలన నేను మహోపకృతి నందితిని. ఇందు నీకు నే నెంతో ఋణపడియున్నాను. ఇది యథార్థము !

గాంధారి

ఆశ్చర్యముగా నున్నదిసుమా ! నీ మాట ! నేను నీకు మహోపకారమేమిచేసితిని !

కుంతి

నే నింతకుపూర్వ మొక ప్రతిజ్ఞ పట్టితిని నీమాటలవలన నా కా ప్రతిజ్ఞ స్మృతికివచ్చినది. నేనా శపథ ప్రకార మీ సమయమున అరణ్య నివాసము చేయవలసియున్నది.

గాంధారి

ఇదియేనా నా మహోపకారము ! పుత్రపౌత్రులతో కలకలలాడు సామ్రాజ్యసంపద ననుభవింపవలసిన దానవు ! నీకీ దుష్కరారణ్యవాసమేల ? నామాట మన్నించి నీ నిశ్చయము మానుము !

కుంతి [గంభీరముగా]

మహారాజ్ఞీ ! నీ వెరిగినంతవరకు— కుంతి యెన్నడైన తన నిశ్చయమునుండి మరలినదా ?

గాం ధా రి

లేనిమాట నిశ్చయమే......కాని......

కుం తి

అయినయెడల మరి యెందులకీ వృథాకాలయాపనము ! నా వెంటనే చేయిపట్టుకొని తొట్రుపడకుండ నడచిరమ్మా ! మన మాలస్యముచేయరాదు ! సంధ్యాతప మరుణవర్ణము దాల్చినది.

గాం ధా రి

ఎంత ధైర్యశీలవు సోదరీ నీవు ! నీ వింతకు పూర్వము చేసికొన్న నిశ్చయమేమో నేను తెలిసికొనవచ్చునా ?

కుం తి

అమ్మా ! ఇంతకు పూర్వము నీ వన్నమాటలు నిశ్చయముగా యథార్థములు ! నేను నా కుమారులను సామ్రాజ్యముకొరకే యుద్ధముచేయించితిని !

గాం ధా రి

అదిగో తిరిగి ఆమాటలేనా ? దుఃఖోద్వేగంవల్ల నేనన్నమాట క్షమించరాదా ?

కుం తి

నీ వన్నమాటలలో పొరబాటులేదు ! భ్రాతృహింస చేయుటకు సంకోచించుచున్న అజాతశత్రువును అధిక్షేపించి, యుద్ధమునకు ప్రోత్సహించినది నేనే ! అతని నీ సామ్రాజ్యమునకు చక్రవర్తిగా సందర్శింపవలెనని ఆకాంక్షతో ప్రజ్వలించినది నేనే !

గాం ధా రి [వైముఖ్యంతో]

అయిన యెడల నీ కుమారులతోనూ కోడండ్రతోనూ, సామ్రాజ్యసౌఖ్యముల ననుభవింపరాదా !

కుం తి

కాని— నా కుమారుని పట్టాభిషేకానంతరము వనవాసముచేసి, తపశ్చర్యలో, శరీరత్యాగము చేయవలెనని నిశ్చయించితిని. ఆ పూర్వనిశ్చయము నేడు నీ వాక్యములవలన నాలో ఒక మెరుపువలె స్ఫురించినది. దీనికి నేనెంతో ఋణపడితి నన్నాను !

గాం ధా రి [ఆశ్చర్యంతో]

నీ హృదయ మెంత గంభీరమైనది !

[తె ర లో]

జనుషాంధ్యమ్మునఁజేసి పాండుపటు, దోస్సాహాయ్యముంబొంది, భూ
జనతాహ్లాదకరమ్ముగం ధరణి రక్షాదీక్షితుండైన, పా
లనమార్గ మ్మిసుమంతయేని యొకవేళం గొంతలోపమ్మునం
దిన, దానిం గరుణించి, వీనియెడ శాంతింబొందగాఁజేయరే !



5

కుంతి

అదిగో ధృతరాష్ట్రమహీపతి పౌరులయొద్ద సెలవుతీసికొనుచున్నాడు. నా చేయిపట్టుకొని మెల్లగా నడచిరమ్ము! ఇక్కడ జాగ్రత్తగా అడుగువేయుము. ఎవరక్కడ...సంధ్యాంధకారంలో స్పష్టంగా గుర్తింపలేకున్నాను. ఎవరువారు?

ధర్మరాజు

అమ్మా! నే నజాతశత్రువును. ఇతడు తమ్ముడు భీమసేనుడు. మహాదేవులవ కివే మా అభివాదనములు.

గాంధారి

నాయనా! దీర్ఘాయుష్మంతులై వర్ధిల్లుదురు గాక!

కుంతి

మహారాజా! మీకు సర్వాభీష్టములును సిద్ధించినవి. ఇంకమరి ఆశీర్వదించుట కేమున్నది! అయినను ధర్మానువర్తులై, కంటికి రెప్పలవలె మీ సామ్రాజ్యమును సంరక్షించుకొందురుగాక!

గాంధారి

నాయనా! పురద్వార మతిక్రమించి వచ్చితిమిగదా! దేవాలయములలో పరమేశ్వరుని సంధ్యా తాండవ మృదంగధ్వను లప్పుడే మందగించుచున్నవి. మరి మేమింక సత్వరముగా పోవలయునుగదా!

ధర్మరాజు

ఇదిగో మరలిపోవుచున్నాము! మహారాజ్ఞీ! సంధ్యాసమయ మతిక్రమించి చీకటిపడుచున్నవి. నేనింకను కొంతదూరముపోయి వీరందరిని సాగనంపి వచ్చెదను. నీవింక వీరియొద్ద సెలవుతీసుకొని, మరి రాజభవనమునకు మరల గూడదా!

కుంతి

మహారాజా! నేనీ అత్తమామల కిరువురికిని పరిచర్యలు చేయుచు, అరణ్యమందే నివసింప నిశ్చయించితిని. ఇక మరి రాజభవనమునకు తిరిగి రాజాలను. నీవింక రాజగృహమునకు మరలిపొమ్ము!

భీముడు

ఎవరు మహారాజ్ఞీ! నీ అత్తమామలు!

కుంతి

ఎవరామాటలు! నీవే నా ఇప్పుడు మాటలాడినది!

భీమసేనుడు

ఔను నేనే! ఎవరా అత్తమామలు!

కుంతి

బంధుత్వముకూడ విస్మరించుచున్నావు కాబోలును! నాయనా! మరిఅన్నగారు పితృసమానులేకదా!

భీముడు

అవును. అంతమాత్రము నాకు తెలియకపోలేదు! అన్నగారు పితృసమానులే!

కుంతి

అట్లయిన ధృతరాష్ట్రమహారాజులును గాంధారీదేవియును నా కత్తమామలు కారామరి!

భీ మ సే నుఁ డు

మహారాజ్ఞీ ! నీవు మహారాజ మాతవుగదా ! మరి నీవెరుగని రాజధర్మ మేముందును !

ధ ర్మ రా జు

అమ్మా ! నీవీవార్ధకదౌర్బల్యంలో వీరికేమి పరిచర్యచేయగలవు ? నేను వీరితోబాటరణ్యములకు పోయి, వీరి పాదపరిచర్యచేసి మనశ్శాంతి పొందగోరుచున్నాను. నీవు నా బదులు రాజభవనమునకు మరలి, నీపుత్రపౌత్రులచే సామ్రాజ్యము పరిపాలింపజేయుము.

కుం తి

మహారాజా ! నన్నింక మరలుమని ప్రార్థింపకుము. నేనింక తపోవనమునకేగుట దృఢనిశ్చయమై పోయినది. మరి—నా జీవితమున కోరికలన్నియును సిద్ధించినవిగదా ! ఇంక నేను ప్రశాంత మనస్కనై పోవుచున్నాను. కాని ఒక్క రెండువిషయములు మాత్రము నన్ను వేధించుచున్నవి ! నకుల సహదేవు లిరువురును తల్లిలేని పిల్లలుగదా ! వారిలో సహదేవ కుమారుఁడు మిక్కిలి ముగ్ధహృదయుడు. వీరిద్దరికిని తల్లిలేదను లోపము లేకుండ చూచుచుందువుగాక !

ధ ర్మ రా జు

అమ్మా ! నీహృదయ మింత హిమాలయస్థిరమై పోవుచున్నదని నే నెరుగలేకపోయితినిసుమా !

కుం తి

ఇక రెండవ విషయము. కర్ణుని విషయములో నేను నిష్కృతిలేని మహాపరాధ మొనర్చితిని. అది తలచుకొన్నప్పుడెల్ల నా హృదయము చీలిపోవుచున్నట్టుండును. కాని యిప్పుడు విచారించిన ప్రయోజన మేమి ! కర్ణుని పారలౌకిక క్రియలయం దతిశ్రద్ధాళుడవై ప్రవర్తింతువుగాక ! మరి నాకు కాలమతిక్రమించుచున్నది. నేనింక పోవుదునా ?

ధ ర్మ రా జు

అమ్మా ! ఉత్తర పరీక్షిత్కుమారు నెత్తుకొని నీకు నమస్కరించుటకై తొందరగా వచ్చుచున్నది. ఒక్కసారి వెనుకకు తిరిగి పరీక్షిత్కుమారు నాశీర్వదింపవా ?

కుం తి

నాయనా ! ఉత్తరాపరీక్షిత్కుమారులను చూచినయెడల ఇక నాకు ముందడుగిడుట మిక్కిలికష్టము. ఇంక నన్నీ స్నేహపాశములతో బంధింపకుము. వారిని సకలశ్రేయోభివృద్ధికరముగా నాశీర్వదించితినని చెప్పుము. నీవు సర్వధర్మజ్ఞుడవుగదా ! నీకు నే నింక బోధింపవలసిన ధర్మము లేమున్నది !

భీ మ సే నుఁ డు [తీవ్రస్వరముతో]

మహారాజ్ఞీ !

కుం తి

ఏమి భీమసేనా ! నావైపంత తీవ్రముగా చూచుచున్నావు.

భీ మ సే నుఁ డు [గంభీరముగా]

నీ యీ వనవాసము కేవల మాత్మవంచనము !

కుంతి

వనవాసము కేవల మాత్మవంచనమా! ఎంత విచిత్రము! ఎందుచేత?

భీమసేనుడు

ఇంత విరక్తురాలవుగదా! నీవు! మరి మాచేత ఈ మహాసంగ్రామమేల చేయించితివి!

కుంతి

నా ఒక్క ప్రేరణచేతనేనా మీరందరును యుద్ధము చేసినది? మీకు కొంచెమైనా ప్రతీకార కాంక్ష లేనేలేదా?

భీమసేనుఁడు

మాలో కౌరవులపై క్రోధజ్వాల రగులుచున్నమాట నిజమే! కాని నీ ప్రేరణాజంఝామారుతమువలన అది ప్రళయాగ్నియై, కౌరవవంశము భస్మీపటలము చేసినది!

కుంతి [గంభీరముగా]

అవునవును నేనే ప్రేరేపించితిని! దాని మూలముననే కదా! అరణ్యలో కిరాతులవలె హీనులై సంచరించుచున్న మీరు, నేడీ సామ్రాజ్యసంపదలతో తులతూగుచున్నారు.

భీమసేనుఁడు

అవును! నీవన్నమాట నిజమే! అందుచేతనే నీవుకూడ మాతోకలిసి నీవు సంపాదించుకొన్న ఈ సామ్రాజ్యసుఖముల ననుభవింపుము. అంతేగాని, ఇప్పుడీ అరణ్యావాసము కేవల మసంబద్ధము.

ధర్మరాజు

అన్నన్నా! భీమసేనా! తొందరపడి ఎంత అపచారముగా మాట్లాడుచున్నావు.

కుంతి

నేనీ వార్ధకదశలో సామ్రాజ్యభోగముల ననుభవించుటకేనా మిమ్మీమహాసంగ్రామమునకు పురికొలిపినది!

భీమసేనుఁడు

లేకపోయినయెడల సమూలముగా ఈ మహావంశచ్ఛేద మెవరికోసం జరిగినది?

కుంతి

ఈ అక్షరములు భీమసేనుడేనా ఉచ్చరించుచున్నది. ఎంతలో ఎంతమార్పు వచ్చినది! నేనింకను మిమ్ము యుద్ధమునకెందుకు ప్రోత్సహించితినో చెప్పవలసియే యున్నదా? నాయనా! నాకీవిషయము దుర్భరముగానున్నదిసుమా! పోనీ! భీమసేనా! అలనాడు నిండుసభలో నీ కన్నులయెదుట ద్రౌపదీ మానభంగము జరిగిన విషయము జ్ఞాపకమున్నదా? లేక పూర్తిగా మరచిపోయితివా?

భీమసేనుఁడు

ఎంత గంభీరమైన తిరస్కారము!

కుంతి

ఆమాత్రము జ్ఞాపకమున్న చాలును. ఆనాడు ఆదుస్సహావమానము భరించి, నిస్తేజస్కులైన మీ క్షత్రియత్వమును విజృంభింపజేయుటకై మిమ్ములను యుద్ధమునకు పురిగొల్పితిని. అంతేకాదుసుమా! మహాపౌరుషవంతమైన ఈ పాండవవంశము పదునాలుగేండ్లరణ్యవాసము చేసిన మీతో దుర్బలమై పోవుచున్నదని

భయపడి, మిమ్మిట్లు రణరంగమునకు ప్రేరేపించితిని. మీరు క్షత్రియధర్మములు విస్మరించి, భీరువులవలె దీనులై పోదురేమోనని అగ్నివర్షము కురిపించు అధిక్షేపశూలములతో మిమ్ము ధర్మయుద్ధమునకు ప్రోత్సహించితిని. అంతేగాని,—

### ధ ర్మ రా జు

అమ్మా! భీమసేనుని ధోరణి నీ వెరుగుదువుగదా! దీనికై నీవింత ఉద్వేగపడవలయునా?

### కు ం తి

ఇంతేగాదు! నాకుగూడ దుర్బలాతి దుర్బలమైన మాతృహృదయమున్నదిసుమా! కాని ఆహృదయ భారం దిగమ్రింగి, కాలసర్పిణినై నా పుత్రపౌత్రులైన, కర్ణాభిమన్యుల నిద్దరినిగూడ కేవలము, ధర్మసంస్థాపనకై ఈ మహాయుద్ధాగ్నిలో హోమము చేసితిని. అంతేగాని, చంచలమైన ఈ సామ్రాజ్య భోగముకొరకు కాదుసుమా!

### ధ ర్మ రా జు

అమ్మా! నిన్నువిడిచి యుండలేక భీమసేను డట్లన్నాడుగాని, అతనికిమాత్రము నీవిధి నిర్వహణము తెలియదా?

### కు ం తి

మహారాజా! కేవలము రాజధర్మ సంస్థాపనకై, నేనీ సంగ్రామమున కంగీకరించితినని నీవొక్కడవు మాత్ర మెరుగుదువు. అసిధారా సదృశమైన రాజధర్మముకూడ నీ వెరుగనిదికాదు! కాని ప్రతిదినమును,రాజ గృహమందలి యీ రోదనధ్వనులు, ఈ పారలౌకికక్రియలు, ఈ వృద్ధదంపతుల హృదయములో పగిలిపోవుటకు సిద్ధముగానున్న ఈ నరకదుఃఖాగ్నిపర్వతము, ఈ పౌరజనుల విషాదఘోషము ఇవన్నీ కలిసి మీలో క్షత్రియ రక్తమింకింపఁ జేయునేమో అని భయమువేయుచున్నది.

### ధ ర్మ రా జు

అమ్మా! నా కంఠములో ప్రాణములు నిలుచునంతవరకును, రాజధర్మ నిర్వహణమున కేవిధమైన లోపమును రాదని దృఢముగా విశ్వసింపుము!

### కు ం తి

మాతృసమీపమున చేసిన శపథముసుమా! ఇది!

### ధ ర్మ రా జు

అమ్మా పసినాటినుండియు నన్నెరుగుదువు. ఇంకను నామాట విశ్వసింపలేవా!

### కు ం తి

నాయనా! భీమసేనా! అజాతశత్రుని ప్రతిజ్ఞవలన నాకూరట గలుగుచున్నది. మరి నా అత్తమామలకు పరిచర్య చేయుటే నా అంతిమవిధి. ప్రశాంతమనస్కనై నావిధి నిర్వహణమున కేగుచున్నాను. నీవుగూడ ప్రసన్నవదనముతో నన్ను వీడ్కొల్పకలవా?

### భీ మ సే నుఁ డు

అమ్మా! నీ ఉద్బోధనమువలన నాలో ధర్మజ్యోతిర్దర్శన మగుచున్నది. కాని అజ్ఞానమువలన నిన్నెంతో నొప్పించితిని. లజ్జాభక్తి భరితమైన హృదయముతో నిన్నిదే వేడుకొనుచున్నాను. నన్నుకరుణించి క్షమించుము.

కుంతి [చిరునవ్వుతో]

ధర్మసూను డన్నట్లు, నా యెడబాటు సహింపలేని సంతాపముతో నీవట్లు పల్కియుందువు. అంతే గాని నీవన్నమాటలలో క్షమింపవలసినదేమున్నది. కాని నన్నమ్మా! అనిమాత్రము సంబోధింపకుము. అరణ్యములలో నివసించినను నేను మహారాజమాత నే సుమా! కేవలము మహారాజ్ఞీ! అనియే నన్ను సంబోధింపుము!

భీమసేనుడు

అమ్మా! నీ వింకను మహారాజ్ఞివే కావచ్చును గాని, నీలోని మాతృత్వ మెంత గంభీరమైనది! కావున మరల నిన్ను ఒకసారి అమ్మా! యనియే నోరార పిలిచికొననిమ్ము!

కుంతి

నాయనా! పెద్దవాడవైనను, నీలో చిన్నతనము పోలేదుసుమా! మహాదేవీ! గాంధారీ! ఈసంభాషణమువలన నీ మనసు కొంచెము నొప్పించితినేమోఅని భయముకలుగుచున్నది. సోదరి క్షంతవ్యురాలుసుమా!

గాంధారి

మహారాజ్ఞీ! ఎంతమాటాడితివి! గతి జలసేతుబంధనము వ్యర్థమేకాని, నీవలెనే నేనుగూడ ధర్మార్థమే రాజమాతనైనచో ఈ మహాసంగ్రామమే జరగకపోయియుండునుగదా!

[తెరలో]

తోరణ మంథరమ్ములయి, దూరబలాకలు పర్వులెత్తి, యొ
య్యారముగా, హఠాత్తరళయానమునం దరుపీథికేగ, సిం
దూరతుషారవర్షరుచితో, రవికాంతివెలింగె గూళ్ల, నో
పౌరమహాత్ములార! కురుభర్త జనం దమ రానతీయరే!



# నారు చిత్రాలు



రాసనీల

శ్రీ డి. పి. నారాయణ రావు.



వృషభము

ఒక జపాను చిత్రకారుడు

# MUSINGS

## "చలం"

సుఖమూ బాధా ఈరెండే విలవలు. ఏదైనా సరే, ఏ యత్నమైనా అన్నీ, అన్నీ, విడతీసిచూస్తే చివరికి మిగిలే అసలువిలవలు, బాధనించి తప్పించుకోడమూ, సుఖాన్ని అనుభవించడమూ.

ఏరాజ్యాంగ సంస్కార, సాంఘిక, ఆర్థిక, విద్యాయత్నాలలోనూ ఆలోచించుకోవలిసింది ఈ రెండు సంగతులే. తక్కిన మాటలు ఎంతగొప్పవి మాట్లాడనీ, ఎంత గొప్పవుపకారాలు చేస్తున్నామని మోసపుచ్చుకోనీ, వీటిని తప్పించి ఆలోచిస్తే మాట్లాడితే, ఆ మాటలకి, అర్థమూ, సారమూ లేవు.

జ్ఞానవంతుడికీ మూర్ఖుడికీ, ధనవంతుడికీ దరిద్రుడికీ, స్వతంత్రుడికీ బానిసకీ, సుఖానుభవంలో భేదంలేకపోతే, లేనివాళ్ళని ఉన్నవాళ్ళకింద మార్చడానికి యత్నం అర్థహీనం. ధనం వొచ్చాక, బీదతనపు సుఖంపోయినవాళ్లు అనేకులు. చదువుకున్న జాతుల్లోంచి సుఖమూ శాంతి ఎక్కడా కనపడకండా వుండడం చాలా సాధారణంగా చూస్తున్నాము. ఒకప్పుడు రెండు బాధల్లో ఏది నయమూ అని ఆలోచించుకోవలిసి వొస్తుంది. బ్రహ్మచర్యం బాధ. సంసారం అంతకన్న బాధ.

వున్నది బ్రహ్మచర్యం, లేనిది సంసారం. అందుకని లేనిదాంట్లో ఏదో శాంతి వుందనిపించడం సహజం. సంసారాలు కొనితెచ్చుకుని ఆ కొత్త చిరాకుల్లో చిక్కుకుంటారు. ధైర్యం వివేకం వున్నవాళ్లు దాంట్లోంచి మళ్ళీ బ్రహ్మచర్యంలోకి పోతారు, దానికి సన్యాసమని పేరుపెట్టి.

పూర్వం పంచముల నేవాళ్ల బతుకు మురికి,మూర్ఖం, దరిద్రం. గుడిశలో చదువుకున్న హరిజన బాలిక జుట్టుశుభ్రం, శుభ్రమైన బట్టలు. మాట్లాడిస్తే కొంత తెలివి. కాని ఈ హరిజనబాలిక మనసులో ఎంత మెలికలు Complexes. తనికి తెలీని అర్థంగాని మాటలూ, సూత్రవాక్యాలు ఎన్ని ఏకరుపెడుతుంది!

ఎంతమూర్ఖంగానీ, మురికిగానీ, ఊరివాళ్ళు దయతలిచి దూరంగా వాళ్ళ ఇరుకుమురికి సందుల్లోంచి తరిమితే మాలగూడెంలో బతుకుతున్నారు. మాలగూడెమని జాలిపడడమేగాని, ఎండిన ఎముకల్ని చూసి అసహ్యించుకోడమేగాని, చాలా వూళ్ళకన్నకూడా శుభ్రం, అందం. గాలీ, ఎండా వాళ్ళకి గొప్ప మిత్రులు, శానిటరీ డిపార్టుమెంటు.

రాజకీయంవారికీ, సంస్కర్తలకీ, వాళ్ళనిచూసి జాలి. రోగాలతో, ఆశలతో, నిరాశలతో, కాపరపు చిరాకుతో, కాఫీహోటళ్ళకే డబ్బులేదనే చింతలతో, ఎదటిపార్టీపైన ద్వేషాలతో, ఎగబాకుళ్ళతో, కుమిలి చచ్చే యీ ప్రచారకులకి ఆ హరిజనుల్ని చూసి జాలి.పట్టణాలలో యీవిద్యార్థుల గదులలోకి ప్రవేశించలేము. రెండు నిమిషాల సేపు శుభ్రంగా మాట్లాడలేము వాళ్ళతో. వాళ్ళకీ హరిజనులపైన జాలి.

"నాకు తెలుసు. గడ్డంకింద కర్రపెట్టుకుని శాంతంగా స్వేచ్ఛగా ఎక్కడోచూస్తో ఐక్యం లేకండానుంచునేవాడు మహారాజులాగు భూమికంతా తానే కర్తఐనట్టు పాలికాపు. ఈ నాడు విద్యావాసననుపొంది, స్వేచ్ఛ, నిర్మలత్వం అతనిలోవుండే ఆరోగ్యం, సూనృతం నశించి, హక్కులకోసం యాతన, అనుమానం, ద్వేషం. తానెట్లా కనపడుతున్నానా, ఎక్కడ బైట పడిపోతానా, అనే

భయంతో ఎంత దుర్భరుడై నాడు హరిజనుడు! ఎంత ఐశ్వర్యాన్ని పోగులుకున్నాడు! అతను నీచుడనే భావం మనమనస్సుల్లోంచి కదిలి, అతని మనసులో లోపలికి ప్రవేశించింది'' అంటున్నారు లీల.

తాను బతకడానికో, కీర్తికో, ఎగపాకడానికో, తన Emotions కో, తనమనసు లోపలి అన్యాయ భావభారాన్ని తీర్చుకోడానికో, హరిజనోద్ధరణ అవసరమవుతోంది. ఇంక మనం ఏంమాట్లాడినా, మన మాటల్లో వాస్తవం గోచరించదు, గోచరించనీరు. రాజకీయంగా అవసరమూతోవొచ్చాకే, సంఘంలో మతంలోని దోషాలు క్రమంగా గోచరిస్తోవొచ్చాయి గాంధీగారివంటి సూనృతవాదికి కూడా.

కనక సంస్కారం పొందవలసింది, ముందు నాగరికతా విద్యా పొందిన మనుషుల జీవితాలు. సుఖం శాంతీ, సూనృతం, ఉత్పన్నమయ్యేట్టు, సాంఘిక, ఆర్థిక పరిస్థితులు మారాలి. అంతవరకు ఇతరుల్ని సంస్కరించి తమస్థితికి తీసుకురావాలనే ఈ ప్రయత్నం వుత్తమోసమూ అన్యాయమూ అవుతుంది. తాము వున్నది ఎంత అధమస్థితో ముందు గమనించాలి ఈ సంస్కర్తలూ, ప్రజాసేవకులూ.

నీ సోదరుణ్ణి నీవలె ప్రేమించు అన్న జీసస్ వాక్యానికి, ముందు నిన్ను నువ్వు గొప్పగా ప్రేమించుకుంటేనే గాని—నిన్ను నువ్వు నీచంగా ప్రేమించుకుంటే, నీ సోదరుణ్ణీ అట్లానే ప్రేమిస్తావని వ్యాఖ్యానంచేశాడు ఆస్కార్ వైల్డు.

కాని మానవుడిలో ఎప్పుడూ మారాలని, ఏదో అభివృద్ధి కావాలనే ప్రోద్బలంవుంది. ఒక్క మానవుడిలో ఏమిటి, సమస్తమైన సృష్టిలోనూ కనపడుతుంది. మా ఇంటిముందరి బంతిమొక్కల్లో కనపడుతుంది—కొత్త అందాలు ధరించే అన్వేషణ. కుక్క 'మే' లో కనపడుతుంది. తన యజమానిని అర్థం చేసుకు నేపూర్తిజ్ఞానం లేదే అనే దిగులు. ఒకసమాజం, ఒకజీవి, ఏ విధమైన శక్తికోసం, జ్ఞానంకోసం, స్వేచ్ఛకోసం, పెనుగులాడుతున్నాడో అటు చేయూత ఇవ్వడం ఉదారులపని. కాని తన బాధ నివారణకోసం, తానొక ఆధిక్యత కల్పించుకోడం కోసం ఇతరులపైన సంస్కారం ప్రారంభించడం ఘోరం. మోటివ్ ని పైనించి ఎవరూ తెలుసుకోలేరు. ప్రతిసంస్కారీ తన హృదయంలోని ప్రేమనూ సూనృతాన్ని తానే పరీక్షించుకోడం అవసరం.

సౌందర్యానుభవమూ అంతే.

గొప్పకళాసృష్టి అనుకున్న సినీమాలు, పాటలు, చిత్రాలు, పుస్తకాలు ఎక్కువ ఆనందాన్ని ఇస్తున్నాయా?

భవభూతిని చదివితే పండితుడికి వొచ్చే ఆనందం కన్న బాలనాగమ్మ చదివే పామరుడికి తక్కువ ఆనందం వొస్తోందా? నిశ్చయంగా చెప్పగలమా?

బాలనాగమ్మని ఆనందించే మనిషిని ఎందుకు భర్తృహరికోసం విద్యామరలో పెట్టి తిప్పడం? జ్ఞానమంటారా? సుఖాన్ని హెచ్చుచెయ్యాలి అనుభవం కోసం, జ్ఞానంకోసం, మార్పుకోసం యత్నించడం మూర్ఖం.

లోకమంతా ఒకసుందరసముద్రం. అందాన్ని నిరంతరం అనేకరూపాల వెదజల్లుతోంది ప్రపంచం మీద. ఏయూలనించో మాస్తో కీటకాలనించి గొప్ప మేధావంతులదాకా అనుభవిస్తున్నారుసౌందర్యాన్ని. తాము చూసింది ఇతరులు చూడలేకపోతున్నారనీ, తామెదో గొప్పఎత్తున గొప్పవి అనుభవిస్తున్నామనీ, ఇతరుల్ని ఆస్థితికి తీసుకురావాలనీ తపనపడడం చాలా ఉదారం, కాని మూర్ఖం. వాళ్ళు అనుభవిస్తున్నారు కాని నీ కవి సౌందర్యాలమల్లే కనపడవు. పుస్తకంలో తలదూర్చుకుని లొట్టవేసేపండితుడూ! తనగుడిశలో బిచ్చగాడు ఎండనీ, గడ్డినీ, మేకపిల్ల

గంతులీన్నీ, బిడ్డల చిరునవ్వులీన్నీ అనుభవిస్తున్నాడు. నువ్వు వాటిని పుస్తకాల్లోనూ, పటాల్లోనూ వర్ణిస్తేనే గాని గుర్తుపట్టలేని హీనస్థితిలో పడ్డావు. వాళ్ళని వుద్ధరిస్తావా నువ్వు! వుడకపెట్టి, వేయించి, కౌరంచల్లితేనేగాని చిలగడదుంపలో రుచిపోయింది నీకు. జీర్ణంకాదు. పచ్చిచిలగడదుంపలు హాయిగా రోడ్డుమీద కొరుక్కుంటో పొయ్యే గడ్డిమోపు మనిషికి సంస్కారాన్నిస్తావా?

ఈ కార్మిక కర్షక వుబలాటంలో ముప్పాతిక అంతా ఇదేరకం.

దరిద్రంలో, మూర్ఖంలో, అస్వాతంత్రంలో వుంది బాధ.

కాని ఐశ్వర్యంలో, జ్ఞానంలో, స్వాతంత్ర్యంలో వున్న ఇరుకు, యాతన భయం ఇంక దేంట్లోనూ లేవు.

అన్నిటికన్న, తిండికన్న, రక్షణకన్న మానవుడు కోరేది స్వేచ్ఛ. తనశరీరానికీ మనసుకీ సుఖాన్ని కోరి, మరిగి, పిట్టలకీ మృగాలకీ వున్న స్వేచ్ఛను పోగొట్టుకున్నాడు మానవుడు. ఆవులకీ గేదెలకీ కష్టించకుండా తిండీ, రక్షణా అన్నీ వున్నాయి. కాని ఏనిమిషానైనా ఆకళ్ళలో దీనత్వం పొగిలి కనపడతాయేమో! యుగాలకిందట పోయిన తమ స్వేచ్ఛకోసం ఈనాటికింకా వెతుక్కుంటో నిరాశలో బతుకుతున్నాయి. పాలుతాగుతున్న దూడని గుంజేసినప్పుడు ఆవువంక చూడండి. ఎన్నిజంతుబలులబాధ సమానమౌతుంది ఆనిమిషం ఒక్కతల్లిపడే దీనత్వానికీ అసహాయత్వానికీ! విప్లవాలు, హత్యలు, ఆస్తిప్రాణాలమీద నిలకడలేకపోవడం, ఏవీ సరికావు. అస్వాతంత్ర్యపుశాంతిలో, రక్షణలో మానవులు పడే వేదనతో.

“అధికారం మనవాళ్ళచేతుల్లోకి వొచ్చింతరవాత ఎన్నిఘోరాలు, హత్యలు, సమ్మెలు ... స్వతంత్ర ప్రారంభంలోనే ఇట్లావుంటే ... ఏంలాభం ఈ స్వతంత్రం?” అన్నారు లీల.

నిజమే. ఇంక అనేకసంవత్సరాలు చైనాలోవలె అంతర్యుద్ధం, పైదేశాలతో యుద్ధాలతో యీ దేశం క్షోభపడడమే తటస్థిస్తే! ఎందుకీస్వతంత్రం! లోకమంతా కాలిపోతున్నా, రెండు గొప్పయుద్ధాలనించి రక్షించిన పాలకుల్ని పొమ్మని మనం తెచ్చుకుంటున్నదేమిటి? దానికి వసంత అన్నాడు. “ఎందుకా రక్షణ! ఈ నిర్జీవదాస్యంకన్న ఏ బాంబులూ, హత్యలూ ఘోరంకావు!”

“అట్లా దూరంగా యోచించి మాట్లాడకు. ఆ బాంబులూ, హత్యలూ మనఇంట్లో మనవాళ్ళకే మన కళ్ళముందు జరిగినట్లు యోచించుకుచూడు.” అన్నాను.

“నిజమే. దగ్గిరిగా యోచించుకోలేము. కాని ఆ బలహీనాన్ని పట్టి, లోకమంతా క్షోభపడుతూ వుంటే, నాదేశం, నాఇల్లు, క్షేమంగా వుండాలని యోచించడం చాలా సంకుచితం. చైనామాత్రం, పడనీకష్టాలు. వందయేళ్ళ ఆకష్టాలల్లోంచి జ్ఞానమూ ధైర్యమూ జాతి నేర్చుకుంటేచాలు చివరికి.” అన్నాడు.

“రెండుమూడు తరాల మనుషులు ఏ బాధలుపడి ఎంతనశిస్తేనేం, ఎప్పుడో వందయేళ్ళతరవాత మనుషులు ఏదో నేర్చుకుంటారని నమ్మకపడడం చాలా optimism అప్పుడేం నేర్చుకుంటారో, ఇంక ఏ దైన్యం దిక్కులేక అణగారి పోతారో! వాళ్లు నేర్చుకునేలోపల, ఆ పాఠాలవల్ల ప్రయోజనంలేకండానే మారిపోతుందో లోకం!” అన్నాను.

“ఆవిధంగా యోచిస్తే ఏ ప్రయత్నంలోనూ అర్థం లేదు: తన స్వార్థం తనుచూసుకునే పందికొక్కుగాళ్ళని ఎంత చెండాడావు ఇదివరకు? ఇప్పుడు లీలగారి మాటలమీది గౌరవంవల్ల ఇట్లా మాట్లాడుతున్నావు” అన్నాడు.

“తనని గొప్పగా ప్రేమించే ప్రియురాలి మధురమైన వాక్కునించి జ్ఞానం సంపాయించలేని పురుషుడు ఏ శాస్త్రాలనించీ ఏ విజ్ఞానంనించీ ఏమీ నేర్చుకోలేడు” అన్నాడు. ప్రేమలో గొప్ప నాజూకులు అనుభవించిన రూసో.

ఈసారి బాపయ్య అంటున్నాడు సముద్రం కేసి చూస్తో "ఈయువకులు వూరికే యువతులు వాళ్లకోసం చాలాలని ఆశలు పడతారుగాని, వూరికే వొస్తారా? ఎంతశ్రమపడాలి? దీక్షవహించాలి ఒక్క స్త్రీ రావాలంటే!" అమ్మాయిల్ని పట్టడం ఇంగ్లండులో ఒక టెక్నిక్ ఐనట్టు, యీదేశంలో ఆడపిల్లల్ని పట్టడం ఒక టెక్నిక్, ఒక సాధన! కష్టేఫలీ. ఆకష్టంలో ఎంత ఆనందం వుంది! ఎందుకంటే అందంకోసం పడే కష్టం. కాకాంతో thrill 'థ్రిల్' అవుతో ఆశ పడే బాధ. నాలుగురోజులు అట్లా సముద్రంకేసి ఎండని చూస్తో చూస్తో కాచోడం -- కలలు కనడం ఎంతశాంతి! చీరకొంగు, బూట్సులచప్పుడు, కంఠం పిలుపు... మల్లెపువ్వులపరిమళం... one shy look, one hesitating smile — చాలు ఆ రోజుకి! సాయంత్రం మధ్యలోవలో కలుసుకుంటే, "నువ్వు నాకోసం వొస్తావని తెలుసు" అన్నమాట తొందరగా. "Darling, Be patient. I will come," చాలు!

చివరికి ఇద్దరిమధ్యవున్న ఇరవైగజాల సముద్రాన్ని ఆరాత్రి దాటి మర్నాడు, "O Beloved, Last night in your arms I felt I was in Heaven" అన్నమాట స్త్రీనించి అనిపించుకో గలిగిన రసికత్వంకోసం, నాలుగురాత్రులు నక్షత్రాలమధ్య వెతికితేనేం? ఆమాటని స్త్రీనించి విన గలిగిన ధన్యుడు ఇంక ఏకీర్తికోసం వెతుక్కోన క్కర్లేదు ప్రపంచంలో. పూర్వపునాయికలు, ఉత్తరీయాన్ని, పయ్యెదని, అంగుళీయాన్ని వొదిలివెళ్ళే వారు. 1941 నాయికవి నువ్వు, నాకు పొరబాటున side-clip వొదిలావు! విక్టోరియా! దీన్నే టాగూరు,

"I am hopelessly born in the age of the busy printing press and you, my love, are utterly modern" అన్నారు.

అవును. ఏప్రయత్నంలోనైనా సరే, స్వార్థయత్నమైనా సరే, ఇతరులకోసమైనదానికోసం యత్నించేసే మనిషి, తక్కినవారికన్న చాలా ఉన్నతుడని పిస్తుంది. కాని ఏం ప్రయత్నిస్తున్నాడు. దాంట్లో ఎంత వివేకముంది అనే ప్రశ్న రాకమానదు.

మళ్ళీ వీళ్ళల్లో రెండురకాలు.

ప్రయత్నం చెయ్యకండా వుండలేనివాళ్లు. ఏదో సాధించడానికో, ఆయత్నంలో నశించడానికో పుట్టినవాళ్ళు. వీళ్ళకి నిరాశ లేదు, యత్నించడమే వీళ్ళకి తృప్తి. ఫలితంలో ఎక్కువప్రసక్తిలేదు. విఫలులవుతున్నా ప్రయత్నం విరమించుకోలేరు.

కాని చాలా మంది ఒక ఆశయం, ఉద్దేశ్యం పెట్టుకుని, అది సఫలమౌతుందనే ఆశతో నే, నమ్మకంవుంటేనేగాని, యత్నం చెయ్యలేనివాళ్ళు. వీళ్ళదే చాలావరకు గోల ఈ ప్రపంచంలో. వీళ్ళనిచూస్తేనే జాలివేస్తుంది, ఏం వూహించుకుని ఇంత త్యాగం చేస్తున్నారు, ఏం రాబోతోంది? అని.

చాలామంది ప్రజ ఏ స్వార్థానికో గొప్పకో యత్నించే నాయకుడి గొప్పమాటల్లోపడి మోసపోయే దౌర్భాగ్యులు. అతనికి ఘనతను సాధించి పెట్టే నౌకర్లు.

జీవితమంటేనే యత్నం. యత్నం లేకండా ఎట్లాగూ నిలవరు. మూర్ఖంకానీ, జ్ఞానవంతంకానీ.

కమ్యూనిజంపట్ల వొచ్చే సందేహం ఇదే. ఈ ప్రపంచంనించి చాలా చెత్తని వూడ్చేస్తుంది. బాధల్ని తీసేస్తుంది. కాని స్థిమితంకోసం, తిండికోసం, స్వతంత్రాన్ని అర్పించమంటుంది. ఒక్క స్వతంత్రంకోసం, అంతకన్న విలువగల పది స్వాతంత్రాల్ని అరికట్టుకోవలిసి వొస్తుందేమోనని.

బిచ్చగాడి స్వేచ్ఛ; పిట్టలస్వేచ్ఛ. ఎన్ని బాధలలోంచి అతన్ని బిచ్చంలో నిలిపింది ఆ స్వేచ్ఛ. ఊరంతా తిరుగుతాడు ఆడుక్కుంటో. సినిమాని చాటుతో పూరంతా తిరగు దబ్బిస్తామంటే, సణుగుతాడు మళ్ళీ.

తిండికి స్వతంత్రం, మాటకి స్వతంత్రం, వోటుకి స్వతంత్రం, కాదు కావలిసింది. వీటికి మించిన స్వతంత్రం, నాతో వున నేనుంటే, నా జోలికి ఎవరూ రాని, దేనికీ బలవంతంలేని స్వతంత్రంకావాలి. నీకీ స్వతంత్రం ఇచ్చాం, వొప్పుకున్నాం, తీసుకో. నువ్వు సరిగా ప్రవర్తించినన్నాళ్లు ఈ స్వతంత్రం వుంటుంది, అని ఎవరూ అనకుండా వుండే స్వతంత్రం ఆదర్శం. ఈ నాగరికతా సుఖానుభవంలో ఆ స్వేచ్ఛ నశించింది. బతకడానికీ, చావడానికి, మాట్లాడ్డానికి, పలుకులేకుండా కూచోడానికి, తినడానికి, మాడడానికీ, ప్రేమించడానికి, కావాలి స్వతంత్రం.

మొన్న రైల్లో ఒకరు అంటున్నారు, "ఎవరన్నా ఇరవై యేళ్ళు మన మధ్య లేకుండా, ఈనాడువొచ్చి చూస్తే, ఏ మార్పు గమనిస్తారు? డబ్బు విలువలు అధికంకావడం. అంతా డబ్బు. ధర్మం, సత్యం, దయ ఈ మాటలన్నిటికి బదులూ డబ్బు వినపడుతుంది."

చీర అందమా కాదా? కాదు. ఎంత పెట్టి కొన్నారు? ఈ పటం, ఈ సంగీతం, యీ స్నేహం...ఎంత డబ్బు ఖర్చు? ప్రేమా, కామం, స్త్రీ పురుష సంబంధం...అంతా ఎంత డబ్బు? ఎంతకట్నం? ఎంతజీతం? ఎంత ఆస్థి?

దేశస్వాతంత్రం ఎందుకు? ధనధాన్యాదులతో తులతూగేటందుకు.

ఎందుకు చదువు? ఎందుకు పెళ్ళి? ఎందుకు తండ్రి? ఎందుకుయత్నం? డబ్బుకోసం.

కవిత్వం కళా ఎందుకు? ప్రజల ఉపయోగంకోసం. అంటే వారి ఆర్థికలాభంకోసం.

ఎవరో రాస్తున్నారు కృష్ణశాస్త్రి కవిత్వం వెనకచూపు అని. నీకూ, నీ చీమలపుట్టకీ, గింజలకోసం వెతికే, రాసే నీ రెండు అంగుళాలదృష్టికీ శాస్త్రిగారి కవిత్వం వెనకచూపు కాదు; అసలు చూపేలేదు. ఆయనకవిత్వపుచూపు మేరనీకలలలోనన్నా అందుకోగలవా? శాస్త్రి ఎందుకు "ఏడ్వగానీకు." అంటున్నాడో చెప్పాలట ఇంకో ఆయనకి. ఎందుకు ఏడుస్తున్నాడు? నీ కోసం, నా కోసం, లోకంకోసం, ఇట్లా ఇంతబాగా తనని అర్థం చేసుకునే విమర్శకుల కోసం.

స్త్రీలని తిరగబడమనడమే గాని, అభ్యుదయమిచ్చే మార్గం చూడలేమట చలం. దేనికోసం తిరగబడమనడం?

"చావు, రోగాలు, దూకు." అనే రాచకీయనాయకుల్ని అడగరేం ఆ మాటలు? ఇచ్చి, నూకి, వొదిలి, మనుషులు ఒక బానిసత్వంనించి ఇంకో బానిసత్వానికి పాకడం కనపడటంలేదా?

సాంఘిక బానిసత్వంనించి బైటపడుతున్న హరిజనుడు, వెంటనే ఉద్యోగప్రతిష్ఠా దాస్యాలలో కుంగి గుర్భరుడౌతున్నాడు. ఆర్థిక దాస్యంనించి ప్రపంచాన్నే ఉద్ధరిస్తామని బైలుదేరే యోధుడు జైలుదాస్యంలోకి, కౌన్సిలు దాస్యంలోకి వెడుతున్నాడు. ఒక్కగంతులో స్వతంత్రం పొందేమంత్రం స్త్రీకి చలం చూపాలా? ఎన్ని బైటదాస్యాలు వొదిలితే, లోపలి భావదాస్యం వొదులుతుంది మనషులకి! ఒక్క భావాన్ని, కాంగ్రెసు కానీ, కమ్యూనిజం కానీ, ఇదే సత్యమని నమ్మి తక్కిన భావాలకీ, విలువలకీ, పూర్తిగా అంధమయ్యే దాస్యం కలలోనన్నా గుర్తుకి వొస్తుందా మనుషులకి! అంతే జీవితం, మనష్య స్వభావం. ఈలోపల మనం భరించలేని సత్యాన్ని, మనకి తాహతులేని అందాలకాంతుల్ని, తప్పించుకోడానికి పనికివొస్తుంది మన స్వంతమైన, మనం ఆరాధించే ప్రత్యేక దాస్యం.

# కళకోసమే కళ

## శ్రీ అరవిందులు

కళకోసమేకళ! అయితే ఈ నినాదానికి అసలు అర్థం ఏమిటి? ఈ నినాదం బయలుదేరడానికి కారణాలేమిటి? ఇది బయలుదేరినప్పటిరోజుల్లో రచనావిధానమూ, శిల్పమూమాత్రమే కళా సర్వస్వం అనేవారు. అయితే, విషయం ఏదయినా, చక్కని రచన, సామర్థ్యంతో రచించిన చిత్రము, మంచి శిల్పము, సొగసైన సంగీతము అయితే చాలునన్నమాట. విషయంతో ఎంతమాత్రమూ ప్రసక్తి లేదన్నమాట. ఈ పైనిర్వచనం ఒక అర్థంలో చాలా వరకు సత్యమే. ఆ అర్థం ఇది: ఒకొక్క కళకి ఉన్నపరిస్థితుల్లో ఏది ఏ విధంగా వ్యక్తీకృతం అయినా సంపూర్ణంగా వ్యక్తీకృతం అయినప్పుడు, కళాశీలి పరిశ్రమకి సాఫల్యం వచ్చిందన్నమాటే. అందుచేత ఎంత సామాన్యంగానూ అసహ్యకరంగానూ ఉన్నా, అగటిపళ్లు, అంట్లగిన్నెలు, గాడిదలు మొదలైనవన్నీ కళాశాలి పర్యవేక్షణ కిందకి వస్తాయి. అంతేకాదు; నైతికవిషయము, వేదాంత పరమార్థము. సాంఘిక పరిశోధనలు మొదలైనవికూడా అందులో జేరతాయి; ఇంకా పంచవర్ష ప్రణాళిక, స్థానిక సంస్థల చర్చలూ పెద్ద పెద్ద హోటళ్లు, విద్యుద్యంత్రాలు మొదలైనవాటి లాభాలు, అన్నీ బాగా బలంగా కళాపర్యవేక్షణం కిందికి తీసుకురావచ్చును. ఇక్కడ శిల్పమే ప్రధానం కనక ముఖ్యంగా చూడవలసినది. కవి, చిత్రకారుడు, నవలారచయిత, నాటకకర్త, శిల్పి, తమతమ విషయాల్లో ఉండేదుష్కరపరిస్థితులన్నీ అతిక్రమించి సృజన విషయంలో అందుకోవలసిన అంతస్థులన్నీ అందుకున్నారా? లేరా? అనేదే! అంతేగాని వస్తుస్వీకరణంలో ఏ విధమైన తారతమ్యమూ లేనేలేదు. ఇల్లాగ వస్తుస్వీకరణంలో భేదమేమీ లేకపోయినా కళాశీలి ఆదర్శము కళే అనీ, అతను ఒకవేళ సాంఘిక రాజకీయాదివిషయాలు తీసుకున్నా, ఆవిషయాలు తన ప్రధానాదర్శాలుగా పెట్టుకోకూడదనీ అనవచ్చును. ఒకవేళ ఆ విధమైన విషయాలు అతని పర్యవేక్షణంలోకి వచ్చినప్పుడు, పరిపూర్ణశిల్పమూ, తత్సౌందర్యమూ మొదలైనవి అతని సృష్టిలో ప్రవేశిస్తే తప్పేమి? సామాన్యంగా సాంఘిక రాజకీయాదివిషయాలు ప్రచారంచేసేవాళ్లు కళాశీలురుకూడా అయి ఉంటారు. ప్లేటో, షెల్లీల నిద్దరినీ దీనికి ఉదాహరణంగా తీసుకోవచ్చును. అయితే ఈ సిద్ధాంతం ప్రకారం ఇక్కడ కళాదృష్టితోనే రచయిత రచనకి విలవకట్టడం జరుగుతుంది. అంటే ఇక్కడ శిల్పాన్నిబట్టి రచనకి విలవ కట్టడం జరుగుతుంది. గాని దానిలో ఉన్న విషయాన్నిబట్టి కాదని తెలుసుకోవాలి. ఆరచనలో ఉన్న నైతిక విషయాలవల్లగాని వేదాంతాన్వేషణవల్లగాని రచనకి మూల్యాధిక్యం సంప్రాప్తించదు.

అయితే ఈ సిద్ధాంతం అంతా కొంతవరకే సత్యము. శిల్పము అభివ్యక్తికి సాధనం మాత్రమే; ఎవరూ ఒట్టి అందమైన పదాలకోసం మాత్రమే రచన రచించరు; అల్లాగే చిత్రకారులుకూడా కేవలము రేఖావర్ణాల కోసమే చిత్రాలు రచించరు. ఈ సాధనాల ద్వారా వ్యక్తీకరించ దలుచుకొన్నది ఏదో ఒకటి ఉంటుంది. అది సౌందర్య వ్యక్తీకరణము, సృష్టి అని చెప్పవలసి ఉంటుంది. కళ వీటి కోసమే. సౌందర్య వ్యక్తీకృతివల్లనే కళకి విలవ కట్టవలసి ఉంటుంది. సౌందర్య సృష్టికి అనుకూలమైనవన్నీ కళాశీలి పర్యవేక్షణలోకి వస్తాయి.

అయితే ప్రపంచంలో కేవలం భౌతిక సౌందర్యమే కాక నైతిక సౌందర్యమూ, మేధాసౌందర్యమూ, ఆధ్యాత్మిక సౌందర్యమూ కూడా ఉన్నాయి. అయితే 'కళ కళ కోసమే' అన్న సిద్ధాంతానికి కూడా సౌందర్యమే పరమార్థం అనీ, దానికి వ్యతిరేకమైనది అంతా పరిత్యాజ్యమేననీ అనవచ్చును. కళకి, కేవలం జీవితంతో గాని, వస్తువుల వాస్తవిక స్థితితో గాని, సత్యంతో గాని, శ్రేయస్సుతో గాని లేక దైవంతో గాని సంబంధం ఏమీ లేదు. సౌందర్యంతో సంబంధించినంత వరకే కళకీ వాటికీ సంబంధము. అందుచేతనే పంచవర్ష ప్రణాళిక, నైతికోపదేశము, వేదాంతసిద్ధాంతము మొదలైన వాటికి కళలో ప్రవేశంలేదు అని కూడా అనవచ్చును. అయితే ఇంతాచేస్తే సౌందర్యం అంటే ఏమిటి ? అది దృశ్యంలోనూ ద్రష్టలోను ఎంతెంత వరకు ఉంది ? కళాశిల్పి నిత్యమూ అత్యంత సామాన్యములూ, అసహ్యకరములూ, అనైతికములూ అయిన విషయాలు తీసుకుని, వాటిల్లో సౌందర్యం గ్రహిస్తూ తన సాధనాలద్వారా బలంగా వ్యక్తీకరించడం లేదూ ?

ఒక విధమయిన యోగ చైతన్యంలో (Consciousness) ద్రష్టకు సర్వ పదార్థాలు సౌందర్య తరళంగా కనిపిస్తాయి. ఆధ్యాత్మికంగా సహజస్థితిలో అవన్నీ అలాంటివయి ఉండడమే దానికి కారణము. అదీగాక ప్రపంచశాసకమూ, ప్రపంచాంతర్నిగూఢమూ అయిన ఆనంద చైతన్యానికి ఈ ప్రాపంచిక వస్తువులన్నీ రేఖల్లోనూ, ఆకృతుల్లోనూ, వైశిష్ట్యంలోనూ, సత్తాశక్తిలోనూ జరిగిన పరిణామాలు అయిఉండడము కూడా దానికి కారణమే. సామాన్య బాహ్యదృష్టికి సుందరమైనది రసదృష్టికి సుందరమైనది కాక పోవచ్చును. చాలా వరకు సుందరమైనదికాకుండా ఉండడమే కనబడుతూంది. అయితే యోగి అటువంటి వస్తువులో సామాన్యదృష్టి చూడలేని రేఖలూ, వర్ణాలూ, సుందర సమ్మేళనాలూ, కొత్తకొత్త అభివ్యక్తుల సూచనలూ చూస్తూ, వీటి అన్నింటికీ అంతర్నిహితమైన ఆత్మసాక్షాత్కారం కూడా పొందగలుగుతాడు. అయితే యోగి ఇక్కడ ఆత్మగతమైన ఒకానొక లక్షణాన్ని ఆరోపించి, తద్వారా దృశ్యవస్తువును మార్చివేస్తున్నాడని అనవచ్చును. కళాశిల్పి కూడా ఇదేవిధంగా వ్యవహరిస్తాడు. కాని ఇందులో యోగికీ కళాశిల్పికీ కొంత భేదం ఉంది. కాని కళాశిల్పీ, యోగీ అవగాహన చేసుకునే వస్తువు ఒకటే ! కాని యోగిదృష్టి పరుసవేది వంటిది.— వస్త్వంతర్వ్యాప్తమైన సత్యాన్ని సాక్షాత్కరింపజేస్తుంది. సాక్షాత్కృతమయిన ఈ విశ్వసమ్మేళన దృష్టితో పరిశీలిస్తే ప్రపంచంలో ప్రతివస్తువూ కళాశిల్పికి లక్ష్యం కావచ్చును. ఇక్కడ కళాశిల్పి ప్రతివస్తువులోనూ అంతర్వ్యాప్తమయిన ఉన్న సౌందర్యాన్ని వ్యక్తీకరిస్తుంటాడని తెలుసుకోవలసిఉంది. ఇల్లా అనడంవల్ల మనం మళ్లీ ఒక బ్రహ్మాండమయిన అర్థవైశాల్యానికి తావు ఇస్తున్నాము. ఇక్కడ ఒకగిరిగీసి ఇదిఇల్లాగని నిర్ణయించడానికి వీల్లేదు. మరీసామాన్యమయిన, పందులు, మందుల ప్రకటనాలు మొదలయిన విషయాల్లోనుంచి, సౌందర్యం వ్యక్తీకరించడం చాలా కష్టమయిన విషయమే. అయినా నవ్యవాఙ్మయము, కళ, ప్రయత్నపూర్వకంగా ఇల్లాంటి విషయాలు తీసుకుంటున్నాయి. ఇదే ఇంకా కొంచెందూరం పొడిగిస్తే నీతి, సంఘోద్ధరణ మొదలైన విషయాల్లో నుంచికూడా సౌందర్యం ఆకర్షించవచ్చును. ఈ విషయాలన్నీ నిస్సందేహంగా కళాశిల్పి పర్యవేక్షణలోకి రావచ్చును. అయితే ఇక్కడ స్రష్టకి ఒక సౌందర్య దృష్టే ప్రధానంగా ఉండాలనికూడా చెప్పలేము. స్రష్ట తన మనస్సులో ఒక ప్రధానాశయం పెట్టుకుని, అది రససంబంధికాకపోయినప్పటికీ ఒక గొప్పకళా సృష్టిచేస్తే మనం అతని దగ్గిరనించి అంత

కంటె కోరవలిసింది ఏమీ ఉండదు. స్రష్ట ఏ ఆశయంతో ప్రారంభించినా సౌందర్యస్రష్ట అవుకూడాలి. కళ అంటే సౌందర్య సాక్షాత్కృతీ వ్యక్తీకృతీ మాత్రమే. మనం ఇంతకంటె తక్కువగాని ఎక్కువగాని చెప్పవలసింది ఏమీ లేదు.

కాని ఇంకొక ముఖ్య విషయం ఇక్కడ చెప్పడం అవసరము. యోగి విశ్వసౌందర్య దృష్టికి సమస్తమూ సౌందర్య వంతంగానే కనిపిస్తుంది. అయితే అన్ని వస్తువుల సౌందర్యమూ ఒకే కక్ష్యకి చెందినది కాదు. ఈ విశ్వ సౌందర్యదృష్టిలో అనేక తారతమ్యాలున్నాయి. ఈ తారతమ్యాలు ఔన్నత్యానికి అతిగమించిపోయే చైతన్యంమీద, వస్తువుల్లో వ్యక్తీకృతమైన విశ్వానందంమీద ఆధారపడి ఉంటాయి. అన్ని వస్తువుల్లోను దివ్యాంశ ఉంది. అయితే కొన్నివస్తువుల్లో దివ్యాంశ ఎక్కువగా ఉంటుంది. కొన్ని వస్తువుల్లో తక్కువగా ఉంటుంది. అల్లాగే కళాశీలి దృష్టిలోకూడా వివిధములైన మూల్యాలూ తారతమ్యాలూ ఉంటాయి. షేక్స్పియరు 'మాల్వొలియో' 'డాగ్ బెర్రీ'లలోనించి రూపకమూల్యాలూ, రసమూల్యాలూ గణించగలడు. మేక్ బెత్, లియరుల సృష్టిలో చూపినంత మహాసామర్థ్యము ఈ సామాన్యపాత్రల సృష్టిలో కూడా చూపించాడు. అయితే ఒక్క 'మాల్వొలియో' 'డాగ్ బెర్రీ'లనే సృష్టించి, మేక్ బెత్ లియరుల్ని సృష్టించకపోతే అతను మహానాటక కర్తగాగాని స్రష్టగాగాని పరిగణింపబడతాడా? ప్రతీ వస్తువులోనూ ఉండే భిన్నభిన్న సామర్థ్యాలనిబట్టి, భిన్నవిభేదాలు ఏర్పడుతూ ఉంటాయి. పక్షులు ఎపెల్లే సృష్టించిన ద్రాక్షపళ్లు చూసి మోసపడి వాటిమీద వాలి ముక్కులతో పొడుస్తాయి. అయితే ఫిడియాస్ సృజించిన జ్యూస్‌లో ఎక్కువ రసవస్తువు ఉంది; అందులో సంపూర్ణ సౌందర్యావతరణకు అవసరమైన అంగప్రత్యంగాలన్నీ ఉన్నాయి.

ఇక్కడ ఈ రెండు విషయాలూ సృష్టించిన ఇద్దరు కళాశీలురూ, సౌందర్యసారం సమానంగా వే గ్రహించి ఉండవచ్చును. అయితే ఆనంద వ్యక్తీకరణంలో ఈ రెండిటిలోనూ తారతమ్యంఉండితీరింది.

ఇంకొక విషయము. ఒక్క శిల్పము మాత్రమే కళ కాదనుకున్నట్లు ఒక్క సౌందర్యంకూడా కళ కాజాలదు. కళ ఒక శిల్పమే కాదు; ఒక్క సౌందర్య సాక్షాత్కృతీ, వ్యక్తీకృతీ మాత్రమే కాదు. అది పరిపూర్ణ శిల్పంద్వారా ఆవిర్భవించిన, విశ్వచైతన్యానికి సంబంధించిన రసమయవ్యక్తీకృతి. ఇదే మరి ఒక విధంగా చెప్పాలంటే కళలో రససంబంధమైన విలువ లేకాక, జీవన మూల్యాలు, మానసిక మూల్యాలు, ఆత్మమూల్యాలు కూడా ప్రవేశిస్తాయని తెలుసుకోవలసి ఉంటుంది. ఇక్కడ కళాశీలి కేవలం స్వీయచైతన్య శక్తులే కాక బ్రహ్మాండాలు, వాటిలో ఉన్న వస్తుసముదాయమూ సృష్టించిన అనంత విశ్వచైతన్య శక్తుల్నికూడా ప్రదర్శిస్తున్నాడని గమనించవలసి ఉంటుంది. అయితే వేదాంతదృక్పథం ప్రకారం ఆ విశ్వచైతన్యం సర్వవస్తువుల్లోనూ సమానమే అనుకున్నా, ఆవిర్భావంలో అది అన్ని వస్తువులలోను సమానమని అనడానికి వీలులేదు. ప్రాకృత జనుల్లో కంటె మహాపురుషులలో దివ్యశక్తి ప్రాదుర్భావం అధికతరమని అంగీకరించాలి. ఆత్మావిర్భావానికి అన్ని ఆవిర్భూతులూ సమానంగా ఉపకరించవు. అదీకాక చైతన్యాల్లోకూడా కొన్ని అంతరువులున్నాయి. వాటివల్ల రసమూల్యాల్లోగాని, ఒక కళాసృష్టి మహత్వాల్పత్వాల్లోగాని భేదా లుండక పోవచ్చును. కాని ఆయా విషయాలకి సంబంధించిన మూల్యాలుండనే ఉంటాయి. హోమరు మానవుని బాహ్య జీవితంలోనించిమాత్రమే సౌందర్యం సృష్టిస్తాడు. షేక్స్పియరు అంతకంటె ఒక మెట్టు పైకెక్కి మన కళ్ల ఎదట జీవితాత్మ, జీవిత శక్తులు, జీవితమూల్యాలు ప్రదర్శిస్తాడు. ఇవి హోమరుకి

అందు బాటులోకి రానేలేగు. ఇంక వాల్మీకి వ్యాసులలో గొప్ప భావశక్తులూ ఆదర్శశక్తులూ విత్య సన్నిహితాలై ఉండి, జీవితానికీ దాని చలనానికీ బలం చేకూర్చుస్తూ ఉంటాయి. హోమరూ, షేక్స్పియరూ ఈ అంతరువు వాకా రాలేకపోయారు. ఇంకా ఈ భావశక్తులకీ ఆదర్శ శక్తులకీ అతీతమైన శక్తులుకూడా ఉన్నాయి. అవి ఇంకా ఆంతరాంతరములూ, సత్యములూ అయిన శక్తులు. అవే వస్తువులకీ వ్యక్తులకీ అతీతములయిన ఆత్మశక్తులు. సుసంపూర్ణమూ, గంభీరమూ, సమృద్ధమూ, అయిన మహోన్నతకళలో ఈ ఆత్మశక్తులూ వాటి విభూతులూ లక్ష్యాలు అవుతాయి. పూర్వపు విషయాలకంటె ఈ శక్తులు మహత్తరమైనవి. ఒకవేళ ఎవరైనా, ఈ శక్తుల్ని గురించి, పూర్వకవులతో సమానమయిన సంపూర్ణ ప్రతిభాశక్తులతో రచనలు చేయవచ్చును. అయితే కేవలం రసదృష్టిలో ఈ రచనలకు మహత్తరమూల్యం లేకపోవచ్చును. కాని ఈ రచనల చైతన్యమూల్యమూ, విషయమూల్యమూ పూర్వపువాటికంటె మహత్తరములూ, గంభీరతరములూ, సంపూర్ణతరములూ అయి తీరుతాయి. ఇక్కడ కేవలం కళ కళకోసమే అన్న సిద్ధాంతంగాని, కళ సౌందర్యంకోసమే అన్న సిద్ధాంతంగాని పని చెయ్యవు. ఇవి కళా సృష్టికి కావలసిన కొన్ని ప్రధాన విషయాలు ఒత్తి చెబుతూన్నమాట నిజమే. అయితే ఇవి ఇంతకంటె అధికతరమైన దివ్యమూల్యాలు బహిష్కరించి, నిత్యమైన కళాభివృద్ధికి అడ్డుతగిలితే కళని నిర్బంధిస్తాయి.

సంపూర్ణమైన శిల్పము, సౌందర్య వ్యక్తీకరణము, ఆనందము, వస్తుతత్త్వము, ఆత్మ, అనేవాని సాక్షాత్కృతి అన్న ఈ మూడూ కలిస్తే మనకి ఈ సమస్య పరిష్కారం అవుతుంది. దీనివల్ల ఈ వాదంలో ఉభయపక్షాలకీ సామరస్యంకూడా కలుగుతుంది. కళ కళకోసమే అన్నది, సంపూర్ణశిల్పము, సౌందర్య వ్యక్తీకృతి అన్న అర్థాలలో సత్యమే. ఆపైన కళ ఆత్మకోసమూ సౌందర్య సాధనంద్వారా ఆత్మవ్యక్తీకరింపదలుచుకున్నవాటికోసమూ అన్న విషయం కూడా చేర్చాలి. ఆ ఆత్మవ్యక్తీకృతిలో అనేక తారతమ్యాలున్నాయి; సుదూర శిఖరాలకు తీసుకుపోయే మార్గాలున్నాయి. మన రససాధన, ఆధ్యాత్మిక సాధన ఎప్పుడూకూడా మహావిశాలాకాశంలోకి ఎగిరే ప్రయత్నంలో ఉండాలి; అంతేకాదు వాటిద్వారా మనం సర్వోన్నతమైన ఔన్నత్యశిఖరం అధిగమించాలి. ఈ సాధనలెప్పుడూ ఈ విధంగానే ఉన్నాయి. ఇకముందుకూడా ఇల్లాగే ఉండితీరాలి.

అనువాదకుడు ; 'శిల్పి'



# సాహిత్య ప్రతీక్ష

## శ్రీ జమ్ములమడక మాధవరామ శర్మగారు

ఆనాటి నుండి ఈ నాటి వరకు సాహిత్య గతిని చూస్తే సర్వలక్షణ సంపత్తి బాగానే కనపడుతుంది. అయితే ఒక్కొక్క అంశం ఉద్దిష్టమయినది కూడా అనవసరంగా మగ్నమై పోవడము ఉపసర్జనమే కావడము తటస్థమవుతున్నది. అందువలననె కలుగవలసిన ప్రత్యుజ్జీవనము బాగా కలగడము లేదు. సాహిత్యోద్యమమును కార్యవ్రతంగా పెట్టుకొని ఒక్కొక్క సమితి, సంఘము కర్తవ్యమును నిర్వహించాలి. ఒక్కొక్క వ్యక్తి ఒక్కొక్క విశేషమును బాగా అనుసంధానించుకొని మననంచేసి పూనిక పట్టాలి. అందరూ ఒకే రేఖను అనుగమిస్తూ ఉంటే అక్కరలేని పునరుక్తి రాక తప్పదు. దాని వలన ప్రయోజనం కనపడడము లేదు. ప్రయోజనాకాంక్షతో ఉన్న లోకము కవులపైనా సమితులపైనా ఎంతో ఆశ పెట్టుకొని ఉన్నది. ఏమో ఏమో రావచ్చునని ప్రతీక్షిస్తున్నది. వచ్చిన దాని వలన తృప్తి కలుగక పోయినా నిరాశపడడం లేదు. ఆనుభవికములకు సమన్వయగతిని ప్రదర్శించి సువ్యవస్థను ఏర్పరచగల సాహిత్యోదయమును లోకము కాంక్షిస్తున్నది. ప్రక్లిష్టమయిన ఈ సమయంలో సుశ్లిష్టమయిన ఒక కవిత అవతరించాలి.

స్వభావ పరిణతమయిన లోకతంత్రము ఎప్పుడూ కూడా అతృప్తితో గతము కావడమును చూస్తూ సహింపలేదు. అతృప్తి వలయిత మయిన లోకవేదన ప్రకృతి గర్భమును ఉత్థాపితము చేస్తుంది. అప్పుడు ప్రాకృతికమయిన ప్రతిఅణువూ స్వస్పందసుస్నిగ్ధమై ఒక నవచేతన విస్ఫురణం కలిగి ఒక్కొకచోట పాలపొంగులుపోస్తుంది. అపుడు కవులు కవులై కవితను అవతరింప చేస్తారు. దానికై లోకము వేయికన్నులు పెట్టుకొన్నది. కవి సాహిత్యమును సముల్లసితము చేయాలి. నేను అనుభవంలో అందుతూ ఉన్న అనుభూతులను అవగాహనము చేసికొన్నప్పుడు ఒక్కొక్క విధమయిన ప్రస్తారము ఒక్కొక్క కవికూటములో ఉండవలసిన అవసరము ఉన్నది.

౧. కవి తన పరిమితానుభూతులను నగ్నంగా చెప్పుకొనడానికి భయపడి సిగ్గుపడి రూపాంతరం ఇస్తున్నాడు. దాని వలన స్వాభావికమయిన సత్యానుభూతి మరుగుపడి పోతున్నది. అందువలన పరిమితంగా సీమితంగా ఉన్న అనుభూతులను సాధారణీకరించి అపరిమితములను గానూ అల్పసీమా పరివేష్టితములు కాకుండానూ నిబంధించడమునకు అలవాటు పడాలి. పరిసర

ప్రభావిత మయిన భావస్పందము తత్వచక్రమునకు సంబంధించి కల్లోలిత మవుతుంది. ఎంతటి సత్యచలనము బయటి భావాలలో కనపడుతున్నా అంతర్గతమయిన భావచక్రమే ఆ చలనంలో హేతువు. లోపలి భావవ్యూహము స్వభావ రమణీయంగా పొంగుతుంది. ఎంతగా పొంగినా సముద్రము అతివేలము కానట్లు భావచక్రమున్నూ అతిలోకము కాదు. బయటి పరిస్థితికి అంతర్హేతువును అవగాహనం చేసికొంటూ సాధారణీకృతమయిన స్వభావసుందర భావమును పూనికపట్టి కొందరు కవులు నిబంధించితే సర్వసహృదయ సంగ్రాహ్యత ఉండకపోదు. ఇటువంటి రచనకు లోకము మంగళతోరణాలు కట్టుతుంది.

౨ అనంతము అనశ్వరమూ అయిన విశ్వప్రకృతి శాస్త్రకారుల మంటకంటిలో పడి రూపుమాసింది. ఇంత కవితా సుధా సేచనం ఇచ్చి ప్రకృతికి నవప్రాణం పోసే కవిత కావాలి. ప్రకృతిని అనేకులు చిత్రించి నిరూపించారు. అయితే అది ముద్దలు కట్టి, ఖండఖండములుగా పాయలు పాయలుగా విశీర్ణమై పోయింది. స్వప్రాధాన్య రమణీయంగా లేదు. అన్యాంగమై అప్రధానతాహత మయింది. ప్రకృతిని ప్రకృతిగా నిరూపించే అలవాటు కవులలో నీరసించి పోయింది. కవితా ప్రాణమ్మయిన విశ్వప్రకృతిని అకృత్రిమప్రకృతిని ప్రకృతి ముగ్ధప్రకృతిని ఇతరములకు ఊడిగము చేసేటట్లుగా నిరూపించడము ప్రకృతి దేవికి కన్నీటి చుక్క. అష్టాదశవర్ణనలు అన్న పేరుతో లలితమధుర మయిన ప్రకృతిని వర్ణించడానికి పూనుకొన్నా దానిలో కొందరు కృత్రిమశోభలు కలపడము వలన వెగటు పుట్టుతున్నది. స్వభావ ప్రకృతిని స్వభావప్రకృతిగా నిరూపించడమును మరచిపోతున్నారు. కొందరు ప్రకృతిని అకృత్రిమంగానే ఆనందంగా వర్ణించారు. కాని ఇంతకన్న ఏదో ఒక చిత్తవృత్తిని ముఖ్యీకరించుకొని దానిని రసీకరింప దలచి ప్రకృతిని విభావీకరించారు. విశిష్ట భావనా భావ్యమాన భోగప్రద మయిన ప్రకృతిని ఒక రసంలో ఒకభావం కోసరము విభావముగా వర్ణించి భావపరిపుష్టిని సంపాదించడానికి కవులు చేసిన ప్రయత్నము శ్లాఘ్యమే అయినా ప్రకృతి విషయంలో ఒక అపచారము. స్వతంత్ర ప్రోల్లాసము కలదిగా ప్రకృతి వర్ణింప బడినప్పుడే స్వచ్ఛంద సారమును పిదికినట్లవుతుంది. ఇదివరలో కవులు ముఖ్యంగా చేయని ఈ పనిని ఈ నాడు కవులు చేయాలి. కవుల చిత్తములో వికాస విస్తరములు ఉన్నట్లు క్షోభ విక్షేపములు కూడా ఉంటవి. మాంగళ్యమనోహరమయిన కళ్యాణ ప్రకృతిని సర్వేంద్రియ గోచరం

చేసికొని తద్దీయామృత లీలాపరవశుడై కవి తలు ప్రకాశింప చేయవలసిన కవి సాహజిక ప్రకృతిని కృత్రిమ సీమలలో కట్టివేసి గ్రామనగరాల బంధించి నశ్వర మానవోప భోగాలలో కుదించి మానవుల చిత్తవృత్తులకు ధర్మకామాలకు నానావ్యవహారాలకు విలాస వినోదాలకు ఉపయోగింపచేసికొన్నాడు. దానివలన ప్రకృతి కోమలత మ్లానమై పోయింది. మ్లాన ప్రకృతి అమ్లానాస్వాదమును ఏవిధంగా ఇస్తుంది? ప్రాకృతికములో మానవ వ్యవహారారోపము కాని మానవములో ప్రాకృతికారోపముకాని చమత్కారకము మనోహరము అయితే కావచ్చు కాని ఉన్నదానిని ఉన్నట్లుగా అది ఆస్వాదింప చేయలేదు. ప్రకృతియందు జగత్తంత్రమును ఆరోపించ దలచి నాయికానాయక వ్యవహారాపాదన సుందరత నిచ్చినప్పటికీ భట్టుమూర్తి ప్రకృతిని ప్రకృతిగా అందించినవాడు కాలేకపోయినాడు. ధర్మము పేరుతో తాము తలచిన రసభావముల పేరుతో కొందరు కవులు ప్రకృతిని వేపుకొని తిన్నారు. భర్జిత బీజాలకు మొలకలా? ప్రకృతిని విశ్వమోహనంగా వర్ణించి పునరుజ్జీవనం చేయవలసిన పని కవిలోకమునకు సంబంధించి ఉన్నది. అప్పుడు ప్రకృతినొసట కుంకుమ బొట్టు పెట్టడానికి కన్నెపిల్లలు కుంకుమభరణులు పట్టుకొన్నారు.

3. శృంగారమును మనకవులు ఎంతో వర్ణించారు. ఇక అక్కరలేదు అన్నంత వరకూ నిరూపించారు. అయితే ఆ కవుల కవితా ప్రభావ మంతా సంయోగ శృంగారం మీదనే ప్రసరించింది. అక్కడ కూడా విభావానుభావములనే విశదంగా ప్రతిపాదించారు. స్థాయికి సంబంధించిన ఉల్లసవమును అంతగా చెప్పలేదు. చిత్తకూపంలో దాగి ఆంతరమై భావాంతరానను గతమై ఆత్మకైవల్యంతో ప్రస్ఫురించే స్థాయి ప్రస్పందమును చెప్పవలసిన అవసరం ఉంది. అదే భావకులకు సంవాదమధురిమలిచ్చి భావాల ఔన్నత్యములను గాంభీర్యములను మార్దవములను కాఠిన్యములను స్పష్టగోచరం చేస్తుంది. అటువంటి భావస్వరూప కీర్తనమే కవితకు పరిపుష్టి. కేవలము సంయోగ శృంగార లీలా ప్రాభవమె కాదు. వియోగ శృంగార విశిష్టతను ఇప్పటి కున్నంత దానికంటె విశేషంగా నిరూపించాలి. వియోగకాలీనమయిన చిత్త లాలిత్యమును లోకానికి నేర్పాలి. ప్రేయసీ ప్రియులపరస్పరవియోగవేదనారహస్యమును ఇంకా ఇంకా స్పష్టం చేసే కవిత అవసరం. శృంగారాంగ వియోగము కాక ఇతర వియోగములెన్నో అచుంబితరూపములు ఉన్నవి. వానికి కవితలో అవకాశం లేకపోతే పరిపూర్ణత్వము రాదు. తనతో సమానంగా లాలితపాలిత అయిన చెల్లెలు అత్తవారిం

టికి వెళ్లిన తరువాత అన్న వియోగవేదన వర్ణనీయము కదా! ఇటువంటివి ఎన్నో మధురవియోగములు ఉన్నవి. వాని నిరూపణోద్యమము ఏదీ? అని లోకము అంటున్నది.

౪. వీరరసమునకు సంబంధించిన భేదప్రభేదాలు ఎన్నోఉన్నవి. వానిలో కొన్నిటిని మాత్రమే కొందరు కవులు నిరూపించారు. ముఖ్యంగా వీరకావ్యమని చెప్పదగినది రాలేదు. ఎక్కడైనా ఒకటి రెండు ఉన్నా అవి వర్ణనాబాహుళ్యంతో వీరరసధారను శుష్కింప చేస్తున్నవి. అల్పకాయం కల వీరకావ్యాలు చాలా అవసరం. జాతికి క్రమదీప్ర భావాలను అందింప వలసిన ఈ సమయంలో అటువంటివి అవసరం. శృంగారానుభావాలను శృంగార చేష్టలను విస్తరంగా నిరూపించినట్లు వీరానుభావాలను వీరచేష్టలను ఆలంకారికులు చెప్పక పోయినా నిరూపించాలి. కవులు ఇప్పుడు తమ కవితలలో నిరూపిస్తే ఆలంకారికులు క్రమంగా లక్షణ శోభను సంపాదిస్తారు. లక్ష్యము లేనిదీ లక్షణము వస్తుందా?

౫. మృదువయిన సభ్య హాస్యం జాతిని చక్కదిద్దే లలితహాస్యం మన సంస్కృత కవులకు కూడా లేకపోయింది కదా! అని మనము ఖేదపడిన దినాలు ఉన్నవి. నవ్యకవుల కడుపు చల్లగా కొంత విడిచి పెట్టితే కొంతలో కయినా అనుకూలమయిన హాస్యరచన వచ్చింది. అయితే అది గద్యరచన పద్యీకృత మయిన హాస్య ప్రచుర రచన అవసరంగా కావాలి. పద్యంలో ఆ విధానం వస్తే జాతికి అది చక్కగా అస్థిగత మవుతుంది. అప్పుడు నిర్మాణ కౌశల్యం అలవడుతుంది. స్వతంత్రంగా హాస్యమును నిబంధించే నేర్పు కవులకు కలగాలి. ఎంత కాలమయినా శృంగారానికో భీభత్సానికో అంగముగా ఉండే హాస్య నిబంధన మేనా? హాస్యమును స్వతంత్ర రసముగా చేసి సర్వాంగీణ పుష్టి కలదానినిగా చేయవలసిన అవసరం ఉంది.

౬. కరుణ సంవిధానకము కఱకు హృదయాన్నయినా మెత్తపఱచి ఆర్ద్రార్ద్రము చేస్తుంది. ఎంతగా చూచినా ఇష్టజన వియోగము వలని శోకమే సునిరూప మయింది కాని, విభవనాశ కృత మయిన కరుణ పరిదేవన నిరూపణావశ్యకతను ఆలంకారికులు సూచించినా కవులు స్పష్టనిరూపణం చేయలేదు. ఆర్థిక సమత్వం లేని నేటి పేదదినాలలో ఇటువంటిది ఎంతయినా అవసరం. విజ్ఞాన క్షామము దేశానికి పట్టరాదు. ఆర్థిక సమత్వం రాకపోతే విజ్ఞానక్షామము వస్తుంది. అప్పుడు జాతి పతిత మవుతుంది. ఈనాడు జాతి పతయాళువుగా ఉంది. సమకాలకవులు వర్గవిభాగమును బాగా భావించి కవితా ప్రసారము చేస్తారని ఆశించే లోకము ఇంకా అనేక విధాల సాహిత్యప్రతీక్ష చేస్తున్నది.

# శ్రీ. బి. వి. సింగరాచార్య.

అఖిలభారత కళాపరిషత్ స్థాపననుగురించి కొన్ని సంవత్సరాలుగా ఎన్నో పత్రికలలో ఎన్నో భావలతో ఎన్నోవ్యాసాలు ప్రకటించడం జరిగింది. కాని ఏనాడో స్థాపితమైఉండి ఉండవలసిన ఈ సంస్థ నేటికీ గాలిమేడలతో నే ఊగులాడుతూ ఉండటం శోచనీయం.

ఒక జాతీయాత్మ ఆ జాతి సాధించిన కళావైశద్యంలోనే వ్యక్తం అవుతుంది. ఇది జగమెరిగిన సాధారణసత్యం. అట్టి జాతీయాభ్యున్నతి ఆ జాతి యందలి కళాకుశలుల పరస్పరసహకార సాహచర్యాలవల్ల సాధింపదగినది.

దురదృష్టవశాత్తు మన దేశభాషావైవిధ్యం ఇట్టి కళాసాంగత్యానికీ సాహచర్యానికీ దుర్గమావరోధంగా ఏర్పడిఉంది. ఈ బహు మాతృభాషాత్వం ఈ దేశ రాజకీయాభ్యున్నతికి కూడా ఆటంకం కలిగిస్తూంది; కాని రాజకీయనాయకులు ఈ సంగతిని ముందుగానే గ్రహించి తమ సంయుక్తకృషివలన ఈ అవరోధాన్ని అధిగమనించడానికి సేతువుగా ఒక జాతీయమహాసంస్థను స్థాపించుకొన్నారు. ఒక జాతీయభాషను కూడా నిర్ణయించారు.

నిజానికి ఆ జాతీయ మహాసంస్థతోపాటే జాతీయ వైజ్ఞానిక, సాంస్కృతిక ఐక్యతను సాధించదగిన భారతకళా పరిషత్తుకూడా పునాదిపడవలసింది. కాని అది ఎందుచేతనో నాటికీ నేటికీ జరుగనేలేదు.

మన ఆంగ్లభాషా సాంగత్యంవల్ల మన సారస్వతంలోను, మన చిత్రకళలోను, కొంతవరకు మన సంగీత కళలోను పాశ్చాత్య కళాప్రభావాలు వచ్చిచేరినై. సనాతన అధునాతన ఆంగ్లకవులప్రభావాలు మన ఆధునికకవులలో తామరతంపరలుగా కనిపిస్తున్నాయి. అలాగే వారి చిత్రకళాకారుల ప్రభావం భారతచిత్రకారులను మేల్కొలిపి ప్రాచీన భారత చిత్రకళాపునరుద్ధరణకు ప్రోత్సహించింది. పాశ్చాత్య గానకళారీతులుకూడా మన సినిమా రేడియోలద్వారా అనుదినం ప్రచారం, ప్రసారం అవుతున్నాయి. కాని, మనదేశంలోనే ఒక భాషాసీమలో వర్ధమానమవుతూన్న కళాకౌశలానికీ, మరొక భాషాసీమలోని కళాకృషికీ ఇట్టి బాంధవ్యంగాని, సంబంధంగాని ఇంచుమించు శూన్యమే అని చెప్పవచ్చు. మన ఇరుగు పొరుగు రాష్ట్రాలలో జరుగుతూన్న కళాకృషిని గురించే మనకు తెలియదు. ఈవిషయంలో చిత్ర, గాన కళలస్థితి కొంచెం మెరుగు అనవచ్చుగాని, మొత్తముమీద భారతదేశమందలి వివిధ ప్రాంతాలలో జరుగుతూన్న లలితకళాకృషిని పరస్పరం అవగాహన చేసుకొనడానికి ఉపయోగపడదగిన శృంగాటకం ఒకటి లేకపోవడంవలన భారతీయ లలితకళా సరస్వతీ, సమగ్ర స్వరూపాన్ని ఏకత్ర దర్శించే, ప్రదర్శించే భాగ్యం మనకు కలగడంలేదు. ఇందువలన భారత లలితకళాభ్యుదయంలో కొంత వేగం కొంత గుణంకూడా కొరవడుతున్నాయనడం సాహసం కాదనుకుంటాను.

కళాస్రష్టలకు అన్యోన్య కళారసాస్వాదన నూతన జీవం పోస్తుంది. ఇందుకు తగినఅవకాశం లేనిచోట కళాభ్యున్నతి కుంటుపడకతప్పదు. ఉత్తమ కళాసృష్టి వ్యక్తిగత ప్రతిభపైనే ఆధారపడి ఉన్నదనే

సత్యం ఈ వాదానికి ప్రతిబంధకం కాజాలదు. సమ్యక్ దృష్టి వ్యక్తిగతకళాప్రతిభను ఇనుమడింప జేయడమే ఎక్కువసహజం.

పైగా ఈ కళాపరిషత్ స్థాపన ఒక్క కళా స్రష్టల ఉపయోగం కొరకు మాత్రమే కాదు, కళా రసజ్ఞులకు జాతీయ కళాసృష్టిలో సర్వోత్తమ రచనల నెత్తి చూపడానికీ, కళాప్రదర్శనాలు ఏర్పాటుచేసి భారతాభారత రసజ్ఞులకు సమగ్ర భారతకళా కౌశలము నొక్కచోట, ఒక్కమారు దర్శించే అవకాశం కలిగించడానికీ, ఉదాత్త భారతకళా కృతులతో విశ్వసరస్వతీ మందిరమునకు నూతనాలంకారాలను సమకూర్చడానికీ కూడా భారతకళాపరిషత్తు పనిచేయ వలసి ఉంది.

భారతదేశం స్వతంత్రమైన తరువాతనే భారత కళాపరిషత్ స్థాపన జరగాలి అనీ, ఈలోగా అట్టి యత్నం అసమయప్రయత్నం మాత్రమే అవుతుంది అనీ ఇండియన్ పి. ఇ. ఎన్ (Indian P. E. N) సంఘకార్యకర్త్రి మేడమ్ సోఫియా వాడియా 'మాడరన్ రెవ్యూ' పత్రికలో వ్రాసిన వ్యాసానికి సమాధానం ఇస్తూ భారతమిత్రుడు, సుప్రసిద్ధ ఐరిషు కవి అయిన కజిన్సుపండితుడు వ్రాసినట్లు భారత కళాపరిషత్తు వాస్తవానికి సత్వర భారతస్వాతంత్ర్య సముపార్జనకుకూడా దోహదం చేయగలదు.

మహాశయుడు కజిన్సుకవి సుమారు 20 సంవత్స రాలకు పూర్వమే భారతకళాపరిషత్తును గురించి కల గని నాటినించీ దాని స్థాపనకొరకు కృషిచేస్తు న్నాడు. ఇది కేవలం భారతకవులు, గాయకులు, చిత్రకారులు ఇతర కళావేత్తలు సాధించవలసినపని; వారే దీనికొరకు నడుములుకట్టి పనిచేయాలని ఆయన ఉద్ఘోష. కాని నేటివరకు భారత సారస్వతులలో తగినంతశ్రద్ధ కలగకపోవడం చిత్రంగా ఉంది.

ఈ మధ్య అనగా 1942 లో ఈ పరిషత్ స్థాపనకు వలసిన పూర్వరంగ కార్యక్రమాన్ని నిర్వహించడానికిగాను వివిధ ప్రాంతాలకు సంబంధించిన ఉత్సాహవంతులతో ఒకసంఘం ఏర్పడింది. ఈ ఉద్యమంలో చాలాకాలంనించీ అత్యంత ఉత్సాహంతో నిరంతరం కృషిచేస్తూన్న శ్రీ దేవగుప్తాపు విశ్వేశ్వరరావుగారు ఈ సంఘానికి కార్యదర్శి. ప్రథమంలో వివిధభాషాప్రాంతాలలో రాష్ట్రకళా పరిషత్తులను స్థాపించి, అలా స్థాపింపబడిన రాష్ట్ర కళా పరిషత్తుల నాధారంగా చేసుకొని కేంద్రభారత పరిషత్తును ఏర్పాటుచేయాలని ఈ సంఘంవారి సంకల్పం. అస్సాం రాష్ట్రంలో ఇటీవలనే ఇట్టి రాష్ట్రకళాపరిషత్ స్థాపన జరిగింది.

ఆంధ్రదేశంలోకూడా త్వరలో ఇట్టి పరిషత్తు నొకదానిని స్థాపించాలని శ్రీ దేవగుప్తాపు విశ్వేశ్వర రావుగారు కృషిచేస్తున్నారు. కాని ఇదివరకే అర డజను పరిషత్తులకుపైగా ఏర్పడిఉన్న ఆంధ్రదేశంలో క్రొత్తగా మరోపరిషత్తు అవసరమా అనే ప్రశ్న సహజంగా వస్తూంది.

దురదృష్టవశాత్తు ఈ పరిషత్తులలో ఏదీ అఖిల భారత కళాపరిషత్ శాఖగా పనిచేయదగినట్టుగా నిర్మింపబడలేదు. ఆంధ్రసాహిత్యపరిషత్తు కేవలం గ్రాంథిక సాంప్రదాయికవాదులకొరకు మాత్రమే ఉద్దేశింపబడింది. శ్రీ కోన వేంకటరాయశర్మగారి కార్యదర్శకత్వాన నిర్వహింపబడే ఆంధ్రసారస్వత పరిషత్తు పై పరిషత్తులో చేరని సాంప్రదాయిక గ్రాంథిక భాషావాదులకు చెందినది. సాహితీసమితి నవ్యసాహిత్యవాదులలో కొందరిది. తక్కిన నవ్య సాహిత్యవాదుల సంస్థ నవ్యసాహిత్య పరిషత్తు. కమ్యూనిస్టుల విప్లవకరపద్ధతులతో సహకరించే కవులకు చెందినది అభ్యుదయ రచయితల సంఘం. ఇక

రాయలసీమ కళాపరిషత్తు మొదలైనవి మాండలిక సంస్థలు. పైగా ఈపైన చెప్పినవన్నీ కేవలం సాహిత్య కళకు మాత్రమే సంబంధించిన సంస్థలు. అంతేకాని మొత్తం దేశమందలి ఉత్తమ సారస్వతులందరికీ, ప్రముఖచిత్రకారు లందరికీ, ప్రసిద్ధగాయకు లందరికీ—వారివారి వాదాలతో గాని, వివాదాలతో గాని నిమిత్తం లేకుండా—అందరికీ సమానావకాశాలిచ్చే సంస్థమాత్రమే సమగ్రాంధ్ర కళాపరిషత్తు అవుతుంది. అట్టి సర్వాంగ సౌష్టవంగల సంస్థ అయినప్పుడే అది అఖిలభారత పరిషత్ స్థాపనకు ప్రాతిపదికగా కూడా ఉపయోగపడ గలుగుతుంది. కాబట్టి అఖిలభారత సంస్థమాట అటుంచి కేవలం ఆంధ్రసాహిత్య ప్రపంచాన్ని గురించే యోచించినా అట్టి ఉదారాశయాలు గల ఆంధ్రకళాపరిషత్తుయొక్క అగత్యం చాలా కనిపిస్తూంది.

అభిమానాలతో, అనుమానాలతో కూడిన సంస్థలు సాహిత్యవికాసానికి ఎక్కువ ఉపయోగ పడలేవని అనుభవపూర్వకంగా స్థిరపడింది గనుక సంకుచితభావాలకు తావులేని సర్వలలిత కళాభ్యుదయకరమైన ఆంధ్రకళాపరిషత్తును నెలకొల్పడానికి సహకారం చేయవలసినదిగా ఆంధ్రకళావేత్తలైన పెద్దలను ప్రార్థిస్తున్నాను.

కళాప్రియుల చేయూత లభించి శ్రీ విశ్వేశ్వరరావుగారి కృషి సార్థకమై సర్వాంధ్ర లలితకళాభ్యున్నతికి అమూల్యమైన సేవచేయగల ఆంధ్రకళాపరిషత్తు త్వరలోనే ఏర్పడగలదని ఆశిస్తున్నాను.



# మన నాటక ప్రదర్శనములు

శ్రీ తలిశెట్టి రామారావు

టాకీలలో చూపసాధ్యమైన విషయాలను నాటకాలలో చూపలేమనీ, రెండణాలు చేతనున్నచో టాకీని చూచే అవకాశమున్నది కాన హెచ్చుపైకము నిచ్చి కూడా నాటకము వినీ వినబడని చోట కూర్చొనుట కిష్టపడక ప్రజలు నాటకాన్ని చూడరారనీ, టాకీలు ప్రజామోదాన్ని పొందిన కొలది నాటకాలకికముందు తావులేదనీ కళారాధకులందు నిరుత్సాహము పెరుగుచున్నది. బాగుగ ఆలోచించిన యెడల ఈ నిరుత్సాహమునకు కారణాలు కనబడవు.

ఇప్పుడిప్పుడు కొన్ని మంచి టాకీలు ప్రదర్శింపబడుచున్నను, ప్రఖ్యాత నటులు పాల్గొన్న నాటకాలను వందలకొలది ప్రజలు చూస్తూనే ఉన్నారు—నిద్ర, పైకము దండుగ గనక టాకీలు రంగులతో ప్రదర్శింపబడుచున్నను నాటకాల మీది మోజు తగ్గలేదు. చిత్రాలు బాగా రంగులతో అచ్చయి తక్కువ మూల్యమునకు లభించినప్పటికిని చిత్రకారులు వ్రాసిన తొలిచిత్తరువులు కావాలంటున్నటులనే, యంత్ర సహాయముతో ప్రదర్శనాలను, సంఘటనలను చూచుటే తెలివిజను కనుక తెలివిజను వాడుకకు వచ్చిన తరువాత కూడ నాటకాల నిప్పటికంటె హెచ్చుగ కావాలంటారు ప్రజలు.

కథ యొక్క నిర్మాణ ప్రయోజనాలను, పాత్రల యొక్క లోతును తెలిసికొనకయే డైరెక్టరు చెప్పి నటుల నటుడు చేసిన అభినయము టాకీలు చేయుటకు చాలునని అనేకుల అభిప్రాయము. ఉత్తమ నటుడు పాత్ర తానుగానే భావించి, ప్రేక్షకులను చూచిన కొలది ఉద్రిక్తుడై, తాను చేయుచుండిన అభినయము ప్రేక్షకులందు కలిగించుచున్న భావోద్రేకమువలన నూతనోత్సాహాన్ని పొంది, పాత్రకు క్రొత్త వన్నె పెట్టి, ప్రేక్షకులకును తనకును క్రొత్త సౌభ్రాత్రమును కల్పించుకొనుటయందు కలిగిన కళానుభవము అమూల్యమైనది. ప్రేక్షకులు హర్షించని పరిస్థితు లేర్పడినయెడల తన లోపమును దిద్దుకొని, నూతన ప్రయత్నమునకు బూనుకొనును. ఈ యనుభవము రిహార్సిలులందు కలుగనేరదు. డైరెక్టరెంత తెలివియైన వాడైనను, అనుభవము కలవాడైనను టాకీ యందలి ప్రతి పాత్రయొక్క లోతును నటుని వలె కనిపెట్టజాలడు; కనుక అతడు చెప్పినటుల మాత్ర మభినయము చేసినయెడల నటుడెంత గొప్పవాడైనను తన కళా సంప్రదాయములను నిలువబెట్టుకొనజాలడు. టాకీలలో అభినయించు ప్రతీ నటునకును నాటకాభినయమునందు గలిగిన అనుభవము చాలా అవసరమని సుప్రసిద్ధులైన డైరెక్టరుల నిశ్చితాభిప్రాయము. అందువలన నాటకాలతో పోటీకి వచ్చు ఉత్తమమైన టాకీలను సృజించుటకు కూడ నాటకములు కావలెను.

టాకీలను సృజించు విధానము సామాన్యప్రేక్షకునకు బోధపడిన పిమ్మట ఇప్పుడు టాకీల యెడల కల ఉత్సాహము తగ్గగలదు. నిజమైన వ్యక్తులు ఎదుట నాటకాభినయము చేయుటను చూచుటయందు కలిగిన యానందము, ఎదుటి నటులకును ప్రేక్షకుల

కును మధ్య నేర్పడిన సానుభూతి టాకీలను, వెలివి జనును చూచుటయందు కలుగదు.

అందువలన నాటకాలకు మున్ముందు తావులేదన్న యూహ సరియైనది కాదు.

కాని టాకీలు ప్రదర్శింపబడుచున్నప్పటి నుండి నాటకాలు మునుపటంత తరుచుగ బ్రదర్శింప బడుట లేదు. దీనికి నటులు, ప్రేక్షకులు కారణము కాని టాకీలు కావు.

టాకీలు క్రొత్త రుచులను కలుగజేయుచున్నను, మన నాటకరంగము మునుపటివలెనే ఉన్నది. క్రొత్త మార్పులు టాకీల అనుకరణముతో సరిపోవు. పైగా వానివలన అవమానకరమైన పరిస్థితులు కూడ ఏర్పడినవి. మన నటులు సుప్రసిద్ధులని, హిందీ, అరవ టాకీలలో కూడ వన్నె కెక్కుచున్నారని మనకు కలిగిన గర్వము కళాదృష్టిని స్తంభింప జేయుచున్న టులున్నది.

దేశకాల పరిస్థితుల వలన మన దైనిక జీవనము, దృక్పథము మారుచున్నను ద్రౌపదీ వస్త్రాపహరణము వంటి నాటకాలను చూచి భళీ! అనుచున్నాము. ఇప్పటి మన దైనిక జీవనము నాధారముగ గొని, మన భావిపరివర్తనమునకు సరిపోవునటుల ఒక మంచి సందేశమును ప్రజలకు జెప్పి, వారి హృదయములందు నూతన తేజము పుట్టునటులు కళా సంప్రదాయముల ననుసరించి యీ కథను వ్రాయుటకు వీలున్నను, మహాభారతమందలి కథను మహాభారత సందర్భమునుండి విడదీసి పేలవమైన నాటకముగ వ్రాసినను మన మామోదించుచున్నాము. "అనగా అనగా ఒక రాజు" పద్ధతి కథలను వ్రాయుట మన మెంత వేగముగ మానుకొనిన అంత దేశమునకు మంచిది. మన దైనిక జీవితమునందలి లోపములను దీర్చి ఉన్నతా దర్శముల ననుసరించు నటుల చేయుటకు మార్గము లెవ్వి? ప్రపంచమున కంతకును దివిటీ వలె వెలిగిన మన నాగరికతయెడల మన గౌరవమును వృద్ధిపరచి మనదేశము యొక్క భవిష్యత్తును గూర్చి పాటుపడునటుల హృదయము నేరీతిని స్పందింప జేయగలము? అవినీతిపరులను శిక్షించి, నీతిపరులను రక్షించు భగవంతుని గొప్పతనమును తెలిసికొని నీతిపరులమై, అవినీతిని మన సంఘము నందణగ ద్రొక్కుటెటులు? మన భావి భాగ్యోదయమునకు పౌరాణిక గాథల నెటుల నుపయోగపరచుకో గలము?

పూర్వులు మనకు ప్రసాదించిన కళా సంప్రదాయముల నీ కథలలో పోషించి, మన జాతీయ నాగరకత నాధారముగ జేసికొని ఎటుల ముందంజ వేయ గలము? సామ్రాజ్యములను నిర్మించి, ప్రజాను రంజకముగ పాలించిన ఆంధ్రుల పూర్వపు గొప్పతనము నుద్ధరించు టెటులు? ఇట్టి సమస్యలు నాటకములను వ్రాసినవారికిని, ఆడిన నటులకును, చూచి ఆనందించుచున్న విద్యావంతులకును ఈనాడును గోచరింపకుండుట శోచనీయము. ఆధ్యాత్మికముగ, సాంఘికముగ, రాజకీయముగ మనలో నిదురించుచున్న శక్తిని లేపి, మనల నుత్సాహవంతులుగ జేయజాలెడి నాటకములను మానవుని మన స్తత్త్వమునకు సరిపడునటుల, జాతీయ కళా సంప్రదాయములను పోషించునటుల వ్రాసినచో ఇప్పుడు నాటకముల యెడల కలుగుచున్నదనుకొనుచున్న విముఖత మాయ మగును.

ప్రజల యామోదమును పొందినగాని నాట్యరంగమునకును, నటులకును కావలసిన పైకము రాదు. కనుక ప్రజలు హర్షించు విధమున నాటకములను

ప్రదర్శింపవలసి వచ్చుచున్నదని, నూతన విధానములను ప్రవేశపెట్టుట కింకా కొంతకాలము పోవలెనని కొందరు ప్రదర్శకులు చెప్పుటకలదు. ప్రజలు హర్షించెదరని మనము స్త్రీ పాత్రలను నగ్నముగ జూపుటలేదు ; మోటుసరసమును నాటకములందు ప్రవేశపెట్టుటలేదు. కొందరు రహస్యముగ నేమి చేయుచున్నను సంఘమునందు నీతిపరులై యుండుటకు ప్రయత్నించుచు, తాము చేయు యవినీతి కార్యములకు సిగ్గుపడుచుందురు. దైనిక జీవితమున వారెదుర్కొను సమస్యలందు నీతి, దైవము, కర్మానుభవము మొదలగు భావములు వారికి లేనిధైర్యమును చేకూర్చుచుండును. ఇట్టి యున్నత భావములను మనోజ్ఞముగ నేర్పి ప్రజలకు తోడ్పడుట మనోజ్ఞ కళలు మానవులకు ప్రసాదించు మేలులలో ముఖ్యమైనది. అందువలన ఉన్నత ధర్మములను నేర్పు నాటకమును జూచి పామరులు సైతము హర్షింతురే కాని డబ్బు దండుగని విచారింపరు. ప్రజలందు నీతి తక్కువగనున్నయెడల వారికి నూతనమైన రుచులను నేర్పి, ఆకర్షించి, నీతిని నేర్పి సంఘమును సంస్కరించుట నాట్యరంగము చేయవలసిన పనులలో ముఖ్యమైనది. ఇటుల చేయజాలని యెడల మనము నాటకములను ప్రదర్శించుట నిష్ప్రయోజనము.

మనోజ్ఞ కళలగు కవిత్వము, సంగీతము, చిత్ర రచన,అభినయము,నృత్యముల యొక్క సమ్మేళనము, నాటకము మొదలయిన ప్రతియొక్క కళయు మానవులందు గల దైవిక శక్తులను మేల్కొలిపి, వారిని నీతిపరులుగ జేయజాలను. కనుక నివియన్నియు గలిసినపు డెంతటి యుపకారమునైనను జేయగలవు. ఇందువలన నాటకప్రదర్శనములు మన కత్యంతావశ్యకములు, వీటిని ప్రోత్సాహపరచుట ప్రతివ్యక్తి యొక్కయు విధ్యుక్త ధర్మము. ఈ ధర్మమును మనము నెరవేర్చుటలేదు.

టాకీలు ప్రజల కనేకములైన నూతన విషయములను నేర్పుచున్నవి. రెండణాల టిక్కట్టును కొన్న ప్రేక్షకుడు కూడ తారలను గూర్చి. కథను గూర్చి చర్చించటను నేడు మనము వినుచున్నాము. ప్రజలందు జ్ఞానము కలుగుచున్న యీ దినములలో తదనుగుణముగ మన నాటకరంగము నభివృద్ధికి తేజాలని యెడల నాటకప్రదర్శనము ప్రజానురాగమును పొందలేదు,

పురాతనశిల్పమును, పురాణములను పరిశీలించుటవలన ఆయాకాలమందు ప్రజలవేషము, వారు నివసించిన గృహముల నిర్మాణము, ఉపయోగించిన వస్తువుల, నగల యాకారము, వారి మర్యాదలు మనకు తెలియుచున్నవి. పౌరాణిక, చారిత్రక నాటకములను ప్రదర్శించి నప్పుడిట్టి వేషములను, రంగ నిర్మాణను అవలంబించినగాని ప్రదర్శనములు సత్యదూరము లగును. తాము చూచు దృశ్యమునందు నమ్మకము కలుగని యెడల నాటకము యొక్క ప్రయోజనము ప్రేక్షకులను కలుగదు. ద్రౌపదీ వస్త్రాపహరణమును సినిమాలలో నటించిన విద్యాధికులు ప్రదర్శించుట యందుకూడ ఇప్పటి రాజులు, ధనికులు ధరించు పొడుగుపాటి కోటులు, షేర్వాణీలు. మేజోళ్ళు! చెమికీ పంజాబీ జోళ్లు, చీరలు వేషముగ ధరించుట చాల విచారకమైన విషయము.పూర్వపు స్త్రీల కుచబంధము, దిగువకట్టు, ఉత్తరీయము నటులు ధరించుటయందెట్టి యభ్యంతరము నుండకూడదు.పూర్వపు వేషము నొక సుప్రసిద్ధ నటుడు ధరించుటను చూడ చాలా మనశ్శాంతి కలిగినది. ఇప్పటి కుర్చీలు, టేబిలులు కూడ చారిత్రక నాటకముల నాడునప్పుడు స్టేజి

మీద కానరాకూడదు. చిన్న యూరులందు తగిన హంగులు దొరకవన్న క్షమాపణయందు కొంత సత్యమున్నను, ఆధునికత కానరాకుండు నటుల, వాటిని మరుగుపరుచుట యంతెట్టి కష్టమును లేదు.

చారిత్రక నాటకము నందిప్పటి హిందూస్తానీ పాటను పాడుచు, హిందుస్తానీ నాట్యము నొకనటి చేయుట నెరుగుదును. పూర్వపు దుస్తులను ధరించి భరతనాట్యము నీమె చేసిన నెంతయో బాగుండెడిది. నటులకు మన పూర్వపు సాంప్రదాయములయెడ దృష్టిలేకపోవుటవలన నిట్టి లోపములు కలుగుచున్నవి

ప్రపంచమునం దందరు మానవుల ప్రకృతి యొక టియే యైనను దేశకాల పరిస్థితులవలన కలిగిన యను భవము ప్రత్యేకము కనుక ప్రతి జాతియొక్క వేషము, ప్రవర్తన మొదలగు సంఘ మర్యాదలు, సాంప్రదాయములు భిన్నముగ నేర్పడినవి. ఈ భేద ములు మననటులు గమనించుటయే లేదు. మనము ప్రదర్శించు నాటకములు సంకుచిత దృష్టితో వ్రాయ బడినవి కనుక నిట్టి యవసర మింతవరకు విశేష ముగ కలుగలేదు.

మనలో మంచి నటులున్నారు. వారి వ్యక్తిగత మైన ప్రతిభవలన పాత్రపోషణ కొన్ని విషయముల బాగుగనున్నది. కాని వీరికి గల సహజమైన ప్రతి భకు తోడ్పడు సంస్థ మనదేశమున లేనందున వీరి ప్రయత్నములు తగురీతిని ఫలింపకున్నవి. మానవ హృదయ మెట్టిది? ప్రతి వ్యక్తియు అనేకగుణ ముల సమ్మేళనము కనుక నట్టి గుణములు కల వ్యక్తి వివిధములైన పరిస్థితులలో నెటుల ప్రవర్తిం చును? పురాణములందును, దేశచరిత్రము నందును గల వ్యక్తులెట్టివారు? వారెదుర్కొన్న పరిస్థితులం దెటుల ప్రవర్తించి యుందురు? మనలోగల సుప్ర సిద్ధనటులు, మనస్తత్త్వ వేత్తలు, ఐతిహాసికులు కలిసి యిట్టి విషయములను చర్చించిన యెడల నాట కాభినయ మెంతేని యభివృద్ధిపొందగలదు.

మన స్టేజిసంగీతమును పెద్దలెవరును అంగీక రించలేదు. దక్షిణదేశపు సంగీతమునుండి గాని, పల్లెటూరి పదాలనుండిగాని యిది పుట్టలేదు. సాంగ్లీ నాటక కంపెనీవారు పూనానుండి వచ్చి మనదేశము నందు నాటకముల నాడిన పిమ్మట వారివలె తెలు గులో నాటకముల నాడవలెనన్న యుత్సాహమునం దిది పుట్టినది. "పార్సీమట్టు" లనుండి "హిందీ మట్టు" లకిది పరివర్తనము పొంది యిప్పుడు హిందీ సినీమాల అనుకరణమై, ఆంధ్రముకాక, హిందీకాక, అయోమయమై ప్రబలియున్నది. మనోజ్ఞకళలందు హిందూ సాంప్రదాయములను మరల నొకటిగజేసి, అనేకకారణముల వలన విచ్ఛిన్నమైన భారతీయ నాగరికత కేకత యేర్పరచుటకు ఈ సంగీతమునకు సభ్యతకాని, లోతుకాని లేదు. భారతీయసంగీత విద్వాంసు లందరు పరిత్యజింపవలెనన్న హార్మో నియము దీనికి తగిన మేళవింపుగనున్నది. కనుక హార్మోనియంతో పాటు ఈ సంగీత విధానము నెంత వేగము విడిచి పెట్టిన మన రంగభూమికంత మంచిది. మన యుత్తమ నాగరకతా ఫలితముగ బుట్టినది "కర్ణాటక" సంగీతము. పల్లెటూరి వారి సంగీత సంప్రదాయములను చూపుట కనేకములగు పదములు కలవు. వీటిని స్టేజిమీదను, ఫిల్ములలోను ఏల యుప యోగింపరాదో, ఉపయోగింపకున్నారో బోధపడలేదు.

మన రాజకీయ స్వాతంత్ర్యము పోయినప్పటి నుండియు మన మనోజ్ఞకళల పరివర్తనము జాతీయ మార్గములనుండి తప్పి తప్పుడుత్రోవ త్రొక్కినది. త్యాగయ్య మొదలైన సంగీతబ్రహ్మల కృతులను,

జావళీలను మాత్రము మన విద్వాంసులు పాడి మనలను మెప్పించుచున్నారు కాని మారుచున్న మన యాధునిక జీవితమునకు సరిపోవు భంగిమలను సృజించుటకు తలపెట్టుటలేదు. మనము సభలలోను, రేడియోలోను విను పాటలందు భక్తి, శృంగారములు తప్ప తక్కినరసములు లేకున్నవి. ఈ లోపము తీర్చుటకు పెద్దలు పూనుకొనలేదు. కనుక నాటకాల ఆయోమయ సంగీతమునకు కొంతబలము, అవసరము కలిగినది.

సినీమాలందు వలె నాటకములందును "బాక్ గ్రౌండ్ మ్యూజిక్" ప్రవేశపెట్టుటకు నాటకములందు పాల్గొనుచున్న "సినీమాతారలు" ప్రయత్నించుచున్నారు. ఈ "మ్యూజిక్కు" నాటకములందు అనవసరము, హానికరము, మధ్య మధ్య వ్యవధి యున్నప్పుడు మన జాతీయోద్యమఫలితముగ బుట్టిన "జంత్ర సమ్మేళన"మను "ఇండియన్ ఆర్కెస్ట్రా"ను ఉపయోగించవచ్చును.

హార్మోనియము తబలాలు ప్రేక్షకులకును, స్టేజికిని మధ్యనుంచుట దుమ్ములు మెడకు వ్రేలాడగట్టుకొనునటు లున్నది. గాత్రమున కంగుగ నుపయోగించు జంత్రములు ప్రేక్షకులకు కానరాకూడదు. కనుక ప్రక్క తెరమరుగున వీటినుంచుట మంచిది.

సినీమాయందు వలెనే, నాటకమునందును ప్రేక్షకులు చూచునది యొక చిత్తరువుల మాలిక. ఈ చిత్తరువు లెంత మనోజ్ఞములుగనున్న నాటకము లంత ప్రయోజనకారు లగును. సుప్రసిద్ధ చిత్రకారులు ప్రకృతి దృశ్యములందలి రహస్యమును, ప్రయోజనమును తెలిసికొని యా విషయములు సుబోధకములుగ నుండునటుల చిత్రించి, తమ యాధ్యాత్మికానుభవమును మనకు తెలియజేయుదురు. ఇటుల చిత్రించుటలో చిత్తరువునందు చిత్రింపబడిన వ్యక్తులను, వస్తువులను వాటిప్రాముఖ్యము, ఆకార ప్రయోజనముల కనుగుణముగ చిత్రకారు డేర్పరచును. ఎటుల నేర్పరచిన చిత్తరువులు సుందరముగ నుండునో తెలిసికొనుటకు సుప్రసిద్ధములైన చిత్తరువులను పరిశీలించి, బుద్ధివంతులు కొన్నిసూత్రములు కనుగొనిరి. స్టేజిమీద మనకు కనబడు ప్రదర్శనము చిత్రమాలిక కనుక నీ సూత్రముల ననుసరించి స్టేజిమీద నటులు స్థానముల నేర్పరచికొని యభినయించిన యెడల తాము ప్రదర్శించు చిత్తరువుల కొకపొందిక, బిగియేర్పడును. ఇప్పుడు స్టేజిమీద నటు లొక యర్థములేని మూకగ కనబడుచున్నారు. నటులు కదలక నిలబడిన నీ చిత్రరచన యొక్క సూత్రము వర్తించును. కాని అభినయమునం దిది సాధ్యముకాదను వాదనయందు సారములేదు. నాట్యమున నర్తకి యొకచోట నిలువబడకపోయినను, అంగవిన్యాసమున ప్రతిక్షణమున సుందరముగ కానవచ్చునటుల నాట్యముచేయుట మన మెరిగిన విషయము. ఒక భంగిమనుండి మరియొక భంగిమకు మారునప్పుడుకూడ నీ కళాసంప్రదాయమునకు భంగము వాటిల్లకూడదు. ఈ సూత్రమునే నటులు సమిష్టిగ స్టేజిమీదకూడ నవలంబింపవచ్చును. ఈ యున్నత సూత్రములను స్టేజిమీద ప్రవేశపెట్టుటకు రిహార్సల్సులో చాలా శ్రమతీసుకొనవలెను. కాని కష్టమని మంచికళా సూత్రములను విడనాడుట ఉత్తమ కళారాధకుల లక్ష్యము కాదు.


రంగులతో టాకీలు ప్రదర్శింపబడుచున్నంత మాత్రమున నాటకముల ప్రాముఖ్యము తగ్గదు. ప్రకృతి దృశ్యమునకును, ఛాయా చిత్రమునకును కల భేదము కన్న నాటక దృశ్యములకును రంగుల టాకీలకు హెచ్చు భేదముకలదు. ఈ భేదమును మనము నాటక

ములందు బాగుగ వినియోగపరుచుకోగలము. చిత్తరువుల నిర్మాణమును గూర్చి సూత్రములున్నటుల, చిత్తరువులలోని రంగులను గూర్చికూడ సూత్రములున్నవి. కొన్నిరంగు లొకదాని ప్రక్క మరొకటి యున్న కండ్లకు బాధకలుగును. మరికొన్నియున్న నింపుగ కానవచ్చును. ఈ సూత్రములను బాగుగ బోధపరచుకొనిన యెడల తెరలకును, నటులు ధరిఛచు దుస్తులకును సామరస్య మేర్పడునటుల మనోహరముగ దృశ్యమును ప్రదర్శింపవచ్చును. మరికొంత ప్రయత్నమున తెరముందును ప్రక్కతెరల మధ్యను ఉన్న నటుల సుస్పష్టముగను, సుందరముగను కానవచ్చునటులకూడ రంగుల నుపయోగపరుపవచ్చును.

ఒక్కొక్క రంగు ఒక్కొక్క విధమైన భావమును మనయందు కలుగజేయగలదు. ఎరుపు ఉద్రేకమును, పసుపు శుభమును, ఆకుపచ్చ శాంతిని సూచింపకలవు. వీటిగుణములగూర్చి పరిశోధనలు జరుగుచున్నవి. ఒక దృశ్యమునందలి ప్రధాన రసము కనుగుణముగ నీ రంగులను స్టేజిమీద ప్రయోగించిన కథయొక్క ప్రయోజన మధికమగును. దుస్తులయందే కాక స్టేజిదీపములవలనగూడ నీ రంగులను ప్రవేశపెట్టుట సులభము. వెనుకనున్న తెరమీద రంగు దీపపుకాంతి ప్రసరింపజేయుచు రసపోషణ నధికము చేయవచ్చును. ఇట్టి విధానము నవలంబించిన యెడల తెరలమీద రంగులతో చెట్లు, మేడలు మొదలగు బొమ్మలను స్పష్టముగ చిత్రింపనక్కరలేదు.

స్టేజిమీదగాని, నటులమీద గాని నీడ పడకుండు నటుల దీపముల నేర్పాటు చేసి స్టేజి నంతను వెలుతురుతో నింపుట యిప్పటియాచారము. దీనివలన అందరు నటులును స్పష్టముగ కానవచ్చుచున్నారు. కాని మన దృష్టి యందరిమీద నొకేపర్యాయము ప్రసరించుట ప్రకృతిధర్మముకాదు. ఎవరు మాటలాడి అభినయము చేయుచున్నారో వారినే చూచుటయం దితరనటులు మనదృష్టినుండి తప్పిపోవుదురు. అభినయము చేయు నటునిపై ఎక్కువ వెలుతురును ప్రసరింపజేసి, తక్కినవారిపైబడు వెలుతురును తక్కువ చేసిన యెడల నభినయించు నటునకు హెచ్చుగ ప్రాముఖ్యము కలుగుటవలన మన నయనములకు కొంత విశ్రాంతి కలుగుటయేకాక అభినయముచేయు నటునకును, అభినయింపబడు విషయమునకును తగు ప్రాముఖ్యము కలుగును. ప్రేక్షకుల దృష్టియు కథపై కేంద్రీకరింపబడును. ఈ సూత్రమును.... రెంబ్రాంటు అను సుప్రసిద్ధ చిత్రకారు డత్యద్భుతముగ వినియోగపరచెను. ఇటుల వెలుతురుచాయలను (chiaroscuro) ఉపయోగపరచుటవలన రంగులకును క్రొత్తవన్నెను చేకూర్పవచ్చును. స్టేజిమీదను, ఫిల్ములలోను స్త్రీల సౌందర్యమును ప్రదర్శించి ప్రేక్షకుల నాకర్షించు ప్రయత్న మిటుల వెలుతురు నీడలద్వారా ద్విగుణీకృతముగ ఫలించునటుల జేయవచ్చును.

భారతీయ నాగరికతయొక్క చిహ్నములుగ ప్రపంచమునం దంతటను పొగడ్తగనిన మనోజ్ఞ కళా సాంప్రదాయములను, ఆధునికయుగము ప్రసాదించిన నూతన విజ్ఞానమును ఇటుల వినియోగించి, మనోజ్ఞకళలకు క్రొత్త మెరుగుపెట్టి, భావిపరివర్తనమునకు మార్గదర్శకులమగుట మన ధర్మము. మనోజ్ఞకళలందు ఆంధ్రులకు ప్రత్యేకముగ అభిరుచి కలదన్న కీర్తిని మనము నిలువబెట్టుకొనుటకు సమష్టి ప్రయత్నము చేయకున్నాము. ఈ వ్యాసమునందు సూచనామాత్రముగ నాంధ్రులకు మనవిచేసిన విషయముల నొక కేంద్రనాట్యశాలయందు తోచిన మార్పులతో బ్రవేశపెట్టి, ఆంధ్ర రంగభూమికే గాక భారత నాటక ప్రదర్శనమునకును కళారాధకులు నూతనోత్సాహమును చేకూర్చెదరుగాక !



పరశురామ గర్వభంగము

'కొచ్చిన్ మ్యూరల్స్ నుండి'

# కొచిన్ భవనంలోని కుడ్యచిత్రాలు

## శ్రీ టి. యన్. శ్రీనివాసన్

అజంతా, బాఘ్, తిరువాన్కూరు, కొచ్చిన్ మొదలైన ప్రదేశాల్లో మనకు ఉపలభ్యమానమౌతూన్న కుడ్యచిత్రాలు చూస్తే ఎంత విచిత్రంగాను అతిప్రాచీనంగా కనబడినా, వాటిల్లో కొన్ని ప్రత్యేక వ్యక్తిత్వాలు గోచరిస్తాయి. హైందవ కళ ఆదర్శాల్లోను, అభివ్యక్తి విధానంలోను, పాశ్చాత్య కళకంటె భిన్నమైనది కావడమే దానికి కారణము. పాశ్చాత్యకళ ముఖ్యముగా వాస్తవికంగాను, ఐహికంగాను, శాస్త్రీయంగాను ఉంటుంది. భారతీయ కళ మత సంప్రదాయాలమీద, ఆదర్శాలమీద, ఆధారపడి ఉండడంవల్ల వ్యంగ్యంగాను, సాంకేతికంగాను ఉంటుంది. అందుచేత భారతీయకళలో వట్టి హస్తకౌశలం కంటే భావనకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఈ భేదం భారతీయచిత్రకారులు వాడే సాధనాల్లో కూడా కనబడుతుంది.

భారతీయ చిత్రకళ అంటే సుసమృద్ధము వివిధము అయిన భారతీయుల సృజన చైతన్యానికీ, మనోహరములైన వారి పరిసరాలకీ, కలిగిన సంపర్కంవల్ల ఉద్భవించిన సృష్టి అని అర్థము. భారతీయుల విజ్ఞాన శిఖరాలన్నీ, వర్ణంలోను, ఆకృతిలోను, సౌందర్యంలోను. అభివ్యక్తము లయ్యాయి. అందుచేతనే భారతీయ చిత్రకళలో చాలావరకు తాత్విక ఆదర్శాలు ప్రవేశించడము, అది ఎక్కువగా రేఖామయం కావడము జరిగాయి. పాశ్చాత్యకళలో దీనికి వ్యతిరేకంగా బ్రహ్మాండమయిన ఆకృతి, నిర్మాణము ప్రవేశించాయి. హైందవ చిత్రకారులు తృతీయ పరిమాణము (Third dimension) విడిచిపెట్టడంవల్ల వారికళలో ఒకవిధమైన లాలిత్యంకూడా ప్రవేశించింది. ఇంతేకాక నీటిరంగులు, టెంపెరా విధానము అవలంబించడంవల్ల భారతీయకళలో లలిత గాంభీర్యసన్నివేశం వచ్చింది. లలితవర్ణసమ్మేళనంవల్ల అవయవాల కదలికలో అతి సున్నితమైన భంగిమలు, ఆకృతులు భావోన్మీలనాలు చిత్రించడానికి వీలౌతుంది. పాశ్చాత్యకళలో శరీరావయవ చిత్రణము చాలా శాస్త్రీయంగా చేస్తారు. ఆ నియమాలు వాళ్ళకి అనుల్లంఘనీయాలు. హైందవ చిత్రకళలో అనంతము, అని అబద్ధము అయిన భావనావేశంవల్ల, ఆకృతి విహీనములైన అనేక భావాలు చిత్రించడానికి వీలు అవుతుంది.

కొచ్చిన్ భవనంలోని కుడ్య చిత్రాలలో ఈ లక్షణాలన్నీ సుసమృద్ధంగా కనిపిస్తాయి. ఈ చిత్రాలన్నీ సంప్రదాయానుసారంగా చిత్రితములై, సహజమైన ఆధ్యాత్మికత ప్రదర్శిస్తూ ఉంటాయి. ఇవి చిత్రించిన విధానమంతా సాంప్రదాయికంగా హైందవ చిత్రకారులు అవలంబించేదే! చిత్రకారులు వీటిల్లో మూర్తుల ప్రధానలక్షణాలన్నీ బాగా చిత్రించారు. అయితే ఈ లక్షణాలవల్ల సహృదయుల దృష్టి కొంతవరకు చిత్రాల సహజమూల్యాలకు దూరం అవుతుంది. కాని వీటివల్ల చిత్రాలకు సహజమైన కళామూల్యం ఎంతమాత్రమూ తగ్గలేదని గుర్తించాలి.

ఈ చిత్రాల్లో మూర్తులన్నీ అతి గంభీరంగాను, సున్నితంగాను చిత్రించినవి. ఇవి కదలకుండా బింకంగా ఉన్నట్లు కనిపించినా చలించిపోతూన్న వస్త్రాలంకారాల రేఖలూ, లయాత్మకమైన మూర్తి సమూహీకరణమూ పరిశీలిస్తే వాటిచలనం వ్యంజితమౌతూనే ఉంటుంది, ఆ చిత్రాల ముఖాలు కళకళ


లాడుతూ దేనికోసమో ఎదురు చూస్తూన్నట్లుంటాయి. ఈ చిత్రాలలో ఆధ్యాత్మికభావాలేకాక, అవి చిత్రించిన కాలంలో జనసామాన్యం ధరించే వస్త్రాలూ, అలంకారాలూ మొదలైన వాటినిగూడా మనం గమనించవచ్చును. అంతేగాదు. అవి జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ నాడు జగత్ప్రసిద్ధమైన కథాకళిలో అవలంబించే ప్రధానసిద్ధాంతాలన్నీ కనిపిస్తాయి.

ఇప్పుడు మనకి కొచ్చిన్‌లో మట్టన్ చెర్రీభవనంలో లభిస్తూన్న చిత్రాలు పదహారో శతాబ్దిలో రాజా వీర కేరళవర్మ (౧౫౩౭–౬౧) కాలంలో చిత్రించినవని అనుకుంటున్నారు. ఈ భవనం కొచ్చిన్ ద్వీపానికి ప్రాగ్భాగంలో ఎంతో మనోహరంగా కనిపిస్తూంటుంది. ఒకప్పుడు ఒక పోర్చుగీసు ఉద్యోగి ఈ కొచ్చిను రాజ్యంలో ఉన్న ఒక దేవాలయధనం అంతా అన్యాయంగా అపహరించాడు. దానివల్ల కొచ్చిన్ రాజుకి పోర్చుగీసు వారిమీద పట్టరాని ఆగ్రహం కలిగింది. పోర్చుగీసువాళ్లు ఆ రాజు మనస్సు శాంతింపచెయ్యడానికని ఈ భవనంకట్టి ఆయనకి బహుమతీ చేశారు. ఆ పైనవీర కేరళవర్మకు ఈ భవన కుడ్యాలు అలంకరింప జెయ్యాలని సంకల్పం కలిగింది. దానికి ఫలితమే ఈ మనోహర కుడ్యచిత్రాలు.

ఈ చిత్రాలు చిత్రించినకాలంలో మళయాళ వాఙ్మయంలో ఒక నూతన చైతన్యం వ్యాపించింది. ఆ చైతన్యమే ఈ చిత్రాల్లోకూడా ప్రతిధ్వనిస్తూంటుంది. ఈ కాలంలో నారాయణనంబూద్రివంటి కవులు తమ సుప్రసిద్ధకావ్యాలతో మళయాళ వాణిని అలంకరించారు. కొచ్చిన్ ప్రభువు, జమోరిన్నూ, మళయాళ వాఙ్మయాన్ని ఆదరించి పోషించారు. అంతేకాక ఆ కాలంలో నృత్యనాటికలు గూడా బాగా ప్రసిద్ధికెక్కాయి. బహుశః ఈ కాలంలోనే ఒత్తామ్ - తుల్లాల్, కృష్ణనత్తమ్ అనే దేశీయ నాటకాలుగూడా అభివృద్ధి చెందిఉంటాయి. వీటితో సరిసమానంగా చిత్రకళకూడా బాగా అభివృద్ధి చెంది ఉంటుంది. బహుశః మట్టంచెర్రీభవనంలోని కుడ్యచిత్రాలు ఆ కాలపు చిత్రకళాభివ్యక్తికి మహోన్నతశిఖరాలై ఉండవచ్చును.

ఈ కుడ్య చిత్రాల్లో రామాయణగాథ అంతా చిత్రితమై ఉంది. 'పరశురామ గర్వభంగ' మనే త్రివర్ణ చిత్రం రామాయణ గాథలోనిది. ఈ కథ అందరూ ఎరిగినదే. రాముడు సీతా వివాహానంతరం అయోధ్యనించి తిరిగి వస్తూంటే, పరశురాముడు అతనితో కయ్యానికి కాలుదువ్వుతాడు. అప్పుడు రాముడు అతను అందిచ్చిన ధనస్సును వంచి, అతనికి గర్వభంగం చేస్తాడు. వెంటవే పరశురాముడు అతని మహత్త్వం అంగీకరించి నమస్కరిస్తాడు. అతని పక్కగా అతనికి నిత్యానుయాయి అయిన లక్ష్మణుడున్నాడు. ఇందులో విరుద్ధ భావాభివ్యక్తీ, అలంకార విన్యాసమూ పరిస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఇంక మిగిలిన రెండు చిత్రాలలోను పుష్పక విమానంలో శ్రీరాముడు అయోధ్యకు రావడమూ, రాణులు అతనికి ఎదురేగి గౌరవించడమూ వర్ణనీ విషయాలు. వీటిల్లో ఒకదానిలో పురాణప్రసిద్ధ పురుషులేకాక ఇంకా ఇతరులైన స్త్రీ పురుషులు కూడా ఉన్నారు. వారందరూ శ్రీరాముణ్ణి గౌరవించడానికి అక్కడికి చేరుకున్నారు. వారందరూ అచ్చంగా నంబూద్రీలలాగ ఉండడం ముఖ్యంగా గమనించవలసిన విషయము, రాణులు శ్రీరామునికి ఎదురేగిన రెండవచిత్రంలో చిన్న చిన్న పళ్లాలలో హారతులు ఇస్తూండడం కనిపిస్తుంది. ఇది కేరళులు వారి అతిథులను గౌరవించే విధానము. ఆ దేశంలో ఈ ఆచారం ఇప్పటికీ అనుస్యూతంగా వస్తుంది.

అనువాదకుడు : "శిల్పి"



పుష్పకములో రాముడయోధ్యకు మరలివచ్చుట.

'కొచ్చిన్ మ్యూరల్స్' నుండి.

# "ఒక నిర్వచనం"

శ్రీ ఎమ్. నరసింహాచార్య

జీవం ఉన్నచోట చైతన్యం ఉంది. చైతన్యమే సృష్టికి సౌందర్యం. ఈ సృష్టిలోని ఈ జీవచైతన్యం విశృంఖల వృత్తితో గాక ఛందోబద్ధగతితో ప్రసరిస్తోంది. అందుచేతనే సృష్టి భయావహం జుగుప్సాకరంగాక శివప్రదమై విలసిస్తోంది. అంతే కాదు—భిన్నభిన్న రూపాలలో ఖండఖండాలుగా విభజించుకుపోయిన ఈ జీవచైతన్యం ఛందోగతితో అనేకత్వంలోంచి ఏకత్వానికి ఉన్ముఖంగా పురోగమిస్తోంది.

ఛందోబద్ధమైన హృదయస్పందనమే సృష్టికి మూలాధారం - అనేకత్వంలోంచి ఏకత్వంలోకి అధిగమించే ఈ జీవచైతన్యానికి ఛందోగతే ఏకైక సాధనం. ఈ ఏకత్వసాధనే సృష్టి కార్యానికి ప్రయోజనం. ఈ సాధనలోనే రూపరహితమైన దివ్యచైతన్యం జడ ప్రకృతిలో అనంతకోటి రూపాలతో స్పందింపబడుతూ విశ్వనాట్యం సాగిస్తోంది.

ఈ మహా సృష్టికార్యానికి సృష్టికర్తని ప్రేరేపించే భావచైతన్యమే - హృదయస్పందనమే శిల్పినికూడ శిల్పకార్యానికి ప్రోద్బల పరుస్తోంది. అయితే ఆ శిల్పం సృష్టిని అనుకరించేది కాని అనువదించేది కాని కాదు. తనలోనూ సృష్టిలోనూ అనేకముఖాలుగా క్షణక్షణమూ విజృంభించి పోతూన్న జీవచైతన్యాన్ని శిల్పకృతుల ద్వారా ఛందోబద్ధంచేసి ఆత్మైకత్వాన్ని ఉపపాదించడమే శిల్పిసాధన. సత్యం శివం సుందరం అయిన అఖండాత్మ స్వరూపాన్ని నిరూపించడమే శిల్పానికి ప్రయోజనం.

కవి హృదయం భావసమ్మర్దంతో ఓతప్రోతమైన క్షణంలో అతని లేఖినిలోంచి సద్యోజనితంగా కూర్పునందిన ఛందోగత శబ్దాల్లోంచే కవిత్వం శిల్పిస్తోంది. చిత్రకారుని మనోనేత్రాలలో మసలే అనంతభావ వీచికలు రేఖారూపాలుగా ప్రవహిల్లి, అతని హృదయరాగంతో మేళవితాలై ఛందోమయ శిల్పాలు సిద్ధిస్తున్నాయి. గాయకుని కంఠం తన ఆత్మాంతరాల లోతుల్లోంచి వినవచ్చే నాదమయ సౌందర్యాలకి ఛందోగతిలో బద్ధమై స్పందించిన ముహూర్తంలో రాగరుచులు వర్షిల్లి గానశిల్పం భాసిస్తోంది.

ప్రకృతిలోని ఒక సంఘటన కారణంగా, -లేక ఒక దృశ్యంయొక్క - వ్యక్తియొక్క సంపర్కంవల్ల - లేక అతని తాత్కాలిక మానసికప్రవృత్తినిబట్టి శిల్పి హృదయం

స్పందితమై శిల్ప కార్యానికి దోహదమవుతోంది. అప్పుడు శిల్పి హృదయ చైతన్యం అప్రయత్నంగానే రూపసిద్ధి నందుతోంది.

అయితే-తనలోని కదలికకు కారణభూతమైన ఆ సంఘటనను జరిగినది జరిగినట్లు సృష్టిలోంచి అనువదించేందుకుగాని, ఆ ప్రత్యేక దృశ్యాన్ని లేక వ్యక్తిని యథాతథంగా వర్ణించడానికి గాని, లేక తన తాత్కాలిక మానసికస్థితిని తార్కిక పద్ధతిలో నిరూపించడానికి గాని శిల్పి పూనుకోడంలేదు. అతని హృదయ చైతన్యమే ఛందోబద్ధమై రూపం దాల్చడంతో, శిల్పికి పై వాటితో అంతగా ప్రసక్తి లేకుండా పోతోంది. రూపరహితమైన తన హృదయ చైతన్యానికి రూపం ఇచ్చేంతవరకూ అవసరమైన భౌతిక పరికారాలే అతడు తీసుకుంటున్నాడు.

ఈసందర్భంలో, సజీవములైన రేఖలూ, వర్ణాలూ, రూపాలూ ఒకరికి ఉపకరిస్తే-ఒకరికి ప్రాణవంతాలైన అక్షరాలూ, పదాలూ, వాక్యాలూ సహకరిస్తున్నాయి_వేరొకరికి చైతన్యవంతాలైన నాదాలూ, రాగాలూ సహాయ మవుతున్నాయి. ఇట్లే చేతి కందుబాటులో ఉన్న సామాన్య పరికరాల్ని తగుమాత్రంగా స్వీకరిస్తూ, విశ్వమంతా నిండి ఛందోగతులతో నాట్యంచేసే ఆత్మ చైతన్యాన్ని తన విశిష్ట జీవచైతన్యంతో మేళవించి తన శిల్ప కృతులలో అంకితం చేసి చూపిస్తున్నాడు శిల్పి.

ఈ విధంగా భౌతిక పరికరాలు శిల్పి సృష్టికార్యానికి నిమిత్తమాత్రాలే అవుతున్నాయి. శిల్పి వీటి విషయంలో ఏ మాత్రం వ్యామోహితుడైనా అతని సాధనా గతికి నిరోధం ఏర్పడుతోంది. అతనికి తపస్యాభంగం అవుతోంది.

ఒక తాత్కాలిక సంఘటనని యథాతథంగా వివరించడం — ఒక ప్రాకృతిక దృశ్యాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రించడం — ఒక వ్యక్తి భౌతిక రూపాన్ని వాస్తవికంగా చూపడం ఇవన్నీ సహజచైతన్య శక్తిలేని యంత్రం నిర్వహించవలసిన పనులు. ఇవి నిర్మాణకార్యాలు. వీటితో సృష్టి కార్యాన్వితుడైన శిల్పికి సంబంధంలేదు. శిల్పి బాహ్యవస్తు సంపర్కంవలన తన హృదయంలో కల్గిన స్పందనంచేత సంచలితుడవుతాడు. ఆ జీవచైతన్యాన్నే కృతులలో ఛందోబద్ధం చేస్తాడు. ఆయావస్తు రూపాల ప్రసక్తి అతనికి లేదు. తన భావవ్యక్తీకరణకి తగుమాత్రం పరికరాల్ని సృష్టించుకోడంలో అతడు సర్వస్వతంత్రుడు. ప్రకృతికిగాని మరే యితర కృతికిగాని శిల్పి ఈ విషయంలో దాసుడుకాడు.

శిల్పి సృష్టికర్త. అతని శిల్పం సృష్టి. అతని సృష్టికి ఛందోబద్ధమైన జీవచైతన్యం అసత్యాన్ని అమంగళాన్ని వికృతాన్ని తుతింపజేస్తూ సత్యం శివం సుందరం అయిన అఖండ ఆత్మైకత్వాన్ని నిరూపించడమే శిల్పి కృతులకు ఏకమాత్రప్రయోజనం!



తల్లులు రామునికి ఎదురేగుట

'కొచ్చిన్ మ్యూరల్స్' నుండి

# గాంభీర్యము: నన్నయ

శ్రీ బొడ్డపాటి కుటుంబరాయశర్మ

కావ్యగుణము లిరువదిమూఁ డనువారిమతమున గాంభీర్య మొక కావ్య గుణము. రీతివృత్తిగుణపాక శయ్యాలంకారరసధ్వనులు మున్నగువానినిగూర్చి వామన వాత్స్యాయన సూత్రములును, కావ్యాదర్శ ప్రకాశములును, సాహిత్యకౌముదీచంద్రోదయ రత్నాకరమీమాంసలును, ప్రతాపరుద్రీయకువలయానందాదికమును లక్ష్యలక్షణ సమన్వయ దృష్టితో వివరించియున్నవి. అలంకారమతవిభేదముల నవి దశవిధములని యెంచుటచే గాబోలును నాంధ్రమున కావ్యాలంకార చూడామణి కర్తయగు విన్నకోట పెద్దయ మహాకవిగాని, నరసభూపాలీయ కర్తయగు శారదామూర్తికవి, గాని పేరునకు గాంభీర్యమును కావ్యగుణముగ చెప్పినట్లు భావింపను. అది యట్లుండెను. కాని ప్రత్యేకముగ నాంధ్ర సారస్వతమునగల మహాకవుల కావ్యములను ప్రస్తుతము సమీక్షచేయు మనము కేవలము గాంభీర్యమను దానిని మిక్కిలి స్థూలముగ శబ్దార్థముల పరముగనే స్వీకరించుచున్నామనుట మఱవరానిది.

శబ్దార్థములు రెండును గావ్యమునకుఁ బ్రధానములేయైనను సమశబ్దార్థ ప్రాధాన్యము గల కృతులు ప్రాయికముగ లభింపవు. కొందఱు కవులర్థమును, మఱికొందఱు కవులు శబ్దమును మన్నించిరి. ప్రసిద్ధులందు శ్రీనాథ, పెద్దన, సూర్యనాది మహాకవులను సమశబ్దార్థ రచనమున కుదాహరించుటలో గొంత యర్థమున్నది. కాని వారియందైనను సూక్ష్మదృష్టిని బరిశీలించినచో బహుళముగ శబ్దమో యర్థమో ప్రాధాన్యము వహించుట స్ఫురించును. కాన నీ మన నిర్ధారణమంతయు స్థూలముగ మాత్రమేయని మఱువరాదు. గాంభీర్య మనఁగా శబ్దార్థములయందే యొకటియో, లేక రెండును సమముగనో ప్రాధాన్యముఁదాల్చి, తత్తదుచితేంద్రియములకు శీఘ్రజ్ఞానము గల్గించు రచనమని మనము నిర్వచించుకొనవలెను. కాఁగా శబ్దగాంభీర్యము, నర్థగాంభీర్యము, సమశబ్దార్థగాంభీర్యమునని మూఁడు విధములుగ దీనిని విభజింప వచ్చును. ఇవియే శబ్దప్రధానము, నర్థప్రధానము, సమశబ్దార్థ ప్రధానమునగు రచన లనఁబడుచున్నవి.

శబ్దప్రధాన కవిత యనఁగా నర్థరహితమైనరచన మనుకొనరాదు. జటిలమై, యాడంబరమై, కృతకమై, భాషలో నర్థచిత్ర మిమిడియుండి, యర్థముకంటె శబ్దమే

ముందు పరుగిడుట యని తాత్పర్యము. పద్యనియతార్థము గ్రాహ్యముగాకయు, శ్రవణసుఖము గలుగుట దీని ఫలితము. దీనికిఁ బరస్పరము వ్యతిరేకమై, సులభపద సంఘటనము గలిగి, నిరాడంబరమై, సహజ మనోజ్ఞమైన భాషలో బ్రకృతి మధురమైన భావములఁ జిత్రించునది యర్థగంభీర రచన. ఇందు శబ్దములు సుష్ఠుగ నుండకపోవచ్చును. అనఁగా శబ్దగాంభీర్యమునకువలె నక్షర రమ్యత దీనికి, బ్రధానలక్షణముగాదు. అర్థము దెలియక సుఖము గలుగవచ్చునుగాని యానందము గలుగదు. కనుక నెంత సులభములైన పదములిందున్నను నర్థముఁ దరచిచూచి గ్రహించుకొనుట ముఖ్యావశ్యకము. అందుచేతనే నన్నయ భట్టారకుఁడు, "ప్రసన్నకథాకలితార్థయుక్తిలో నారసి" యనెను. ఇంతకు నొకానొక కవి యాశించినదియు, తుదకాతఁడు సాధించినదియు నెట్టి రచనా విశేషమో వివరించుటయే మన ప్రకృత కర్తవ్యము. కనుక జ్యేష్ఠతాగౌరవక్రమమున నన్నపార్యుని భారతమును బరికింతము.

నన్నయభట్టారకునిఁ గూర్చి తిక్కనార్యుఁడు విరాటపర్వాదిని "ఆంధ్రకవిత్వవిశారదుండు, విద్యాదయితుండు,...మహితాత్ముఁడు" నని స్తుతించెను. జక్కన విక్రమార్క చరిత్రారంభమునఁ గవిస్తుతిలో, "రసబంధుర వాగ్విభవాభిరామధౌరేయులు, శబ్దశాసనవరేణ్యులు" అని స్తుతులు బలికెను. ఎఱ్ఱన హరివంశమునఁ గవిస్తుతియందు నన్నయ భద్రకుంజరమును "ఉన్నతగోత్రసంభవము, నూర్జితసత్త్వముఁ" గలదిగఁ గొనియాడెను.

"సారమతిం గవీంద్రులు బ్రసన్నకథా కలితార్థ యుక్తిలో
నారసి మేలునా, నితరులక్షర రమ్యత నాదరింప, నా
నారుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు, తెనుంగునన్ మహా
భారత సంహితారచన బంధురుఁడయ్యె జగద్ధితంబుగన్." (1)

ఈ పద్యమున నన్నయపార్యుఁడు, తన్నుగుఱించి తాను చెప్పుకొనినట్లున్నది.(2) అందుచే సహృదయు లర్థగాంభీర్యమును, సాధారణులు శబ్దగాంభీర్యమును శ్లాఘింప వచింతునని శపథము చేసినాడనవచ్చును. ఇతని గంభీర శబ్దప్రయోగ నిపుణతకుఁ గొన్ని తఱుచైన యుదాహరణములు :—

(1) భారత, ఆది, ఆ 1-ప 25; (2) "అట్లున్నది" యనుట, మతాంతరమును సూచించుటకొఱకు; (3) ఆది, ఆ 1-ప 104; (4) ఆది, ఆ 1-ప 107.

"బహువనపాదపాఢ్యకుల పర్వతపూర్ణ సరస్సరస్వతీ
సహితమహామహీభరమజస్ర సహస్ర ఫణాళిఁదాల్చి, దు
స్సహతరమూర్తికిన్ జలధిశాయికిఁ బాయక శయ్యయైన య
య్యహిపతి పుష్కలాంతకుఁ డనంతుఁడు మాకుఁబ్రసన్నుఁ డయ్యెడున్. (3)

"గోత్రమహామహీధర నికుంజములన్ విపినంబులన్ గురు
క్షేత్రములన్ బ్రకామగతిఖేలన నొప్పి, సహాశ్వసేనుఁడై
ధాత్రిఁబరిభ్రమించు బలదర్పపరాక్రమ దక్షుఁడీక్షణ
శ్రోత్రవిభుండు దక్షకుఁడు శూరుఁడు మాకుఁ బ్రసన్నుఁడయ్యెడున్." (4)

"సాగరసారవారిరుహ శౌక్తికమౌక్తిక విద్రుమద్రుమై
లాగరు చందనంబులు.........................." (1)

"మండిత సూరరశ్మిరుచి స్మణిహార చయంబుతోఁగట
స్యంది సుగంధదాన జలసంపద నొప్పెడువాని......" (2)

"దళితనవీన కందళకదంబ కదంబ కేతకీరజో
మిళితసుగంధ బంధుర.........................." (3)

"శారదరాత్రు లుజ్జ్వల లసత్తరతారక హారపంక్తులన్ ..." (4)

వీనియందుపామరులకు భావమంతగా గనులకుఁ గట్టకున్నను, బఠనమాత్రముననేఁ

(5) శ్రవణసుఖము గల్గుట తథ్యము. ఇదియే యతఁ డుద్దేశించిన యక్షర రమ్యత; అనఁగా మనము వ్యవహరించు శబ్దగాంభీర్యము. ఇట్లయ్యును భావనిబిడమై తరచి చూచిన కొలఁదియు నర్థము స్ఫురించు నర్థగంభీరశైలియందు నన్నయభట్టారకుఁడు వెనుకఁబడినవాఁడు కాఁడు:—

"శ్రవణసుఖంబుగా సామగానంబులు
చదివెడు శుకముల చదువుఁదగిలి
కదలక వినుచుండు కరులను గరికర
శీతలచ్ఛాయఁ దచ్ఛీకరాంబు
కణముల చల్లనిగాడ్పాసపడి వానిఁ

(1) (2) సభాపర్వ-ఆ 2-110, 111 ప; (3) (4) అరణ్య-ఆ 4-ప 138, 142; (5) ఆంగ్లమున Robert Bridges ప్రభృతి విమర్శకాచార్యుల పరిభాషలోనిది 'Ear-pleasure' అనఁబడును. (6) ఆది-ఆ 4-ప 23; (7) ఆది-ఆ 4-ప 17.

కొంగి సుఖంబున్న సింహములును..............." (6)

"అతిరుచి రాగతుండయిన యాతనికిన్ హృదయప్రమోదమా
తతముగ నవ్వనంబున లతాలలనల్ మృదులానిలాపవ
ర్జిత కుసుమాక్షతావళులు సేసలు వెట్టిన యట్టి గిరి సం
పతదళినీ నినాద మృదుభాషల దీవనలొప్ప నిచ్చుచున్......" (7)

అనునట్లుండును.

శబ్దప్రధానమైన రచనలో శబ్దము నిండారియుండియు భావము నిబిడీకృతమై యుండక కొంత వెలితి గలిగియుండును. కాని యీ క్రిందిపద్యమున భావమెంత క్రిక్కిఱిసి యున్నదో మనమే తరచి చూడవచ్చును:—

"నిండు మనంబు నవ్య నవనీతసమానము, పల్కు దారుణా
ఖండల శస్త్రతుల్యము జగన్నుత! విప్రులయందు; నిక్కమీ
రెండును రాజులందు విపరీతము; కావున విప్రుఁడోపు, నో
పండతిశాంతుఁడయ్యు నరపాలుఁడు శాపము గ్రమ్మరింపఁగన్"........

మాతృకమున శ్లోకత్రయమునందున్న యర్థము నీక్రిందిపద్యమున నన్నపార్యుఁ డెంత భావాక్లుప్తితో వ్యక్తపరచెనో గనుఁడు:—

"పదిగినము లైదు ప్రాస్తలుఁ
బదపడి రెన్నాళ్లు నొక్క పగలుఁ రేయుఁ
మదమున రణమొనరించిరి
నదిసుత గురుకర్ణశల్య నాగపురీశుల్".............. (1)

ఇట్టి శబ్దసంగ్రహాశి సాధారణముగ నర్థప్రధాన రచనకు ముఖ్యాంగము. ఇదియే యతఁడాసించిన "ప్రసన్నకథాకలితార్థయుక్తి." ప్రతినప్రకారము శబ్దార్థ గాంభీర్యంబుల రెంటిని చిత్రింప యత్నించెనుగాని మొత్తముమీఁద పిండితార్థముగ నన్నపార్యుఁడు సాధింపఁగల్గినది శబ్దగాంభీర్యము. బహుళముగ నీతని కవిత నర్థగాంభీర్యమున కుదాహరింపము. విపులశబ్ద శాసనుఁడై రెండువంతులు సంస్కృతపదములఁ బ్రయోగించుటయే గాక సాంస్కృతిక (2) వాక్యసంయోజనఁ గలవాఁడగుటకూడ దీనికి కారణము. ఇతనిది వేదవాణి యనవలెను:—

"...........భస్మము చేయుము తక్షకాగకా
కోదర సంహతిన్ హుతవహోగ్ర మహోగ్ర శిఖాచయంబులన్"...... (3)

(4) శబ్దగాంభీర్య మిట్టిది యలవడుటచేతనే యెఱ్ఱనార్యుఁ డీతని శైలి "భద్రకుంజరగతి" గలదనెను. ఈ యీ హేతువులనుబట్టి నన్నయ భట్టారకునిది శబ్దగంభీర శైలియని నిర్ణయించుటయే న్యాయము.

---

(1) ఆదిపర్వం-ఆ 1-ప 68; Syntax sanscritic; (3) ఆది-ఆ 1-ప 124; (4) Dignified sound.

# పెద్దన కవితాదర్శము

శ్రీ వడలి మందేశ్వరరావు

ఏకవి కవితకైనా విలువలు కట్టుకోవడం నేటి సాంప్రదాయం: విలువలు కట్టడమనేది ఒక నూతన అభిరుచిని, దృక్పథాన్ని తెలియజేసేమాటగాకూడా పరిణమించింది. కాని ఏకవి కవితాదర్శానైనా ఇది ఇట్టిదని సమగ్రంగా నిర్వచింప ప్రయత్నించడం-ముఖ్యంగా నేటి పరిస్థితుల్లో-పెద్దపొరపాటు. దీనికి కారణం నేటి అభిరుచులు త్వరత్వరగా మారిపోతూండడమే. కాగా, అవకాశాలను పురస్కరించుకొని, కవికాలానికి, దానివల్ల బయలుదేరిన కావ్యానికీ ఉండే సంబంధబాంధవ్యాలను గుర్తించి, అందులో వ్యక్తమైన కవితాదర్శాన్ని అన్వేషించవలసినఅవసరం ఏర్పడింది.

ప్రబంధయుగానికి సాంప్రదాయస్రష్ట అయిన పెద్దన యుగంలోకి వచ్చేసరికి అంతకుపూర్వం కవిత్వంలో అణగిమణగిన ఏదో ఒక ప్రత్యేక గంభీర చైతన్యానికి నూతనమైన రూపు కల్పించడానికి అవకాశాలు కలిగాయి.

రాయ లేదేశస్థుడైనా, అతని సామ్రాజ్యంలో ఆంధ్రులకు అపూర్వగౌరవ సంపద లేర్పడ్డాయి. ఆర్థికంగాకాని, మానసికంగాకాని సంపద అబ్బినప్పుడు, ఆ అధికమైన ఆదాయం భౌతికసుఖాలని, మానసికఆనందాలని కోరుతుంది. భౌతికంగా ఇది రాయలరాజ్యంలో రసికతగా పరిణమించింది: అంటే తినేతిండిలోను, విహరించేతావుల్లోనూ, వేషభూషణాలలోనూ విశిష్టసంపత్ చిహ్నాలను గోచరించేటట్టు చేసింది. నాటి పాశ్చాత్యులుకూడా వారి ఆర్థికస్థితివల్ల ఉద్బుద్ధమైన నాటిరసికత మహోజ్జ్వలంగా ఉండేదని బహుధా చెప్పుతూవచ్చారు.

దీనికి అనుగుణంగా నాటికళాకారుడిలో కళాపరమైన అభిరుచి భాసిస్తే, నాటి మనఃస్థితిలో నే మానసికానందాన్ని, కవి, గాయకుడు, చిత్రకారుడూ, శిల్పికూడా అందివ్వగలుగుతారు - తమతమ కళల ద్వారా. పుష్పమాలల్ని కట్టడంనుంచి, శిల్పచాతుర్యం వరకూ పెద్దనయుగంలో ఏదో ఒక ప్రత్యేకత కనిపిస్తూనేఉంది. ఇంత విశిష్టత ఉన్నయుగంలోని కవిలో భాసించే విశిష్టత ఏమిటి? అన్నప్రశ్న ఒకటి దీనివెనకనే బయలుదేరుతుంది.

ఆ ప్రత్యేకతలో ముఖ్యమైంది రాయలనాటి రసికత నాటికావ్యాలలో వర్ణనాముఖంగా ఉదాత్తంగా కనిపించడం ఒకటి. రెండోది భారతీయసాంప్రదాయాన్ని వదలక, నాటి నూతన అభిరుచితో కూడిన ప్రబంధశిల్పం రెండోది. అంటే అభిరుచిలోనూ, రచనావిధానంలోనూ పెద్దన నూతనత్వాన్ని ప్రదర్శించినా, అది చాలా చతురంగా, కనిపించీ కనుపించనంత సున్నితంగా, ప్రజలను కలవరపెట్టి దిగ్భ్రాంతులుగా చెయ్యానవసరంలేకుండా జరిగింది.

నిజానికి తత్పూర్వరచనలకూ ప్రబంధాలకూ సామ్యవిషయం - ముఖ్యంగా పెద్దననాటికి - కవితావస్తువులు పురాణాంతర్గతాలు కావడమే. కాగా, నాటికవులలోని ప్రత్యేకత, తమకావ్యాలలో వస్తునిర్దేశంనుంచి పాత్రలవిశదీకరణంవరకూ అన్నింటినీ సౌందర్యప్రాతిపద్యనిలయాలుగా చెయ్యడమే. దీనికే పెద్దన సజీవమైన తీక్ష్ణమైన రూపుకల్పించాడు.

పెద్దనకావ్యంలో వస్త్వైక్యం లేదన్నారు. అంతకంటె 'పారిజాతాపహరణం'లో ఒకే ఇతివృత్తం చుట్టూ కథ అల్లుకుపోయింది. సత్యభామా, కృష్ణుడూ

మొదటినుంచి తుదివరకూ ఆకర్షణీయమైన పాత్ర లయారు. వారిచుట్టూ, వారి మనోభావాలచుట్టూ కథ పెరిగింది; వారి ఆశయాలు నెరవేరడంతోనే కథ సమాప్తిచెందింది. కాని పెద్దనకావ్యంలో ఇతి వృత్తాదర్శం ఒక వంశకర్త జననమాత్రమే అవడం చేత దానికి అవసరమైనంతవరకే పాత్రలను ప్రవేశ పెట్టవలసివచ్చింది. ఎంత ఉత్కృష్టపాత్రఅయినా, ఒక నిర్దిష్టకార్యాన్ని నెరవేర్చి,మనకు తెలియకుండానే మను'చరిత్ర'లో అదృశ్యమయి, తిరిగి మనకు కన పడదు. రెండు సంద్రకెరటాలరాపిడికి, వియద్వీధి కెగసి, తిరిగి అంబుధిలో కలిసిపోయే నీటిబిందువులలా గోచరిస్తాయి ఆపాత్రలు— వరూధినీప్రవర వియచ్చర ప్రవరులు.

అయినప్పటికీ పెద్దనకావ్యం నాటినుంచి నేటి వరకూ అపూర్వప్రజాభిరుచికి పాత్రమయింది. దీనికి కారణం కేవలం వస్తువులోనే వెతుక్కుంటే పెద్ద నకు పరిపూర్ణమైన న్యాయం జరగదు. అది పెద్దన కవితాదర్శంలోనూ, దాని నతడు ప్రతిపాదించిన తీరులోనూ ఉందనుకోక తప్పదు.

ఏకవి అయినా తనకు వ్యక్తంగా తెలిసిఉండో, తెలియకనో ఒక నిర్దిష్టఆవరణలో ఉండి రచన సాగిస్తాడు. విజ్ఞుడైన కవిలో ఇది మరీ స్ఫుటంగా గోచరిస్తుంది. తాను సాధించదలిచిన కవితావిశే షాన్ని సాధించడంలోనే, ఆకవి కవితాప్రాభవం ఇమిడిఉంటుంది. కాని, పెద్దన కవితాధర్మం, ఆదర్శం పరిపూర్ణంగా అతని చాటువులలో వ్యక్త మయాయని విశ్వసించడానికి వీలులేదు. చాటువులు విచిత్రసందర్భాలలో, భిన్నఅభిరుచులను తృప్తి పరచడానికి, అప్పటికవి మనఃస్థితిని, వాతావర ణాన్ని అనుసరించి చెప్పబడతాయి. అందుచేత వాటిలోని సిద్ధాంతాలకు పూర్ణత్వం కుంటువడుతుంది; కాని కవి ఆశయాలని కొన్నింటి నవి స్థూలంగా మాత్రం ఇముడ్చుకుంటాయి.

పెద్దన కవితావిశేషంలో ముఖ్యంగా గోచరించే విశిష్టత 'రమ్యత' అని చెప్పవలసిఉంటుంది. ఇంత కంటె మంచిమాట దొరికేవరకూ, పెద్దన 'శిరీష కుసుమపేశల సుధామయోక్తుల'నుంచి కూర్పులో కనుపించే ఆడంబరత్వంలోని నిరాడంబరమైన హాయి లోనే కాకుండా, వస్తువుని నిర్దేశించడం, పాత్రల చిత్తవృత్తులను పోషించడంవరకుకూడా స్ఫురించే పెద్దన కవితా విశేషానికి 'రమ్యత' అని నామకరణం చేస్తున్నాను. అంతకు పూర్వపు కవుల్లో ముఖ్యంగా నన్నయ, శ్రీనాథుడు, నాచనసోమనలలో రమ్యత భాసించకపోలేదు. కాని ఇది పెద్దనలో విశిష్టతగా పరిణమించింది. పెద్దన శిల్పంలోని ఈ ప్రత్యేకతనే తరువాతికవులు కొద్దిగానో, గొప్పగానో పోషించి ప్రబంధకవు లయారు. తుదకు రామరాజభూషణుడు శ్లేషలోకూడా ఈ హాయికోసం, రమ్యతకోసం ప్రాకులాడి కృతకృత్యుడయాడు.

దీని అర్థం పెద్దన స్వతహాగా తెనుగులో ఉండే ఒక మార్దవాన్ని, మాధుర్యాన్ని, 'శిరీషకుసుమపేశ ల'త్వాన్ని ఒక మహోన్నతస్థితిలోఉంచి, దానినే తన పాత్రలకుకూడా సంక్రమింప చేశాడన్నమాట.

అల్లసాని కవి ఒకచోట:

"నునుఁ జిగురాకు మేయుతఱి
నోరి కెలంకులఁ దేఁటి గుట్టినన్
వనతరుశాఖలం గువకు
వధ్వనిఁ బాడు పికాంగనం బికం
బనునయ మొప్పమాన్పుగతి
నాత్మముఖంబు ముఖంబుఁ జేర్చి చుఁ
బన మొనరించె!"

అని అంటాడు. ఇందులో వరూధినీ మాయాప్రవ రుల సమాగమాన్ని సూచించడంవల్ల, దీనికి ఇక్కడ

స్వతహాగా ఒకస్థానం ఏర్పడింది. అంతేకాకుండా పద్యాన్ని అంతటినీ అలముకొనిఉన్న ఒకమార్దవం-మాధుర్యం-రమ్యత-హృదయాన్ని జల్లని జిల్లుమని పిస్తోంది.

'సునుఁ జిగురాకు'లలో వసంతసమయపు వాతావరణం ఏర్పడింది; పికాంగనకు 'నోరికెలంకుల' తేటికట్టడంలో ఇది పరిణితిపొందింది. పికము పికాంగనను చుంబించడంలోను, అందులో 'అను నయమొప్పమాన్పగతి' చుంబనమొనరించడంలోను ఇది పరిపూర్ణంగా ఫలించింది. ఇదిగాక పద్యం ఎత్తుగడలోను, పదాలకూర్పులోను, అతి సున్నితమైన నకారప్రాసలోనూ, 'మేయుతఱి', 'మాన్పగతి' అన్నమాటలు సరిగ్గా యతికిపూర్వంపడి, పికాంగన వ్యథకు కారణం, వ్యథతీరేమార్గం యతిస్థానాన్నుంచే రెండుసార్లూ ప్రారంభించడంలో పద్యం అలవరచుకున్న ఊతంలోనూ, ధ్వన్యనుకరణమైన 'కువకువ'లోను కవి ప్రథమంలో సాధించిన వాతావరణానికి అనుకూలమైన శబ్దంజాలం, ఛందస్సు కట్టుబాట్లు కవికలానికి లొంగడం కనిపిస్తుంది.

ఈ రెండుతరహాల రచనలూ ఒకేచోట కేంద్రమవడం చాలామంది ప్రబంధకవులలో కనిపిస్తుంది. ఉదా: తారాశశాంక విజయంలోని "కులుకుం జందుం గోవిపావడపయిఁ గొందళ్కు రాయంచ యంచులజిల్గుల్ ..." కాని, పెద్దన అంతతో ఆగిపోలేదు. వీటిఅన్నిటికీ కేంద్రంగా రెండు భిన్న ప్రవృత్తులను ప్రవేశపెట్టి రెంటినీ రంజింపచేశాడు. అనాగరికమైన ముగ్ధపికాంగనకూ, నాగరికమైన ప్రౌఢపికానికీ అనుకూలమైన వసంతసమయపు వాతావరణాన్ని చిత్రించి, రెంటినీ రంజింపచేశాడు కవి. ఈ విరుద్ధప్రవృత్తుల నగిషీపనితనంలోనే పెద్దన చాలా ఘటికుడనిపించుకున్నాడు.

విరుద్ధప్రవృత్తులనడంతోనే మనకు వరూథినీ ప్రవరులు, ప్రవరమాయాప్రవరులు, వరూథినీవియచ్చరప్రవరులు స్ఫురిస్తారు. వీరిపాత్ర పోషణకొంత మనకిక్కడ కావలసింది. ఈ పాత్రలు కవి ఆశయాలని బాహ్యంగాకాని, అంతర్యంలోకాని ఎలా ఇముడ్చుకొన్నారా, అనేదిమాత్రమే.

పెద్దనలోని అతిమానుషమైన సానుభూతి, సమదృష్టి యీ పాత్రరచనలో వ్యక్తమవుతాయి. ఈ మహాశిల్పి యీ పాత్రలను దిద్ది తీర్చేటప్పుడు, వరూథినిలోని సౌందర్యోపాసనా, పిపాసలను, కొంత విషయలాలసను ఎంత చనువుగా లాలనచేశాడో, ప్రవరుని మహోజ్వలసంయమాన్నికూడా అంత గంభీరంగానూ తనలో ఇముడ్చుకున్నాడు. అలాగే 'క్షణక్షణముల్ జవరాండ్రచిత్తముల్' అని నమ్మిన 'అంగభవ విద్యాపారగుడై'న వియచ్చర ప్రవరుడిని చిత్రించడంలోకూడా కవి ఈ సానుభూతినే, యీ సమదృష్టినే ప్రదర్శించాడు. గంధర్వుడు, వరూథిని గర్భవతి అయినతరువాత, తన మాయ ఎక్కడ బయటపడుతుందో నన్నభయంకొద్దీ, ప్రవరుడిలా నటిస్తూ తానింటికి పోనాలంటాడు. అదీగాక:

"ఎవ్వఁడు మీఁదెఱుంగక య
థేచ్ఛ సుఖైకరతిం జరింపఁగా
నవ్వల వంశహాని, వ్రత
హాని, యశోధనహాని పుట్టుఁ దా
నవ్వెడఁ, గమ్మనుష్య పశు,
వయ్యవివేకి చెడుఁ జగంబునఁ
నవ్వఁగఁబాలు రౌరవము
నంబడఁబాలును నిందపాలునై!"

అని ఉద్వేగపూరితమైన ధర్మచింతచేసినా, వరూథినికి వెంటనే, అస్వెంటనే 'చిత్తము జల్లనఁ

సౌరుకు నమ్యాంభోజపత్త్రాక్షి లోచనగోళంబులఁ జిమ్మలై, చిలుపలై, జాలై, తరంగంబులై' బాష్ప వృష్టి కురిసినా, మనకు కవివేసిన గోసాయిచిటిక వల్ల ఇద్దరియందూ సానుభూతి ఏర్పడుతుంది కాని, ఎవ్వరిపట్ల ద్వేషం పొడసూపదు. అసలు మోసం, మోసగింపబడడం కథకోసం తెలుసుకున్న విషయం కాని, యీ కపటప్రవర్తనలోకూడా మనకు లభ్యమైంది ఈ రససిద్ధే కాని, నీతి అవినీతులు, న్యాయాన్యాయాలు అనే ప్రశ్నలు బయలుదేరవు.

కాని పెద్దనకావ్యంలో నీతికీ అవినీతికీ, కాకపోతే సంయమానికీ శృంగారానికీ స్పర్ధపెట్టి, నీతికి జయాన్ని సిద్ధింపచేశాడన్నవాదం ఒకటి లేకపోలేదు. ప్రవరుడిలో పొరపాటున నీతే పరిపూర్ణంగా భాసించినా, తర్వాతికథలో కూడా ప్రవరుడి చర్యలు యీ నీతిదృక్పథంతో చూస్తే, అతనిలో ఒక పెద్దమోసకాడు కనపిస్తాడు. గంధర్వులకు ప్రత్యేకనీతిశాస్త్రాలున్నాయని నీతివాదులేమన్నా, కావ్యం రచించిన కవిలో 'మానుషత్వము మెయిం' మాత్రమేకాక, తనపాత్రలలోకూడా కనుపించేటట్టు రచన సాగించాడు కనుక, తృతీయాశ్వాసాన్నుంచి తుదివరకూ, అసలు స్వారోచిషమనుసంభవమే ఒక పెద్దమోసం, దగా పునాదిగా కలది అని చెప్పవలసి ఉంటుంది. అంతకంటె ప్రవరుడిలో ఆ అచ్చరకోసం ఏకపత్నీవ్రతం కాస్తంత తప్పినా, న్యాయంగా ఆలోచిస్తే నీతివాదులకు అంతమరీ అభ్యంతరం ఉండకూడదు.

కాని మహాశిల్పి పెద్దన పాత్రలను చిత్రించేటప్పుడు యీ నీతిని అతిక్రమించిన ఒక విశాల దృక్పథాన్ని ప్రదర్శించడం కనబడుతుంది. అక్కడ అందరూ ఒక 'రమ్యతమ' దృష్టితో చూడదగ్గవారే! అసలు పెద్దనకవిలో ప్రపంచంలోని వస్తువు లన్నీ కూడా రూపాంతరం చెందుతాయి. జుగుప్సకు సాధారణంగా కారణమైన 'వరాహపోతములు' కూడ ఈ కవిదృష్టిలో 'తొండములులేని యేనుగు'లయి మన దృష్టి నాకర్షిస్తాయి. అటువంటి కవి వరూధినివంటి ఉత్తమోత్తమకళలప్రోవుకు అపజయం చేకూర్చాలన్న దృష్టితో రచన సాగించాడనడం, పెద్దన సమదృష్టికి అన్యాయంచేయడమే అవుతుంది.

పెద్దనపాత్రల చిత్తవృత్తుల చిత్రణలో వ్యక్తమైన విపరీతసానుభూతి, ప్రతీ వర్ణనీయాంశంలోనూ వ్యక్తమయే సౌందర్య ప్రాతిపద్యం, నీతికీ అవినీతికీ విశాలమైన సమదృష్టికీ, మోసాన్ని కూడా మందహాసంతో ఆనందింపచెయ్యగలిగే విశిష్టత - ఇవన్నీ పెద్దన కవితాదర్శమైన రమ్యతా ప్రాదుర్భావాలే, రమ్యతవల్ల భాసించినవే.

కాని, మనం ఈ శతాబ్దంలో ఒక్కటి మరచిపోకూడదు. పెద్దనకాలంలో సౌందర్య పరిగ్రహణ ప్రాతిపద్యాలు, ఒక 'ఎస్కేప్' కాదు. పెద్దనఁ రమ్యసీమ స్వాప్నికమూ కాదు. స్వాప్నికం అంటే అసహజమైనది, కృత్రిమమైనది, ఇంద్రియజ్ఞానం నశించిన తరువాత కేవలం సుషుప్తిలో గోచరించేది అనే అర్థంలో వాడాను. స్వాప్నికసౌందర్యానికి కవులు జీవితాన్ని ధారపోస్తారు: తుదకు విసివి వేసారి అందుకోలేక పోతారు. దీనివల్ల ప్రపంచంలో అవిశ్వాసం కలిగి, కవి తనకలలే, తనే యదార్థమని నమ్మి, ప్రపంచంఅసత్యమని భ్రమపడతాడు. ఇటీవల కొందరి కవులలో ఇది వ్యక్తంగానో, అవ్యక్తంగానో, కొద్దిగానో, గొప్పగానో జరిగితీరింది. కాని పెద్దనకల సాధారణమైన కల కాదు: ప్రత్యక్షంగా మనకు కూడా గోచరించేటంత స్ఫుటంగాఉంది. అతడు కలంగాంచినా, మేల్కొని ఆవస్తువును కళ్ల ఎదుట చూడగల్గుతాడు; వరూధిని మాయాప్రవరుని 'కలఁ

గాంచిన వస్తువుం దెలిసికొంచిన యట్లుగానే! ఆంగ్ల కవికీట్సు ఆడం కలను గూర్చి 'He awoke and found it true అని ఓ సందర్భంలో అన్నట్టుగానే!

అయితే పెద్దనకల 'ఎస్కేప్' (Escape) కాక ఇంత సత్యమెలా అయిందన్న ప్రశ్నకు జవాబు రాయలకాలంలోనే వుంది: లండన్ కంటె విశాల నగరాన్ని కట్టగల్గిన రాజుల కాలంలో బ్రతికి, ప్రపంచంలోని మహాసంపదలను అనుభవిస్తూ, ప్రపంచానికి కానధిపుడనన్న విశ్వాసం కలిగి, తినడానికి తిండి, కట్టడానికి బట్టలే కాకుండా, వీధిలో నేడు సుగంధరహితమైన పుష్పాలను అమ్మినట్లు వజ్రాలను అమ్మగల్గిన ఆ రోజుల్లో కాకపోతే ఇంకెప్పుడు పెద్దనకవి కల నిజమౌతుంది, అసలు కలలు నిజమవడమే తటస్థిస్తే?

అందుచేత నేటి ఆకలి సమస్యలని మనస్సులో పెట్టుకొని పెద్దనను బూర్జువా అనడంవల్ల ఆనాటి చైతన్యం ప్రభవించిన పెద్దన కవితాదర్శానికి లోపం జరగదు. పెద్దన సృష్టించిన ఆదర్శాన్ని ఓ మూడువందల ఏళ్లుపాటు పట్టుకొని వేళ్ళాడారు ప్రబంధకవులు! అందుచేత దానిపని అది నేరవేర్చుకుంది. ఎటొచ్చీ ఇకమనం 'డాడా'ల మహాలంటే మాత్రం పెద్దనకు స్వస్తిచెప్పాలంతే!

---

# గ్రంథస్వీకృతి

౧. శిల్పదర్శనము

కొండూరు వీరరాఘవాచార్యులు :
విశ్వజ్ఞమండలి, తెనాలి. ౨-౮-౦

౨. నాట్యశాల

శ్రీనివాసచక్రవర్తి :
'ఆంధ్రశ్రీ' ప్రచురణాలయం
6782, ఇమాంబావి వీథి,
సికింద్రాబాదు. (దక్కన్) ౧-౦-౦

3. జేబురుమాలు

బుర్రా వెంకటసుబ్రహ్మణ్యం :
నవరచనా ప్రచురణలు,
4/8, దేశిగర్ స్వామి వీథి,
మైలాపూరు, మద్రాసు. ౧-౮-౦

౪. గాంధీదేవుడు :

శ్రీ మునగపాటి విశ్వనాథశాస్త్రి ౦-౪-౦

౫. రైతునాయకుడు (బుఱ్ఱకథ)

శ్రీ మునగపాటి విశ్వనాథశాస్త్రి ౦-౬-౦
ఈ పైపుస్తకములు దొరకు స్థలము :
సుందరరాం అండ్ సన్సు, తెనాలి.

౬. మారేలోకం

వసంతరావు వెంకట్రావు ౧-౦-౦

౭. సినీమాజ్వరం

చలం ౧-౦-౦
ఈపుస్తకములు దొరకుస్థలము :
ప్రతిమాబుక్సు, ఏలూరు.

౮. ఏమి మగవాళ్లు ౦-౧౨-౦

రచయిత : శ్రీ పి. వి. రాజమన్నారు
ప్రచురణకర్తలు : ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం, గవర్నరుపేట, బెజవాడ.

మదరాసు ఎసంబ్లీ సభ్యులు.
సంపాదకులు : ఆంధ్రసర్వస్వము.
వెలయుస్థలము :
జాతీయ జ్ఞానమందిరం,
త్యాగరాయనగరము, మదరాసు—17.

౯. తెలుగుతల్లి

వ్రాసినవారు :
మాగంటి బాపినీడు ౨-౦-౦
బి. ఎస్. సి. (కార్నెల్) ఎమ్ ఎస్. సి. (కాలిఫోర్నియా)

# గ్రంథ విమర్శనము

## అభ్యుదయ

### సచిత్ర సాహిత్య పత్రిక

### ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం బెజవాడ

సాహిత్యం ఎప్పుడూ ఒకే తీరుగా నడవదనీ, సాంప్రదాయికతలోనించి అనుస్యూతంగా ప్రవహించే నిత్యనూతన చైతన్యమే దాని సహజలక్షణమనీ విజ్ఞులు అంటారు. అంటే సజీవసాహిత్యంలో సంప్రదాయమూ, జీవితపరిసరాలకి అనుకూలమయిన నిత్యపరిణామమూ అనుస్యూతంగా వస్తూంటాయన్నమాట! సంప్రదాయం విడిచిన కేవల నవ్యతగాని, నవ్యత విడిచిన కేవల సంప్రదాయంగాని సజీవసాహితికి లక్షణాలుకావు. సజీవసాహితిలో ఈ లక్షణాలు ఉండితీరతాయి.

సాహితీసమితిరచనలూ, ఇంకా ఆసమితి సమకాలీనులైన కొందరు ప్రఖ్యాతులరచనలూ, ఆతరువాత వచ్చిన కొందరు యువరచయితల వాఙ్మయమూ, ఈ సత్యాన్ని ఋజువుచేశాయి. ఆకాలంలో నవోద్యమాలు శంకించిన విజ్ఞులుగూడా ఇప్పుడవి పీకేశలింగయోగానికి సహజమైన సజీవపరిణామాలని అంగీకరించక తప్పిందికాదు.

ఇంచుమించుగా 'భావకవితోద్యమం' అని చెప్పబడే ఆ నవ్యకవితామార్గం ఒక పాతికసంవత్సరాలనించి అనర్గళంగా వస్తూంది. అది యింకా పూర్తి అయిందని చెప్పడానికి వీల్లేదు. అసలు ఏకవితామార్గమూ హఠాత్తుగా ఉదయించడంగాని, అస్తమించడంగాని జరగదు.

ఇప్పుడు నాలుగైదేళ్ళనించి ఆంధ్రదేశంలో కొత్తగా వినిపిస్తూన్న అభ్యుదయరచనావాదం తత్పూర్వవాఙ్మయరీతికి ఒక సహజమైన క్రమికపరిణామం అని అంగీకరించక తప్పదు. ఆ అభ్యుదయవాదాన్ని ప్రధానంగా అనుసరించే రచయితలకి ఈపత్రిక ఒక శృంగాటకం కావడం ముదావహము.

పత్రిక ప్రారంభంలో వచ్చే చిన్నచిన్నలోటుపాటులు విడిచి నిష్పాక్షికంగా పరిశీలిస్తే ఇది క్రమక్రమంగా అభ్యుదయరచనకి ఒక బలమైన పట్టుగొమ్మ కాగలదనిపిస్తూంది.

పత్రికలో చిలుకూరి పంచాగ్నుల కోరాడవంటి దిగ్దంతులైన పండితులూ, కొడవటిగంటి, ప్రయాగ, శ్రీపాద, శ్రీశ్రీ, అని పెట్టులవంటి సుప్రసిద్ధ రచయితలూ వ్రాసిన రచనలున్నాయి. ఇంకా ఆంధ్ర సాహిత్య పాఠశాలకి సంబంధించిన కొన్నివ్యాసాలు ముదావహంగా ఉన్నాయి.

పత్రికలో కొన్నికొన్ని జీవచిత్రాలవిషయంలోనూ, పత్రిక బాహ్యాకారం విషయంలోనూ అభివృద్ధి అవసరం. కొన్నికొన్ని రచనలలో కళాదృష్టి బాగా తక్కువకావడంవల్ల అసలు జీవమే నశించింది. ఈవిషయంలో సంపాదకులు జాగ్రత్తపడాలి.

విశ్రాంతిలేకుండా జీవితం అంతా అభ్యుదయానికి ధారపోస్తూన్న సంపాదకులూ, తదితరులూ ఈపత్రిక ఆంధ్రపత్రికాలోకంలో ఒక ఉత్తమస్థితి పొందేటట్టు చెయ్యగలరని నమ్ముతున్నాను.

'శిల్పి'

# చిత్ర వివరణము

శ్రీ టి. యస్. శ్రీనివాసన్‌గారు

## పరశురామ గర్వభంగము

ఈ త్రివర్ణ చిత్రము కొచ్చిన్ మట్టంచెర్రి భవనమందలి కుడ్యచిత్రాలలోనిది. కథాభాగము రామాయణము. ఈ చిత్రంలో వర్ణములు, ఇంకా సూక్ష్మములైన ఇతర విషయములు మాతృక ననుసరించి యథాతథంగా చిత్రించారు. కొచ్చిన్ ప్రభుత్వము అనుమతినిపొంది కొంతకాలము క్రితము ఈ కుడ్య చిత్రములనుండి కాపీలు చేశారు. ప్రస్తుతం ఇవి కళాభిమానులకోసం త్రిచూరులో ఉన్న ప్రభుత్వకళామందిరంలో ప్రదర్శించారు. కుడ్యచిత్రాలు చూడడానికి భవనంలో ప్రవేశించుటకు అనుమతి దొరకడం కష్టము. అందుచేత ప్రభుత్వము ఈ సదుపాయం చేసింది. ఈ కొచ్చిన్ భవనంలోని కుడ్యచిత్రాలనుగురించిన వ్యాసం ఈ పత్రికలో మరి ఒకచోట అచ్చుపడింది.

## అర్ధ శిల్పాలు

### రామపట్టాభిషేకము, రాసలీల.

ఈ రెండుశిల్పాలు శ్రీ డి. పి. నారాయణరావుగారివి. ఈయన చెన్నపట్టణం లలితకళాశాలలో చిత్రకళ, శిల్పం నేర్చుకున్నారు. చిత్రకళాధ్యాపకులుగా కొంతకాలం పనిచేశారు. పాఠకులకు సుపరిచితమైన ఈ రామపట్టాభిషేక చిత్రము చక్రవర్తి కుండవలసిన రాజలాంఛనాలు, పరివారంతోను కాకుండా సాధారణంగా చిత్రించారు. శ్రీ రామచంద్రుడు సీతాదేవిని ప్రేమానునయాలతో ఆలింగనం చేస్తున్నట్లుంది. నమ్మిన బంటు ఆంజనేయస్వామి వినయ విధేయతలతో సమస్కరిస్తున్నట్లు సృష్టించారు. ప్రాచీన ప్రతిమా లక్షణాలు లేకపోయినా, ఆ ఘట్టంలో సృష్టించిన మత సంబంధమైన ఈ విషయం శక్తివంతంగా నిర్వహించారు.

## రాసలీల

రెండవది రాసలీల అనే అర్ధశిల్పము. అది సంచలనంతోను, ఉల్లాసంతోను పొంగులు వారుతూన్న చిత్రము. శ్రీ కృష్ణుడు గోపికా బృందంతో రాసకేళిలో ఉన్నాడు. ఈ శిల్పంలో గమనించవలసిన విషయము ఒకటి ఉంది. శ్రీ కృష్ణుడు బృందావన గోపకునివలె నెమలిపింఛంతోను వేణువుతోను సృష్టింపబడలేదు. ఇక్కడ పరిపూర్ణ యౌవనుడు. అతనితోఉన్న గోపికలు ఉల్లాసంగా నృత్యం చేస్తున్నారుగాని, అతను మాత్రం తీవ్రంగా రాసకేళిలో నిమగ్నుడై ఉన్నాడు.

ఈ చిత్రానికి వెనకభాగంలో చక్కని శీతల వృక్షచ్ఛాయ ఉంది. దానికింద దివ్యప్రేమికుడైన శ్రీకృష్ణుడు తన మనోహర సహచారిణులతో కలిసి నృత్యంచేస్తున్నాడు.

### దారు చిత్రాలు

అభిసారిక : శ్రీ కె. తణికాచలం.

శ్రీ తణికాచలంగారు చెన్నపట్టణ లలిత కళాశాలలో చిత్రకళ నేర్చుకొన్నారు. ఈ అభిసారికశిల్పం వారు తయారుచేసినది. మంచి నిపుణతతో చెక్కబడినది. దారు చిత్రాలలో ఈ మాదిరి పనిచేయడానికి ఎంతో తెలివితేటలు, నేర్పరితనము కావాలి. విషయము సంస్కృత కావ్యములలోనిది. ఆ భావానికి తగిన ఆకృతినిచ్చారు. ఆ మెచెట్టు నానుకుని లేడిని లాలనచేస్తూన్న భంగిమము బొమ్మకంతకీ చక్కని విన్యాసము నిచ్చింది. చిత్రానికి వెనుకభాగంలోని ఆకాశం, సమాన దూరంలోని చిన్నిచిన్ని గుంటలవల్ల చిత్రంలోని ముందుభాగాన్ని స్ఫుటంగా కనపరుస్తున్నది.

### ఎద్దు

ఇది జపాను చిత్రకారునిచేత తయారుచేయబడిన ఒక చక్కని దారుచిత్రము. సాధారణంగా ఈలాంటివాటిని బల్లలపైన అలంకారంగా ఇళ్ళలో వాడతారు. శిల్పి దీనిని ముద్దగా చెక్కినప్పటికి, సున్నితమైన పనివానితనంకూడా కనబరిచాడు. పగటి విశ్రాంతి తీసుకుంటూన్నా ఈఎద్దు ముఖంలో రౌద్రము కానవస్తోంది.

### తరంగాలు : మేఘాలు

ఈ నీటిరంగుల చిత్రము శ్రీ వి. ఆర్. చిత్రాగారు శాంతినికేతన స్నాతకులైరాగానే చిత్రించింది. ఇందులో వారు నీటికి ఒక్కనీలవర్ణంతో చిత్రంలోని వర్ణాంతర్భాగాలు సృష్టించి సమైక్యత కలిగించడం గమనించదగ్గ విషయము. విరిగిపడే తరంగాలపైన-సుదూర నీలగగనంలో పలచని మేఘాలు ఒక్కవర్ణంతో అనేక వర్ణచ్ఛాయలు ఒప్పించేటట్లు సృష్టించి చిత్రంలోని అంతర్భాగాలకి సమైక్యత కలిగించారు. యూరపు చిత్రకారులలో నూతన ఉద్యమానికిచెందిన చిత్రకారుల ఆదర్శాలు వర్ణసాదృశ్య, వర్ణసమైక్యతలు. ఒక్కవర్ణంతో జాషువా రైనాల్డ్సు మొదలైనవారు ఇవి నిర్వహించారు.

ఇల్లా భారతీయ చిత్రకారులు ఇదివరకెవరుచేసి ఉండలేదు. శ్రీ చిత్రాగారు ఈ మార్గము అన్వేషించి సిద్ధహస్తులైనారు

అనువాదకుడు : 'లక్ష్మి'.

# రేషనింగు
## నిబంధనలు

### మీకు తెలుసునా

రేషను కార్డుతో, అచ్చంగా వున్న వారికోసమే రేషను పుచ్చుకోవాలి. - - - -

మనుష్యులు యెక్కువగాని తక్కువగాని అయితే, అధికారులకు తెలియజేయాలి. - - -

రేషనింగువల్ల న్యాయమైన పంపకం తప్పక జరుగును.

రేషనింగువల్ల అధిక లాభాలు చేసుకోవడం, అక్రమ వ్యాపారము తొలగును. - - -

**ఇందువల్ల మీకు స్వయంసహాయము కల్గును; ఇతరులకు సహాయపడినవారగుదురు.**

మదరాసు ప్రభుత్వ సమాచార ప్రచురణశాఖా డైరెక్టరు ప్రకటన.

MGK 19.TG

# కోహినూర్ రత్నములు



పిల్లలను ఉల్లాసముగ నుంచుటకు స్వచ్ఛమైన

"కోహినూర్"

చిట్టాముదం ఆవశ్యకము.

వ్యాధులను ఖండించి ఆరోగ్యముగా నుంచును.

★

"కోహినూర్" ఆమ్లా పరిమళ తైలము. మెదడుకు చల్లదనమిచ్చి వెంట్రుకలను పోషించును. చుండు, తల నెరయుట మొదలగు వ్యాధులు ఖండించును.

★

"కోహినూర్" పన్నీరు దేవతారాధనములకు, వివాహములకు మఱియు అనేక శుభ ప్రయోజనములకు అత్యావశ్యకము.

దీని గుణము: అయిదారు చుక్కలు "కోహినూర్" పన్నీరు మీ చేతిగుడ్డయందు చల్లిన, మీరు గులాబి వనమునం దుండుచందమున మనస్సుకు ఆనందం కల్గించును.

గృహపరిశ్రమలో తయారుచేయబడినది.

ఆదరింపతగినది.



# వివేకానంద ఇండస్ట్రియల్ ఇంజనీర్స్

## పెరంబూరు, మదరాసు.

### ఎలక్ట్రికల్

డిజైన్లు—కట్టడములు

★ ★ ★

బంగాళాలు, సినీమాలు, ఫాక్టరీలలో, ఇంజను ఫిట్టింగులు దీపాలు ఏర్పాటులు

★ ★ ★

కోల్డుస్టోరేజి, ఫ్రిజిడరీలు

★ ★ ★

గ్రామసీమలలో విద్యుచ్ఛక్తి ఏర్పాటులు

★ ★ ★

అన్నిరకాల మోటార్లూ, జనరేటర్లూ మరమ్మతు చేయబడును.

★ ★ ★

ట్రాన్సుఫారమర్లూ, స్విచ్ గియర్లూ సప్లయి చేయబడును.

### మెకానికల్

రిపేరీలు—తయారీలు

★ ★ ★

చేతి-మర-మగ్గములు నూలుయంత్రాలు అంటే వైండింగ్, వార్పింగ్, సైజింగ్ మెషీనులు మొదలయినవి.

★ ★ ★

చేతికాగితపు గ్లేజింగు, వగైరా యంత్రాలు.

★ ★ ★

బియ్యము, పిండి, నూనె, పంచదార, మరల బాయిలర్లు, స్టీముఇంజన్లు, పంపులు.

గ్యాస్ ఆయిలు, ఇంజన్లు, వర్కుషాపు పనిముట్లు, టానరీయంత్రాలు.

ఉక్కు, బీడు, ఇత్తడి, కంచు వగైరా పంచలోహములలో మీకు కావలసిన ఇంజను సామాన్లయినా సరిగా సకాలమునకు పోతపోసి తయారుచేసి ఇవ్వగలము. సరసమయిన ఛార్జీలు! నికరమయిన పనివాడితనం. !

ప్రొప్రయిటరు,

టి. సి. యస్. ఆచారి.



ఇది బి. యన్. కె. ప్రెస్, 37, ఆచారప్పన్ వీథిలో బి. నాగిరెడ్డిగారిచే ముద్రింపబడి, ఆంధ్రశిల్పి కార్యాలయం, 10, నరసింగపురం వీథిలో శ్రీమతి డి. ఆర్. చిత్రాగారిచే ప్రకటింపబడినది. సంపాదకులు: వి. ఆర్. చిత్రా : పి. గణపతిశాస్త్రి.

శిల్పి

శిల్పి ప్రచురణములు:

# 'నా జీవిత యాత్ర'

ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు

బాల్యం మొదలు పంచాశద్వర్షాలవరకూ గడిచిన మహోజ్జ్వల జీవిత గాథ.

ప్రథమ ఖండము

వెల రూ. ౩/—

౧౯౪౬ ఆగస్టు ౨౩ వ తేదీనాడు శ్రీ ఆంధ్రకేసరి జన్మదినోత్సవ సందర్భంలో వెలువడింది.

## 'ఆంధ్ర శిల్పి'

ఆంధ్ర సాహిత్యానికీ, లలిత కళలకీ,

సంస్కృతికీ దోహదమిచ్చే

సచిత్ర మాస పత్రిక

సంపాదకులు:

వి. ఆర్. చిత్రా

పి. గణపతి శాస్త్రి

సాలు చందా ౫ రూపాయలు.

విడి కాపీ ౧౨ అణాలు.



రాబోవు

## 'శిల్పి' ప్రచురణలు

ఆంధ్రకేసరి

శ్రీటంగుటూరి ప్రకాశంపంతులుగారు

రచించిన

౧. 'నా జీవిత యాత్ర' ద్వితీయ ఖండము
౨. యోగసూత్ర సిద్ధాంతము
౩. ఈశావాస్యోపనిషత్తు
౪. ప్రశ్నోపనిషత్తు
౫. కఠోపనిషత్తు.
౬. భగవద్గీతా భాష్యము

వివరాలకు:— మేనేజరు:

'ఆంధ్ర శిల్పి'

౧౦, నరసింగపురం వీధి,

మౌంటు రోడ్, మద్రాసు.